# 36-24-36

పల్లి నిరంజన్ రెడ్డి

36-24-36 3
36-24-36 3



SILVER JUBILEE
25
NOVEL

1984, డిసెంబర్ 9

ఢిల్లీ

సమయం : ఉదయం ఏడూ ఇరవై

దట్టమైన చిక్కని పొగమంచు.

ఆ మంచు పొరలను చీల్చుకొని బయటకు రావాలని విశ్వప్రయత్నం చేసి విఫలమవుతున్నాయి వెలుగు రేఖలు.

ఆ సమయంలో...

థర్మామీటరులోని పాదరసం మూడు డిగ్రీలకి పడిపోయింది.

చలి...ఎముకలు కొరికేసేలా...రక్తాన్ని గడ్డ కట్టించేదిలా వుంది.

ఆ చలి గాలుల్ని చీల్చుతూ శరవేగంతో ఎంబసీ రోడ్డులో దూసుకుపోతున్నాయి ఢిల్లీ పోలీసులకు సంబంధించిన మూడు వాహనాలు.

అత్యంత విశాలమైన రోడ్డు అది.

ఆ రోడ్డు పక్కన కళ్ళు చెదిరేలా నిర్మించిన విదేశీ రాయబార కార్యాలయాలు, వాటి ముందు పార్క్ చేసిన ఫారిన్ కార్లు.

'ఇది ఇండియా...అవునా? కాదా? అని సందేహించేటంత అందంగా ఉంటుందా రోడ్డు.

వేగంగా దూసుకు వెళ్ళే మారుతీజిప్సీలో డాష్ రాడ్ పట్టుకుని అసహనంగా కూర్చుని ఉన్నాడు ఢిల్లీ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ కుల్వంత్. యాంకిల్ లెంగ్త్ కోట్....గమ్ షూ....ఉలెన్ గ్లోవ్స్ ధరించి వున్నా అవి ఆ చలిని పూర్తిగా అడ్డుకోలేక పోతున్నాయి.

అతని శరీరం సన్నగా వణుకుతోంది. ఆ చలి వెన్నులోంచి తన్నుకు వస్తోంది.

మంచు పొరల్ని చీల్చి దారి చూపడంలో హెడ్‌లైట్స్ విఫలమవటంతో హెలోజన్ లైట్స్ ఆన్ చేశాడు డ్రైవర్.

శక్తివంతమైన ఆ కాంతికి రోడ్డు ప్రస్ఫుటం అయింది.

రోడ్డుస్పష్టం అవడంతో జీపు స్పీడోమీటర్‌లోని నీడిల్ అరవై మీద నుండి ఎనభై మీదకు దూకింది.

గిరగిరా రివాల్వ్ అవుతూ ఎరుపు రంగు కాంతులు విరజిమ్ముతోంది జీపు మీది పైలట్ ల్యాంప్.

ఆ వెలుగు జీపు బాయ్‌నెట్ మీద పడి రిఫ్లెక్ట్ అవుతున్నాయి.విండ్ షీల్డ్ లోంచి రోడ్డు మసకగా కనబడుతుండటంతో వైపర్స్ ఆన్ చేశాడు డ్రైవర్.

ఆ జీప్‌నే అనుసరించి వస్తున్నాయి మరో పోలీస్ వ్యాన్, జీపు.

ఆ వాహనాలు చేస్తున్న రొదకి, రోడ్డు పక్క జాగింగ్ చేస్తున్న కొందరు యువకులు "ఇంత పొద్దున్నే ఏం జరిగిందా" అన్నట్టు ఆత్రుతగా వాటి వైపు తేరిపార చూస్తూ నిలబడి పోయారు.

కన్నాట్ ప్లేస్‌ని దాటాయి వాహనాలు.

రిస్ట్‌వద్ద కోట్ వెనక్కి లాగి వాచ్‌లో టైమ్ చూశాడు. ఏడూ నలభై.

తను అక్కడికి చేరాలంటే మరో ఐదు నిముషాలు పడుతుంది.

అసహనంగా ఉంది అతనికి.

సరిగ్గా ఆరూ నలభై నిముషాలకి తనకీ వార్త తెలిసింది. అది తెలిసిన మరుక్షణం డిపార్ట్‌మెంట్‌ని ఎలర్ట్ చేశాడు.

ఈపాటికి సిటీ బోర్డర్స్‌ని, హైవేలని క్లోజ్ చేసి ఉంటారు.



బస్‌స్టాండ్‌లలో, రైల్వే స్టేషన్‌లలో, ఎయిర్ పోర్ట్‌లలో పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటయి ఉండాలి.

ఈ విషయంలో ఆ వ్యక్తులు నగరం నుంచి తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తే అది అసంభవం. కానీ ఇప్పటికే నగరం దాటిపోతే....

ఇంక వారిని పట్టుకోవటం తన డిపార్ట్‌మెంట్‌కి ఒక చాలెంజ్ అవుతుంది.

జీప్ వెనుక సీట్లో స్టెన్ గన్స్ పట్టుకుని చాలా అటెంటివ్‌గా కూర్చుని రెప్పవాల్చకుండా రోడ్డువైపే చూస్తున్నారు ఇద్దరు గన్‌మేన్‌లు.

కారు అద్దం మీద మంచు బిందువులు తుడిచివేయబడటంతో వైపర్స్ ఆఫ్ చేశాడు డ్రైవర్.

ఆ వాహనం డ్రైవ్ చేయడం నల్లేరు మీద నడకలా వుందతనికి.

అప్పటికి నెల రోజుల క్రిందటే తొలిసారిగా డెభ్భై మారుతీ జీప్సీ జీపులను సమకూర్చుకుంది ఢిల్లీ పోలీస్ డిపార్ట్‌మెంట్.

ఆ జీపు డ్రైవ్ చేయటం ప్రారంభించిన దగ్గర నుంచి కనీసం వెయ్యిసార్లయినా అనుకొని ఉంటాడు....."జపాన్ టెక్నాలజీ సామాన్యమైనది కాదు" అని.

వాహనాలు ఆ రోడ్డు మలుపు తిరిగాయి.

దూరంగా ఓ బంగ్లా దగ్గర కనీసం ఓ పాతిక ముప్పై వాహనాలు ఆగి కనిపిస్తున్నాయి.

"ఈ వార్త అప్పుడే చాలా మందికి తెలిసి పోయిందన్న మాట" అనుకున్నాడు కుల్వంత్.

ఆ బంగ్లా ముందు ఆగింది జీప్.

అందులోంచి దిగాడు కుల్వంత్.

అక్కడున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు గార్డ్స్ కుల్వంత్‌ని చూస్తూనే అటెన్షన్‌లో నిలబడి శాల్యూట్ చేశారు.

కుల్వంత్ దృష్టి ఆ ఇంటి కాంపౌండ్ వాల్ మీద వున్న నేమ్‌ప్లేట్ మీద ఒకసారి పడింది.

అడుగు వెడల్పు రెండున్నర అడుగుల పొడవుతో ఉన్న బ్లాక్

గ్రానైట్ పీస్‌మీద జైసింగ్ షకావత్, ఎం. పి. అన్న బ్రాస్ అక్షరాలు, హిందీ, ఇంగ్లీషులలో రాసి ఉన్నాయి.

దృష్టి వాటిమీద నుంచి మరల్చి లోపలికి అడుగులు వేశాడు కుల్వంత్.

అతన్ని అనుసరించారు పోలీస్ డిపార్ట్‌మెంట్ మనుషులు.

"వేరిజ్ దట్ రూమ్" పక్కనున్న ఇన్‌స్పెక్టర్‌ని ఉద్దేశించి అడిగాడు కుల్వంత్ నడుస్తూనే.

"ఊపర్ హై సాబ్" జవాబు చెప్పాడతను.

హాలులో ఎవరెవరో కూర్చుని ఉన్నారు.

కుల్వంత్ కళ్ళలోని భావం అర్థం చేసుకున్న ఓ వ్యక్తి "షెకావత్ జీ బాత్‌రూమ్‌లో ఉన్నారు" అన్నాడు.

ఇంకేమీ మాట్లాడకుండా తిన్నగా మేడమెట్లెక్కి పైకి చేరుకున్నాడు కుల్వంత్.

ఎడమ వైపున ఒక గది వుంది.

ఆ రూమ్‌లో ఓ ఇన్‌స్పెక్టర్, ఓ ఫోటోగ్రాఫరు ఉన్నారు.

ఆ ఫోటోగ్రాఫర్ చేత ఫోటోలు తీయిస్తున్నాడతను.

కుల్వంత్‌ని చూస్తూనే శాల్యూట్ చేసి ఆ గదిలోంచి బయటికి వచ్చేశాడు ఇన్‌స్పెక్టర్.

ఫిఫ్టీన్ ఇంటూ ట్వంటీ సైజ్ బెడ్‌రూమ్ అది.

గది మధ్యలో ఒక బెడ్. పక్కన ఒక టీపాయ్—బుక్ షెల్ఫ్.

బుక్ షెల్ఫ్ మీద ఒక ఫోటో ఫ్రేంలో ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఫోటో....గోడకి మైకెల్ జాక్సన్ బ్లో అప్.

బెడ్ మీది దుప్పటి అస్తవ్యస్తంగా ఉంది.

ఒక పిల్లో క్రింద పడిపోయి ఉంది.

ఫ్లవర్‌వాజ్ ఒకటి పగిలిపోయి ఉంది.

ఏదో పెనుగులాట జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. బెడ్ మీది తెల్లని దుప్పటి మీద ఓ మూలగా రెండు రక్తపు మరకలు.

దాని మీద నుంచి దృష్టి మరల్చి కిటికీ దగ్గరకు నడిచాడతను.



అందులో నుంచి క్రిందికి చూశాడు.

సుమారు ఇరవై అడుగుల ఎత్తు ఉంటుంది. అంత ఎత్తు నుంచి ఎవరికీ తెలియకుండా దూకడం కష్టమే.

అక్కడ నుంచి కాంపౌండ్‌వాల్ కనీసం నలభై అడుగుల దూరం ఉంటుంది.

"నిన్న రాత్రి ఇక్కడ డ్యూటీలో ఉన్నది ఎవరు ? తన పక్కనున్న ఇన్‌స్పెక్టర్‌ని ఉద్దేశించి అడిగాడు కుల్వంత్ హిందీలో, చాలా కరుకుగా వుంది అతని గొంతు.

తన పక్కనున్న ఇద్దరు కానిస్టేబుల్స్‌ని, ఆ పక్కన నిలబడివున్న వాచ్‌మాన్‌ని చూపించాడు ఇన్‌స్పెక్టర్.

"రాత్రి ఏం జరిగిందో చెబుతారా?" అడిగాడు కుల్వంత్.

వాళ్ళ సంభాషణ హిందీలో సాగుతోంది.

కొంచెం గొంతు సవరించుకొని "ఏమీ జరగలేదుసార్....అదే.... అంటే....మాకు తెలిసి....ఏదీ జరగలేదు సార్" చెప్పాడు కానిస్టేబుల్.

అతని జవాబుకు ఒళ్ళు మండిపోయింది "వాట్ ది హెల్....ఆర్ యు టాకింగ్" అరిచినట్లుగా అన్నాడు.

"ఏయ్... జవాబు చెప్పే పద్ధతి అదేనా!" మందలింపుగా కానిస్టేబుల్‌తో అని "నేను చెబుతాను సార్" అంటూ వాళ్ళ మధ్య జోక్యం చేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

"రాత్రి ఏం జరిగిందో వీళ్ళకు కూడా అంతుపట్టనంత మిస్టరీగా జరిగిపోయింది సార్. యథావిధిగా వీళ్ళిద్దరూ, ఆ వాచ్‌మాన్ డ్యూటీలోనే ఉన్నారు. రెండు ఆల్సేషియన్ కుక్కలను కూడా గొలుసులు విప్పి ఫ్రీగానే ఉంచారట. రాత్రి అంతా మామూలుగానే గడిచింది. తెల్లవారేసరికి ఇది జరిగిందట."

అతను చెప్పింది విని కానిస్టేబుల్స్ ఇద్దరినీ, వాచ్‌మేన్‌ని ఓసారి ఎగాదిగా చూశాడు కుల్వంత్. గజగజ వణుకుతున్నారు వాళ్ళు.

అతనిని చూసి వణుకుతున్నారో, ఆ చలికే వణుకుతున్నారో అర్థం కాలేదు.

"ఈ గదిలోంచి ఏ విధమైన శబ్దమూ రాలేదా!" ఖంగుమంటోంది అతని కంఠం.

ఓ క్షణం తటపటాయించి "లేదు" అన్నట్లు తల అడ్డంగా ఊపారు వాళ్ళు.

"మరి అయితే ఈ ఫ్లవర్ వాజ్ ఇప్పుడు పగిలిందా!"

తలవంచుకొని నిలబడ్డారు వాళ్ళు.

"ఇడియట్స్" కసిగా మనసులో తిట్టుకున్నా, అది అతని పక్కనున్న ఒకరిద్దరికి వినిపించింది. తిన్నగా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు కుల్వంత్.

అప్పటికి హాలులో సోఫాలో కూర్చుని ఉన్నాడు జైసింగ్ షకావత్.

కత్తివాటుకు నెత్తురు చుక్క లేనట్లు తెల్లగా పాలిపోయి వుంది అతని వదనం. జీవంలేని కళ్ళతో చూస్తున్నాడు.

ఐదడుగుల పదకొండు అంగుళాల ఎత్తు, దాదాపు వంద కిలోల బరువున్న గంభీరమైన రాజస్థానీ పర్సనాలిటీ షకావత్‌ది. ఎర్రని వంటి ఛాయ, గుబురు మీసాలు, కొద్దిగా బట్టతల, యాభై సంవత్సరాల వయస్సు ఉన్నా నలభై సంవత్సరాల వ్యక్తిలా కనిపించే దృఢమైన శరీరం.

షకావత్‌ని చూస్తూనే విష్ చేశాడు కుల్వంత్.

కూర్చోమన్నట్లు సోఫా చూపించాడు అతను.

"రాత్రి ఏం జరిగిందో చెప్పగలరా!" అడిగాడు.

కళ్ళలో సుడి తిరుగుతున్న నీటి పొరను మనస్సుతో కంట్రోలు చేసి గొంతు విప్పాడు షకావత్.

"రాత్రి.... తొమ్మిది గంటలకి ఇంటికి వచ్చాను. అప్పటికి నా కూతురు ఆ రూమ్‌లో చదువుకుంటోంది. రేపటి నుంచి ఎగ్జామ్స్ ఉన్నాయి అని చెప్పింది. ఇద్దరం కలిసి భోజనం చేశాము. దాదాపు పదిన్నర వరకు ఇద్దరం మాట్లాడుకున్నాం. "ఎగ్జామ్స్ కదా! ఉదయం ఎనిమిది గంటలకే కాలేజీకి వెళ్ళాలి. పొద్దున్న కాస్త త్వరగా నిద్ర లేపు నాన్న" అంది. "అలాగే"



అని నేను నా గదిలో పడుకున్నాను. తెల్లవారి ఆరుగంటలకి ఆమెను నిద్ర లేపుదామని తలుపులు ఎంత తట్టినా తెరుచుకోలేదు. ఏం జరిగిందో అర్థం కాక భయంతో డోరు బోల్టు పగలగొట్టి లోపలికి వెళ్ళాము. నా కూతురు లేదు. కిటికీ మాత్రం తెరిచివుంది. బెడ్ మీద రక్తపు మరకలు ఉన్నాయి. అంతే....ఆమె జాడలేదు" ఇంక మాట్లాడలేక పోయాడు షకావత్.

అతని మాటల్లో అక్కడక్కడ రాజస్థానీ యాస తొంగిచూస్తోంది.

రెండు నిముషాలకు తేరుకుని తనేఅన్నాడు "ఇంత మందీ ఉండగా, ఎవరికీ ఏ మాత్రం తెలియకుండా... నా కూతుర్ని ఎవరు కిడ్నాప్‌చేశారో.... ఆమె ఇప్పుడు ఎక్కడుందో .... ఏమయిందో బేలతనంతో మాటలు రాని వాడిలా ఆగిపోయాడు.

షకావత్ కళ్ళలోని బాధ చూడలేక అక్కడి నుంచి బయటికి వచ్చాడు కుల్వంత్. అంతా మిస్టరీగా ఉంది.

పాలకవర్గం ఎం.పి. కూతుర్ని, ఇద్దరు కానిస్టేబుల్స్, వాచ్‌మన్, రెండు అల్సేషియన్ డాగ్స్ ఉండగా, వేసిన తలుపులు వేసినట్లే ఉండగా. ఎటు నుంచి వచ్చారో ఎటు నుంచి తిరిగి ఎలా వెళ్ళారో కూడా అర్థం కానంత ఊహకందనంత పకడ్బందీగా ఆమెను ఎవరో అపహరించారు.

"ఇందులో కానిస్టేబుల్స్ హస్తంకానీ, వాచ్‌మన్ హస్తం కానీ ఉందా!" అనుమానం వచ్చింది అతనికి.

పక్కనున్న ఇన్‌స్పెక్టర్‌తో అన్నాడు "ఆ కానిస్టేబుల్స్‌ని, వాచ్‌మన్‌ని వ్యాన్ ఎక్కించండి. మీరు కూడా నాతో రండి...." అంటూ వడివడిగా అడుగులు వేసి, జీప్‌లో కూర్చున్నాడు కుల్వంత్.

మరో నిముషానికి అతని జీప్, ఆ వెనకగా మరో వ్యాన్ బయలు దేరాయి.

వార్త దేశం అంతా దావానలంలా వ్యాపించింది.

తీవ్రంగా స్పందించింది ప్రభుత్వం.

అంతకంటే తీవ్రంగా స్పందించాయి ప్రతిపక్షాలు.

కనీవినీ ఎరుగని రీతిలో రంగప్రవేశం చేశారు పోలీసులు. దేశం అంతా పెద్ద ఎత్తున గాలించారు.

రోజులు....వారాలు....నెలలు....సంవత్సరాలు గడిచాయి.

అలా ఎనిమిది సంవత్సరాలు గడిచాయి.

ఆమె జాడలేదు. ఏమయిందో తెలియదు. ఆమె తండ్రి తప్ప అందరూ ఆమె గురించి మర్చిపోయారు. చివరికి పోలీస్ డిపార్ట్‌మెంట్ కూడా విసిగిపోయింది. ఆ కేస్ క్లోజ్ అయింది.

మన మాజీ ప్రధాని హత్యనే సంవత్సరకాలంలో మరిచిపోవడం జరిగింది. ఇదీ అంతే....

ం ం ం

1993, సెప్టెంబర్ 13.
హైదరాబాద్
సమయం :సాయంకాలం ఐదుగంటలు
రవీంద్రభారతి
హడావిడిగా కోలాహలంగా
వుందా ప్రాంతం.

"సాంస్కృతిక శాఖామాత్యులకు స్వాగతం" అని రాసి వున్న రంగురంగుల బ్యానర్లు గాలికి రెపరెపలాడుతున్నాయి.

వరుసగా కార్లు వచ్చి క్యాంపస్‌లో ఆగుతున్నాయి.

ఆగిన కార్లలోంచి ఖరీదైన మనుషులు దిగుతున్నారు.

అందులో పరిచయం వున్న వ్యక్తులు ఒకరిని ఒకరు విష్ చేసుకుంటున్నారు.

ఐదారుగురు పోలీస్ కానిస్టేబుల్స్, మరోఇద్దరు పోలీస్ అధికారులు అక్కడ నిలబడి వున్నారు.

సరిగ్గా ఐదు గంటల పది నిముషాలు అవుతుండగా ఓవైట్ అంబాసిడర్ కారు, ఆ వెనుకగా ఒక మారుతీ జీప్సీ వ్యాన్ వచ్చాయి.

కారు డోరు తెరుచుకుని బయటకు దిగారు ఇద్దరు గన్‌మాన్‌లు.

వారిలో ఒకరు కారు వెనక డోరు తెరవగానే అందులోనుంచి బయటికి దిగాడు సాంస్కృతిక వ్యవహారాల మంత్రి.



ఆయనను చూస్తూనే హడావుడిగా కదిలి వచ్చి శాల్యూట్ చేశారు అక్కడి పోలీసులు.

పూల దండలతో నిలబడి వున్న వ్యక్తులు హడావుడిగా ఆయన వైపు కదిలారు.

వరుసగా ఆయన మెడలో పడిపోయాయి ఆ దండలు.

క్లిక్....క్లిక్‌మని శబ్దం చేస్తూ ఫ్లాష్‌లు వెలిగించాయి కెమెరాలు.

ఆ వ్యక్తుల వెనకనుంచి వచ్చింది ఓ యువతి

ఓ క్షణ కాలం అక్కడ గాలి స్తంభించింది.

కొందరి హృదయస్పందన నిలిచిపోయింది.

రెప్పవేయడం మరచిపోయారందరూ.

ఆమె అందం గురించి చెప్పాలంటే చాలా కష్టమైన పనే అవుతుంది.

ఆమె-శుభాంగి.

"వాట్ ఫెంటాస్టిక్ బ్యూటీ!" అస్పష్టంగా ఇంగ్లీష్‌లో గొణిగాడు ఆమెను చూస్తూ ఓ వ్యక్తి.

"వాహ్ చాంద్‌కా టుక్‌డా!" స్పష్టంగా హిందీలో అన్నాడు మరో వ్యక్తి.

మంత్రిని చూస్తూనే ఆమె చిరునవ్వు నవ్వింది.

పలుచని ఎర్రని ఆమె పెదవుల వెనుక నుండి దానిమ్మగింజల్లాంటి ఆమె అందమైన పలు వరస తళుక్కుమని మెరిసింది.

కొందరి గుండె ఝల్లుమంది.

మరి కొందరి గుండెకొట్టుకోవడం మానేసింది.

మంత్రముగ్ధులై ఆమెను చూస్తుండిపోయారు జనం.

ఆమె ప్రక్కనున్న ఓ వ్యక్తి ఆమె చేతికి ఫ్లవర్ బొకేని అందించాడు.

దానిని ఆమె అందుకుని, మంత్రిగారి చేతికి అందించింది.

2)

టపటప వెలిగాయి మరోసారి ఫ్లాష్‌లు.

"అబ్బ....ఇంత అందమైన అమ్మాయిని ఫోటోగ్రాఫ్ చేసి నా కెమెరా ఎంత అదృష్టం చేసుకుంది"-అనుకున్నాడో కుర్రఫోటోగ్రాఫర్.

వారందరి కాళ్ళు హాల్ ఎంట్రన్స్ వైపు నడిచాయి.

అక్కడ రిబ్బన్ దగ్గర ఆగారు అందరూ.

మంత్రిగారి చేతికి కత్తెర అందించారు ఒకరు.

రిబ్బన్ కట్ చేశాడు ఆయన.

ఫ్లాష్‌లు వెలిగాయి.

క్లాప్స్ మోగాయి.

ఆదొక పెయింటింగ్ ఎగ్జిబిషన్....దాదాపు డెబ్బై పెయింటింగ్స్ అక్కడ డిస్‌ప్లే చేశారు.

లైట్ క్రీంకలర్ వాల్‌కి అందమైన ఫ్రేమ్స్‌లో బిగించిన పెయింటింగ్స్, వాటిపైన అమర్చిన టంగ్‌స్టన్ స్పాట్ లైట్స్.

అద్భుతమైన పెయింటింగ్స్ అవి.

ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి.

వాటిలో ఏది అందంగా వుందో చెప్పడం అసంభవం

"చాలా అద్భుతంగా పెయింట్ చేశావమ్మా" మెచ్చుకోలుగా అన్నాడు మంత్రి. అతనికి ఆమె వేసిన పెయింటింగ్స్ కన్నా ముందుగా ఆమె అందం నచ్చింది.

"థాంక్స్" అన్నట్లుగా నవ్విందామె.

"నీకు గట్టిగా పాతికేళ్ళు కూడా వున్నట్లు కనపడటంలేదు. ఇప్పుడే ఇంత ప్రతిభ చూపిస్తున్నావంటే....నీకు మంచి భవిష్యత్తు వుందమ్మా" అని పెయింటింగ్స్‌ని పరిశీలనగా చూస్తూ చెప్పాడు మంత్రి

"ఈ పెయింటింగ్ నాకు ఎంతగానో నచ్చింది. కలర్స్ చూడడానికి కూల్‌గా, లవ్లీగా ఉన్నాయి....ఇంతకీ దీని అర్థం ఏమిటి? దీనిని ఏ రకమైన పెయింటింగ్ అంటారు?" ఆసక్తిగా అడిగాడు ఆయన.

"దాన్ని అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ అంటారు. మీరు పెయింటింగ్ టైటిల్ చదివి పెయింటింగ్‌ని కాస్త డీప్‌గా స్టడీ చేయగలిగితే....ఈ రకమైన పెయింటింగ్‌ని ఎంజాయ్ చేయవచ్చు....కలర్ కాంబినేషన్ కూడా అంతే" చెప్పిందామె, అంతకు మించి వివరించడం అనవసరం అన్నట్లుగా.



"స్వీట్ వాయిస్" అనుకున్నాడు మినిస్టర్‌గారి పి.ఎ.

"ఇది నేను తీసుకోవాలనుకుంటున్నాను. దీని రేటు ఎంత?" ఏదో ఒకటి ఆమెతో మాట్లాడాలి. అదీ పెయింటింగ్ ఎగ్జిబిషన్ కాబట్టి అంతకు మించి సబ్జెక్టులోకి వెళ్ళడం మంచిది కాదనుకున్నాడాయన.

ఆమె ఒకింత ఇబ్బందిగా కదిలింది.

"ఫరవాలేదమ్మా....చెప్పు....ఎంతరేటయినా ఫరవాలేదు"

"మీరే మొదటి వ్యక్తి కాబట్టి....మీరు ఎంతనుకుంటే అంత పే చెయ్యవచ్చు సార్" ఆమె ప్రక్కనున్న వ్యక్తి చెప్పాడు.

ఆమెను ఇంప్రెస్ చేయడానికి అదో అవకాశమని అతననుకున్నాడు.

"ఓ.కే." అని తన పి.ఎ. వైపు చూసి ఏదో అన్నాడు.

తన దగ్గరున్న బ్యాగ్‌లోంచి చెక్‌బుక్, పెన్ తీసి ఇచ్చాడు పి.ఎ.

బుక్‌లోని ఒక లీఫ్ మీద కాష్ కాలమ్‌లో అంకెలు వేసి సంతకం పెట్టి అమె చేతికి ఇచ్చాడు.

అందులోని అంకెలు చూసి "లక్ష రూపాయలే....మైగాడ్" అనుకుని గుండెమీద చేయి వేసుకున్నాడు ఓ వ్యక్తి.

"అంత డబ్బే" అని ముక్కు మీద వేలేసుకుంది మరో యువతి.

"థాంక్యూసార్" అని కృతజ్ఞతతో అని, "ఈ డబ్బుని....వికలాంగుల సహాయ నిధికి అందజేస్తున్నాను" అంది ఆమె అందరికీ వినిపించేలా.

సంతోషంతో అక్కడి జనాలు కొట్టిన క్లాప్స్‌కి ఆడిటోరియం దద్దరిల్లింది.

"నీ ఎగ్జిబిషన్ అయ్యాక తీసుకుంటానమ్మా ఆ పెయింటింగ్. మరి నేను వస్తాను—నాకు మరొక ఫంక్షన్ వుంది" అంటూ ముందుకు కదిలాడు మంత్రి.

జస్ట్ ఫార్మాలిటీ ముగిసింది....మరుసటి రోజు పేపర్లో లక్ష రూపాయల పెట్టుబడితో న్యూస్ ఐటమ్‌ని సృష్టించగలిగాడు ఆయన.

కృతజ్ఞతతో చేతులు జోడించిందామె.

ఆయనను కారు వరకు సాగనంపిందామె.

కారులో కూర్చోబోతూ....అడిగాడు ఆయన "ఇంతకీ నీ పేరు మర్చిపోయానమ్మా. మరోసారి చెబుతావా !"

"శుభాంగి" చిరునవ్వుతో చెప్పిందామె.

పెయింటింగ్ సంగతెలా వున్నా ఈ అమ్మాయి బావుంది అనుకున్నాడాయన.

మరో నిమిషానికి మంత్రిగారి కారు వెళ్ళిపోయింది.

"శుభాంగి—శుభాంగి....వాటె లవ్లీ నేమ్—" స్వగతంలో అనుకున్నాడు.

అంతవరకు దూరం నుంచి వారిని చూస్తున్న ఓ యువకుడు....

అందమైన రూపం .... మరింత అందమైన పేరు .... తీయని స్వరం .... అద్భుతమైన ఆర్ట్ .... సృష్టికర్త తనకున్న ప్రతిభనంతా ఉపయోగించిన సజీవ శిల్పం....ఈ శుభాంగి అనిపించిందతనికి.

ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఆ వెనుకనే లోపలకు నడిచాడా యువకుడు కూడా.

ఆమె లోపలకు వెళ్ళగానే కొందరు వ్యక్తులు ఆమెను చుట్టుముట్టి ఏవో ప్రశ్నలు అడగసాగారు.

వారికి సమాధానం చెబుతోంది ఆమె.

ఆ యువకుడు వరుసగా పెయింటింగ్స్ అన్నీ చూడసాగాడు.

అన్నింటిలోనూ అతను గమనించింది ఒకటి వుంది.

కలర్ కాంట్రాస్ట్ ఈట్ పెంటాస్టిక్.

కలర్స్ ఆర్ వెరీ సూదింగ్ అండ్ ప్లెజంట్.

అన్ని పెయింటింగ్స్‌ని ఒక రౌండ్ కొట్టి చూసి వచ్చేసరికి దాదాపు గంటపట్టింది అతనికి! అలా పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కి రావటం అతనికి అది మొదటిసారి.



అన్నిటినీ చూచి వెనక్కి వచ్చాడతను.

అప్పటికి ఆమె చుట్టూ వున్న గుంపు ఆమెనుంచి దూరంగా వెళ్ళి పెయింటింగ్స్ చూడడంలో నిమగ్నమైపోయారు.

కానీ ఇద్దరు వ్యక్తులు మాత్రం ఆమెతో ఇంకా మాట్లాడుతున్నారు!

ఆమెకు ఓ పదడుగుల దూరంలో నిలబడి ఆమెనే రెప్పవాల్చకుండా చూడసాగాడు.

ఎందుకో తల తిప్పిన ఆమెకు, తననే రెప్పవాల్చకుండా చూస్తున్న ఓ యువకుడు కనిపించాడు.

అతని చూపులో ఏదో ప్రత్యేకత కనిపించింది ఆమెకు. అతని చూపుల్లో ఓ రకమైన గ్రేస్ వుంది. అతని కదలికలో కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది.

నిమిషం తరువాత తిరిగి అతని వైపు చూసింది.

అదే ప్రదేశంలో నిలబడి ఆమెనే తదేకంగా చూస్తున్నాడతను.

అంతవరకు ఆమెతో మాట్లాడుతున్న ఆ వ్యక్తులు ఇద్దరు వెళ్ళిపోయారు.

కొద్ది క్షణాలు ఆమె ఒంటరిగా మిగిలింది.

ఆమెతో మాట్లాడటానికి అది మాత్రమే అవకాశం అనుకున్నాడతను. ఓ సారి షర్ట్ సరిచేసుకుని ఆమె వైపు కదిలాడు.

"ఎక్స్‌క్యూజ్‌మి" చాలా కూల్‌గా .... చిరునవ్వుతో అడిగాడామెను.

అతని వైపు తలతిప్పింది శుభాంగి.

అంతవరకు తనను దూరంనుంచి చూసిన యువకుడు తనను సమీపించి పలకరించేసరికి ఒకింత తొట్రుపడి సర్దుకుంది ఆమె.

ఆమె పెదవులపై పలకరింపుగా చిరునవ్వు, ఆమె కళ్ళలో "మీరెవరు?" అన్న ప్రశ్నార్థకం ఒకేసారి కనిపించాయి అతనికి.

"యు వార్ ది ఆర్టిస్ట్ శుభాంగి.... అవునా!" ప్రశ్నించాడు. అవునన్నట్లు సున్నితంగా తల ఊపింది.

ఇలా తల ఆడించినపుడు ఆమె ముంగురులు నుదుటి మీదికి వచ్చి ఆమె ముఖానికి మరింత అందం తెచ్చాయి.

"నైస్ టు మీట్ యు.... అయాం సాయిగౌతమ్, ఫ్రం బాంబే" సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"ప్లీజ్డ్ టు.... మీట్ యు" చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది శుభాంగి.

"మీ పెయింట్స్ అద్భుతంగా వున్నాయి" అభివందనగా అన్నాడు అతను.

"థాంక్యు" తీయగా సమాధానం చెప్పిందామె. అంతలో అందామె "అరే మీరు తెలుగు మాట్లాడుతున్నారే!" ఒకింత ఆశ్చర్యంగా అంది ఆమె.

నవ్వాడు అతను.

"నేను తెలుగువాణ్ణి. బట్ పుట్టి పెరిగింది బాంబేలో."

"ఐసీ.... మీరు.... నా పెయింటింగ్ ఎగ్జిబిషన్ చూడడానికే వచ్చారా! లేక వేరే ఏదయినా పనిమీద వచ్చి...."

"అఫ్‌కోర్స్ .... ఈ వూరు వచ్చినది వేరే పనిమీద. బట్ ఇక్కడికి వచ్చింది మాత్రం మీ పెయింటింగ్స్ చూడడానికే. నేను ఇటువంటి ఆర్ట్సని చాలా లైక్ చేస్తాను. మీలాగే మీ పెయింటింగ్స్ కూడా అందంగా వున్నాయి."

"థాంక్స్" అన్నట్లుగా లీలగా కదిలాయి ఆమె పెదవులు. కొద్దిగా సిగ్గుపడింది కూడా.

"మీరు కూడా పెయింటరా!" అడిగిందామె

"అస్సలు కాదు. అసలు నాకు రాదు."

తడుముకోకుండా అతను చెప్పిన జవాబు విని ఆమెకు నవ్వు వచ్చింది.

"చాలా అందంగా నవ్వుతోంది ఈమె" అని అప్పటికి ఇరవై సార్లు పైగా అనుకుని వుంటాడు అతను.

ఏదో అడగబోయిన అతను అటుగా కొందరు వ్యక్తులు ఆమెతో మాట్లాడడం కోసం రావడంతో ఆగాడు.



"ఇక్కడున్న చైర్‌లో కూర్చోండి. వీళ్ళతో మాట్లాడి వస్తాను" చెప్పిందామె.

"అలాగే" అని తల ఊపి దూరంగా వున్న చైర్‌లో కూర్చున్నాడతను.

వాళ్ళతో మాట్లాడుతున్న ఆమెను పరిశీలనగా చూడసాగాడతను.

సుమారు ఐదడుగుల ఆరంగుళాల ఎత్తు, నాజూకైన శరీరం, లేత గులాబీ ఛాయ.

భుజాలవరకు పడేలా కట్ చేసుకున్న సున్నని కురులు, విశాలమైన కళ్ళు, సన్నని నాసిక, బలమైన బుగ్గలు, సన్నటి భుజాలు, నాజూకైన చెవులు.... తీర్చిదిద్దినట్లున్న అందాలు, ఎత్తయిన వక్షం, సన్నని నడుము, లేతగా వున్న పాదాలు– అందం అనేది ఆమె శరీంలోని ప్రతి ఒంపులోను వుంది.

దృష్టి మరల్చుకోలేని సౌందర్యం శుభాంగిది.

ఆమె అందం గురించి చెప్పాలంటే ఆమె పాదాలమీద కంద పద్యం చెబితే, ఆమె చుబుకంమీద సీస పద్యం చెప్పచ్చు. జాకెట్‌కి, చీరకి మధ్య వున్న ఖాళీ ప్రదేశంమీద ఉత్పలమాల చెబితే, కళ్ళ గురించి షాయిరీలు వినిపించవచ్చు అనుకున్నాడు.

ఆమె కట్టిన గంధపురంగు సిఫాన్ చీర, మ్యాచింగ్ బ్లౌజు కూడా ఆమె సౌందర్యంముందు వెలవెలబోతున్నాయి.

ఈమెతో ఎలాగయినా పరిచయం పెంచుకోవాలి అనుకున్నాడు సాయిగౌతమ్.

అతను మాట్లాడేటంతలో మరెవరో వచ్చారు ఆమెతో మాట్లాడటానికి.

తరువాత ఇంకెవరో....

ఇరవై నిమిషాలు గడిచాయి.

ఇక ఈ రోజు మాట్లాడడం అసంభవం అనుకున్నాడు. అందుకే

అన్నాడు ఆమెతో "మీతో కొంచెం మాట్లాడాలి. ఎప్పుడు ఫ్రీగా వుంటారు?"

"విషయం ఏమిటో తెలుసుకోవచ్చా?" వెంటనే ఆమె నుంచి ప్రశ్న వచ్చింది.

ఊహించని ఆ ప్రశ్న ఎదురవటంతో ఒకింత సర్దుకుని "ప్రత్యేకంగా ఏమీలేదు. మీకు ముందే చెప్పానుకదా పెయింటింగ్స్ అంటే నాకు ప్రాణం అని. అందుకే.... ఆ విషయమె మాట్లాడాలని—"

"సారీ కుదరదు" అని చెప్పాలనిపించింది కానీ చెప్పలేకపోయింది. అతనిలో ఏదో ఆకర్షణశక్తి వుంది. అదేమిటో ఆమెకు అంతుబట్టలేదు. తొలిసారిగా ఆమె ఓ అపరిచితుడి ముందు మొహమాట పడుతోంది.

"ఏమిటి?.... మీకు ఇష్టంలేదా?" అన్న అతని ప్రశ్నకు, సర్దుకుని "అదేంలేదు. నేను సాధారణంగా నా ఇంటిదగ్గర ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వను. నిర్మొహమాటంగా ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దు. మీరొక పని చేయవచ్చు. నేను రేపు ఉదయం పది గంటల నుంచి ఓ గంటపాటు గ్రీన్‌పార్క్ హోటల్‌లో వుంటాను. నాకు అక్కడ పని వుంది. మీరు మాట్లాడాలనుకుంటే అక్కడికి రండి. మీతో ఒక అర గంట మాట్లాడ గలుగుతాను" చెప్పిందామె.

"నా రిక్వెస్టుని మన్నించినందుకు చాలా థాంక్స్. రేపు పది గంటలకు గ్రీన్‌పార్క్ హోటల్‌వద్ద మీకోసం ఎదురు చూస్తుంటా....బై" అని వెనక్కి తిరిగి బయటకు వచ్చి నడవసాగాడు.

అతని వయసు ఇరవై ఎనిమిది వరకు వుండవచ్చు అనుకొంది ఆమె.

ఆరడుగుల ఎత్తు....ఎక్సర్‌సైజు వల్ల విశాలంగా వున్న ఛాతీ, ఎత్తయిన కండరాలు, సన్నని నడుము ...అతని శరీరానికి పెర్‌ఫెక్ట్ షేప్ వుంది. అతను ధరించిన వైట్‌జీన్స్, టీ షర్ట్‌లో అతని బాడీ షేప్ స్పష్టంగా తెలుస్తోంది. అందమైన కనుముక్కు తీరు.... ముఖానికి నప్పే హెయిర్ స్టయిల్.... మీసాలు.



అతను అందంగా వున్నాడనుకొంది శుభాంగి అంత బిజీగా వుండి కూడా.

o o o

"హల్లో మిస్ శుభాంగి"

సుపరిచిత కంఠం వినపడడంతో తల తిప్పి వెనక్కి చూసి "హలో సాయిగౌతమ్.... మీరా" అంది శుభాంగి.

లీఫ్‌గ్రీన్ చుడీదార్‌లో చాలా సింపుల్‌గా వున్న ఆమెను చూసి ఈమె ఏ అలంకరణ లేకపోయినా అందంగా వుందే అనుకున్నాడు సాయిగౌతమ్.

"ఎప్పుడొచ్చారు?" అడిగిందామె.

"జస్ట్ పదినిమిషాలయింది లాంజ్‌లో కూర్చున్నాను"

"ఐ.సీ. బై దివే.... ఈమె నా క్లోజ్‌ఫ్రెండ్ సుప్రియ" అని తన ప్రక్కనున్న అమ్మాయిని చూపించింది శుభాంగి.

"హలో" అందామె!

సుప్రియకు కూడా సుమారు ఇరవై ఐదేళ్ళుండవచ్చు. అందగత్తె కాకపోయినా, ఆకర్షణీయంగా, షార్ప్‌గా కనిపించింది.

తనకు తాను పరిచయం చేసుకున్నాడు సాయిగౌతమ్.

"ఓ.కే..... నాకు పనుంది. మళ్ళీ కలుద్దాం" సాయిగౌతమ్‌తో అని "శుభా .... ఈవినింగ్ నాకు ఫోన్ చెయ్యి" అని వెళ్ళిపోయిందామె.

"రండి. రెస్టారెంట్‌లో కూర్చుందామా" అన్నాడు ముందుకు నడుస్తూ.

"ష్యూర్" అని అతనిని అనుసరించింది.

ఇద్దరూ రెస్టారెంట్‌లోకి వెళ్ళారు.

ఆ సమయంలో రెస్టారెంట్ దాదాపు ఖాళీగా వుంది.

"అలా కూర్చుందాం రండి" అని ఒక టేబుల్‌వైపు దారి తీశాడు సాయిగౌతమ్.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఏం తీసుకుంటారు?" అడిగిందామె.

"నేను జస్ట్ కోల్డు కాఫీ తీసుకుంటా"

"అయితే నేనూ అదే తీసుకుంటా" చెప్పిందామె.

వెయిటర్‌కి అదే ఆర్డర్ చేశారు.

పగటి వెలుగులు గ్యాస్ డోర్సులోంచి లోపలికి ప్రవేశిస్తున్నాయి. ఆ వెలుగుల్లో శుభాంగి చాలా అందంగా కనిపిస్తోంది.

"పెయింటింగ్స్ గురించి మనం మాట్లాడుకునే ముందు ఒకళ్ళ నొకరు పరిచయం చేసుకుంటే బావుంటుందేమో!" అడిగాడు.

"ష్యూర్"

"అయితే ముందుగా మీరే మీ గురించి చెప్పాలి" అడిగాడు సాయి గౌతమ్.

ఆమె అలాగే అన్నట్టు తల వూపింది.

వెయిటర్ ఇద్దరికీ కోల్డ్ కాఫీ సర్వ్ చేసాడు.

ఇద్దరూ సిప్ చేయనారంభించారు.

ఆమె తన గురించి చెప్పనారంభించింది.

ఆమె చెప్పబోయే విషయాలు చాలా ఆసక్తిగా వుంటాయేమో అని పించింది అతనికి.

కాన్‌సన్‌ట్రేషన్ ఆమె మీదే నిలిపి వినటానికి సిద్ధం అయ్యాడు.

"మాది బెంగుళూరు. మా ఫాదర్ ఎడ్వకేట్, పేరు సిద్ధ లింగప్ప."

ఉలిక్కిపడ్డాడు అతను ఆమె సమాధానం విని.

"మా అమ్మానాన్నలకి నేను ఒక్కత్తే కూతుర్ని"

"అయితే....మరి....మీరు ఇక్కడ" ఏదో అడగబోయాడు.

"అదే చెబుతున్నాను. నా దురదృష్టవశాత్తు నా పదిహేడవ ఏట వాళ్ళిద్దరూ కార్ యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఆ తరువాత నా మేన మామ ఒకాయన నన్ను ఇక్కడికి తీసుకువచ్చారు. ఓ ఏడాది పాటు నన్ను చూసుకున్నాడు. ఆయన కూడా కేన్సర్ వచ్చి చనిపోయాడు. నా తల్లి



దండ్రులు చనిపోయినప్పుడు ఇన్స్యూరెన్స్ కంపెనీ నుంచి నాకు పదిహేను లక్షలు వచ్చాయి. దానితో నేను స్వతంత్రంగా, ఒంటరిగా వుంటు న్నాను" అంతవరకు విని పెదాలు విడిపడకుండా నవ్వాడు సాయి గౌతమ్.

అతనెందుకు నవ్వాడో అర్థం కాలేదామెకు. అదే అడిగిందామె.

"ఎందుకో మీరు చెప్పే విషయం నమ్మబుద్ధి కావడం లేదు" కూల్‌గా అన్నాడు సాయిగౌతమ్.

"అంటే" ఆమె ముఖంలో రంగులుమారాయి. ఆమె ఆత్మాభి మానం మీద చిన్నపాటి దెబ్బ తగిలింది.

నాలిక కరుచుకున్నాడు సాయిగౌతమ్. ఆమె ఫీలింగ్స్‌లో వచ్చిన మార్పుని చూసి తన మనస్సులోని మాటని అనాలోచితంగా పైకి అన్నందుకు తనని తానే తిట్టుకుని సర్దుకున్నాడు.

"అబ్బే....ఏం లేదు. ఊరికే అన్నాను. చెప్పండి" అన్నాడు.

"ఇంకేముంది చెప్పటానికి, దటీజ్ ఎబౌట్ మీ" పొడిగా అంది ఆమె.

"మరి నాకు టైమ్ అయింది. వెళతాను" వాచ్‌లో టైమ్ చూసు కుంటూ నిలబడింది.

"అరె....అప్పుడే వెళ్ళిపోతున్నారా! ఇంకా నా గురించి చెప్పలేదు. మీ పెయింటింగ్స్ గురించి అడగలేదు"

"మరోసారి కలుద్దాంలెండి" అని ఇంకొకమాటకి అవకాశం ఇవ్వ కుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

'ఛ....తొందరపడి ఆ మాట అన్నాడు. ఆమె ఫీలయింది. వెళ్ళి పోయింది. ఇంక చేసేదేముంది! సాయంకాలం మళ్ళా ఆర్ట్ ఎగ్జిబిషన్ దగ్గ రికి వెళ్ళి మరోసారి ఆమెతో మాట్లాడాలి అనుకున్నాడు.

వెయిటర్ తీసుకువచ్చిన బిల్ పే చేసి బయటికి నడిచాడు సాయి గౌతమ్ కూడా!

ం ం ం

ట్రింగ్....ట్రింగ్....

ఫోన్ రింగవటంతో గాఢ నిద్రలో వున్న సాయిగౌతమ్‌కి మెలుకువ వచ్చింది. ఒళ్ళు విరుచుకుని లేచి బెడ్ ప్రక్కనే వున్న ఫోన్ అందుకున్నాడు.

"హలో....నేను బొంబాయి నుంచి కన్విల్‌కర్‌ని మాట్లాడుతున్నాను సార్" వినిపించింది అవతలి కంఠం.

ఆ కంఠం విని సర్దుకుని కూర్చున్నాడు సాయిగౌతమ్.

"హలో కన్విల్....ఏమిటి విషయం చెప్పు"

"మీరు ఈరోజు ప్రొద్దున్నకే వస్తానన్నారు. రాలేదేమిటా అని ఫోన్ చేస్తున్నాను సార్. మీకు పరశురామ్ ఇంకా కలవలేదా?"

"మొన్ననే కలిశాడు. ఆ పని పూర్తి అయిపోయింది. కానీ ఇంతలో...."

"ఆ....ఏమయింది సార్" ఒకింత కలవరం తొంగి చూసింది కన్విల్ స్వరంలో.

ఒక్క-క్షణం గ్యాప్ తరువాత చెప్పాడు గౌతమ్ "నథింగ్ టు వర్రీ....నిన్న నాకు ఇక్కడ మౌనిక కనిపించింది"

"మౌనికా" అదిరిపడ్డాడు కన్విల్. "ని....నిజమా సార్"

"యస్....నిన్న కనిపించింది. ఆమెను పరిచయం చేసుకున్నాను. ఆమె వివరాలు అడిగాను. బట్....ఆమె పేరు ప్రస్తుతం శుభాంగి అని మార్చుకుంది. తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో బెంగుళూరులో చనిపోయారంటూంది."

ఓ క్షణం గుండె ఆగిపోయి తిరిగి కొట్టుకోసాగింది కన్విల్‌కి.

"ఎనీవే....ఆమె నుండి పూర్తి వివరాలు రాబట్టే వరకు నేను యిక్కడే వుంటాను. అంటే కనీసం ఒక వారం వరకు నేను రాలేకపోవచ్చు. ఈ లోపుగా రాబర్ట్‌ని హాంగ్‌కాంగ్ పంపించెయ్యి. నా గురించి వెయిట్ చెయ్యవద్దు"

"అలాగే సార్"

"అక్కడి విషయాలు జాగ్రత్తగా మేనేజ్ చెయ్యి"



"సరే సార్"

ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు గౌతమ్.

వాచ్‌లో టైం చూసుకున్నాడు. నాలుగూ ఇరవై.

బయట ఎండ కూడా ఎక్కువ లేదు.

ఐదు గంటలకి పెయింటింగ్ ఎగ్జిబిషన్ మొదలవుతుంది.

శుభాంగిని అక్కడ కలవాలి. ఆ మరునటి రోజు ఎగ్జిబిషన్‌కి ఆఖరి రోజు కూడా.

స్నానం చేసి రెడీ అవ్వాలని బాత్‌రూం వైపు కదిలాడు అతను ఓ నిశ్చయానికి వస్తూ.

o o o

"ప్లీజ్ టేక్ దిస్ ఎమౌంట్-సెవెంటీ ఫైవ్ థౌజండ్"

శుభాంగి చేతికి చెక్ అందించాడు ఆ వ్యక్తి. జంట నగరాలలో అతి పెద్ద జ్యూయలరీ షోరూం వుందతనికి.

శుభాంగి సర్రియాలిజంతో వేసిన ఓ పెయింటింగ్‌ని అతను డెబ్భై ఐదువేలకి కొనుగోలు చేశాడు.

"రేపటితో ఈ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ముగుస్తుంది. ఎల్లుండి ఈ పెయింటింగ్ మీ ఇంటికి పంపుతాను" చెప్పింది శుభాంగి ఆ వ్యక్తి విజిటింగ్ కార్డు అందుకుంటూ.

"అలాగే" అని వెళ్ళిపోయాడతను.

ఎగ్జిబిషన్ చూడటానికి వచ్చిన ఇద్దరు కుర్రాళ్ళు తమలో తాము గుసగుస మాట్లాడుకోసాగారు

"ఏమిటీ ...ఆ పెయింటింగ్ ఖరీదు డెబ్భై ఐదు వేలా!"

"ఏముంది దాంట్లో. కాలిపోయిన సమాధులు, ఎగిరే గుర్రాలు, చెట్లు అర్థం పర్థం లేకుండా"

"కాన్వాసు....ఫ్రేము....రంగులు అంతా కలిపి రెండు వేలు కూడా ఖర్చు అయి వుండదు. దానికి డెబ్భై ఐదు వేలా! ఆయనకేమైనా పిచ్చా ...అంత ఖర్చు పెట్టటానికి? అయినా ఆ అమ్మాయి ఏ ఐదు వేలకో దాన్ని అమ్మచ్చుగా!....మరీ అంత రేటా!"

"కొనేవాడున్నప్పుడు ఆ అమ్మాయికి ఏం నష్టం? నాలుగు లక్షలకయినా అమ్ముతుంది. బ్లాక్‌మనీ వుందిగురూ! అది ఇలా ఖర్చు పెడుతున్నాడు" అలా సాగుతున్న ఆ సంభాషణ కొంత స్పష్టంగా, కొంత అస్పష్టంగా శుభాంగి చెవిన పడి నవ్వుకుంది.

"హలో....గుడీవినింగ్....ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు" అన్న పలకరింపుకు తలతిప్పి చూసింది శుభాంగి.

ఎదురుగా నిలబడి పలకరింపుగా నవ్వుతున్నాడు సాయిగౌతమ్.

"హలో.... రండి" అని తనూ నవ్వేసింది. అదేసమయంలో ఆమెకు క్రిందటి రోజున జరిగిన సంఘటన గుర్తు వచ్చింది.

ఇద్దరూ హోటల్‌లో కూర్చున్నప్పుడు.... తన గురించి అంతా చెప్పింది. అదంతా విని "మీరు చెప్పే విషయం నమ్మబుద్ధికావటంలేదు" అన్నాడు. తాను సీరియస్‌గా చెప్పిన విషయాన్ని ఆ అబ్బాయి జోక్‌గా తీసుకోవటం చాలా ఇరిటేట్ చేసింది ఆమెను.

అదే క్షణంలో ఆమె వదనం ఒకింత గంభీరంగా మారిపోయింది.

"మీరా విషయం చాలా సీరియస్‌గా తీసుకున్నట్లున్నారు. కేవలం జోక్‌గా అన్నాను. అయాం రియల్లీ సారీ" బాధపడుతున్నట్లు అన్నాడు సాయిగౌతమ్.

అతను అలా క్షమాపణ చెప్పేసరికి ఇంక సీరియస్‌గా వుండలేకపోయింది "సర్లెండి.... ఆ విషయం మర్చిపోదాం. ఇంకేమిటి విషయాలు చెప్పండి" అంది మామూలుగా అవటానికి ప్రయత్నిస్తూ

"థాంక్స్.... మీరు మళ్ళీ నాతో మాట్లాడతారో లేదో అని భయపడ్డాను. ఎందుకో మిమ్మల్ని చూడగానే మీతో స్నేహం చేయాలనిపించింది. అందుకే మీతో మాట్లాడుతున్నాను" సూటిగా విషయం చెప్పాడు.

"నాకూ అలాగే అనిపిస్తోంది" అని చెప్పాలనుకుంది. కానీ చెప్పలేకపోయింది.



ఆమెకు తెలియకుండానే ఆమె అతనిలోని ఒక రకమైన ఆకర్షణకు లోనవుతోంది. అతనితో మాట్లాడాలని, సరదాగా టైమ్ స్పెండ్ చెయ్యాలని అనిపిస్తోంది.

నిజానికి శుభాంగిది చాలా సీరియస్‌గా వుండే మనస్తత్వం. ఆమెకు మౌనిక తప్ప మరెవరూ స్నేహితులు లేరు. ఎవరితోనూ సన్నిహితంగా వుండదు.

ఎంతో కాలం అయితే తప్ప ఎవరితోనూ పది నిమిషాలు కూడా మాట్లాడలేదు ఆమె.

ఒంటరితనాన్ని ఇష్టపడుతుంది.

అటువంటి శుభాంగి ఈ రోజున సాయిగౌతమ్‌ని చూసినప్పుడు ఒక రకమైన అకర్షణకు లోనవుతోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్న సాయిగౌతమ్ ప్రశ్నకు సర్దుకొని "అబ్బే ఏమీ లేదు" అంది. సాయిగౌతమ్ మాట్లాడేటంతలో ఆమె దగ్గరకు ఇద్దరు ప్రెస్ రిపోర్టర్లు వచ్చారు.

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి" అంటూ.

"జస్ట్ ఎ మినిట్" అని వాళ్ళతో చెప్పి సాయిగౌతమ్‌తో "మనం ఇక్కడ మాట్లాడుకోవటం కష్టమండీ....ఎవరో ఒకరు ఇలా డిస్టర్బ్ చేస్తూనే వుంటారు" అంది.

"అయితే ఓ పని చెయ్యండి మీ ఇంటి అడ్రస్ చెప్పండి రేపు వస్తాను" అన్నాడు సాయిగౌతమ్.

"ఇంటికా....ఎందుకు....ఇంటి దగ్గర అసలే కుదరదు,రేపు సాయంకాలం ఐదు గంటలకు బంజారా హోటల్ దగ్గర కలుద్దాం."

"అలాగే....వస్తామరి" అని అక్కడి నుంచి కదిలాడు సాయిగౌతమ్.

పత్రికా విలేకరుల ప్రశ్నలకు సమాధానాలివ్వటానికి సిద్ధమయింది. శుభాంగి.

ఈమె ఇంటి ఎడ్రస్ ఇవ్వమంటే ...ఇవ్వలేదు హోటల్ దగ్గర

కలుద్దాం అంటోంది .. ఇందులో ఏమయినా తిరకాసు వుందా! అన్న ఆలోచన వచ్చింది సాయిగౌతమ్‌కి.

o o o

సరిగ్గా ఐదు అవుతుండగా గేట్‌వే బంజారా హోటల్ ఆవరణలోకి దూసుకు వచ్చింది వైట్ మారుతీకారు.

పార్కింగ్ ప్లేస్‌తో కారుని ఆపి క్రిందికి దిగి డోర్ లాక్ చేసింది శుభాంగి.

ఓ క్షణం ఇటూ అటూ పరికించి చూసిందామె.

ఆమెకు సాయిగౌతమ్ ఎక్కడా కనపడలేదు.

లాంజ్‌లో వున్నాడేమోనన్న డౌట్ వచ్చి లోపలకు నడిచిందామె.

గ్లాస్ డోర్స్‌లు దాటి లోపలికి వెళ్ళింది.

ఎయిర్‌కండిషన్డ్ హాలులోకి ప్రవేశించగానే చల్లని గాలి ఆమె శరీరాన్ని తాకింది.

తలతిప్పి చూసిన ఆమెకుసోఫాలో కూర్చుని ఇండియాటుడే మ్యాగ్‌జైన్ చదువుతున్న సాయిగౌతమ్ కనిపించాడు.

తిన్నగా అతని వైపుకు నడిచింది.

మెత్తని కార్పెట్ మీద నడవటంతో ఆమె పాదాల నుండి ఏ విధమైన శబ్దం వెలువడటంలేదు.

సాయిగౌతమ్ ఎదురుగా, ఓ మూడు అడుగుల దూరంలో నిలబడింది ఆమె.

ఏ విధమైన అలికిడీ లేకపోవటంతో తల ఎత్తి చూడలేదు సాయిగౌతమ్.

నిముషంపాటు అలాగే చూసి చివరకు "హలో" అంది.

ఉలిక్కిపడి తల ఎత్తి ఆమె వైపు చూసి "హలో....రండి....అయామ్ వెయిటింగ్ ఫర్ యు" అన్నాడు.

"అబద్ధం... మీరే తలెత్తి నా వైపు ఎప్పుడు చూస్తారా అని నేను వెయిట్ చేస్తున్నాను" అంది,

"అంటే ...మీరు ఎప్పుడొచ్చారు?"



"ఓ మూడు నిముషాలు అయి వుండొచ్చు"

"నిజమా !"

"నేనేం చెప్పినా మీకు అబద్ధంలాగే వుంటుంది అదేం పాపమో మరి" టపీమని సమాధానం చెప్పింది.

తెల్లముఖంపెట్టి సర్దుకుని "సరే....ఎక్కడ కూర్చుందాం చెప్పండి" అడిగాడు.

"మీరేమిటి....నా కంటే చాలా ముందే వచ్చి ఇక్కడ కూర్చున్నట్లున్నారు. అయినా చూస్తుంటే....మీరు, నా కోసం వెయిట్ చెయ్యటం తప్ప పని లేదనుకుంటాను. నేను ఐదు అవటానికి ఐదు నిముషాల ముందే వస్తే, అప్పటికే వచ్చి ఇక్కడ సెటిలయిపోయారు మీరు?"

"ఆ....పనేముంది మరి ? ఈ హోటల్‌లోనే ఐదో ఫ్లోర్‌లో 502 రూమ్‌లో వున్నాను. అక్కడి నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కి రావటానికి ఎన్ని నిముషాలు పడుతుందేమిటి?" ఎదురు ప్రశ్నించాడు.

"ఇంతకీ మీది బొంబాయి అన్నారు కదా! మరి ఈ ఊరు ఎందుకు వచ్చారు? అసలు ఏ ఉద్యోగం చేస్తుంటారు ?

"ఇవన్నీ ఇక్కడ కాదు. అలా లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాం రండి" అంటూ కారిడార్లోకి దారి తీశాడు.

ఇద్దరూ కలిసి హోటల్ వెనుక వైపుకి వచ్చారు. అక్కడ లాన్స్ వున్నాయి. అందులో రెడ్ కలర్ బోట్ ఒకటి, బ్లూకలర్ బోట్ ఒకటి వున్నాయి.

"రండి....సరదాగా బోటింగ్ చేస్తూ మాట్లాడుకుందాం" అని అటు వైపు దారి తీశాడు సాయిగౌతమ్.

అక్కడున్న కుర్రాడికి ఇరవై రూపాయలు పే చేసి ఇద్దరూ పెడలింగ్ బోట్‌లో కూర్చున్నారు.

లైఫ్ జాకెట్స్ ఇచ్చాడు ఆ కుర్రాడు.

"నాకు లైఫ్ జాకెట్ అవసరంలేదు. నీళ్ళలో పడినా ఈదగలను" అని ఆ జాకెట్‌ని బోట్‌లోనే ప్రక్కన పడేసాడు సాయిగౌతమ్.

4)

"నాకు ఈతరాదు బాబూ, నేను ఈ జాకెట్ వేసుకోవాల్సిందే" అంటూ ఆమె ధరించిన చూడీదార్ మీద లైఫ్ జాకెట్ కట్టుకుంది.

"డోంట్ వర్రీ....నాకు ఈతవచ్చుగా, ఏదయినా అయితే మిమ్మల్ని నేను సేవ్ చేయ్యగలను" అందామనుకున్నాడు కానీ అనలేకపోయాడు.

ఇద్దరూ పెడలింగ్ ప్రారంభించారు.

బోట్ నీళ్ళమీద జారిపోసాగింది.

"ఈ రోజు మీ గురించి వివరాలు చెప్పండి" అడిగింది శుభాంగి.

"మీరు అడిగిన ప్రశ్నకి సమాధానం తరువాత చెబుతా. ముందు ఇది చెప్పండి. మీరు నాతో నిజంగా స్నేహం చేద్దాం అనుకుంటున్నారా ! లేదా !"

"అదేం ప్రశ్న ? ఆ ఉద్దేశ్యం లేకపోతే ఇక్కడికెందు కొస్తాను ?"

"అక్కడే వుంది అసలు విషయం. అక్కడికి రండి....ఇక్కడికి రండి అనే బదులు మీ ఇంటికి అహ్వానించవచ్చు కదా! నేను ఇలా హోటల్స్‌లో, రెస్టారెంట్స్‌లో కలవడం కంటే ఇంట్లో కలిసి మాట్లాడ టాన్ని ఇష్టపడతాను" అన్నాడు. ఆ మాటకి ఆమె ముఖంలో రాబోయే మార్పులు గమనించాలని ఓరకంట ఆమెను చూశాడు.

ఆమె ముఖ భావాలలో ఏ మార్పులేదు.

"మీరు తప్పు అర్ధం తీసుకున్నట్లున్నారు నాకు అటువంటి అభ్యం తరాలు లేవు. మీరు మా ఇంటికి రావచ్చు" అని వ్యానిటీ బ్యాగ్ తెరచి అందులోంచి తన విజిటింగ్‌కార్డు తీసి...."ఇదిగో నా అడ్రస్" అని సాయి గౌతమ్ చేతికి ఇచ్చింది.

ఆమె తనను ఇంటికి పిలవకపోవటంతో ఇంట్లో ఏదో పెద్ద మిస్టరీ వుందని భావించిన అతను ఇలా అడగగానే ఇంటికి రమ్మనటంతో తెల్ల బోయి ఆ కార్డు అందుకుని "థాంక్స్" అన్నాడు.

"మరి ఎప్పుడు రమ్మంటారు మీ ఇంటికి?" అడిగాడు.

"ఎనీ టైమ్....రేపు ఖాళీగానే వుంటాను నేను"



"అలా అంటే కుదరదు. కనీసం రెండు మూడు గంటలైనా వుంటాను నేను"

"అయితే ఓ పని చెయ్యండి. రేపు ఉదయం పదకొండు గంటలకు రండి లంచ్ మా ఇంట్లోనే చేయండి"

"థాంక్యూ సో మచ్. మీ ఇంటికి వచ్చాక మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి"

"ముఖ్య విషయాలా!" ఆమె కనుబొమలు ముడిపడ్డాయి.

"పెయింటింగ్ గురించి మాట్లాడాలన్నారు. ఇప్పుడు ముఖ్య విష యాలు అంటున్నారు...ఆ విషయాలు ఏమిటో తెలుసుకోవచ్చా" ఒకింత ఆసక్తిగా అంది. సాయి గౌతమ్ తనని ప్రేమిస్తున్నాడేమోనన్న అను మానం కలిగింది ఆమెకు ఆ క్షణంలో

నిజానికి తనుకూడా సాయిగౌతమ్‌ని చాలా అభిమానిస్తోంది. ఆ అభిమానం ఎందుకు సడన్‌గా డెవలప్ అయిందో ఆమెకే తెలియటంలేదు. దానిని "ప్రేమ" అనడానికి పూర్తిగా మనస్కరించడం లేదు.

కారణం....లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనే మాటకి అర్థంలేదని గట్టిగా నమ్ముతుందామె.

ముఖ్య విషయం అంటే....ఏం లేదు. మీరు మొన్న చెప్పారు కదా! మీది బెంగుళూరు అని, మీ తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చని పోయారని....మీ వెనుక కథ అది కాదని నా నమ్మకం. మీరు దాస్తున్నా రని నా అనుమానం నాకు తెలిసిన నిజాలు కొన్ని ఉన్నాయి. అవి మీకు చెప్పాలనుకుంటున్నాను."

ఆమె వదనం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది.

"నేను అనే మాటల్లో మీరు ఏవో తప్పు అర్థాలు తీసుకుంటున్న ట్లున్నారు నిజానికి మనం మాట్లాడబోయేది చాలా ముఖ్యమైన విషయం. నిజం చెప్పాలంటే....నేను బొంబాయి నుంచి...." ఇంకా ఏదో అనబో తున్నాడు.

"మనం వెళదాం....బోట్ వెనక్కి తిప్పండి" సీరియస్‌గా అంది.

"నాకు తలనొప్పిగా వుంది. దయచేసి వెళదాం బోటు వెనక్కి తిప్పండి" మళ్ళీ అవి తలతిప్పుకుంది ఆమె,

మాట్లాడకుండా బోట్ వెనక్కి తిప్పాడు సాయిగౌతమ్.

ఇంక వారి మధ్య మాటలు లేవు.

ఇద్దరూ వెనక్కి వచ్చారు.

"మనం వెళదాం... నాకు కొంచెం పని వుంది" ముక్తసరిగా అంది ఆమె.

ఆమెకు ఆ సంభాషణ ఇష్టం లేదు....అన్న నిజాన్ని ఖచ్చితంగా దాచిపెడుతోందని సాయిగౌతమ్‌కి అర్థమయిపోయింది.

ఈమె దగ్గర నిజాలు రాబట్టడానికి మరేదయినా పద్ధతి అవలంభించాలని నిర్ణయించుకున్నాడు.

ఆమె తన కారులో కూర్చుంది.

"సారీ— మీ మూడ్ పాడు చేశాను ఇప్పుడూ ఇలా జోక్ చేయను. మీ ఇంటికి రేపు వచ్చేది కూడా కేవలం మీతో పరిచయం పెంచుకోవడానికే అంతేకాని మరే రహస్యాలూ, ముఖ్య విషయాలూలేవు" సంజాయిషీగా అన్నాడు సాయిగౌతమ్.

"వస్తాను" పెదవుల మీద బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొని అంది శుభాంగి.

మరో నిముషానికి ఆమె కారు అదృశ్యం అయింది.

o o o

అలసటగా బెడ్‌మీద వాలిపోయింది శుభాంగి. అస్తవ్యస్తంగా ఉంది ఆమె మనస్సు.

జరుగుతున్న సంఘటనలు ఎందుకో ఆమెకు ఇష్టంగా లేవు.

మితంగా మాట్లాడడం ఆమెకు ఇష్టం.

మగవాళ్ళతో చాలా తక్కువగా మాట్లాడుతుంది.

కానీ....సాయిగౌతమ్‌తో....అందుకు భిన్నంగా జరుగుతోంది.

కొన్ని గంటలు ఒక మగవాడితో అలా మాట్లాడడం—మొదటిసారి. తెలియకుండా అతనిపట్ల ఆకర్షితురాలు అవుతోంది.



అతను మాట్లాడుతోంటే ఎంతసేపైనా వినాలని అనిపిస్తోంది.

కానీ....అంతలోనే అతని మాటల్ని భరించలేకపోతోంది.

సాయిగౌతమ్ ఏమి మాట్లాడడం ప్రారంభించినా, చివరికి తన గత జీవితం గురించే అడుగుతున్నాడు.

తన గురించి వివరాలు అన్నీ చెప్పింది. తన ఊరేమిటో, పేరేమిటో తల్లి దండ్రులెవరో....అన్నీ వివరంగా చెప్పింది.

బహుశా ఇంతవరకు ఎవరితోనూ తన వ్యక్తిగత విషయాలు అంత వివరంగా చెప్పివుండకపోవచ్చు.

అంతా విన్నాక "మీరు ఏదో నిజం దాస్తున్నారు" అన్నాడు.

ఆ మాట అతని నోటి నుండి వెలువడ్డాక తిరిగి అతని ముఖం చూడాలంటేనే విముఖత కలుగుతోంది. తన మాటమీద నమ్మకం లేని వ్యక్తితో పరిచయం పెంచుకోవడం అనవసరం అనుకుంది.

అయితే .. ఏదో ఆకర్షణ అతనివైపు లాగుతోంది.

ఆలోచనలతో సతమతమవుతున్న ఆమె మెదడు మెల్లగా ఆమె నిద్రలోకి జారిపోవడంతో విశ్రాంతి తీసుకుంది.

o o o

రివ్వుమని వీచింది చల్లనిగాలి.

ఆ గాలి అక్కడి చెట్ల ఆకుల మధ్యలోంచి వీచినప్పుడు, సన్నని హోరులాంటి శబ్దం వచ్చింది.

గాలి తాకిడికి తెరుచుకున్నాయి ఆ గది కిటికీలకి వున్న గ్లాసు డోర్స్.

తెరుచుకున్న గ్లాసు డోర్స్‌లోంచి బలంగా ప్రవేశించిన ఆ గాలికి ఆ గదిలోని కర్టెన్స్ కదిలాయి.

చల్లగా శరీరానికి తాకిన ఆ గాలికి కళ్ళు తెరిచి కిటికీవైపు చూసింది ఆమె.

చిక్కటి చీకటి,

ఆ చీకటిలో కదులుతోంది ఏదో ఆకారం.

ఆ ఆకారం కిటికీవైపే వస్తోంది.

కిటికీని సమీపించగానే ఆ ఆకారం స్పష్టమయింది.

అదొక పురుషుడి ఆకారం.

గాలిలో తేలుతూ .... కిటికీ గుండా లోపలికి ప్రవేశించాడు.

గుండె ఝల్లుమంది ఆమెకు.

తనవైపే నెమ్మదిగా నడుచుకుంటూ వస్తున్న ఆకారాన్ని చూడగానే భయంతో. ఆమెశరీరం చల్లబడిపోయింది.

వెన్నులోంచి సన్నని జలదరింపు క్షణాల్లో శరీరం మొత్తం పాకింది.

మెదడులో నరాలు చిట్లిపోతున్నంత టెన్షన్....

అతను ఆమె వైపే వస్తున్నాడు....

నెమ్మదిగా ఆమెను సమీపించాడు.

ఆమె అచేతనంగా వుండిపోయింది, ఒక్క ఉదుటన పైకిలేద్దామని ప్రయత్నించింది కానీ శరీరం ఏ మాత్రం సహకరించడంలేదు. శరీరంలో ప్రతి అవయవం భయంతో బిగుసుకుపోయిన ఫీలింగ్.

నిస్సహాయంగా మంచానికి బల్లిలా కరుచుకుపోయింది.

అప్పుడు నవ్వాడతను చాలా వికృతంగా.

ఆమె దగ్గరకు....మరింత దగ్గరకు చేరుకున్నాడు.

చిన్న వెలుగు రేఖ అతని ముఖంపై పడింది.

ఆ వ్యక్తి నల్లగా, పొడవుగా వున్నాడు. కండలు తిరిగిన బలమైన శరీరం. వెడల్పయిన ముఖం, లోపలికి పోయిన బుగ్గలు, లావుగా వున్న పెదవులు....వికృతంగా బయటకు పొడుచుకు వచ్చినట్లు కనుగుడ్లు... నల్లటి శరీరం.

కెవ్వున కేకపెట్టి ఒక వుదుటన లేద్దామనుకున్న ఆమె ప్రయత్నం మరోసారి దెబ్బతింది.

భయంతో ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది....ఆ భయానికి ఆమె శ్వాస బలంగా తీసుకొంటోంది

ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు లయబద్ధంగా కదులుతున్న ఆమె ఛాతీమీద నిలిచాయి అతని చూపులు.



అతని పెదవుల మీద ఏ శబ్దమూ లేని అసహ్యమైన నవ్వు కదిలింది.

వెడల్పుగా వున్న పళ్ళు వికృతంగా కనిపిస్తున్నాయి.

ఆ నవ్వుకి ఆమె శరీరం జుగుప్సతో జలదరించింది.

శరీరంలోని సున్నిత భాగాల్ని అబగా తాకినపుడు, కర్కశమైన అతని చేతికింద ఆమె శరీరం నలిగిపోతున్నప్పుడు అతికష్టం మీద బాధను పంటి చివర బిగించి పట్టుకుందామె.

అప్పుడు చూసిందామె.

అతనికి ఎడమచేయి మాత్రమే ఉంది. కుడిచేయి భుజం వరకు తెగిపోయి వుంది.

ఆమె అరిచింది కానీ గొంతు దాటి ఆ అరుపు రాలేదు.

అతనిని దూరంగా తోసి పారేయాలనుకుంది. కానీ ఆమె చేతులు కదలడం లేదు,

ఏదో అదృశ్య శక్తి ఆమెను అచేతనంగా చేస్తోంది.

అతను ఒంటి చేత్తోనే రాక్షసత్వానికి సిద్ద పడ్డాడు. లేలేత మామిడి చిగురులా వున్న ఆమె నడుం మీది చీరను పక్కకు తప్పించాడు.

తెల్లని ఆ నడుము, ఆయాసంతో ఎగిసిపడుతున్న ఎత్తులు, సుడి గుండంలా బొడ్డు....

అతనిలో వెంటనే కసి పెరిగింది.

బరువైన ఆమె ఎదమీద బలంగా చేతిని వేశాడు. సుకుమారమైన ఆమె శరీరం అతని చేతిలో పువ్వులా నలిగిపోసాగింది.

అతనిచేయి నడుము మీద నుంచి క్రిందకి దిగింది.

అతనిలో ఉత్సాహం, కసి రెట్టింపయింది. మొరటుగావున్న అతని చేయి మరింత రాక్షసంగా కదిలింది. ఆమెలో నరకవేదన మొదలయింది.

అతని చూపు నెమ్మదిగా ఆమె పెదవులపై నిలిచింది.

ఆమె క్రింది పెదవిని పట్టుకున్నాడు ఎడమచేత్తో.

ముఖాన్ని ఆమె ముఖానికి దగ్గరగా తెచ్చి....గుసగుస లాడినట్లు

అన్నాడు "ఇంక ఇరవై రోజులే" అని. అదే సమయంలో బలంగా అది మిన అతని చేతి వేళ్ళ మధ్య ఆమె పెదవి నలిగిపోయింది.

ఆమె గిలగిలలాడింది.

బలంగా ఒక్కసారి ఆమె పెదవిని అదిమాడు అతను.

ఫట్....మని చిట్లి రక్తం ఫౌంటెన్‌లా చిమ్మింది.

అంతే....కెవ్వుమన్న ఆర్తనాదం ఆమె నోటి నుంచి వెలువడింది.

* * *

కెవ్వున అరిచి అదిరిపడి లేచి కూర్చుంది శుభాంగి.

ఆమెకు మెలుకువ వచ్చేసింది.

అక్కడితో ఆ కల కరిగిపోయింది.

స్వేదంతో ఆమె శరీరం ముద్దయి పోయింది. ఆమె హృదయ స్పందన ఆమెకే గట్టిగా వినిపిస్తోంది.

బెడ్‌లైట్ వెలుతురులో వాల్‌క్లాక్‌లో టైమ్ రెండూపది చూపు తోంది.

బెడ్‌పై నుండి లేచి కిటికీ దగ్గరకు నడిచిందామె.

స్ట్రీట్‌లైట్స్ వెలుగులో నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వుందా రోడ్డు.

అప్పటికాకల రెండు మూడు వేల సార్లు వచ్చి వుండవచ్చు.

ఆ కల ఎప్పుడు వచ్చినా అదేవ్యక్తి, అదే సంఘటన, అదే కల. అయితే అతను చెప్పే మాటలోనే మార్పు.

ఆమెకు బాగా గుర్తుంది.

మొదటిసారి ఆ కల వచ్చినప్పుడు అతను "ఇంక రెండు సంవత్స రాలు మాత్రమే" అన్నాడు.

మళ్ళీ కల వచ్చిన ప్రతిసారీ ఆ సమయం ఒక రోజు చొప్పున తగ్గుతోంది.

ఈ రోజు కలలో "ఇరవై రోజులు మాత్రమే" అన్నాడు అంటే ....ఇరవై రోజుల తరువాత ఏం జరగబోతోంది?



నిజంగానే ఏదయినా జరగబోతుందా? ఆ జరగబోయేది మంచా.... చెడా! అన్న ఆమె ప్రశ్నలకు సమాధానం దొరకడంలేదు.

o o o

సిగరెట్ చివరి పఫ్‌లాగి క్రిందపడ వేశాడు సాయిగౌతమ్. వాచీ వంక చూసుకున్నాడు. సమయం పదకొండు కావస్తోంది.

శుభాంగి ఇంటికి వంద గజాల అవతల ఆటో దిగి, కాసేపు సిగ రెట్ కాల్చి టైము పదకొండు అవడంతో ఆమె ఇంటి వైపు అడుగులు వేశాడు.

నాలుగు అడుగులు వేసి తను ధరించినజర్కిన్ కోట్ జేబులో కుడి చేయి పెట్టుకున్నాడు.

చల్లగా తగిలింది రివాల్వర్.

ఆమె ఇంటికి మొదటిసారి వెళ్ళడంవల్ల ...జేబులో రివాల్వర్ వుం డడం మంచిది అనిపించింది ఎందుకో.

అందుకే ఆరు బుల్లెట్లు లోడ్ చేసి తెచ్చాడు.

జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి ఆమె ఇంటి నెంబరుతో ఒకసారి సరి పోల్చుకున్నాడు.

అదొక చిన్న బంగళా, ఆ ఇంటి ముందు లాన్ వుంది. ఇంటి చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ....పెద్ద గేటు వున్నాయి. గేటు దగ్గర స్టూల్ మీద కూర్చుని వున్నాడు వాచ్‌మెన్.

గేటుని సమీపించాడు సాయిగౌతమ్.

ఎవరు కావాలన్నట్టు చూశాడు వాచ్‌మెన్

"మిస్ శుభాంగి....ఇల్లు....ఇదేనా" కన్‌ఫర్మేషన్ కోసం అడిగాడు

అవునన్నట్టు తల ఊపాడు అతను.

"ఆమెను కలవాలి"

"మీరెవరు?"

"నా పేరు సాయిగౌతమ్. నేను శుభాంగి గారి ఫ్రెండ్‌ని" అని చెప్పి లోపలికి పోబోయాడు.

5 )

ఓసారి ఎగాదిగా గౌతమ్‌ని చూశాడు వాచ్‌మెన్.

"సారీ సార్....అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదు. ఇప్పుడు కలవ డానికి వీలు లేదు."

"నేను కలవచ్చులేవోయ్" చొరవగా ముందుకు రాబోయాడు.

"వీలు లేదు సార్....అమ్మగారే చెప్పారు ఎవరినీ లోపలికి పంప వద్దని"

ఒళ్ళు మండిపోయింది సాయి గౌతమ్‌కి.

"ఏం....మర్యాద వుండక్కర్లేదా....ఈ రోజు నాకు మీ అమ్మ గారు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. చాలా ముఖ్యమైన విషయాలు చర్చిం చాలి. ఒక పని చెయ్యి. లోపలికి వెళ్ళి సాయిగౌతమ్‌గారు వచ్చారు అని చెప్పు, అప్పుడు ఆమె నీకు చెబుతుంది. ఇదిగో మీ అమ్మగారు ఇచ్చిన విజిటింగ్ కార్డు కూడా" అంటూ విజిటింగ్ కార్డు అంటూ చేతికి ఇచ్చాడు.

"ఒక్క నిముషం ఇక్కడే వుండండి" అని గేటు పక్కన వున్న చిన్న రూమ్‌లోని ఇంటర్‌కమ్ లిఫ్ట్ చేశాడు.

"ఎవరో సాయిగౌతమ్ అట....మీ ఫ్రెండ్ అంటున్నాడు. మీరు అపాయింట్‌మెంట్ ఇచ్చారట. లోపలికి రావాలంటున్నారు. పంపించమం టారా?" అడిగాడు.

వాచ్‌మెన్ అడగడం సాయిగౌతమ్‌కు స్పష్టంగా వినిపించింది. ఆమె ఏదో సమాధానం చెప్పింది.

"అలాగే మేడమ్....సరే ....మేడమ్" వినయంగా చెప్పి ఫోన్ పెట్టాడు వాచ్‌మన్.

"అర్థమయిందా!....ఇందాకటి నుంచి చెబితే వినిపించుకోలేదు." ఇంకా ఏదో అనబోయాడు సాయిగౌతమ్.

"ఏమిటయ్యా అర్థం అయ్యేది? సాయిగౌతమ్ ఎవడో నాకు తెలి యదు పొమ్మంది మా మేడం....రోడ్డుమీద దొరికిన విజిటింగ్ కార్డు తీసు కుని ఇంట్లో దూరదామని చూశావా! చూడటానికి పెద్ద మనిషిలా వున్నావు పో. పో....బయటికి"దాదాపుగా మెడపట్టి బయటికి గెంటినంతపని చేశాడు వాచ్‌మన్.



తల తిరిగిపోయింది సాయిగౌతమ్‌కి.

♦ ♦ ♦

ఇది కలా, నిజమా!

ఓ క్షణం అయోమయంలో పడ్డాడు సాయిగౌతమ్.

ఊహించని పరిణామం అది.

తల దించుకుని ముందుకు అడుగులు వేస్తున్న అతని ప్రక్కన ఏదో ఆగడంతో తల ఎత్తి చూశాడు.

గ్రే కలర్ ఫియెట్ కారు అది.

డ్రైవింగ్ సీట్లో కూర్చుని వుంది ఓ అమ్మాయి సాయిగౌతమ్‌ని చూసి పలకరింపుగా నవ్వింది.

ఆమె ఎవరో ఓ క్షణం గుర్తుకురాలేదు అతనికి. అతను సాధార ణంగా ఎవరినైనా ఒక్కసారి చూస్తే మరచిపోడు. ఆమెను ఎక్కడ చూసింది గుర్తుకు తెచ్చుకోసాగాడు.

అదే క్షణం ఆమె కళ్ళకు అడ్డంగా వున్న గాగుల్స్ తొలగించింది.

అప్పుడు గుర్తుపట్టాడు. ఆమె... శుభాంగి స్నేహితురాలు సుప్రియ,

"గుర్తుపట్టారా?" అనుమానంగా చూస్తున్న సాయిగౌతమ్‌తో అంది ఆమె.

"ఆ .. ఆ....మీరు సుప్రియ" పొడిగా అన్నాడు.

"ఏమిటి?"....శుభాంగితో మాట్లాడి వస్తున్నారా?" డోరు తీసుకుని దిగుతూ అంది.

ఆమెకు ఏం చెప్పాలో అర్థంకాక ఒకింత సంశయించాడు.

అదే సమయంలో వాళ్ళని సమీపించాడు వాచ్‌మన్.

"మేడమ్....మీకు ఈ వ్యక్తి తెలుసా?" అడిగాడు సాయిగౌతమ్‌ని చూపిస్తూ.

సాయిగౌతమ్‌ని గురించి వాచ్‌మన్ తనని ఎందుకు ప్రశ్నించాడో అర్థంకాలేదు సుప్రియకి.

"తెలుసు. అయినా ఎందుకు అలా అడుగుతున్నావ్?" ఎదురు ప్రశ్నించింది.

"మరి....శుభాంగి మేడమ్‌కి కూడా తెలుసా?" మళ్ళీ అడిగాడు.

కొంచెం చిరాకుగా అనిపించిందామెకు.

"పిచ్చి ప్రశ్నలు వేయకు. శుభాంగి ద్వారానే నాకు ఈయన పరిచయం అయ్యారు. అయినా నీ కెందుకు ఈ విషయాలన్నీ" కటువుగా వుంది ఆమె స్వరం.

అయోమయంగా చూశాడు అతను.

"మరి....అదేమిటి? సాయిగౌతమ్ ఎవరో తెలియదు అని నాకు చెప్పారు" అంటూ జరిగిన విషయం వివరించాడు వాచ్‌మన్.

అక్కడ నిలబడడం చాలా ఇబ్బందిగా వుంది సాయిగౌతమ్‌కి.

"నువ్వు వెళ్ళు" అంది వాచ్‌మన్‌తో సుప్రియ. అతడు వెళ్ళి గేటు దగ్గర నిలబడ్డాడు.

"మీరు శుభాంగితో ఏదయినా ముఖ్య విషయం మాట్లాడాలా?"

"ఎస్. ఆమెతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని ఈ రోజు వచ్చాను. నిజానికి ఈ రోజు రమ్మని ఆమే నన్ను ఆహ్వానించింది. కానీ ....ఈ రోజు ఈవిధంగా అవమానించడం.... నేను ఊహించలేకపోయాను" అతను సంశయిస్తూనే విషయం చెప్పాడు.

"నా స్నేహితురాలి తరపున నేను మీకు క్షమాపణ చెబుతున్నాను దయచేసి మర్చిపొండి. మీ గురించి శుభాంగి నా దగ్గర ప్రస్తావించింది.. నాకు తెలిసినంత వరకు మీరు ఆమెకు ఇటీవలే పరిచయం అయ్యారు. ఆమెతో మాట్లాడాలని, పరిచయం పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అవునా?" సూటిగా అడిగింది.

అవునన్నట్టు తల ఊపాడు సాయిగౌతమ్.

"మీరు ఆమెను ప్రేమించే ఉద్దేశ్యంలో వుంటే మాత్రం ఆ ఆలోచన మానుకోండి. ఆమె క్లోజ్ ఫ్రెండ్‌గా, ఆమె మనస్తత్వం తెలుసున్న వ్యక్తిగా మీకు సలహా ఇస్తున్నాను."

ఆమె అంత ఫ్రీగా.... స్ట్రెయిట్‌గా మాట్లాడేసరికి సమాధానం వెంటనే చెప్పలేకపోయాడు.

"మీరు పొరపాటు పడుతున్నారు. మీరు కొంత సమయం స్పేర్



చేయగలిగితే మీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను."

అతని మాటలు ఆమెలో ఆసక్తిని రేకెత్తించాయి.

"తప్పకుండా వింటాను. రండి కారులో కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ డ్రైవింగ్ సీట్లో కూర్చుందామె.

కారుకి అటు తిరిగి వచ్చి ఆమె పక్క సీట్లో కూర్చున్నాడు సాయి గౌతమ్.

కారు స్టార్ట్ చేసి ఆ వీధి చివర వున్న ఒక పెద్ద వేప చెట్టు క్రింద నీడలో ఆపి "ఇప్పుడు చెప్పండి మీరేం చెప్పాలనుకుంటున్నారో" అంది ఆమె. ఎందుకో సాయిగౌతమ్ అంటే మొదటి నుంచి ఓ మంచి ఇంప్రెషన్ కలిగిందామెలో. అందువల్లే అంతసేపు మాట్లాడగలుగుతోంది.

జేబులోంచి సిగరెట్ ప్యాక్ తీసి...."స్మోక్ చేయవచ్చా" అడిగాడు సభ్యత కోసం.

"తప్పకుండా" చెప్పింది ఆమె.

లైటర్‌తో సిగరెట్ వెలిగించి పఫ్ లాగి వదిలాడు.

"నేను మీకు ఆ విషయం చెప్పే ముందు మిమ్మల్ని ఓ ప్రశ్న అడగాలనుకుంటున్నాను" ఆమెను చూస్తూ అన్నాడు.

"అడగండి"

"శుభాంగి మీకు ఎన్ని సంవత్సరాలుగా తెలుసు?"

"సుమారు ఎనిమిది సంవత్సరాల నుంచి"

"ఆమెది ఈ ఊరేనా?"

"కాదు....బెంగుళూరు"

"ఆమె తల్లి దండ్రులు ఎవరు? ఆమె గురించి తెలిసింది చెబుతారా! ఇప్పుడు మీరు నాకు చెప్పాల్సిన అవసరం కూడా లేదు. కానీ ఓ ఫ్రెండ్‌గా నన్ను మీరు భావిస్తే, ఆ ఫ్రెండ్‌షిప్‌ని మిస్‌యూజ్ చేయనని అనిపిస్తే నాకు మీ నుంచి వివరాలు కావాలి" అడిగాడు సాయి గౌతమ్.

ఆమె ఏమనుకుందో ఏమో తెలియదు గాని సమాధానంగా అతడడిగిన వివరాలు చెప్పసాగింది.

"ఆమె తల్లిదండ్రులను నేను చూడలేదు. కారణం వాళ్ళు కారు

యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఆ తరువాత ఆమెను ఆమె మేనమామ ఇక్కడికి తెచ్చి కాలేజీలో చేర్పించాడు. కాలేజీలో మేమిద్దరం క్లాస్‌మేట్స్. వాళ్ళ మేనమామ కూడా కాన్సర్ రోగంతో చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే వుంటోంది. అయినా ఇంతవరకు మీ గురించిన వివరాలు నాకు ఏమీచెప్పకుండా ఇలా నా ఫ్రెండ్ గురించిన వివరాలు అడగటం సభ్యత కాదు" నిర్మొహమాటంగా అంది.

"అయాం వెరీ సారీ....సుప్రియా....నాకా ధ్యాసలేదు. అందుకే చెప్పలేదు. ఇప్పుడు చెబుతున్నాను. నేను ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ని."

చిత్రంగా ఎగాదిగా చూసింది సాయిగౌతమ్‌ని సుప్రియ.

"ప్రైవేట్ డిటెక్టివ్.... ఇండియాలో వున్నారా?" ఒకింత ఆశ్చర్యంగా అడిగింది.

"వై నాట్... ఎన్నో ఏజెన్సీలున్నాయి. సుమారు ఇరవై ఏళ్ళ క్రిందట మా ఫాదర్ బొంబాయిలో డిటెక్టివ్ ఏజెన్సీస్టార్ట్ చేశారు. ఆయనకి ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది, దాని బాధ్యత నేను తీసుకున్నాను. నేను స్కాట్‌లాండ్ యార్డ్ పోలీస్ ఎకాడమీలో ట్రైనింగ్ అయ్యాను. మార్షల్ ఆర్ట్స్‌లో బ్లాక్‌బెల్టు వుంది. సుమారు రెండువందల మంది మా ఏజెన్సీలో పని చేస్తున్నారు. పనిని బట్టి, అవసరాన్ని బట్టి ఎంతమందినైనా హైర్ చేసుకుంటాం. ఇవి నా గురించిన వివరాలు. ఇప్పుడు అసలు విషయానికి వస్తే నాలుగురోజుల క్రిందట నేను ఒక కేసు ఇన్‌వేస్టిగేషన్ కోసం ఈ ఊరు వచ్చాను. అనుకోకుండా శుభాంగిని చూశాను" చెప్పటం ఆపి సిగరెట్ చివరి పఫ్‌లాగి బయటికి విసిరికొట్టాడు.

"కొంపతీసి మా శుభాంగి ఎవరినైనా మర్డర్ చేసిందా?" జోక్ చేసింది సుప్రియ.

తనూ నవ్వాడు.

"ఇప్పుడు మీకు అసలు విషయం చెబుతాను"

స్టీరింగ్‌మీద రెండు చేతులు ఆన్చి అతని వైపుకి తిరిగి అతను చెప్పబోయేది వినడానికి ఎలర్ట్ అయింది ఆమె.

"ఈ శుభాంగి అసలు పేరు మౌనిక" అతని మాటల్లోనే కాదు



చూపుల్లో కూడా షార్ప్‌నెస్ వుంది.

అర్ధం కానట్టు చూసింది సుప్రియ.

"మీకు విషయం అర్ధమయ్యేలా చెబుతాను. జైసింగ్ షకావత్ అనే పేరు విన్నారా?"

ఆమె ఓ క్షణం ఆలోచనలో పడింది.

"ఎవరూ.... సెంట్రల్ కేబినెట్ మినిస్టరా?"

"అవును .... ఆయనే"

"ఆయనకీ శుభాంగికీ గల సంబంధం ఏమిటి?"

"అదే చెబుతున్నాను షకావత్‌కి ఒకే ఒక కూతురుండేది ఆమె పేరు మౌనిక. ఆమె ఒక రోజు రాత్రికి రాత్రి మిస్టీరియస్‌గా అదృశ్యం అయింది, పోలీసులు ఆమె కోసం గాలించారు. దొరకలేదు. ఆమె అదృశ్యమైన పదిహేడు నెలలకి షకావత్ మా డిటెక్టివ్ ఏజన్సీని అప్రోచ్ అయ్యారు.

అప్పట్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి మీద కొందరు టెర్రరిస్టులు హత్యాప్రయత్నం చేయబోయారు దానిని పోలీస్ డిపార్ట్‌మెంట్ కనుక్కోలేకపోయింది. కానీ మాకు తెలిసింది. మేము చివరి నిముషంలో అడ్డుపడి ముఖ్యమంత్రి ప్రాణం కాపాడగలిగాము. ఆ సంఘటనతో మా ఏజన్సీకి మంచి పేరు వచ్చింది.

"అదృశ్యమైన మౌనికను వెతికి పట్టుకోవటంలో పోలీస్ డిపార్టుమెంట్ విఫలం కావడంతో ఆ సమయంలో మా మీద నమ్మకముంచి ఆయన మమ్మల్ని ఆశ్రయించారు. మేము ఆ కేసు టేకప్ చేశాము కొన్ని వందల మంది మనుషుల్ని అపాయింట్ చేశాము. లక్షల్లో ఖర్చు అయింది. మేము కూడా ఆమె ఆచూకీ కనిపెట్టడంలో ఘోరంగా ఫెయిల్ అయ్యాము. అది మా మొదటి ఫెయిల్యూర్. మేము కూడా కేసని వదిలేశాము.

"శుభాంగిలో మౌనిక పోలికలు చాలా వున్నాయి. ఆ మౌనికయే ఈ శుభాంగి అని నా అనుమానం. అనుమానమే కాదు. నిస్సందేహముగా ఈమే మౌనిక!" చెప్పడం ముగించాడు సాయిగౌతమ్.

ఊపిరి పీల్చడం మర్చిపోయి వింటోంది ఆమె.

"మీ తల్లిదండ్రులేరి అంటే యాక్సిడెంట్‌లో చనిపోయారంటోంది

యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఆ తరువాత ఆమెను ఆమె మేనమామ ఇక్కడికి తెచ్చి కాలేజీలో చేర్పించాడు. కాలేజీలో మేమిద్దరం క్లాస్‌మేట్స్. వాళ్ళ మేనమామ కూడా కాన్సర్ రోగంతో చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే వుంటోంది. అయినా ఇంతవరకు మీ గురించిన వివరాలు నాకు ఏమీ చెప్పకుండా ఇలా నా ఫ్రెండ్ గురించిన వివరాలు అడగటం సభ్యత కాదు" నిర్మొహమాటంగా అంది.

"అయాం వెరీ సారీ....సుప్రియా....నాకా ధ్యాసలేదు. అందుకే చెప్పలేదు. ఇప్పుడు చెబుతున్నాను. నేను ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ని."

చిత్రంగా ఎగాదిగా చూసింది సాయిగౌతమ్‌ని సుప్రియ.

"ప్రైవేట్ డిటెక్టివ్.... ఇండియాలో వున్నారా?" ఒకింత ఆశ్చర్యంగా అడిగింది.

"వై నాట్... ఎన్నో ఏజెన్సీలున్నాయి. సుమారు ఇరవై ఏళ్ళ క్రిందట మా ఫాదర్ బొంబాయిలో డిటెక్టివ్ ఏజెన్సీ స్టార్ట్ చేశారు. ఆయనకి ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది, దాని బాధ్యత నేను తీసుకున్నాను. నేను స్కాట్‌లాండ్ యార్డ్ పోలీస్ ఎకాడమీలో ట్రైనింగ్ అయ్యాను. మార్షల్ ఆర్ట్స్‌లో బ్లాక్‌బెల్టు వుంది. సుమారు రెండువందల మంది మా ఏజెన్సీలో పని చేస్తున్నారు. పనిని బట్టి, అవసరాన్ని బట్టి ఎంతమందినైనా హైర్ చేసుకుంటాం. ఇవి నా గురించిన వివరాలు. ఇప్పుడు అసలు విషయానికి వస్తే నాలుగురోజుల క్రిందట నేను ఒక కేసు ఇన్వెస్టిగేషన్ కోసం ఈ ఊరు వచ్చాను. అనుకోకుండా శుభాంగిని చూశాను" చెప్పటం ఆపి సిగరెట్ చివరి పఫ్‌లాగి బయటికి విసిరికొట్టాడు.

"కొంపతీసి మా శుభాంగి ఎవరినైనా మర్డర్ చేసిందా?" జోక్ చేసింది సుప్రియ.

తనూ నవ్వాడు.

"ఇప్పుడు మీకు అసలు విషయం చెబుతాను"

స్టీరింగ్‌మీద రెండు చేతులు ఆన్చి అతని వైపుకి తిరిగి అతను చెప్పబోయేది వినడానికి ఎలర్ట్ అయింది ఆమె.

"ఈ శుభాంగి అసలు పేరు మౌనిక" అతని మాటల్లోనే కాదు



చూపుల్లో కూడా షార్ప్‌నెస్ వుంది.

అర్థం కానట్టు చూసింది సుప్రియ.

"మీకు విషయం అర్థమయ్యేలా చెబుతాను. జైసింగ్ షకావత్ అనే పేరు విన్నారా?"

ఆమె ఓ క్షణం ఆలోచనలో పడింది.

"ఎవరూ.... సెంట్రల్ కేబినెట్ మినిస్టరా?"

"అవును .... ఆయనే"

"ఆయనకీ శుభాంగికీ గల సంబంధం ఏమిటి?"

"అదే చెబుతున్నాను షకావత్‌కి ఒకే ఒక కూతురుండేది ఆమె పేరు మౌనిక. ఆమె ఒక రోజు రాత్రికి రాత్రి మిస్టీరియస్‌గా అదృశ్యం అయింది, పోలీసులు ఆమె కోసం గాలించారు. దొరకలేదు. ఆమె అదృశ్యమైన పదిహేడు నెలలకి షకావత్ మా డిటెక్టివ్ ఏజన్సీని అప్రోచ్ అయ్యారు.

అప్పట్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి మీద కొందరు టెర్రరిస్టులు హత్యాప్రయత్నం చేయబోయారు దానిని పోలీస్ డిపార్ట్‌మెంట్ కనుక్కోలేకపోయింది. కానీ మాకు తెలిసింది. మేము చివరి నిముషంలో అడ్డుపడి ముఖ్యమంత్రి ప్రాణం కాపాడగలిగాము. ఆ సంఘటనతో మా ఏజన్సీకి మంచి పేరు వచ్చింది.

"అదృశ్యమైన మౌనికను వెతికి పట్టుకోవటంలో పోలీస్ డిపార్టుమెంట్ విఫలం కావడంతో ఆ సమయంలో మా మీద నమ్మకముంచి ఆయన మమ్మల్ని ఆశ్రయించారు. మేము ఆ కేసు టేకప్ చేశాము కొన్ని వందల మంది మనుషుల్ని అపాయింట్ చేశాము. లక్షల్లో ఖర్చు అయింది. మేము కూడా ఆమె ఆచూకీ కనిపెట్టడంలో ఘోరంగా ఫెయిల్ అయ్యాము. అది మా మొదటి ఫెయిల్యూర్. మేము కూడా కేస్‌ని వదిలేశాము.

"శుభాంగితో మౌనిక పోలికలు చాలా వున్నాయి. ఆ మౌనికయే ఈ శుభాంగి అని నా అనుమానం. అనుమానమే కాదు. నిస్సందేహముగా ఈమే మౌనిక!" చెప్పడం ముగించాడు సాయిగౌతమ్.

ఊపిరి పీల్చడం మర్చిపోయి వింటోంది ఆమె.

"మీ తల్లిదండ్రులేరి అంటే యాక్సిడెంట్‌లో చనిపోయారంటోంది

బంధువులు ఎవరూ లేరంటోంది. అందుకే నా అనుమానం మరింత బల పడుతోంది''

"మీరు చెప్పేది నిజమా ? మౌనిక ఫోటో ఏదయినా మీ దగ్గర వుందా?''

ఊహించని వివరాలు విని ఆమెలో టెన్షన్ క్రియేటయింది.

ఉత్కంఠతో ఆమె నరాలు తెగిపోతున్నట్లయింది.

"ఇక్కడ లేవు. బొంబాయిలో వున్నాయి. మా మనిషి ఒకతను రెండు రోజుల్లో అవి తెస్తాడు అప్పుడు చూసి మీరే ఒప్పుకుంటారు''

"కానీ నాదొక సందేహం శుభాంగి ఏమీ అజ్ఞాతవాసం చేయటం లేదు కదా! ఆమె అందరి ఎదురుగా తిరుగుతూనే వుంది. అంతేకాదు, ఎంతో మంది పోలీసులు కూడా ఆమెను ఇంతవరకు చూసి వుంటారు వాళ్ళెవరికీ రాని అనుమానం మీకే ఎందుకొస్తోంది. ఆమె తన తండ్రిని ఎందుకు కలవడంలేదు? కిడ్నాప్ అయి వుంటేనే కదా ఎవర్ని కలవ లేకుండా వుండేది''

"మీ ప్రశ్నకి ఖచ్చితమైన జవాబు చెప్పడం కొంచెం కష్టం. మీరన్నట్లు ఇక్కడ పోలీసులు కూడా ఆమె ఫోటో చూసివుండవచ్చు. కానీ ఒక ఫోటో చూసి, ఆ ఫోటోలోని వ్యక్తిని బయటవున్న ఇన్ని లక్షల జనాభాలో చూసి గుర్తుపట్టటం కష్టం. అందుకే ఆమెను పోలీసులు ఎవరూ పట్టుకొని ఉండకపోవచ్చు. ఇక్కడ మరో విషయం చెప్పమంటారా .... "మా ఫ్రెండ్ రాసిన పెద్ద కథ ఒకటి ఆరు వారాలపాటు ఓ పత్రికలో ప్రచురితం అయింది ఆరు వారాలూ అతని కలర్ ఫోటోని ఆ పత్రిక ప్రచురించింది, ఫోటో పత్రికలో ప్రింటు అయ్యాక జనం చూసి తనని గుర్తుపట్టి ఎగబడతారనుకున్నాడు కానీ ఒక్కరూ గుర్తుపట్టిన పాపాన పోలేదు.''

పక్కుమని నవ్వెందా మాటకి ఆమె.

"మరి మీరు ఎలా గుర్తుపట్టారు మీకు కష్టం కాదా ?'' అడిగింది ఆమె.

"కానీ ఈ కేసు డీల్ చేసిన వాడిని నేను ఆమె ఫోటోలు వివిధ



భంగిమల్లో సుమారు నలభై వరకు నా దగ్గర వున్నాయి ఆ ఫోటోలు కొన్ని వందలసార్లు చూసి వున్నాను. అందుకే ఆమె రూపం నా కళ్ళలో రిజిస్టర్ అయిపోయింది. అందువల్ల ఈ విషయంలో పొరపాటు పడడం అసంభవం అనుకుంటున్నాను.''

ఒక నిమిషం పాటు ఆమె మౌనంగా వుంది తరువాత అంది "ఏమో....మీరు ఇంత చెప్పాక కూడా మీరు చెప్పిన విషయాన్ని నమ్మ లేకపోతున్నాను.''

"ఇట్సాల్‌రైట్ ఫోటోలు రాగానే చూపిస్తాను అంతేకాదు, ఆమె ఒంటిమీద పుట్టుమచ్చల వివరాలు, బ్లడ్‌గ్రూప్ లాంటి వివరాలు కూడా మా దగ్గర వున్నాయి ఇవన్నీ పోల్చి చూశాకనే మనం నిర్ధారణకు రావచ్చు''

"మీరు చెప్పింది బాగానే వుంది ఇప్పుడు నా ఫ్రెండ్ పేరు మార్చు కుంది, తన పుట్టుపూర్వోత్తరాల విషయంలో కూడా అబద్ధం చెబుతోంది అనుకుంటే... ఆమెను ఎవరూ కిడ్నాప్ చేయలేదు అని తనంతట తానుగా ఇంటి నుంచి పారిపోయి వచ్చిందేమోనని అనుమానం వస్తోంది'' అంది సుప్రియ ఒక కన్‌ఫ్యూజన్‌కి వస్తూ.

"ఈమె విషయం నాకేమీ అంతుపట్టటం లేదు, మీ స్నేహితురాలి గురించి మీరు కొన్ని వివరాలు ఏమయినా ఇవ్వగలిగితే ఈ కేస్‌ని సాల్వ్ చేయటం నాకు కొంత తేలిక అవుతుంది'' జుట్టులోకి వేళ్ళు పోనించి ముఖం మీదకి పడుతున్న జుట్టుని వెనక్కి తోసుకున్నాడు.

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

"ఇప్పుడు నాకు అర్థం కాని విషయం మరొకటి వుంది. శుభాంగి దగ్గర ఆమె గత జీవితానికి సంబంధించిన ప్రస్తావన రెండుసార్లు తీసుకు వచ్చాను. ఆ సందర్భం రాగానే ఆమె చాలా గంభీరంగా మారిపోయింది. నిన్న సాయంకాలం కూడా ఈ టాపిక్ రాగానే ఆమె మూడ్ మారి పోయింది. ఆ ప్రస్తావన ఆమెకు ఇష్టంలేదు అందుకే ఈ రోజు నాతో మాట్లాడటానికి ఇష్టపడలేదు దీనిని బట్టి ఆమె ఖచ్చితంగా ఏదో నిజం

దాచి పెడుతోందని అనుమానం వస్తోంది."

"నాకు తెలిసిన నిజాలు ఏమీ లేవు. ఆమె స్వయంగా చెబితే తప్ప మీరూ ఏమీచేయలేరు శుభాంగితో ఓ సమస్య కూడా వుంది. ఆమెది అదోక రకమైన మనస్తత్వం ఒక్కొక్క విషయానికి చాలా సీరియస్ అవుతుంది. రోజుల తరిబడి మూడీగా వుంటుంది కాబట్టి ఆమె నుంచి మీకు కావలసిన నిజాలు రాబట్టడం చాలా కష్టం"

నిశ్శబ్దంగా వింటున్నాడతను.

"ఏనీవే....ఆమె నుంచి నిజాలు రాబట్టడానికి నా ప్రయత్నం నేను చేస్తాను ఆ తర్వాత చూద్దాం....ఏం జరుగుతుందో" అంది.

"ఒకే ఇంక నేను వెళతాను" అంటూ కారులోంచి దిగబోయాడు.

"ఎక్కడికి వెళ్ళాలి మీరు?"

"బంజారా హోటల్‌కి"

"కూర్చోండి డ్రాప్ చేస్తాను"

"మీరు....శుభాంగిని కలవటానికి వచ్చారు కదా! మరి వెళ్ళరా?"

"ఇంక ఇప్పుడు వెళ్ళను ఇప్పుడు ఆమె డిప్రెస్డ్ మూడ్‌లో వుంటుంది నేను వెళ్ళినా కూడా నాతో సరిగా మాట్లాడదు అందుకే పదండి మిమ్మల్ని డ్రాప్‌చేసి నేను వెళ్ళిపోతా" అంటూ కారు స్టార్ట్‌చేసి ముందుకి దూకించింది ఆమె.

పది నిమిషాలు ప్రయాణించాక కారు బంజారా హోటల్ ముందు ఆగింది.

డోరు తీసుకుని క్రిందికి దిగి "థాంక్యూ సో మచ్ .... మళ్ళీ కలుద్దాం" అన్నాడు సాయిగౌతమ్.

అలాగే అన్నట్లు తల ఊపిందామె.

ఆమె కారు బయలుదేరింది.

o o o

లిఫ్ట్ డోర్స్ తెరుచుకున్నాయి.

లిఫ్ట్‌లోకి నడిచాడు సాయిగౌతమ్.

"ఏ ఫ్లోర్‌కి వెళ్ళాలి సార్" అడిగాడు లిఫ్ట్‌బోయ్.



"ఫిఫ్త్" చెప్పాడు.

డోర్స్ క్లోజ్ అయ్యాయి.

కొద్ది సెకన్ల తర్వాత ఐదో ఫ్లోర్‌లో ఆగింది లిఫ్ట్.

రూంలోకి వెళ్ళి డోరు క్లోజ్ చేశాడు.

తిన్నగా బెడ్‌మీద వాలిపోయాడు.

చాలా డల్‌గా వుంది అతనికి.

బెడ్‌పై వెల్లకిలా పడుకొని రూమ్ అంతా కలియచూశాడు నీట్‌గా సర్దివుంది.

అంటే....తను వెళ్ళిపోయాక రూమ్ అటెండెంట్ వచ్చి రూమ్ అంతా క్లీన్ చేయించాడన్నమాట అనుకున్నాడు.

అలసటగా వున్న ఆ సమయంలో కాఫీ త్రాగితేనే కానీ రిలీఫ్ రాదనిపించింది అతనికి. ఫోన్ చేసి రూమ్ సర్వీస్‌కి చెబితే పంపిస్తారు కదా అనుకొని ఫోన్ కోసం అటువైపు తిరిగాడు.

బెడ్‌కి ఎడమవైపు డ్రెస్సింగ్ టేబుల్, దాని ప్రక్కనే ఫోన్ ఉన్నాయి.

అటు వైపు తిరిగి ఫోన్‌మీద చేయి వేసిన సాయిగౌతమ్ అనుకోకుండా డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలోకి చూసి అదిరిపడ్డాడు.

అతని శరీరంలో రక్తం ఒక్కసారిగా గడ్డ కట్టుకుపోయింది.

ఒళ్ళు జలదరించింది సాయిగౌతమ్‌కి. కీడుని శంకించింది అతని సిక్త్ సెన్స్, కారణం....

వార్డ్‌రోబ్‌లో హేంగర్స్‌కి దుస్తులు వ్రేలాడుతున్నాయి.ఆహేంగర్స్ వెనుక ఏదో కదలిక.. అంటే.... అక్కడ ఎవరైనా వున్నారా!

అతని శరీరకండరాలు ఒక్కసారిగా బిగుసుకున్నాయి. క్షణం కూడా ఆలస్యం చేయలేదు అతను....

గిర్రున వెనక్కి తిరిగి బెడ్‌మీద దొర్లాడు.

అదే క్షణంలో ఊహించని వేగంతో వార్డ్‌రోబ్‌లోంచి ఎగిరి బెడ్ మీదకు దూకాడు ఓ వ్యక్తి. విసురుగా సాయిగౌతమ్ కాళ్ళు గాలిలోకి లేచింది.

ఆ దెబ్బ ఆ వ్యక్తి మోకాలి మీద బలంగా తగిలి "ఫట్"మని శబ్దం వచ్చింది.

భీకరంగా అరుస్తూ గాలిలోకి ఎగిరి బెడ్‌కి దాదాపు నాలుగు అడుగుల దూరంలో పడ్డాడు ఆ వ్యక్తి. అదే క్షణంలో నేలకు కొట్టిన బంతిలా ఎగిరి గాలిలోకి లేచి పిడికిళ్ళు బిగించాడతను.

బెడ్‌మీద నుంచి ఇవతలికి దొర్లి లేచి నిలబడ్డాడు సాయిగౌతమ్.

ఐదు అడుగుల వెడల్పున్న ఆ పెద్ద బెడ్‌కి అటువైపు ఆ వ్యక్తి ఇటువైపు సాయిగౌతమ్ నిలబడి వున్నారు. రెప్పవాల్చకుండాచూశాడతని వైపు.

ఆరడుగుల పైన పొడవు వున్నాడు. తెల్లగా బలిష్టంగా వున్నాడు. పంక్ సెల్ జుట్టు, టిబెటన్స్‌లాంటి చిన్నకళ్ళు, షార్ప్‌గా వున్న ముక్కు, ఇండియాలో ఏ ప్రాంతంవాడో అర్థంకాలేదు.

"తప్పుకో" కరుకుగా అరిచాడు ఆ వ్యక్తి.

తప్పుకో మంటున్నాడు. అంటే వెనకాల ఏముందా....అని తల కొద్దిగా తిప్పి క్రీగంట వెనక్కి చూశాడు సాయిగౌతమ్. రూమ్‌లోంచి బయటికి వెళ్ళే దోరు వుంది.

"నీకే చెప్పేది....తప్పుకో" ఈసారి చాలా కూల్‌గా అన్నాడు అతను.

అతను మాట్లాడే తెలుగు వింటే, అతని మాతృభాష అది కాదన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

సాయిగౌతమ్ మెదడు వేగంగా ఆలోచిస్తోంది. ఎవరీ వ్యక్తి? ఎందుకువచ్చాడు? తను ఇక్కడ వున్నట్లుగా అతనికి ఎలా తెలిసింది? పరిపరివిధాల వస్తున్న ఆలోచనలు పక్కకునెట్టి "ఎవరు నువ్వు" సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

పిడికిలి బిగించి అడుగు ముందుకు వేశాడతను.

"పక్కకి తప్పుకోమని చెబుతే అర్థంకాలేదా"

"అయింది. నువ్వెవరు? అని నేను అడుగుతున్నాను"



"నిముషంలో తప్పుకోపోతే చస్తావ్"

"నువ్వెవరో చెప్పుకోవటానికే భయపడుతున్నావు. నువ్వు నన్నేం చంపగలవు?"

సాయి గౌతమ్ మాటలు ఇంకా పూర్తికాలేదు.

బెడ్‌మీదగా ఎగిరి గాలిలోకి డైవ్‌చేసి శక్తికొద్దీ సాయిగౌతమ్ గుండెలమీద తన్ని బ్యాలన్స్ తప్పటంతో దబ్‌మని క్రిందపడ్డాడు అతను.

పెడీమని గోడకి గుద్దుకుని క్రింద పడ్డాడు సాయిగౌతమ్.

అతని శరీరం మార్షల్ ఆర్ట్స్‌లో రాటుతేలినది కాబట్టి తిరిగి లేవగలిగాడు. మరొకరయితే....అదే క్షణంలో ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయేవి.

ఆ వ్యక్తి లేచి నిలబడేలోపు ముందుగా తనే లేచి పిడికిలి బిగించి విసిరాడు.

ఫెడీమని అతని పక్కటెముకల్లో తగిలింది సాయిగౌతమ్ చేయి.

మరోసారి బలమైన ముష్టిఘాతం ఇవ్వాలని వేగంగా ముందుకు కదలిన సాయిగౌతమ్ చేయిని చివరి క్షణంలో రెప్పపాటుకాలంలో వెనక్కి లాక్కున్నాడు.

క్షణం ఆలస్యమయిన సాయిగౌతమ్ చేయి మణికట్టువరకు తెగి కింద పడేదే.

కారణం....

ఆ వ్యక్తి జేబులోంచి తళతళలాడుతున్న కత్తి బయటికి వచ్చింది.

"నీకు ముందే చెప్పాను. తప్పుకో ....లేకుంటే ఛస్తావ్" అరిచాడు.

"నిన్నెవరు పంపారు?" కరుకుగా పలికింది, సాయిగౌతమ్ కంఠం.

"నీకనవసరం"

"నిన్ను ఎవరైనా పంపారా? లేక నువ్వే ఏదైనా గ్యాంగ్ లీడర్‌వా!"

"నీకు బ్రతకాలని లేదా"

"నా రూమ్‌లో ఏం కావాలని వచ్చావ్?"

"బాస్టర్డ్....ఐవిల్ కిల్‌యు" కీచుమని అరిచాడు అతను.

"నువ్వు నన్ను చంపవు, నాకాసంగతి తెలుసు" కూల్‌గా అన్నాడు సాయిగౌతమ్.

అతని ముఖంలో రంగులు మారాయి.

"ఆ మాత్రం తెలుసుకోలేని చవటని కాను. చంపే ఉద్దేశంతో రాలేదు నువ్వు. ఏదో గ్యాంగ్‌కోసం పనిచేస్తున్నావే తప్ప నువ్వు ఏ గ్యాంగ్‌కీ లీడర్‌వి కావు. ఎటాక్ చేయటానికి వచ్చినవాడు తెలుగు సిన్మాల్లోలాగా డైలాగ్స్ చెప్పుకున్నతర్వాత కొట్టుకోరు"

తెల్లముఖం వేశాడు అతను అంత ఖచ్చితంగా సాయిగౌతమ్ చెప్పటంతో.

"ఎలా చెప్పగలిగావు?" ఎదురు ప్రశ్నించాడు అతను.

"సింపుల్ నన్ను చంపే ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చివుంటే నేను ఈ గదిలోకి వచ్చి బెడ్‌మీద ఐదునిముషాలు పడుకున్నా నువ్వు నన్ను ఏమీ చేయలేదు. అంతేకాదు వార్డ్‌రోబ్ బట్టల వెనుక దాక్కున్నావు. నేను నిన్ను చూడకపోతే సైలెంట్‌గా బయటికి పారిపోదామనుకున్నావు. కానీ ఎప్పుడయితే నేను నిన్ను చూశానో, అప్పుడు మాత్రమే నువ్వు ఆత్మ రక్షణ కోసం బయటికి వచ్చావు. నువ్వే బాస్‌వి అయి వుంటే ఈ పాటికి నన్ను చంపి పారిపోయేవాడివి" ఇంకా ఏదో అనబోయాడు సాయిగౌతమ్

"గుడ్ చాలా తెలివైనవాడివి. నువ్వు లేని టైములో ఈ గదిలో ఒక పని పూర్తిచేసుకురమ్మని మా బాస్ పంపించాడేకానీ, నిన్నుచంపమని చెప్పలేదు. అందువల్ల కేవలం ఇక్కడి నుంచి తప్పించుకోవటం కోసం నిన్ను చంపితే దానివల్ల కొత్తసమస్యలు ఉత్పన్నమయితే, అనవసరంగా నేను నా బాస్ ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. విషయాన్ని చాలా సరిగ్గా గ్రహించావు"

సాయిగౌతమ్‌కి ఈ అనుభవం వింతగా వుంది. ఇలా కత్తి ఝుళిపించి నిలబడి ఓ వ్యక్తి నిముషాల తరబడి మాట్లాడటం సినిమాలలో చూశాడేగానీ, నిజజీవితంలో అలా జరగటం ఆశ్చర్యంగా వుంది.



లాస్ట్‌వార్నింగ్ ...తప్పుకుంటావా లేదా" అరిచాడు.

ఆ వ్యక్తి బయటకు పారిపోకుండా చూసి, స్పృహపోయేలా గాయ పరచగలిగితే, అతని కాళ్ళు, చేతులు కట్టిపడవేసి ఆ తరువాత నిజం రాబట్టవచ్చు.

అతని కళ్ళు ఆ చివరినుంచి ఈ చివరికి కదిలి ఎడమవైపు నాలుగడుగుల దూరంలో టీపాయ్ మీద వున్న ఫ్లవర్‌వాజ్‌మీద ఆగిపోయాయి. అది అందుకుని ఆ వ్యక్తిమీద విసరగలిగితే....

ఆ ఆలోచన వచ్చినదే తడవు ...మెరుపులా ఫ్లవర్‌వాజ్ వైపు దూకాడు.

సాయిగౌతమ్ చేయి ఫ్లవర్ వాజ్‌ని సమీపించేటంతలో విసురుగా కదిలింది ఆ వ్యక్తి చేయి.

పదునైన సాయిగౌతమ్ మణికట్టు ప్రాంతంలో తాకింది. సర్ర్‌మంటూ నాలుగు అంగుళాల మేర చర్మం చీలిపోయింది.

నిప్పుతో చర్మం మీద గీత గీసినట్లు భగ్గుమంది.

మరోసారి తన మీదకు రాబోతున్న ఆ నైఫ్‌ని ఆపే ప్రయత్నంలో అతని మనికట్టు దగ్గర బలంగా పట్టుకున్నాడు సాయిగౌతమ్.

క్షణంలో వెయ్యోవంతు కాలంలో అతనా నైఫ్‌ని కుడిచేతిలోంచి పైకి ఎగరేసి ఎడమచేతితో అందుకుని సాయిగౌతమ్ శరీరంవైపు ఫ్లిక్ చేశాడు

సర్రుమని తెగిపోయింది సాయిగౌతమ్ షర్టు. భుజంమీద నుండి కుడి మోచేతికి రెండు అంగుళాలు పై వరకు గల చర్మం చీరుకు పోయింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా మోకాలితో ఆ వ్యక్తి డొక్కలో తన్ని అతనికి దూరంగా దూకేసాడు సాయిగౌతమ్.

భరించలేని బాధతో మోకాళ్ళమీద కూర్చుండిపోయాడు అతను.

మెరుపు వేగంతో అతను నైఫ్‌ని కదిలించడం చూసినపుడు సాయి గౌతమ్‌కి అర్థమైపోయింది నైఫ్ ఎటాక్‌లో అతను మాస్టర్ అని.

అతని బాడీ మూవ్‌మెంట్స్‌నిబట్టి మార్షల్ ఆర్ట్స్ కూడా వచ్చని

తెలుస్తోంది.

తనకి మార్షల్ ఆర్ట్సు మాత్రమే వచ్చుకానీ నైఫ్‌తో అంత నైపుణ్యంగా ఎటాక్ చేయడం రాదు.

ఇప్పుడు అతనితో తలపడి మరికొన్ని కత్తిగాట్లకి గురిఅవటం తప్ప ప్రయోజనం లేదు.

పరిస్థితులనుబట్టి ఓటమిని అంగీకరించడం ఈ వృత్తిలో తప్పదు.

"ఇప్పుడయినా వెళ్ళనిస్తాననుకుంటున్నాను" బటన్‌నైఫ్‌ని ఎడమ చేతిలోకి మార్చుకుంటూ అన్నాడు.

ఇంకేం మాట్లాడలేదు సాయిగౌతమ్.

వెళ్ళమన్నట్లుగా చేయి చూపించాడు.

"వెనుకకు తిరిగి ఆ సోఫావైపు నడువు" ఆదోరకమైన యాసతో కర్కశంగా అన్నాడు.

మాట్లాడకుండా అటుగా నడిచాడు సాయిగౌతమ్.

"నీల్ డౌన్" అరిచాడు.

నిశ్శబ్దంగా మోకాళ్ళమీద కూర్చున్నాడు.

మరుక్షణంలో క్లిక్‌మన్న శబ్దంతో తెరుచుకుని, ధనేల్‌మని శబ్దం చేస్తూ తిరిగి మూసుకుపోయింది.

గిర్రున వెనక్కి తిరిగి లేచి నిలబడ్డాడు.

ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

పరుగులాంటి నడకతో డోర్‌ను సమీపించి తెరిచి కారిడార్లో ఇటూ ఆటూ చూశాడు.

ఆ వ్యక్తి కనిపించలేదు.

అంటే లిఫ్టులోకి వెళ్ళిపోయి ఉండాలి.

క్రింద హోటల్ సెక్యూరిటీకి ఫోన్ చేస్తే....

దానివల్ల జనాలు అంతా గుమిగూడుతారు .... పోలీసులుకూడా రంగంలోకి దిగుతారు.

ఫలితం....తనని గురించిన వివరాలు కూడా పోలీసులకి తెలియ చేయాల్సి వస్తుంది.



కాబట్టి ప్రస్తుతానికి సైలెంట్‌గా వుండటమే మంచిది.

రూమ్‌లోకి తిరిగివచ్చి డోర్ క్లోజ్ చేశాడు.

డ్రెస్సింగ్‌టేబుల్ దగ్గర అద్దంలో చూసుకున్నాడు.

రక్తం కారటంతో షర్టు అంతా ఎర్రగా ఆయిపోయింది.

షర్టు విప్పి గాయాల మీద నీళ్ళుపోసి కడిగాడు.

సింక్ దగ్గర వున్న డెట్టాల్ బాటిల్ తీసి కత్తిగాట్లమీద పోశాడు.

భగ్గుమని మండింది చర్మం.

వెనుకకు వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

పదినిముషాలకి రక్తం గడ్డకట్టింది.

కుట్లు వేయవలసిన అవసరం లేదనిపించింది.

సూట్‌కేస్‌లోంచి రెండు కర్చీఫ్‌లు తీసి గాయాల దగ్గర కట్టాడు.

టైమ్ చూసుకున్నాడు ఐదు అవుతోంది.

అంటే మరో గంటలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ మొదలవుతోంది. ఆ సమయానికి అక్కడికి చేరుకొని ఈ రోజైనా శుభాంగితో మాట్లాడాలి.... అనుకున్నాడు.

సోఫాలోంచి లేచి నీళ్ళతో ముఖం కడుక్కొని డ్రెస్ ఛేంజ్ చేసుకో సాగాడు.

తనమీద ఎటాక్ మొదలయింది.

ఆ వ్యక్తి ఎవరో....ఖచ్చితంగా ఏ పనిమీద తన రూమ్‌కి వచ్చాడో తెలుసుకోలేకపోయాడు.

రూమ్‌లో వస్తువులుకూడా ఎక్కడివక్కడే వున్నాయి. ఏవీ సర్దినట్లు కానీ, కాగితాల కోసమో, డైరీలకోసమో వెతికినట్లు కూడా ఏమీ కన పడలేదు.

మరి ఎందుకు వచ్చినట్లు?

కారణాలు ఏవయినా కూడా....ఇక చాలా జాగ్రత్తగా వుండాలి. సూట్‌కేస్ తెరిచి అందులో అడుగున దాచిన రివాల్వర్ తీసి కోట్ జేబులో పెట్టుకొని బయటికి నడిచాడు.

హోటల్ బయటికి వచ్చి టాక్సీని పిలిచాడు.

"సికింద్రాబాద్ పోవాలి" చెప్పి టాక్సీలో కూర్చున్నాడు.

చిన్న కుదుపుతో బయలుదేరింది కారు.

అక్కడికి వంద గజాల దూరంలో ఆగివున్న ఒక మారుతీ వ్యాన్ ఆ టాక్సీ వెనుకగా బయలుదేరింది.

o o o

ఆ ఆడిటోరియం దగ్గర ఎటువంటి హడావుడి, కోలాహలంలేదు.

"ఇంత సైలెంట్‌గా వుందేమిటా" అని సందేహిస్తూ టాక్సీ ఫేర్ పే చేసి క్రిందికి దిగాడు సాయిగౌతమ్.

పార్కింగ్ ప్లేస్‌లో కూడా వాహనాలు ఏమీ కనపడలేదు.

ఆడిటోరియం మెయిన్‌డోరు దగ్గర మెట్లమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు ఇద్దరు కుర్రాళ్ళు.

సాయిగౌతమ్ వాళ్ళని సమీపించగానే ఏమిటన్నట్లు చూశారు అతని వైపు.

"ఇక్కడ....ఈ రోజు....పెయింటింగ్ ఎగ్జిబిషన్ లేదా" అనుమానంగా అడిగాడు.

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు ఒకతను,

"ఏం?"

"అమ్మగారికి ఒంట్లో బాగోలేదట....అందుకని"

"ఇప్పుడు శుభాంగి ఎక్కడున్నారు?"

"ఇంట్లోనే వున్నారేమో....మాకు తెలియదుసార్" చెప్పి తిరిగి వాళ్ళ కబుర్లలో పడిపోయారు.

"షిట్....చాలా తెలివిగా ఎవాయిడ్ చేస్తోంది" అనుకున్నాడు.

ఇప్పుడు ఆమెను కలవడం ఎలా?

క్షణానికి ఒక మూడ్‌లో వుండే ఈమె నుంచి నిజాలు రాబట్టడం సంభవమేనా! ఈ కేస్ సాల్వ్ అవుతుందా!

మెల్లగా అడుగులు వేస్తూన్న సాయిగౌతమ్ ఆగాడు. అతని మస్తిష్కంలో ఓ ఆలోచన మెదిలింది.



జేబులోంచి కొన్ని కాయితాలు బయటికి తీసి అందులోంచి ఓ వ్యక్తి విజిటింగ్ కార్డు బయటికి లాగాడు.

అదే క్యాంపస్‌లో వున్న పబ్లిక్‌ఫోన్ దగ్గరకు నడిచి, ఫోన్ లిఫ్ట్ చేసి ఆ నెంబరు డయిల్ చేశాడు.

నిముషంపాటు రింగ్ అయిన తరువాత అవతల వైపు ఫోన్ లిఫ్ట్ అయింది

"హలో" అని వినిపించింది ఓ కంఠం.

ఆ గొంతు ఎవరిదో గుర్తుపట్టగలిగాడు సాయిగౌతమ్.

అతని పెదవులమీద చిన్న చిరునవ్వు మెరిసింది.

"హలో" తీయగా లినిపించింది విలవత కంఠం.

"యామ్ ఐ స్పీకింగ్ టు సుప్రియ" అడిగాడు ఆ గొంతు విని గౌతమ్.

"యస్.... హూ ఈజ్ స్పీకింగ్"

"నేను సాయిగౌతమ్"

"హలో మిష్టర్ గౌతమ్.... హౌ ఆర్ యు?"

"ఫైన్"

"ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు? వాట్స్‌ది మేటర్?"

"పెయింటింగ్ ఎగ్జిబిషన్ దగ్గర నుండి మాట్లాడుతున్నాను"

"శుభాంగి ఈ రోజు ఎగ్జిబిషన్ దగ్గరకు రాలేదన్న విషయం చెప్పడానికి ఫోన్ చేశారా?"

"అవును.... ఎగ్జిబిషన్ ఈరోజు కాన్సిల్ అయిందన్న విషయం మీకు తెలుసా?"

ఆమె చిన్నగా నవ్వినట్లు అనిపించింది.

"తెలియదు. అయి వుంటుందని గెస్ చేశాను. ఇది మామూలే."

"బట్ ఐ వాంట్ టు నో ది రిజన్.... కొంచెం వివరంగా చెబుతారా?" అన్నాడు గౌతమ్.

"బాబూ.... ఇది నీ ఇంటి ఫోన్ కాదు. వెనకాల నలుగురం

వెయిటింగ్‌లో వున్నాం" ఒకింత కరుకుగా వినిపించిందో స్వరం.

తల తిప్పి చూశాడు గౌతమ్.

ఫోన్‌లో మాట్లాడటానికి తన వెనుక క్యూలో నలుగురు నిలబడి వున్నారు.

వాళ్ళంతా ఫోన్ దగ్గర నుంచి గౌతమ్ ఎప్పుడు కదులుతాడా అన్నట్లుగా చూస్తున్నారు.

చాలా ఎంబరాసింగ్‌గా అనిపించింది గౌతమ్‌కి.

అక్కడ జరుగుతున్న విషయం అర్థమయినట్లుంది సుప్రియకి.

"గౌతమ్.... మీరు వివరంగా ఏమయినా మాట్లాడాలనుకుంటే మా ఇంటికి రండి. ఉయ్ కెన్ టాక్" చెప్పిందామె.

"కానీ" ఒకింత సంశయించాడు.

"నథింగ్ టు హెజిటేట్.... మీ దగ్గర నా విజిటింగ్ కార్డు వుంది కదా! రండి" మళ్ళీ చెప్పిందామె.

"అరే బాస్.... ఎంతసేపు మాట్లాడతావు ఫోన్లో" అసహనంగా అరిచాడు క్యూలోని వ్యక్తి.

ముఖం పగిలేలా వాడిని ఓ గుద్దు గుద్దాలనిపించింది గౌతమ్‌కి.

ఆవేశాన్ని అదుపుచేసుకుంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి బిల్ పే చేసి బయటికి నడిచాడు.

ఆటో ఒకటి పిలిచి "హిమయత్‌నగర్.... పోనీ" అని అందులో కూర్చున్నాడు.

మీటరు ఆన్ చేసి ఆటోని ముందుకు పోనిచ్చాడు.

ట్రాఫిక్‌కి పీక్ అవర్స్ కావటంలో నెమ్మదిగా పోనిస్తున్నాడు ఆటోని.

ఈమె మనస్తత్వం అంతుపట్టనిదిగా వుంది. క్షణానికొక మూడ్‌లో వుండే ఈమె నుంచి నిజాలు రాబట్టటం సంభవమా!....

ఇది వృధా ప్రయాస ఏమో!....

మరెవరైనా వ్యక్తులనుంచి నిజాలు రాబట్టాలంటే.... ఆమెకు బంధువులు లేరు. స్నేహితులూ లేరు. ఉన్న ఒక్క స్నేహితురాలు



సుప్రియ. ఆమెకు కూడా పెద్దగా నిజాలు ఏమీ తెలిసినట్లు లేవు.

శుభాంగి ద్వారానే నిజానిజాలు తెలుసుకోవాలంటే.... అసలామె మాట్లాడే ఛాన్స్ ఇవ్వటంలేదే!

ఇటువంటి స్థితిలో ఈ కేస్‌ని సాల్వ్ చేద్దామని ప్రయత్నించడం టైం వేస్ట్ ఏమో!

"హిమాయత్‌నగర్‌లో ఎక్కడికి పోవాలి సార్?" అడిగాడు ఆటో డ్రైవర్.

ఒకసారి ఇటూ అటూ చూసి ఆలోచనల్లోంచి ఇవతలకి వచ్చాడు.

"అదిగో ఆ లెఫ్ట్‌టర్న్ తీసుకో.... కొంచెం ముందుకు పోనీ....ఆ అపార్ట్‌మెంట్స్ దగ్గర ఆపు" చెప్పాడు.

ఆటో ఆగింది. ఫేర్ పే చేసి క్రిందికి దిగాడు.

జేబులోంచి విజిటింగ్‌కార్డుతీసి ఫ్లాట్‌నెంబర్ చూశాడు.

నెం. 403.

లిఫ్ట్ దగ్గరకు నడిచాడు గౌతమ్.

డోర్ తెరిచాడు లిఫ్ట్‌బాయ్.

"ఫోర్త్‌ఫ్లోర్" అన్నాడు

నిముషం తరువాత లిఫ్ట్ ఫోర్త్ ఫ్లోర్‌లో ఆగింది.

బయటికి నడిచాడు గౌతమ్.

ఆ కారిడార్లో నాలుగు ఫ్లాట్‌లున్నాయి.

చీకటి పడుతుండడంతో కారిడార్లో లైట్లువెలుగుతున్నాయి.

403 దగ్గరకు వచ్చి ఆగాడు. డోర్‌మీద ఏ విధమైన నేమ్ ప్లేట్ లేదు.

కాలింగ్ బెల్ ప్రెస్ చేశాడు.

లోపల బెల్ మోగిన శబ్దం వినిపించింది.

కొద్ది సెకన్ల తరువాత డోరు తెరుచుకుంది.

"ప్లీజ్ కమ్" గౌతమ్‌ని చూస్తూనే అంది సుప్రియ.

అతడు లోపలకు రాగానే డోర్ క్లోజ్ చేసింది ఆమె.

"ప్లీజ్ బి సీటెడ్" సోఫా చూపించి అంది.

కూర్చుంటూ చుట్టూ చూశాడు.

ఇల్లంతా నీట్‌గా వుంది.

"నిముషంలో వస్తాను కూర్చోండి" అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

ఇంట్లో ఇంకెవరూ లేరేమోనన్న సందేహం వచ్చింది గౌతమ్‌కి.

టి.వి. ఆన్ చేసివుంది. ఏదో భరతనాట్యం ప్రోగ్రాం వస్తోంది.

రెండు నిముషాల తరువాత తిరిగివచ్చిందామె.

ఆమె చేతిలో ట్రే. అందులో స్నాక్స్, రెండు కప్పులు టీ వుంది.

"అరే.... నన్ను అడగకుండానే టీ తెచ్చారే?" అన్నాడు.

"మీరు వస్తున్నారని తెలుసు కదా! అందుకే ప్రిపేర్ చేశాను. మీరు ఆటోలోంచి దిగటం చూశాను" అంది ఓ కప్పు అతనికి ఇస్తూ.

"థాంక్యూ" అన్నాడు కప్పు అందుకుంటూ.

ఆమె చాలా సింపుల్‌గా వుంది. క్రీంకలర్ నైటీ ధరించి వుంది. ఆమె జుట్టు భుజాల వరకు కత్తిరించి వుంది.

సోఫాలో కూర్చుంటూ జుట్టుని వెనక్కి వేసుకుంది సుప్రియ.

కొద్దికాలం క్రిందట టి.వి.లో "మృగనయని" అనే సీరియల్‌ని అప్పుడప్పుడు చూశాడు గౌతమ్. అందులోని హీరోయిన్ పోలికలు ఈమెలో చాలా వున్నాయనిపించింది. ఆ హీరోయిన్ పేరు ఏమిటో గుర్తు రాలేదు.

"ఏమిటలా చూస్తున్నారు?"

ఆమె అడిగిన ప్రశ్నకు సర్దుకుని "నథింగ్.... మీలో ఒక టి.వి. ఆర్టిస్ట్ పోలికలు కనిపిస్తున్నాయి. ఆమె పేరు ... గుర్తు రావటం లేదు....."

"ఎవరా టి.వి. ఆర్టిస్ట్" ఒకింత ఆసక్తి చూపిస్తూ అడిగింది.

"అది మృగనయని అని ఒక సీరియల్...."

"అర్థమయింది. ఈ మాట చాలామంది అన్నారులెండి" తేలిగ్గా నవ్వేస్తూ అంది ఆమె.



"అవును.... ఇంట్లో ఎవరూ కనపడటంలేదు. బయటకు వెళ్ళారా అందరూ!"

"అందరూ.... అంటే"

"ఐ మీన్.... మీ ఇంట్లో ఎవరుంటే వాళ్ళు"

"ఈ ఇంట్లో ఎవరూ లేరు. మా మదర్ వుండేవారు. నాలుగు రోజుల క్రిందటే పుణ్యక్షేత్రాలు తిరిగి వస్తానంటూ వెళ్ళింది. మరో పది రోజులవరకు రాదు. అంతవరకు ఒంటరిదాన్నే" ఖాళీ చేసిన కప్పు క్రింద పెడుతూ అంది.

"అంటే ఈమె వివాహితా!.... అవివాహితా!" అన్న సందేహానికి ఆస్కారంలేదు. అవివాహితే అయివుండాలి. ఇంతవరకు తన భర్త గురించి కూడా ఏమీ చెప్పలేదు.... కాబట్టి...." అనుకున్నాడతను.

"అరే.... మీచేతికి ఏమయింది?" ఒకింత ఆత్రుతగా అడిగింది చేతికున్న బ్యాండేజ్ చూస్తూ.

"ఇదా! అబ్బే.... ఏంలేదు. నిన్న దెబ్బ.... అంతే" అని, మాట మారుస్తూ, "ఇంతకీ నాకు శుభాంగి విషయం చెప్పండి" అన్నాడు.

"ఏం చెప్పమంటారు?"

"అదే ఎగ్జిబిషన్‌కి ఈరోజు ఎందుకు రాలేదు? నిజంగా అనారోగ్యమా! లేక నన్ను ఎవాయిడ్ చేసే ప్రయత్నమా!"

"అది మీకే తెలియాలి"

"అంటే"

"మిమ్మల్ని ఎవాయిడ్ చేసేటంతటి బలమైన సంఘటనలు ఏం జరిగాయో!"

"మీకు తెలియందేముంది?.... ఆమె గతం గురించి ప్రస్తావించడం ఇష్టంలేదు. అందుకే నన్ను ఎవాయిడ్ చేయడానికి ప్రయత్నించుతోంది"

"ఇప్పుడు ఏం చేద్దామనుకుంటున్నారు?"

"ఆమెను కలవాలి" దృఢంగా అన్నాడు గౌతమ్.

"ఎప్పుడు?"

"ఇప్పుడే కలవాలనుంది"

"కానీ ఆమె హెల్తుకూడా బాగోలేదు. ఆమె ఎగ్జిబిషన్‌కి రాకపోవ డానికి ఇది కూడా కారణమే. అఫ్‌కోర్స్ మిమ్మల్ని ఎవాయిడ్ చేయాలన్న ఉద్దేశ్యం కూడా ఉందనుకోండి"

"ఇప్పుడు ఆమె హెల్తు ఎలా వుంది?"

"తెలియదు. ఫోన్ కూడా ఎవరూ లిఫ్ట్ చేయడంలేదు. అయినా నాదొక సందేహం"

"సందేహమా!...నా గురించా!" తన వైపు చేయి చూపిస్తూ అన్నాడు గౌతమ్.

"అవును"

"ఏమిటి అడగండి?" అని ఆమె అడగబోయే ప్రశ్నని ఊహించ డానికి ప్రయత్నిస్తూ.

"మీ ఇన్వెస్టిగేషన్ కంటే కూడా ఆమెతో స్నేహం కూడా ఎక్కువగా కోరుకుంటున్నారేమానని నా అనుమానం" అని ముఖంలోకి పరీక్షగా చూస్తూ అంది.

"మీకు నిజం చెబుతున్నాను. ఆమెతో స్నేహం కోరుకుంటు న్నాను. ఎట్ ది సేమ్ టైమ్ నాకు ఇన్వెస్టిగేషన్ కూడా చాలా ముఖ్యం" చాలా బాలన్స్‌డ్‌గా వుంది అతని ఎక్స్‌ప్రెషన్.

"మీరు ...శుభాంగిని ప్రేమిస్తున్నారేమో!" సుప్రియకు స్ట్రెయిట్‌గా మాట్లాడడం అలవాటు. ఎదుటివారు ఏమనుకుంటారో అన్న విషయం పెద్దగా పట్టించుకోదు.

"ఎందుకలా అడిగారు? ఆ ప్రశ్న అతను ఊహించలేదు. అందు వల్ల అతని ముఖంలో రంగులు మారాయి.

"సింపుల్.... నిజంగా ఇన్వెస్టిగేషన్ మీ ఉద్దేశం అయితే మీకు ఆమెను అడిగి నిజాలు రాబట్టే ప్రయత్నం చెయ్యరు. ఎందుకంటే, మీరు ఆమె గతాన్ని ఆమె దగ్గర రెండు మూడు సార్లు ప్రస్తావించినా ఆమె విషయం పట్ల విముఖత చూపించింది. అంటే, ఆ విషయం గురించి మీరు ఇంక ఏ వివరాలు ఆమె నుంచి రాబట్టలేరు.



"తరువాత నన్ను అడిగారు. నాకు తెలిసిన నిజం చెప్పాను. అది నిజం కాదు.... ఇంకా ఏదో ఫ్లాష్ బ్యాక్ ఆమెకు వుంది అంటున్నారు మీరు. నిజంగానే ఆమె మౌనిక అయితే, ఇంక ఆమె గత జీవిత వివ రాల గురించి ఆమెను ప్రశ్నించడంతో ఉపయోగంలేదు అన్న విషయం మీకు తెలుసు. మరో కొత్త వ్యక్తుల ద్వారా మీరు ఇన్వెస్టిగేషన్ ప్రారం భించాలి. ఆలా కాకుండా, తిరిగి ఆమెనే కలవాలని ప్రయత్నించుతున్నారు. అంటే.... అది ప్రేమే అని నా గట్టి నమ్మకం. ఆ విషయం మీరు నాకు చెప్పడానికి మొహమాటపడుతున్నారేమో!"

"ప్రేమా!" అతని పెదవులమీద చిరునవ్వు కదలాడింది. "అసం భవం.... నేను ఆమెతో మాట్లాడిన టైము మొత్తం కలుపుకున్నా మూడు నాలుగు గంటలు మించి వుండదు"

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్. తొలి చూపులోనే ప్రేమలో పడతారు. అదే అయి ఉండవచ్చుగా!"

"లేదు....అయినా లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అనేది జరుగదు. కవులు, రచయితలు చేసిన అనుభూతకల్పనఅది. వాస్తవ జీవితంలో తొలిచూపులో ప్రేమ అనేది ఇంపాజిబుల్"

"నేను ఉంది అంటాను"

"అది లవ్ కాదు...జస్ట్...కేవలం శారీరక ఆకర్షణ....కోరిక వాంఛ...అంతే. నిజమైన ప్రేమ అనేది కలగాలంటే....చాలా టైమ్ పట్టవచ్చు. నిజం చెప్పాలంటే....లవ్ అనే మాటకు అర్థంలేదు. ప్రేమ అనేది వుంటుందని నేను అనుకోను. అ మాటకే నేను వ్యతిరేకిని"

"మరి ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండేది ఏమిటి?"

"ఏ ఇద్దరు వ్యక్తులు?"

"ఉదాహరణకి మనిద్దరి మధ్య ఉన్నది?"

"స్నేహం"

"కరెక్ట్...బట్...మీకు మీనాన్నగారికిమధ్య వుండేది ఏమిటి? మీ

ఫాదర్‌కి, మీ మదర్‌కి మధ్య వుండేది ఏమిటి? అది ప్రేమ కాదా?"

"కాదు"

"మరి?" తెల్లబోయిందామె.

"రిలేషన్....బంధుత్వం...." నా మనిషి" అన్న అభిమానం.... ఆప్యాయత....అది ఒక రోజులో వచ్చినదికాదు....కొన్ని సంవత్సరాలుగా డెవలప్ అవుతున్న అనుబంధం."

"దానిని ప్రేమ అనరా!"

"అసలు అవదు....ముందే చెప్పాను కదా! ఆ మాటకే నేను వ్యతిరేకిని. ఆ మాటకొస్తే మీకు ప్రేమంటే నమ్మకం వుందా!....ఎప్పుడయినా ఆ ఎక్స్‌పీరియన్స్ మీకు కలిగిందా!"

ఆ ప్రశ్నకు ఆమె ముఖంలో రంగులు మారాయి. క్షణ కాలం మౌనంగా వుండిపోయింది. అక్కడి నుంచి లేచిందామె.

ఆమెకు ఎడమ వైపుగా వున్న కిటికీ దగ్గరకు నడిచింది.

ఒక్కసారిగా గంభీరత చోటుచేసుకున్న ఆమె వదనాన్ని చూసి అతను ఒకింత కలవర పడ్డాడు.

"ఏదయినా తప్పు మాట్లాడానా?" అన్న సందేహం వచ్చింది.

అదే మాట పైకి అన్నాడు.

"సుప్రియా... డిడ్ ఐ స్పీక్ ఎనీథింగ్ రాంగ్" ఆందోళన ధ్వనించింది అతని గొంతులో.

"నా గతం గురించి చెప్పవచ్చా?" హఠాత్తుగా అంది.

తెల్లబోయాడు ఆమె ప్రశ్నకి. అతను ఆ తరువాత ఏమీ మాట్లాడలేదు.

అతని మౌనాన్ని ఆమె అంగీకారంగా తీసుకుంది.

"నాకు అమ్మా. అన్నయ్య ఇద్దరే వున్నారు. డాడీ చిన్నప్పుడే పోయారు. అన్నయ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్.

"నేను డిగ్రీ ఎగ్జామ్స్ రాసి ఖాళీగా ఉన్న రోజులవి. అన్నయ్య ఓ రోజు ఇంటికి వస్తూ వాళ్ళ ఫ్రెండ్ రమాకాంత్‌ని పిలుచుకుని వచ్చాడు.



అతను కూడా ఎయిర్ ఫోర్స్‌లో పైలట్. తొలిచూపులోనే ఇద్దరం ఒకరినొకరు ప్రేమించుకున్నాం. అతను మా ఇంట్లో కేవలం ఒక వారం రోజులే వున్నాడు. ఎందుకో అతనితోనే జీవితం పంచుకోవాలన్న బలమైన కోరిక కలిగింది.

మీరనుకున్నట్లుగా మా ఇద్దరి మధ్య శారీరకమైన కోరికలు ఏమీ కలగలేదు. శారీరకంగా దగ్గరవ్వాలన్న ప్రయత్నం కూడా చేయలేదు. తరువాత అతను వెళ్ళిపోయాడు. తన అభిప్రాయం అన్నయ్యకి తెలియజేశాడు. ఆయన ఆ సంగతి చెప్పిన నెలరోజులకు మా ఇద్దరి పెళ్ళి అయిపోయింది. పెళ్ళయ్యాక అతనితో నేను గడిపినది కేవలం ఎనిమిదిరోజులు మాత్రమే. ఇద్దరం కలిసి హనీమూన్‌కి వెళ్ళివచ్చాం. తిరిగి రమాకాంత్ డ్యూటీకి వెళ్ళిపోయాడు. ఆ ఎనిమిది రోజులతో మా బంధం అంతమయిపోయింది...."

ఆమె కిటికీలోంచి ఎటో చూస్తోంది.

"నేను అన్న విషయాన్ని మీరూ పరోక్షంగా ఒప్పుకుంటున్నారు. మీరు మొదటి చూపులోనే ప్రేమించుకున్నాం-అన్నారు. అది ప్రేమకాదు. ఆకర్షణ....అందుకే పెళ్ళయిన ఎనిమిది రోజులకే విడిపోయాం అన్నారు. అంటే.... ఆ కొద్దిరోజుల్లోనే మీ ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయన్నమాట. దాన్ని మరి ప్రేమ అని ఎలా ....ఇంకా ఏదో అనబోయాడు సాయి గౌతమ్.

"గౌతమ్ మేము విడిపోయాం అంటే....భగవంతుడు రమాకాంత్‌ని నా నుంచి దూరంచేశాడు. అతను ఇక్కడి నుంచి వెళ్ళిపోయిన రెండు రోజులకే డెహరాడూన్ దగ్గర ప్లెయిన్ క్రాష్ అయింది...." ఆమెకు ఇంక మాట రాలేదు.

అదిరిపడ్డాడు గౌతమ్. ముఖంమీద బాంబు పేలినట్లనిపించింది. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"ఈ సంఘటన జరిగి .... ఆరేళ్ళు అయింది. నేను .... ఇంకా? ఆ జ్ఞాపకాలతోనే బ్రతుకుతున్నాను. ఇప్పుడు చెప్పండి - ఎనిమిది రోజుల ప్రేమానుబంధం ఆరేళ్ళు అయినా పోలేదు. దీనిని ప్రేమ అంటారా

సంవత్సరాల తరబడి డెవలప్ అవుతూ వస్తున్న అనుబంధం అంటారా?''

ఆమె ప్రశ్నకు తలలో నుండి బుల్లెట్లు దూసుకుపోయినట్లు అనిపించింది.

నోట మాట రాలేదు గౌతమ్‌కి.

ఇటువైపు తిరిగింది ఆమె. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

బ్రాన్పడిపోయాడు అతను.

తను వచ్చిన పని వేరు. శుభాంగి గురించిన వివరాలు తెలుసుకుందామని. కానీ....అది కాస్తా....విషయం ఎక్కడో మొదలు అయి.... ఎక్కడికో వెళ్ళిపోయింది. అయినా ఎందుకు అంత తీవ్రంగా మాట్లాడాడో తనకే అర్థం కాలేదు.

సుప్రియ ఇంతటి దురదృష్టవంతురాలని అతను అనుకోలేదు. ఆమె వయస్సు మహా అయితే ఇరవై ఆరేళ్ళుంటాయేమో !

''చిన్న వయస్సులోనే విధి ఆమెను విధవరాలిని చేసింది'' అన్న ఆలోచన రాగానే ఆమె మీద ఒక రకమైన జాలి, అభిమానం కలిగాయి.

ఆ సమయంలో అక్కడి వాతావరణం చాలా ఇబ్బందిగా అనిపించింది. ఎందుకో ఇంక అక్కడ ఉండాలనిపించలేదు.

''అయాం వెరీసారీ....మిమ్మల్ని బాధపెట్టినట్లున్నాను'' లేచి నిలబడుతూ అన్నాను.

''ఇందులో....మీరు నన్ను అన్నది. బాధపెట్టింది ఏముంది?....నా గతం గుర్తువచ్చి నాకు బాధ అనిపించింది అంతే. నిజానికి క్షమించమని అడగాల్సింది నేను.. అనవసరంగా నా గురించిన వివరాలు అన్నీ చెప్పి బోరుకొట్టించాను''

''నేను వస్తాను''

''అరె కూర్చోండి. శుభాంగి గురించి మాట్లాడాలన్నారు. నా మాటలకి ఏమయినా ఫీలయ్యారా!'' ఆమె ముఖంలో ఒకింత బాధ తొంగి చూసింది.

''నోనో.... అదేమీలేదు నాకు ఏడు గంటలకి మరో అపాయింట్‌మెంట్ వుంది. ఇప్పటికే ఏడున్నర అయిపోయింది. త్వరగా వెళ్ళాలి'' వాచ్‌వైపు చూసుకుంటూ – ఏదో హడావుడిగా వెళ్ళేవాడిలా అభినయించాడు.



''మరి శుభాంగి....'' ఏదో అనబోయింది.

''ఇట్సాల్ రైట్.... రేపు ఆమె ఎగ్జిబిషన్ దగ్గరికి వస్తుందేమో ప్రయత్నించుతాను. వస్తాను''

''ఇంకేమీ మాట్లాడలేదు ఆమె'' కూడా.

ఏడు గంటలకి ఏదో అపాయింట్‌మెంట్ వుందని చెప్పడం అబద్ధం అని అతనికీ తెలుసు.... ఆమెకూ తెలుసు.

బరువెక్కిన గుండెతో బయిటికి నడిచాడు గౌతమ్.

0 0 0

సిగరెట్ వెలిగించి గుండెల నిండుగా పొగ పీల్చి వదిలాడు అతను.

కాలికున్న షూస్ లాగి ప్రక్కన పడవేసి, సాక్స్ కూడా తీసేశాడు.

రెండు కాళ్ళూ టీపాయ్‌మీద వుంచి సోఫాలో వెనక్కి వాలాడు.

అతని ఆలోచనల్లోంచి ఇంకా సుప్రియ పోలేదు. ఆమె గత జీవితం అతన్ని చాలా బాధించింది. చిన్న వయసులోనే సుఖాలన్నీ పోగొట్టుకున్న ఆమెమీద జాలి అధికం అయింది.

కాలింగ్‌బెల్ శబ్దం అయింది.

రూమ్‌లోకి కాఫీ పంపించమని రిసెప్షన్ దగ్గర చెప్పివచ్చాడు. బహుశా కాఫీ వచ్చి వుండవచ్చు అనుకున్నాడు.

డోరు ఓపెన్ చేశాడు.

ఎదురుగా రూమ్ సర్వీస్‌మెన్ కాఫీ సెట్‌తో కనిపించాడు.

''అక్కడ పెట్టు'' టీపాయ్ చూపించాడు గౌతమ్.

''సార్.... మీకు టెలిగ్రామ్ మెసేజి ఒకటి వుంది'' మడిచివున్న పేపర్ ఒకటి టీపాయ్‌మీద వుంచి వెళ్ళిపోయాడు అతను.

చేతి వేళ్ళమధ్య వున్న సిగరెట్‌ను పెదవుల మధ్యవుంచి ఆ పేపర్ అందుకుని ఓపెన్ చేసి చూశాడు.

పరశురామ్ ఫైల్ ఈ రోజు కొరియర్‌లో పంపాను. నరేంద్ర బొంబేకి బయలుదేరాడు. మీరు ఫోన్ కాల్ రేపు చేస్తారనుకుంటున్నాను.

—శర్మ,
విశాఖపట్నం.

అని ఇంగ్లీష్‌లో వున్న మేటర్ చదివి దాన్ని పక్కన పడేశాడు గౌతమ్. పరశురామ్ ఫైల్ తన చేతికి వచ్చింది అంటే.... తను వచ్చిన పని పూర్తి అయిపోయినట్లే. ఇంక శుభాంగి విషయంలో ఇక్కడ వుండాలా లేదా అనేది తనే నిర్ణయించుకోవాలి.

శర్మ టెలిగ్రాం ఇచ్చాడంటే, తన గురించి ఫోన్‌లో చాలసార్లు ప్రయత్నించి వుంటాడు. తను దొరకకపోయేసరికి టెలిగ్రాం ఇచ్చి వుండాలి.

తనకు గట్టి నమ్మం — ఆ మౌనికే ఈ శుభాంగి అని. అది కొంతవరకైనా ఋజువు కావాలి. అంటే ... ముందుగా మౌనిక ఫోటోలను బొంబాయి నుంచి తెప్పించాలి. ఈ విషయంగా శుభాంగి నుంచి తనకు ఏ విధమైన సహకారం వుండకపోవచ్చు. సుప్రియ నుంచి హెల్ప్ తీసుకోవాలి. ఆమె సహకరిస్తేనే కేస్ సాల్వ్ చేయడంలో కొంతవరకు ముందుకు వెళ్ళగలుగుతాడు. అది జరగకపోతే, సరిగ్గా వారం తరవాత ఇక్కడి నుంచి బొంబాయి వెళ్ళడం శ్రేయస్కరం. అలా అని దీని కోసమే సమయం వృధా చేసుకోవడం కూడా అంత మంచిదికాదు.

అంతేకాదు....

తన గురించి ఎవరో వ్యక్తులు ప్రయత్నం చేస్తున్నారు. ఆ వ్యక్తులు ఎవరో అర్థంకావడంలేదు.

మరి కొద్ది రోజులు ఇక్కడే వుంటే ...తన ప్రాణానికి ప్రమాదం ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అంతలోనే అతనికొక ఆలోచన వచ్చింది.

టెలిఫోన్ సమీపించాడు.



ఒక నెంబర్ డయిల్ చేయసాగాడు గౌతమ్.

కొద్ది సెకన్లు గడిచాయి.

o o o

"ఎక్సలెంట్ పెయింటింగ్స్" కాంప్లిమెంట్ చేస్తున్నారు ఎవరో.

వరుసగా ఒక్కొక్క పెయింటింగ్‌ని దాటుకుంటూ వెళుతున్నారు వాళ్ళు.

సుమారుగా ఇరవై మంది జె.ఎన్.టి.యు. ఫైనార్ట్స్ స్టూడెంట్స్ ఉన్నారు అక్కడ.

ఒక్కొక్క పెయింటింగ్‌ని పరీక్షగా చూస్తూ బ్రష్ స్ట్రోక్స్ ఎలా ఇవ్వబడ్డాయో ఏమిటో కూడా పరిశీలనగా చూడసాగారు.

కలర్స్ మిక్సింగ్ పరిశీలిస్తున్నారు కొందరు.

"ఈమె పెయింటింగ్స్‌లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఉన్నాయి" మనస్ఫూర్తిగా మెచ్చుకుంటూ అన్నాడు కుర్రాడు.

వాళ్ళ కామెంట్స్‌కి మామూలుగా ఎంజాయ్ చేసేదే .... కానీ ఆ రోజు ఆ మూడ్‌లో లేదు శుభాంగి.

డల్‌గా ఒక చైర్‌లో కూర్చుని వుంది ఆమె.

ఎగ్జిబిషన్ ఓపెన్ చేయకపోతే బాగోదు అనుకుని తప్పనిసరిగా వచ్చింది ఆ రోజు ఆమె.

అప్పటికి ఐదు నిముషాలుగా ఆమెను అబ్జర్వ్ చేస్తున్నాడు గౌతమ్.

విశాలమైన ఆ హాల్‌కి అటువైపుగా వున్న ఒక కార్నర్‌లో నిలబడ్డాడు అతను, అక్కడ ఒక పిల్లర్ ఉండడంతో ఆమెకు అతను కనపడడంలేదు.

అదే సమయంలో ఆమె దగ్గరకు వచ్చారు ఇద్దరు వ్యక్తులు.

"ఎక్స్‌క్యూజ్‌మి....అయాం ఫ్రమ్ మార్క్స్ ఎడ్వర్టైజింగ్ ఏజెన్సీ" తనని తాను పరిచయం చేసుకున్నాడతను.

పెదవులమీదికి నవ్వు తెచ్చుకుంటూ కూర్చోమన్నట్లుగా చేయి చూపించింది.

వాళ్ళిద్దరూ కూర్చున్నారు.

"మీతో పనుండి వచ్చాము. ఈ సంవత్సరం మేము మీ పెయింటింగ్ ఒకటి క్యాలెండర్‌గా ప్రింట్ చేయాలని నిర్ణయించుకున్నాం. మాకు నెల రోజుల్లో అంటే కనీసం నవంబర్ ఫస్ట్‌లోపుగా ఆ పెయింటింగ్ చేసి ఇవ్వగలరా?"

అలాగే అన్నట్లు తల ఊపింది ఆమె "వివరాలు చెప్పండి. ఎటువంటి పెయింటింగ్ కావాలో...." అడిగింది.

"మదర్....చైల్డ్ రిలేషన్ మీద....మీ ఇష్టం వచ్చిన స్టైయిల్‌లో పెయింటింగ్ చేసి ఇవ్వండి."

"పెయింటింగ్ సైజ్ చెబుతారా?"

"యస్....చెబుతాను" అని సర్దుకుని "థర్టీసిక్స్ ఇంటూ ట్వంటీ ఫోర్ సైజు....థర్టీ సిక్స్ ఇమేజ్ హైట్ ఉండాలి" అన్నాడు.

ఆమె మొహంలో రంగులు మారాయి.

ఒకింత పరిశీలనగా అతని ముఖంలోకి చూసింది.

"మీకు అర్థంకాలేదనుకుంటా. మా క్యాలెండరు పొడవు థర్టీ సిక్స్ ఇంచెస్, వెడల్పు ట్వంటీ ఫోర్ ఇంచెస్ వుండాలి. క్యాలండర్ బొమ్మ హైట్ కూడా థర్టీ సిక్స్ ఇంచెస్ ఉండాలి. అందువల్ల మాకు థర్టీ సిక్స్, ట్వంటీ ఫోర్ సైజ్ కాన్వాస్, థర్టీ సిక్స్ సైజ్ ఇమేజ్ కావాలి" మళ్ళీ చెప్పాడు.

అంతే....

విసురుగా కుర్చీలోంచి లేచిందామె. ఆమె కుడిచేయి గాలిలోకి లేచి ఆ వ్యక్తి చెంపని బలంగా తాకింది.

ఛెళ్ళుమన్న శబ్దం....ఆ గదిలో ప్రతిధ్వనించింది.

అదిరిపడి అటువైపు తిరిగారు అందరూ.

"గెటౌట్....బాస్టర్డ్" స్వరపేటిక తెగిపోయేలా అరిచిందామె.

బిత్తరపోయి చూస్తున్నారు వాళ్ళిద్దరూ.

అతను అడిగినదానిలో తప్పేమిటో .... ఆమె ఎందుకంత ఉద్రేకానికి లోనయిందో, ఎందుకు కొట్టిందో....సభ్యతని మరిచి ఎందుకలా ప్రవర్తించిందో అర్థంకాక నిశ్చేష్టుడయి చూస్తూ ఉండిపోయాడు గౌతమ్.



o o o

ప్రతి మనిషికి జీవితంలో ఎన్నో అవకాశాలు వస్తాయి.

కొందరు ఆ వచ్చిన అవకాశాలను సరిగ్గా ఉపయోగించుకుని ఎదుగుతారు.

వీళ్ళు అదృష్టవంతులు.

ఇంకొందరు ఎన్ని అవకాశాలు వచ్చినా వాటిని ఉపయోగించుకునే ప్రయత్నమే చేయరు. వీళ్ళు మూర్ఖులు.

"ప్రతి మనిషికి అవకాశాలు వస్తాయి" అన్నదానికి పూర్తి వ్యతిరేకి గౌతమ్.

"అవకాశాలు తమంతట తాము రావు. మనమే వాటిని వెతుక్కోవాలి. ఆ వెదుకులాటలో దొరికిన అవకాశాలను ఉపయోగించుకోవాలి" అన్న విషయాన్ని బలంగా నమ్ముతాడు.

అలాగే అతని దృష్టిలో కూడా సమయం విలువైనది. ఒకసారి పోయిన క్షణాలు తిరిగిరావు.

మనిషి జీవితాన్ని ప్రతి ఒక్కరూ సంవత్సరాలలో లెక్కపెడతారు.

కానీ గౌతమ్ మాత్రం లక్షల కోట్ల సెకన్లుగా భావిస్తాడు. జీవితంలోని ప్రతి సెకను విలువైనది అని అనుకుంటాడు.

అతను తన సమయాన్ని సంపాదనని కూడా వింతగా లెక్కపెడతాడు.

ప్రతి మనిషికీ ఎనిమిది గంటల నిద్ర అవసరం. కొందరు ఆరు గంటల పాటు నిద్రపోతే సరిపోతుందనుకుంటారు.

ఆరు గంటల నిద్ర అనేది కనీస విశ్రాంతి.

ఇందులో ఒక గంట పైము విశ్రాంతిని తగ్గించుకోగలిగితే....

రోజుకి ఒక గంటపాటు పనులు చేయటానికి అదనంగా లభిస్తుంది. అలా రోజుకి గంట కాలం పొదుపు చేస్తే....

నెలకి ముప్పై గంటలు పొదుపు చేయవచ్చు.

సంవత్సరానికి మూడు వందల అరవై ఐదు గంటలు పొదుపు అవుతుంది.

365 గంటలు అంటే సంవత్సరంలో పదిహేను రోజులు అదనంగా వచ్చినట్లు.

అలా ఒక ముప్పై సంవత్సరాలపాటు తీసుకుంటే....ఎన్ని నెలలు సేవ్ అవుతాయి? ఆ మిగిలిన రోజుల్లో అదనంగా పనిచేస్తే—ఆదాయం ఎంత పెరుగుతుంది?....అన్నదే అతని లెక్క.

ఇలా ఓ గంట నిద్ర తగ్గించుకుని టైముని పొదుపు చేసే సూత్రాన్ని బహుశా ఎవరూ పాటించరేమో!

టైము రాత్రి రెండవుతోంది.

గౌతమ్ లెక్కప్రకారం ఆరోజు రెండు గంటలు అతని నిద్రలో సేవ్ చేసినట్లే.

కానీ....ఆ రెండు గంటలు వృధానే....

నిద్రపట్టక అసహనంగా దొర్లుతున్నాడు.

ఈరోజు సాయంకాలం ఒక ప్రముఖ ఎడ్వర్‌టైజింగ్ ఏజన్సీ ఎగ్జిక్యూటివ్‌ని చెంప పగిలేలా కొట్టింది శుభాంగి.

ఆ తరువాత వాళ్ళ మధ్య తీవ్ర వాగ్యుద్ధం కూడా జరిగింది. చివరికామె క్షమాపణ చెప్పింది.

అకారణంగా అతనిని అలా కొట్టడం చాలా తప్పుగా అనిపించింది గౌతమ్‌కి కూడా.

అసలు ఆమె మానసిక స్థితి ఎలా వుందో!

ఆమె కేసు ఎలా హేండిల్ చెయ్యాలో....

ఈరోజు బొంబాయికి ఫోన్ చేసాడు.మౌనిక ఫోటోలు ఒకటి రెండు రోజుల్లో ఎవరికయినా ఇచ్చి పంపమని చెప్పాడు. వాటితోపాటు ఆ కేసుకి



సంబంధించిన మిగతా ఫైల్స్, పేపర్స్ కూడా తీసుకురమ్మన్నాడు. బహుశా రఘురామ్ బయలుదేరవచ్చు అనుకున్నాడు.

ఇంతకీ శుభాంగిని ఎలా ఎప్రోచ్ అవ్వాలి?

శతవిధాల ఆలోచిస్తుంది అతని మెదడు.

మరికొన్ని నిమిషాలకి....

ఆలోచనలతో అలసిపోయిన అతని మెదడు నిద్రలోకి జారుకుంది.

ం ం ం

ఉలిక్కిపడి లేచింది శుభాంగి.

ఆమె శరీరం వణికిపోతోంది.

చుట్టూ చీకటి.

టేబుల్ లైట్ ఆన్ చేసింది.

ఒక్కసారిగా గదంతా వెలుగు పరుచుకున్నది.

అదే కల....

అదే వ్యక్తి....

అదే విధంగా కలలోకి వచ్చాడు.

అదే విధంగా ప్రవర్తించాడు.

చివరగా "ఇంకా పంధొమ్మిది రోజులే...." అన్నాడు.

ఎవరతను....ఎందుకొస్తోందా కల?

ఒకసారి కల....మరోసారి రావటం అసంభవం. అటువంటిది ఈ కల కొన్ని వందలసార్లు వచ్చింది. తొలిసారి కల వచ్చినప్పుడు ఆ వ్యక్తి అన్నమాట బాగా గుర్తు—

"ఇంకా రెండు సంవత్సరాలే" అక్కడి నుండి ఒక్కొక్కరోజు చొప్పున తగ్గించుకుంటూ వస్తున్నాడు.

ఏం జరగబోతోంది....పంధొమ్మిది రోజుల తరువాత?

ఆ కల వచ్చిన ప్రతిసారి తీవ్ర మానసిక భయానికి గురి అవుతోంది.

ఒంటరితనం వల్ల ఆ భయం మరింత అధికం అవుతోంది.

తనకు ఒంటరితనం పనికిరాదు. తోడు కావాలి.

ఎవరుంటారు తోడుగా?

గౌతమ్ పరిచయం అయినప్పుడు అతను తన జీవితానికి తోడు అయితే బావుంటుంది అని అనిపించింది.

తొలిసారి ఆమెకు అలాంటి ఆలోచన వచ్చింది.

ఏ పురుషుణ్ణి చూసినా అటువంటి యోచన రాలేదు.

కానీ....అతని ప్రవర్తన భరించరానిదిగా వుంది. ప్రతిసారీ "మీరు మౌనిక....మీది బెంగుళూరు కాదు! మీరు అబద్ధం చెబుతున్నారు" అంటాడు. తను దాచిన రహస్యాలు ఏమీ లేవు. తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో పోవటం వాస్తవం. తన మేనమామ దగ్గర ఒక సంవత్సరం పాటు వుండడం, ఆ తరువాత ఆయన చనిపోవడం....అన్నీ నిజాలే. అతను చెప్పే కథకి, తన జీవితానికి ఏమాత్రం పొంతన లేదు. అందువల్ల అతని మాటల్లో అర్థంలేదు అనిపిస్తోంది. ఆ విషయం అతను ప్రస్తావిస్తే భరించరానిదిగా వుంటోంది కానీ....అతనితో స్నేహాన్ని కోరుకుంటుంది ఆమె మనస్సు.

అతని సాంగత్యంలో ఈ ఒంటరితనానికి స్వస్తి చెప్పాలనుకుంది,

అది జరిగేపనేనా!

ఏమో....!

గౌతమ్ పరిచయం అయిన ఆ క్షణం నుండి జరిగిన ప్రతి సంఘటనని ఆమె జ్ఞప్తికి తెచ్చుకుంది.

అతను తన ఇంటికి వచ్చినప్పుడు అమర్యాదగా ప్రవర్తించింది.

తనని ఇంటిలోకయినా రానివ్వకుండా బయటి నుంచే గూర్ఖాచేత వెళ్ళగొట్టించింది.

అది అతని ఆత్మాభిమానం మీద కొట్టిన దెబ్బ....

పాపం....ఎంత ఫీలయి వుంటాడో....



ఆలోచించిన కొద్దీ తిరిగి, అతని మీద అభిమానం, ప్రేమ ఏర్పడసాగాయి.

అతని మీద అభిమానం చిగురు తొడగసాగింది.

రేపు అతనిని ఇంటికి పిలవాలి....క్షమాపణ చెప్పాలి.

తన మానసిక అశాంతి గురించి చెప్పాలి. తన ఒంటరి,దుర్భర జీవితం గురించి చెప్పాలి, అతని ఓదార్పు కావాలి.

అతని అభిమానం పొందాలి.

అతనితో కొత్త జీవితం ప్రారంభించాలి.

ఇలా ఆలోచిస్తున్న ఆమెకు తన ముందున్న సమస్యల మేఘాలన్నీ దూదిపింజల్లా తేలిపోతున్నట్లనిపించింది. హృదయం తేలికైంది.

o o o

సన్నని వాన జల్లులా పడగాసాగాయి షవర్‌లో నుండి వెచ్చని నీటి బిందువులు.

అవి ఆమె కురుల మీద పడి అక్కడి నుండి నుదుటి మీదుగా, అందమైన కళ్ళ మీదుగా, నాసికను తాకుతూ, అందమయిన పలుచని పెదవుల మీద కొద్ది క్షణాలు నిలిచి ఆమె పెదవులను చుంబించి, భుజాల మీదుగా శరీరంలోని అణువణువును ఆర్తిగా తాకుతూ, శరీరం వంపులతో పాటు వంపులు తిరుగుతూ పాదాల మీదుగా క్రిందికి జారి, నీరు కారిపోతున్నాయి.

సూర్యుడు కూడా చూడడానికి నోచుకోని, ఆమె అందమైన శరీర భాగాలను తాకగలిగామన్న ఆనందంతో గలగలా చప్పుడు చేస్తున్నాయి ఆ నీటి బిందువులు.

అంతటి అందమయిన శరీరాన్ని తాకటం తమ భాగ్యం అన్నట్లుగా సంతోషంతో పొంగిపోతూ, ఆ బాత్‌రూమ్ లైట్స్ వెలుగులో మెరిసిపోతున్నాయి.

తెల్లని ఆమె పాదాల రంగు ముందు, పాదాల క్రింద వున్న తెల్లని ఇటాలియన్ మార్బుల్స్ వెలవెలబోతున్నాయి.

వేడి నీటి నుంచి వెలువడిన ఆ ఆవిరి బాత్‌రూమ్ నిండా వ్యాపించి ఆమె స్టీమ్‌బాత్ చేస్తోందేమో అనిపిస్తోంది.

ఆమె స్నానం పూర్తి అయ్యింది.

శరీరాన్ని టర్కీ టవల్‌తో సున్నితంగా తుడుచుకోసాగింది.

మరో అరగంటలో గౌతమ్ వస్తాడు. అతనితో కలిసి డిన్నర్ చేయాలి. అతను వచ్చాక ఇష్టమైన పదార్థాలు ఏమిటో తెలుసుకోవాలి. అవి తనే స్వయంగా వండి పెట్టాలి. అతని రియాక్షన్ చూడాలి.

ఆమె మెదడులో ఎన్నెన్నో ఆలోచనలు.

టవల్ శరీరానికి చుట్టుకుని తన రూమ్‌లోకి వచ్చింది.

తన కిష్టమయిన గంధం రంగు చీర, మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది.

ఫేస్‌కి సింపుల్ ఫౌండేషన్, రోజ్ అప్లయ్ చేసింది ఐ షాడోస్, ఐ లైనర్....లిప్‌గ్లాస్....వేసుకుంది. డ్రయర్‌తో హెయిర్ డ్రై చేసుకోసాగింది.

ఇంతలో బెల్ మోగింది.

అంటే....గౌతమ్ వచ్చేసాడు.

ఎందుకో ఆ క్షణాన ఆమె మనస్సు తేలికయి పోయినట్లనిపించింది.

త్వరత్వరగా వచ్చి డోరు ఓపెన్ చేసింది.

ఎదురుగా నిలబడి వున్నాడు గౌతమ్.

"వెల్‌కం....మిష్టర్ గౌతమ్" అంది ఒకింత ఆనందంగా ప్రక్కకు జరుగుతూ.

లోపలికి వచ్చాడు అతను.

మొదటిసారి అతను ఆ ఇంట్లోకి రావటం.

ఆమెను నఖశిఖ పర్యంతం ఒకింత పరిశీలనగా చూశాడు.

"షి ఈజ్ బ్యూటిఫుల్" అనుకున్నాడు మనస్సులో.

వచ్చి సోఫాలో కూర్చున్నాడు.



ఈజిప్షియన్ ఫినిష్ ఉడెన్ సోఫా అది.

అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది.

ఆమెను ఎలా అప్రోచ్ అవ్వాలి? కేస్ ఎలా సాల్వ్ చెయ్యాలని సతమతం అవుతున్నాడు. అటువంటి సమయంలో శుభాంగి తనకు ఫోను చేయటం, యింటికి రమ్మనటం.........నమ్మలేని నిజంలా అనిపిస్తోంది.

ఆమెను ఆమె ఇంట్లోనే కలవాలన్న ప్లాన్ ఈరోజు తీరుతోంది.

ఎందుకంటే... తన కేస్‌కి కావలసిన ముఖ్యమైన క్లూలు ఏవయినా ఇక్కడ దొరకవచ్చు. జైసింగ్ షకావత్ తాలూకు ఫోటోలు కానీ, వేరే ఇతర గుర్తులు కానీ దొరికితే....తన ఇన్వెస్టిగేషన్ సులభం అవుతుంది. అందుకే అతను వచ్చాడు.

"ఎలా వుంది నా ఇల్లు?" అడిగిందామె.

"జెస్ట్ ఫెంటాస్టిక్" చుట్టూ కలయచూస్తూ అన్నాడు.

చాలా ఆర్టిస్టిక్‌గా అరేంజ్ చేసి వున్నాయి అక్కడున్న ప్రతి వస్తువు.

ఈసారి ఏమాత్రం మౌనిక గురించి మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాడు. తను వీలయినంత తక్కువగా మాట్లాడాలనుకున్నాడు.

ఆమెనే ఎక్కువగా మాట్లాడనివ్వాలని కూడా అనుకున్నాడు.

"అయామ్ వెరీ సారీ...క్రిందటిసారి మీరు వచ్చినప్పుడు మిమ్మల్ని బాధపెట్టేలా ప్రవర్తించాను" మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పింది శుభాంగి.

ఏమీ మాట్లాడలేదు గౌతమ్.

"మీరంటే నాకు ఏ విధమైన వ్యతిరేకతా లేదు. ఆరోజు నా ప్రవర్తనకి కారణం నా మానసిక స్థితి. అప్పుడప్పుడు తీవ్రమయిన మానసిక వత్తిడికి లోనవుతుంటాను. అలాంటప్పుడు ఏం చేస్తుంటానో, ఎలా వుంటానో నాకే తెలియదు. ఒంటరితనం నా అశాంతికి కారణం. ఈ ఒంటరితనాన్ని వదులుకోగలిగితే నేను మామూలు అవుతాను"

మౌనంగా వింటున్నాడు గౌతమ్. ఆమె మాట్లాడే ప్రతి మాటను

జాగ్రత్తగా ఫాలో అవుతున్నాడు ఎక్కడయినా ఆమె గత జీవితం తాలూకు ఛాయలు దొరుకుతాయేమోనని.

"మీరు సైలెంట్‌గా వున్నారు. నా మాటలు మీకు బోర్ కొట్టిస్తున్నాయా?" సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ ఆమె అడిగిన ప్రశ్నకు అతను ఒకింత సర్దుకుని "నోనో....అదేం లేదు. చెప్పండి" అన్నాడు ఆమె సంభాషణలో పాలుపంచుకునే ప్రయత్నం చేస్తూ.

"మీరు పెయింటింగ్స్ ఎక్కడ చేస్తారు?....ఐ మీన్ ఏదయినా రూమ్ వుందా?" అడిగాడు.

"ఉంది....ఏం....డూ యూ వాంట్ టూ సీ"

అవునన్నట్లు తల ఊపాడతను.

"రండి. మా ఇల్లు అంతా చూడొచ్చు" అంటూ వరుసగా ఒక్కొక్క గదే చూపసాగింది.

"ఇది నా బెడ్ రూమ్....ఇది కిచెన్....ఇది...."

వరుసగా గదులన్నీ దాటుకుంటూ నడుస్తున్నారు ఇద్దరూ.

ప్రతి గదిలోకి పరీక్షగా చూస్తున్నాడు గౌతమ్, ఏమయినా వస్తువులు కనిపిస్తాయేమోనని.

చివరగా ఒక గది దగ్గరకు తీసుకువెళ్ళింది. దాని డోరు క్లోజ్ చేసి వుంది.

"దిస్ ఈజ్ ఆర్టిస్ట్స్ డెన్....రండి లోపలికి" అంది డోరు ఓపెన్ చేస్తూ.

ఆ గదిలోకి వెళగానే లైట్ ఆన్ చేసింది.

చీకటిగా వున్న ఆ గదిలో ఒక్కసారిగా వెలుతురు పరుచుకుంది.

అదొక విశాలమైన హాల్.

గోడలకి ఏడెనిమిది పెయింటింగ్స్ పెట్టి వున్నాయి.

ఒక ప్రక్కగా రకరకాల సైజుల కాన్వాసులు, ఫ్రేమ్‌లకి బిగించి వున్నాయి.

ఒక పెద్ద టేబుల్ మీద డెభ్భై, ఎనభై వరకు రంగుల సీసాలు,



డబ్బాలు, రకరకాల సైజుల పెయింట్ బ్రష్‌లు, గోడకి వున్న ఒక షెల్ఫ్ నిండా కొన్ని వందల ఆర్ట్ బుక్స్ వున్నాయి.

"ఇదంతే నా ప్రపంచం" అంది.

గదంతా చుట్టూ కలియచూస్తున్న అతని దృష్టి రూమ్ కార్నర్‌లో వున్న ఒక పెయింటింగ్ మీద నిలిచిపోయాయి.

"ఫెంటాస్టిక్" అప్రయత్నంగా పలికాయి అతని పెదవులు.

అతను చూసిన వైపుగా చూసింది ఆమె.

అదొక అద్భుతమయిన పెయింటింగ్. ఒక అమ్మాయి చిత్రమది.

పలుచని చీరలో, ఒక కాలు మోకాలు దగ్గర కొంచెం మడిచి వయ్యారంగా గడ్డిలో పడుకొని వున్నట్లుందా పెయింటింగ్.

ఆమె ఎవరో కాదు....శుభాంగి.

కళ్ళు చెదిరే సౌందర్యంతో కనిపిస్తోంది ఆమె.

"అరె....అది మీ పెయింటింగ్....ఐ మీన్....ఆ పెయింటింగ్‌లో వున్నది మీరే....చిత్రించింది మీరేనా?" సంభ్రమంతో అడిగాడు.

అవునన్నట్లు తల వూపింది ఆమె.

"బట్....ఎలా సాధ్యం?"

"సింపుల్....నేను బెడ్‌మీద ఆ భంగిమలో పడుకొని కెమెరాని స్టాండ్‌కి ఫిక్స్ చేసి సెల్ఫ్ టైమర్‌తో నా ఫోటోని నేనే తీసుకున్నాను. దానిని రిఫరెన్స్‌గా తీసుకుని, బెడ్ వుండవలసిన స్థానంలో గడ్డిలో పడుకొని వున్నట్లుగా చిత్రించాను. సో ఇటీజ్ ఎ సెల్ఫ్ పోర్ట్రెయిట్. ఎలా వుంది అది?"

అతని కళ్ళు పెద్దవి అయ్యాయి. శుభాంగిని, ఆ పెయింటింగ్‌ని నాలుగుసార్లు మార్చి మార్చి చూసాడు. ముమ్మూర్తులా ఆమే పడుకొని వున్నంత సజీవంగా వుంది అది. శరీరం షేప్‌కి చాలా ప్రాధాన్యత ఇస్తూ చిత్రించిన చిత్రమది.

"లవ్లీ ...మార్వలెస్, షేప్ టెర్రిఫిక్....జస్ట్ థర్టీసిక్స్—ట్వెంటీఫోర్—థర్టీసిక్స్....అద్భుతం" (థర్టీసిక్స్—ట్వెంటీఫోర్—థర్టీసిక్స్ అనేవి అందమయిన స్త్రీ శరీర ఆకృతి కొలతలు. అంత ఖచ్చితమయిన శరీర సౌష్టవపు కొలతలు వున్న స్త్రీలు అరుదు. అలా వున్న స్త్రీలనే అందాల పోటీలలో ఎంపిక చేస్తారు) అన్నాడు గొణుగుతున్నట్లుగా.

"ఏమిటి అన్నారు?" అడిగిందామె.

"యస....ఇటీజ్ పెర్‌ఫెక్ట్. థర్టీసిక్స్—ట్వెంటీఫోర్-థర్టీసిక్స్" ఆనందంగా అన్నాడు.

అతని ఉద్దేశంలో అలా మాట్లాడడంలో తప్పులేదన్న భావం ప్రతిబింబిస్తుంది.

ఒక్కసారిగా ఆమె ముఖంలో రంగులు మారాయి.

"రండి హాలులో కూర్చుందాం" అంది ముక్తసరిగా.

అంతవరకు ఆందంగా నవ్వుతున్న ఆమె వదనం ఒక్కసారిగా ఎందుకు గంభీరంగా మారిందో అర్థం కాలేదు గౌతమ్‌కి. అంతలోనే ఆ క్రిందటి రోజు జరిగిన సంఘటన గుర్తు వచ్చింది.

**36—24—36** అని ఆ యాడ్ ఏజెన్సీ వ్యక్తి అన్నందుకు అతని చెంప పగలకొట్టింది. దాంతో నాలుక కరుచుకున్నాడు.

తనూ ఆ మాట అనగానే ఆమె వదనం గంభీరంగా మారిపోయింది.

కారణం ఏమయివుండవచ్చు?

ఆయినా ఆ మాటలో తప్పేముంది?

ఇద్దరు వచ్చి హాల్లో కూర్చున్నారు.

ఆమె గంభీర ముద్రలో మార్పు లేదు.

ఒక్కసారిగా ఆమె అలా అయ్యేసరికి ఏం చేయాలో పాలుపోలేదు గౌతమ్‌కి.

ఒకింత ఇబ్బందిగా కదిలాడు.



"మీ హాబీస్ ఏమిటి?" అక్కడి వాతావరణాన్ని మార్చడానికి ప్రయత్నించుతూ అన్నాడు.

"ఏమీ లేవు" తుంచినట్లుగా అంది.

తెల్లబోయాడు ఆ సమాధానానికి. సర్దుకుని "ఇంకా ఏమిటి విశేషాలు చెప్పండి" అన్నాడు.

అమె సైలెంట్‌గా కూర్చుంది.

తల తిరిగినట్లయింది గౌతమ్‌కి.

ఏమిటి ఈ మనిషి?....ఈ క్షణం వరకు ఆనందంతో వున్న వ్యక్తి హఠాత్తుగా సీరియస్ అయిపోయింది?

ఆమెను బాధపెట్టే విధంగా కూడా తనేమీ మాట్లాడలేదు. మరి ఆమె మూడ్ ఎందుకు మారిపోయింది?

శుభాంగికి ఏమయినా పిచ్చి వుందా అన్న అనుమానం వచ్చింది అతనికి.

పది నిమిషాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యం ఏలింది.

ఏమీ మాట్లాడకుండా తల దించుకుని కూర్చున్న ఆమెతో ఇంకేం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇంక అక్కడ ఒక్కక్షణం గడపడం కూడా దుర్భరం అనిపించింది.

అందుకే సోఫాలోంచి లేచాడు.

"నేను వెళతానండి. టైము ఎనిమిది అవుతోంది కదా! బాగా చీకటి కూడా పడింది" అన్నాడు, ఆమె ముఖంలోని రియాక్షన్‌ని చదవటానికి ప్రయత్నిస్తూ.

"మంచిది" అంది పొడిగా.

అదిరిపడ్డాడు గౌతమ్. డిన్నర్‌కి రమ్మంది. చాలా విషయాలు మాట్లాడాలంది. నాలుగైదు గంటలయినా తనతో గడపాలంది. ఇంటికి రాకపోతే నా మీద ఒట్టే అంటూ ఒక రోజులో ఐదుసార్లు ఫోన్ చేసిన మనిషికి ఇంతలోనే ఏమొచ్చింది?

ఆ క్షణంలో ఆమె అంటే విముఖత ఏర్పడింది.

"వస్తా....మీ ఆతిథ్యానికి చాలా థాంక్స్" అన్నాడు వ్యంగ్యంగా, కక్షగా.

మాట్లాడలేదామె.

సీరియస్‌గా సోఫాలోంచి లేచి డోరు తెరిచి బయటికి వెళ్ళి విసురుగా తిరిగి డోరు క్లోజ్ చేసాడు.

"ధనా" మన్న శబ్దంతో మూసుకుంది డోరు.

ఆ శబ్దానికి నేల అదిరింది.

ఆమె పరుగులాంటి నడకతో తన గదిలోకి వెళ్ళి తిన్నగా బెడ్ మీద వాలిపోయింది.

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

ఆమె మానసిక స్థితి తిరిగి అల్లకల్లోలం అయింది.

థర్టీసిక్స్—ట్వంటీఫోర్—థర్టీసిక్స్—అవే మాటలు....
అవే మాటలు
తాను అసహ్యించుకునే మాటలు....
తనకు కంపరం కలిగించే మాటలు....
శరీరం జలదరించే మాటలు అవి.

० ० ०

పేవ్‌మెంట్ మీద నడకసాగించాడు గౌతమ్.

కోట్ జేబుల్లో రెండు చేతులు వుంచుకొని తల వంచుకుని నడుస్తున్నాడు. అతడి మూడ్ అంతా పాడయింది.

"ఛ....ఏమిటీ మనిషి? ఎందుకలా ప్రవర్తిస్తోంది? అంతవరకు తనతో మామూలుగా ప్రవర్తించిన ఆమె అంతలోనే అలా ఎందుకయింది?

థర్టీసిక్స్—ట్వంటీఫోర్—థర్టీసిక్స్ అన్న మాటల్లో తప్పేముంది?

ఆ మాటల్లో ఆమెకు వేరే అర్థం ఏమైనా గోచరించుతోందా?

ముఖం మీద పడుతున్న జుట్టు వెనక్కి తోసుకున్నాడు. సిగరెట్ కోసం జేబు తడుముకున్న అతనికి ఖాళీ పెట్టె కనిపించింది. దానిని నేల మీద విసిరి, నాలుగు అడుగులు వేసి ఒక షాప్‌లో ట్రిబుల్ ఫైవ్ ప్యాక్ ఒకటి కొని అందులోని సిగరెట్ తీసి వెలిగిస్తూ తల తిప్పాడు.



రోడ్‌కు అవతలివైపున నిలబడి తనవేపే చూస్తున్నాడు ఓ వ్యక్తి.

గౌతమ్ అతని వైపు చూడగానే తడబాటుగా తల తిప్పుకున్నాడు.

ఎందుకో అనుమానం వచ్చింది.

యాభై గజాల దూరం నడిచి, క్రీగంట వెనక్కి చూశాడు.

ఆ వ్యక్తి తననే ఫాలో అవుతున్నాడు.

బలంగా, ఎత్తుగా వున్నాడు.

ఎవరతను?....రకరకాలుగా ఆలోచిస్తోంది అతని మెదడు.

అతను తననే ఫాలో అవుతున్నాడో లేదో చూద్దామని ఎదురుగా వున్న సందులోకి దూరాడు.

అక్కడ ఇంపోర్టెడ్ వస్తువులు అమ్మే షాప్స్ చాలా వున్నాయి.

ఒక షాప్‌లోకి వెళ్ళాడు, షేవింగ్ క్రీం కొన్నాడు. మరో షాప్‌లోకి వెళ్ళి ఆడియో కేసెట్స్ కొన్నాడు. మరో షాప్‌లో సాక్స్ కొన్నాడు. బయటికి వచ్చి చూచిన గౌతమ్‌కి ఆ వ్యక్తి అక్కడే కనిపించాడు.

గౌతమ్ అతనిని చూడగానే చటుక్కున తల తిప్పి ఇటూ అటూ చూడసాగాడు.

బయటికి వచ్చి కొద్ది గజాలు నడిచి ఎదురుగా కనిపించిన బార్‌లో దూరాడు. ఆకలికి కడుపులో పేగులు మెలి తిరిగినట్లు అనిపిస్తోంది.

చికెన్ ఫ్రైడ్ రైస్, జింజర్ చికెన్ ఆర్డర్ చేసాడు.

కడుపునిండా తిన్నాడు. బార్‌లో సమయం గంటపైగా గడిపాడు.

టైము పదవుతోంది.

"ఆ వ్యక్తి సహనం నశిస్తే వెళిపోయి ఉంటాడు.లేకపోతే బయటే ఎదురు చూస్తుంటాడు" అనుకున్నాడు.

బిల్ పే చేసి డోరు తీసుకుని బయటికి వచ్చిన అతనికి కార్ పార్కింగ్‌కి అవతలగా నిలబడి వున్న వ్యక్తి కనిపించాడు.

"ఇంక దాగుడుమూతలు అనవసరం. ఇతనెవరో, ఎందుకు ఫాలో అవుతున్నాడో తేల్చుకోవాలి"

రోడ్ల మీద ట్రాఫిక్ తగ్గిపోయింది.

చిరాగ్ అలీ లేన్ వైపు నడక సాగించాడు గౌతమ్.

గౌతమ్‌కి ఓ ముప్పై గజాల దూరంలో అతను కూడా నడవ సాగాడు.

దాదాపు నిర్మానుష్యంగా వుందా వీధి.

తనని చంపడం ఆ వ్యక్తి ఉద్దేశ్యం కాదు కదా!....అన్న అనుమానం వచ్చింది.

ఏం చెయ్యాలి?... ముందుగా తనే ఎటాక్ చేస్తే!

ఆ సందు మలుపులో ఒక బిల్డింగ్ కనిపించింది. అది కన్‌స్ట్రక్షన్ ఇంకా పూర్తి కాలేదు. అందువల్ల లైట్స్ ఏమీలేక కొంచెం చీకటిగా వుంది.

కన్‌స్ట్రక్షన్ తాలూకు కొన్ని డ్రమ్స్ అవీ రోడ్డు ప్రక్కన పెట్టి ఉన్నాయి.

వడివడిగా అడుగులు వేసి సందు మలుపు తిరిగి, వెంటనే వెనక్కి టర్న్ అయి ఆ డ్రమ్స్ వెనుకగా నక్కి కూర్చున్నాడు గౌతమ్.

కొద్ది క్షణాల తరువాత ఆ ప్రదేశాన్ని చేరుకున్నాడావ్యక్తి.

చుట్టూ కలియచూసాడు అతనికి గౌతమ్ కనపడలేదు. అదే క్షణంలో అతని దృష్టి అక్కడున్న డ్రమ్స్ మీద పడింది. అతని చేయి పేంట్ జేబులోకి వెళ్ళింది. మరుక్షణం నల్లని రివాల్వర్ అతని చేతిలో ప్రత్యక్షమయ్యింది.

చీకటిలో మసకగా కనపడుతోందా రివాల్వర్. అతని చేతి వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంది. ఒక్క సెకను గడిచింది.

మసక వెలుతురులో మెరుస్తున్నాయి రెండు కళ్ళు.



డ్రమ్ వెనుకగా కనుపిస్తున్నాయి ఆ కళ్ళు.

వాటివంక పరీక్షగా చూశాడా వ్యక్తి.

అక్కడ గౌతమ్ వున్నాడన్న విషయం అతనికి అర్థమయింది.

అయితే.... అతన్ని సమీపించడం ఎలా? గౌతమ్ చేతిలో కూడా రివాల్వర్ వుంటే....

గౌతమ్ డ్రమ్ వెనక దాక్కొని వున్నాడు కాబట్టి అతనికి కాల్చడం చాలా తేలిక. తనకి చాలా కష్టం అవుతుంది.

తను నిలబడి వుండడం కూడా మంచిది కాదన్న విషయాన్ని వెంటనే గ్రహించాడు. చటుక్కున నేలమీదకు వంగి మోకాళ్ళమీద పాక సాగాడు.

డ్రమ్ వెనుక మెరిసిన ఆ రెండు కళ్ళు మాయం అయ్యాయి

క్రింద ఆ రకంగా ప్రాకటం కూడా కష్టంగానే వుంది. కారణం.... నేలంతా కంకరాళ్ళు, కర్రలు, ఇనుప మేకుల లాంటి చాలా వస్తువులున్నాయి.

డ్రమ్ వెనుక కనిపించిన ఆ రెండు కళ్ళు హఠాత్తుగా మాయమయ్యాయి అంటే.... గౌతమ్ ఎక్కడున్నట్లు?

నిశితంగా చుట్టూ కలయ చూశాడు.

గౌతమ్ కనిపించలేదు.

అక్కడున్న పది, పదిహేను డ్రమ్స్ వెనక ఎక్కడయినా అతను దాక్కొని వుండవచ్చు అనుకుంటున్న సమయంలోనే అతనికి ఎడమ వైపున వున్న నాలుగో డ్రమ్ వెనకనుండి చిన్న శబ్దం అయింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా మెల్లిగా పాములా పాకాడు.

ఆ డ్రమ్‌ని సమీపించాడు.

నిశ్శబ్దం.

అతని వేలు ట్రిగ్గర్‌మీద బిగుసుకుంది.

నాలుగు అంగుళాలు ముందుకు పాకి డ్రమ్‌కి అవతలి వైపుకి తొంగి చూసి అదరిపడ్డాడు.

కారణం.

డ్రమ్ వెనుకనే నక్కి కూర్చుని తనవైపే కన్నార్పకుండా చూస్తోంది ఓ పిల్లి. అంటే ఇంతసేపూ తను వెంటాడింది పిల్లినా! ఆకళ్ళు పిల్లివా?.... గౌతమ్ కళ్ళు అని భ్రమపడ్డానా!

అయినా మనిషి కళ్ళు చీకట్లో ఎలా మెరుస్తాయి?

అయితే.... గౌతమ్ డ్రమ్స్ వెనకాల లేడా! ముందుకు వెళ్ళిపోయాడా! ఇంతసేపూ తను డ్రమ్ దగ్గర వెతుకుతూ టైం వేస్ట్ చేశానా! ఎంత మోసపోయాను?

అప్పటికి రెండు నిముషాలుగా ఆ వ్యక్తి కదలికను గమనిస్తున్నాడు గౌతమ్. చివరి డ్రమ్ వెనకగా దాక్కొని వున్నాడతను. అదృష్టవశాత్తు అక్కడ ఎక్కువ చీకటిగా వుంది.

అతను వేసుకున్న జెర్కిన్ కూడా పసుపురంగుది అవటంతో ఇంతవరకు ఆ వ్యక్తి కంటపడకుండా కూర్చోగలిగాడు.

గౌతమ్ కూర్చున్న చోటికి వెనుకగా చిన్నబుట్టలో కొన్ని కుళ్ళిపోయిన చేపలున్నాయి. వాటి దుర్గంధం భరించరానిదిగా వుంది. కడుపులో తిప్పుతోంది.

ఆ కుళ్ళిన చేపలకోసం వచ్చింది ఆ పిల్లి.

పిల్లి కదిలిన ప్రతిసారివచ్చిన శబ్దానికి ఆ వ్యక్తి ఎక్కడ చూస్తాడోనని భయపడ్డాడు గౌతమ్.

అతని చేతిలో రివాల్వర్ వుంది.

గౌతమ్ నిరాయుధుడు. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా ఆ రివాల్వర్ నుండి వెలువడే బుల్లెట్ తన తలను రెండుగా చీల్చేస్తుంది.

రెండు క్షణాల నిశ్శబ్దం.

ఆ వ్యక్తి వున్నాడా వెళ్ళిపోయాడా!

సన్నగా చిరుగాలి వీచింది.

ఏవో కాయితాలు గలగలమన్న శబ్దం అయింది.

మెల్లగా మోకాళ్ళమీద పైకి లేచాడు గౌతమ్. డ్రమ్ అంచు మీదుగా అవతలకి చూశాడు.



ఇంకా మోకాళ్ళమీది కూర్చుని ఇటూ అటూ అనుమానంగా చూస్తున్నాడా వ్యక్తి.

అతని వీపు గౌతమ్ వైపు వుంది.

ఇదే అవకాశం తీసుకుని అతన్ని వెనుకనుండి ఎటాక్ చేస్తే.... ఆలోచన వచ్చినదే తడవు నిటారుగా నిలబడ్డాడు గౌతమ్.

నేలని తన్ని బంతిలా గాలిలోకి లేచి డ్రమ్ మీదుగా డైవ్ చేశాడు. మరుక్షణం గౌతమ్ రెండు కాళ్ళూ ఆ వ్యక్తి వీపుని బలంగా తాకాయి.

ఆ వ్యక్తి ఊహించలేనంత వేగంగా జరిగిపోయిందది.

అదే క్షణంలో మరో దెబ్బ బలంగా అతని మెడమీద వేశాడు.

కళ్ళముందు నక్షత్రాలు మెరిసాయి ఆ వ్యక్తికి. కిక్కురుమనకుండా పడిపోయాడు.

భుజం పట్టుకుని ఇటుగా తిప్పాడు అతన్ని.

నిశ్చలంగా పడిపోయి వున్నాడు.

రెండు చేతులూ పట్టుకుని లైట్‌కి దగ్గరలోకి లాక్కు వెళ్ళాడు గౌతమ్.

ఆ సందులోకి ఏదో వాహనం వస్తున్న శబ్దం అయి చటుక్కున పక్కకి తప్పుకున్నాడు.

రెండు స్కూటర్లు వెళ్ళాయి.

ఎందుకయినా మంచిదని లైటుకి అటువైపున వున్న గోడ ప్రక్కకి లాక్కుపోయాడు అతన్ని.

ఇంక వాళ్ళిద్దరూ రోడ్డుమీదపోయే వ్యక్తులకి కనపడరు.

అతను స్పృహతప్పిన ప్రదేశంలో రివాల్వర్ పడిపోయి వుంది. అక్కడికి వెళ్ళి దానిని చేతిలోకి అందుకున్నాడు.

జపాన్ మేడ్, ఆటోమేటిక్ 7 ఎం.ఎం. గన్ అది. ముందు సైలెన్సర్ అమర్చి వుంది.

మాగజైన్ ఓపెన్ చేశాడు. నాలుగు బుల్లెట్లు వున్నాయి. తిరిగి క్లోజ్ చేశాడు. ఆ వ్యక్తిని సమీపించాడు మళ్ళీ.

రెండు జేబులు వున్న కాటన్ షర్టు ధరించి వున్నాడతను. ఒక పాకెట్‌లో రెండు వంద రూపాయల నోట్లు. ఒక పది రూపాయల నోటు, ఒక రెండు రూపాయి నోటు వున్నాయి.

మరో జేబులో ఒక ప్లాస్టిక్ టూట్ పిక్ (పంటి మధ్య ఇరుక్కున్న పదార్థాలు తీసేందుకు ఉపయోగించే పుల్ల, ఒక వక్కపొడి ప్యాకెట్, ఐదు లీటర్ల పెట్రోలు బిల్లు వున్నాయి. ప్యాంట్ జేబులో కర్చీఫ్, మరో జేబులో ఒక పాకెట్ సైజ్ దువ్వెన,.... ఒక బాల్‌పెన్, ఒక తాళం చెవుల గుత్తి వున్నాయి.

విజిటింగ్ కార్డ్సుకానీ, డ్రైవింగ్ లైసెన్స్ కానీ, రివాల్వర్ తాలూకు లైసెన్స్ కానీ ఏదీ లేదు. ఆ వ్యక్తి ఊరు, పేరు తెలిపే ఛాన్స్ ఏ మాత్రం దొరకలేదు.

ఆ వ్యక్తి ఎవరో, ఎందుకు తనని ఫాలో అవుతున్నాడో తెలుసుకోవాలి అనుకున్నాడు.

చెంపలమీద అటూ ఇటూ తట్టినట్లుగా కొట్టాడు. అతనిలో చలనంలేదు. బలంగా నాలుగుసార్లు లాగి కొట్టాడు.

కళ్ళు తెరిచాడా వ్యక్తి. తల దిమ్మెక్కినట్లుంది. రెండు అరచేతులతో తలను పట్టుకుని లేవబోయాడు.

అతనికి లేచే ఛాన్స్ ఇవ్వలేదు గౌతమ్.

తాపీగా అతని గుండెలమీద కూర్చుని రివాల్వర్‌ను ఆ వ్యక్తి కుడి కంటిమీద వుంచాడు.

"ఎవరు నువ్వు" గుసగుసలాడినట్లు అడిగాడు.

గట్టిగా అడగటానికి ఆస్కారంలేదు. ఏమాత్రం గట్టిగా మాట్లాడినా రోడ్డుమీద వచ్చే పొయ్యేవాళ్ళ అటెన్షన్‌ని డ్రా చెయ్యటమే అవుతుంది.

సమాధానం చెప్పలేదతను.

లాగి చెంపమీద ఛెళ్ళుమని చరిచాడు.



ఉలిక్కిపడ్డాడతను.

"చెప్పు.... ఎవరు నువ్వు?"

"ఎవరేమిటి— నేను.... నేనే.... నేను ఎవరని చెబితే మాత్రం నీ కర్థమవుతుంది"

"తెలివిగా మాట్లాడకు.... చస్తావ్" రివాల్వర్ నాబ్‌ని కంటి గుడ్డుకి ఆనించాడు గౌతమ్.

"ఎవరు పంపారు నిన్ను?"

"ఎవరూ పంపలేదు"

"నీకు బాస్ ఎవరు?"

"నాకు ఎవరూ బాస్‌లు లేరు. నాకు నేనే బాస్" అతని గొంతు కీచుగా వుంది. అతని గుండెల మీద గౌతమ్ కూర్చున్నందువల్ల మాట అలా వస్తోందా, అతని మాట తీరే అలా వుంటుందో తెలియదు.

"నీకు చావు దగ్గరపడింది. అందుకే నిజాలు దాస్తున్నావు" రివాల్వర్‌ని కంటిమీద బలంగా అదిమాడు.

అతని కంటి నుంచి నీరు కారసాగింది.

"ఎవరూ పంపలేదంటున్నావు. మరి నన్ను ఎందుకు వెంటాడుతున్నావ్?"

"నేనేమీ నిన్ను వెంటాడటంలేదు. నిన్ను చంపే ఉద్దేశ్యం నాకు లేదు"

"అబద్దం. సుమారు రెండుగంటలుగా చూస్తున్నాను. నేనుబార్‌లోకి వెళ్ళి వచ్చేవరకు కూడా నువ్వు నా కోసం బయట ఎదురు చూశావు. తరువాత మళ్ళీ నా వెనకాలే వచ్చావు. నేనీ డ్రమ్స్ వెనకాల దాక్కోగానే నువ్వూ ఇక్కడికి వచ్చావు. దీనిని వెంటాడటం అంటారా, ఇంకేమైనా అంటారా."

మాట్లాడలేదు అతను.

రివాల్వర్ బట్‌తో ఫెడీమని అతని మూతిమీద కొట్టాడు. పెదవి

చిట్లి రక్తం బడబడా కారింది. లోపలి పళ్ళు అన్నీ కదిలినట్లు అనిపించింది అతనికి.

బాధతో విలవిలలాడిపోయాడు.

"నిజం చెప్పు? ఎందుకు వెంటాడుతున్నావు?"

"నీదగ్గరవున్న డబ్బు దోచుకుందామని"

"అబద్ధం"

"కాదు....ఇదే నిజం. నువ్వు చూడటానికి చాలా ధనవంతుడిలాగ కనిపిస్తున్నావు. అందుకే నీదగ్గర ఏమయినా డబ్బు దొరుకుతుందేమో అని వెంటాడుతున్నాను"

"షటప్"

"నమ్మితే నమ్ము....లేకుంటే లేదు" ఖచ్చితంగా అన్నాడు అతను.

ఆ వ్యక్తి చిన్నదొంగ మాత్రం కాదు. ఎందుకంటే కన్ను గుడ్డును తాకుతూ గన్ వుంటే ఎటువంటి దొంగ నోటి నుంచి అయినా నిజాలు వస్తాయి, బట్....ఇతనెవరో ఈ వృత్తిలో ప్రొఫెషనల్ .... అందుకే కొంచెంకూడా చలించటంలేదు అనుకున్నాడు.

అదే మాట అన్నాడు. "నువ్వు దొంగతనం కోసం నా వెంట పడుతున్నావంటే నమ్మేటంత ఫూల్‌ని కాను"

మాట్లాడలేదు అతను.

ఉలుకూ పలుకూ లేకుండా పడివున్న అతన్ని చూస్తే ఒళ్ళు మండిపోయింది ఫెడీమని ముక్కు మీద గుద్దాడు.

కెవ్వుమని అరవబోయి పళ్ళు బిగువున బాధను ఆపుకున్నాడు అతను. ముక్కునుండి చుక్కలు చుక్కలుగా రక్తం పెదవుల మీదకు కారింది.

మూడే అంకెలు లెక్క పెడతాను....ఈ లోపుగా నిజం చెప్పావా బతుకుతావ్ లేకుంటే నీ మెదడు ముక్కలుఅయిపడుతుంది" కర్కశంగా పళ్ళు కొరుకుతున్నాడు.

నువ్వునన్ను చంపవు" స్థిరంగా అన్నాడు.



"ఏమిటా నమ్మకం?"

"చంపే వాడివయితే ఆ పని ఎప్పుడో చేసేవాడివి. ఇంతసేపు భయపెడుతూ కూర్చోవు"

కంటి గుడ్డుమీద రివాల్వర్ వుండగా కూడా అంత ధైర్యంగా మాట్లాడుతున్న అతన్ని చూసి ఆశ్చర్యంవేసింది.

"రైట్... నిన్ను చంపను....కానీ నీ బాస్‌కిచెప్పు....ఇలాఅనుక్షణం నన్ను ఛేజ్ చేసినా సహనం అంతు చూడొద్దని. నా నుంచి మీకు ఏం కావాలో దమ్ముంటే స్పష్టంగా చెప్పమను....మీరంతా చచ్చుదద్దమ్మల్లా వున్నారు. అందుకే నా వెనకాల చీకట్లో తిరుగుతున్నారు. అంత పనికిరాని, పిరికి సన్నాసులని నేనెక్కడా చూడలేదు. ఛీ...." ఈసడింపుగా అని లేచి ఫెడీమని అతని డొక్కలో తన్ని రివాల్వర్‌ని తన కోట్ జేబులోకి తోసి అక్కడి నుంచి నడుచుకుంటూ పోయాడు.

ఆ వ్యక్తి వెళ్ళిపోతున్న గౌతమ్ మీద తిరగబడే ప్రయత్నం చేయలేదు. ముక్కు నుండి కారుతున్న రక్తం తుడుచుకుంటూ అలాగే వుండిపోయాడు.

* * *

బెడ్‌లైట్ వెలుతురులో గది సీలింగ్ వైపు కన్నార్పకుండా చూస్తోంది శుభాంగి. అప్పటికి అరగంట నుండి ఆమె బెడ్‌మీద అలానే వెల్లకిలాపడుకొని వుంది.

ఆమె కంటి నుండి నీరు జారి పిల్లోమీద పడి ఇంకిపోతుంది.

థర్టీ సిక్స్—ట్వంటీఫోర్—థర్టీసిక్స్

అనే మాటలు....చెవులలో మారుమ్రోగుతున్నాయి.

అవి ఆమె భయపడే మాటలు....అసహ్యించుకునే మాటలు.

చివరికి గౌతమ్ కూడా అన్నాడు అవే.

అతని నోటి నుండి ఆ మాటలు వెలువడిన మరుక్షణం అతని ముఖం చూడాలంటేనే అసహ్యం వేసింది.

ఇంకా అతనితో మాట్లాడలేకపోయింది.

తన మానసిక అశాంతికి స్వస్తి చెప్పడానికి గౌతమ్ తోడు కావాలనుకుంది.

ఎందరో ఆమెను ప్రేమించాలని ప్రయత్నించారు వెంటాడారు.

కానీ....

ఆమె దృష్టిని ఎవరూ ఆకర్షించలేకపోయారు. ఆమె మనస్సు గౌతమ్ విషయంలో మాత్రం ఎదురుతిరిగింది అతనికి లొంగిపొమ్మంటోంది. అతనే జీవిత భాగస్వామి అంటోంది. బట్....అతన్ని రెండోసారి కూడా అవమానపరిచింది.

ఇక గౌతమ్ తన ముఖం చూడటం కూడా అసంభవం.

మెలకువగా వుంటే, జీవితం మీద విరక్తి కలుగుతోంది.

నిద్రపడితే....ఒంటిచేతి వ్యక్తి కలలోకి వస్తున్నాడు.

మెలుకువగా ఉండాలంటే భయం, నిద్రపోవాలన్నా భయమే.

ఆమెకు తలలో నరాలు తెగిపోతున్నట్లనిపించింది టెన్షన్ భరించలేకపోతోంది. నిముషాలు గడిచాయి ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది,

బెడ్ మీద లేచి కూర్చుంది.

మెల్లగా అడుగులు వేస్తూ అల్మారాని సమీపించింది.

అందులోని ఒక బాటిల్ని బయటికి తీసింది అవి నిద్ర మాత్రలు రోజూ నిద్రకోసం వాటిని ఆశ్రయిస్తుంది ఆమె.

బాటిల్ మూత తీసి వాటిని చేతిలో వేసుకుంది.

వాటన్నింటినీ లెక్కపెట్టింది ఇరవై రెండు ఉన్నాయి.

అవి చాలు....నిద్రపోవడానికి శాశ్వతంగా.నిద్రపోవడానికి దుర్భరమైన ఈ జీవితం కంటె....ఈ మానసిక సంక్షోభం కంటె .... అశాంతి కంటె....ఇదే మంచిది.

ఆత్మహత్య....

తృప్తిగా నిద్రపోవచ్చు.

ఫ్రిజ్ వైపు నడిచింది.



డోరు తెరిచి ఒక బాటిల్ నీళ్ళు అందుకుంది. తిరిగివచ్చి బెడ్మీద కూర్చుంది.

అరచేతిలో గట్టిగా తగులుతున్నాయి స్లీపింగ్ పిల్స్.

ఆమె కంటి నుంచి చివరి నీటిబొట్టు జారింది.

ఆమె చేయి నోటిని సమీపించింది.

అప్పుడు టైము....రాత్రి....సరిగ్గా పదకొండూ ఐదు.

♦ ♦ ♦

అసహనంగా బెడ్మీద దొర్లుతున్నాడు గౌతమ్. అతనికి నిద్ర రావటంలేదు. అలాంటి నిద్రరాని రోజులు చాలా అరుదు.

అలసిపోయేవరకు పనిచేయటం....బెడ్మీద పడుకున్న కొద్ది నిముషాల్లోనే నిద్రపోవటం అలవాటు.

అందుకు విరుద్ధంగా ఈ మధ్య రెండు మూడు రోజుల నుంచి నిద్రకి దూరమవుతున్నాడు.

అతనికి ఇక్కడ వింత వింత సంఘటనలు ఎదురవుతున్నాయి.

తనని చంపకుండా, కేవలం అనుక్షణం ఫాలో అయ్యే మనుషులు ...ప్రతి కదలికలను గమనించే మనుషులు....

వాళ్ళకి తననుంచి ఏం కావాలో అర్థంకావటంలేదు.

శుభాంగి....ఆమె తనకొక పజిల్.

ఆమె మాయం అవటం మిస్టరీగానే వుండిపోయింది. ఇప్పుడు ఆమె గడిపే జీవితం కూడా అలాగే వుంది. ప్రవర్తన అగమ్య గోచరం.

ఒకక్షణం చాలా ప్రేమగా మాట్లాడుతుంది ... మరుక్షణంలోనే మూర్ఖురాలిగా వుంటుంది.

ఈ రోజు ఆమె ప్రవర్తన చూసిన తరువాత ఒక నిర్ణయానికి రాగలుగుతున్నాడు గౌతమ్.

ఇలా రెండు మూడు సంఘటనల్లో తనని ఇన్సల్ట్ చేసి, అర్థంకానట్లుగా బిహేవ్ చేస్తే....తను ఈ కేసు ఇన్వెస్టిగేషన్ మానుకోవచ్చు.... ఇదొక తలకాయనొప్పి కేస్ అని అనుకోవచ్చు....అప్పుడతను ఈ కేస్

పరిశోధించడం మానేస్తే ఆమె హాయిగా తన జీవితం గడపవచ్చు అనుకుందేమో! అదే ఆమె ఉద్దేశం ఏమో!

ఆమెలోని ఆ రకమైన ప్రవర్తన అతన్ని రెచ్చగొడుతోంది.

ఏది ఏమయినా ఆమె విషయం తేల్చాలిసిందే....గతం....ఇది.... అని బట్టబయలు చేయాలి. అందుకు ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కోవాల్సిందే అనుకున్నాడు.

అంతలో అతని ఆలోచనకి సుప్రియ వచ్చింది.

ఆమె వ్యక్తిత్వం ఎందుకో బాగా నచ్చింది చాలా మర్యాదగా మాట్లాడుతుంది. షీ ఈజ్ వెరీ డీసెంట్ అండ్ బాలన్స్‌డ్....

ఆమెతో పరిచయం అయిన దగ్గర నుండీ ప్రతి సంఘటనని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

ఆమె భర్త చనిపోయాడని తెలిసినపుడు షాక్ అయ్యాడు ఆమెకు మహా అయితే ఇరవై ఆరేళ్ళు మించి ఉండవు.

అంత చిన్న వయస్సులోనే వైధవ్యం అనుభవించాల్సిన ఆమె జీవితం తల్చుకుంటే ఎవరికైనా గుండె కలుక్కుమనక మానదు.

కొందరి జీవితాల మీద భగవంతుడు అలా చిన్న చూపు ఎందుకు చూస్తాడో....

పూర్ లేడీ....

ఏడు సంవత్సరం క్రిందట చనిపోయిన తన భర్త ఊహల్లోనే ఇంకా జీవిస్తోంది.

ప్రేమ అంటే అదేనంది.

"ప్రేమ" అనే మాటని ఏ మాత్రం నమ్మని గౌతమ్, ఆమె కథ విన్నాక ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఎక్కడో....అతని హృదయాంతరాళాల్లో, ఆమె పట్ల అభిమానం చోటు చేసుకుంది.

ం ం ం

ఆ గదిలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు.

డిమ్‌గా వుంది ఆ గదిలోని లైట్.



ఒకరి ముఖాలు ఒకరికి స్పష్టంగా కనిపించనంతటి డల్ లైట్ అది.

"ఇప్పుడు ఏం చేద్దాం అంటావ్?" అడిగాడు ఆ వ్యక్తి సిగరెట్ పఫ్ లాగుతూ రెండో అతనిని.

అతను చెయిన్ స్మోకర్. అతని చేతివేళ్ళ మధ్య ఉండో సిగరెట్ ఆ గది అప్పటికే సిగరెట్ వాసనతో నిండిపోయింది.

"మనకు ముందు ముందు తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయని నా అనుమానం" చెప్పాడతను.

"మన కదలికలని ఎవరో గమనిస్తున్నారు"

"అవును....మనమీద ఎవరో నిఘా వేశారన్నది వాస్తవం"

"టెలిఫోన్స్‌ని కూడా ఎవరో టాప్ చేస్తున్నారు"

"ఎవరయి ఉండవచ్చు?"

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు అతను.

రెండు అరచేతుల మధ్యలో తలవుంచుకుని మౌనంగా కూర్చుని వున్నాడు ఆ మూడో వ్యక్తి.

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

సిగరెట్ నేలమీద పడవేసి బూటు కాలితో దాన్ని కసిగా తొక్కాడు అతను.

"నా దొక అనుమానం" అన్నాడు.

ముఖానికి రెండు చేతులు అడ్డుతీసి తలెత్తి ఏమిటన్నట్లు చూశాడు మూడో వ్యక్తి.

"మనలోనే డబుల్ క్రాసర్స్ వున్నారని నా అనుమానం"

ఉలిక్కిపడ్డాడు ఆ మాటకి అతను.

"మనలోనా!" పెదవి విప్పాడతను. ఆ పది నిముషాలలోనూ అతను మాట్లాడిన మొదటి మాట అది.

"ఎస్....మనలోనే ఎవరో విషయాలని బయటికి చేరవేస్తున్నారు"

"అంటే మన ముగ్గురిలోనా!" తిరిగి అతనే అడిగాడు.

అవును అన్నట్లు తల వూపాడు మొదటివ్యక్తి.

"నో ....అలా అని నేను అనుకోవడంలేదు" అన్నాడు రెండో వ్యక్తి.

"మనలో అలా ఎందుకు జరుగుతుంది? అసంభవం....నువ్వు అనవసరంగా అనుమాన పడుతున్నావు. ఇలాంటి అనుమానాలవల్ల మనమధ్య స్నేహం చెడిపోవటం తప్ప జరిగేది ఏమీ వుండదు" చెప్పాడు మూడో వ్యక్తి.

"చెడినా ఫరవాలేదు....కానీ ఒకడి వల్ల మిగతా ఇద్దరూ నష్టపోకూడదు"

"అంటే ఏం చేద్దాం అంటావు?" ఒకింత అసహనంగా మారింది మూడో వ్యక్తి కంఠం.

సమాధానం చెప్పలేదు మొదటి వ్యక్తి.

వాళ్ళిద్దరినీ మార్చి మార్చి చూస్తున్నాడు రెండో వ్యక్తి.

కూర్చున్న చైర్‌లో ఒకింత ఇబ్బందిగా కదిలాడు మొదటి వ్యక్తి అతని చేయి జేబులోకి వెళ్ళింది.

చేయి బయటికి రాగానే, చేతిలో నల్లని రివాల్వర్ మెరిసింది.

"రివాల్వర్ ఎందుకు....తీశావ్?" అడిగాడు మూడోవ్యక్తి.

మొదటి వ్యక్తి చేతిలోని రివాల్వర్ ట్రిగ్గర్ లాగాడు.

"టుప్" మని శబ్దం వచ్చింది సైలెన్సర్ అమర్చివున్న ఆ రివాల్వర్ నుంచి. దాని నుంచి రిలీజయిన బులెట్ మూడో వ్యక్తి గొంతులో నుండి దూసుకుపోయింది.

కూర్చున్న చైర్‌లోనే నిశ్శబ్దంగా ప్రక్కకి ఒరిగిపోయాడతను.

జరిగినదేమిటో అర్థంకాక అయోమయంగా చూశాడు రెండోవ్యక్తి

వేడెక్కిన రివాల్వర్ బారల్‌ని టీపాయ్ మీద వున్న గాజు గ్లాసులోని నీళ్ళల్లో ముంచాడు అతను.

చుస్....స్....మన్న శబ్దం వచ్చింది.



కూల్ అయింది రివాల్వర్ నాజిల్.

ం ం ం

నిర్విరామంగా మోగుతోంది ఫోన్.

గాఢనిద్రలో నుండి మెలుకువ వచ్చింది గౌతమ్‌కి.

బెడ్‌మీద కూర్చున్నాడు. బెడ్‌లైట్ వెలుగులో డిమ్‌గా వుంది గది.

ఫోన్ రింగ్ అవుతూనే వుంది.

అప్రయత్నంగా వాచ్‌లో టైమ్ చూసుకున్నాడు.

నాలుగు అవుతోంది.

ఇంతరాత్రివేళ ఫోన్ చేసింది ఎవరా అని ఒక్క క్షణం ఆలోచించి బెడ్ మీదగా అటువైపుకి వంగి చేయి చాపి ఫోన్ అందుకున్నాడు.

"హలో" గాఢనిద్రలోంచి లేవడంవల్ల గొంతు మత్తుగా వచ్చింది.

అవతలి గొంతు విని ఒక్కసారి నిద్రమత్తు వదిలింది.

ఫోన్ చేసింది సుప్రియ.

"అరె....మీరా....ఇంతరాత్రి ఏమయింది?" ఆతృతగా అడిగాడు.

ఆమె సమాధానం విని అదిరిపడ్డాడు గౌతమ్.

"మైగాడ్ మీరు చెప్పేది నిజమా!....ఎప్పుడు జరిగింది?"

"రాత్రి జరిగింది."

"ఎలా జరిగింది?"

"స్లీపింగ్ పిల్స్ తీసుకుంది"

సుప్రియ సమాధానం విని రక్తం గడ్డకట్టుకుపోయింది గౌతమ్‌కి.

"మైగాడ్....అంత దారుణం జరిగిందా, నేను ఇప్పుడే వస్తున్నాను" ఇంకో మాటకి అవకాశం లేకుండా ఫోన్ జారవిడిచాడు.

తల తిరిగిపోతోంది గౌతమ్‌కి.

మరో ఐదు నిముషాలకి అతను ఎక్కిన టాక్సీ హోటల్ బయటికి దూసుకుపోయింది.

ం ం ం

వేగంగా వచ్చి ఆ ఇంటి ముందు ఆగింది టాక్సీ.

టాక్సీఫేర్ పే చేసి క్రిందికిదిగాడు గౌతమ్.

బయట రెండు కార్లు ఆగి వున్నాయి. అందులో ఓ కారు సుప్రియ దిగా గుర్తించాడు.

నిశ్శబ్దంగా వుందా ఇల్లు.

గేటు దగ్గర వుండాల్సిన వాచ్‌మన్ కూడా లేడు.

గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టిన అతని కాళ్ళకి ఆ రోజు న్యూస్‌పేపర్ తగిలింది.

పేపర్ బోయ్ అంతకు ముందే పడవేసి వెళ్ళిపోయి వుంటాడు అనుకున్నాడు.

ఇంకా చీకట్లు విడలేదు.

హాలులోకి ప్రవేశించగానే ఎదురుగా కనిపించింది సుప్రియ.

గౌతమ్ కోసమే ఎదురు చూస్తోందా అన్నట్లుగా లేచి అతని దగ్గరకు వచ్చింది.

"శుభాంగి ఎక్కడ వుంది?" అడిగాడు ఇటు అటూ చూస్తూ.

"మేడమీద గదిలో" చెప్పిందామె.

"ఎలా వుంది కండిషన్"

"కొంతసేపట్లో మామూలు అవ్వచ్చు"

నిజమేనా అన్నట్లుగా చూశాడు.

అతని చూపులోని భావం అర్థమయింది ఆమెకు.

"డాక్టర్ లోపలే వున్నాడు. ఆయనే చెప్పారు"

"మంచి డాక్టరేనా!....ఐమీన్....అనుభవం వున్నవాడేనా!"

"ఉస్మానియా హాస్పిటల్‌లో సీనియర్ మోస్ట్ డాక్టర్ ఆయన. కార్డియాలజిస్ట్....ఇప్పటికి చాలా సంవత్సరాల నుండి శుభాంగికి ఆయనే డాక్టర్."

"కార్డియాలజిస్ట్....ఈ రకమైన కేస్‌కి" అనుమానం వ్యక్తంచేశాడు.

"ఎవరైనా స్పెషలిస్ట్ అయితే మంచిదేమో!"



"దీనికి స్పెషలిస్ట్‌లు ఎందుకు? అయినా ఈ డాక్టరుని మీరు చాలా తక్కువగా అంచనా వేస్తున్నారు."

ఇంకేం మాట్లాడలేదు గౌతమ్.

ఆమెను చూడడం కోసం మెట్లవైపు నడిచాడు.

"డాక్టర్ లోపల వున్నారు. మనం తరువాత చూద్దాం" చెప్పింది సుప్రియ, ఇప్పుడు లోపలికి వెళ్ళితే ఆయన చిరాకు పడతారన్న అర్థం స్ఫురించేలాగ.

ఆమె మాటలోని భావం అర్థం చేసుకుని వెనక్కి తిరిగి సోఫాలో కూర్చున్నాడు. కుడిచేతిని గుప్పిటగా బిగించి కణతల మీద రుద్దుకున్నాడు

రాత్రి నిద్రలేక పోవడంతో కొంచెం తలనొప్పిగా వుంది అతనికి.

గౌతమ్‌నే పరిశీలనగా చూస్తోంది సుప్రియ.

"ఎన్ని టాబ్లెట్స్ తీసుకుని వుండవచ్చు?" తల ఎత్తి అడిగాడు

"ఏమో! తెలియదు"

"మీరు ఆమెను స్లీపింగ్ పిల్స్ ఎలా తీసుకోనిచ్చారు?"

ఆమె స్లీపింగ్ పిల్స్ తీసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేస్తోందని నాకు ఏం తెలుసు?" ఎదురు ప్రశ్నించింది ఆమె.

"మరి....ఆమె స్లీపింగ్ పిల్స్ తీసుకుందని మీకెలా తెలిసింది? రాత్రి మీరు ఇక్కడ లేరా?"

"నేనా!....నేను మా ఇంట్లో వున్నాను"

"మరి ఈ విషయం మీకు ఎవరు చెప్పారు?" మళ్ళీ అడిగాడు.

"వాచ్‌మన్ ఫోన్ చేసి చెప్పాడు"

కొద్ది క్షణాల తరువాత అన్నాడు "జరిగిందేమిటో మీకు తెలిసినంత వరకు చెబుతారా!"

"రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో నాకు ఫోన్ వచ్చింది..... వాచ్‌మన్ మాట్లాడాడు-శుభాంగి అపస్మారక స్థితిలో పడి వుందని, ఏం జరిగిందో అర్థం కావటం లేదు అని. అదే క్షణంలో బయలుదేరి వచ్చాను. అప్పటికే నేల మీద అచేతనంగా పడివుంది ఆమె" సుప్రియ గొంతు జీరపోయింది. కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

కొద్దిసేపు ఏమీ మాట్లాడలేకపోయిందామె.

"వాచ్‌మన్ ఎక్కడున్నాడు?"

ఆమె తేరుకుంది.

"ఏదో మెడిసిన్ కావాలని డాక్టర్ బయటికి పంపించాడు" చెప్పింది

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో ఫోన్ రింగయిందట. ఎంత సేపు రింగ్ అవుతున్నా ఫోన్ ఎత్తటం లేదేమిటా అని వాచ్‌మన్ శుభాంగి రూమ్‌లోకి వచ్చాడట. అతను వచ్చేసరికి ఫోన్ రింగవటం ఆగిపోయిందట. చూసేసరికి నేలమీద పడి వుంది శుభాంగి.

ఆమెకు కొంత దూరంలో స్లీపింగ్‌పిల్స్ బాటిల్ పడి వుందట. రెండు టాబ్లెట్స్ నేల మీద పడివున్నాయట. అప్పుడే నాకు ఫోన్ చేశాడు. నేను వచ్చాక డాక్టరుని పిలిచాము"

"ట్రీట్‌మెంట్ ఏం ఇచ్చారు?"

"డాక్టర్‌రాగానే ఆమె గొంతులోకి ఒక పైప్‌ని వేసి బలవంతంగా ఆ టాబ్లెట్లు అన్నింటినీ కక్కించారు" ఆ దృశ్యం తల్చుకున్న ఆమె ముఖం వికారంగా పెట్టింది.

"ఆమె ఎన్ని టాబ్లెట్లు తీసుకుని వుండవచ్చు?"

"పదిహేను, ఇరవై మధ్య తీసుకుని వుండవచ్చు అన్నాడు డాక్టర్ ఏవో రెండు ఇంజెక్షన్స్ కూడా ఇచ్చారు"

"హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళటం లేదా!"

"అవసరం లేదన్నారు డాక్టర్"

తల ఎత్తి మేడమీది రూమ్‌వైపు చూసి తిరిగి సుప్రియ వైపు తిరిగాడు-

"ఇంతకు ముందు ఎప్పుడయినా శుభాంగి ఇటువంటి ప్రయత్నం చేసిందా!"

"ఏ ప్రయత్నం?"

"ఐ మీన్... ఇలా ఆత్మహత్యచేసుకునే ప్రయత్నాలు ఎప్పుడయినా చేసిందా?"



ఆమె సర్దుకుని కూర్చుంది. ముందుకు జారినట్లున్న బ్యాంగిల్స్‌ని వెనక్కి తోసుకుంది.

"ఇదివరలో....అంటే షుమారు సంవత్సరన్నర క్రిందట ఒక సారి ఇలాగే స్లీపింగ్ పిల్స్ మింగిన కొద్ది నిముషాలకే ఆమెకు తిరిగి బ్రతకాలన్న కోరిక కలిగింది. వెంటనే నాకు ఫోన్ చేసింది. అప్పుడు డాక్టర్ సేవ్ చేశాడు"

ఆమె చెప్పే ప్రతి మాటని కేర్‌ఫుల్‌గా వింటున్నాడు గౌతమ్.

"అప్పుడు ఆమె ఆత్మహత్యాప్రయత్నం చేయటానికి కారణం?"

"ఆమెకు తరచుగా ఏదో కల వస్తుండేది. ఆ కల వచ్చిన ప్రతిసారీ ఆమె మానసిక స్థితి అల్లకల్లోలంగా వుండేది. తట్టుకోలేని అశాంతితో అల్లాడేది దాని ఫలితమే ఆ ఆత్మహత్యా ప్రయత్నం"

కల రావటం ఏమిటి? కలలు వచ్చినంత మాత్రాన ఆత్మహత్యలు చేసుకుంటారా! ఆత్మహత్యా ప్రయత్నం చేసిన కొద్ది నిమిషాలకే బ్రతకాలనుందని అంటూ ఫోన్ చేయటమేమిటి? శుభాంగి నాటకం ఆడుతోందేమోనని అనుమానం వచ్చింది.

గతంలో ఒక కేస్ చూశాడు. ఒక స్త్రీ తరచుగా స్లీపింగ్ పిల్స్ మింగి చనిపోతున్నాను అంటూ భర్తని బెదిరించేది. టాబ్లెట్లు తీసుకున్న వెంటనే భర్తకి ఆ విషయం చెప్పేది. కేవలం భర్తను బెదిరించడానికి ఆమె ఆ పని చేసేదని ఆ తరువాత అర్థం అయింది. ఈమె కూడా అలా సానుభూతి పొందటానికి ఏమయినా చేస్తోందా అన్న అనుమానం వచ్చింది.

అయితే ఆ విషయాన్ని పైకి అనలేదు అతను.

అదే సమయంలో మెట్లు దిగి రాసాగాడు డాక్టర్.

డాక్టర్‌ని చూస్తూనే సోఫాల్లోంచి లేచి నిలబడ్డారు ఇద్దరూ.

ఓ క్షణం గౌతమ్‌ని చూశాడు అతను.

"ఎలా వుంది డాక్టర్ ఆమెకు అడిగాడు గౌతమ్.

"షి ఈజ్ ఆల్‌రైట్" అని, సుప్రియ వైపు తిరిగి, "ఆమె ఇప్పుడు మాట్లాడుతోంది. కానీ ఇంకా కొద్ది గంటల పాటు ఆ నిద్రమత్తు

వుంటుంది. కాబట్టి ఆమె అదే మూడ్‌లో వుంటుంది. బై ఈవినింగ్ షి విల్ బి ఆల్‌రైట్'' అన్నాడు.

ఆయన దృష్టి తిరిగి గౌతమ్ మీదకు మళ్ళింది. ''అతను ఎవరు?'' అన్నట్లుగా ప్రశ్నార్థకంగా వున్నాయి అతని చూపులు.

''అన్నట్లు డాక్టర్....ఈయన పేరు గౌతమ్. శుభాంగి ఫ్రెండ్.... అఫ్‌కోర్స్. శుభాంగి ద్వారా నాకు కూడా ఫ్రెండ్ అయ్యారు'' పరిచయం చేసింది.

''శుభాంగికి ఫ్రెండ్'' అని పరిచయం చేయటం ఏమిటో ఇబ్బందిగా అనిపించింది అతనికి....కారణం ''శుభాంగికి తనకు ఫ్రెండ్‌షిప్ డెవలప్ అయ్యే ఛాన్స్ రాలేదు. అంతేకాదు....శుభాంగితో తన పరిచయం కూడా కేవలం తన కేస్ సాల్వ్ అయ్యేవరకే పరిమితం!''

''నైస్ టు మీట్ యు మిస్టర్ గౌతమ్'' అని చేయి చాపాడు డాక్టర్.

ఆ చేయి అందుకొని సున్నితంగా నొక్కి వదిలేసాడు గౌతమ్.

''అయితే....మిమ్మల్ని చూడాలి అంటోంది శుభాంగి''

డాక్టరు అన్నమాటకి తెల్లబోయాడు గౌతమ్.

''ఎస్....ఆమెకు స్పృహరాగానే అన్నమాట అదే....ఇప్పటికి మూడు నాలుగుసార్లు అదే మాట అంది ఆమె'' చెప్పాడు డాక్టర్.

చాలా ఆశ్చర్యం అనిపించింది గౌతమ్‌కి.

చావు బ్రతుకుల్లో వుండి తనని తలుచుకోవటం ఏమిటా అని, బహుశా తన గత జీవితం గురించి చెప్పాలనుకుంటోందేమో! తను మౌనికనే అన్న విషయం చెప్పాలనుకుంటోందేమో!

''నేను వెళతాను....ఏమయినా అవసరం వుంటే ఫోన్ చెయ్యండి'' చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్.

''వై డోంట్ యూ గో అండ్ సీ హర్'' అడిగింది సుప్రియ.

ఓ క్షణకాలం తటపటాయించి మెట్లు ఎక్కసాగాడు గౌతమ్.

o o o



బెడ్ మీద నిస్త్రాణగా పడుకొని వుంది శుభాంగి.

ఆమె కళ్ళు మూతపడి వున్నాయి.

ఆమె ధరించిన నైటీమీద ఏవో మరకలు పడివున్నాయి.

శుభాంగి చేత టాబ్లెట్స్ బయటికి కక్కించినప్పుడు అవేమైనా మరకలుగా పడి వుండవచ్చు అనుకున్నాడు.

ఆమె నడుము వరకు దుప్పటి కప్పి వుంది.

గదిలో ఒక రకమైన స్పిరిట్ వాసన వస్తోంది.

తెల్లవారిన వెలుగులు కిటికీలోంచి గదిలోకి పడుతున్నాయి.

ఒక్క క్షణం పాటు నిశ్చలంగా ఆమెనే చూస్తూ వుండిపోయాడతను.

కళ్ళు మూసుకుని వుండడంతో ఆమె నిద్రలో వుందో, మెలుకువగానే వుందో అర్థం కాలేదు గౌతమ్‌కి.

చిన్నగా దగ్గాడు.

ఆమెలో కదలిక కనిపించింది.

మెల్లగా ఆమె రెప్పలు విడివడ్డాయి.

అంటే ఆమె మెలుకువగానే వుంది.

తల ఎడమ వైపుకు తిప్పింది.

ఎదురుగా ఆమెకు గౌతమ్ కనిపించాడు.

క్షణం తరువాత ఆమె పెదవుల మీద నీరసంగా చిరునవ్వు మెరిసింది. కళ్ళలోకి జీవం తిరిగి వచ్చింది. కూర్చోమన్నట్లుగా సైగ చేసింది.

వచ్చి ఆమె బెడ్‌పక్కనే కూర్చున్నాడు.

''ఎలా వుంది ఇప్పుడు?'' అడిగాడు.

''బాగానే వుంది''

ఆమె దృష్టి బ్యాండేజి కట్టి వున్న అతని చేతిమీద పడింది.

''ఏమయింది?'' అటువైపే చూస్తూ అంది ఆమె. ఆమాట నూతిలోనుంచి వచ్చినట్లుంది.

13)

"ఇదా....నథింగ్....చిన్న దెబ్బ తగిలింది అంతే"

ఆమె కళ్ళలో ఒకింత బాధ కనిపించింది.

"ఎందుకు ఈ ఆత్మహత్యా ప్రయత్నం చేశారు" అని అడగాలనుకున్నాడు. కానీ ఆ ప్రశ్న ఆమెలో రియాక్షన్స్ ఎలా వుంటాయో తెలియదు. తిరిగి మానసిక ఒత్తిడికి లోనుకావచ్చు.

అడగబోయి ఆగిన అతని ముఖంలోని సందిగ్ధం ఆమె గమనించింది.

"ఎందుకు చేశావు ఈపని అని అడగాలనుకుంటున్నారా!"

"నో....నో.... అదేం లేదు"

ఆమె పూర్తిగా ఇటు తిరిగింది. అలా తిరిగినప్పుడు ఆమె గుండెల మధ్యవున్న గోల్డ్ చెయిన్ లాకెట్ ఒకప్రక్కకు జారింది.

"నా సమస్యలు ఎవరికీ చెప్పుకోలేను. ఈ మానసిక అశాంతిని తట్టుకోలేను. అందుకే ప్రాణాలు తీసుకోవాలనుకున్నాను" ఆమె కళ్ళలో కన్నీరు తిరిగింది.

నిశ్శబ్దంగా వింటున్నాడు గౌతమ్.

"కానీ.... నా దురదృష్టం. తిరిగి బ్రతికాను" ఆమె కుడికంటిలోనుండి జారిన అశ్రుబిందువు ముక్కు మీదుగా జారి పిల్లోమీద పడింది.

"నో.... ప్లీజ్ డోంట్ గెట్ ఎగ్జయిటెడ్.... అదృష్టం బాగుండి సరి అయిన టైముకి ట్రీట్‌మెంట్ జరిగింది.రెస్ట్ తీసుకోండి. అనవసరంగా ఇప్పుడు ఏమీ ఆలోచించవద్దు" ఆ మందలింపులోనే అభ్యర్ధన కూడావుంది.

"బట్.... ఎవరికోసం బ్రతకమంటారు? నా అన్నవాళ్ళు ఎవరూ లేని జీవితాన్ని ఎన్నాళ్ళు గడపమంటారు? ఈ జీవితం ఎంత దుర్భరమైనదో తెలుసా!"

ఉద్వేగభరితంగా వుంది ఆమె మాట.

మాట్లాడలేదు గౌతమ్.

అతని మెదడు ఆలోచిస్తోంది. ఈమె తనని కలవాలని ఎందుకన్నట్లు? అపస్మారక స్థితిలో కూడా 'గౌతమ్' అని ఎందుకు కలవరించినట్లు ?



"నాకు తోడుగా వుంటారనుకున్న వ్యక్తులు దూరం అవుతున్నారు. క్షణం క్షణం భయంగా గడుపుతున్న నా జీవితానికి ఒక నీడ దొరుకుతుందనుకున్నాను. కానీ ఆ అవకాశం దొరకటం లేదు"

ఆమె మాటలు సరిగ్గా అర్ధంకావటం లేదు గౌతమ్‌కి.

"నిన్ను ఆ ఒంటి చేతి మనిషి....బ్రతకనివ్వడు. ప్రతి రాత్రి....చిత్రవధ చేస్తున్నాడు"

ఆమె కళ్ళు సగం సగం మూతపడుతున్నాయి.

"నన్నెందుకు రక్షిస్తారు?" చిన్నగా ఏడుస్తోంది ఆమె.

శుభాంగికి ఏం చెప్పాలో అర్ధంకావటం లేదు గౌతమ్‌కి.

"చూడండి.... ప్లీజ్.... ప్లీజ్ టేక్ రెస్ట్.... మీకు ఏం భయం లేదు" ధైర్యం చెబుతూ అన్నాడు.

"నన్ను.... వాళ్ళు చంపేస్తారు."

కొంచెం ముందుకు వంగి వణుకుతున్న ఆమె చేతిని అందుకున్నాడు.

"చూడండి.... నేను ఇక్కడే. మీ కళ్ళముందే వున్నాను. మీ ప్రక్కనే వున్నాను. మీకు వచ్చిన భయం ఏమీ లేదు. మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయరు. నేనున్నాను...." ఒక పేషెంట్‌కి ధైర్యం చెప్పే డాక్టర్‌లా అన్నాడు గౌతమ్.

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి:

ఆమె చేయి వణుకుతుండటం అతనికి స్పష్టంగా తెలుస్తోంది.

కొన్ని నిముషాలు గడిచాయి....

ఆమె కళ్ళు మగతగా మూతపడుతున్నాయి.

"గౌతమ్.... ఐ....లవ్....యు...." అస్పష్టంగా పలికాయి ఆమె పెదవులు.

ఉలిక్కిపడ్డాడు ఆ మాటకి గౌతమ్.

ఆమె చేయి అతని చేతిని గట్టిగా పట్టుకొని గుండెల మీద వుంచుకుంది ఈ చేయి నా సొంతం అన్నట్లుగా.

ఆమె గుండెలని చేరుతున్న అతని చేతిని వెనక్కి లాక్కోవాలని

ప్రయత్నించాడు.

కాని.... అతని చేతిని ఆమె చేయి బలంగా బంధించి ఉంచింది.

తన చేతికి ఆమె శరీరం మెత్తగా తగులుతోంది.

బరువుగా జరుగుతున్న ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అతనికి స్పష్టంగా తెలుస్తున్నాయి.

అతి ఇబ్బందికరమైన పరిస్థితి అది అతనికి.

"గౌతమ్.... సేవ్ మి.... నన్ను రక్షించు" ఇంకా గొణుగుతూనే వుంది ఆమె.

"థర్టీ సిక్స్—ట్వెంటీఫోర్—థర్టీ సిక్స్...వద్దు....ప్లీజ్.... అనొద్దు" ట్రాన్స్‌లో వున్నట్లుగా కలవరిస్తోంది ఆమె.

ఆమె ఏం మాట్లాడుతోందో ఆ సమయంలో ఆమెకు తెలియదు.

ఆమె ఆ మాట ఎందుకు అందో అర్థంకాక తీవ్రంగా ఆలోచిస్తున్నాడు గౌతమ్.

క్షణాలు గడిచాయి.

ఆమె నిద్రలోకి జారుకుంది. చేయి పట్టు సడలింది.

అతను చేయి వెనక్కి తీసుకున్నాడు.

మరునిముషం బయటికి నడిచాడతను.

0 0 0

"హౌ ఈజ్ షి?"

మెట్లు దిగి క్రిందికి వస్తున్న గౌతమ్‌ని అడిగింది సుప్రియ.

సమాధానం చెప్పకుండా క్రిందికి వచ్చి నిలబడ్డాడు అతను.

"ఎనీ ప్రాబ్లం?" ఒకింత ఆందోళనగా అడిగింది ఆమె.

"నోనో.... నథింగ్.... ఆమె ఇప్పుడు నిద్రపోతోంది. ఆమెకు రెస్ట్ చాలా అవసరం" నిద్ర సరిగాలేక మండుతున్న కళ్ళు నులుముకుంటూ అన్నాడు గౌతమ్.

"ఏమయినా మాట్లాడిందా! లేక మీరు వెళ్ళినప్పటినుండి నిద్రపోతూనే వుందా?"

ఏమీ మాట్లాడలేదు అని చెబుదాం అనుకున్నాడు కానీ.... అలా



చెప్పలేదు.

"ఏవేవో.... అర్థంలేని మాటలు మాట్లాడింది. తనని ఎవరో చంపుతున్నారు అంటుంది. రక్షించండి అంటుంది" అంతవరకే చెప్పాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఏదో పరధ్యానం మాటల్లా వున్నాయవి. మతిస్థిమితం లేని మాటలేమో అనిపిస్తుంది. బాగా విశ్రాంతి తీసుకుంటేనే కానీ మామూలు అవదేమో!" తిరిగి అతనే అన్నాడు.

"నేను ఇంక వెళతాను మళ్ళీ సాయంకాలం వస్తాను" టైం చూసుకుంటూ గౌతమ్. అప్పుడు సమయం ఏడున్నర దాటింది.

అలాగే అన్నట్లుగా తల ఊపింది ఆమె.

"మరి.... ఇక్కడ ఎవరు ఉంటున్నారు?"

"నేను ఈ రోజంతా శుభాంగి దగ్గరే వుంటాను"

"ఓ.కే. ఈలోపు ఏమయినా అవసరం అయితే హోటల్ రూమ్‌కి ఫోన్ చెయ్యండి. నేను వెంటనే వస్తాను" చెప్పి ముందుకు నడిచాడు.

సరేనని తల ఊపిందామె.

నాలుగు అడుగులు వేసి వెనక్కి తిరిగాడు అతను.

ఏమిటన్నట్లు చూసింది.

"—'థర్టీ సిక్స్—ట్వెంటీ ఫోర్—థర్టీ సిక్స్' —అంటూ ఏదైనా కలవరిస్తూ వుంటుందా శుభాంగి మీకు తెలిసి. ఆ మాటలకి వేరే ఏదయినా అర్థం వుందా!

"ఏమో!" అయోమయంగా అంది ఆమె.

"ఇట్సాల్‌రైట్.... వస్తా" జేబుల్లో చేతులు పెట్టుకొని బయటికి నడిచాడు అతను.

అతని మెదడులో ఏవో కొత్త ఆలోచనలు మొదలయ్యాయి.

0 0 0

బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు గౌతమ్.

అప్పుడే నిద్ర నుంచి మెళకువ వచ్చింది అతనికి.

వాచ్‌లో టైము చూసుకున్నాడు.

పన్నెండు అవుతోంది.

విండోలోంచి బయటికి చూశాడు.

ఎండ బాగా వుంది.

ఉదయం శుభాంగి దగ్గర నుండి వచ్చి న్యూస్‌పేపర్ చూస్తూ బెడ్ మీద పడుకున్నాడు. తెలియకుండానే నిద్రపట్టేసింది.

మెలకువ వచ్చేసరికి ఈ టైమ్ అయ్యింది.

శుభాంగి ఆత్మహత్యా ప్రయత్నం చేయటం....చావునుంచి వెంట్రుక వాసిలో తప్పించుకోవటం.... అంతా.... ఓ కలలా అనిపించసాగింది.

ఈ రోజు బొంబాయి నుండి రఘునాథ్ వస్తాడు. మౌనిక ఫోటోలు ఆమె కేస్ ఫైల్స్ అన్నీ తెస్తాడు.

మరో గంటలో అతను వచ్చే ఫ్లయిట్ వస్తుంది. కాబట్టి ఎయిర్ పోర్ట్‌కి వెళితే బావుంటుందనిపించింది.

అంటే ఒక అరగంటలో తయారు అయి వెళ్ళాలి.

బెడ్ మీదనుంచి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. ఐదు నిముషాలపాటు ఎక్సర్‌సైజ్ చేశాడు. శరీరంలో బడలిక అంతా పోయి కండరాలు ఉత్తేజితం అయ్యాయి.

పది నిముషాల్లో ఫ్రెష్ అయ్యాడు.

బ్లాక్ జీన్స్‌మీద లైట్ బిస్కెట్ కలర్ నోలో టీ షర్ట్ ధరించాడు.

షూస్ తీసుకుని సోఫాలో కూర్చుని, సాక్స్ వేసుకోబోయాడు.

సరిగ్గా అదే సమయంలో రింగ్ అయింది ఫోన్.

కొంచెం ప్రక్కకు వంగి రిసీవర్ అందుకున్నాడు.

"హలో...."

అవతలి నుంచి ఎటువంటి సమాధానం లేదు.

"హలో.... హలో"

"నేను" వినిపించిందో అపరిచిత కంఠం.

"అయాం సారీ....గుర్తుపట్టలేకపోతున్నాను"

"అప్పుడే మర్చిపోయారా!" మళ్ళీ వినిపించింది.

ఈసారి ఆ గొంతు ఎక్కడో విన్నట్లు అనిపించింది. కానీ ఎవరో



గుర్తురావటం లేదు.

"లాభం లేదు.... గుర్తురావటం లేదు"

"అంత త్వరగా మర్చిపోయావా! నా రివాల్వర్ నీ దగ్గర వుంది"

అదిరిపడ్డాడు ఆ మాటకి.

"భయపడ్డావా! నా మాట విని"

"షటప్.... ఏం కావాలి?.... నీ రివాల్వరా !" ఉలికిపాటు కప్పి పుచ్చుకుంటూ అన్నాడు.

"కాదు.... మా బాస్ మీ కొక విషయం చెప్పమన్నారు"

"అయితే నీకు బాస్ వున్న విషయం ఒప్పుకుంటున్నావు"

"అధికప్రసంగం ఆపి చెప్పే విషయం విను. మరో గంటలో నీకొక వార్త పంపిస్తున్నాం"

"నాకా!"

"అవును నీకే....సరిగ్గా గంటలో నీకావార్త అందుతుంది" కరుకుగా వుంది అతని కంఠం.

"ఏమిటా వార్త?"

అవతలవైపు లైన్ కట్ అయింది. అంటే ఫోన్ పెట్టేశారు.

ఫోన్ జారవిడిచాడు గౌతమ్.

అంటే ... అదొక హెచ్చరిక.

ఒక గంటలో ఏదో ఒక ప్రమాదం జరగబోతోంది.

ఆ వార్త వచ్చేవరకు తను రూమ్‌లోనే వుండాలి. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళడానికి కుదరదు.

వెంటనే లేచి డెస్క్‌లో వున్న 7 ఎం.ఎం. జపాన్ ఆటోమేటిక్ రివాల్వర్ బయటికి తీసి జేబులోకి తోసాడు.

షూ వేసుకుని కూర్చున్నాడు.

సమయం గడుస్తోంది.

నిముషనిముషానికి టైం చూసుకుంటున్నాడు గౌతమ్. ఏం జరగబోతోందో అర్థంకావటం లేదు అతనికి.

గంట గడిచింది....

గంట ఐదు నిముషాలు....

సరిగ్గా అదే సమయంలో మోగింది కాలింగ్ బెల్.

ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు గౌతమ్.

సందేహం లేదు.... ఆ వ్యక్తులే ఎవరో వచ్చారు.

జేబులోంచి రివాల్వర్ బయటికి లాగాడు. పరుగులాంటి నడకతో డోరుని సమీపించాడు ...

చిన్న ఇనుపగొలుసులాగ వున్న సేఫ్టీలాక్‌ని బిగించాడు.

బోల్టు ఓపెన్ చేశాడు.

ఇప్పుడు అవతలి వ్యక్తి తలుపు తోసినా కూడా ఓ రెండు అంగుళాలకు మించి తలుపు తెరుచుకోదు.

అయినా అవతలి వ్యక్తి బలంగా తోస్తే ఆ గొలుసు ఏమీ ఆగదు.

బట్.... అటువంటిది ఏదయినా జరిగితే, ఆ సమయం చాలు... తను తిరిగి ఎటాక్ చేయటానికి.

"ఎవరు?" అడిగాడు రివాల్వర్ ట్రిగ్గర్ మీద చేయిబిగిస్తూ.

"నేను రూమ్ అటెండెంట్‌ని సార్"

నమ్మబుద్ధి కాలేదు గౌతమ్‌కి.

"ఏం కావాలి ?"

"మీ కోసం రెండు సూట్‌కేసులు తెచ్చాను సార్"

"ఎవరు పంపారు?"

"మీకు రఘునాథ్ అనే వ్యక్తి తెలుసా సార్" అడిగాడు.

ఒక్క క్షణం అర్థంకాలేదు. తేరుకుని అన్నాడు "తెలుసు.... ఏం జరిగిందో చెప్పు."

"ఈ రోడ్డు చివర ఒక యాక్సిడెంట్ అయింది సార్. అందులో రఘునాథ్ అనే వ్యక్తికి తీవ్రమైన గాయాలు అయ్యాయి. అతను మీ పేరు చెబుతున్నాడు. ఈ హోటల్ అడ్రస్ చెపుతున్నాడు. ఈ సూట్‌కేసులు మీకు అందచేయమన్నాడు. మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నాడు. అతన్ని హాస్పిటల్‌కి కదిలించాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా అక్కడనుంచి కదలడంలేదు. మీరు వస్తేనే కాని కదలనంటున్నాడు"



రక్తం గడ్డ కట్టినట్లయింది గౌతమ్‌కి.

"ఇప్పుడు.... అతనికి.... ఎలా వుంది?" వణికే కంఠంతో అడిగాడు.

"మీరు అక్కడికి వెళ్ళేనదాకా బ్రతికుంటాడని చెప్పటం చాలా కష్టం సార్. రక్తం అంతా పోయింది. కొన ఊపిరితో వున్నాడు"

తల మీద పిడుగు పడినట్లయింది.

రెండో ఆలోచన లేకుండా అదేక్షణంలో తలుపు తెరిచాడు గౌతమ్ ఆ వచ్చిన వ్యక్తి నిజం చెపుతున్నాడా! లేదా! అన్నది కూడా ఆలోచించకుండా.

0 0 0

ఒక్కసారిగా చలనం వచ్చింది అతనిలో.

పరుగులాంటి నడకతో లిఫ్ట్‌ని సమీపించాడు.

డోర్సు ఓపెన్ అవగానే లిఫ్ట్‌లోకి ప్రవేశించాడు.

గౌతమ్ వెనుకగా లిఫ్ట్‌లోకి ఎక్కాడు రూమ్ సర్వీస్ అసిస్టెంట్ క్రిందకి జారసాగింది లిఫ్ట్.

టెన్షన్‌తో నరాలు తెగిపోతున్నాయి అతనికి.

ఆ సమయంలో లిఫ్ట్ కూడా చాలా నెమ్మదిగా క్రిందికి దిగుతోంది అనిపించింది.

రఘునాథ్ బ్రతికి వున్నాడో....లేదో.

'భగవంతుడా, అతనిని సజీవంగా వుంచు....' అని మనసులో అనుకున్నాడు.

లిఫ్ట్ ఆగగానే బయటికి దూకాడు గౌతమ్.

"ఎంతదూరంలో జరిగింది యాక్సిడెంట్" అడిగాడు సర్వీస్ అసిస్టెంట్‌ని.

"ఇక్కడే సార్.... ఈ రోడ్డు చివర"

అతని మాట పూర్తి అయిన మరుక్షణం పరుగు ప్రారంభించాడు. శక్తి అంతా కాళ్ళలో కేంద్రీకృతం అయి వుంది.

రెండు నిముషాలు పరుగెత్తిన అతనికి రోడ్డుమీద గుమిగూడిన జనాలు, ఒక పోలీసు జీపు, ఒక అంబులెన్స్ కనిపించాయి.

అక్కడికి వచ్చేసరికి అతని హృదయ స్పందన హెచ్చింది.

గుంపును తోసుకుంటూ లోపలికి ప్రవేశించాడు.

ఎదురుగా ఒకప్రక్క పూర్తిగా దెబ్బతిన్న టాక్సీ, దానికి ప్రక్కనే పడివున్న రఘునాథ్ కనిపించారు.

వెల్లకిలా పడివున్నాడు. అతని కళ్ళు రెండూ రక్తసిక్తం అయి వున్నాయి.

బట్టల నిండా రక్తం.

తలమీద ఎక్కడో కూడా దెబ్బ తగిలినట్లుంది. కుడి చెవు మీదగా మెడ మీదకు కారుతోంది చిక్కటి రక్తం.

ఆ దారుణ దృశ్యం చూడలేక కళ్ళు మూసుకున్నాడు గౌతమ్.

"సార్....ఈయనే గౌతమ్" అంటూ అక్కడున్న ట్రాఫిక్ ఎస్.ఐతో చెప్పాడు రూమ్ సర్వీస్ అసిస్టెంట్.

ఆ మాట వినిపించినట్లుంది రఘునాథ్‌కి.

కళ్ళు తెరిచి తల తిప్పాడు.

అంతవరకు రఘునాథ్ ఏ పరిస్థితితో వున్నాడో అర్థం కాని గౌతమ్‌కి అతను కళ్ళు తెరిచేసరికి చెప్పలేని ఆనందం కలిగింది. "థాంక్ గాడ్! బ్రతికే వున్నాడు"

దాదాపు రక్తం అంతా పోయి పాలిపోయినట్లుగా కనిపిస్తున్నాడు. అతన్ని చూసి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

ఐదడుగుల పదంగుళాల ఎత్తు, కండలు తిరిగిన శరీరం....వంకీలు తిరిగిన జుట్టు .. ఆకర్షణీయమైన రూపంలో వుండే అతనిని ఆ స్థితిలో చూడలేకపోయాడు గౌతమ్.

"మీరేనా గౌతమ్ అంటే?" దగ్గరకు వచ్చి అన్నాడు ఎస్.ఐ.

అవునన్నట్లుగా తల ఊపాడు గౌతమ్.

"ఈయనని హాస్పటల్‌కి తరలించాలని అరగంట నుంచి ప్రయత్నిస్తున్నాం. మీరు రానిదే ఇక్కడ నుంచి కదలనని మొండికేశాడు. బలవంతంగానైనా తీసుకువెళదామని సమీపిస్తే చేతులు కాళ్ళు విదిలించికొడుతున్నాడు. అలా అతను కదిలిన ప్రతిసారీ రక్తస్రావం అధికం అయిపోతోంది. ఇక ఏమీ చేయలేని స్థితిలో మీ గురించి ఎదురు చూస్తున్నాం. మీరయినా త్వరగా చెప్పండి. అతను బ్రతుకుతాడన్న నమ్మకం మాకు ఇప్పటికే పోయింది" చెప్పాడు ఎస్.ఐ.



"మీతో ఏదో మాట్లాడాలంటున్నాడు. త్వరగా మాట్లాడండి. కనీసం ఫస్ట్ ఏయిడ్ చేయటానికైనా దగ్గరికి రానివ్వటం లేదు" ఆందోళనగా అన్నాడు అంబులెన్స్‌తో పాటు వచ్చిన డాక్టర్.

"ఒక సెకనులో అతను బయలుదేరే ప్రయత్నం చేస్తాను" అంటూ రఘునాథ్‌ని చేరాడు గౌతమ్.

మోకాళ్ళమీద కూర్చున్నాడు.

రఘునాథ్ కళ్ళు మెరిసాయి.

"వచ్చారా సార్" అతి నెమ్మదిగా వస్తోంది అతని మాట,

"మీకు సూట్‌కేసులు అందాయా" మళ్ళీ అతనే అడిగాడు.

"రఘునాథ్.... ఆ సూట్‌కేసులోని ఫైల్స్ అంత ఇంపార్టెంట్ ఏమీ కాదు. ప్రాణాపాయ స్థితిలో వుండగా ఏమిటీ మొండితనం?"

"నేను మీకు....ఆ ఫైల్స్ .. చేర్చగలిగాను. ఇది యాక్సిడెంటు కాదు....ఇద్దరు వ్యక్తులు అంబాసిడర్ కారులో వచ్చి.... ఈ కారుని గుద్దారు కావాలనే.... అంటే ఎవరో మనల్ని చంపాలనుకుంటున్నారు. కాబట్టి మీరు చాలా జాగ్రత్తగా....ఉండండి. ఈ విషయం చెప్పాలనే ఇక్కడ వుండిపోయా...." మిగతా వారికి అర్థం అవకూడదని మరాఠీలో మాట్లాడాడు. అతను మాట్లాడుతుంటే నోట్లో రక్తం అడ్డుపడుతున్నట్లుంది. ప్రక్కకు తిప్పి ఉమ్మివేశాడు. అంటే నోటిలో కూడా ఎక్కడో దెబ్బ తగిలింది.

రఘునాథ్ గౌతమ్‌కి చెప్పబోయే విషయం ఏమిటో తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా ప్రక్కన నిలబడిన ఎస్.ఐ.కి రఘునాథ్ మరాఠీలో మాట్లాడడంతో ఒక ముక్క కూడా అర్థం కాలేదు.

"త్వరగా అంబులెన్స్ ఎక్కించండి సార్" ఆందోళనగా అన్నాడు గౌతమ్.

అంబులెన్స్‌తో పాటు వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్ట్రెచ్చర్‌ని రఘునాధ్‌కి దగ్గరగా తీసుకువచ్చారు.

అతికష్టంమీద అతనిని స్ట్రెచ్చర్ మీదకు ఎక్కించ గలిగారు వాళ్ళు. ఆ క్షణంలో బాధతో విలవిలలాడిపోయాడు అతను

రక్తం మరోసారి స్రవించింది.

అతనిని చూడలేక కళ్ళు మూసుకున్నాడు గౌతమ్.

అతన్ని అంబులెన్స్‌లోకి చేర్చాడు.

"డాక్టర్ ఎలా వుంది అతని కండిషన్....ఐ మీన్ ప్రాణానికి"_ వణుకుతున్న గొంతును అదుపులో పెట్టుకుంటూ అన్నాడు గౌతమ్.

"బ్రతకడం....దాదాపు అసంభవం.... అయినా మా ప్రయత్నము మేము చేస్తాం" అంటూనే వ్యాన్‌లోకి ఎక్కాడు డాక్టర్.

ఆ వెనుకనే వ్యాన్‌లోకి ప్రవేశించాడు గౌతమ్ కూడా.

అతన్ని "రావద్దు" అని ఎవరూ అనలేదు.

పేషెంట్ తలకి కొంచెంప్రక్కగావున్న స్టూల్ మీద కూర్చున్నాడు గౌతమ్. అది అంబులెన్స్ క్రింద భాగానికి బిగించబడి వుండడం వల్ల ఇటూ అటూ కదలదు.

బయట నుండి డోర్ క్లోజ్ చేశారు ఎవరో....ఉస్మానియా హాస్పటల్ వైపు చిన్న కుదుపుతో స్టార్టయి శరవేగంతో దూసుకు పోసాగింది అంబులెన్స్.

చెవులు చిల్లులు పడేలా రొదచేస్తోంది సైరన్.

తల పక్కకి తిప్పి చూశాడు రఘునాథ్.

"మీరు....ఇక్కడే వున్నారా!" అడిగాడు.

అవునన్నట్లు తల ఊపాడు గౌతమ్.

అతని కళ్ళు ఒకింత తృప్తిగా మెరిసాయి.

నజ్జునజ్జుగా నలిగిపోయిన అతని కాళ్ళ దగ్గర పేంట్‌ని కత్తెరతో కత్తిరించి వేసి కాళ్ళ చుట్టూ వుంచారు.



ఇంట్రావీనస్ ప్లాస్మా ట్రాన్స్‌ఫ్యూజన్‌కి సిద్ధం చేయసాగాడు డాక్టర్

"ఇది కావాలని....చేసిన పని. యాక్సిడెంటు కాదు" అన్న రఘునాధ్ మాటలు గౌతమ్ చెవిలో మారుమ్రోగుతున్నాయి.

ఎవరయి వుంటారు?

ఎందుకలా ఛేజ్ చేస్తున్నారు?

తన వృత్తిపరంగా ఎందరికో తాను శత్రువు అయ్యే అవకాశం వుంది. అందువల్ల ఆ శత్రువులలో ఒకరిద్దరయిన తనని చంపాలని ప్రయత్నించే అవకాశం లేకపోలేదు.

బట్....

ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరయి వుండచ్చు?

తన హోటల్ రూమ్‌లోకి వచ్చిన ఆ అగంతకుడు కూడా అతనెవరనే విషయాన్ని చెప్పలేదు.

ఆ తరువాత రివాల్వర్ తీసుకుని తన వెంటపడ్డ వ్యక్తి దగ్గర నుండి కూడా అతనెవరనే విషయాన్ని రాబట్టటంలో ఫెయిల్ అయ్యాడు.

కనీసం ఆ ఇద్దరి ఊరు పేర్లు కూడా తెలుసుకోలేక పోయాడు. అంతలోనే ఒక విషయం గుర్తుకు వచ్చింది.

తను హోటల్ రూమ్‌లో వుండగా ఆ రివాల్వర్ వ్యక్తినుంచి ఫోన్ వచ్చింది. ఏదో వార్త తీసుకుని ఎవరో వస్తారు అని హోటల్ రూమ్‌లో ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

అంటే....

వాళ్ళు పంపిన వార్త ఇదా! రఘునాథ్ మీద హత్యా ప్రయత్నం.... ఒళ్ళు జలదరించింది గౌతమ్‌కి.

కంట్రోల్ రూమ్ ముందు నుంచి వెళుతోంది అంబులెన్స్.

రఘునాథ్‌కి ఏవో ఇంజెక్షన్స్ చేశాడు డాక్టర్

ఎండిపోతున్నట్లు వున్న పెదవులను నాలికతో తడి చేసుకుంటూ దాహం అన్నట్లుగా పెదవులు కదిలించాడు రఘునాథ్.

అది చూసిన గౌతమ్ డాక్టర్‌తో ఏదో అనబోయాడు.

ఏమీ మాట్లాడవద్దు అన్నట్లు సంజ్ఞ చేశాడు డాక్టర్.

మౌనంగా చూస్తూ వుండిపోయాడు గౌతమ్

తన దగ్గర వున్న ఒక బాటిల్‌లోని స్టెరిలైజ్‌డ్ వాటర్‌ని రఘునాథ్ నోటిలో కొద్ది చుక్కలను ఫిల్లర్‌తో వేశాడు డా ర్.

రెండు మూడు గుటకలు అతికష్టం మీద మింగాడు అతను

లేని శక్తిని తెచ్చుకుంటూ తిరిగి చెప్పనారంభించాడు రఘునాథ్

అతన్ని చూస్తున్న డాక్టర్‌కి అర్థం కాలేదు. చివరి క్షణంలో వున్నాడనుకున్న వ్యక్తి ఎలా ఇంత సేపు మాట్లాడగలుగుతున్నాడో!

చిన్నగా గుసగుసలాడుతున్నట్లుగా వస్తున్న అతని మాట సరిగా వినిపించక తన చెవిని దాదాపు రఘునాథ్ నోటి దగ్గర వుంచాడు గౌతమ్.

"ఇది యాక్సిడెంటు కాదు.... ఎందుకంటే యాక్సిడెంటు అయిన తరువాత నా చేతిలోని సూట్‌కేస్.... లాక్కోవాలని ప్రయత్నించారు. పెనుగులాడాను. ఈలోపే జనం అంతా గుమికూడారు. వాళ్ళు పారిపోయారు" సూట్‌కేస్ వాళ్ళు తీసుకుపోకుండా కాపాడగలిగానన్న ఆనందం అతని కళ్ళలో మెరిసింది.

గౌతమ్‌లో బాధ అధికం అయ్యింది

రఘునాథ్ సిన్సియారిటీ అతనికి తెలుసు బట్....ప్రాణాలు సహితం పణంగా పెట్టి.... జీవితపు చివరి క్షణాల్లో కూడా అతను తన ఉద్యోగ ధర్మం కోసమే పోరాడాడు. దేశం కోసం ప్రాణాలర్పించే సైనికుడిలా కనిపించాడు అతనికి ఆ క్షణంలో

రఘునాథ్.... యూ ఆర్ గ్రేట్.... మనస్సులోనే అతని సిన్సియారిటీకి నమస్కరించాడు

"సార్" మెల్లగా పిలిచాడు రఘునాథ్.

ఏమిటన్నట్లు చూశాడు గౌతమ్

రఘునాథ్ మాట్లాడకుండా వుంటే బాగుండునని వుంది గౌతమ్‌కి. మాట్లాడినకొద్దీ అతనిలో మరింత అలసట కనిపిస్తోంది. కానీ....మాట్లాడవద్దు అన్నా అతను వినడు

"నేను....చచ్చిపోతానేమో సార్..." శక్తినంతా కూడదీసుకుని అన్నాడు రఘునాథ్.



కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి గౌతమ్‌కి. గుండె దిటవు చేసుకుని ఎంత గాంభీర్యం ప్రదర్శించాలనుకున్నా సాధ్యం కావటం లేదు

"సార్ మాది పేద కుటుంబం.... మీకు తెలుసు.... నేను ఇంటికి ఆధారం.... నేను చనిపోతే.... నా ఉద్యోగం మా తమ్ముడికి ఇస్తారా!" ముద్దగా వస్తోంది అతని మాట

"రఘు.... ప్లీజ్.... ఏమీ మాట్లాడకు.... నీకు ఏమీ అవదు. యూ విల్ బి.... ఆల్‌రైట్...." ధైర్యం ప్రదర్శిస్తూ అన్నాడు గౌతమ్

నిర్జీవంగా నవ్వాడు రఘునాథ్

"మీరు అన్నట్లు.... నేను బ్రతికినా.... నాకు.... రెండూ కాళ్ళు వుండవేమో....అప్పుడు....నేను ఈ వృత్తికి పనికిరాను.... అప్పుడు.... కనీసం.... క్లర్క్‌గానయినా మీ దగ్గర.... వుండనిస్తారా!"

గుండెలు ఎవరో పిండిచేసినంత బాధ కలుగుతోంది అతని మాటలకి. నిస్సహాయంగా వింటున్నాడు గౌతమ్.

రఘునాథ్ కళ్ళు మెల్లగా మూతలు పడుతున్నాయి

"సార్.... బీదకుటుంబం .... ఇంటికి ఆ....ధా....రం.... హెల్ప్" అంటూండగానే అతని కళ్లు పూర్తిగా మూతపడ్డాయి.

అది చూసిన గౌతమ్‌కి గుండెలు అదిరిపోయాయి.

"ఇంజెక్షన్ పనిచేస్తోంది, మత్తులోకి వెళ్ళిపోయాడు" చెప్పాడు డాక్టర్.

ఆ మాట అతనిలో ఒకింత ఊరట కలిగించింది

నిశ్చలంగా పడివున్నాడు రఘునాథ్

వ్యాన్ ఉస్మానియా హాస్పటల్‌లో ఆగింది

డోరు తెరిచారు ఎవరో....

క్షణాల్లో క్రిందికి దిగి రఘునాథ్‌ని స్ట్రెచ్చర్ మీద మోసుకుని పరుగులాంటి నడకతో యమర్జన్సీ వార్డ్స వైపు మూసుకుపోయారు వాళ్ళు.

వాళ్ళ వెనుకనే పరుగులాంటి నడక ప్రారంభించిన డాక్టర్‌ని ఉద్దేశించి అడిగాడు గౌతమ్.

ఏమిటన్నట్లు చూశాడు డాక్టర్

"సార్.... అతను.... అతని లైఫ్‌కి....ప్రమాదమా!" అడగలేక అడగలేక అడగాడు గౌతమ్

ఒక క్షణం ఏమీ మాట్లాడలేదు డాక్టర్

"మా వంతు ప్రయత్నము చేస్తాం.... నేనేమీ చెప్పలేను. ఏది జరిగినా కూడా రిసీవ్ చేసుకోవటానికి.... మానసికంగా సిద్ధంకండి" అని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్

ఆ మాటకి శరీరం జలదరించింది గౌతమ్‌కి.

o o o

"ఏక్ చాయ్ లావ్" చెప్పాడు సప్లయర్‌తో గౌతమ్.

సరిగ్గా అదే మాటని లోపలి గదిలోని టీ తయారు చేసే వ్యక్తికి వినిపించేలా గట్టిగా అరిచాడు సప్లయర్.

తల నొప్పితో కణతలు బ్రద్దలవుతున్నాయి. రెండు చేతుల బొటన వేళ్ళతో కణతలు రుద్దుకుంటున్నాడు.

ఉదయం నుంచి ఏమీ తినలేదు. ఆకలిగా అనిపిస్తోంది. అయినా ఏమీ తినాలనిపించలేదు. సప్లయర్ టీకప్పు తెచ్చి టేబుల్‌మీద వుంచి వెళ్ళిపోయాడు.

జేబులోంచి ఆస్ప్రిన్ టాబ్లెట్ తీసి నోట్లో వేసుకుని కొంచెం నీళ్ళు త్రాగాడు. ఆ తరువాత మెల్లగా టీ సిప్ చేయనారంభించాడు.

ఆ ముందు రోజు రాత్రి నిద్రలేకపోవటంతో కళ్ళలో ఇసుక పోసినట్లు మండుతున్నాయి.

రెండు భయంకరమైన సంఘటనలు....

ఒకదాని వెనుక ఒకటి....

అదీ.... కొద్ది గంటల వ్యవధిలో ....

శుభాంగి ఆత్మహత్యా ప్రయత్నం.... రఘునాథ్ మీద హత్యా ప్రయత్నం.

తన వృత్తిపరంగా ఎన్నో హత్యలు.... శవాలు చూశాడు. అలా చూడడం అతనికి మామూలే.

కానీ....ఈ రోజు సంఘటనలు,.... అతనిని మానసికంగా స్థిరంగా వుండనివ్వడం లేదు.



చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు రఘునాథ్.

చావుబ్రతుకులు అనడం కంటే చావుకు దగ్గరలో వున్నాడు అనటం నిజమేమో అనిపిస్తోంది.

ఇప్పుడు శుభాంగి పరిస్థితి ఎలా వుందో!

డాక్టర్ చెప్పిన దానిని బట్టి ఆమెకు ప్రాణభయం ఇంక లేనట్లే. సుప్రియతో "మళ్ళీ వచ్చి శుభాంగిని చూస్తాను" అన్నాడు. కానీ ప్రస్తుతం రఘునాథ్ వున్న పరిస్థితిలో తను వెళ్ళలేడు. ఇక్కడే వుండాలి.

కనీసం ఫోన్ అయినా చేస్తే ... ఆ ఆలోచన రాగానే ఫోన్ చేయాలని నిర్ణయించుకున్నాడు. టీకి డబ్బులు చెల్లించి బయటికి వచ్చి పబ్లిక్ టెలిఫోన్ వైపు నడిచి జేబులో నుండి రూపాయి నాణెం ఒకటి తీసి చేతిలో పట్టుకుని నెంబర్ డయల్ చేశాడు.

ఫోన్ రింగవుతోంది.

రెండు నిముషాలు గడిచాయి.

ఫోన్ ఎవరూ లిఫ్ట్ చేయటంలేదు.

లైన్ డిస్కనెక్ట్ చేసి మరోసారి డయల్ చేశాడు.

అప్పుడూ అదే పరిస్థితి.

ఆశ్చర్యంగా వుందే....శుభాంగి ఈ సమయానికి పూర్తి స్పృహలోకి వచ్చి వుండాలి. ఆమె అయినా ఫోన్ లిఫ్ట్ చేయాలి. కాదంటే సుప్రియ అయినా మాట్లాడాలి. అదీ కాదనుకుంటే వాచ్‌మాన్ అయినా ఫోన్ ఎత్తాలి....ఎవరూ ఫోన్ తీయటంలేదంటే....ఏమయి వుంటుంది?

ఒకవేళ శుభాంగికి సీరియస్ అయిందేమో!....

ఏదయినా హాస్పిటల్‌కి తరలించారేమో!....

లేక మరేదయినా జరిగిందా!

రకరకాల ఆలోచనలు అతని మస్తిష్కంలో ముసరసాగాయి.

రెండు నిముషాలు ఆగి తిరిగి ఆమె నెంబర్ డయల్‌చేశాడు.

ఈసారి సుమారు ఐదు నిముషాలకి పైగా ఫోన్ రింగయింది. బట్....నో రెస్పాన్స్....

15)

ఏమై వుంటుంది?....ఏం చెయ్యాలి?

వెళ్ళి చూసి వస్తే....

ఈలోపు రఘునాథ్ పరిస్థితి ఏమిటి?

అతను అపరేషన్ థియేటర్లో వున్నాడు కదా!

ఈలోపు త్వరగా వెళ్ళివస్తే....

ఎటూ తేలని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతూ టెలిఫోన్ బూత్‌లోంచి బయటికి వచ్చి ఎమర్జెన్సీ వార్డ్స్‌వైపు నడిచాడు గౌతమ్.

ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసి వున్నాయి.

పరిశుభ్రత లోపించిన ఆ హాస్పిటల్ కారిడార్లు చూస్తుంటే కంపరంగా వుంది గౌతమ్‌కి.

కొందరు నర్సులు....కాంపౌండర్లు....తమ పని మీద తాము ఇటూ అటూ తిరుగుతున్నారు. అలా తిరుగుతున్న వారిలో ఒక వ్యక్తి గౌతమ్ దృష్టిని ఆకర్షించాడు.

బలిష్టంగా, ఎత్తుగా వున్న అతను అప్పటికి రెండు మూడుసార్లుగా తన ముందే తచ్చాడుతున్నట్లు అనిపించింది.

ఆ కారిడార్‌లో ఆ చివరికి వెళ్ళిపోయి ఒక స్తంభం ప్రక్కనవున్న బెంచ్ మీద కూర్చున్నాడతను.

అతను అప్పుడప్పుడు గౌతమ్‌నే చూస్తున్నాడు.

ఎవరతను ...?

రెప్ప వాల్చకుండా అతన్నే చూశాడు గౌతమ్.

ఇద్దరి చూపులు రెండు క్షణాలు కలిశాయి.

తడబాటుగా చూపు మరల్చుకుని ఎటో చూడసాగాడతను.

సందేహం లేదు....ఎవరో తనని వెంటాడుతున్నారు.

అతనికి కొద్దిదూరంలో నిలబడి వున్నాడు మరో వ్యక్తి.

ఆ వ్యక్తి ఈ వ్యక్తికి కళ్ళతో ఏదో సంజ్ఞ చేశాడు.

ఈ వ్యక్తి అతనికి బొటనవేలు చూపించి ఏదో అంటున్నాడు.

ఎస్....నిర్ధారణ అయిపోయింది.

మళ్ళీ తన మీద నిఘా మొదలయిపోయింది.



ఈసారి ఏం చేయబోతున్నారు వాళ్ళు?!

ఒకవేళ రఘునాథ్ బ్రతికితే తిరిగి చంపాలని వచ్చారా! లేకపోతే ఆ సూట్‌కేసుల కోసం తనని ఏమయినా చేయాలని వచ్చారా! నో డౌట్! తమచుట్టూ ఏదో ఉచ్చుబిగుసుకుంటోంది.

అప్రయత్నంగా జేబు తడుముకున్నాడు.

జేబులోని రివాల్వర్ చల్లగా తగిలింది.

ఆపరేషన్ థియేటర్ తలుపు తెరుచుకుంది.

హడావుడిగా ఇద్దరు నర్సులు బయటికి పరిగెత్తారు. ఆ వెనుకనే ఒక డాక్టర్ బయటికి వచ్చాడు. అతని ముఖంలో టెన్షన్ కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

"డాక్టర్ లక్ష్మరావుగారిని కూడా పిలవండి....ఫాస్ట్" అరిచాడు నర్సులని ఉద్దేశించి.

వాళ్ళు తల ఊపి పరిగెత్తారు.

గిర్రున వెనక్కి తిరిగి ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళిపోయాడు ఆ డాక్టర్.

ఆ వెనుకనే డోర్స్ క్లోజ్ అయ్యాయి.

అంటే....ఏదో జరుగుతోంది రఘునాథ్‌కి.

కాలు చెయ్యి కదలటంలేదు గౌతమ్‌కి.

రెండు నిముషాల తరువాత ఒక డాక్టరు పరుగులాంటి నడకతో వచ్చాడు. ఆ వెనుకనే ఆ ఇద్దరు నర్సులు కూడా వచ్చారు.

డోరు తెరుచుకుని డాక్టరు, అతని వెనుక ఒక నర్స్ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళిపోయారు.

మరొక నర్స్ ఒక్కక్షణం బయటనే నిలబడింది.

ట్రేలో వున్న మెడిసిన్ బాటిల్స్ ఒక్కసారి సరిచూసుకోసాగింది.

అదే క్షణంలో ఆమెను సమీపించి "అతని కండిషన్ ఎలా వుంది సిస్టర్" ఆందోళన నిండిన స్వరంతో అన్నాడు గౌతమ్.

ఓ క్షణం గౌతమ్‌ని చూసి 'పల్స్ డౌన్ అయిపోతోంది!" ఆమాట చెప్పి ఆమె కూడా ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళిపోయింది.

అంటే....జీవితపు చివరి ఘడియలనుకోవాలా!

రక్తం గడ్డ కట్టుకు పోతోంది గౌతమ్‌కి.

అటు శుభాంగికి ఏమయిందో తెలియదు.

ఇటు రఘునాథ్ ఏమవుతున్నాడో తెలియదు.

మరోవైపు తనని వెన్నాడుతున్న వ్యక్తులు.

వాళ్ళు తన పాలిటి మృత్యువు కాబోతున్నారేమో తెలియదు,

ఏం జరగబోతోంది?

అంత వరకు స్తంభం చాటుగా బెంచి మీద కూర్చున్న ఆ అగంతకుడు లేచాడు.

o o o

దిగాలుగా అక్కడున్న బెంచీమీద చతికిలపడ్డాడు గౌతమ్.

అతని కళ్ళలో నీటి పొరలు నిలిచాయి.

'ఏ క్షణంలో అయినా ఆపరేషన్ థియేటర్‌లో నుంచి రఘునాథ్ నిర్జీవంగా బయటికి రావచ్చు' అని చెబుతోంది అతని మనస్సు.

నిర్లిప్తంగా ఎటో చూస్తున్న గౌతమ్, తన ఒడిలో ఏదో వస్తువు పడటంతో ఉలిక్కిపడి చూసాడు.

గౌతమ్‌కి ఎదురుగా నాలుగడుగుల దూరంలో నిలబడి ఉన్నాడు ఆ అగంతకుడు. అతని చేయి కోటు జేబులో ఉంది

అందులో నుండి నల్లని రివాల్వర్ ఒకటి సగం సగం కనిపిస్తోంది.

గౌతమ్ వైపు చూసి పళ్ళన్నీ కనిపించేలా నవ్వాడు.

ఆ నవ్వు చూస్తే ఒంటిమీద తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది. తన ఒడిలో పడిన వస్తువేమిటా అని చూసాడు.

గ్రీన్ కలర్ కవర్ అది.

"ఆ కవర్‌లో చూసుకో" అన్నట్టుగా సైగచేసి త్వరత్వరగా నడుచుకుంటూ మాయం అయిపోయాడు ఆ వ్యక్తి.

మామూలు పరిస్థితిలో అయితే ఎగిరి ఆ వ్యక్తి గుండెల మీద తన్ని చిత్రవధచేసి అతనెవరో, ఎందుకు వెంటాడుతున్నాడో అన్నీ తెలుసుకునేవాడు.



కానీ....ఆ సమయంలో మాత్రం....ఏమీ చేయలేకపోయాడు.

ఆ వ్యక్తి రివాల్వర్‌తో కాల్చినా కూడా తను చూస్తూ ఉండిపోయేవాడేమో!

కవర్ చేతిలోకి తీసుకుని ఓపెన్ చేసాడు.

అందులో ఒక తెల్ల కాగితం మడతపెట్టి ఉంది.

ఆ మడత విప్పబోతూ ఇటూ అటూ చూసాడు. ఎవరూ లేరు తన పక్కన.

ఆ వ్యక్తి ఎక్కడయినా కనపడతాడేమోనని అన్ని వైపులా మరోసారి కలయ చూసాడు.

అతనెక్కడా లేడు.

పేపరు మడతలు విప్పాడు.

అందులో నల్లని అక్షరాలు ఉన్నాయి.

"మేము పంపించిన వార్త నీకు అందింది. సిద్ధంగా ఉండు. త్వరలోనే మరో వార్త కూడా అందుతుంది."

స్వచ్ఛమైన తెలుగులో ఉంది ఆ మేటర్. క్రింద సంతకంగాని, మరే విధమైన అక్షరాలు కాని లేవు.

మామూలుగా అయితే - "ఆ మరో వార్త ఏమయి ఉండవచ్చు.... మరెవరినైనా కూడా చంపబోతున్నారా! మరో విధమైన ఎత్తుగడ ఎలా ఉంటుంది"....లాంటి ఆలోచనలు వచ్చేవి. ఇప్పుతనిలో అటువంటి ఆలోచనలు ఏమాత్రమూ లేవు.

ఏదో నిర్లిప్త ధోరణి.

జీవితంలో అన్నీ పోగొట్టుకున్న నైరాశ్యం.

వైరాగ్యం.

వేదాంత ధోరణి.

అలా శూన్యంలోకి చూస్తూ కూర్చున్న అతనికి ఎన్ని గంటలు గడిచాయో కూడా తెలియదు.

"మిస్టర్ గౌతమ్" అన్న పిలుపుకి తల తిప్పి చూసాడు.

ఎదురుగా నిలబడి ఉన్నాడు అంబులెన్స్‌లో వచ్చిన డాక్టర్.

"ఎ—ఎలా ఉంది....అతని కండిషన్" తడి ఆరిపోతున్న పెదవుల్ని నాలికతో తడిచేసుకుంటూ అడిగాడు గౌతమ్ డాక్టర్ నుండి రాబోయే సమాధానం పిడుగుపాటులా ఉంటుందని ఊహిస్తూ.

"అదృష్టవశాత్తు డౌట్ అయిన పల్స్ తిరిగి అందుకుంది. ఒక దశలో అతని పరిస్థితి అయిపోయింది అనుకున్నాం. బట్....ఈ క్షణంలో అయితే జీవించే ఉన్నాడు. మరో నలభై ఎనిమిది గంటలు సర్వయివ్ కాగలిగితే ఆ తరువాత పెద్దగా ప్రాబ్లం ఉండదు."

రఘునాథ్ బ్రతికే ఉన్నాడన్న విషయం తెలిసి చెప్పలేని ఆనందం కనిపించింది. కానీ....మరో నలభై ఎనిమిది గంటలు ఎలా గడుస్తాయో తెలియదు. "భగవాన్ అతన్ని బ్రతికించు" అనుకున్నాడు మనస్సులో.

"మీరు నాతో రండి" అని ముందుకు కదిలాడు డాక్టర్.

అతని వెనుకనే యాంత్రికంగా నడిచాడు గౌతమ్.

కారిడార్ చివరిలో ఉన్న అతని రూమ్ దగ్గర ఆగి లోపలికి నడిచాడు డాక్టర్.

ఆ వెనుకనే లోపలికి వెళ్ళాడు గౌతమ్.

మసక చీకట్లు కమ్ముకున్నాయి.

ఆ గదిలోకి రాగానే లైట్ ఆన్ చేశాడు డాక్టర్.

కూర్చోమన్నట్టుగా చైర్ చూపించాడు.

కూర్చున్నాడు గౌతమ్.

వాష్ బేసిన్ వైపు నడిచి చేతులు కడుక్కోసాగాడు డాక్టర్.

"డాక్టర్" పిలిచాడు.

ఏమిటన్నట్లు చూసాడు డాక్టర్.

"నేను....ఇప్పుడు....రఘునాథ్‌ని చూడచ్చా"

"ఇప్పుడా!"

అవునన్నట్టు తల ఊపాడు.

"ఇప్పుడు అతను ఎక్కడున్నాడో తెలుసా?" ఎదురు ప్రశ్నించాడు. నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ డాక్టర్ ఎదురు ప్రశ్నించేసరికి తడబడ్డాడు గౌతమ్.



"హి ఈజ్ స్టిల్ ఇన్ ది ఆపరేషన్ థియేటర్"

తెల్లబోయాడు గౌతమ్.

తను ఏదో ఆలోచనల్లో ఉన్న సమయంలో రఘునాద్‌ని ఆపరేషన్ థియేటర్ నుండి బయట ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కో, స్పెషల్ వార్డుకో తరలించి ఉంటారనుకున్నాడు. కాని....ఇంకా ఆపరేషన్ థియేటర్లోనే ఉన్నాడన్నమాట.

"డాక్టర్....అంటే....ఇంకా.... అతను....అక్కడే ఉన్నాడన్న మాట. అయామ్ సారీసార్"

"ఇట్సాల్‌రైట్. అతనికి ఇప్పటికి మూడు ఆపరేషన్స్ అయ్యాయి. తలకి కుడివైపు చెవికి పైభాగంలో దెబ్బతగిలింది. నరాలు చిట్లిపోయాయి. ఫలితంగా అతని కుడి చెవి ప్రస్తుతం పని చేయదు. కొన్నాళ్ళ తరువాత అయినా పని చేస్తుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేము. దానికి ఒక ఆపరేషన్ అయింది."

"మరి మిగతావి?"

"అదే చెబుతున్నాను....అతనికి పొట్టలో కారు తాలూకు ఇనుప రాడ్ గుచ్చుకుంది. అది జీర్ణాశయం నుంచి కాలేయం వరకు దిగింది. అదృష్టవశాత్తు అతని లివర్‌కి పెద్దగా దెబ్బ తగలలేదు. అదే దెబ్బ లివర్‌కి తగిలి వుంటే ఈ పాటికి అతని ప్రాణాలు పోయి వుండేవి"

"ఈ యాక్సిడెంట్‌లో అతని కాళ్ళు బాగా దెబ్బతిన్నాయి" అతనే అన్నాడు.

"డాక్టర్....మరి మూడో ఆపరేషన్...."

"అది కాళ్ళకి .... జరుగుతోంది. ఒక కాలు బాగా నజ్జు నజ్జుగా నలిగిపోయింది. మోకాలి పైభాగంలో బలమైన దెబ్బ తాకింది. ఇంచుమించుగా ఆ కాలు శరీరం నుంచి ఊడిపోయిందనే చెప్పాలి"

అది వింటున్న గౌతమ్ శరీరం కంపించింది.

"ఆ కాలిలోని బోన్ దాదాపు ఏడు అంగుళాల మేర ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది. ఆ ప్రదేశంలోని బ్లడ్ వెసల్స్, నెర్వ్స్, మజిల్ టిష్యూస్ చాలా ఎక్స్‌టెన్సివ్‌గా డామేజి అయ్యాయి."

ఓ క్షణం ఆగి తిరిగి చెప్పసాగాడు-

"తెగిపోయిన ఆ కాలుని తొడ దగ్గర తిరిగి జాయింట్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముక్కలుగా విరిగిపోయిన ఆ బోన్ ప్రదేశంలో స్టెయిన్‌లెస్ స్టీల్ జాయింట్స్ వేస్తున్నారు. కట్ అయిపోయిన బ్లడ్ వెసల్స్, నరాలు అన్నీ మైక్రో సర్జరీలో కలిసి కుట్లు వేస్తున్నారు"

మౌనంగా వింటున్నాడు గౌతమ్.

"కుట్లు వేసాక అది కరెక్ట్‌గా సెట్ అయితే అతను అదృష్టవంతుడే"

"రఘునాధ్ ఎడమ కాలికి కూడా గాయం ఉంది కదా!"

"యస్....అయితే అది ఇంత ప్రమాదకరమైంది కాదు. థై బోన్ ఫ్రాక్చర్ అయింది. పైన చర్మం కొంత దెబ్బతింది. అయితే మూడు నాలుగు నెలలలో ఆ కాలు తిరిగి సాధారణ స్థితికి వస్తుంది."

"మరి కుడికాలు?"

"చెప్పాను కదా మా ప్రయత్నం మేము చేస్తున్నామని! ఏమయినా రెండు మూడు రోజులు అయితేగాని ఏ విషయమూ చెప్పలేము. అయినా అతను చాలా మూర్ఖంగా ప్రవర్తించాడు. హాస్పిటల్‌కి తీసుకు వెళతాం అంటే రానని మొరాయించాడు. దాదాపు రెండు గంటలపాటు అలా రోడ్డు మీదే పడి ఉన్నాడు. దానివల్ల రక్తస్రావం చాలా జరిగింది. అందువల్ల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడింది. లేకుంటే ఇంతటి ప్రమాదం వచ్చేది కాదు."

బూట్ కాలితో నేలమీద రాస్తూ ఉండిపోయాడు గౌతమ్.

"ఇంతకీ ఎవరతను?" అడిగాడు డాక్టర్.

ఒక్క క్షణం సమాధానం చెప్పలేదు గౌతమ్. కారణం....ప్రైవేట్ డిటెక్టివ్ అని చెబితే తలనొప్పి కొని తెచ్చుకోవటమే అవుతుంది.



ఏం కేస్ ఇన్వెస్టిగేట్ చేస్తున్నారు ? ఈ యాక్సిడెంట్ హత్యా ప్రయత్నమా!

ఎవరు చేసి ఉంటారు ఇలా ? ఏ అవసరం ఉంది వాళ్ళకి ?

ఇటువంటివి లక్ష ప్రశ్నలు.

పైగా పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మరిన్ని ప్రశ్నలు, సమస్యలు.

అంతా తల నొప్పి వ్యవహారం.

"మాకు దూరపు బంధువు" పొడిగా అన్నాడు.

"మరి....మీరు వచ్చేదాకా రోడ్డుమీద నుంచి తనని కదిలించడానికి వీలు లేదని మొరాయించాడు. కారణం?"

"నీకెందుకు?" అని ఎదురు ప్రశ్నించాలనిపించింది.

సర్దుకుని, "అతని చెల్లెలు పెళ్ళి తాలూకు కట్నం డబ్బు తెచ్చాడు.

అది సూట్‌కేస్‌లో ఉంది.

ఆ డబ్బు నాకు అందుతుందో లేదోనని అక్కడే ఉన్నాడు.

"ఐసీ....ఏమాత్రం డబ్బు ఉందేమిటి?"

అసహనంగా ఉంది డాక్టర్ ప్రశ్నలకి. పోలీస్ ఇంటరాగేషన్‌లా ఉందది. నిజానికి పోలీసులే నయం.ఎదురు ప్రశ్నలు వేయలేదు. సింపుల్‌గా ఎఫ్.ఐ.ఆర్. పంచనామా తీసుకున్నారు.

"ఓ నలభై వేలవరకు ఉంటుంది"

"అంతేనా! కట్నం అంటే లక్షల్లో ఉంటుందేమో అనుకున్నాను. కేవలం నలభై వేల కోసం తన లైఫ్‌ని రెండు గంటలపాటు రోడ్డు మీద రిస్క్‌లో పెట్టుకున్నాడు. అది చాలా ఫూలిష్‌నెస్" స్వగతాన్ని పైకి అన్నట్టుగా అన్నాడు.

"అతను చాలా బీదవాడు. బొంబాయిలో చిన్న ఉద్యోగం చేస్తాడు. సంవత్సరాల తరబడి కూడబెట్టిన సొమ్ము అది. అందుకే అతనికి ప్రాణం కంటె ఎక్కువ" అసహనాన్ని అణచుకుంటూ అన్నాడు.

డాక్టర్ ముఖంలో రంగులు మారాయి. ఒకింత అనుమానంగా చూడసాగాడు గౌతమ్ వైపు.

"ఐకాంట్ బిలీవ్ ఇట్" అన్నాడు టేబుల్ మీది నీళ్ళ గ్లాసు అందుకుని తాగుతూ.

ఉలిక్కిపడ్డాడు గౌతమ్ ఆ మాటకి.

గ్లాసు టేబుల్ మీద ఉంచి గడ్డం మీదుగా క్రిందికి కారుతున్న నీటి చుక్కని ఎడమ చేతితో తుడుచుకుంటూ తిరిగి అన్నాడు.

"అవును. మీరు చెప్పింది అబద్ధం" కాన్ఫిడెంట్‌గా అన్నాడు.

"హౌ డూ యూ సే" గంభీరత ప్రదర్శిస్తూ అన్నాడు గౌతమ్.

నవ్వాడు డాక్టర్.

"సింపుల్.... పేషెంట్, ఐమీన్ రఘునాథ్ నువ్వు చెప్పినంత బీదవాడు కాదు. కారణం.... అతని కాళ్ళకి ఉన్న నైక్ షూస్‌ని నేను తొలగించాను. అదే మోడల్ నైక్ షూస్‌ని నా కొడుక్కి రెండు రోజుల క్రితమే ఐదు వేలకు కొనిపెట్టాను. అది నేను గమనించిన మొదటి విషయం.

రెండవది.... అతను యాక్సిడెంట్‌కి గురిఅయిన టాక్సీ ఎయిర్ పోర్ట్ నుంచి వస్తోంది. అతని సూట్‌కేసులకి ఎయిర్ లైన్స్ లగేజి స్లిప్స్ ఉన్నాయి. అతని జేబులో ఇండియన్ ఎయిర్‌లైన్స్ టికెట్స్ ఉన్నాయి. సంవత్సరాల తరబడి దాచి నలభై వేలు పోగుచేసిన మనిషి ఐదువేలుపెట్టి నైక్ షూ వేయడు, ఫ్లయిట్‌లో తిరగడు. ఇట్సాల్‌రైట్.... ఆ సూట్‌కేసులో డబ్బుంటే నాకేమిటి? బంగారపు బిస్కెట్స్ ఉంటే నాకేం. మామూలుగా అడిగాను."

అదిరిపడ్డాడు గౌతమ్. చూడటానికి బక్కగా పొట్టిగా కళ్ళజోడు పెట్టుకొని అమాయకంగా వున్న మహా మేధావి అని అర్థమయింది. ఈ డాక్టర్ వృత్తి బదులుగా ఏదయినా ప్రయివేట్ డిటెక్టివ్ ఏజెన్సీ పెట్టుకొని ఉంటే ఇంకా రాణించే వాడనిపించింది.

"ఇట్సాల్‌రైట్....ఆపరేషన్ కనీసం మరో రెండు మూడుగంటలు పడుతుంది. ఆ తరువాత ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచుతాం. మరో నలభై ఎనిమిది గంటలు గడిచే వరకు చూస్తాం"

"అతను రికవర్ అవుతాడా డాక్టర్?"



"ఇప్పుడు ఉన్న కండిషన్‌లో ఏమీ చెప్పలేము. ఎనీథింగ్ మే హేపెన్. ఉయ్ ఆర్ ట్రైయింగ్ అవర్ లెవల్ బెస్ట్. లెటజ్ హోప్ ఫర్ ది బెస్ట్.... ఎనీవే, నా డ్యూటీ టైమ్ అయిపోయింది. నేను వెళుతున్నాను. మీరు ఇక్కడే ఉండండి. మీ బంధువులని ఎవరినైనా కూడా పిలిపించండి. ఒకరికొకరు హెల్ప్‌గా ఉంటారు" అంటూ ఛైర్‌లోంచి లేచాడు.

ఆ వెనుకనే లేచి నిలబడ్డాడు గౌతమ్.

మరో నిముషానికి ఆ రూమ్ ఖాళీ అయింది.

o o o

"అమ్మా" ఒకింత బాధగా అంది శుభాంగి.

"అరె....ఇంజెక్షన్‌కి అంత ఇదయిపోతే ఎలా?" కొంచెంకటువుగా అన్నాడు డాక్టర్. స్పిరిట్‌లో ముంచిన కాటన్‌ని, ఆమెకు ఇంజెక్షన్ చేసిన చోట రుద్ది చేతులు కడుక్కున్నాడు

"ఈ రాత్రికి కొంచెం లిక్విడ్ డైట్ ఇవ్వండి. బై టుమారో షి విల్ బి కంప్లీట్‌లీ ఆల్‌రైట్" సుప్రియని ఉద్దేశించి అన్నాడు.

అలాగే అన్నట్టు తల ఊపింది.

సున్నితమైన శుభాంగి శరీరం ఇంజెక్షన్ చేసిన ప్రదేశంలో ఎర్రగా కందిపోయింది.

"ఈ టాబ్లెట్స్ ప్రతి ఐదు గంటలకి ఒకసారి వేయండి. రేపు ఉదయంతోటి ఇవి అన్నీకూడా ఆపెయ్యవచ్చు."

డాక్టర్ ఇచ్చిన టాబ్లెట్స్ తీసుకుంది సుప్రియ.

"నేను వెళతాను. ఇంక ఏ ప్రాబ్లం ఉండదు. ఈ రాత్రి ఏదయినా అంత అవసరం అయితే నాకు ఫోన్ చేయండి. నేను వస్తాను."

"అవసరం అయితే నేనే వస్తాను డాక్టర్" చెప్పింది సుప్రియ.

"అంత దూరం రావటం ఎందుకమ్మా. ఫోన్ చేసినా చాలు. అసలు ఆ అవసరమే రాదు"

"ఇక్కడ మా ఫోన్ పనిచేయటం లేదు డాక్టర్. మధ్యాహ్నం నుంచి డెడ్ అయింది. అందుకే అవసరం అయితే నేనే వస్తాను అన్నాను."

"ఆ....అవును కదూ! ఫోన్ డెడ్ అయిన విషయం మర్చిపోయాను. సరే.... నేనింక బయలుదేరతా!" కిట్ బ్యాగ్ తీసుకుని బయటికి నడిచాడు.

ఆయనని గేటు వరకు సాగనంపి తిరిగి శుభాంగి దగ్గరకు వచ్చింది సుప్రియ.

అప్పటి వరకు బెడ్‌మీద పడుకొని ఉన్న శుభాంగి ఇప్పుడు పిల్లోని గోడకి ఆన్చి బెడ్‌మీద కూర్చుంది.

ఆమె ముఖం అలసటగా, నీరసంగా ఉంది.

చెదిరిన జుట్టు ఆమె నుదుటిమీద, చెక్కిళ్ళమీద పడి ఒక రకమైన అందాన్ని ఇస్తోంది. నీరసంగా ఉన్న ఆమె ముఖం అప్పుడు కూడా ఎంతో అందంగా అనిపించింది. ఆమె ధరించిన గులాబీ రంగు నైటీ ఆమె శరీర వర్ణంలో కలిసిపోయింది.

గుండెల దగ్గర కొంచెం క్రిందికి జారిన ఆ నైటీ ఆమె అందాలని అస్పష్టంగా బహిర్గతం చేస్తోంది.

ఆమె మెడలోని సన్నని బంగారు గొలుసుకు ఉన్న లాకెట్ ఆమె వక్షస్థలంలో దాక్కుని దాగుడు మూతలాడుతోంది.

ఆమె పక్కనే బెడ్‌మీద కూర్చుంది సుప్రియ.

"ఇప్పుడెలా ఉంది నీకు" అడిగింది సుప్రియ.

"బాగానే ఉంది" అన్నట్లుగా తలఆడించింది శుభాంగి.

"పాలుకాని, కాఫీ కానీ త్రాగుతావా?"

"వద్దు" అని అర్థం వచ్చేలా తిరిగి తల ఊపింది.

"నీరసంగా ఉందా?"

మాట్లాడలేదు ఆమె.

సుప్రియ కూడా మౌనంగా ఉండిపోయింది.

కొద్ది క్షణాలు అక్కడ నిశ్శబ్దం నెలకొంది.

కుడికాలు బొటన వేలిని కుడి చేతి చూపుడు వేలితో రుద్దసాగింది శుభాంగి.

"గౌతమ్ ఎక్కడున్నాడు?" అడిగింది ఆమె.



"తెలియదు" అంది సుప్రియ.

"పొద్దున్న ఎప్పుడు వెళ్ళిపోయాడో నాకు తెలియదు. నేను అతనితో మాట్లాడుతుండగానే తిరిగి నిద్రలోకి వెళ్ళిపోయాను."

"......."

"మళ్ళీ వస్తానన్నాడా?"

అవునన్నట్లు తల ఊపింది సుప్రియ.

"ఎప్పుడు ?"

"మధ్యాహ్నం"

తల ఎత్తి వాల్ క్లాక్ వైపు చూసింది. రాత్రి సుమారు తొమ్మిది గంటలు కావొస్తోంది.

"మరి రాలేదేం?"

"తెలియదు"

"ఫోన్ అయినా చేయలేదా?"

"మన ఫోన్ డెడ్ అయ్యింది కదా!"

"వస్తాడా?"

"వస్తాడు.... రావచ్చు.... అనుకుంటా!" సందిగ్ధంగా సమాధానం ఇచ్చింది సుప్రియ. నిర్లిప్తంగా నవ్వింది శుభాంగి.

"అతను ఇంక రాకపోవచ్చు" ఆమే అంది.

"ఎందుకు రాడనుకుంటున్నావు?" అని అడగాలనుకుంది సుప్రియ. కానీ ఆ సంభాషణ పొడిగించడం మంచిది కాదనుకుంది.

శుభాంగి కంటి నుంచి ఒక నీటిచుక్క చెక్కిళ్ళ మీదుగా జారి నైటీ మీదపడి ఇంకి పోయింది.

"శుభా....నువ్వు రెస్ట్ తీసుకో. ఏవో పనులలో ఉండి గౌతమ్ రాలేకపోయి ఉంటాడు. అనవసరంగా లేనిపోని ఆలోచనలు పెట్టుకొని ఆరోగ్యం పాడుచేసుకోకు" ఆమె మాటల్లో ఒక విధమైన మందలింపు ధ్వనించింది.

బెడ్ మీదనుంచి లేచి కిటికీ తలుపులు మూసివేసింది సుప్రియ.

ఫ్యాన్ ఆన్ చేసింది. లైట్ ఆఫ్‌చేసి బెడ్‌లైట్ వేసి నిద్రలోకి జారుకుంది సుప్రియ.

శుభాంగి ఆలోచనలు మాత్రం గౌతమ్ చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి ఎందుకు రాలేదు? ఇంక వస్తాడో రాడో....

అర్థం పర్థంలేని ఆలోచనలు ఆమె మెదడును కమ్ముతున్నాయి.

డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ పనిచేస్తోంది.

కొంచెం మత్తుగా అనిపిస్తోంది. కనురెప్పలు బరువెక్కుతున్నాయి.

తెలియకుండానే ఆమె నిద్రలోకి జారిపోయింది.

ం ం ం

నల్లని చిక్కని ఆకాశం.

ఆ ఆకాశంలో ఓ ఎర్రని మెరుపు.

ఆ మెరుపు అంతకంతకు పెద్దదవుతోంది. దానితోపాటు మొదలయింది సన్నని గాలి.

క్షణాలు గడిచే కొద్దీ ఆ పిల్లగాలి ప్రళయకాల ఝంఝూమారుతమైంది.

మిరుమిట్లు గొలిపే ఎర్రని కాంతులు.

ఆ మెరుపులు జ్వాలల్లా కిటికీలోంచి ఆ గదిలోకి ప్రవేశించాయి.

అ గదిలోని బెడ్‌మీద....గాఢనిద్రలో ఉంది శుభాంగి.

కళ్ళు మూసుకుని ఉన్నా, ఆమెకు ఆ మెరుపులు కనిపిస్తూనే వున్నాయి.

ఆమె శరీరంలో కంపన మొదలయింది.

తలను అసహనంగా అటూఇటూ విదిలించసాగింది.

ఆ మెరుపులతోపాటు గాలిలో తేలుతూ రాసాగింది ఓ ఆకారం. ఆ ఆకారం కిటికీలోంచి లోపలికి వచ్చింది.

ఆమె బెడ్ పక్కనే నిలబడింది.

చిన్నదిగా ఉన్న ఆ ఆకారం పరిమాణం అంతకంతకూ పెద్దదయింది.



ఇప్పుడు ఆ ఆకారం ఎత్తు ఏడు అడుగులు వుంది.

నల్లని శరీరం....

నీగ్రోలాంటి ఉంగరాల జుట్టు....

చప్పిడి ముక్కు....

ఒంటిచేతి మనిషి.

ఆ రూపం ఆమెకు కొత్తకాదు. కొన్ని వందలసార్లు చూసింది అతనిని.

ఆమెను చూస్తూనే నవ్వాడతను.

అలా నవ్వినపుడు పెద్దవిగా ఉన్న అతని పళ్ళు కనిపించాయి.

ఆ నవ్వుకి ఆమె ఒళ్ళు జలదరించింది.

అపాదమస్తకం ఆమెను పరీక్షగా చూసాడు.

బలిష్టమైన తన చేయిని ముందుకు చాపాడు.

ఆమె రక్తం గడ్డకట్టినట్లయింది.

మృదువైన ఆమె కురులను బలిష్టంగా ఒడిసి పట్టింది అతని చేయి.

ఆమె బాధతో విలవిలలాడింది.

అతని ముఖం ఆమె ముఖానికి సమీపంగా వచ్చింది.

అతని శ్వాస ఆమె ముఖానికి తాకుతోంది.

హఠాత్తుగా ఆమె క్రింది పెదవిని బలంగా కొరికాడతను.

కెవ్వుమంది ఆమె.

ఆపై పెదవి నుండి బొటబొటా రక్తం కారింది.

ఆనందంగా క్రూరంగా నవ్వాడతను.

బెడ్‌పై నుండి క్రిందికి దూకాలని, పారిపోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది ఆమె. కానీ....

ఆమె చేతులు, కాళ్ళు ఏమాత్రం కదలటంలేదు.

అతని చేయి ఆమె ముఖం మీదుగా క్రిందికి జారసాగింది.

అతని దృష్టి.... చేయి.... ఆమె గుండెల మీద క్షణకాలం నిలిచాయి.

అతని చేయి ఆర్తిగా ఆమె శరీరం అంతటిని తాకసాగింది.

గుండెలు పిండేలా అరుస్తోంది ఆమె.

కానీ.... ఆమె అరుపులు ఎవరికీ వినపడటం లేదు.

అతను చేతిని ఆమె శరీరం మీదనుండి తొలగించి నవ్వాడు.

"ఇంక పద్దెనిమిది రోజులే"

ఆమె చెవిలో గుసగుసలాడినట్లుగా అన్నాడు.

"పద్దెనిమిది రోజుల్లో ఏం చేయబోతున్నావు? ఏం జరగబోతోంది?' దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో అంది ఆమె.

క్రూరంగా నవ్వాడు.

"తొందరెందుకు?.... చూస్తావుగా" ఇనుప గొలుసులు రాసుకున్నట్టుగా గరగర లాడుతోంది ఆ గొంతు.

హటాత్తుగా ఆమె చెంపమీద ఛెళ్ళుమని బలంగా చరిచాడు.

కెవ్వుమంది ఆమె.

"గుర్తుందా!"

"థర్టీ సిక్స్ – ట్వెంటీఫోర్ – థర్టీ సిక్స్..." అడిగాడతను.

అదిరిపడి లేచి కూర్చుందామె.

ఆ కల కరిగిపోయింది.

o o o

వేగంగా వెళుతోంది ఆటో.

ఆ వేగానికి వీచేగాలికి, సిగరెట్ వెలిగించుదామని రెండు అగ్గిపుల్లలు గీసి వ్యర్ధ ప్రయత్నం చేసాడు గౌతమ్. కొంచెం వెనుకకు తిరిగి రెండు చేతులు అడ్డు వుంచి వెలిగించాడు.

ఈ ప్రయత్నం ఫలించి సిగరెట్ వెలిగింది.

బలంగా దమ్ములాగి పొగ వదిలాడు గౌతమ్.

ముంచుకొస్తున్న నిద్రమత్తు కొంచెం వదిలినట్లనిపించింది.

కళ్ళల్లో ఇసుక పడినట్లుగా భగభగమండుతున్నాయి. అప్పటికి రెండు రోజులుగా నిద్రే లేదు.



రఘునాథ్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్నాడు. అతని పరిస్థితి ఇప్పటికీ ప్రమాదంగానే వుంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి.

కాలికి తగిలినా బలమైన గాయం వల్ల ఆ కాలు వుంటుందో తీసి వేయాల్సి వస్తుందో తెలియదు. తల మీద దెబ్బ తగిలింది.

అది తలవరకే తగిలిందా, మెదడులో ఏదయినా భాగానికి కూడా దెబ్బ ప్రభావం వుందా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు.

మరో నలభై ఎనిమిది గంటలపాటు ఈ టెన్షన్ భరించాల్సిందే.

ఒక సమయంలో రఘునాథ్ తల్లిదండ్రులకి బొంబాయి ఫోన్ చేసి ఇన్‌ఫార్మ్ చేద్దామనుకున్నాడు. కానీ ప్రస్తుతానికి ఆ ఆలోచన మానుకున్నాడు.

అతని ఆరోగ్య పరిస్థితి ఏమి కానున్నది అన్న విషయం రెండు రోజులలో నిర్ధారణ అయిపోతుంది. ఆ తరువాత పరిస్థితిని బట్టి అప్పుడే తెలియచేయడం మంచిదనిపించింది.

"ఎటువైపు వెళ్ళాలి సాబ్"

ఆటోడ్రైవర్ మాట వినిపించి ఆలోచనల్లోంచి తేరుకుని, "ఇటు రైట్ సైడ్‌కి పోనీయ్" చెప్పాడు.

అటు టర్న్ చేసాడు ఆటో డ్రైవర్

నాలుగు ఇళ్ళు దాటగానే శుభాంగి ఇంటి ముందు ఆపమన్నాడు.

ఆటో ఆగిన తరువాత దిగి ఫేర్ పే చేసి ముందుకు నడిచాడు.

గేటు దగ్గర వాచ్‌మాన్ గౌతమ్‌ని చూడగానే గేటు తెరిచాడు.

"అభీ.... మేమ్ సాబ్ కైసీహై" అడిగాడు.

"ఠీక్ హైసాబ్" చెప్పాడు వాచ్‌మాన్

థాంక్ గాడ్ ఈమె ఆరోగ్యంగానే వుందన్నమాట, అనుకుని లోపలికి నడిచాడు.

సుప్రియ కారు ఇంకా అక్కడే వుంది.

అంటే ఆమె ఇంకా శుభాంగిని అంటిపెట్టుకునే వుందన్నమాట.

హాలులోకి అడుగుపెట్టాడు.

ఎవరూ కనపడలేదు.

"ఏమండీ.... మొన్న వస్తానన్న పెద్దమనుషులు.... ఇప్పుడా రావటం"

సుప్రియ గొంతు వినపడడంతో తలతిప్పి ఆ దిశగా చూశాడు.

కిచెన్‌లోంచి బయటికి వస్తూ కనిపించింది ఆమె.

చాలా ఫ్రెష్‌గా కనిపించిందామె. బహుశా అంతకు ముందే స్నానం చేసి వుండవచ్చు అనుకున్నాడు.

అక్కడున్న సోఫాలో చతికిలపడిపోయాడు.

మాసిన గడ్డం.... రేగిపోయిన జుట్టు.... ఎర్రబారిన కళ్ళు.... వడిలిపోయినట్లున్న ముఖంతో వున్న గౌతమ్‌ని చూడగానే ఆమె ముఖము లోని చిరునవ్వు మాయం అయింది.

అతనేదో టెన్షన్‌లో వున్నాడన్న విషయం అర్థమయింది.

"వాట్ హేపెండ్ గౌతమ్.... యువార్ లుకింగ్ టెన్స్" అంది. అతని మనస్సులోని టెన్షన్ ఊహించటానికి ప్రయత్నించుతూ.

"అయాం వెరీసారీ ... శుభాంగిని చూడడానికి మళ్ళీ రాలేక పోయాను. ఇప్పుడు ఆమె ఎలా వుంది?"

"షి ఈజ్ ఫైన్.... రాత్రి నిద్రకూడా బాగానే పట్టింది. ప్రొద్దున్న డైట్ కూడా తీసుకుంది. షి ఈజ్ పెర్‌ఫెక్టలీ ఆల్‌రైట్ అండ్ షి ఈజ్ టోటల్లీ అవుటాఫ్ డేంజర్. పైన తన రూమ్‌లో కూర్చుని టి.వి. చూస్తోంది. శుభాంగి విషయం సరే.... మీరేమిటి అలా వున్నారు? ఏం జరిగిందో చెప్పలేదు."

"ఇట్స్ ఎ వెరీ శాడ్ ఇన్సిడెంట్.... రఘునాథ్ అనే ఒక వ్యక్తి తీవ్రమయిన యాక్సిడెంట్‌కు గురి అయ్యాడు.

"రఘునాధ్... ఎవరతను?"

"నా దగ్గర ఎంప్లాయి అతను."

"ఎక్కడ అయింది యాక్సిడెంట్?"

"ఇక్కడే .. మీతో చెప్పానుకదా! శుభాంగి ఫోటోలు, ఆ కేస్



ఫైల్స్ తీసుకుని బొంబాయి నుండి ఒక వ్యక్తి వస్తాడు అని. అతనే ఈ రఘునాధ్. నా దగ్గర పనిచేసే వ్యక్తులతో చాలా ముఖ్యమైనవాడు. నమ్మకస్తుడు. నాకు కుడిభుజంలాంటి వాడు. నా దగ్గర ఎంప్లాయి అనే బదులు, మంచి స్నేహితుడు అనడం సబబుగా వుంటుందేమో!"

"ఎలా జరిగింది యాక్సిడెంట్?" ఆమె ముఖకవళికల్లో కూడా మార్పు వచ్చింది.

జరిగిన విషయం క్లుప్తంగా చెప్పాడు గౌతమ్

ఆ విషయం చెబుతున్నప్పుడు అతని కంట్లో కదిలిన సన్నని నీటి పొరని గమనించింది ఆమె.

"వెరీ శాడ్" ఆ సంఘటన వింటుంటే ఆమె మనస్సు చలించి పోయింది.

"తన ఉద్యోగం అంటే ప్రాణం ఇచ్చే మనిషి.... తన ప్రాణాన్ని పణంగా పెట్టి దాదాపు గంటసేపు రోడ్డు మీదే, ఆ గాయాలతో నా కోసం ఎదురుచూసాడు. నిజానికి మౌనిక కేస్ ఫైల్ అంత ఇంపార్టెంట్ కానే కాదు. అతను అంత సమయం అలా రోడ్డు మీద వెయిట్ చేయకపోతే ప్రాణానికి అంత ప్రమాదం వుండేది కాదేమో!"

రెప్పవాల్చకుండా చూస్తూ అతను చెప్పే విషయాలు వింటోంది ఆమె.

"పాపం.... చాలా పూ్యర్ ఫ్యామిలీ.... ఇంటికి అతను ఒక్కడే ఆధారం. పెళ్ళికి ఎదిగిన చెల్లెళ్ళు ఇద్దరు. రిటైరైన తండ్రి, అనారోగ్య ముతో వున్న తల్లి - ఇది అతని కుటుంబం. ఇది కాకుండా రఘునాధ్‌కి ఒక అన్నయ్య, వదిన వుండేవారు. వాళ్ళిద్దరూ మూడేళ్ళ క్రిందట స్కూటర్ యాక్సిడెంట్‌లో చనిపోయారు. వాళ్ళ పిల్లలు ఇద్దరూ ·ేళ్ళ లోపువారే. వీళ్ళందరికీ ఇతనే ఆధారం.... ఇతనికి ఏమయినా జ ఆ కుటుంబం పరిస్థితి ఏమిటో అర్థం కావటంలేదు. కాంపెన్సే లక్షలు ఇస్తే మాత్రం సరిపోతుంది?"

తెలియకుండానే ఆమె కంటిలో చిన్న నీటి పొర

"భగవంతుడా, అతనికి ఏ చెడూ జరగకుండా బ్రతి

మనస్సులో, ఆ రఘునాధ్ అనే వ్యక్తి ఎవరో తెలియకపోయినా, ఆమె మనస్సు అలా ప్రార్థించింది.

రెండు నిముషాలు ఇద్దరి మధ్య నిశ్శబ్దంగా గడిచాయి.

"ఒక్క నిమిషం వుండండి.... కాఫీ తెస్తాను.... తాగి కొంచెం రిలాక్స్ అవ్వొచ్చు" అందామె అక్కడి నుండి కదులుతూ.

మాట్లాడలేదు గౌతమ్.

రఘునాధ్ గుర్తు వచ్చిన ప్రతిక్షణం అతని మనస్సు అస్తవ్యస్తం అయిపోతోంది.

నాలుగైదు నిముషాల తరువాత కాఫీ కప్పుతో తిరిగి వచ్చింది ఆమె.

"వద్దు".... అనాలనిపించింది కానీ, అనలేదు. అందుకుని సిప్ చేయసాగాడు.

"ఎలా వుంది కాఫీ.... చక్కెర సరిపోయిందా?" అడిగిందామె.

"సరిపోయింది. కాఫీ బావుంది కూడా!" కొంచెం మామూలు అవటానికి ప్రయత్నించుతూ అన్నాడు.

"మిమ్మల్ని చూస్తే నిన్నటి నుంచి అన్నం కూడా తినలేదేమో అనిపిస్తోంది. బ్రేక్‌ఫాస్ట్ చేస్తారా!"

"అబ్బే....ఇప్పుడేం వద్దులేండి"

"నేనేం తయారుచేయటం లేదు. ఇందాకే హోటల్ నుంచి తెప్పించాను. తినండి.... మీరు మళ్ళీ హాస్పటల్ దగ్గరకి వెళ్ళితే, అక్కడి పరిస్థితి ఎలా వుంటుందో ఏమో!"

"సరే....నేను వెళ్ళేముందు తింటాను. పదండి శుభాంగిని చూద్దాం" అన్నాడు ఖాళీ కప్పు కిందపెడుతూ.

"మీరు పైకి వెళ్ళండి. కిచెన్‌లో స్టవ్ మీద పాలున్నాయి. నేనూ వచ్చానంటే అవి పొంగిపోతాయి. కాబట్టి నేనొక ఐదు నిముషాల తరువాత వస్తాను."

అతను లేచి నిలబడ్డాడు.

ఒళ్ళు విరుచుకుని, మెట్లెక్కి పై రూమ్‌లోకి వెళ్ళాడు.



బెడ్ మీద అటువైపు తిరిగి కూర్చుని, టి.వి.లో వచ్చే కార్టూన్ ఫిల్మ్ చూస్తోంది శుభాంగి.

డోరు దగ్గర నిలబడి ఆమెను పిలవడానికి ఒక్క క్షణం సంశయించాడు.

పలుచని పింక్ కలర్ నైటీ ధరించి ఉందామె.

"హలో" అన్నాడు ఒక్క అడుగు ముందుకు వేసి.

తల తిప్పిందామె

క్షణం తరువాత ఆమె పెదవుల మీద చిరునవ్వు కదలాడింది.

చాలా నీరసంగా వుందా నవ్వు

బహుశా నాలుగైదు రోజుల వ్యవధిలో, ఆమె మొదటిసారి నవ్విందేమో!"

"రండి" అంది ఛైర్ చూపిస్తూ.

ఆమె ఎదురుగా వున్న ఛైర్‌లో కూర్చున్నాడు గౌతమ్.

పిల్లో ప్రక్కన వున్న రిమోట్ కంట్రోల్ అందుకుని టి.వి. ఆఫ్ చేసిందామె.

"అరె....ఆఫ్ చేసారేం.... ఏదో కార్టూన్ ఫిల్మ్ సీరియల్ చూస్తున్నారు కదా!"

"అబ్బే.... అదేం లేదు. ఏదో టైంపాస్ కోసం.... అంతే! మీరేమిటి? అలా వున్నారు? హెల్త్ బాగోలేదా?"

"నథింగ్.... అయామ్ ఆల్‌రైట్.... రెండు రోజులుగా నిద్ర లేదంతే"

"ఏమయింది?"

"కొద్దిగా పనుల వత్తిడిలో వుండి తిరుగుతున్నాను. అందువల్ల అలసటగా వుంది. అంతకు మించి ఏమీ లేదు" అన్నాడు ఆమెతో రఘునాధ్ యాక్సిడెంట్ విషయం ప్రస్తావించడం ఇష్టంలేక. కారణం.... ఆమె మానసిక స్థితి సరిగాలేదు. ఆ సమయములో ఇటువంటి విషయాలు చెప్పి మరింత ఆందోళనకు గురిచేయడం అవుతుంది.

"మీరు ఏదో దాస్తున్నారు" అతని కళ్ళలోకి పరీక్షగా చూస్తూ అంది.

"ఇందులో దాచడానికి ఏముంది? ఇంతకీ మీ ఆరోగ్యం ఎలా వుంది?" మాట మార్చడానికి ప్రయత్నించుతూ అన్నాడు.

"మరి నిన్న ఏందుకు రాలేదు?" అతనడిగిన ప్రశ్నను దాటవేస్తూ తిరిగి ఆమె అడగాలనుకున్న విషయానికి వచ్చింది.

ఇంక ఆమెకు సమాధానం చెబితే తప్ప ఊరుకోదనిపించింది.

"నిన్న నేను.... అనుకోకుండా ఊరు వెళ్ళాల్సి వచ్చింది. అందు వల్ల ఇక్కడ లేను."

"ఏ ఊరు?"

"కడప"

"ఏం పనో?"

"నా బిజినెస్ పనిమీద ... ఎందుకలా తరచి ప్రశ్నిస్తున్నారు?"

"నిన్నంతా మీ కోసం ఎదురుచూసాను"

మాట్లాడలేదు అతను.

అంతకు ముందు రోజు ఆమె మాట్లాడిన మాటలు సడన్‌గా గుర్తుకువచ్చాయి అతనికి.

డాక్టర్ ఆమెను స్పృహలోకి తెప్పించినపుడు, తను వచ్చి ఆమెను పలకరించినపుడు - "గౌతమ్.... ఐ లవ్ యు ..." అని అస్పష్టంగా పలికి తిరిగి మత్తులోకి జారుకుంది.

ఆ విషయం గుర్తు వచ్చి ఉలికి పాటుగా ఫీలయ్యాడు.

"ఎందుకు అలా అంది ఆమె. అంటే.... ఆమె తనని నిజంగానే ప్రేమిస్తోందా?"

మనస్సులో వున్న బలమైన ఆలోచన, సగం సగం స్పృహలో వున్న ఆ సమయంలో ఆమె నోటి నుండి వెలువడిందా?

లేక, ఆ మత్తులో వచ్చిన-తెలియని, అర్థంపర్థంలేని మాటలా!

ఆ మాటలు అన్నట్లుగా ఆమెకు తెలుసా? తెలియదా?



ఆ సంఘటన గుర్తురాగానే ఆమెవైపు చూడాలంటే ఒకింత ఇబ్బందిగా అనిపించింది.

"ఏమిటి సీరియస్‌గా వున్నారు? ఏమయినా తప్పు మాట్లాడానా?" అన్న ఆమె మాటలకు సర్దుకుని "నోనో.... అదేంలేదు చెప్పండి" అన్నాడు.

"నిన్న మీరు వస్తారని రోజంతా ఎదురుచూసాను. కనీసం ఫోన్ అయినా చేస్తారనుకున్నాను. మా ఫోన్ నిన్న రోజంతా డెడ్"

సైలెంట్‌గా కూర్చున్నాడు గౌతమ్.

"ఏమిటి ఇద్దరూ అలా కామ్‌గా కూర్చున్నారు?" అంటూ ఆ రూమ్‌లోకి వచ్చింది సుప్రియ.

"మేమేమీ కామ్‌గా కూర్చోలేదు. ఇప్పుదే మాట్లాడడం ఆపాము" అంది శుభాంగి.

శుభాంగి పక్కనే కూర్చుంది సుప్రియ.

"మీరు హాస్పిటల్‌కి ఎంతసేపట్లో తిరిగి వెళ్ళాలి?" అడిగింది సుప్రియ?

"హాస్పిటల్‌కా? ఎందుకు?....ఏమయింది మీకు. ఒంట్లో బాగోలేదా?" ప్రశ్నించింది శుభాంగి.

"ఈయనకు కాదు....ఈయన ఫ్రెండ్‌కి" అని, గౌతమ్‌వైపు తిరిగి "మీరు మీ ఫ్రెండ్‌కి యాక్సిడెంట్ అయిన విషయం చెప్పలేదా?" అని అడిగింది.

ఒకింత ఇబ్బందిగా కదిలాడు గౌతమ్.

అతనిని, సుప్రియను ఓసారి మార్చి మార్చి చూసింది ఆమె.

ఇంక ఆ విషయాన్ని అక్కడితో సర్దెయ్యడం మంచిదని నిర్ణయించుకున్నాడు గౌతమ్.

"చెప్పలేదు. శుభాంగిగారి హెల్త్ బాగోలేదు కదా! చెప్పి ఆమె మనస్సు పాడుచేయడం ఎందుకని చెప్పలేదు"

"ఎవరా ఫ్రెండ్? ఏమయింది?"

"నథింగ్.... నా క్లోజ్ ఫ్రెండ్ ఒకడికి స్కూటర్ మీదనుండి పడి చిన్న యాక్సిడెంట్ అయింది. హాస్పిటల్‌లో చేర్పించాము. అంతే....

రెండురోజుల్లో డాక్టర్లు అతనిని డిశ్చార్జి చేస్తారు. అతన్ని చూడడానికే మళ్ళీ హాస్పిటల్‌కి వెళుతున్నాను."

"అయ్యో.... దెబ్బలు బాగా తగిలాయా!.... ఎనీథింగ్ సీరియస్."

"అంత ప్రమాదం లేదులెండి" అన్నాడు నవ్వడానికి ప్రయత్నించుతూ.

"థాంక్ గాడ్" అంది శుభాంగి.

"సరే నేను వెళ్ళివస్తాను" అన్నాడు లేచి నిలబడుతూ.

"అప్పుడే?"

"తప్పదు.... వెళ్ళాలి. మరోసారి వస్తానులెండి. మీరు కూడా రెస్ట్ తీసుకోండి" అన్నాడు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ.

"మరోసారి అంటే.... ఎప్పుడు?"

"రేపో.... ఎల్లుండో వస్తా!"

"సాయంకాలం రాలేరా?"

"సాయంకాలమా!.... ఎందుకు?"

"ఎందుకు?....అంటే ...ఏమీలేదు....ఊరికినే"

"క్షమించండి ...వీలుకాదు...."

"పోనీ ఫోన్ అయినా చేయగలరా ?"

అలాగే అన్నట్లుగా తల ఊపాడు గౌతమ్.

ఆ సమయంతో వారిద్దరి మానసిక స్థితి అర్థం చేసుకోగలదు సుప్రియ.

శుభాంగి ఒంటరితనం ఫీలవుతోంది. ఆ ఒంటరితనానికి గౌతమ్ తోడుంటే బాగుండుననిపిస్తోంది. ఆమె అతన్ని ప్రేమిస్తోంది.

గౌతమ్‌తో కలిసి జీవితం పంచుకోవాలనే ఉద్దేశంతోనే తిరిగి ఆమె మామూలు అవుతోంది.

కాని....

గౌతమ్‌లో.... ప్రేమ....అభిమానం అనేవి ఏకోశానా లేవు.

అతను ప్రేమ అనే మాటకే బద్ధ వ్యతిరేకి. ఆ మాటకి అర్థంలేదని అతనెవరినీ ప్రేమించడు.



శుభాంగితో మాట్లాడుతున్నాడంటే....అది కేవలం ఒక క్లయింట్‌తో మాట్లాడుతున్నట్లుగానే తప్ప మరో ఉద్దేశంతో కాదు.

అతనికి శుభాంగి గత చరిత్ర కావాలి. ఆమె మౌనిక అవునోకాదో తెలుసుకోవాలి.

ఆమె జై సింగ్ షకావత్ కూతురేనని ఋజువుచేయాలి. అప్పుడతనికి అతిక్లిష్టమైన కేస్ సాల్వ్ చేసానన్న సంతృప్తి మిగులుతుంది.

అతని లక్ష్యం, ఆమెతో మాట్లాడే వుద్దేశం అదే. అంతకు మించి ఏమీలేదు.

"రెస్ట్ తీసుకోండి. నేను వెళతాను" అంటూ బయటికి కదిలాడు.

అయిష్టంగానే తల ఊపింది శుభాంగి.

"గౌతమ్‌గారిని పంపించివస్తాను" అంటూ అతని వెనుకే క్రిందికి వచ్చింది సుప్రియ.

"ఇప్పుడు హాస్పిటల్‌కేనా?" అడిగింది సుప్రియ గౌతమ్‌ని.

అవునన్నట్లు తల ఊపాడు.

"పాపం....దురదృష్టం కాకుంటే.... సరిగ్గా ఈ ఊరిలో అడుగు పెట్టగానే యాక్సిడెంట్ అవడం ఏమిటో...." బాధగా అంది.

"అది యాక్సిడెంట్ కాదు"

"కాదా!"

"కాదు.... హత్యాప్రయత్నం"

అదిరిపడింది ఆమె.

అంతకు ముందు ఆమెతో విషయం చెప్పినపుడు యాక్సిడెంట్ అన్నట్టుగానే చెప్పాడు. కాని....వివరంగా 'హత్యాప్రయత్నం'అన్నట్లుగా చెప్పలేదు ఇప్పుడు ఆమెకు ఆ నిజం కూడా చెప్పాలనిపించి జరిగింది వివరంగా చెప్పేసాడు.

అది వింటున్న ఆమె గుండెలు దడదడా కొట్టుకోసాగాయి.

"కాని.... అలా.... మర్డర్ ఎటెమ్ట్ ఎవరు చేసి వుంటారు?"

"తెలియదు. అతను తెచ్చింది మాత్రం శుభాంగి కేస్ ఫైల్....

అతనా ఫైల్స్ తెచ్చిన విషయం ఎవరికో తెలిసింది. అందుకే అతని వెంట పడ్డారు. ఆ ఫైల్స్ నాకు చేరకుండా చూడాలని ప్రయత్నించారు. అంటే శుభాంగిని మౌనికగా నిరూపించడానికి ఎవరో అడ్డుపడుతున్నారు అని నా అనుమానం. దీనినిబట్టి నా అనుమానం మరింత బలపడింది. ఈమె శుభాంగి కాదు. ఖచ్చితంగా మౌనికే''

అవాక్కయిపోయింది సుప్రియ.

ఇదంతా వింటుంటే ఆమెకు ఎందుకో భయంగా అనిపించింది.

శుభాంగి— శుభాంగి కాదా! మౌనిక అనే మరో అమ్మాయా!

అసలీ అవతారం ఈమె ఎందుకు ఎత్తింది?

శుభాంగికి తనే మౌనిక అన్న విషయం తెలుసా?

తెలిసే వుండాలి.

తెలిసే నాటకం ఆడుతూ వుండివుండాలి. కాని దానివల్ల ఆమెకు ఉపయోగం ఏమిటి?

ఆమె గతానికి సంబంధించిన సాక్ష్యాలు బయటపడకుండా ఎత్తుకు పోవాలని చూస్తున్న ఆ వ్యక్తులు ఎవరు?

వాళ్ళకి శుభాంగితో ఏమిటి సంబంధం?

తనకి సంబంధించిన వివరాలు బయటికి పొక్కకుండా శుభాంగే ఎవరయినా కిరాయి గూండాలని పంపిందా! దానివల్ల ఆమెకు ప్రయోజనం ఏమిటి?

''ఏమిటి ఆలోచిస్తున్నారు? విషయం వింటే భయంగా వుందా ?'' అని అడిగిన అతని ప్రశ్నకు సర్దుకుని లేదన్నట్లుగా తల అడ్డంగాఊపింది ఆమె.

''నేను వెళతాను''

అలాగే అన్నట్లు తల వూపింది సుప్రియ.

మరో నిమిషానికి అతను వెళ్ళిపోయాడు.

* * *

రెండు రోజులు గడిచాయి.



ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకే హాస్పిటల్‌కి చేరుకున్నాడు గౌతమ్.

డాక్టర్ లక్ష్మీరావు కేబిన్‌ని సమీపించాడు.

బయట వున్న ప్యూన్‌ని అడిగాడు ''సార్ ఉన్నారా?'' అని.

ఉన్నారు. లోపలికి వెళ్ళమన్నట్లుగా సైగచేసాడు ప్యూన్.

స్ప్రింగ్ డోర్ తీసుకుని లోపలికి వెళ్ళాడు గౌతమ్.

అతని రాకను గమనించలేదు ఆయన. ఏదో మెడికల్ లిటరేచర్ సీరియస్‌గా చదువుతున్నాడు.

కొద్ది క్షణాలు అలాగే నిలబడి.... ఆయన తనను గమనించక పోవడంతో చిన్నగా దగ్గాడు.

తలఎత్తి చూసి- ''ఆ.... రండి.... ప్లీజ్ సిట్'' ఛైర్ చూపించాడు ఆయన.

కూర్చున్నాడు గౌతమ్.

''పేషెంట్ ఈ రోజుకూడా ఒంటరిగానే వున్నాడు. అతని తల్లి దండ్రులకిగాని, బంధువులకుగానీ ఈ విషయం ఇంకా తెలియపరచ లేదా ?

లేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు గౌతమ్.

''వై ?''

''అతని తల్లిదండ్రులు ఈ నిజం విని తట్టుకోలేరు. ఇంతకీ అతని కండిషన్ ఎలా వుంది డాక్టర్?'' గౌతమ్ మాటల్లో ఆత్రుత, అతని కళ్ళలో ఆందోళన కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

మెడికల్ జర్నల్ ప్రక్కన పెట్టి టేబుల్‌మీద చేతులు వుంచి ముందుకు వంగాడు ఆయన.

''చూడు మిస్టర్. అతను ప్రమాదం నుంచి బయటపడినట్లే. అతని బి.పి., హార్ట్‌బీట్ అన్నీ కంట్రోల్‌లోకి వచ్చాయి. రెస్పిరేషన్ కూడా నార్మల్ అయింది. బాడీ సిస్టమ్స్ ఆర్ వర్కింగ్ వెల్.''

పట్టలేనంత ఆనందంగా అనిపించింది గౌతమ్‌కి.

''థాంక్యూ డాక్టర్. అతను బ్రతికాడంటే అది మీ చలవే. కేవలం

మీ ఎఫర్ట్! అతనికి పునర్జన్మ ఇచ్చారు సార్" దాదాపుగా అతని కళ్ళలో ఆనందంతో నీళ్ళు నిండాయి.

అదే సమయంలో అతనికి ఒక విషయం గుర్తువచ్చింది.

"డాక్టర్.... అతని తలకు దెబ్బతగిలింది కదా? మెదడుకు ఏమైనా ఎఫెక్ట్ అయిందా?" అంటూ ఆందోళనగా అడిగాడు.

"లేదు.... అన్ని టెస్ట్‌లు చేసాం, స్కల్‌కి తగిలింది కానీ, మెదడుకేమీ కాలేదు. అతను నిన్నరాత్రి స్పృహలోకి వచ్చాడు. వస్తువులనుగుర్తు పడుతున్నాడు. అతని పేరు చెప్పాడు. మీ పేరు చెప్పాడు. కాబట్టి మెదడుకి ప్రాబ్లం ఏమీలేదు. రాత్రినుంచి ఇప్పటివరకు నాలుగైదు సార్లు స్పృహ వస్తోంది, మళ్ళీ పోతోంది. అది కొంత ఎనస్థీషియా మత్తువల్ల కూడా జరుగుతోంది.బహుశా ఈ సాయంకాలానికి అతను పూర్తి స్పృహలోకి వస్తాడు."

పట్టరాని సంతోషంగా అనిపించింది గౌతమ్‌కి.

"థాంక్యూ డాక్టర్. థ్యాంక్యూ వెరీమచ్" ఆనందంగా డాక్టర్ చేయి పట్టుకుని ఊపేస్తూ అన్నాడు గౌతమ్.

"ఇట్సాల్‌రైట్.... మా డ్యూటీ మేం చేశాము. అతని అదృషం బావుంది. బ్రతికాడు"

"డాక్టర్.... నేను ఇప్పుడు అతనిని చూడొచ్చా?"

"ష్యూర్. నేనూ వెళుతున్నాను రండి" అంటూ లేచాడు.

దాదాపు పరిగెత్తుతున్నట్లుగా నడవసాగాడు గౌతమ్.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ని సమీపించారు ఇద్దరూ.

"మీ షూస్ విప్పెయ్యండి" చెప్పాడు డాక్టర్.

దాదాపుగా బూట్లు విసిరేసినట్లుగా విప్పి పడవేసి డాక్టరు వెనుకనే లోపలికి నడిచాడు గౌతమ్.

ఎదురుగా బెడ్‌మీద అచేతనంగా పడుకొని వున్నాడు రఘునాధ్.

అనిర్వచనీయమైన ఆనందంతో బెడ్‌ని సమీపించి, రఘుని చూసి ఉలిక్కిపడ్డాడు.

ఆ దృశ్యం చూసిన గౌతమ్‌కి రక్తం గడ్డకట్టుకుపోయింది.



"అయాం సారీ గౌతమ్.... ఈ నిజం చెప్పాలనుకున్నాను. కానీ చెప్పలేకపోయాను" అని దోషిలా తల వంచుకున్నాడు డాక్టర్.

రఘునాథ్ వైపు చూడలేక కళ్ళు మూసుకున్నాడు గౌతమ్.

♦ ♦ ♦

బెడ్‌మీద అచేతనంగా పడివున్నాడు రఘునాథ్.

అతని ఎడమకాలు ఉండవలసిన స్థానంలో, మోకాలి వరకు ఏమీ లేదు.

తొడ నుండి మోకాలివరకు మాత్రమే వుంది. అంటే....రఘునాథ్ అవిటివాడు అయిపోయాడు.

ఆ దృశ్యం చూడలేక కళ్ళు మూసుకున్నాడు గౌతమ్.

"వుయ్ ఆర్ వెరీ సారీ మిస్టర్ గౌతమ్........ మోకాలి వరకు దాదాపుగా తెగిపోయిన కాలుని, ఎంతో శ్రమపడి మైక్రోసర్జరీ చేసాము. కాలు తిరిగి మామూలవుతుందనుకున్నాము. కానీ, అలా అవలేదు. మోకాలి క్రింది భాగం నిన్నటినుండి కుళ్ళిపోసాగింది. అలా వుంటే ఆ ఇన్‌ఫెక్షన్ శరీరమంతటికీ పాకి ప్రాణానికే ప్రమాదం! అందువల్ల తప్పనిసరి అయి ఈరోజు ఉదయమే మోకాలి వరకు ఆపరేషన్‌చేసి తొలగించాల్సి వచ్చింది. అతని కుడికాలికి ఏమీ ప్రమాదం లేదు. అలాగే అతని ప్రాణానికీ ప్రమాదం తప్పినట్లే"

డాక్టరు మాటలు అతని చెవులకు వినపడడం లేదు.

నిలబడలేక అక్కడే వున్న స్టూల్‌మీద చతికిలబడ్డాడు గౌతమ్. అతనికి కాళ్ళలో సత్తువ లేనట్లు అనిపించసాగింది.

"ఇందుకు ఒక రకంగా రఘునాథ్ నిర్లక్ష్యమే కారణం.... అతను చాలా సమయాన్ని రోడ్డుమీదే వృథా చేసాడు. అందువల్ల అప్పటికే అతని కాలుని బాక్టీరియా ఎటాక్ చేసేసింది! ఫలితం.... ఆపరేషన్ ఫెయిల్ అయింది. కాలు తొలగించాల్సి వచ్చింది"

కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి గౌతమ్‌కి.

అందమైన, బలమైన రఘునాథ్.... ఈ రోజు నుండి అవిటివాడు. తన పనులు తాను చేసుకోలేడు. ఒకరిమీద ఆధారపడే జీవితం. ఇంక

తన ఉద్యోగంలో ఏమీ సహాయపడలేదు. అతనికి మరో జీవనాధారం చూపించాలి. ఇప్పుడతని తల్లిదండ్రులకి ఏం ఇన్‌ఫార్మ్ చెయ్యాలి ?

రకరకాలుగా ఆలోచిస్తోంది అతని మెదడు.

రఘునాథ్ కుటుంబాన్ని ఏం చెయ్యాలి? అతనికి జీవనోపాధి ఎలా చూపాలి?

"మీరు అతని ఫ్యామిలీ మెంబర్స్‌కి ఇన్‌ఫార్మ్ చేశారా?"

డాక్టర్ మాటకి తల తిప్పి చూసి లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

"కనీసం మరో వారం పాటు అతను హాస్పిటల్‌లో వుండాలి. అతనితోపాటు ఎవరుంటారు?"

"నేనే వుంటాను" చెప్పాడు గౌతమ్.

ఓసారి ఎగాదిగా గౌతమ్‌ని చూశాడు డాక్టర్.

"వారం తరువాత డిశ్చార్జ్ చేస్తారా?" అడిగాడు.

"ఉయ్ హేవ్ టు సీ ది కండిషన్. అప్పటికి పరవాలేదనిపిస్తే డిశ్చార్జి చేస్తాము. లేకుంటే మరికొన్ని రోజులు ఆగాల్సి వస్తుంది. ఏది ఏమయినా కనీసం మరో రెండు నెలలపాటు అతనిని వారానికి ఒకసారి హాస్పిటల్‌కి తీసుకురావాల్సి వుంటుంది"

బొటన వేలి గోరు కొరకసాగాడు గౌతమ్.

రెండు నెలల పాటు.... ఇక్కడే అంటే.... ఎక్కడ ఉంచుతాడు ? హోటల్ రూమ్‌లో వుంచవచ్చు.

కానీ....

అతనితోపాటు ఒక వ్యక్తి తప్పనిసరిగా వుండాలి!

రెండు నెలలపాటు తను ఈ ఊరిలో వుండడం అసంభవం. పోనీ బొంబాయికి తీసుకువెళ్ళిపోతే.... డాక్టర్లు ఒప్పుకుంటారా!

డాక్టర్లు ఒప్పుకున్నా.... అతని తల్లిదండ్రులు అతనిని ఈ స్థితిలో చూసి తట్టుకోగలరా?

అగమ్యగోచరంగా అనిపించింది.

బెడ్‌మీద నిశ్చలంగా మత్తులో పడి వున్నాడు రఘునాథ్.



కాలు తీసివేసిన విషయం అతనికి ఇంకా తెలియదు.... తెలిసిన మరుక్షణం అతని మానసిక స్థితి ఎలా వుంటుందో....

అతనిని ఆ స్థితిలో చూస్తూ వుండడానికి మనస్కరించలేదు అతనికి స్టూలు మీదనుంచి లేచి మెల్లగా అడుగులు బయటికి వేసాడు గౌతమ్.

o o o

కాలింగ్ బెల్ మోగింది.

చదువుతున్న బుక్ ప్రక్కన పడవేసి ఒళ్ళు విరుచుకొని లేచి నిలబడింది సుప్రియ.

డోర్‌ని సమీపించి బోల్టు తీసింది.

లోపలికి వచ్చాడు గౌతమ్.

"అరె....మీరా....వారం రోజులుగా ఏమయిపోయారు?" ప్రక్కకు తప్పుకొని దారి ఇస్తూ అంది ఆమె.

లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు గౌతమ్.

అతని ముఖం చాలా డల్‌గా వుంది. గత వారం పదిరోజులుగా సరైన తిండి, నిద్రలేక బాగా నీరసించాడతను.

"ఎలా వున్నాడు మీ ఫ్రెండ్" అడిగింది గ్లాసుతో మంచినీళ్ళు అందిస్తూ.

"రికవర్ అవుతున్నాడు. ఫర్వాలేదు"

"కాలు తీసివేసారు కదా? అందుకు బాధపడుతున్నాడా?"

"మానసికంగా బాధపడుతున్నాడు.కానీ పైకి ఏమాత్రం కనబడడం లేదు. కానీ శారీరకంగా మాత్రం ఫాంటమ్ సెన్సేషన్‌తో బాధపడుతున్నాడు." (కాలుగాని, చెయ్యిగాని శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా తొలగించినప్పటికీ, ఆ చేయి ఇంకా వున్నట్లు.... చేతివేళ్ళన్నీ నొప్పులు పుడుతున్నట్లు అనిపించి భరింపరాని బాధగా వుంటుంది. నాలుగైదు నెలలవరకు ఈ బాధ వుంటుంది. దీనిని ఫాంటమ్ సెన్సేషన్ అంటారు.)

మనసు చివుక్కుమంది ఆమెకు.

"అతని తల్లిదండ్రులకు తెలియచేసారా?"

"ఈ కారణంగా అని చెప్పలేదు. తప్పనిసరి పనులవల్ల ఇక్కడ

ఒక నెలరోజులు అతను ఆగాల్సి వస్తుందని చెప్పాను.''

"డాక్టర్స్ అతని ఆరోగ్యం గురించి ఏమంటున్నారు?''

"హి ఈజ్ కంప్లీట్లీ అవుటాఫ్ డేంజర్. కుడికాలిమీద, తలమీద తగిలిన దెబ్బలు ఇంచుమించుగా తగ్గినట్లే''

"మరి... ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారు''

"రెండు రోజుల్లో''

"అప్పుడు బొంబాయి తీసుకువెళతారా!''

".... .... ....''

"ఇక్కడే వుంచుతారా?''

".... .... ....''

"ఇంకా ఏమీ నిర్ణయించలేదా?''

"ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకావడం లేదు. మరో నెలవరకు అతను ఇక్కడ వుంటేనే మంచిదన్న అభిప్రాయం నాకుంది. అందుకే మూడు వంతులు అతన్ని ఇక్కడే వుంచుతాను. కానీ.... ఇక్కడ ఎక్కడుంచాలో అర్థంకావడం లేదు. అతనితో హోటల్ రూమ్‌లో వుండడం కుదరదు. పోనీ ఎక్కడయినా రూమ్ తీసుకోవాలంటే.... నేను బయటికి వెళ్ళిన టైమ్‌లో అతనికి కాపలాగా ఎవరుంటారు!''

".... .... ....''

"అతను నీళ్ళు త్రాగాలన్నా ఒకరు అందించాల్సిందే'' జుట్టులోకి వేళ్ళు పోనించి తల పట్టుకున్నాడు.

"తలనొప్పిగా వుందా?'' అడిగిందామె.

లేదన్నట్లుగా తల ఊపి జుట్టులో నుండి చేతులు బయటకు తీశాడు.

"లెట్ మి గెట్ యూ ఎ కప్ ఆఫ్ కాఫీ'' అంటూ లోపలికి వెళ్ళిందామె.

సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు గౌతమ్.

కాఫీ తయారుచేస్తున్న సుప్రియలో ఆలోచన మొదలయ్యింది.



రఘునాథ్ హాస్పిటల్‌లో వుండగా గౌతమ్‌తో కలిసి వెళ్ళి చూసి వచ్చిందామె.

ఆ స్థితిలో వున్న రఘునాథ్‌ని చూసి అతను అపరిచితుడయినా, మనస్సెందుకో రోధించింది.

పూర్ మేన్....

మధ్యతరగతి మనిషి....ఇంటికి పెద్ద దిక్కు...

ప్రస్తుతం అవిటివాడు.

భగవాన్....ఇటువంటి కష్టం పగవాళ్ళకు కూడా వద్దు అనుకుంది ఆమె.

డికాక్షన్ తీసి గ్లాసులో పోసి పాలు, సుగర్ కలిపి రెండు కప్పులలో పోసి బయటకు తీసుకువచ్చింది.

కాళ్ళు చాపుకుని కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కి తలవాల్చి పడుకుని వున్నాడు గౌతమ్.

"కాఫీ తీసుకోండి'' అంది.

అతని భంగిమలో మార్పులేదు.

నిద్రపోతున్నాడా అని అనుమానం వచ్చిందామెకు.

చిన్నగా శబ్దం వచ్చేలాగ కప్పుని టీపాయ్ మీద వుంచింది.

అతని భంగిమలో మార్పు మాత్రం లేదు.

సందేహం లేదు—నిద్రపట్టేసింది అతనికి.

అలా క్షణాల్లోనే నిద్రపోయిన అతన్ని చూస్తే జాలి అనిపించింది ఆమెకు.

పాపం....సరిగా నిద్రపోయి ఎన్ని రోజులయిందో....పోనీ లోపలికి వెళ్ళి బెడ్ మీద పడుకోమంటే....

మెడ నొప్పి పుడుతుందేమో అలాగే సోఫాలో పడుకుంటే అనుకుంది.

మరో ఐదు నిముషాలు చూసి ఇంక నిద్ర నుండి అతనిని లేపటం మంచిదనుకుంది.

19)

"గౌతమ్....గౌతమ్"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

"అయామ్ సారీ టు డిస్టర్బ్ యువర్ స్లీప్....లోపలకు వెళ్ళి పడుకుంటారా?"

"అరే....ఇంతలోనే నాకు నిద్రపట్టిందా?" అంటూ సర్దుకుని కూర్చున్నాడు.

క్షణాల్లోనే నిద్రపోవడం అతనికి నవ్వనిపించింది.

"సరి అయిన నిద్రపట్టి ఎన్ని రోజులయిందో....పడుకోండి"

"నోనో....చాలా పనులున్నాయి. వెళ్ళాలి. కొంచెం ముఖం కడుక్కుంటా" అంటూ వాష్‌బేసిన్ వైపు నడిచి నీళ్ళతో ముఖం కడుక్కొని తిరిగివచ్చి కాఫీ కప్పు అందుకున్నాడు.

ఇద్దరూ కాఫీ సిప్ చేస్తున్నారు.

"షల్ ఐ టెల్ యు వన్‌థింగ్."

ఆమె మాటకి తల ఎత్తాడు.

"మీరు ఏమీ అనుకోనంటే....మీ సమస్యకు ఒక పరిష్కారం చెబుతాను"

"ఏ సమస్యకి?"

"అదే...మీ రఘునాథ్ సమస్యకి."

"చెప్పండి."

"హాస్పిటల్ నుండి డాక్టర్స్ డిశ్చార్జి చేయగానే....మా ఇంట్లో వుంచండి అతనిని"

"మీ ఇంట్లోనా!"

"అవును"

"మానవతాదృక్పథంతో మీరన్నమాటకి చాలా థాంక్స్."

"అరె....ఇది మాట కాదండి ...నేను సీరియస్‌గా అంటున్నాను"

"అతనిని నెల రోజులపాటు ఈ ఊళ్ళో వుంచాలి....ఒక పూటో ఒక రోజో అయితే తప్పకుండా వుంచేవాడిని....బట్....వన్ మన్త్."

"నెల కాబట్టే....ఇక్కడ వుంచమంటున్నాను"



"అతనికి సర్వీస్ చేయటం చాలా కష్టం. అనుక్షణం కనిపెట్టుకొని వుండాలి"

"ఫరవాలేదు. నాకు పనులేమున్నాయి....ఇంట్లోనే వుంటాను."

"తీర్థయాత్రలకి వెళ్ళిన మీ మదర్ తిరిగివస్తే....రఘునాథ్ మీ ఇంట్లో వుండడానికి అభ్యంతరం తెలియచేయవచ్చు."

"నో ...మా మదర్‌కి అటువంటి అభ్యంతరం వుండదు. ఆమెది చాలా ఉన్నతమైన మనసు"

"అతను మీకు క్లోజ్ ఫ్రెండ్ కూడా కాదు. అతని కోసం మీరు ఈ రిస్క్ తీసుకోవటం...."

"ఇందులో రిస్క్ ఏమీ లేదు. కష్టాలలో వున్న సాటి మానవుడికి సహాయం అందించడం తప్ప మరేమీ లేదు"

"మీలో అతని పట్ల ఎంత సానుభూతి వున్నా....నాకు మనస్కరించడంలేదు. అతను కూడా మీ ఇంట్లో వుండడానికి ఖచ్చితంగా వ్యతిరేకిస్తాడు"

"అలా అతను వ్యతిరేకించకుండా మనం కన్విన్స్ చేద్దాం."

"కానీ"

"ప్లీజ్... ఇంక వద్దని చెప్పవద్దు. ఈ ఇల్లు అంతా ఖాళీయే....అందువల్ల అతను ఇక్కడ వుండటంవల్ల ఎవరికీ ఇబ్బందిలేదు. కష్టంలో వున్న ఓ వ్యక్తికి కొన్నాళ్ళు సహాయపడ్డానన్న తృప్తి నాకుంటుంది."

వయస్సులో గౌతమ్‌కంటె రెండు మూడేళ్ళు చిన్నది అయినా, ఆమె వ్యక్తిత్వం ...తనకంటె కూడా చాలా ఉన్నతమైనదని అర్థం అయింది అతనికి.

ఆమె స్థానంలో తనుంటే....ఆ సహాయం అడిగి వుంటే...."సారీ కుదరదు" అని ఖచ్చితంగా చెప్పి వుండేవాడు.

కానీ....ఆమె....అడగకుండానే తనవంతు సహాయం అందిస్తోంది. "షి ఈజ్ గ్రేట్" అనుకుంటూ "సుప్రియా....యువార్ గ్రేట్" అంటూ అప్రయత్నంగా చేతులు జోడించాడు గౌతమ్.

ఆ నమస్కారం వయస్సులో తనకంటు చిన్నదయిన సుప్రియకు

కాదు....మానసికంగా తనకంటే ఎంతో గొప్పదయిన ఆమె మంచితనానికి.

o o o

"హలో"

బ్రష్‌తో పెయింటింగ్‌కి ఫినిషింగ్ టచెస్ ఇస్తున్న శుభాంగి తల తిప్పింది.

"హలో....రండి....ఏం చేస్తున్నారు? రఘునాధ్ ఎలా వున్నారు?" అడిగింది లోపలికి వస్తున్న గౌతమ్‌ని.

"ఫైన్. అతని ఆరోగ్యం కుదుటపడుతోంది."

"సుప్రియ ఆయనను సరిగ్గా చూసుకుంటోందా."

"ఆమెది చాలా ఉన్నతమైన మనస్సు. ఇప్పటికి రఘురామ్‌ని ఆమె ఇంటికి తీసుకువచ్చి రెండురోజులు అవుతోంది. ఈ రెండురోజులుగా అతనిని అనుక్షణం కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఆమె ఋణం ఎలా తీరుతుందో అర్థం కావటంలేదు."

"ఈరోజు మీరు కొంచెం ఫ్రెష్‌గా కనిపిస్తున్నారు" మాట మార్చడానికి ప్రయత్నించుతూ అందామె.

"అయి వుండొచ్చు. రెండు రోజులుగా కొంచెం సరిఅయిన నిద్ర వుంది" అన్నాడు నవ్వుతూ.

"రండి. అలా లాన్‌లో కూర్చుందాం" అంటూ బ్రష్‌లు అక్కడే పెట్టి బయటకు నడిచిందామె.

ఆమెను అనుసరించాడు గౌతమ్.

లాన్‌లో కూర్చున్నారు ఇద్దరూ.

కాళ్ళకు వున్న హవాయ్ స్లిప్పర్స్ విడిచి గడ్డిలో కాళ్లు వుంచిందామె.

పచ్చని ఆ పచ్చికలో తెల్లని ఆమె పాదాలు మరింత తెల్లగా కనిపించసాగాయి.

ఆమె కళ్ళలో కూడా తిరిగి జీవకళ వచ్చింది.

ఆమె ఆత్మహత్యాప్రయత్నం చేసినప్పటి సమయంలో వున్న వీక్‌నెస్ నుండి ఆమె పూర్తిగా బయటపడినట్లే.



"ఏం తీసుకుంటారు? కాఫీ....టీ....ఫ్రూట్ జ్యూస్"

"నథింగ్. ఇప్పుడే త్రాగాను. ఇంక నావల్లకాదు. ఇప్పుడు మీ హెల్త్ ఎలా వుంది?"

"ఫైన్. పగటిపూట ఏదో ఒక పనుల్లో సమయం గడిచిపోతోంది రాత్రులే."

"రాత్రులు త్వరగా నిద్రపోండి. సమయం గడవదు అన్న సమస్య లేదు."

"నిద్రపట్టదుకదా! ఒకవేళ నిద్రపట్టినా....ఏ క్షణంలో ఆ కల వస్తుందో నన్న భయం నన్ను వెంటాడుతోంది."

అప్పుడు గుర్తువచ్చింది అతనికి.

ఆమెకు తరచుగా ఏవో కలలు వస్తుంటాయని....దానివల్ల ఆమె మానసికంగా భయపడుతోందని సుప్రియ చెప్పింది.

"కలలా...."

"అవును"

"కలలు రావటం సహజం. కలలకే అంత కలవరపడాలా."

"ఇది నిజంలాంటి కల."

"అంటే...." ఆమెలోని విషయాన్ని రాబట్టాలని ప్రశ్నించడం మొదలుపెట్టాడు గౌతమ్.

"నన్ను కలవరపెట్టే కల....నన్ను మానసిక అశాంతికి గురిచేసే కల అది."

"అంటే....మీకు వచ్చేది ఒకే కలా!"

"అవును"

"రోజూ వస్తోందా."

"అవును. ఊహూ కాదు రెండు రోజులకోసారి. అలా కూడా చెప్పలేను. ఒకేరోజులో రెండుమూడుసార్లు కూడా రావచ్చు."

"ఎన్నాళ్ళనుండి వస్తోంది."

"రెండేళ్ళకి పైగా అయిందేమో"

"రెండేళ్ళనుంచా" తెల్లముఖం వేశాడు గౌతమ్.

ఒక మనిషికి ఒకే కల రెండు మూడు సంవత్సరాల పాటు రావటం....సంభవమేనా! నమ్మశక్యంగా లేదు అతనికి. ఆమె మాటల్లో నిజం లేదేమో అనిపిస్తోంది.

"అవును. అదే కల. రెండేళ్ళనుంచి"

"ఏమిటాకల?" అని అడుగుదామనుకున్నాడు. కానీ మళ్ళీ ధైర్యం చాలలేదు. కారణం....ఆమెదొక విచిత్రమైన మనస్తత్వం. ఏ క్షణంలో నవ్వుతూ మాట్లాడుతుందో....ఏ క్షణంలో సీరియస్ అవుతుందో.... ఎందుకు అవుతుందో తెలియదు. వీలయినంతవరకు ఆమె చెప్పేది వినటం మంచిదేమో అనిపించింది.

"ఏమిటాకల? అని అతడు అడుగుతాడనుకుంది. కానీ అతనలా మౌనంగా కూర్చోవటంతో ఆమె అంది "మీకు ఆ కల ఏమిటో తెలుసా!" అని.

ఇదేం ప్రశ్న! ఆమె కల తనకెలా తెలుస్తుంది? తెలియదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"తెలుసుకోవాలన్న ఆసక్తి వుందా!

"మీరు చెబితే వింటాను."

"ఇందులో చెప్పకపోవటానికి ఏమీ లేదు. నాకు నిద్రలో ఒక కల వస్తుంది. అందులో ఒక బలమైన వ్యక్తి....నల్లగా, ఎత్తుగా బలిష్టమైన కండరాలతో, నీగ్రోలాంటి జుట్టు, చప్పటిముక్కు, ఒకచేయి భుజంవరకు తెగిపోయి వుంటుంది. అతని నవ్వు చాలా క్రూరంగా వుంటుంది. మాట్లాడితే ఇనుపగోలుసులు రాసుకుంటున్నట్లు వుంటుంది. అతను నన్ను సమీపిస్తాడు. తన ఇనుపహస్తాలతో నా శరీరం అంతా తాకుతాడు. అసభ్యంగా ప్రవర్తిస్తాడు. చివరలో ఇంకా "ఇన్ని" రోజులే అంటాడు."

"అంటే" ఆమె మాట అర్ధంకాక అన్నాడు.

"నాకా కల మొదటిసారి వచ్చినప్పుడు" ఇంక రెండు సంవత్సరాలే!" అన్నాడు. ఆ తర్వాత నుండి కల వచ్చిన ప్రతిసారీ ఒక రోజు తగ్గుతోంది."

ఊపిరి బిగించి వినసాగాడు.



"చివరిగా మీకు ఆ కల ఎప్పుడు వచ్చింది?"

"నిన్న"

"అప్పుడేమన్నాడు?"

"ఇంకా పదహారురోజులే" అన్నాడు.

"అంటే....పదహారురోజుల తరువాత ఏం జరుగుతుంది!"

"ఏమో"

"పదహారురోజుల్లో ఏమయినా చేస్తానని బెదిరిస్తాడా!"

"అదేమీ చెప్పడు"

"ఈ కలలో ఏమీ మార్పు లేదా?"

"ఎప్పుడు వచ్చినా ఇలాగే వస్తుంది."

"కలలో వచ్చిన వ్యక్తి ముఖం గుర్తుందా?"

"బాగా గుర్తుంది"

"ఫైన్....అయితే అతని బొమ్మగీసి నాకు చూపించండి."

ఆమె ముఖంలో రంగులు మారాయి.

"సారీ....నేను అతని బొమ్మ గీయలేను."

"అదేమిటి?" మీరు ఆర్టిస్ట్ కదా!"

"బట్....ఈ విషయంలో మాత్రం నేను ఫెయిల్ అయ్యాను అప్పటికీ చాలాసార్లు అతని బొమ్మ పెయింట్‌చెయ్యాలని ప్రయత్నించాను. అదేమిటో....మరి....బ్రష్ పట్టుకున్నాక అతని కళ్ళు, ముక్కు ఎలా వున్నాయో గుర్తురాదు."

"చాలా వింతగా వుంది మీరు చెప్పే విషయం నిజం కాదేమో అన్నంత వింతగా వుంది."

"అంటే....అబద్దం చెబుతున్నానంటారా" ఆమె ముఖం ఎర్రగా అయింది.

"నో నో....అలా అనటంలేదు. చాలా వింతగా వుంది అనటానికి ఆ విధంగా చెప్పాను. అంతే" అన్నాడు. నిజానికి శుభాంగి ఏదో కట్టుకథ చెబుతోంది అనే అనుమానం అతనికి మనస్సులో ఖచ్చితంగా వుంది.

"గత రెండు సంవత్సరాలుగా కలలో ఆ వ్యక్తి మిమ్మల్ని

హింసిస్తుంటే....మీరు ఎవరైనా సైకియాట్రిస్టును సంప్రదించారా.''

లేదన్నట్లు తల ఊపింది.

''సైకియాట్రిస్ట్‌ని సంప్రదించలేదా'' తిరిగి అడిగాడు.

లేదన్న అర్థం వచ్చేలా తల అడ్డంగా ఊపింది.

అనుక్షణం మానసిక చిత్రవధకి గురిఅవుతూ బాధపడేకంటే ఒకసారి డాక్టరుని సంప్రదించడంవల్ల మీ సమస్య పరిష్కారం అయ్యేదేమో.''

''నాకు డాక్టర్ని కన్సల్ట్ చేయాలనిపించడంలేదు.'' ఖచ్చితంగా అంది ఆమె.

గౌతమ్‌లో సహనం అడుగంటింది. కానీ అది ఏమాత్రం పైకి కనపడకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈమె విషయం సైకియాట్రిస్ట్‌తో సంప్రదించడం తప్పనిసరి. శుభాంగి వచ్చినా రాకపోయినా, తానైనా వెళ్ళి, సైకియాట్రిస్ట్‌ని కన్సల్ట్‌చేసి ఈమె కలలను గురించి చర్చించాలని అనుకున్నాడు. సుప్రియ మేనమామ సైకియాట్రిస్ట్ అని అతనికి తెలుసు.

ఒకే కల ఇన్నిసార్లు రావటం సంభవమా! వచ్చిన ప్రతిసారీ ఆ వ్యక్తి ''ఇన్ని రోజులే'' అంటూ ఏదో అల్టిమేటం ఇవ్వటం వాస్తవానికి చాలా దూరంగా వుంది.

''ఏమిటి ఆలోచిస్తున్నారు'' అన్న ఆమె ప్రశ్నకి సర్దుకుని ''ఏమీ లేదు ఒక చిన్న విషయం ఆలోచిస్తున్నాను'' అన్నాడు.

''ఏ విషయం?''

''మీ గురించే''

''నా గురించా''

''అవును. మీలో ఒక వింత ప్రవృత్తి గమనించాను. ఎవరైనా కూడా సమస్యలు వుంటే, వాటికి పరిష్కారం కోరుకుంటారు. బట్ మీరు ప్రయత్నం చేయటంలేదు. అందుకే మిమ్మల్ని అర్థం చేసుకోవటం కష్టంగా వుంది'' నిర్మొహమాటంగా అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.



''మీరు నిజంగా మీ మానసిక ఆందోళననుండి పరిష్కారం కోరుకుంటున్నారా?''

అవునన్నట్లు తల ఊపింది.

''అయితే కొంతకాలంపాటు నేను చెప్పినట్లు చేస్తారా''

క్షణకాలం ఆలోచించి సరేనన్నట్లు తలూపింది.

''రేపు మీకు కొన్ని ఫోటోలు చూపిస్తాను. చూడండి.''

''ఏం ఫోటోలు?''

''చూస్తారుకదా! ఇప్పుడే చెప్పటం ఎందుకు?''

''సరే. ఆ ఫోటోలుచూసి నేనేం చెయ్యాలి?''

''అది కూడా అప్పుడే చెబుతాను.''

''ఆ ఫోటోలు చూడడం వల్ల నాకేమిటి ప్రయోజనం?''

''తొందరెందుకు? ఒక్కరోజు ఓపిక పట్టండి. రేపు ఫోటోలు తెస్తా కదా!''

గౌతమ్ మాటలు వింతగా తోచాయి ఆమెకు.

o o

''హౌ ఆర్ యు రఘు....'' ఇంట్లోకి వస్తూనే అడిగాడు గౌతమ్.

చదువుతున్న పేపర్ ప్రక్కన వుంచి తల తిప్పి ''ఫైన్''అన్నాడు రఘునాథ్.

''సుప్రియ ఎక్కడ?'' అడిగాడు బెడ్ ప్రక్కనే వున్న స్టూల్ మీద కూర్చుంటూ.

''కిచెన్‌లో వుంది'' అని అటుగా చూసి, ఆమె సమీపంలో లేదని నిర్ధారించుకొని, ''సార్....నన్ను ఇక్కడ వుంచొద్దు....నేనూ మీతోపాటు హోటల్ రూమ్‌లో అయినా వుంటాను. లేదా బొంబాయి అయిన తిరిగి వెళ్ళిపోతాను. ఇలా అపరిచిత వ్యక్తి ఇంట్లో వుండడం....ఆమె నాకు సేవలు చేయడం.... దుర్భరంగా అనిపిస్తోంది.''

''మిమ్మల్ని బాధించేలా ప్రవర్తించానా?''

సుప్రియ గొంతు వినడంతో అదిరిపడి తల తిప్పారు ఇద్దరూ. ఆమె కిచెన్‌లో లేదు. బెడ్‌రూంలో నుండి బయటికి వచ్చింది. ఆమెను చూసి తెల్లముఖం వేశాడు రఘునాథ్.

"మా ఇంటి వాతావరణం నచ్చకపోతే మీరు నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు" ఒకింత కటువుగా వుంది ఆమె గొంతు ఆ మాట అంటున్నప్పుడు.

"నో నో....అలాకాదు. మీకు చాలా ఇబ్బంది, శ్రమ కలిగించాల్సి వస్తోందని అంటున్నాను. నిజానికి మీరు చేస్తున్న సహాయానికి మీకు మేము ఏం చేసినా ఆ ఋణం తీరదు" ఆ మాట అంటున్న రఘునాథ్ కళ్ళలో సీటి పొర కదలాడింది.

"ఋణపడేటంత సహాయం నేను ఏం చేస్తున్నాను?"

"ఇంతకంటె ఏం చెయ్యాలి?... ముక్కూ ముఖం తెలియని వ్యక్తిని ఇంట్లో పెట్టుకుని, కంటికి రెప్పలా చూస్తున్నారు. బంధువులే సహాయం అంటే పారిపోయే రోజులివి. అలాంటిది మీరు...."

"ఛ.... అలా అనుకోవద్దు. ఏమో రేపు నేను మీ నుండి ఏదయినా సహాయం తీసుకోవాల్సి వస్తుందేమో!" అంతవరకు వాళ్ళిద్దరి ధోరణి చూసిన గౌతమ్‌కి సహనం చచ్చిపోయింది.

"అబ్బబ్బ ...ప్రాణం తీస్తున్నారిద్దరూ....ఇందాకటి నుంచి చూస్తున్నాను, మీకు ఋణపడిపోయాను అంటే అబ్బే ఇది నా ధర్మం అని.... మీ ఋణం ఎలా తీర్చుకోను అంటే, మీ సహాయం ఎలా మరువగలను అని....మీరు ఋణాలు, సహాయాలు తరువాత మాట్లాడుకోండి. ఇప్పుడు నేనొక ముఖ్యమైన పని మీద వచ్చాను. ముందు నా పని సంగతి మాట్లాడండి" విసుక్కున్నాడు నవ్వుతూనే.

ఇంక మాట్లాడలేదు వాళ్ళిద్దరూ.

"అయితే చెప్పండి మీరొచ్చిన పనేమిటో" అంది అక్కడున్న చైర్‌లో కూర్చుంటూ సుప్రియ.

కాలికున్న షూస్ లాగి పక్కన పడేసి రిలాక్స్‌డ్‌గా అయ్యాడు గౌతమ్ కూడా.



"మీ ఫ్రెండ్ మన స్తత్వం ఏమిటో ఆ భగవంతుడికి కూడా అర్థం కాదు" రెండు చేతులూ జోడించి ఎదురుగా వున్న వెంకటేశ్వరస్వామి ఫోటో చూస్తూ అన్నాడు గౌతమ్.

"మళ్ళీ ఏమయింది?" నాటక ధోరణిలో వున్న అతని అభినయానికి నవ్వుకుంటూ అంది సుప్రియ.

"ఏమిటేముంది. నిన్న మాట్లాడాను. మీరు చెప్పినట్లే తనకేదో కల వస్తోందని చెప్పింది. ఆ వ్యక్తి బొమ్మ గీయమంటే గుర్తు లేదంటుంది. సైకియాట్రిస్ట్‌ని కలుద్దాం అంటే కుదరదంటుంది. మీరు నాకొక నిజం చెప్పండి. ఆమె మానసిక స్థితి సరి అయినదేనా!" ఒకింత సీరియస్‌గా మారింది అతనిముఖం ఆ క్షణాన.

క్షణకాలం నిశ్శబ్దంగా వుంది ఆమె.

ఆమె ఏ సమాధానం చెప్పాలనుకుంటోందో చూద్దామని చూస్తున్నాడు రఘునాథ్.

"చాలామందికి వచ్చిన అనుమానమే మీకూ వచ్చింది. ఆమె అందరూ అనుకున్నట్టు మెంటల్ పేషెంట్ కాదు. చాలా ఖచ్చితమైన మానసికస్థితి వుందామెకు. అయితే ఆ కలలు వచ్చినప్పుడు మాత్రం ఆమె ధోరణి అదో మాదిరిగా వుంటుంది. అంతే"

"మరి డాక్టర్‌ని ఎందుకు సంప్రతించడం లేదు?"

"ఏమో!"

"కనీసం మనమైనా ఒకసారి మీ అంకుల్‌ని కలిసి మాట్లాడితే మంచిది. ఏమంటారు?"

"దట్స్ ఎ గుడ్ ఐడియా" చెప్పాడు రఘునాథ్.

"తప్పకుండా కలుద్దాం....ఆయన దగ్గర అప్పాయింట్‌మెంట్ ఫిక్స్ చేయనా!"

"ఎంత త్వరగా చేస్తే అంత మంచిది"

"అయితే ఇప్పుడే మాట్లాడతాను" అని అక్కడి నుంచి లేచి ఫోన్ దగ్గరకు నడిచి ఏదో నెంబర్ డయల్ చేసింది.

ఆమెనే చూస్తున్నారు ఇద్దరూ.

నిమిషం తరువాత ఫోన్ లిఫ్ట్ చేసినట్లున్నారు.

"హలో అంకుల్....నేను సుప్రియని"

"ఫైన్ అంకుల్"

"ఆ....ఒక విషయం మాట్లాడాలి .... అది....ఇదివరకు మీకు చెప్పాను గదా శుభాంగి అని నా ఫ్రెండ్ వుంది. ఆమె ప్రవర్తనలో పరివర్తనలు వస్తుంటాయి అని....ఆమెకు కలలు వస్తుంటాయని...."

"ఆ....ఆమె గురించే.... ఆమె గత జీవితంలో ఒక మినిస్టర్ కూతురని...." ఇంకా ఏదో చెప్పబోయింది సుప్రియ.

చటుక్కున లేచి ఆమెను సమీపించి "ఫోన్లో.... ఈ వివరాలు అన్నీ చెప్పకండి" అన్నాడు రహస్యం మాట్లాడినట్లుగా.

మౌత్ పీస్ మీద చేయి అడ్డు వుంచి గౌతమ్‌తో "....సారీ" అని తిరిగి ఫోన్లో మాట్లాడసాగింది.

"అంకుల్ నేను వచ్చినప్పుడు వివరంగా అన్నీ చెబుతాను. ఎప్పుడు రమ్మంటారు?"

"ఒకే....ఎల్లుండి ఎన్ని గంటలకి? పది గంటలకా!....వస్తాము"

"అలాగే. థాంక్యూ అంకుల్" చెప్పి ఫోన్ పెట్టేసింది సుప్రియ.

"ఎల్లుండి పొద్దున్న పది గంటలకి రమ్మన్నారు" అంది వచ్చి చైర్‌లో కూర్చుంటూ.

"ఒకే. మీరు, నేను ఇద్దరం వెళ్ళి మాట్లాడివద్దాం. ఆ తరువాత కేస్ గురించి ఒక అవగాహనకి రావచ్చు"

"కేస్ గురించి అవగాహన అంటున్నారు. మౌనిక, ఈ శుభాంగి ఒకళ్ళేనన్న నమ్మకం ఇంకా మీకు వుందా?"

"ఉండకపోవడం ఏమిటి? శుభాంగి ఖచ్చితంగా మౌనికే" చెప్పాడు రఘునాథ్.

అప్పటికి రెండు రోజుల ముందు రఘునాథ్‌ని చూడడానికి శుభాంగి ఆ ఇంటికి వచ్చింది. అప్పుడు ఆమెను చూశాడు రఘునాథ్.

"ఇది చూడండి". అంటూ ఆమె ఒడిలో పడేలాగ ఒక కవర్ విసిరాడు.



అది అందుకుంది ఆమె.

కవర్ ఓపెన్ చేసింది.

అందులో 8×10 అంగుళాల సైజు గ్లాసీ కలర్ ప్రింట్స్ ఓ పదిహేను వరకు వున్నాయి.

అన్నీ దాదాపుగా క్లోజప్స్.

రెప్పవాల్చకుండా వాటన్నిటినీ చూసింది ఆమె.

"ఇవి....శుభాంగి....ఫోటోలు....లాగ...."

"లాగ కాదు....అవి శుభాంగివే....ఐ మీన్ మౌనికవే"

బిత్తరపోయి ఆ ఫోటోలను మార్చిమార్చి చూడసాగింది ఆమె.

"ఇది....సుమారు పదేళ్ళ క్రిందట, అంటే మౌనికకు పదహారేళ్ళ వయసులో తీసిన ఫోటోలు...."

కళ్ళు.... ముక్కు....గెడ్డం, బుగ్గలు....పెదవులు....ఏ మాత్రం తేడాలేదు.

"కానీ....నాకు తెలిసినంతవరకు మౌనిక....కాదు శుభాంగి తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో పోయారు. అంతేకాదు .. ఇంత భయంకరమైన అబద్దాలు చెప్పగలిగిన మనస్తత్వం ఆమెదికాదు" అంది సుప్రియ.

"పోనీ....మనిషినిపోలిన మనుషులు వుంటారుకదా! అలా ఈమెకు మౌనిక పోలికలు వుండవచ్చు కదా! అది చూసి మనం అందరం పొరపాటుపడుతూ వుండవచ్చు కదా!" అంది ఆమె.

"మీరన్నది నిజమే....మౌనిక, శుభాంగి ఒకే పోలికలో వున్న మనుషులు అయివుండొచ్చు. కానీ....శుభాంగిని నీ తల్లిదండ్రులేరి? అంటే చనిపోయారంటుంది. బంధువులు ఎవరూ లేరు అంటుంది. ఆమె మీకు పరిచయం అయినపుడు ఆమెకు మేనమామ వుండేవాడు. ఇప్పుడు అతనూ లేడు. మౌనిక అక్కడ మాయం అయిన సంవత్సరం, మీకు ఇక్కడ శుభాంగిగా పరిచయం అయిన సంవత్సరం రెండూ కలుస్తున్నాయి."

"అది యాదృచ్ఛికమేమో !"

"ఫైన్ ఒప్పుకుంటాను. కానీ....నేను శుభాంగి కేస్ డీల్ చేయడం మొదలుపెట్టిన దగ్గర నుంచి నా మీద నిఘా మొదలయింది. అనుక్షణం

కొందరు వ్యక్తులు నన్ను వెంటాడుతున్నారు. ఎందుకు వెంటాడుతున్నారు?''

రెప్పవాల్చకుండా అతన్నే చూస్తూ వింటోంది సుప్రియ.

''అంతేకాదు....మౌనిక కేస్ ఫైల్స్ తెస్తున్న రఘునాథ్ మీద హత్యా ప్రయత్నం జరిగింది. ఎందుకు జరిగింది?''

''అంటే....ఎవరు చేసి వుంటారు మర్డర్ ఎటెమ్ట్!'' ఎదురు ప్రశ్నించింది ఆమె.

''అదే తెలియదు''

''తన గతం గురించి వివరాలు బయటికి రాకుండా వుండడానికి శుభాంగి నన్ను చంపించే ప్రయత్నం చేసిందేమో! సందేహం వ్యక్తం చేశాడు రఘునాథ్.

''ఇంపాజిబుల్. శుభాంగి అంత క్రూరమైనదికాదు'' ఒకింత ఉద్రేకంగా అంది ఆమె.

''అయామ్ సారీ .... డిష్కషన్ సేక్‌కి అన్నాను'' అన్నాడు రఘునాథ్.

''ఒకే. శుభాంగి అంత క్రూర స్వభావురాలు కాకపోవచ్చు. బట్ ఎవరో మాత్రం ఖచ్చితంగా అడ్డుపడుతున్నారు. ఆమె గతం బయటికి రాకుండా విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇది మాత్రం నిజం''

''ఎవరికి వుంటుందా అవసరం?'' ఎదురు ప్రశ్నించింది ఆమె.

''మీరు ఏదయినా అనుకోండి....నా అనుమానం మాత్రం శుభాంగి మీదే వుంది'' గబగబా అనేసి సైలెంట్ అయ్యాడు రఘునాథ్.

ఈసారి అతని మాటలకి రియాక్ట్ అవలేదు ఆమె.

''ఈ ఫొటోలు శుభాంగి చూసిందా?'' ఫోటోలు తిరిగి కవర్‌లో వుంచుతూ అంది సుప్రియ.

''లేదు....రేపు ఆమెకు చూపిస్తాను. ఆమె రియాక్షన్ ఎలా వుంటుందో చూస్తాను'' అన్నాడు గౌతమ్ ఆ కవర్ అందుకుంటూ.

''శుభాంగి జీవితం వెనుక మనకెవరికీ తెలియని భయంకరమైన



సత్యాలు, మరింత భయంకరమైన మనుషులు వున్నారన్నది వాస్తవం'' అన్నాడు రఘునాథ్.

''రేపు ఆమెతో మరోసారి మాట్లాడతాను. నువ్వు రెస్ట్ తీసుకో.... నేను ఇక వెళతాను'' అంటూ లేచాడు గౌతమ్.

''మళ్ళీ ఎప్పుడొస్తారు'' అన్న సుప్రియ ప్రశ్నకు ''రేపు సాయంకాలం'' అని సమాధానమిచ్చి వెళ్ళిపోయాడు గౌతమ్.

o o o

రోడ్డుమీద మెత్తగా జారిపోతోంది టాక్సీ.

విండో లోంచి బయటికి చూస్తోంది. శుభాంగి.

ఆమె మనస్సు ఒకింత ఆనందంగా వుంది.

కారణం....''ఈ రోజు మీతో సరదాగా టైం స్పెండ్ చేయాలనుకుంటున్నాను'' అన్నాడు గౌతమ్.

అందుకే ఇద్దరూ ఒక ప్రైవేట్ టాక్సీని హైర్ చేసుకున్నారు. ఆ రోజంతా సైట్‌సీయింగ్ కోసం ప్లాన్ చేశారు.

ఆ రోజు షాప్స్ అన్నీ దాదాపుగా మూసి వున్నాయి.

అదే మాట అంది ఆమె ''ఈ రోజు ఆదివారం కూడా కాదు కదా షాప్స్ అన్నీ అలా క్లోజ్ అయ్యాయేమిటి!'' అని.

''ఏదో పార్టీ లీడర్‌ని ఓల్డ్ సిటీలో మర్డర్ చేశారట. దానికి నిరసన ....''చెప్పాడు గౌతమ్.

''ఐ.సి.'' అంది సాలోచనగా.

''ఇప్పుడు మనం ఏఏ ప్రదేశాలు చూడబోతున్నాం?'' అడిగాడు గౌతమ్.

''చాలా ఉన్నాయి. కుతుబ్‌షాహి సమాధులు. గోల్కొండ, గండిపేట....ఆ తరువాత అంటే....అప్పటికి చీకటి పడిపోతే వెనక్కి తిరిగి రావడం, బిర్లాటెంపుల్‌కి వెళ్ళడం....అక్కడి నుంచి వైస్రాయ్ హోటల్లో డిన్నర్ చేయటం....''

''అబ్బా ....చాలా ప్రోగ్రాం వుందే?''

''అవును....ఇవ్వాళ నేను ఎక్కడికి తీసుకెళితే అక్కడికి రావాలి.

ఏం తినమంటే అది తినాలి. కాదు, కూడదు అనకూడదు."

"తప్పకుండా....ఈ రోజంతా మీకే కేటాయించాము కదా! మీ ఇష్టం. అయామ్ ఎట్ యువర్ డిస్పోజల్"

ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

ఈ రోజు ఆమెలో నూతనోత్సాహం చూస్తున్నాడు.

ఆ ఆనందంలో ఆమె మరింత అందంగా కనిపిస్తోంది.

ఆ సమయంతో వాళ్ళ మనసులో ఆలోచనలు పరస్పరం విరుద్ధంగా వున్నాయి.

"ఈ రోజంతా మీతో టైం స్పెండ్ చేస్తాను" అన్న అతని మాటలో అతను తన వైపు మొగ్గు చూపిస్తున్నాడు అన్న అర్థం తీసుకుందామె. ఈ రోజు ఎలాగయినా తన ప్రేమ గురించి అతనికి తెలియచేయాలి ....తొలి చూపులోనే అతని పట్ల ఆకర్షితురాలు అయిందని ... అతనంటే గుండెలనిండా ప్రేమవుందని... అతనితోనే జీవితం గడపాలని నిర్ణయించుకుందని....ఇలా చాలా విషయాలు చెప్పాలనుకుంది....అటువంటివి మాట్లాడటానికి ఈ రోజే మంచిఅవకాశం ఇంత ఛాన్స్ ఇంక దొరకదు.

కానీ... గౌతమ్‌లో ఈ ఆలోచన ఏ మాత్రం లేదు. "మీతో ఓ రోజు సరదాగా టైం గడపాలి" అన్న మాటను అడ్డు పెట్టుకుని ఈ కేస్‌కి సంబంధించిన విషయాలు అన్నీ కూపీ లాగుదామని వుంది. ఈ రోజుతో కొన్ని ముఖ్యమైన నిజాలు బయటికి రావాలి.

చాలా గట్టి నిర్ణయంతో వున్నాడతను. ఆతనికి అమెకువున్నట్లుగా ప్రేమ ఆలోచనలు ఏ మాత్రం లేవు.

తల తిప్పి ఆమెను చూశాడు.

బయటికే చూస్తోంది ఆమె.

దృష్టిని రోడ్డు మీదనే కేంద్రీకరించి డ్రైవ్ చేస్తున్నాడు డ్రైవర్. అతనికి సుమారు యాభై ఏళ్ళుంటాయేమో! జుట్టు బాగా నెరిసి వుంది. అతను మహాభక్తుడు కాబోలు-కారు డాష్ బోర్డుకి దాదాపు పది వరకు రకరకాల దేవుడి బొమ్మల స్టిక్కర్లు అతికించి వున్నాయి.



లంగర్ హౌస్ దాటి టర్న్ అయింది కారు.

కారు డోర్స్‌లో ఒకటి లూజ్‌గా వుంది. అక్కడ నుండి టకటక శబ్దం వస్తోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

అతని మాటకి తలతిప్పి చూసి నవ్వింది. "ఏమీ లేదు. బయటకు చూస్తున్నాను."

"ఇదిగో ఇది చూడండి" అంటూ ఓ కవర్ ఆమెచేతిలో వుంచాడు.

"ఏమిటిది" ఆమె కనుబొమలు ముడి పడ్డాయి.

"ఏమిటో కవర్ ఓపెన్ చేస్తే తెలుస్తుంది"

"ఇప్పుడే ఓపెన్ చేయాలా?" కవర్ ఇటూ అటూ తిప్పి చూడసాగింది.

"అవును కదా!"

అందులో ఏముందో ఊహించడానికి ప్రయత్నించసాగిందామె.

"ఆ కవర్‌లో చాలా ఇంట్రెస్టింగ్ మెటీరియల్ వుంది. చూస్తే మీరు ఎంజాయ్ చేస్తారు" చెప్పాడు.

కవర్ ఓపెన్ చేసిందామె.

అందులో నుండి ఫోటోలను బయటికి లాగింది.

ఆమె ముఖంలో వచ్చే మార్పులు గమనించసాగాడు గౌతమ్.

క్షణ కాలం నివ్వెరపోయిందామె.

వరసగా అన్ని ఫోటోలు పరిశీలించింది.

"ఇవి.... నా ఫోటోలు ....లాగా....వున్నాయి...." ఎండిపోయినట్లున్న పెదవులు తడిచేసుకుంటూ అంది.

"లాగా ....కాదు.... అవి మీ ఫోటోలే"

"నావి కాదు"

"అదేమిటి, ఇప్పుడేకదా నా ఫోటోలు లాగా వున్నాయి అన్నారు?"

"నా ఫోటోలు లాగా వున్నాయి. అంతే కాని నావి కాదు" వాటిని తిరిగి కవర్‌లో వుంచి అతని చేతికి ఇచ్చేసింది.

"ఏం ....ఎందుకు కాదంటున్నారు?"

"ఎందుకేమిటీ?....అవి నా పదహారేళ్ళ వయస్సులో తీసినఫోటోల్లా వున్నాయి."

"అవును అవి మీ పదహారేళ్ళ వయస్సు ఫోటోలే."

"ఇంపాజిబుల్"

"ఎలా!"

"ఆ వయస్సులో నాకు ఫోటోలు లేవు"

"అదే ఏందుకు లేవు?"

"ఏమో ....తెలియదు....కానీ లేవు"

"మీ చిన్నప్పటి ఫోటోలు?"

"లేవు"

"కనీసం మీ అమ్మా, నాన్నలతో తీయించుకున్న ఫోటోలు"

"అవీ లేవు"

"అసలు లేవా....ఎక్కడయినా పోయాయా?"

"తెలియదు"

"మీ చిన్నప్పటి ఆల్బంలేదా?"

"లేదు"

"ఏమయింది?"

"ఏమో మరి....నా దగ్గర లేదు."

"మీ తల్లిదండ్రులతో గడిపిన సమయం....ఆ అనుభవాలు ఫోటోలుగా లేవు అంటున్నారు. కనీసం ఆ అనుభవాలు గుర్తున్నాయా?"

క్షణం సేపు సమాధానం చెప్పలేదు ఆమె.

"గుర్తులేదా?"

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

"అంటే ....మీకు చిన్నతనం ఎప్పటి నుంచి గుర్తుందో చెప్పగలరా?

ఆమె ముఖంలో రంగులు మారుతున్నాయి.

"చెప్పలేరా?" రెట్టించి అడిగాడు.



"నా తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చనిపోయారు. మాది బెంగుళూరు, వాళ్ళుపోయిన తరువాత నా మేనమామ పెంచి పెద్దచేశాడు. నా మేనమామ నన్ను హైదరాబాదు తీసుకువచ్చిన దగ్గర నుండి జరిగిన ప్రతి సంఘటన నాకు గుర్తుంది. అంతకు ముందు విషయాలు గుర్తులేవు కనీసం ఫోటోలు కూడా లేవు."

"గుర్తు తెచ్చుకునే ప్రయత్నం ఏదయినా చేశారా?"

"చాలాసార్లు చేశాను....బట్....ఆవిషయాలు నా మెదడులోలేవు....బ్లాంక్"

ఆమె మాట్లాడే ప్రతి అక్షరం జాగ్రత్తగా వింటున్నాడు అతను ఎందుకంటే ఈ వివరాలు అతనికి చాలా అవసరం.

"ఇప్పుడు ఒకవిషయం చెబుతున్నాను వినండి. ఈ ఫోటోలు మీకు గుర్తు లేని గతానికి సంబంధించినవి"

అర్థం కానట్లు చూసింది ఆమె.

అతని మాటకు కారు డ్రైవర్ తల ఇటువైపుకు తిరిగింది. ఓరకంట ఒకసారి గౌతమ్‌ని చూసి తిరిగి దృష్టిని రోడ్డుమీదకు సారించాడు అతను.

అంటే....ఈ సంభాషణ అతను ఫాలో అవుతున్నాడన్నమాట.

అతని దృష్టి రోడ్డు మీదనే వున్నా చెవులు మాత్రం వాళ్ళ సంభాషణ మీదే వుంది. ఆ విషయం అంతవరకు నోటీస్ చేయలేదు గౌతమ్.

ఇంక ఆ సంభాషణ కారులో వుండగా పొడిగించడం మంచిదికాదు అన్నది నిర్ధారణ అయింది.

"మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇవి మీ ఫోటోలే" ఆమె చెవిలో గుసగుసలాడినట్లుగా అని కవర్ ఆమె చేతిలో నుండి అందుకుని బ్యాగ్‌లో వుంచాడు.

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

ఆమె మెదడులో ఏవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయన్న విషయం స్పష్టంగా అర్థం అవుతోంది.

ఆమె గత జీవితం గురించి ఏ మాత్రం చెప్పటంలేదు.

ఆమె తనకు తానుగా చెప్పకపోవటమో లేక ఎవరైనా వ్యక్తులు చెప్పనివ్వకపోవటమో జరుగుతోంది.

వెనుక నుండి ఏదో అంబాసిడర్ కారు ఈ కారుని ఓవర్‌టేక్ చేయటానికి ప్రయత్నించుతోంది.

హారన్ కొడుతున్నాడు ఆ కారు డ్రైవర్.

"డ్రైవర్....ఆ కారుకి సైడ్ ఇవ్వు. వాడు వెళ్ళిపోతాడు కదా! ఇందాకటి నుంచి హారన్ కొడుతున్నాడు" అన్నాడు గౌతమ్.

కొంచెం తల తిప్పి గౌతమ్‌ని చూసి కారుని లెఫ్ట్ మార్జిన్‌కు తిప్పాడు డ్రైవర్.

వెనుకనున్న కారు ముందుకు రాసాగింది. క్షణకాలం రెండు కార్లూ పక్కపక్కగా వచ్చాయి.

తమను దాటి ముందుకు వెళుతున్న ఆ కారు వైపు చూసి ఉలిక్కిపడ్డాడు గౌతమ్. అందులో కిటికీ దగ్గర కూర్చుని వున్న వ్యక్తిని గుర్తుపట్టాడు.

ఆ రోజు రాత్రి తనను వెంబడించిన వ్యక్తి అతను. అతని రివాల్వర్ ఇప్పటికీ తన దగ్గరే వుంది.

ఆ కారులోని వ్యక్తులు తమని వెంటాడుతున్నారా!....

వేగంగా ముందుకు దూసుకువెళ్ళిపోయింది ఆ కారు!....

ఆ కారులోని ఆ వ్యక్తి కూడా-తన వైపు తల తిప్పిచూడలేదు

తనని ఛేజ్ చేయటం కాదేమో !

ఛేజ్ చేసే ఉద్దేశ్యం వున్నవాళ్ళయితే కారు వెనుకనే రావాలి కదా! అలా చేయకుండా ముందుకు దూసుకువెళ్ళిపోయింది.

కారు కుతబ్‌షాహి సమాధులని సమీపించింది.

అక్కడికి రాగానే కారు స్లో చేశాడు డ్రైవర్.

"సార్....ఐదు రూపాయల టిక్కెట్టు తీసుకుంటే కారులోనే లోపల అంతా తిరగవచ్చు. తీసుకుంటారా?" అడిగాడు డ్రైవర్.



"వద్దు....నువ్వు ఇక్కడే వుండు. మేం నడచి తిరిగి వస్తాము" అంది శుభాంగి.

ఇంజన్ ఆఫ్ చేశాడు డ్రైవర్.

కారులోంచి దిగారు ఇద్దరూ.

తన వ్యానిటీ బ్యాగ్‌లోనుండి హ్యాట్ తీసి ధరించిందామె.

డార్క్ గ్రీన్ కలర్ చూడీదార్‌మీద ఆమె ధరించిన హేట్.... వింతగా వున్నా అందంగా కనిపించింది.

సినిమాలలో డాన్స్ డైరెక్టర్స్ అలా వుంటారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌లో, హ్యాట్ పెట్టుకొని తిరుగుతుంటారు వాళ్ళలాగా అనిపించిందామె.

"పదండి" అంది ముందు నడుస్తూ.

మొదటిసారి ఆ ప్రదేశాన్ని చూస్తున్నాడు అతను.

అద్భుతమైన నిర్మాణాలు అవి.

చాలా సినిమాల్లో చూసాడు లొకేషన్లని....

వెనుక ఏదో వాహనం వస్తున్న శబ్దం అయింది.

అప్రయత్నంగా తల తిప్పాడు గౌతమ్.

వాళ్ళకి సుమారు యాభై గజాల దూరంలో ఆగింది ఓ కారు.

ఆ కారుని చూసి ఉలిక్కిపడ్డాడు.

అదే కారు తాము వస్తుంటే ఓవర్‌టేక్ చేసి వెళ్ళిపోయింది.

కారు డోర్ తెరచుకుని బయటకు దిగాడు ఆ వ్యక్తి. నల్లని అద్దాలు ధరించివున్న ఆ వ్యక్తిని చూస్తుంటే ఒళ్ళు జలదరించింది.

అదే క్షణంలో గౌతమ్ చేయి పాకెట్‌లోకి వెళ్ళింది.

అతని చేతికి చల్లగా తగిలింది రివాల్వర్.

అక్కడే ఆగి రెండు క్షణాలపాటు పరిశీలనగా చూశాడు.

కారులో అతను కాకుండా మరో ఇద్దరు కూడా వున్నారు.

గౌతమ్‌ని చూస్తూనే అదోలా నవ్వాడతను.

అతనేదో రివాల్వర్‌తో తనమీద ఎటాక్ చేస్తాడని ఊహించాడు గౌతమ్. కానీ అతను ఆ ప్రయత్నం చేసేలాగ కనబడటం లేదు.

కారు బాయ్‌నెట్‌మీద కుడిచేయి ఆన్చి అలాగే నిలబడి వున్నాడు.

"గౌతమ్ ...ఏమిటి అలా నిలబడిపోయారు?" అన్న శుభాంగి మాటలకు తేరుకుని ముందుకు కదిలాడు.

దాదాపు పదడుగులు ముందుకు వేశాడు గౌతమ్.

ఆ పది అడుగులు నడిచేంతలో ఐదుసార్లయినా వెనక్కి చూసి వుంటాడు.

ఆ వ్యక్తి భంగిమలో ఏమాత్రం మార్పులేదు.

మరి ఎందుకు వచ్చినట్లు....తనని కేవలం ఫాలో అవుతున్నాడు. అంతే....చంపే ప్రయత్నం, కిడ్నాప్ చేసే ప్రయత్నమూ చెయ్యడంలేదు. వింతగా వుంది వాళ్ళ ప్రవర్తన

"వాట్ హేపెండ్ గౌతమ్. మీ మూడ్ ఏమిటి అలా మారిపోయింది?" అడిగింది అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ....

"అబ్బే....అదేంలేదు. పదండి" అంటూ ముందుకు నడిచాడు.

ఆమె కుతుబ్‌షాహి కట్టడాల గురించి ఏదేదో చెబుతోంది. ఏదో మొక్కుబడిగా ఊ కొడుతున్నాడే కాని అతని దృష్టిమాత్రం వెనుకనే వుంది. ఏ క్షణంలో అయినా వాళ్ళనుంచి ఎటువంటి ఎటాక్ అయినా రావచ్చుని అతని సిక్స్త్ సెన్స్ చెబుతోంది.

"ఇక్కడ మీకు ఫోటో తీయనా!" అంది ఆమె.

అక్కడొక వాటర్ ఫౌంటెన్ వుంది.

"ఓ.కె. తీయండి" అని సర్దుకుని నిలబడ్డాడు.

బ్యాగ్‌లోనుండి కెమెరాతీసి క్లిక్ మనిపించింది.

ఆ రోజు జనం చాలా తక్కువగా వున్నారు.

ఎవరో ఓ యువతి, యువకుడు జర్మన్ భాషలో మాట్లాడుకుంటున్నారు. ఇద్దరూ తెల్లగా పిండి బొమ్మల్లా వున్నారు. ఇద్దరూ బెర్ముడా నిక్కర్స్, టీషర్ట్స్ ధరించి వున్నారు.

"ఇక్కడికి ఫారినర్స్ కూడా వస్తున్నారే" అన్నాడు ఆమెతో.

"ఆ ...ఇది చాలా ఫేమస్ స్పాట్" అని "ఇప్పుడు మీరు నాకొక ఫోటో తియ్యండి" అంది కెమెరా అతని చేతికిస్తూ.



"ఓ.కే." అన్నాడు.

"ఇదిగో నేను ఇలా నిలబడతాను....నా వెనుకగా ద్వారాలులాగా వున్న ఈ కారిడార్ అంతా రావాలి" అంది అక్కడున్న స్తంభాన్ని ఆనుకుంటూ.

ఆ భంగిమలో ఆమె చాలా అందంగా వుంది.

"ఓ.కే. రెడీ, స్మైల్" అన్నాడు మోకాళ్ళమీద కూర్చుని ఫోటో తీయటానికిరెడీ అవుతూ....

అంతవరకూ నవ్వుతున్న ఆమె ముఖంలో ఒక్కసారిగా నవ్వు మాయం అయింది. కళ్ళలో భయం ప్రవేశించింది.

"గౌతమ్....సేవ్ మి" కెవ్వుమని అరుస్తూ పరుగెత్తుకు వచ్చి గౌతమ్‌ను గట్టిగా పట్టుకొని గజగజ వణికిపోసాగిందామె.

"అరె....ఏమయింది?" గాభరాగా అడిగాడు.

"అటు....చూ....డు....కలల్లో....వ్యక్తి....అతనే" కళ్ళు తెరవటానికి కూడా ధైర్యం చాలక అటుగా చేయి చూపించింది.

అదిరిపడి అటుగా చూసాడు గౌతమ్.

ఆరడుగుల పొడవు....నల్లగా బలిష్టంగా....చిన్న చిన్న ఉంగరాల జుట్టు, చప్పిడిముక్కు, లావు పెదవులు....కుడి చేయి లేదు.... గుండెలు అదిరిపోయాయి గౌతమ్‌కి.

వాళ్ళవైపు అడుగువేశాడా వ్యక్తి.

o o o

కొద్ది సెకన్లు హృదయస్పందన స్తంభించినట్లయింది గౌతమ్‌కి.

ఆ నీగ్రో వ్యక్తి ఇటు వైపే చూసి నవ్వాడు. ఒంటి మీద తేళ్ళు, జెర్రులు పాకినట్లనిపించింది అతనికి.

జేబులోకి చేయిపోనించి రివాల్వర్‌ని అందుకున్నాడు గౌతమ్,

ఆ వ్యక్తి వాళ్ళకి అభిముఖంగా రాసాగాడు. అతని చేతిలో ఏదో నల్లని వస్తువు వుంది. ఏమయి వుండవచ్చు?

రివాల్వరా?

వాళ్ళ మధ్య దూరం తరిగింది.

అతను రివాల్వర్‌తో ఎటాక్ చేసేటట్లయితే అలా అభిముఖంగా నడుస్తూ వస్తాడా?

ఏం జరుగుతుందో చూద్దాం....అన్నట్లుగా స్థిరంగా నిలబడి రెప్ప వాల్చకుండా అతన్ని చూశాడు గౌతమ్.

తన చేతిని పట్టుకొని వున్న శుభాంగి చేతి వణుకు అతనికి స్పష్టంగా తెలుస్తోంది.

సరిగ్గా రెండడుగుల దూరంలోకి వచ్చి ఆగాడు అతను.

పరిచయం వున్న వ్యక్తిలాగ నవ్వాడు.

లావుగా మొరటుగా వున్న అతని పెదవులు విడివడి నలుపు రంగులో గారపట్టినట్లున్న అతని పళ్ళు కనిపించాయి.

"ఎక్స్‌క్యూజ్‌మి" చాలా మర్యాదగా అన్నాడు అతను.

ఏమిటన్నట్లు చూశాడు గౌతమ్.

"అయామ్ హేండీక్యాప్డ్....విల్ యు ప్లీజ్ హెల్పుమి ఇన్‌లోడింగ్ దిస్ ఫిల్మ్ ఇంటూ దిస్ కెమెరా!" అభ్యర్ధనపూర్వకంగా అన్నాడతను.

తెల్లముఖం వేశాడు గౌతమ్.

అతను దగ్గరకు వస్తోంటే తననో, శుభాంగినో, చంపడానికి వస్తున్నాడనుకున్నాడు. కానీ....ఇలా నాకు ఒక చేయి లేదు, ఈ కెమెరాలో ఫిల్మ్ లోడ్‌చేసి ఇవ్వగలరా!" అని అడుగుతాడనుకోలేదు. అతని చేతిలో వున్న నల్లని వస్తువు కెమెరా అన్నమాట.

క్షణం తరువాత తేరుకుని "ష్యూర్" అని, కెమెరా అందుకొని, ఫిల్మ్ ఛాంబర్ తెరిచి, ఫిల్మ్ లోడ్‌చేసి ఇచ్చాడు.

"థాంక్యూ సోమచ్" మర్యాదపూర్వకంగా అని తిరిగి వెళ్ళిపోయాడతను.

నోరు తెరుచుకుని అతను వెళ్ళిన వైపు చూస్తూ వుండిపోయాడు గౌతమ్.

అతను వెళ్ళి మెల్లగా ఫారినర్స్‌తోపాటు కలిసిపోయి ఏదో మాట్లాడుతూ ముందుకు నడిచి ఆ గుంపుతోపాటు అదృశ్యం అయిపోయాడు.

ఆ సమయంలో....ఒళ్ళు మండిపోయింది శుభాంగి మీద.



ఎవరో పెద్దమనిషి....పాపం చేయిలేనివాడు ....అతన్ని చూసి, కలలో వచ్చే రాక్షసుడు ఇతనే....అంటూ అనవసరంగా భయపెట్టింది.

ఇంకా నయమే....తనుకానీ జేబులోంచి రివాల్వర్ బయటకు తీస్తే ....ఎంత అసహ్యంగా వుండేది పరిస్థితి?

"ఇంకా ఎందుకు అలా వణుకుతారు....నా చెయ్యి వదలండి" వీలయినంత వరకు అసహనాన్ని అణుచుకుంటూ అన్నాడు.

అతని చేతిని వదిలి కళ్ళు తెరిచింది ఆమె

ఎదురుగా ఆ వ్యక్తి కనబడలేదు.

అటూ ఇటూ చూసింది. ఎక్కడా అతని జాడలేదు.

"ఆ....నీ....గ్రో...."ఏదో అనబోయింది, తడారిపోయిన పెదవులు తడిచేసుకుంటూ.

"ఆ లేదు,నీ గ్రో లేదు....మీ మాట నమ్మి నేను రివాల్వర్‌తో వాణ్ణికాల్చిపారేసి వుంటే....ముందు నేను చచ్చేవాడిని ఈపాటికి నన్ను జైల్లో వేసేవారు."

ఆమె ఇంకా తేరుకోలేదు. నిలబడలేనిదానిలా, అక్కడే ఒక రాయి మీద చతికిలపడింది.

"ఎవరో పాపం....ఫారిన్ విజిటర్ అతను"

"కానీ....కలలో....ఇత నే....ఇలాగే....ఒంటిచేయి...."

"మరుక్షణం మీరు ఆ ఆలోచనల్లోనే వుంటున్నారు. మిమల్ని ఎవరో ఏదో చేసెయ్యబోతున్నారనో....మీకేదో ప్రమాదం రాబోతోందనో భయపడుతున్నారు. మీరు మానసికంగా అస్థిరంగా వుంటున్నారు. ఎదుటి వాళ్ళను భయపెట్టి చంపుతున్నారు" దొరికింది కదా చాన్సని కక్షకొద్దీ అన్నాడు.

"బట్....నాకు కలలు రావటం....నిజం"

"కలలు వస్తోంటే....భయం వేస్తోంటే డాక్టర్ని కలవాలి. ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మానసికంగా పోగొట్టుకున్న ధైర్యం తిరిగి పొందాలి మీరు ఇదేమీ చేయరు. రోజుకోసారి మెంటల్‌గా డిప్రెస్ అయిపోవడం

మీకు మామూలు అయిపోయింది. ఏ క్షణంలో సంతోషంగా వుంటారో.... ఏ క్షణంలో ఎందుకు తిడతారో....అంతా అయోమయం....గందర గోళం. అతనెవరో థర్టీ సిక్స్ ట్వెంటీ ఫోర్ థర్టీ సిక్స్ అన్నాడని....పది మందిలో చెంప పగలకొడతారా!.... నేను అన్నానని ఏకంగా ఆత్మహత్యా ప్రయత్నమే చేసేసారు. మీ ప్రవర్తన అర్థంకాక మీకు మతిభ్రమించింది అనుకునేవాళ్ళు కూడా చాలామంది వున్నారు.

ఇప్పుడు మీ మాట నమ్మి, తొందరపడి నేనా నీగ్రోని కొట్టటమో, చంపటమో చేసుంటే....నాకూ మతిభ్రమించింది అనుకునేవారు....ఛ...."

ఇన్ని రోజులుగా ఆపుకున్న ఆవేశం అతనిలో కట్టలు తెంచుకుంది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి శుభాంగికి.

రెండు అరచేతులతో ముఖం దాచుకుంది ఆమె.

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడతను. వీలయినంతవరకు టెన్షన్‌ను అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించుతున్నాడతను.

ఆమె తన ముఖాన్ని అరచేతులతో కప్పుకునే వుంది.

అక్కడి నుంచి కదలి ఆమెకు కొద్ది గజాల దూరంలో వున్న ఒక స్తంభాన్ని ఆనుకుని స్మోక్ చేయసాగాడతను.

పరుషంగా తాను మాట్లాడిన మాటలు ఆమె మీద పనిచేసివుండాలి.

మరో పరిస్థితిలో అయితే ఇంత ఖచ్చితంగా ఈ విషయం చెప్పగలిగేవాడు కాదు. చాలా మొహమాటం అడ్డు వచ్చేది.

అంతేకాదు....ఈ మాటలంటే ఆమె మానసికస్థితి మళ్ళీ ఏమవుతుందో....

తిరిగి ప్రాణం తీసుకునే ప్రయత్నం చేస్తుందా....

ఇటువంటి రకరకాల భయాలు....అతనిని ఆ మాటలు అనకుండా ఆపివేసేవి.

ఇప్పుడు ఒక రకమైన ఆవేశం అతని చేత అలా మాట్లాడించింది.

ఆమె లేచి నిలబడింది.

ఆమె కళ్లు ఇంకా తడిగానే వున్నాయి.

ఆ స్థితిలో ఆమెను చూసిన అతనికి బాధగా అనిపించింది.



ఛ....అనవసరంగా అన్ని మాటలు అన్నానేమోనని.

సిగరెట్ నేలమీద విసిరికొట్టి ఆమెను సమీపించి "అయాం వెరీ సారీ" అన్నాడు నొచ్చుకుంటూ.

"ఇంటికి వెడదాం పదండి" అంది పొడిగా.

"అరె....అప్పుడే ఇంటికా....ఇంకా మనం ఏమీ చూడందే."

"సారీ....నాకు ఇంట్రస్ట్ లేదు"

"నిజానికి నేను మీకు సారీ చెప్పాలి. చాలా పరుషంగా మాట్లాడాను."

"నన్ను నేను మార్చుకుంటాను. నాకు మెంటల్ పీస్ కావాలి. నా భయాలు పోగొట్టుకునే ప్రయత్నం చెస్తాను" చాలా స్థిరంగా అందామె.

ఏమీ మాట్లాడలేదు గౌతమ్.

"నాకీ భయాలు పోవాలి అంటే....నేనేం చెయ్యాలో చెప్పండి చేస్తాను."

"పదండి వెళదాం" అన్నాడు పొడిగా.

"కాదు ...నేనేం చెయ్యాలో చెప్పండి" మళ్ళీ అంది ఆమె.

"ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం. నడవండి" అన్నాడు మరో మాటకి అవకాశం లేకుండా ముందుకు నడుస్తూ.

మరో రెండు నిమిషాలకి గేటు దగ్గరికి వచ్చారు ఇద్దరూ.

"ఏం సార్ అప్పుడే అంతా చూసారా?" వాళ్ళని చూస్తూనే అడిగాడు డ్రైవర్.

సమాధానం చెప్పలేదు ఇద్దరూ.

కారులో కూర్చుని "పద" అన్నాడు గౌతమ్.

"గోల్కొండకా సార్" అడిగాడు డ్రైవర్.

"ఇంటికి"

క్షణంసేపు తటపటాయించి కారు స్టార్ట్‌చేసి ముందుకు దూకించాడు డ్రైవర్.

o o o

డాక్టర్ పరమాత్మ

సైకియాట్రిస్ట్

"బ్లాక్‌గ్లేజ్‌డ్ స్టోన్ మీద బ్రాస్ లెటర్స్ మెరుస్తున్నాయి.

సాయంత్రం సమయపు పసుపురంగు నీరెండ ఆ అక్షరాల మీద పడి గోల్డ్ కలర్‌లో కనిపిస్తున్నాయవి.

ఈ డాక్టర్‌గారి పేరులాగే టేస్ట్ కూడా వెరైటీ అనుకుంటా. ఐ.ఎ.ఎస్. వాళ్ళో, ఐ.సి.ఎస్. వాళ్లో నేమ్‌ప్లేట్స్ పెట్టుకున్నట్లుగా బ్రాస్‌లెటర్స్ పెట్టుకున్న గౌతమ్ ఆ నేమ్‌ప్లేట్ చూసి అనుకున్నాడు.

"రండి లోపలికి వెళ్ళి కూర్చుందాం" అంటూ లోపలికి దారితీసిందామె.

ఆమెను అనుసరించాడు గౌతమ్.

అదొక చిన్నగది.

మహా అయితే ఎనిమిది అడుగులు పొడవు, ఎనిమిది అడుగులు వెడల్పు వుండొచ్చు. ఓ అరడజను ఫోల్డింగ్ కుర్చీలు వున్నాయి.

లోపలికి ఇంకొక గది వున్నట్లుంది. ఆ గది తలుపులు వేసి వున్నాయి. డోరు ప్రక్కన డాక్టర్ ఈజ్ ఇన్ అన్న ఇంగ్లీషు అక్షరాలున్నాయి.

డోరు ప్రక్కనే స్టూలు మీద కూర్చుని వున్నాడు ఓ ఇరవై ఏళ్ళ యువకుడు.

"అంకుల్ వున్నారా?" లోపలికి వస్తూ అడిగింది సుప్రియ ఆ యువకుడిని.

"కూర్చోండమ్మా!.... లోపల పేషెంట్లని చూస్తున్నారు."

అతని జవాబుకి కూర్చున్నారు ఇద్దరూ.

ఒకసారి చుట్టూ కలియచూశాడు గౌతమ్.

గోడలకి కనీసం క్యాలెండర్ అయినా లేదు.

ఖాళీగా వున్నాయి.

గౌతమ్ ఇంతవరకు ఎందరో డాక్టర్ల దగ్గరకు వెళ్ళాడుకానీ సైకియాట్రిస్ట్ దగ్గరకు వెళ్ళడం మొదటిసారి.

అసలు డాక్టర్లంటేనే మహా చిరాకు అతనికి.



ఇప్పుడే కాదు—చిన్నప్పటి నుంచీ అతనికి డాక్టరు దగ్గరకు వెళ్ళాలంటే విసుగు....అయిష్టం

కారణం....

అతని బాల్యంలో దాదాపు ప్రతి రెండు రోజులకీ ఏదో ఒక డాక్టరు దగ్గరికి వెళ్ళాల్సి వచ్చేది.

అలా ఒకళ్లు....ఇద్దరు డాక్టర్లు కాదు. చాలామంది.

పీడియాట్రీషియన్స్, డెర్మటాలజిస్ట్‌లు, ఆప్తాల్మాలజిస్ట్‌లు, యూరాలజిస్ట్‌లు, డెంటిస్ట్‌లు, ఆర్థోపెడిక్స్ స్పెషలిస్ట్‌లు....ఇలా రకరకాల డాక్టర్లని చూశాడు.

చిన్నతనంలో తరచుగా వచ్చే అనారోగ్యాలు ఒక కారణం అయితే ....తన తల్లిదండ్రుల "డిసిప్లిన్" మరో కారణం.

గౌతమ్ తండ్రి మిలటరీలో చేసి రిటైరయి డిటెక్టివ్ ఏజెన్సీ మొదలుపెట్టిన వాడుకావడంతో కొద్దిపాటి ఇన్‌డిసిప్లిన్ కూడా భరించేవాడు కాదు.

ఇంట్లో కూడా మిలటరీ డిసిప్లిన్.

ఒకసారి ఇంటికి ఎవరో పెద్దమనిషి వచ్చాడు.

"గౌతమ్ అంకుల్‌కి నమస్తే చెప్పు" అంటూ పిలిచాడు తండ్రి. నమస్కారం పెట్టకుండానే ముందుకు వెళ్ళిపోయాడు గౌతమ్ మహా అయితే అప్పటికి అతనికి ఎనిమిదేళ్లుంటాయేమో.

అంతే....అదే ఊపుతో వచ్చి గౌతమ్ గూబ అదిరేలా చెళ్ళుమని కొట్టాడు తండ్రి.

ఆ దెబ్బకి దవడ దగ్గర రెండు పళ్లు గల్లున రాలిపడ్డాయి. కళ్లు గిర్రున తిరిగాయి. మరుక్షణమే అతని తల్లి గౌతమ్‌ని ఎత్తుకుని ఆటోలో డెంటిస్ట్ దగ్గరికి తీసుకువెళ్ళింది.

"మా అబ్బాయి మెట్ల మీద జారిపడ్డాడు" అని చెప్పింది.

అప్పుడొకసారి డాక్టర్ దర్శనం చేసుకున్నాడు గౌతమ్.

మరోసారి వంటింట్లో సీసా పగలకొట్టాడు గౌతమ్.

అప్పడాల కర్రతో చేతి మీద లాగి కొట్టింది తల్లి.

ఫలితం చేయి ఎముక ఫ్రాక్చర్.

"బాబు సైకిల్ మీద నుండి పడ్డాడు, చేతికి దెబ్బ తగిలింది" అంటూ ఎముకల స్పెషలిస్ట్‌కు చూపించింది వాళ్ళ అమ్మ.

అమ్మ అలా ఎందుకు అబద్ధం చెప్పేదో అప్పుడు అర్థంకాలేదు.

కళ్ళు జిగేల్ మనేలా వున్నాయి రంగులు.

ఇవేం రంగులు....వింతగా వున్నాయి?

అన్ని రంగులున్న ఆ గదిలో కూర్చుంటే కళ్ళముందు నక్షత్రాలు మెరుస్తున్నట్టు కళ్ళు చెదురుతున్నట్లు అనిపిస్తోంది.

అన్ని రంగులు కళ్ళముందు అలా కనబడితే, ఆ గదిలో వున్న మరే వస్తువునూ సరిగా చూడలేము.

"కూర్చోండి" అన్నాడు తనూ కూర్చుంటూ డాక్టర్ పరమాత్మ.

ఆయన చెప్పిన విధంగానే కూర్చున్నారు ఇద్దరూ.

"ఇప్పుడు చెప్పండి? మీ సమస్య ఏమిటో...." అడిగాడు.

"క్షమించండి....మీవైపు చూసి మాట్లాడటమే కష్టంగా అనిపిస్తోంది" సమాధానంగా అన్నాడు గౌతమ్.

పళ్ళన్నీ కనిపించేలా నవ్వాడు డాక్టర్.

"అంత ఇబ్బందిగా వుందా!"

అవునన్నట్లు తల ఊపాడు గౌతమ్.

"ఇక్కడికి వచ్చిన ప్రతి వ్యక్తి కొన్ని సమస్యలతో, ముఖ్యంగా మానసిక సమస్యలతో అస్తవ్యస్తంగా వున్న ఆలోచనలతో వస్తాడు. ఆ వ్యక్తి ఈ గదిలో అడుగు పెట్టగానే మరింత కన్‌ఫ్యూజ్‌గా ఫీలవుతాడు. ఆ స్థితిలో వున్న వ్యక్తిని హిప్నటైజ్ చేయడం చాలా సులువు నాకు" చెప్పాడు పరమాత్మ.

ఈయన లాజిక్ గమ్మత్తుగా వుంది అనుకున్నాడు గౌతమ్.

అతనికి డాక్టర్ వైపు చూసి మాట్లాడే బదులు తలదించుకునో, కళ్ళు మూసుకునో మాట్లాడటం మంచిది అనిపిస్తోంది.

"ఐ కెన్ అండర్‌స్టాండ్ యువర్ డిస్‌కంఫర్ట్.... పదండి లోపల కూర్చుందాం" అంటూ ఛైర్‌లోంచి లేచి అతని ఛైర్‌కి వెనుకనున్న మరో డోరు తెరిచాడు.



"ఇలా చెయిన్ లాగ .. గదివెనుక గది....ఎన్నివున్నాయోఏమిటో" అనుకుంటూ లేచాడు గౌతమ్.

ఆ వెనుకనే లేచి నిలబడి ముందుకు కదిలింది సుప్రియ.

చిన్నదిగా వున్న ఆ గది ద్వారంలో నుంచి లోపలికి వెళ్ళారు ముగ్గురూ.

ఈ గది ముందు గదులకి భిన్నంగా వుంది.

తెల్లని గోడలు....

నేల మీద లైట్ మార్బుల్ టైల్స్....

గది మధ్యలో ఎదురెదురుగా వున్న రెండు కుర్చీలు....

గది మూలగా మరో చైర్ వున్నాయి.

"ఆ చైర్ కూడా మధ్యలోకి లాగి కూర్చో" గోడ మూల వున్న చైర్‌ని సుప్రియకు చూపిస్తూ అన్నాడుడాక్టర్‌తనొక చైర్‌లో కూర్చుంటూ

అతని చైర్ ప్రక్కనే వున్న స్టూల్‌మీద చిన్న బ్రీఫ్‌కేసు వుంది. అందులో ఎమున్నాయో తెలియదు.

గదికి ఎడమ వైపు ఒక వైట్ కర్టెన్ వేలాడుతోంది. కర్టెన్‌కు గోడకు మధ్య నాలుగైదు అంగుళాల ఖాళీ స్థలం వుంది. ఆ ఖాళీలోనుంచి కర్టెన్ వెనుక వున్న పెద్ద బుక్ షెల్ఫ్ కనిపిస్తోంది.

కొన్ని వందల పుస్తకాలున్నాయి. అందులో.

అవన్నీ అతని హిప్నాటిజంకి సంబంధించిన బుక్స్ అయి వుండ వచ్చు ననుకున్నాడు గౌతమ్.

"ఏ కేస్ గురించి అయినా పూర్తి వివరాలు నాకు అవసరం. ఆ వివరాలు అన్నీ ఖచ్చితంగా వుంటేనే గాని ఎవరికి ట్రీట్‌మెంట్ మొదలు పెట్టను. ఇంతకు ముందు మీరు ఇక్కడ చూసిన నలభై మంది జనాభా ఒక కేసు గురించి, వాళ్ళు కన్నది, విన్నదీ విపులంగా చెప్పడానికి వచ్చారు. ఆ నలభై మందిలో ఒక వ్యక్తికి మాత్రమే హిప్నాటిజం ద్వారా చికిత్స చేయాల్సి వుంది, సరే....మన విషయానికి వద్దాం.... ముందుగా వివరాలన్నీ కావాలి" అన్నాడు.

"అయితే నేను మీకు చెబుతాను అంకుల్" అంటూ చిన్నగా గొంతు సవరించుకుంది సుప్రియ.

"ఈయన....నా ఫ్రెండ్ మిస్టర్ గౌతమ్....ప్రైవేట్ డిటెక్టివ్."

"ఆహా....అలాగా!" కళ్ళలో, ముఖంలో విపరీతమైన ఆశ్చర్యం ప్రదర్శించాడు పరమాత్మ.

"నా ఫ్రెండ్....శుభాంగి వుంది కదా! ఆమె గురించి ఒక కేస్ ఇన్వెస్టిగేట్ చేస్తున్నారు ఈయన."

"ఆహా....నిజంగానా!"....మరింత ఆశ్చర్యపోయినట్లుగా అన్నాడు డాక్టర్.

"ఈ కేస్ విషయంగా దాదాపు పదిహేను రోజులుగా ఈ ఊర్లో వుంటున్నారు. ఈయన వుండేది బొంబాయి."

"ఈజిట్....బొంబాయా! వెరీ ఇంట్రెస్టింగ్" పట్టలేని ఆశ్చర్యం ప్రకటించాడు డాక్టర్.

ఒళ్ళు మండిపోతోంది గౌతమ్‌కి.

"ఎందుకు అంత అతిగా ఆశ్చర్యపోతాడు అన్నింటికీ....అంత విపరీతంగా ఆశ్చర్యపోవాల్సినంత సీను ఏమీ లేనేలేదు. "ఈయన పేరు గౌతమ్" అనగానే ఆశ్చర్యపోయాడు. "ఈయన ప్రైవేట్ డిటెక్టివ్" అనగానే మరోసారి బాగా ఆశ్చర్యపోయాడు. "ఈయన వుండేది బొంబాయి" అనగానే పట్టలేని ఆశ్చర్యం ప్రదర్శించారు. ఎందుకింత అతిగా ఆశ్చర్యపోతున్నాడు మీ అంకుల్? ఆయన యాక్షన్ చూస్తుంటే ఒళ్ళు మండిపోతోంది నాకు" కసిగా....చెవిలో గుసగుసలాడినట్లుగా అన్నాడు గౌతమ్.

"అది ఆశ్చర్యపోవటం కాదు....నా అలవాటు....అది తెలియని నీకు ఒళ్ళు మండటంలో తప్పులేదు" జవాబు వచ్చింది.

అది విని అదిరిపడ్డాడు గౌతమ్.

కారణం....

జవాబు చెప్పింది సుప్రియ కాదు....పరమాత్మ.

తను సుప్రియ చెవిలో గుసగుసలాడితే....అది పరమాత్మకెలా



వినిపించింది? దానికి సమాధానం ఆయన ఎలా చెప్పగలిగాడు?....ఆశ్చర్యంతో తల తిరిగిపోయింది గౌతమ్‌కి.

"ఎందుకంతగా ఆశ్చర్యపోతావు? ఇక్కడ అంతగా ఆశ్చర్యపోయే సీను ఏమీ లేదు. నీ పెదవుల కదలికనిబట్టి నువ్వు సుప్రియతో మాట్లాడిన మాట ఏమిటో కనిపెట్టాను. అంత మాత్రానికే ఇంతగా ఆశ్చర్యపోవాలా!" ఎదురు ప్రశ్నించాడు డాక్టర్.

ఎవరో ముఖంమీద కొట్టినట్లు ఉలిక్కిపడ్డాడు గౌతమ్.

ఆ దెబ్బకు మతిపోయింది.

కిక్కురుమనకుండా కూర్చున్నాడు నోట మాటరాక.

విషయం అంతా చెప్పసాగింది సుప్రియ.

ఆయన ఆశ్చర్యపోతూనే వింటున్నాడు విషయం.

నిముషాలు గడుస్తున్నాయి.

నోరు ఎత్తే ప్రయత్నం చేయడంలేదు గౌతమ్.

శుభాంగి గత జీవితంలో మౌనిక అనే అమ్మాయి అయివుండవచ్చు అన్న విషయం....శుభాంగికి వచ్చే కలలు....ఆమె వింత ప్రవర్తన డాక్టర్ని కలవటానికి ఆమె నిరాకరించడం....అన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది సుప్రియ.

అంతా విన్నాడు డాక్టర్ పరమాత్మ.

"మీరు ఏమయినా చెబుతారా!" అన్నాడు గౌతమ్‌తో.

క్షణం తరువాత సర్దుకుని అన్నాడు—"నాకు అంతా అయోమయంగా వుంది. ఐ మీన్ ఆమె ప్రవర్తన....ఆ కల లేమిటో....ఆమె గతం గురించిన నిజాలు ఆమె నిరాకరించడం....ఇవన్నీ ఏమీ అర్థం కాకుండా వున్నాయి. ఆమె అబద్ధాలు చెప్పి....మానసిక స్థితి సరిగా లేనిదానిలాగా నటిస్తోందని నా అభిప్రాయం" అన్నాడు గౌతమ్.

ఈసారి ఆశ్చర్యపోకుండా నిశ్శబ్దంగా విన్నాడు ఆయన.

పది నిముషాలు వాళ్ళమధ్య నిశ్శబ్దంగా గడిచాయి.

23)

ఆయన ఏం ఆలోచిస్తున్నాడా అని తదేకంగా ఆయనని చూస్తున్నారు ఇద్దరూ.

"ఈ కేస్ చాలా వింతగా వుంది... ఒకటిమాత్రం చెప్పగలను.... ఆమె అబద్దాలు చెప్పడంలేదు ...ఆమె మెదడును....ఆలోచనలను.... ఎవరో....ఎక్కడినుంచో నియంత్రిస్తున్నారు" చెప్పాడు డాక్టర్.

షాకయ్యారు ఇద్దరూ ఆయన మాటకి.

"యస్....హర్ బ్రెయిన్ ఈజ్ కంట్రోల్డ్ బై సమ్ బడీ... విత్ ఎ రిమోట్ కంట్రోల్"

"అంకుల్ మీరు....చెప్పేది మాకు ఏమాత్రం అర్దం కావటం లేదు" నిర్మొహమాటంగా అంది సుప్రియ. చాలా తేలికగా నవ్వేశాడు డాక్టర్ పరమాత్మ.

"ఈకేస్ సాల్వ్ అవ్వాలంటే చాలా చిక్కుముడులు విడాలి. మీరు చెప్పిన మాటలు ఆధారంగా ఆమె మానసిక పరిస్థితి ఒకరకంగా ఉండవచ్చని ఊహిస్తున్నాను. నేను ఊహించిన విధంగా ఆమె మానసికస్థితి ఉందా లేదా అనేది ముందుగా నేను తెలుసుకోవాలి" అన్నాడు పరమాత్మ.

ఇద్దరూ ముఖాముఖాలు చూసుకున్నారు.

"ఇంకా కన్ఫ్యూజ్ అయ్యారా!....ఓ.కె. మీకు అర్థమయ్యేలా చెబుతాను. శుభాంగి, మౌనిక ఇద్దరూ ఒకటే అని మీ అభిప్రాయం అవునా!"

అవునన్నట్లు తల ఊపాడు గౌతమ్.

"కానీ ఆ విషయం ఆమె ఒప్పుకోవడం లేదు .. అవునా!"

"అవును"

"ఎందుకు ఒప్పుకోవటం లేదు?"

"ఏమో....అదే అర్థం కావడం లేదు.

"ఆమెకు తన తండ్రి జైసింగ్ షకావత్ దగ్గర ఉండటం ఇష్టం లేదేమో! అందుకే విడిగా ఒంటరిగా ఉంటోందేమో!"

"కాని ఆమె మాయమైనప్పటి పరిస్థితులు ఈ అభిప్రాయానికి అనుకూలంగా లేవు. ఆమె ఆ ఇంటినుండి పారిపోయినట్టు లేదు ...ఎవరో బలవంతంగా కిడ్నాప్ చేసి ఆమెను అపహరించారు"



"ఆర్ యూ షూర్?"

"యస్ సర్"

"మరి కిడ్నాప్ కేస్ అయితే ఆమె తన తండ్రిని చేరే ప్రయత్నం చెయ్యాలికదా!"

"అదే అర్థం కావడం లేదు. అంతేకాదు. ఆమెకు వచ్చేకల గురించి.... దాదాపు రెండు సంవత్సరాలుగా అదేకల రిపీట్ అవుతోంది అంటుంది. కలల్లో అదే నీగ్రో మనిషి కనిపిస్తున్నాడు అంటుంది. ప్రతిసారీ రోజులు తగ్గించి చెపుతుంటాడు. అంటే కలవచ్చినపుడల్లా ఒక్కోరోజు తగ్గిస్తున్నాడంటుంది. ఒకే కల ఇన్నిసార్లు రావటం సాధ్యమా!"

"దట్ కెనాట్ బి రూల్డ్ ఔట్. ఇలా రిపీటెడ్‌గా వచ్చేకల సాధారణమైనకల కాకపోవచ్చు. అందులో అతను రోజులు లెక్కపెట్టడం కూడా అసాధారణమే"

"అదే చెప్పానుకదా!....ఆమె మెదడును ఎవరో కంట్రోల్ చేస్తూ ఉండవచ్చు"

"ఒకరి మెదడును ఒకరు కంట్రోల్ చేయటం....నిజంకాదేమో!"

"నిజమే ...అది"

"సాధ్యం కాదేమోననిపిస్తోంది"

"ఖచ్చితంగా సాధ్యం"

"ఆ అవసరం ఎవరికి ఉంటుంది?"

"ఏమో! అది నేను చెప్పలేను"

"ఎవరయినా ఒక వ్యక్తిని కిడ్నాప్ చేస్తే అది డబ్బు కోసమో, మరేదయినా స్వార్థ ప్రయోజనాలకోసమో ఉంటుంది. ఈ కిడ్నాప్ వెనుక అటువంటి స్వార్థ ప్రయోజనాలు ఏవీ ఉన్న లక్షణాలు కనపడలేదు. కారణం....ఆమె కిడ్నాప్ జరిగాక, మాకు ఇంత డబ్బు ఇస్తే ఆమెను విడిచి పెడతాం....లేదా ఈ పనిచేస్తే వదులుతాం....అంటూ ఎవరూ క్లెయిమ్ చెయ్యలేదు. అటువంటప్పుడు ఆమెను కిడ్నాప్ చేసి ఇక్కడ హైదరాబాద్‌లో సజీవంగా ఉంచి, ఆమె మెదడును, ఆలోచనలను కంట్రోల్ చేస్తూ

ఉంచవలసిన అవసరం ఎంతవరకు ఉంటుంది? ఎవరికి ఉంటుంది?''

"అది నేను ఊహించలేను. ఇన్ని సందిగ్ధాలు, ప్రశ్నలు, అనుమానాలు ఉన్నప్పుడు విషయం అంతా అస్పష్టంగా ఉన్నప్పుడు మనం ఈ విషయం గురించి చర్చించడం కూడా వృథా అనిపిస్తుంది.''

డాక్టర్ ఆమాట అనటంతో సైలెంట్ అయిపోయాడు గౌతమ్.

"అది నిజమే అంకుల్....ఈ విషయం గురించి పూర్తిగా అవగాహనకి రావాలంటే శుభాంగి నుండి తెలియాల్సిన నిజాలు చాలా చాలా ఉన్నాయి'' అంది సుప్రియ.

"దట్స్ కరెక్ట్....అందుకే ముందుగా నేను శుభాంగిని చూడాలి. ఐమీన్ మాట్లాడాలి. అప్పుడే నేనొక నిర్దిష్టమైన అభిప్రాయానికి రాగలుగుతాను''

"బట్....ఆమెను చాలాసార్లు రమ్మని అడిగాను అంకుల్. ఆమె రానని మొరాయిస్తోంది''

"కానీ మనం ఆమెను ఇక్కడికి తీసుకురాక తప్పదు''

"ఆమెను ఇక్కడికి తీసుకురాలేని పరిస్థితిలో ఈ కేస్ గురించి మీరు మర్చిపోయి బొంబాయి వెళ్ళిపోవచ్చు మిస్టర్ గౌతమ్'' చెప్పాడు డాక్టర్.

"అవును గౌతమ్....ఆమెను ఎలాగయినా తీసుకురావాలి మనం''

"వుయ్ విల్ ట్రై అవర్ బెస్ట్''

"ఆమెను తీసుకువచ్చాక మీరు ఆమెచేత ఎంతసేపట్లో నిజం చెప్పిస్తారు?''

ఒకింత ఇబ్బందిగా నవ్వాడు డాక్టర్.

"మీరు అడిగేది విడ్డూరంగా వుంది. పచ్చిగా చెప్పాలంటే, వెనుకటికి ఎవరో చెరువులో గేదెను ఉంచి బేరం మొదలు పెట్టాడట....అలా వుంది మీరు చెప్పేది''

డాక్టర్ మాటలకు నాలిక కరుచుకున్నాడు గౌతమ్.

"ఇంతవరకు మీరు చెప్పే వెర్షన్స్ వినటమే కాని, ఆమెను చూడలేదు....మాట్లాడలేదు, ఇదేమీ జరగనపుడు నేను ఆమెచేత నిజం ఎంత



సేపట్లో చెప్పించగలను అని అడిగితే సమాధానం ఏం చెప్పగలను.''

"సమాధానం చెప్పించడం అంటే ఏం చేస్తారు అంకుల్'' మాట మార్చడానికి ప్రయత్నించుతూ అంది సుప్రియ.

"సాధారణంగా ఇటువంటి కేసులలో నిజాలు రాబట్టటానికి హిప్నోసిస్ పద్ధతిని ఉపయోగిస్తారు. కానీ అందరిమీద హిప్నోసిస్ ఉపయోగించము కేస్‌ని బట్టి పరిస్థితిని బట్టి, సందర్భాన్నిబట్టి ఉపయోగించాల్సి ఉంటుంది. హిప్నోసిస్ అనేది చిట్టచివరగా ఉపయోగించే అస్త్రం. ఇది చేసే ముందుగా పేషెంటుని చూడాలి. ఆమెతో మాట్లాడాలి. చాలా విపులంగా, వివరంగా చర్చించాలి. ఆమె గురించి నాకొక పూర్తి అవగాహన రావాలి. అప్పుడే ఆమె నుండి నిజాలు రాబట్టడానికి ఏం చేయగలనన్న విషయాన్ని నిర్ణయించగలుగుతా''

"అందుకు ఏం చేస్తారు?''

"హిప్నోసిస్ ప్రయోగించేందుకు ముందు చాలా గ్రౌండ్‌వర్క్ చేయాల్సివుంటుంది. ఆమెను కొన్ని పరీక్షలు చేయాలి. ఆమెతో ముందుగా మామూలు సంభాషణ ప్రారంభించాలి. ఆ సంభాషణలు చాలా ఫ్రెండ్లీగా ఉండాలి. ఆ తరువాత దశలో ఆమెమీద ప్రత్యేకమైన ప్రశ్నలు మొదలు పెట్టి ఇన్వెస్టిగేటివ్ పద్ధతిలో నిజాలు రాబట్టే ప్రయత్నం చెయ్యాలి. ఆమెకు సన్నిహితుడయిన వ్యక్తిలాగ ఆమె ఫీలవ్వాలి. మరికొన్ని ప్రశ్నలు ఇంటర్వ్యూ పద్ధతిలో చెయ్యాలి.

ఆ తరువాత స్టేజీలో ఆమెను పేషంటుగా ట్రీట్ చేసి నా టెస్టులు ప్రారంభించాల్సి వుంటుంది. అప్పుడు ప్రయోగించేది హిప్నోసిస్. అది ప్రయోగించేలోపు ఆమె గురించిన పూర్తి వివరాలు అంటే, ఆమె ఇష్టాలు, అయిష్టాలు, కోరికలు, సంతోషాలు, విషాదాలు, ఆమె స్వభావం, ప్రవృత్తి ఇలాంటివన్నీ ఖచ్చితంగా తెలుసుకొని వుండాలి.

అతడే హిప్నోసిస్‌ని ఏ దశలో ప్రయోగించాలో, ఏ పద్ధతిలో ప్రశ్నించాలో, ఏ పద్ధతిలో నిజాలు రాబట్టాలో....సరిగ్గా ప్లాన్ చేసుకోగలుగుతాడు.''

"బట్....డాక్టర్ మీరు చెప్పేదానిని బట్టిచూస్తే ఆమెమీద హిప్నో

సిస్ ప్రయోగించి నిజాలు రాబట్టడానికి చాలాకాలం పట్టేటట్లు వుంది''

"అవును''

"అంటే ఎంతకాలం పట్టవచ్చు?''

"రోజులు పట్టొచ్చు....వారాలు....నెలలు కూడా పట్టవచ్చు''

"మైగాడ్....అంత టైము లేదుకదా!''

"కానీ తప్పదు....గంటల్లోనో, రోజుల్లోనో తెలియటం మాత్రం అసంభవం''

"ఓ గాడ్'' తల పట్టుకున్నాడు గౌతమ్.

"గౌతమ్....ఎండ్ రిజల్ట్స్ గురించి ఇప్పుడే వర్రీ అవటం ఎందుకు? చూద్దాం....మన లక్ బావుంటే ఆమె నుండి నిజాలు త్వరగానే రావచ్చు."

"డాక్టర్....ఇంకేదయినా పద్ధతిద్వారా....అంటే....మీరు ఉపయోగించే ఈ హిప్నోసిస్ ద్వారా కాకుండా మరేదయినా పద్ధతిలో....కొంచెం త్వరగా నిజాలు రాబట్టడానికి మరేదయినా పద్ధతిలో....కొంచెం త్వరగా నిజాలు రాబట్టడానికి ఏమీ మార్గంలేదా! హిప్నాటిస్టులు కాకుండా, ఇతర డాక్టర్లు ఎవరయినా ఈ విషయంలో సహాయపడగలరా!''

"టుది బెస్టు ఆఫ్ మై నాలెడ్జ్....అది అసంభవం. నిజాలు కావాలనుకుంటే కొంత సమయం వెచ్చించక తప్పదు'' ఖచ్చితంగా చెప్పాడు డాక్టర్.

ఒకింత నిరుత్సాహంగా చైర్‌లోంచి లేచాడు గౌతమ్.

"ఒకటి రెండు రోజుల్లో ఆమెను తీసుకువచ్చే ప్రయత్నం చెయ్యండి. ప్రాసెస్ త్వరగా మొదలుపెట్టవచ్చు'' చెప్పాడు డాక్టరు.

"అలాగే'' అని ముందుకు కదిలారు ఇద్దరూ.

"ఈ డాక్టరు పేరు, ఆకారం, వేషధారణ అంతా పెద్ద కామెడీ నటుడిలా వుంది. కానీ మహా తెలివయినవాడు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలడు'' అని అప్పటికి పదోసారి అనుకున్నాడు గౌతమ్.

o o o



"మీకు ఈ స్టైయిల్ చాలా బావుంది'' గౌతమ్ ముఖం పరీక్షగా చూస్తూ అంది శుభాంగి.

"ఏ స్టైయిల్?'' అర్థంకాక తెల్లముఖం వేసాడు గౌతమ్.

"ఏ స్టైయిల్ అంటే....అదే....అనిల్‌కపూర్ లాగా రఫ్‌గా పెరిగిన గడ్డం....మీకు చాలా అందాన్నిస్తోంది''

ఫక్కుమని నవ్వాడు గౌతమ్.

"ఎందుకు నవ్వుతున్నారు? నిజంగానే చెబుతున్నాను'' ముఖం ఒకింత చిన్నబుచ్చుకుంటూ అంది ఆమె.

"నవ్వక ఏం చెయ్యమంటారు? నాలుగు రోజులుగా షేవింగ్ చేయించుకోవటానికి టైము లేక నేను చస్తోంటే....మీరు అనిల్‌కపూర్ స్టైయిల్. జాకీష్రాఫ్ స్టైయిల్ అంటే .. ఎలా వుంటుంది మరి? అసలే రోజూ షేవ్ చేసుకోవటం అలవాటు నాకు''

"నాకయితే ఈ స్టైయిల్ నచ్చింది. బట్ మీరు దానిని ఎగతాళి అంటున్నారు కాబట్టి అయామ్ వెరీ సారీ''

"ఇట్సాల్ రైట్. నేనేమీ అంత సీరియస్‌గా తీసుకోలేదు లెండి. అది సరే....నేను వచ్చి పది నిమిషాలు అవుతోంది. అతిథి మర్యాదగా ఏమీ ఇవ్వలేదు. అసలే ఆకలిగా కూడా వుంది'' అన్నాడు నిర్మోహమాటంగా.

"అరే .... సారీ .... మర్చిపోయాను'' అంటూ చైర్‌లోంచి లేచిందామె.

"మళ్ళీ సారీ చెబుతున్నారు. ఇలా ఎన్నిసార్లు చెబుతారు?''

"ఇంక చెప్పను లెండి. రెండు నిమిషాల్లో వస్తాను'' అంటూ టి.వి. ఆన్‌చేసి లోపలికి వెళ్ళిందామె.

"ముందు ఓ దమ్ము లాగితేనే కానీ ఈ నీరసం తగ్గదు'' అనుకుంటూ జేబులో చెయ్యివుంచి సిగరెట్ ప్యాక్ బయటికి లాగి గభాల్న మళ్ళీ లోపలికి తోసేసాడు.

ఇది శుభాంగి ఇల్లు, ఆమెకు సిగరెట్ పొగ అంటే పరమ చిరాకు. ఆ విషయం సడన్‌గా గుర్తుకువచ్చింది అతనికి.

ఇదొక పనిష్మెంట్....బయటికి వెళ్ళేవరకు సిగరెట్ తాగటానికి లేదు.

టి.వి.లో యథాప్రకారం ఏదో దిక్కుమాలిన ప్రోగ్రాం వస్తోంది.

"ఛీ ...ఇలాంటి ప్రోగ్రాం చూడటం కూడా పనిష్మెంటే"....అనుకున్నాడు.

ఈరోజు శుభాంగితో విషయాలు అన్నీ వివరంగా మాట్లాడి ఇటో అటో తేల్చెయ్యాలి అనుకున్నాడు.

ఒక ప్లేట్‌లో చిప్స్, మరో కప్పులో కాఫీతో వచ్చిందామె.

"ఇవి బనానా చిప్స్‌కదా!" అన్నాడు ప్లేట్లో ఉన్న వాటిని చూస్తూ.

"అవును .. ఏం మీరు తినరా!" ఒకింత సందేహంగా అంది ఆమె.

"అదేం లేదు. తింటూనే వుంటాను. మీకు ఇవి ఎక్కడివి?"

"మా యింటిప్రక్కన ఉన్న వాళ్ళు కేరళనుంచి వచ్చారు. వాళ్ళు ఇవి తయారు చేస్తుంటారు. చేసిన ప్రతిసారీ నాకు కొన్ని ఇస్తుంటారు."

"ఐ.సీ" అన్నాడు ఆ చిప్స్ నోట్లో పెట్టుకుంటూ.

"ఎలా ఉన్నాయి?" అడిగిందామె తనూ ఒకటి తీసుకుంటూ.

"బాగున్నాయి" అని అర్థం వచ్చేలా తలఊపి కళ్ళు ఆర్పాడు గౌతమ్.

"నిన్న రాత్రి మళ్ళీ ఆ కల వచ్చిందీ!" విషయం డైరెక్ట్‌గా మొదలుపెట్టేశాడు గౌతమ్.

తల అడ్డంగా ఊపిందామె.

"అయితే రాత్రంతా బాగా నిద్రపోయి ఉండాలి కదా!"

మళ్ళీ తల అడ్డంగా ఊపింది ఆమె.

"అదేమిటి?" ప్రశ్నార్థకంగా మారింది అతని ముఖం.

"ఏమోమరి....అదే నాకు తెలియదు. అందుకే ఇప్పుడు నిద్ర వస్తోంది కూడా" అని అప్పటివరకు మంచం మీద కూర్చుని ఉన్న ఆమె బోర్లాపడుకుని, పిల్లో మీద గుండెలు ఆన్చింది.

ఆ భంగిమలో పడుకొని ఉన్న ఆమెను చూస్తూ మాట్లాడాలంటే ఒకింత ఇబ్బందిగా అనిపించింది అతనికి.



అఫ్‌కోర్స్... ఆ భంగిమలో అసభ్యత లేదు. కానీ కొంచెం అనీజీగా అనిపించింది.

మీ సమస్యలు తొలగాలంటే....ఐమీన్ ఈ కలలు....అవీ మిమ్మల్ని మానసికంగా వేధించకుండా ఉండాలంటే

"ముందుగా మీరు నాకు అన్నివిధాలా సహకరిస్తానని మాటివ్వాలి"

"ఎటువంటి సహకారం?"

"ఎటువంటి సహకారం....అంటే ..నేను అడిగే ప్రశ్నలకి సరిగ్గా సమాధానం చెప్పాలి. నేను అడుగుతున్న ప్రశ్నలు మీకు కొంచెం ఇబ్బంది కలిగించినా, మీకు బాధ కలిగించినా, మీరు త్వరగా కోపం తెచ్చుకోవటం ....రోజుల తరబడి ముభావంగా ఉండటం....మానసికంగా డిప్రెషన్ ఫీలవటం....ఇలాంటివి చేయకూడదు. అలా అయితేనే నేను మీ సమస్యల్లో భాగం పంచుకుంటాను" ఖచ్చితంగా తను చెప్పాలనుకున్నది చెప్పేసాడు.

కొద్దిసేపు మాట్లాడలేదు ఆమె.

"నా కండిషన్‌కి ఒప్పుకుంటున్నారా! లేదా!" మళ్ళీ అడిగాడు.

సరే అన్నట్టుగా తలవూపి "కానీ నాదొక సందేహం" అందామె.

"ఏమిటది?"

"మొన్న మీరు ఒక అమ్మాయి ఫోటోలు చూపించారు."

"ఒకమ్మాయి కాదు....అవి మీవే!

"అదే నమ్మశక్యంగా లేదు?"

"ఏది నమ్మశక్యంగా లేదు?"

"నేను ఎవరో ఎం.పి. కూతుర్ని అవటం....నేను రాత్రికి రాత్రి మాయం అవటం ఆ తరువాత నాపేరు మౌనిక నుండి శుభాంగి అని మార్చుకోవడం....ఇదంతా పచ్చి అబద్ధం అనిపిస్తోంది"

"మరయితే నిజం ఏమిటి?"

"నా తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చనిపోయారు. మాది బెంగుళూరు."

"ఈ సంఘటన మీకు గుర్తుందా!"

"లేదు"

"మరి ఎలా తెలుసు?"

"మా మావయ్య చెప్పేవాడు"

"మీ మామయ్య చెప్పిన దానినిబట్టి మీ తల్లిదండ్రులు చనిపోయే నాటికి మీ వయసు ఎంత ఉంటుంది?"

"పదహారు ఉంటాయేమో!"

"పదహారేళ్ళ వయస్సులో తల్లిదండ్రులు చనిపోతే అది గుర్తుండదా?"

"షెల్ మి....మీరు హైదరాబాద్ రాకముందు జరిగిన సంఘటనలు ఏవీ గుర్తులేవా! పోనీ మీ తండ్రి ఎలా ఉండేవారు?....తల్లి ఎలా ఉండేవారు?....వాళ్ళ ఫోటోలు అయినా లేవా!"

"ఈ ప్రశ్నలకు సమాధానం మీ దగ్గర లేదు. కారణం.... మీరు చెప్పినవి నిజాలు కాదు"

"నో....నాకు తెలిసి నేను ఏ అబద్దమూ చెప్పడం లేదు"

"మీకు తెలిసి చెప్పటంలేదు. కానీ తెలియకుండా చెబుతున్నారు. మీరు చెప్పటంలేదు. మీచేత చెప్పిస్తున్నారు."

"నాచేత చెప్పించడమా?....అదేమిటి?....మీరనేది నాకు అర్థం కావటంలేదు"

"అవును....మీ ఆలోచనల్ని, మెదడును ఎవరో కంట్రోల్ చేస్తున్నారు"

"వాట్?"

"యస్....ఇది నిజం....జైసింగ్ షకావత్ కూతురు మీరు. మిమ్మల్ని కిడ్నాప్ చేసారు ఎవరో. కిడ్నాప్ చేసాక ఇక్కడ వుంచారు... మీ గతం మరిచిపోయేలా మిమ్మల్ని చేసారు. అందుకే మీ చిన్ననాటి సంఘటనలు ఏవీ గుర్తుకావటంలేదు. ఏదయినా దెబ్బ మెదడుకు తగిలి



మరిచిపోవటం అయితే, మీ గతంతోపాటు, మీ చదువు....లోకజ్ఞానం అన్నీ మర్చిపోవాలి. కానీ అలా జరగలేదు. అంటే....ఇది ఖచ్చితంగా ఎవరో చేస్తున్న పని"

అదిరిపడింది ఆమె.

"బాగా ఆలోచించండి. నా మాటల్లో నిజం ఉందనిపిస్తోందా!" సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

క్షణకాలం తరువాత అవునన్నట్టుగా తల ఊపింది.

"మరి తరచుగా కల రావటం....ఒకే విధమైన కల రావటం.... ఇది ఖచ్చితంగా మీ మెదడును కంట్రోల్ చేయటంలో భాగం అయి ఉండచ్చు"

"కానీ....ఎవరికి" ఆ అవసరం .. ఉంటుంది? ఎవరయినా కిడ్నాప్ చేస్తే వాళ్ళ పని కాగానే వదిలేస్తారు. లేకుంటే చంపేస్తారు. అంతేకాని ఇలా" ఇంకా ఏదో అనబోయింది ఆమె.

"అందుకే ఇది మిస్టీరియస్‌గా అనిపిస్తుంది. జైసింగ్ షకావత్ రాజకీయ నాయకుడు కాబట్టి ఆయన రాజకీయ ప్రత్యర్థులు మిమ్మల్ని కిడ్నాప్ చేసే అవకాశాలు చాలా వున్నాయి. కానీ అలా కిడ్నాప్ చేసిన వాళ్ళు మిమ్మల్ని సజీవంగా ఇన్నేళ్ళపాటు ఇంకో ఊళ్ళో ఉంచాల్సిన అవసరం ఏముంది? అదే ఏమాత్రం అర్థంగాని విషయం"

"మీరు, మౌనిక ఒకటే....అనటానికి చాలా ఆధారాలున్నాయి" తనే అన్నాడు.

"పోలికలనుబట్టేకదా మీరనేది?"

"కాదు....చాలా ఇతర విషయాలు కూడా పోల్చి చెబుతున్నాను. అంతెందుకు మీరు ఈ ఫైల్‌లోని పేపర్సు చూడండి. మీకే తెలుస్తుంది" అంటూ తన దగ్గరవున్న మౌనిక కేస్ ఫైల్ ఆమె చేతికి ఇచ్చాడు.

ఆమె కళ్ళు ఆ అక్షరాల వెంట పరుగులు పెడుతున్నాయి.

క్షణాలు....నిమిషాలు....సుమారు రెండు గంటలు గడిచాయి. ఈ లోపు తెలియకుండానే సోఫాలో వెనక్కి జారి నిద్రలోకి కనీసం ఓ అర గంట అయినా జారుకున్నాడు గౌతమ్.

అతనికి మెలుకువ వచ్చిన పది నిముషాలకి ఆమె చదవటం ఆపింది.

"అప్పుడే ఫైల్ చదవటం అంతాఅయిపోయిందా!" అడిగాడు.

"ఇంకా అవలేదు. ముఖ్యమైన విషయాలన్నీ చదివేశాను. మిగతావి తరువాత చదువుతాను" అంది ఫైల్ ప్రక్కనపెట్టి. ఒక వైట్ పేపర్, పెన్ను తీసుకుంది.

"ఏం రాయబోతున్నారు?"

"నాకు మౌనికకు ఉన్న దగ్గర పోలికలు, సామీప్యాలు రాస్తాను"

"అంటే మీకు మౌనికకు చాలా దగ్గర పోలికలున్నాయని ఒప్పుకుంటారా!"

"ఒప్పుకోవాల్సి వస్తోంది" అందామె పేపరు మీద రాయటానికి ఉపక్రమిస్తూ.

ఆమె ఈ విధంగా రాయసాగింది.

1. మౌనిక : ఆమె బ్రతికి వుంటే ఇరవై ఆరు సంవత్సరాలు ఆమెకు ప్రస్తుతం ఉండేవి.

నేను : నా వయస్సు ఇరవై ఆరు సంవత్సరాలు.

2. మౌనిక: ఆమె మమ్మూర్తులా నన్ను పోలి వుంది.

నేను: మౌనికలాగే ఉన్నాను.

3. మౌనిక: ఆమె శరీర ఛాయ తెలుపు.

నేను: నా శరీర వర్ణం కూడా తెలుపే.

4. మౌనిక: ఆమె ఎత్తు ఐదడుగుల ఆరున్నర అంగుళాలు.

నేను: నా ఎత్తూ ఐదడుగుల ఆరున్నర అంగుళాలే. అంతే నా హైట్‌లో పదేళ్ళుగా మార్పు ఏ మాత్రం లేదు.

5. మౌనిక:ఆమె కంటిపాపలు లేత గోధుమ రంగులో ఉంటాయి

నేను: నా కంటిపాపలు కూడా గోధుమ రంగులోనే ఉన్నాయి.

6. మౌనిక: ఆమె పొట్టమీద నాభికి కొంచెం ప్రక్కగా ఆపరేషన్ చేసిన చిన్న మచ్చ వుంది.

నేను: నాకు కూడా అదే ప్రదేశంలో చిన్న మచ్చ వుంది.



7. మౌనిక: ఆమెకు క్రిందపెదవికి క్రిందగా కుడివైపుకు ఒక పుట్టుమచ్చ, కుడి మోకాలికి కొంచెం పైగా ఒక పుట్టు మచ్చ ఉన్నాయి.

నేను: నాకు కూడా ఖచ్చితంగా అదే ప్రదేశాలలో పుట్టుమచ్చ ఉన్నాయి.

8. మౌనిక: ఆమెకు డ్రాయింగ్, పెయింటింగ్స్ అంటే చాలా ఇష్టం. ఆమెకు స్కూల్, కాలేజీస్థాయిలో డ్రాయింగ్ కాంపిటేషన్స్‌లో బహుమతులు వచ్చాయి.

నేను: నేను పెయింటర్‌ని. పెయింటింగ్ కళనివృత్తిగా కూడా చేపట్టిన దానిని.

అంత వరకు రాసి తలఎత్తి గౌతమ్‌ని చూసిందామె.

"గుడ్ ....మీరు మౌనిక ఒకటే నన్న విషయాన్ని అంగీకరించడానికి చాలా చేరువలో ఉన్నారు. ఇలా మీరు రాస్తూపోతే, మీ ఇద్దరికీ ఇంకా చాలా పోలికలు కనిపిస్తాయి"

దీర్ఘాలోచనలో పడిందామె.

"ఇప్పుడు మీకో ముఖ్యమైన విషయం చెప్పదలుచుకున్నాను" అన్నాడు గౌతమ్.

o o o

గ్రే కలర్ ఫైల్‌లోని, ఉల్లిపొర కాగితాల లాంటి పలుచని కాగితాలు ఫ్యాన్ గాలికి రెపరెపలాడు తున్నాయి.

ఆ కాగితాల మీద అక్షరాలను చదువుతున్నాయి శుభాంగి కళ్ళు, మౌనిక కేస్ ఫైల్ అది.

పేజీలు తిరుగుతున్నకొద్దీ ముఖంలో రంగులు మారుతున్నాయి.

"ఈ ముస్తఫా, హుసేన్‌బీ పేర్లు వున్నాయే....వీళ్ళిద్దరూ ఎవరు?" అడిగింది శుభాంగి గౌతమ్‌ని.

"చదివితే తెలుస్తుంది. చదవండి" అన్నాడు తను చెప్పటం ఎందుకు అన్నట్లుగా.

ఇంక మాట్లాడలేదు ఆమె. తిరిగి చదవనారంభించింది.

ఒకింత రిలీఫ్‌గా వుంది గౌతమ్‌కి.

కారణం....

ఈ కేస్‌ని హేండిల్ చేయటంలో తన సహకారాన్ని పూర్తిగా అందిస్తానని చెప్పింది శుభాంగి.

ఆమెకు వచ్చే కలల గురించి, ఆమెలో కలిగే మానసిక అస్థిరతల గురించి డాక్టర్ పరమాత్మ దగ్గరకు రావడానికి కూడా సిద్ధపడుతోందిఆమె ఇచ్చే పాజిటివ్ సైన్.

కేస్‌ను సాల్వ్ చేయటానికి తొలి అవకాశం ఇది.

"ముస్తఫా, హుసేన్‌బీలు ఇద్దరూ పని వాళ్ళా.... పని వాళ్ళ గురించి కూడా కేస్ ఫైల్‌లో రాస్తారా!" నవ్వాడు గౌతమ్.

"సాధారణంగా ఏ కేసుకయినా స్ట్రాంగ్ సోర్స్ ఆఫ్ ఎవిడెన్స్ అంటే పని వాళ్ళే అవుతారు....ఎందుకంటే, ఇంట్లో వ్యక్తుల గురించి, వాళ్ళ మనస్తత్వాల గురించి, ఆ ఇంట్లోకి వచ్చేపోయే మనుషుల గురించి సరిఅయిన ఇన్ఫర్‌మేషన్ దొరకాలంటే అది వాళ్ళ నుండే వస్తుంది.

"వీళ్ళిద్దరూ పాకిస్తాన్ దేశస్థులు. స్వాతంత్ర్యం తరువాత భారత్, పాకిస్తాన్‌లు విడిపోయాక, వాళ్ళు భారతదేశంలో సెటిల్ అయిపోయిన వాళ్ళు. జైసింగ్ షకావత్ ఇంట్లో పనివాళ్ళుగా వుండిపోయారు. వాళ్ళే మౌనికని అంటే నిన్ను పెంచి పెద్ద చేసినది" తనే అన్నాడు.

కళ్ళు పెద్దవి చేసుకుని వింటోంది ఆమె. తన గత జీవితం గురించి మరో వ్యక్తి ద్వారా తను వినటం చాలా వింతగా అనిపిస్తోంది. ఓపక్కన నమ్మశక్యంగా కూడా అనిపించలేదు.

"ఆ మనుషులు కానీ, జైసింగ్ షకావత్ గాని నీకు కొంచెమయినా గుర్తున్నారా?"

తల అడ్డంగా ఊపిందామె.

"అస్సలు గుర్తు లేదు. ఇదంతా కొత్తగా వింటున్నట్లుంది. అది సరే....పని మనుషులు పెంచి పెద్ద చేయటం ఏమిటి? నాకు తల్లి లేదా?"

"లేదు"

"ఏమయింది?"

"నీ చిన్నప్పుడే చనిపోయింది"



"చాలా విచిత్రంగా వుంది"

"ఏమిటి?"

"నా గతం గురించి మూడో వ్యక్తి ద్వారా నేను వినటం, అది నాకు ఏ మాత్రం గుర్తుండకపోవటం"

"నీకు గుర్తున్నంత వరకు మీది కర్నాటక రాష్ట్రం కదా!" ఆమె మాటకు అడ్డు వస్తూ అన్నాడు గౌతమ్.

"అవును"

"నీకు షుమారు పదహారేళ్ళు వచ్చేవరకూ కర్నాటకలోనే వున్నానని నీ ఉద్దేశ్యం కదా?"

"అవును"

"మరి నీకు కన్నడ భాష వచ్చా"

"కన్నడ భాషా? అస్సలు రాదు"

"అదెలా సాధ్యం?"

"ఏమో....మరి"

"కారణం నువ్వు కర్నాటక రాష్ట్రంలో పుట్టలేదు, పెరగ లేదు. అందుకే నీకు కన్నడ భాష రాదు"

అదీ నిజమే అనిపించింది ఆమెకు.

"నీకు వచ్చిన భాషలు ఏమిటో చెప్పగలవా?" అడిగాడు.

"మామూలే. ఇంగ్లీషు, హిందీ, తెలుగు"

"ఇంకా?"

"ఇంకా....అంటే....కొంచెం రాజస్థానీ భాష అర్థమవుతుంది"

"ఈజిట్" సోఫాలో ముందుకు వంగాడు. అతని కనుబొమలు ముడి పడ్డాయి.

"అవును"

"నువ్వున్నది హైదరాబాద్‌లో....మరి రాజస్థానీ భాష ఎలా వచ్చు?"

"వచ్చు అంటే....పూర్తిగా రాదు. కొంచెం అర్థమవుతుంది. అంతే"

"అదే....ఎలా? మీ ఇంటి చుట్టుప్రక్కల రాజస్థానీయులు ఎవర యినా వున్నారా?"

"లేరు"

"పోనీ స్నేహితులు?"

"ఊహూ....అస్సలు లేరు"

"మరి ఆ భాష ఎలా అర్థమవుతోంది?"

"ఇంతవరకు నాకు ఆ ఆలోచనలేదు. ఇప్పుడు అదే అర్థం కావ డంలేదు"

"ఇందులో అర్థం అవ్వనంత కాంప్లికేషన్ ఏమీ లేదు. నీ తండ్రి జైసింగ్ షకావత్ రాజస్థాన్ నుండి వచ్చిన వాళ్ళందరితోనూ ఆయన రాజస్థానీలో మాట్లాడేవారు. అందువల్ల ఆ భాష నీకు కొంతవరకు అర్థం అవుతోంది."

అదిరిపడిందామె.

"ఈ విషయం కూడా ఆ పేపర్ మీద నోట్ చేయి. మౌనికకు రాజస్థానీ భాష వచ్చు. నాకు కూడా వచ్చు అని."

టీపాయ్ మీద వున్న పెన్ అందుకుని ఇంతకు ముందు రాసిన విషయాలతో పాటు ఈ పాయింట్‌ని కూడా చేర్చింది.

ఆ అక్షరాలు రాస్తున్నప్పుడు ఆమె చేయి సన్నగా వణికింది.

తనూ, మౌనిక ఒకటి కాదు ...అన్న గట్టి నమ్మకంతో వుందామె. కానీ.... ఇప్పుడా నమ్మకం తప్పేమో అనిపిస్తోంది.

'అసంభవం' అనుకున్న విషయం ఏదో సంభవమవుతున్నట్లుగా తోచింది. ఆమెకు ఆ సమయంలో.

o o o

రైల్వే లోకోషెడ్.

ఆ సమయంలో దాదాపు నిర్మానుష్యంగా వుంది.

పాతబడిన నాలుగు గుడ్స్ పెట్టెలు ఒక మూలగా ట్రాక్ మీద ఆగి వున్నాయి.

తుప్పు పట్టిపోయిన ఆ గూడ్స్ వ్యాగన్లు, చక్రాల చుట్టూ దట్టంగా



పెరిగిన గడ్డి ఆ వ్యాగన్లు కొన్ని నెలలుగా అక్కడ మంచి కదలలేదన్న విషయాన్ని తెలియజేస్తున్నాయి.

వాటికి కొంచెం ప్రక్కగా నీడలో నిద్రపోతున్నారు కూటికి, గుడ్డకి, ఇంటికి కరువైన కొందరు మనుషులు.

అక్కడికి రెండువందల గజాల దూరంలో రోడ్డుమీద ఆగి వుంది ఒక టాటా మొబైల్ వ్యాన్. అందులో ఇద్దరు వ్యక్తులు కూర్చుని వున్నారు.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న వ్యక్తికి సుమారు యాభై ఏళ్ళుం టాయి. సన్నగా, పొడవుగా, నల్లగా వున్నాడు అతను.

ప్రక్కన కూర్చున్న వ్యక్తికి కూడా ఇంచుమించు అదేవయస్సుం టుంది.

అతను మాత్రం బలిష్టంగా వున్నాడు.

ఇద్దరి దృష్టి ఆ లోకోషెడ్ వైపే వుంది.

అప్పటికి పది నిముషాలుగా రెప్పవాల్చకుండా అటే చూస్తున్నారు ఇద్దరూ.

"ఈ మధ్య మన పనులు సక్రమంగా జరగటంలేదు" అప్పటి వరకు నిశ్శబ్దంగా డ్రైవింగ్ సీట్లో కూర్చున్న ఆ వ్యక్తి పెదవి విప్పాడు.

సమాధానం చెప్పలేదు రెండోవ్యక్తి.

అతని దృష్టి లోకోషెడ్‌వైపే వుంది.

కుడిచేతిలోని అగ్గిపుల్ల చెవిలో వుంచి తిప్పుతున్నాడతను.

"మాట్లాడవేం?" మళ్ళీ అతనే అడిగాడు.

చెవిలోని అగ్గిపుల్ల తీసి క్రిందపడేసి తల తిప్పాడతను.

"నువ్వు చెప్పేది గౌతమ్ గురించేనా?" అన్నాడు.

అవునన్నట్లుగా తల ఊపాడతను.

"అంతగా అతని గురించి ఆలోచించవలసినది ఏముంది?"

"మొన్నటివరకు అలాగే అనుకున్నాను నేను కూడా. కానీ....

ఇంక సీరియస్‌గా తీసుకోక తప్పేటట్లు లేదు''

"అంటే?''

"అంటే ఏముంది? ఆ రఘునాథ్‌ని చంపాలని ప్రయత్నించాను. కానీ వాడు మృత్యుంజయుడయ్యాడు. బ్రతికి బట్టకట్టాడు.

"అది నిజమే....ఇప్పుడు ఆ రఘునాథ్‌ని చంపడం చాలా కష్టం. ఎందుకంటే అతడు ఇప్పుడు సుప్రియ ఇంట్లో వుంటున్నాడు. ఆమె ఇంటి పక్కనే హోం మినిస్టరు ఇల్లు వుంది. అందువల్ల సెక్యూరిటీ ఆ ఇంటి ప్రాంతాల్లో చాలా ఎక్కువ. కాలు పోవడంవల్ల అతను బయటికే రావడం లేదు కూడా!''

అసహనంగా తల తిప్పి చూశాడు డ్రైవింగ్ సీట్లోని వ్యక్తి.

"నీకు రానురాను మెదడు పనిచేయకుండా పోతోంది. మనం ఇప్పుడు రఘునాథ్‌ని చంపవలసిన అవసరం ఏమిటి? మనం అతనిని చంపాలనుకున్నది అతనిమీద కక్ష వుండి కాదు. అతని దగ్గరశుభాంగికేస్ తాలూకు ఫైల్స్ వున్నాయి ఆ ఫైల్స్ గౌతమ్‌చేతికి చేరేలోపు మనం అందు కోవాలని ప్రయత్నించాం. ఫెయిల్ అయ్యాం. ఇప్పుడు ఆ ఫైల్స్ రఘునాథ్ దగ్గరలేవు. ఇప్పుడతనిని చంపి ప్రయోజనం ఏమిటి....? కొత్త సమస్యలు కొనితెచ్చుకోవటం తప్ప'' కర్కశంగా మారిపోయింది అతని గొంతు.

నిశ్శబ్దంగా వుండిపోయాడతను. ఏది మాట్లాడబోయినా చివాటు తింటున్నాడు.

"ఈ కేస్ విషయంలో గౌతమ్ రోజురోజుకీ అడ్వాన్స్ అవుతున్నాడు.

ఆమెను హిప్నాటిస్ట్‌దగ్గరకు తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు. ఆమెకు మౌనిక ఫోటోలు చూపించాడు, మౌనిక, శుభాంగి ఒకరే అని ఆమెను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు''

అతని మాటకు అడ్డు వచ్చాడు రెండో వ్యక్తి.

"నువ్వు కోపగించుకోనంటే ఒక సందేహం'' అన్నాడు.

ఏమిటన్నట్లు చూసాడు డ్రైవింగ్ సీట్‌లోని వ్యక్తి.

"ఏంలేదు........ ఈ శుభాంగి కేసు నాకు అంత బాగా తెలియను.



ఇంతకీ మౌనిక శుభాంగి ఇద్దరూ వేరువేరు వ్యక్తులా? లేక ఒకే వ్యక్తా?''

సమాధానం చెప్పటానికి నోరు తెరిచిన అతను అలాగే క్షణకాలం వుండిపోయి "అటు చూడు'' అన్నాడు లోకోషెడ్ వైపు చేయి చూపిస్తూ.

దూరంగా కొన్ని గూడ్స్ పెట్టెలు షంటింగ్ జరుగుతున్నాయి.

"ఆ గూడ్స్ పెట్టెలే కదా మనకు కావలసింది!'' అన్నాడు అతను. అతని గొంతులో ఒకింత ఆందోళన ధ్వనించింది.

అవునన్నట్లు తల ఊపాడు రెండో వ్యక్తి.

రెప్పవాల్చకుండా అటు వైపే చూస్తున్నారు ఇద్దరూ.

దూరంగా పడుకొని వున్న ముష్టివాళ్ళలోంచి ఓ వ్యక్తి పైకిలేచాడు అతని దుస్తులు నల్లగా మాసిపోయి చిరిగిపోయి వున్నాయి. దుమ్ము కొట్టుకుని వున్నాడతను.

అప్పటివరకు తలక్రింద పెట్టుకొని వున్న పాత గోనె సంచి తీసి భుజంమీద వేసుకున్నాడు.

వడివడిగా అడుగులు వేస్తూ వెనుకకు షంటింగ్ జరుగుతున్న గూడ్స్ వ్యాగన్‌వైపు నడవసాగాడు.

అతనిని చూడగానే కళ్ళు మెరిసాయి వ్యాన్‌లో కూర్చున్న ఆ ఇద్దరికీ....

వెనుకకు వస్తున్న గూడ్స్ పెట్టెలు లూప్ లైన్‌లోకి వచ్చి కొంత దూరం వెళ్ళి డెడ్ ఎండ్ ట్రాక్‌లోకి వచ్చి ఆగిపోయాయి.

అలా ఆగిన ఆ ఖాళీ గూడ్స్‌కి, రైలుకిమధ్య కనీసం యాభై పెట్టెల పైగానే వుండివుంటాయి.

ముందువైపు ఇంజన్ ఎక్కడుందో కూడా కనపడడంలేదు.

ఆగిన ఆ గూడ్స్‌రైలు వైపు గబగబా నడిచి ఒక పెట్టె దగ్గరఆగి క్రింద వున్న చిత్తుకాగితాలు ఏరి సంచిలో వేసుకోసాగాడతను.

అలా కాగితాలు ఏరుతూ ఒక్కొక్క వ్యాగన్‌నే దాటుకుంటూ ముందుకు నడిచి ఒక వ్యాగన్ దగ్గర ఆగాడతను.

సరిగ్గా అదే సమయంలో ఆ వ్యాగన్‌లో నుండి, బరువుగా వున్న పాత గోనె సంచీ వున్న చెయ్యి ఒకటి బయటికి వచ్చింది.

ఆ సంచీ బయటికి వచ్చిన మరుక్షణం తన చేతిలోని చిత్తుకాగితాల గోనె సంచీని వ్యాగన్‌లో వున్నవ్యక్తి చేతికి అందించి, అతని చేతిలోని సంచిని తాను అందుకుని గిర్రున వెనక్కి తిరిగి వేగంగా వ్యాన్‌వున్న దిశగా రాసాగాడు అతను.

అంతవరకు ఉత్కంఠతో అతనినే చూస్తూ వ్యాన్‌లో కూర్చున్న ఆ వ్యక్తులిద్దరూ రిలీఫ్‌గా శ్వాస విడిచారు.

సరిగ్గా నిమిషం తర్వాత వ్యాన్‌ని సమీపించాడు అతను.

వ్యాన్ డోర్ తెరిచి సిద్ధంగా వుంచాడు డ్రైవింగ్ సీట్లోని వ్యక్తి.

తిన్నగా వచ్చి లోపల కూర్చున్నాడతను.

"సంచిలో ఏమున్నాయి?" అడిగాడు రెండోవ్యక్తి.

"రెండు ఎ.కె.47లు, నాలుగు సబ్ మెషిన్‌గన్లు, మూడో నాలుగో ఆటోమాటిక్ రివాల్వర్స్" చెప్పాడతను.

"గుడ్....డోరు వెయ్యి" చెప్పాడు డ్రైవింగ్ సీట్లోని వ్యక్తి.

డోరు క్లోజ్ చేశాడు.

"ఈ వ్యవహారం ఎవరి కళ్ళ పడలేదుగా!"

లేదన్నట్టు తల ఊపాడతను.

"వ్యాగన్‌లో రంగా ఒక్కడే వున్నాడా!"

అవునన్నట్టు తల ఊపాడు అతను.

"రంగా వల్ల మనకేం ప్రమాదం లేదుగా!"

"అతను నమ్మకంగా మన మనిషే"

వాళ్ళ మధ్య మాటలు ఆగిపోయాయి.

చిన్న శబ్దంతో స్టార్టయి మెయిన్ రోడ్ వైపు దూసుకుపోసాగింది టాటా మొబైల్ వ్యాన్.

o o o

అనూహ్యమైన సంఘటనలు మనిషికి అంత త్వరగా ఆకళింపు కావు.

ఆ సంఘటనలను అర్థంచేసుకోవాలన్నా, రిసీవ్ చేసుకోవాలన్నా కూడా కొంత సమయం పడుతుంది.



అది పూర్తిగా అర్థమయ్యేంత వరకు అయోమయంగానే ఉంటుంది.

ప్రస్తుతం శుభాంగి పరిస్థితి అలాగే వుంది.

తనకు తెలిసిన గతం వేరు.

గౌతమ్ ద్వారా తెలుస్తున్న గతం వేరు.

రెండింటికి పొంతన లేదు.

తనకు తెలిసిన గతం గుర్తుంది.

గౌతమ్ చెప్పే గతం ఏ మాత్రం గుర్తులేదు.

అలాగని అతను చెప్పేది అబద్ధం అనిపించడంలేదు. నిజం లాగ కూడా లేదు.

ఇట్స్ మిస్టీరియస్.

"గౌతమ్....నాదగ్గర ఒక ఆధారం వుంది" హఠాత్తుగా అంది శుభాంగి గౌతమ్‌తో.

చదువుతున్న ఫైల్ ప్రక్కనుంచి తల ఎత్తి చూశాడు గౌతమ్.

"ఏ ఆధారం? దేనికి ఆధారం?"

"అదే నేను ఐ మీన్, నా తల్లి దండ్రులు యాక్సిడెంట్‌లో చనిపోయినట్లుగా ఒక ముఖ్యమైన ఆధారం వుంది"

"ఈజిట్? ఏమిటి ఆ ఆధారం?"

"మా అమ్మా నాన్న చనిపోయినప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీ నుండి నాకు ఆరు లక్షలు రూపాయిలు వచ్చాయి"

"ఇన్సూరెన్స్ నుండా?"

"అవును....దాని తాలూకూ కొన్ని కాగితాలు ఉండాలి"

"ఎక్కడ! ఎవరిదగ్గర?"

"నా దగ్గరే"

"ఏవి?"

"పద ఆ రూమ్‌లో ఉన్నాయి" అంటూ లేచి ప్రక్కగదిలోకి కదిలిందామె.

ఆమెను అనుసరించాడు గౌతమ్.

"అలా కూర్చోండి. వెతకటానికి ఒక ఐదు నిమిషాలయినా పడుతుంది" అంటూ చైర్ చూపించింది.

కూర్చున్నాడతను.

ఎదురుగానున్న బీరువా డోరు తెరిచిందామె.

అందులోని పై రెండు అరలలో ఏవేవో పేపర్స్ ఉన్నాయి. తరువాత రెండు అరలలో బట్టలు కొన్ని మడతలు పెట్టి ఉన్నాయి.

"మా నాన్నకి, అమ్మకీ ఇద్దరికీ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు ఉన్నాయి. వాళ్ళిద్దరూ యాక్సిడెంట్‌లో చనిపోవడం వల్ల ఆ డబ్బు వాళ్ల ఏకైక సంతానమైన నాకు వచ్చింది" బీరువా లోంచి పేపర్స్ బయటికి లాగుతూ అందామె.

"ఆ డబ్బు నా చేతికి అందేవరకు సోమసుందర్ అంకుల్ చాలా హెల్ప్ చేశారు" ఆమే అంది.

"ఎవరు హెల్ప్ చేసింది?"

"సోమసుందర్ అంకుల్"

"సోమసుందర్ అంటే నిన్ను బెంగుళూరు నుండి ఇక్కడికి తీసుకువచ్చిన వ్యక్తా?"

"కాదు"

"మరి?"

"ఈయన బెంగుళూరులోనే వుండేవారు. పురాతన విగ్రహాలు అమ్మే బిజినెస్ చేసేవారు ఆయన. మా నాన్నగారితోపాటు మా ఇంటికి చాలాసార్లు వచ్చారు. నా తల్లిదండులు పోయినప్పుడు ఈ ఇన్సూరెన్స్ కంపెనీ వ్యవహారం అంతా ఆయనే చూశారు. చాలా హెల్ప్‌చేసారాయన" చెబుతోంది ఆమె.

"ఇప్పుడు ఆయన ఎక్కడున్నారు?" అడిగాడు.

"ఇంకెక్కడుంటారు? బెంగుళూరులోనే"

"థాంక్‌గాడ్. ఈ కేసులో ముందుకు ప్రొసీడ్ అవటానికి మరో ముఖ్య ఆధారం దొరికింది. ఈ సోమసుందరాన్ని కలిస్తే నిజాలు బయటపడవచ్చు" అనుకున్నాడు గౌతమ్. సోమసుందర్ ఎడ్రస్ కూడా తీసుకుని



వెంటనే అతన్ని కలవాలనుకున్నాడు.

"ఆయన ఎలా ఉంటారో గుర్తుందా!" అడిగాడు.

"గుర్తులేకేమి? ఎర్రగా పొడవుగా వుంటారు. అప్పట్లో సుమారు నలభై సంవత్సరాల వయస్సుండేది. జుట్టు, మీసాలు కూడా కొద్దిగా రాగి రంగులో వుండేవి. కాస్త కీచు గొంతుక, చాలా సరదా అయిన మనిషి. ఎప్పుడూ నవ్వుతూ జోక్స్ వేస్తూ ఉండేవారు. మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉండేది. ఆయన మాటలకు నేను నవ్వలేక చచ్చేదాన్ని" ఈ విషయం చెబుతున్నప్పుడు ఆమె పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

"ఆ కాలపు సంఘటనలు, ఆయన మాటలు గుర్తువచ్చాయి కాబోలు అందుకే తనలో తాను నవ్వుకుంటోంది" అనుకున్నాడు గౌతమ్.

"సోమ సుందర్ అంకుల్ మా ఫాదర్‌కి చాలా క్లోజ్ ఫ్రెండ్. నేనంటే చాలా అభిమానం. నా తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయాక, ఆయనే ఇన్సూరెన్స్ కంపెనీ చుట్టూ తిరిగి నాకు రావలసిన డబ్బు మొత్తం తెప్పించారు. చాలా మంచి మనసున్న వ్యక్తి. ఆయన సహకారమే లేకపోతే నా పరిస్థితి మరోలా వుండేది."

"ఐ.సీ మీ సోమసుందర్ అంకుల్‌కి మంచి సెన్సాఫ్ హ్యూమర్ వుందని చెప్పావు. ఆయన చెప్పిన జోక్స్ ఓ రెండు చెప్పు. నేను విని ఎంజాయ్ చేస్తాను"

"ఇప్పుడు గుర్తులేవు"

"ఇప్పుడే కదా నీలో నువ్వు నవ్వుకున్నావు కూడా!"

"నేను నవ్వుకుంది జోక్ గుర్తు వచ్చి కాదు. ఆనాటి సంఘటనలు గుర్తు వచ్చి"

"పోనీ....కొంచెం గుర్తు చేసుకుని ఒక జోక్ చెప్పు"

ఆమె ముఖంలో రంగులు మారాయి.

అది గమనించాడు గౌతమ్.

"కష్టం....గుర్తు రావడం లేదు"

"ఆలోచించు....ఖచ్చితంగా గుర్తు వస్తాయి"

"ఇదెక్కడి బలవంతం? గుర్తు రావడం లేదన్నాను కదా!"

"ఒక్కటీ"

రెండు నిమిషాలు ఆలోచించింది ఆమె. "ఏమీ గుర్తురావటం లేదు"

"గుర్తు రావటంలేదా!....కాదు....గుర్తు రానివ్వటం లేదు" అన్నాడు గౌతమ్.

"నువ్వనే మాట నాకు అర్థం కావడంలేదు"

"సింపుల్. సోమసుందర్ అనే వ్యక్తి లేడు. నిన్ను ఎవరో సైకలాజికల్‌గా బ్రైనప్ చేశారు. సోమసుందర్ అనే వ్యక్తి వున్నట్లు, అతను నీకు చాలా సహాయపడినట్టు నీ మనస్సుకు అనిపించేలా నీ మెదడును ఎవరో కంట్రోల్ చేసారు. అందుకే నువ్వు సోమసుందర్ అనే వ్యక్తి గురించి చెబుతున్నావు. కానీ, అతను చెప్పిన ఒక జోక్ చెప్పమన్నా నీకు గుర్తురావడంలేదు. అంటే ఆ వ్యక్తీ లేడు....నీకు జోకులూ చెప్పలేదు."

"అబద్ధం....నేను నమ్మను"

"నువ్వు నమ్మినా, నమ్మకపోయినా నేను ఊహించే నిజం ఇదే"

"నా మెదడును ఎవరో కంట్రోల్ చేయడం ఏమిటి? అసంభవం"

"అది సంభవం. నూటికి నూరుపాళ్ళు సంభవం. ఇప్పుడు నీ మెదడులో వున్న ఆలోచనలు నీవి కాదు"

గౌతమ్ మాటలు ఆమెకు ఏ మాత్రం అర్థం కావడం లేదు.

తన ఆలోచన తనదే. వేరెవరో తన ఆలోచనలను నియంత్రించడం ఏమిటి? అలా వేరే ఎవరయినా తన మెదడులో ప్రవేశించడం సాధ్యమా! కాదు....గౌతమ్ చెప్పేది అబద్ధం అనిపిస్తోంది.

ఆమె ముఖం ఎర్రగా మారిపోయింది. విసురుగా పేపర్లలో వెతక సాగింది.

ఇంక ఆ సంభాషణ సాగించడం మంచిది కాదని అర్థమయియిపోయింది గౌతమ్‌కి. కారణం....అది సంభాషణ స్థాయిని దాటి వాగ్యుద్ధంగా మారుతోంది. ఆ స్థితిలో ఆ విషయం గురించి తర్కించడం అనవసరం. అందుకే మౌనంగా వుండిపోయాడు.

o o o



"ఇదిగో....సోమసుందర్ అనే వ్యక్తి లేడు అంటున్నారు కదా! ఇవిగో ఆ ఇన్సూరెన్స్ కాయితాలు.

ఇందులో ఇవిగో ఆయన సంతకాలు. ఇది ఆయన ఎడ్రస్. చూడండి" అని ఒక డైరీలో నుండి కొన్ని కాగితాలు తీసి గౌతమ్ ముందు వుంచింది.

ఆ పేపర్లు అందుకుని మడత విప్పాడు.

అవి ఇన్సూరెన్స్ క్లెయిమ్ లాస్ట్ సెటిల్‌మెంట్ పేపర్లు....

ఆరు లక్షల రూపాయలకి క్లెయిమ్స్ సెటిల్ చేసినట్టు ఎమౌంట్ రాసి వుంది. ఆమె తల్లిదండ్రుల పేర్లు పుట్టణ్ణ, అపర్ణ అని వున్నాయి.

రుపీస్ సిక్స్ లాక్స్, పెయిడ్ టువర్డ్స్ ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ ఆఫ్ పర్సనల్ యాక్సిడెంట్ క్లెయిమ్ ఆఫ్ పుట్టణ్ణ, అపర్ణ (డెడ్ ఇన్ కార్ యాక్సిడెంట్ ఎట్ బెంగుళూర్) అని స్పష్టంగా రాసి వుంది.

ఆ డబ్బు శుభాంగికి పే చేసినట్టు....శుభాంగి ఇచ్చిన రసీదు తాలూకు కాపీ వుంది.

పుట్టణ్ణ, అపర్ణల ఏకైక సంతానం శుభాంగి అన్నది నిర్ధారించడానికి సంబంధించిన అఫిడవిట్ కూడా వుంది. శుభాంగి వాళ్ళ కూతురే అనటానికి సాక్షి సంతకంగా సోమసుందరం సంతకం వుంది.

సంతకం క్రింద షాప్ నెంబర్ 23, కమర్షియల్ స్ట్రీట్, బెంగుళూరు అని వుంది. క్రితం టెలిఫోన్ నెంబర్ కూడా వుంది. క్లెయిమ్ పే చేసిన ఇన్సూరెన్స్ కంపెనీ ఎడ్రస్ చూశాడు గౌతమ్.

న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ఎం.జి.రోడ్, బెంగుళూర్ అని వుంది.

ఈ కాగితాలు చూస్తే.......ఆమె ఖచ్చితంగా జైసింగ్ షకావత్ కూతురు కాదు....కానీ అతని అంతరాత్మ చెబుతోంది....ఆమె షకావత్ కూతురేనని.

o o o

గౌతమ్‌కి ఇదొక వింత అనుభవం.

ఇంతవరకు ప్రైవేట్ డిటెక్టివ్‌గా ఎన్నో కేసులు హేండిల్ చేశాడు.

కానీ, మొదటి నుంచి చాలా కాంప్లికేటెడ్‌గానే వస్తోంది.

సంవత్సరాల తరబడి, లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆ సేతు హిమాలయాల పర్యంత అణువణువూ గాలించారు. కానీ మౌనిక ఎక్కడ వుందో పట్టుకోలేకపోయారు.

ఆ రోజున....కేవలం మౌనిక దొరికితే బావుండునన్న ఆరాటం ఒకటే వుంది. కానీ....ఈరోజు....సమస్య అగమ్యగోచరంగా వుంది.

మౌనిక, శుభాంగి ఖచ్చితంగా ఒకరే అన్నది తను బలంగా నమ్ము తున్నాడు. ఈ ఇన్సూరెన్స్ పాలసీ చూస్తే ఈమె ఆమె ఖచ్చితంగా వేరు అనిపిస్తోంది.

దీనికి సంబంధించిన నిజం తెలియాలి.

అంటే బెంగుళూరు ఇన్సూరెన్స్ కంపెనీకి ఫోన్ చేస్తే....అసలు నిజం తెలుస్తుంది.

నిజంగా ఈ మనుషుల పేర్ల మీద అక్కడ పర్సనల్ యాక్సి డెంట్ పాలసీలు ఇచ్చారా లేదా!

ఆ తరువాత క్లెయిమ్ వచ్చిందా లేదా!....డబ్బు పే చేసారా లేదా-మొదలయిన వివరాలు అన్నీ తెలుస్తాయి!

ఆ రసీదులు అన్న సృష్టించబడినవి అని అనుమానం గౌతమ్‌కి.

అదే మాట ఆమెతో అన్నాడు.

క్షణకాలం గౌతమ్‌ని తేరిపార చూసింది ఆమె.

"నిజం....ఇవి ఎవరో సృష్టించిన రసీదులు అని నా అనుమానం"

"నీ అనుమానం సిల్లీగా వుందని నా ఉద్దేశ్యం" ముఖం మీద కొట్టి నట్లు సమాధానం ఇచ్చింది ఆమె.

"నా అనుమానానికి లాజిక్ వుంది"

"చెప్పు....ఆ లాజిక్ ఏమిటో?"

"ఈ ఇన్స్యూరెన్స్ పేపర్లు నీతో ఎందుకు దాచుకున్నావు?" ఆమె ముఖంలోని ఫీలింగ్స్ చదివే ప్రయత్నం చేస్తూ అన్నాడు.



"ఎందుకేముంది? ఊరికినే"

"అదే....ఈ ఒక్కటే ఎందుకు దాచావు అని?"

"ఈ ఒక్కటే....అంటే?"

"అంటే, మీ తల్లిదండ్రుల ఫోటోలు కానీ, వాళ్ళతో నువ్వు గడిపి నప్పటి ఫోటోలు కానీ, వాళ్ళకు నువ్వు రాసిన ఉత్తరాలు కానీ, నీకు వాళ్ళు రాసినవి కానీ....వాళ్ళకు సంబంధించిన ఏ గుర్తూ నీ దగ్గర లేదు. కేవలం ఇదొక్కటే ఎందుకు వుంది?"

"...."

"ఎవరయినా కూడా తన తల్లిదండ్రుల గుర్తు ఏదో ఒకటి వుండా లనుకుంటారు. నువ్వు మాత్రం అటువంటిది ఏమీ లేకుండా వున్నావు. మీ అమ్మ నాన్నల రూపురేఖలు ఎలా వుంటాయో కూడా తెలియని స్థితిలో వున్నావు. వాళ్ళ జ్ఞాపకాలకు సంబంధించి ఏ ఒక్క వస్తువు నీ దగ్గిర వుంచ కుండా ఇది ఎందుకు వుంచినట్టు?"

"..."

"నీ దగ్గర సమాధానం లేదు. ఈ ఇన్సూరెన్స్ కాయితాలు కూడా నీకుగా నువ్వు దాచలేదు. నీకు దాచే ఉద్దేశ్యం కూడా లేదు. కానీ నీ మెద డుని ఆ రకంగా ప్రిపేర్‌చేశారు ఎవరో."

నీ తల్లిదండ్రులు కారు ప్రమాదంలో మరణించారన్నది ఖచ్చి తంగా నిర్ధారణ చేయటం కోసం....నీ గతం గురించిన సందేహాలు ఎవ రయినా లేవనెత్తితే వాళ్ళ నోరు నొక్కడానికి తయారు చేయబడినవి ఇవి. అందుకే నీకు తెలియకుండానే వాటిని చాలా జాగ్రత్తగా దాచి వుంచావు."

"నేనింకా నమ్మలేకపోతున్నాను. నాకు ఈ విషయం నిర్ధారణ కావాలి"

"ఆల్‌రైట్....మనం ఇప్పుడే బెంగుళూరు ఫోన్ చేసి ఈ క్లెయిమ్ తాలూకు వివరాలు అడుగుదాం. ఇవి వాళ్ళ దగ్గర వుంటే ఇవి నిజమైన డాక్యుమెంట్లుగానే భావించుదాం. లేకుంటే మాత్రం ఇవి ఖచ్చితంగా నకిలీ పత్రాలే."

"సరే....ఫోన్ చెయ్యి....ఇప్పుడే తెలుసుకుందాం!" ఆమెకు ఈ ఉత్కంఠ భరించరానిదిగా వుంది.

ఛైర్‌లో నుంచి లేచి ఫోన్‌ని సమీపించాడు.

"ఆ క్లెయిమ్ పేపర్స్‌లో ఇన్సూరెన్స్ ఆఫీస్ ఎడ్రస్ క్రింద టెలిఫోన్ నెంబర్స్ వున్నాయి. ఆ పేపర్స్ ఇలా ఇవ్వు" అన్నాడు రిసీవర్ అందుకుంటూ.

మౌనంగా ఆ పేపర్స్ అతని చేతికి అందించింది ఆమె.

నెంబర్ డయల్ చేయబోతూ ఆగి ఆమె వైపు చూసి "బెంగుళూరు ఎస్.టి.డి. కోడ్ నెంబర్ ఎంత?" అన్నాడు.

"తెలియదు. ఒక్క నిమిషం" అని టెలిఫోన్ డైరెక్టరీ తీసుకుని అందులో పేజీలు తిరిగేసింది.

"...." నెంబర్ చెప్పిందామె.

డయల్ చేయసాగాడు.

లైన్ ఎంగేజ్. మళ్ళీ డయల్ చేసాడు.

అతను నెంబర్ ట్రై చేస్తోంటే ఆమెలో టెన్షన్ పెరగసాగింది. అటు స్పీకింగ్....చెప్పండి మీకు ఏం కావాలో" చాలా మర్యాదగా వుంది అతని మాట తీరు.

గౌతమ్ చెప్పిన మాట కూడా కొంతవరకు నిజమే అనిపిస్తోంది. తన దగ్గర మిగతా ఏ గుర్తులూ మిగలక, కేవలం ఇన్సూరెన్స్ కాయితాలే వుండడం ఏమిటి?

"హలో" గౌతమ్ గొంతు విని అతనివైపు దృష్టి సారించింది.

దాదాపు నాలుగు నిమిషాలు ట్రై చేశాక దొరికిందా నెంబర్.

అప్పుడు సమయం సుమారు పదీ పది అయ్యింది.

గవర్నమెంట్ ఆఫీసులలో స్టాఫ్ వచ్చి సీట్లో సెటిల్ అయ్యేసరికి కనీసం పదిన్నర అవుతుంది.

చాలా ఎర్లీగా ఫోన్ చేయడం లేదు కదా అన్న సందేహం వచ్చింది.



"నమస్కార్" స్వీట్‌గా వినిపించింది టెలిఫోన్ ఆపరేటర్ గొంతు.

మహా అయితే ఆమె వయస్సు పాతిక లోపే వుంటాయి అనిపించింది గౌతమ్‌కి ఆ గొంతు విని.

"మే ఐ హెల్ప్ యు?" మళ్ళీ వినిపించింది ఆ కంఠం.

"ఈజిట్ న్యూ ఇండియా ఎస్యూరెన్స్" అడిగాడు.

లిప్తకాలం నిశ్శబ్దం తరువాత వినిపించింది "యస్ ప్లీజ్" అని. వారి సంభాషణ ఇంగ్లీషులోనే కొనసాగుతోంది.

"ఏం కావాలి సర్"

"నేను మీ క్లయింట్‌ని. నా పేరు గౌతమ్."

"చెప్పండి సార్ .... మేము మీ కొరకు ఏం చేయగలుగుతాము?"

"మీ క్లెయిమ్స్ డిపార్ట్‌మెంట్‌కి కనెక్ట్ చేస్తారా!"

"క్లెయిమ్స్ డిపార్ట్‌మెంట్‌లో మీకు ఎవరు కావాలి?"

ఆ ప్రశ్నకు తడబడ్డాడు గౌతమ్.

ఎవరు కావాలని చెప్పాలి.... తనకెవరూ తెలియదు.

"ఎవరయినా ఫరవాలేదు.... కొంచెం ఇన్ఫర్‌మేషన్ కావాలి"

"మీరు ఎక్కడినుంచి మాట్లాడుతున్నారు?"

"హైదరాబాద్ నుండి ఎస్.టి.డి. మాట్లాడుతున్నాను"

"అరె.... లోకల్ కాల్ అనుకున్నాను. వెంటనే క్లెయిమ్స్ డిపార్ట్‌మెంట్‌కి కనెక్ట్ చేస్తానుండండి"

మెల్లగా మ్యూజిక్ వినిపించింది. అంటే లైన్ కనెక్ట్ చేస్తోందన్న మాట.

ఐదు సెకన్ల తరువాత.... మ్యూజిక్ ఆగింది.

"హలో" మెటాలిక్ వాయిస్ పలికింది.

"నా పేరు గౌతమ్. నేను హైదరాబాద్ నుండి మాట్లాడుతున్నాను. నాకు చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి"

"అయామ్ వరుణ్‌రాజ్ అసిస్టెంట్ ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ క్లెయిమ్స్ స్పీకింగ్... చెప్పండి మీకు ఏం కావాలో" చాలా మర్యాదగా వుంది అతని మాట తీరు,

"1984లో మీరు రెండు పర్సనల్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ పే చేశారు. వాటి గురించిన వివరాలు కొన్ని కావాలి"

"1984లో ఇచ్చిన క్లెయిమా?"

"అవును"

"బట్.... చాలాకాలం.... అంటే మోర్ దేన్ టెన్ ఇయర్స్"

"అవును"

"మీరెవరు?"

తడబడ్డాడు ఆ ప్రశ్నకు గౌతమ్.

"అర్ యు ఫ్రం పోలీస్ డిపార్ట్‌మెంట్ ?" సాధారణంగా అంత పాతకాలం క్లెయిమ్ గురించిన వివరాలు అడిగారు అంటే వాళ్ళె అయి వుంటారన్న ఉద్దేశ్యంతో అన్నాడతను,

పోలీస్ డిపార్ట్‌మెంట్ అన్నా, ప్రైవేట్ డిటెక్టివ్ అన్నా కూడా లేనిపోని సమస్యలు కొని తెచ్చుకోవటమే అవుతుంది. మరో మనిషిగా చెప్పాలి. 'మీరెవరు' అని అడిగాడు ఇప్పుడు. 'ఆ వివరాలు ఎందుకు?' అని రెండో ప్రశ్నకూడా అడుగుతాడు. దానికేం సమాధానం చెప్పాలి ? చురుకుగా ఆలోచిస్తోంది అతని మెదడు.

"హలో.... నా మాట వినిపిస్తోందా.... మిస్టర్ గౌతమ్ ?" అటు నుండి వినిపించింది గొంతు.

"ఆ.... ఆ.... వినపడుతోంది. ముందుగా మాకు కావలసిన విషయం చెబుతాను. 1984లో పుట్టణ్ణ, అపర్ణ అనే దంపతులు కారు యాక్సిడెంట్‌లో చనిపోయారు.వాళ్ళిద్దరికీ యాక్సిడెంట్ పాలసీలు మీ దగ్గర ఆరు లక్షలకి వున్నాయి. వాళ్ళు చనిపోయినప్పుడు ఆ డబ్బు వాళ్ళ కూతురు శుభాంగికి ఇచ్చారు మీ డిపార్ట్‌మెంట్ వాళ్ళు. ఆ తరువాత ఆమె హైదరాబాద్ వచ్చి సెటిలయింది. ఆ ఎమౌంట్ మీ దగ్గర నుంచి తీసుకున్నట్లుగా మా దగ్గర కాగితాలు, పత్రాలు ఏమీలేవు. ఇక్కడ ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌తో ఆమెకు సమస్య వస్తోంది. ఆ డబ్బు ఎక్కడిది అన్నప్రశ్నకు ఖచ్చితంగా సమాధానం ఇవ్వటం కష్టంగా వుంది" చాలా తెలివిగా,అవతలి వ్యక్తి ఏ మాత్రం ఊహించలేని పద్ధతిగా అబద్ధం చెప్పేసాడు,



"బట్.... ఈ సమస్య మీకు ఇప్పుడొచ్చిందా?"

"లేదు.... ఈ పదేళ్ళ నుంచి వుంది"

"మరి ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారు?"

"ఇన్నాళ్ళు సర్దిచెబుతూ వచ్చాము. ఇప్పుడున్న ఆఫీసర్ చాలా మనిషి. అతను మాకు వారం రోజులు గడువిచ్చాడు. ఈలోపు మీ ఆరులక్షలు తీసుకున్నట్లుగా కాగితాలు ప్రొడ్యూస్ చెయ్యమన్నాడు"

"ఐ.సి.... కానీ"

"కానీ"

"అయామ్ సారీ సర్.... మీకు ఆ వివరాలు దొరకకపోవచ్చు"

"ఏం"

"సాధారణంగా మా దగ్గర డాక్యుమెంట్స్ ఏడు సంవత్సరాలవరకు వుంచుతాము"

గతుక్కుమన్నాడు గౌతమ్.

"మరి.... మరి.... ఏడు సంవత్సరాలు దాటితే?"

"వాటిని చింపి వెయ్యటమో.... తగులబెట్టటమో జరుగుతుంది"

"మైగాడ్....ఇప్పుడెలా! ఇది జరిగి పదేళ్ళు కదా అయ్యింది!డాక్యుమెంట్ వుండే ఛాన్స్ లేదా?"

"చెప్పలేము.... మీ అదృష్టం ఎలా వుందో"

"మీరు క్లెయిమ్స్ ఇన్‌ఛార్జ్ అన్నారు కదా! ఆ సంవత్సరం డాక్యుమెంట్స్ వున్నాయో డిస్ట్రాయ్ చేశారో చెప్పుతారా?"

"అయామ్ సారీ. నేను ఈ కంపెనీలో జాయిన్ అయి మూడేళ్ళ అయింది. నాకన్నా సీనియర్ మరొకరు వున్నారు. ఆయన ఇంకా రాలేదు. ఆయన రాగానే అడిగి మీకు ఇన్ఫర్మేషన్ చెప్పగలుగుతాను"

"అయితే మళ్ళీ ఫోన్ చెయ్యమంటారా!"

"ఓ.కే.... ఓ రెండు గంటల తరువాత చెయ్యండి.మీ దగ్గరపాలసీ నంబర్ చెప్పండి. నోట్ చేసుకుంటాను"

తన ఎదురుగా వున్న డాక్యుమెంట్‌లోని పాలసీనెంబర్ చెప్పబోయి నాలిక కరుచుకున్నాడు గౌతమ్!

కారణం ...తమ పాలసీ నెంబరు, యాక్సిడెంట్ డేట్ మొదలయిన వివరాలు అన్నీ చెబితే....'' ఈ వివరాలు అన్నీ మీ దగ్గర వున్నప్పుడు ఆ డాక్యుమెంట్స్ కూడా మీ దగ్గర వుండే వుంటాయి. అవి ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కి చూపించవచ్చు కదా! మమ్మల్ని ఎందుకు అడుగుతున్నారన్న'' ఎదురుప్రశ్న వస్తుంది.

అందువల్ల చెప్పలేదు.

''సారీ సర్. ఆ వివరాలు ఏవీ లేవు''

''అలా అయితే చాలా కష్టం''

''ప్లీజ్ సర్.... దయచేసి ఈ సహాయం చేయండి. అవసరం అయితే నేను పర్సనల్‌గా వస్తాను''

''ఆల్‌రైట్.... మీరు ఒక రెండు మూడు గంటల తరువాత ఫోన్ చెయ్యండి. అప్పుడయితే నేను మీకు కొంత ఇన్ఫర్మేషన్ ఇవ్వగలుగుతాను''

''థాంక్యూ సౌమచ్. మళ్ళీ ఫోన్ చేస్తాను'' చెప్పాడు గౌతమ్.

లైన్ డిస్కనెక్ట్ అయింది.

ఫోన్ క్రెడిల్ మీదకి జారవిడిచి ఛైర్‌లో వెనక్కి వాలాడు గౌతమ్.

''అయితే మళ్ళీ ఎప్పుడు ఫోన్ చెయ్యాలి?'' అడిగింది శుభాంగి.

''మధ్యాహ్నం రెండు తరువాత చేద్దాం. అప్పటికి కొన్ని వివరాలు దొరకొచ్చు''

''నువ్వు అనవసరంగా ఈ వివరాలు అన్నీ సేకరించాలని ప్రయత్నించుతున్నానేమో....మౌనిక నన్ను పోలిన మనిషి అయి వుంటుంది''

''అన్నట్టు మీ సోమసుందర్ అంకుల్ ఫోన్ నెంబరు వుంది కదా!'' హఠాత్తుగా గుర్తు రావటంతో ఛైర్‌లో తిన్నగా కూర్చుంటూ అన్నాడు గౌతమ్.

''ఆ....ఉంది....ఏం? మాట్లాడి మా అమ్మానాన్న-పుట్టణ, అపర్ణలు అవునో కాదో కన్‌ఫర్మ్ చేసుకుంటావా?''



''నాకున్న అనుమానం ఏదయినా కూడా నివృత్తి కానిదే వదలను....ఆ నెంబర్ కూడా యివ్వు'' అన్నాడు ఫోన్ అందుకుంటూ.

సోమసుందర్ అడ్రస్ వున్న కాయితాలు అతని ముందుంచి శుభాంగి నంబరు డయిల్ చేయసాగాడు గౌతమ్.

నిమిషం తరువాత లైన్ కనెక్ట్ అయింది.

అవతల వైపు ఫోన్ లిఫ్ట్ చేశారు ఎవరో.

''హలో'' వినిపించింది అవతలి వైపున ఒక స్త్రీ కంఠం.

''ఈజిట్ 247647'' అడిగాడు తను డయిల్ చేసిన నెంబర్ అవునా కాదా అని ప్రశ్నించాడు గౌతమ్.

''అవును'' సమాధానం వినిపించింది.

''సోమసుందర్ గారున్నారా;''

''సోమసుందర్?....ఎవరతను?''

''మీ షాప్ ఓనర్''

మా షాపు ఓనర్ని నేనే....మీ కసలు ఏ నంబర్ కావాలి?'' ఎదురు ప్రశ్నించింది ఆమె.

''247647'' చెప్పాడు గౌతమ్.

''అవును ఇది ఆ నెంబరే''

''మరి సోమసుందర్!''

''ఆ పేరుతో ఈ షాపులో ఎవరూ లేరు''

క్షణకాలం పాటు ఆశ్చర్యపోయాడు గౌతమ్.

తేరుకుని ''మేడమ్....నేను హైదరాబాద్ నుండి మాట్లాడుతున్నాను. దయచేసి చిన్న ఇన్ఫర్మేషన్ ఇవ్వగలరా!'' అడిగాడు.

''చెప్పండి ఏం కావాలి?''

''పురాతన విగ్రహాలు అమ్మేషాపు నెంబర్ 23, కమర్షియల్ స్ట్రీట్. ఆ షాపు ఓనరు పేరు సోమసుందర్. దయచేసి అయన ఫోన్ నెంబరు చెప్పగలరా! మా దగ్గర వున్న ఈ నెంబరు తప్పు అయి వుండవచ్చు''

"ఇదే నెంబర్ 23, కమర్షియల్ స్ట్రీట్, ఏంటిక్స్ అమ్మే షాపు" సమాధానం చెప్పిందామె ఓపికగా.

ఒకవేళ అతని పేరు సోమసుందర్ కాదేమోనన్న సందేహం వచ్చింది గౌతమ్‌కి. రిసీవర్ మీద చెయ్యి అడ్డు వుంచి "ఆయన పేరు సోమసుందరేనా! లేక ఇంకేదయినా వేరే పేరు వుందా" శుభాంగిని ఉద్దేశించి అన్నాడు.

"లేదు....సోమసుందర్....పేరు కరెక్టే" చెప్పింది శుభాంగి.

తిరిగి ఫోన్‌లో మాట్లాడనారంభించాడు గౌతమ్.

"మేడమ్ పోనీ....కమర్షియల్ స్ట్రీట్‌లో ఏంటిక్స్ అమ్మేషాపు మరేదయినా వుందా!"

"ఖచ్చితంగా లేదు. ఈ చుట్టు ప్రక్కల ప్రాంతానికి ఇదొక్కటే పురాతన విగ్రహాలు అమ్మే షాపు"

"ఇప్పుడు కాదు సుమారు పదేళ్ళ క్రిందట వుండేదా!" ఈ మధ్య కాలంలో సోమసుందరం ఈ బిజినెస్ మానేసి మరో వ్యాపారం మొదలు పెట్టి వుండవచ్చున్న అనుమానంతో అన్నాడు.

"ఛాన్సేలేదు. గత ఇరవై రెండు ఏళ్ళుగా ఈ షాపు మాదే. ఇక్కడున్న ప్రతి దుకాణం మాకు తెలుసు. ఇక్కడే కాదు, మొత్తం బెంగుళూరు మీద యిలా పురాతన విగ్రహాలు అమ్మే వాళ్ళు మహా అయితే పది మంది వుంటారు. వాళ్ళలో మీరు చెప్పిన పేరున్న వ్యక్తి ఎవరూ లేరు. మీ దగ్గర వున్నది తప్పుడు ఎడ్రస్" ఇంకా చాలా సహనంగా, ఓపికగా జవాబు చెబుతోంది ఆమె.

"థ్యాంక్యూ సోమచ్........మిమ్మల్ని ప్రశ్నలతో విసిగించాను. క్షమించండి!" అని ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు గౌతమ్.

తెల్లబోయింది శుభాంగి.

తల తిరిగిపోయింది గౌతమ్‌కి.

"ఇంతకు ముందు ఎప్పుడయినా ఈ సోమసుందర్‌తో ఈ ఫోన్ నెంబర్‌లో మాట్లాడావా!" అడిగాడు.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది ఆమె.



"పోనీ ఆ వ్యక్తిని చూశావా! మాట్లాడావా!"

"చూసినట్లే అనిపిస్తోంది"

ఆమె సమాధానంలో వచ్చిన మార్పుని గమనించాడు గౌతమ్.

ఇంతకు ముందు సోమసుందర్ గురించి అడిగినప్పుడు బాగా తెలుసు. చాలా జోవియల్‌గా మాట్లాడతారు....అదీ. ఇదీ—అని చెప్పింది. యిప్పుడు "ఆయనని చూసినట్లే గుర్తు...." అనే స్థితికి వచ్చింది.

సూటిగా శుభాంగి కళ్ళలోకి చూశాడు గౌతమ్.

ఆమె కళ్ళు దించుకుంది.

"ఇప్పుడయినా నమ్మకం కుదిరిందా! నిన్ను ఎవరో మానసికంగా కంట్రోల్ చేస్తున్నారని చెబితే నమ్మలేదు. ఇప్పుడు అనిపిస్తోందా!...ఈ సోమసుందర్ అనే వ్యక్తి కల్పిత వ్యక్తి అని....వాస్తవంగా లేడని నమ్ముతావా!"

మాట్లాడలేదు ఆమె.

మతిపోతోంది ఆమెకు.

తనకు తెలియకుండా తన మనస్సును మరో వ్యక్తి కంట్రోల్ చేస్తున్నారన్న గౌతమ్ మాటల్లో నిజం ఎంతవరకు వుంది?

ఏమో!....

ఆమెకు ఏమీ అర్థం కావడం లేదు.

"ఇప్పుడు టైము ఇంకా పదకొండున్నరే అయింది. మనం మళ్ళీ బెంగుళూరు ఫోన్ చెయ్యాలంటే యింకా రెండున్నర గంటల టైముంది. అంతవరకు ఏం చేద్దాం" స్వగతం పైకి అన్నట్లుగా అన్నాడు గౌతమ్.

మాట్లాడలేదు ఆమె.

"అన్నట్లు ఒక విషయం మరిచాను" అంటూ ప్రక్కనున్న బ్యాగ్ తెరిచి అందులో నుండి ఒక కవర్ బయటికి లాగాడు.

"ఏమిటిది?" అడిగిందామె.

కవర్‌లో నుంచి ఒక బ్లాక్ అండ్ వైట్ ప్రింట్ బయటికి లాగాడు గౌతమ్.

"ఇది మౌనిక కుడిచేతి బొటన వేలి ముద్ర. ఈ ఫింగర్ ప్రింట్‌ని, ఆమె రూమ్‌లోని కాల్‌క్యులేటర్ నుండి సంపాదించాం"

"ఇదెందుకు?"

"నీ వేలి ముద్రతో మ్యాచ్ చేసి చూద్దామని"

"మ్యాచ్ అవదు"

"చూద్దాం" అంటూ బ్యాగ్‌లోంచి ఒక స్టాంప్ ప్యాడ్, వైట్ బ్లాటింగ్ పేపర్ బయటికి తీసాడు.

"నీ కుడి చేయి ఇలా ఇవ్వు"

"అనవసరం గౌతమ్... ఈ రెండూ ఒకలా వుండవు" నమ్మకంగా అంది ఆమె.

"లెట్ మి సీ" అంటూ చొరవగా ఆమె చేయి అందుకుని బొటన వేలుని స్టాంప్ ప్యాడ్ మీద నొక్కి- దానిని పేపర్ మీద వుంచి ప్రెస్ చేశాడు.

ఆమె వేలిముద్ర పేపర్ మీద పడింది.

వేలికి అంటుకొని వున్న మిగతా ఇంక్‌ని మరో పేపర్‌కి తుడిచి, ఆ కాగితాన్ని డస్ట్‌బిన్‌లో వేసింది ఆమె.

కొద్ది క్షణాల తరువాత పేపర్ మీద వేలిముద్ర పూర్తిగా ఆరిపోయింది.

బ్యాగ్‌లోంచి మాగ్నిఫయింగ్ లెన్స్ బయటికి తీశాడు గౌతమ్.

"ఈ భూతద్దంతో వేలి ముద్ర పరిశీలిస్తే రెండూ ఒకేలా ఉన్నాయో లేవో తెలుస్తుందా!"

మాట్లాడలేదు గౌతమ్.

మౌనిక వేలిముద్ర వున్న ఫోటోను, శుభాంగి వేలిముద్ర వున్న కాయితాన్ని టీపాయ్ మీద ప్రక్క-ప్రక్కన వుంచి భూతద్దంతో పరిశీలించసాగాడు.

కన్నార్పకుండా గౌతమ్ ముఖంలోకి చూడసాగిందామె.

తల ఎత్తి ఆమె వైపు చూసి "ఇలారా!"అన్నాడు.

చైర్‌లో నుండి లేచి అతని ప్రక్కకు వచ్చింది.



"ఈ రెండింటినీ చూడు" అన్నాడు భూతద్దం ఆమెకిస్తూ.

"ఒకేలాగ వున్నాయా! లేవా!" ఆత్రుతగా అడిగింది.

"చూడు" అన్నాడుపొడిగా.

లెన్స్ ఫోకస్ చేసి మౌనిక వేలిముద్రని పరిశీలించింది.

రెండు నిముషాల తరువాత ఆ లెన్స్‌ని తన వేలి ముద్ర వైపుకు జరిపింది. కొద్ది క్షణాలు తీక్షణంగా చూసి అదిరిపడింది.

అదే గీతలు- అవే షేప్స్.... అవే లైన్స్ ఏ మాత్రం తేడాలేని వేలిముద్రలు. ఆ రెండూ ఒకేలా వున్న వేలిముద్రలు ఆ రెండూ........ అంటే.... అప్రయత్నంగా కుడిచేతి బొటనవేలిని చూసుకుంది శుభాంగి.

♦ ♦ ♦

"హలో.... ఏమిటి ఏదో విషయాన్ని భూతద్దంలోంచి చూస్తున్నారు?" అంటూ వచ్చింది సుప్రియ అక్కడికి.

తెల్లగా పాలిపోయినట్లున్న శుభాంగి ముఖంలోకి చూస్తూ "శుభా.... వాట్ హేపెండ్, ఎందుకలా వున్నావు ?" అంది ఆమె ప్రక్కనే కూర్చుంటూ.

"ఇదేమిటి ? ఈ ఫింగర్ ప్రింట్స్ ఏమిటి ?" తిరిగి ఆమే అడిగింది.

"అలా నాన్‌స్టాప్‌గా ప్రశ్నలవర్షం కురిపిస్తే ఎట్లా? అవతలి వ్యక్తులకు ఊపిరి పీల్చుకునే టైం వుండాలి కదా!" అన్నాడు గౌతమ్.

ఒకసారి ఇద్దరి ముఖాలు మార్చి మార్చి చూసింది.

"పెళ్ళి చేసుకునే ముందు జాతకాలు కలిసాయో లేదా అనిచూస్తారు అలా మీరిద్దరూ వేలిముద్రలు కలిసాయా లేదా అని చూసుకుంటున్నారా?" అక్కడున్న రెండు వేలిముద్రలు ఒకటి గౌతమ్‌ది, ఒకటి శుభాంగిదిఅన్న ధోరణిలో జోక్ చేసింది ఆమె.

వాళ్ళిద్దరి ముఖాలలోనూ ఎటువంటి రెస్పాన్స్ కాని, నవ్వు కాని లేదు.

విషయం ఏదో సీరియస్‌గా వుందని అర్థం అయింది ఆమెకి.

వాళ్ళిద్దరూ ప్రేమికులని సుప్రియ అభిప్రాయం.

గౌతమ్ అంటే శుభాంగికి ఇష్టం అన్న విషయం సుప్రియకు స్పష్టంగా తెలుసు. కానీ గౌతమ్ మాత్రం ఆ విషయంలో బుకాయిస్తున్నాడు.

o o o

ప్రేమ–గీమ అంతా ట్రాష్ అంటాడు. శుభాంగి అంటే ప్రేమ లేనట్లు మాట్లాడతాడు. కానీ శుభాంగి వెంటపడుతూనే వుంటాడు.

గౌతమ్ పెద్ద హిపోక్రాట్ అని ఆమె అభిప్రాయం.

"అరె ఏమయింది మీ ఇద్దరికీ, మాటాపలుకు లేకుండా బెల్లంకొట్టిన రాయిలా అలా కూర్చున్నారేమిటి? ఏం జరిగింది?" ఆమె గొంతులో ఆందోళన ధ్వనించింది.

జరిగిన విషయాన్ని క్లుప్తంగా చెప్పాడు గౌతమ్.

ఎదురు ప్రశ్నలు వేయకుండా మౌనంగా విషయం అంతా వింది ఆమె.

"ఇప్పుడు ఫింగర్ ప్రింట్స్‌కూడా ఖచ్చితంగా టాలీ అయ్యాయి" చెప్పాడు గౌతమ్.

భూతద్దంలో పది నిమిషాలు ఆ రెండు ఫింగర్ ప్రింట్స్‌ని మార్చి మార్చి చూసింది ఆమె కూడా!

"నీది చాలా మిస్టీరియస్ పుట్టుకలాగ వుందే శుభా! కొంపదీసి సినిమాల్లోలాగా ద్విపాత్రాభినయం చేస్తున్నావా" అని, గౌతమ్ వైపు తిరిగి "నా అనుమానం శుభాంగి, మౌనిక కవల పిల్లలు ... చిన్నప్పుడు ఓ వర్షం కురిసిన రాత్రి దొంగలు తరుముతుంటే విడిపోయారు. ఒకరు బెంగుళూరులో పెరిగారు. మరొకరు ఢిల్లీలో పెరిగారు. అంతే అంతకంటే ఏమీ లేదు."

ఆమె వాగ్ధోరణికి ఎంత సీరియస్‌గా వుందామనుకున్నా నవ్వు ఆగలేదు ఇద్దరికి.

అంతవరకు సీరియస్‌గా వున్న ఆ వాతావరణం ఒకింత తేలిక అయింది.

"ఇంతకీ మా రఘునాథ్ ఎలా వున్నాడు?" ఆ టాపిక్ మార్చడానికి



ప్రయత్నించుతూ అన్నాడు గౌతమ్.

"ఫైన్"

"అంటే.... బెడ్‌మీద నుండి దిగుతున్నాడా!"

"నడక ప్రాక్టీస్ చేస్తున్నారు"

"ఆర్టిఫిషియల్ వించ్ ధరించి నడుస్తున్నాడా!"

"ఇంకా అంత దూరం రాలేదు. బట్ హి ఈజ్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్"

ఈ సాయంకాలం వచ్చి రఘుని చూస్తాను అని చెప్పండి"

"అలాగే" అని తల ఊపింది ఆమె.

"గౌతమ్ టైము రెండు అవుతోంది. ఫోన్ ట్రై చేద్దామా!" అడిగింది శుభాంగి.

వాచ్‌వైపు చూసుకున్నాడు.

"ఇంకొక ఐదు నిమిషాల తరువాత చేద్దాం"

ఈలోపుగా మనం తినడానికి ఏదయినా తెస్తాను. ప్రొద్దుటి నుంచి బ్రేక్‌ఫాస్ట్ కూడా తినలేదు కదా" అంటూ కిచెన్‌లోకి నడిచింది శుభాంగి.

"ఇంతకీ ఏం నిర్ణయించారు. మౌనిక, శుభాంగి ఒకటా! కాదా!" గుసగుసలాడినట్టుగా అంది.

రెండు చేతులూ ఎత్తి ఎదురుగావున్న దేవుడి ఫోటోకి నమస్కరించాడు గౌతమ్.

"ఆ ఏడుకొండలవాడే నిర్ణయించాలి. ఇదేం కేసోకాని....తల తిరిగిపోతోంది. ఒకసారి ఇద్దరూ ఒకటే అనిపిస్తుంది. ఒకసారి వేరువేరు అనిపిస్తుంది. ఇప్పటికి ఈ కేసు హేండిల్ చేయడం మొదలుపెట్టి నెల దాటుతోంది. ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. బొంబాయిలో నా ఆఫీసు ఎలా వుందో స్టాఫ్ ఎలా వున్నారో ఏమీ తెలియదు. ఇక్కడికి వచ్చినవాళ్ళం వచ్చినట్టుగానే ఈ వూళ్ళోనే సెటిల్ అయిపోయాం. ఇంకా ఏదో అన అనబోతున్న గౌతమ్, శుభాంగి రావడంతో సైలెంట్ అయ్యాడు.

ఒకప్లేట్లో సమోసాలు, చిల్లీసాస్ తీసుకువచ్చింది. ఫ్రిజ్‌లో నుండి మూడు గ్లాసుల వాటర్ కూడా తెచ్చింది.

గబగబా రెండు తినేసి గ్లాసునీళ్ళుతాగి కర్చీఫ్‌తో పెదవులకు అంటుకున్న సాస్ తుడుచుకున్నాడు గౌతమ్. "మీరు నెమ్మదిగా తినండి. నేను బెంగుళూరు ఫోన్ ట్రై చేస్తాను" అంటూ ఫోన్ అందుకుని నెంబర్ డయల్ చేయసాగాడు.

లైన్ ఎంగేజ్.

నాన్‌స్టాప్‌గా ప్రయత్నించుతూనే వున్నాడు గౌతమ్.

"మరో రెండు సమోసాలు తిని బలం తెచ్చుకోండి" జోక్ చేసింది సుప్రియ.

లైన్ కనెక్ట్ అయింది.

"హలో" ఈసారి మగగొంతు వినిపించింది అవతలి నుండి.

టెలిఫోన్ ఆపరేటర్ లేదేమోననుకున్నాడు గౌతమ్.

"ఈజిట్ న్యూ ఇండియా ఎస్యూరెన్స్" అడిగాడు సందేహిస్తూ.

"యస్ ప్లీజ్"

"విల్ యు ప్లీజ్ కనెక్ట్ మిస్టర్ వరుణ్‌రాజ్, క్లెయిమ్స్ డిపార్ట్‌మెంట్"

"జస్ట్ ఎమిని"ట్ సమాధానం వినిపించింది.

నాలుగైదు క్షణాల తరువాత లైన్‌లోకి వచ్చాడు వరుణ్‌రాజ్.

"హలో"

"నేను గౌతమ్‌ని హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నాను.

"ప్రొద్దున్న మీకోసం ఫోన్ చేశాను" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

"యస్....ఎస్. నాకు గుర్తుంది"

"నేను అడిగిన ఇన్ఫర్మేషన్ గురించి ప్రయత్నించారా!"

"ఎస్. దొరికాయి.... అది 1984. మేము ఇచ్చాము"

షాక్ కొట్టినట్లయింది గౌతమ్‌కి.

అతను ఊహించని సమాధానం అది.



"సారీ....ఈక్లెయిమ్ మేము ఇవ్వలేదు. మారికార్డ్స్‌లోఅటువంటివి పే చేసిన దాఖలాలు లేవు" అని చెబుతాడు అనుకున్నాడు కానీ అందుకు విరుద్ధంగా "మేమే ఇచ్చాను"

అంటున్నాడు.

"మీకు ఆ పాలసీ నెంబరు, క్లెయిమ్ నెంబరు వివరాలు అన్నీ ఇస్తాను....

నోట్ చేసుకోండి" అంటూ చెప్పసాగాడు.

ఆ వివరాలు నోట్ చేయవలసిన అవసరం గౌతమ్‌కి లేదు. కానీ....

ఏదో రాస్తున్నవాడిలాగ మళ్ళీ పాలసీ నెంబరు....డేట్ చెప్పండి. అంటూ అభినయించాడు.

"ఈ వివరాలు సరిపోతాయా. ఆ క్లెయిమ్ తాలూకు రసీదు కాపీలు ఏమయినా కావాలా?"

అక్కరలేదు అంటే ఏం డౌట్ వస్తుందోనని, "కావాలి సార్" అన్నాడు.

"మీకు ఇవ్వగలుగుతాము. మీరు వస్తారా? పోస్టులో పంపించమంటారా?"

"నేను రావలసిన అవసరం వుందంటే తప్పక వస్తాను. మీరు పోస్టులో పంపగలిగితే మీకు కృతజ్ఞుడ్ని"

"మీరు రావలసిన అవసరం లేదు. మీ అడ్రస్ చెప్పండి. ఐ కెన్ సెండ్ యు బై పోస్ట్"

"అయితే నోట్ చేసుకోండి. మీకు శ్రమ ఇస్తున్నాను. అయామ్ వెరీ సారీ"

"ఫరవాలేదు. చెప్పండి" అవతల నుండి చెప్పాడతను.

ఫోన్ పెట్టేశాడు గౌతమ్.

"అదేమిటి? అడ్రస్ చెబుతాను అని అలా లైన్ డిస్కనెక్ట్ చేశారేమిటి?" అర్థం కాక అడిగింది సుప్రియ.

"ఇప్పటికే ఐదు నిమిషాల పైగా ఫోన్‌లో మాట్లాడాను. ఇంకా ఎందుకు డబ్బు వేస్ట్. అందుకే కట్ చేసి పడేశాను"

"ఇంతకీ ఏమైంది? ఫోనులో జరిగిన విషయం చెప్పండి" అడిగింది సుప్రియ.

"చెప్పేందుకు ఏముంది. విషయం అర్థమయ్యే వుంటుంది"

"అంటే పుట్టణ్ణ, అపర్ణలు చనిపోయినట్టు, ఆ డబ్బు శుభాంగికి యిచ్చినట్టు మన దగ్గర వున్న డాక్యుమెంట్స్ సరి అయినవే అన్న మాట"

అవును అన్నట్లు తల వూపాడు.

"ఇప్పుడేం చెయ్యాలి?"

"ఏమో! ఏమీ అర్థం కావటం లేదు"

"ఫింగర్‌ప్రింట్స్ ఒకేలా వున్నాయి కదా!"

"కానీ....ఈ ఇన్స్యూరెన్స్ కంపెనీవాళ్ళు క్లెయిమ్ ఇచ్చాము అంటున్నారు కదా!"

"ఈ డాక్యుమెంట్స్ బోగస్‌వేమో!"

"శుభాంగి ఒప్పుకోకపోయినా ఆమె జైసింగ్ షకావత్ కూతురే అనిపిస్తోంది నాకు" అన్నాడు గౌతమ్.

"నాకూ అదే అనిపిస్తోంది" చెప్పింది సుప్రియ.

"నీకేం అనిపిస్తోంది?" తలతిప్పి శుభాంగిని అడిగింది.

"అయామ్ అటర్‌లీ కన్‌ఫ్యూజ్‌డ్" తల పట్టుకుంది శుభాంగి.

"ఫింగర్ ప్రింట్స్ కూడా కలిసాయి కాబట్టి ఈమె నిస్సందేహంగా షకావత్ కూతురే. కాబట్టి మీరు షకావత్‌కి ఇన్‌ఫార్మ్ చెయ్యండి" చెప్పింది సుప్రియ.

"ఏమని?"

"ఏముంది? మీ అమ్మాయి దొరికింది అని"

"నో....నేను ఇన్‌ఫార్మ్ చెయ్యను"

"ఏం?"

"ఇందులో చాలా కాంప్లికేషన్స్‌కి సమాధానాలే దొరకలేదు. అటు



వంటప్పుడు ఈమె షకావత్ కూతురన్న నిర్ణయానికి నేనే పూర్తిగా రాలేక పోతున్నాను"

"ఉదాహరణకి శుభాంగి షకావత్ కూతురనే అనుకుందాం....ఎవరు ఆమెను కిడ్నాప్ చేసి వుంటారు? ఎందుకు చేయించి వుంటారు?" అడిగింది సుప్రియ.

"చాలామంది మీద అనుమానం వుంచాము. అనుమానించిన ప్రతి వ్యక్తిని, ప్రతి ప్రదేశాన్ని ఇప్పటికి పదేళ్ళుగా గాలించాను. అంతా అయిపోయింది. సమస్య మాత్రం మిస్టరీగా మిగిలిపోయింది"

"అసలు నాకో కొత్త అనుమానం వస్తోందిప్పుడు" తనే అన్నాడు.

"ఏమిటి?"

"ఇంక అనుమానించడానికి ఎవరూ దొరకలేదు. అందుకే జైసింగ్ షకావతే తన కూతుర్ని కిడ్నాప్ చేయించాడేమో అనిపిస్తోంది"

"అసంభవం. దానివల్ల అతనికి ప్రయోజనం ఏమిటి? కూతుర్ని కిడ్నాప్ చేయించిన వ్యక్తికి కోట్లు ఖర్చు పెట్టి వెతికించవలసిన అవసరం ఏముంటుంది?"

"ఊరికే మాటవరసకి అన్నాను. వేళాకోళంగా అన్నాను. నిజంగా అనుకున్నారా?" నవ్వుతూ అన్నాడు గౌతమ్.

"అసలు మాటలన్నీ మనమే మాట్లాడుతున్నాం. శుభాంగి సైలెంట్‌గా కూర్చుందేమిటి?" అంది ఆమె భుజం మీద చెయ్యి వేసి కదుపుతూ.

"సారీ....నా మూడ్ బాగాలేదు. ఇప్పుడు నేనేమీ మాట్లాడలేను" ముక్తసరిగా అంది శుభాంగి.

"మీ పరమాత్మ అంకుల్ చెప్పినట్టుగా శుభాంగి మెదడును ఎవరో కంట్రోల్ చేస్తున్నారు. ఆమెకు వచ్చే కలలకు కూడా అదే కారణం" తనకు తోచిన విషయం చెప్పాడు గౌతమ్.

"ఈమె కిడ్నాప్ రహస్యానికి. ఆ కలలకి ఏమిటి సంబంధం"

"సంబంధం వుందని నా అనుమానం"

"ఎలా?"

"ఒకే కల తరచుగా రావటం....వచ్చిన ప్రతిసారీ ఇన్ని రోజులు....అన్ని రోజులు అని చెప్పటం....ఇవన్నీ ఆమె మెదడును కంట్రోల్ చేయటంలో ఒక భాగం అని నా నమ్మకం"

"అది సాధ్యమా?"

"సాధ్యమే అన్నట్టుగా మీ అంకుల్ అన్నారు కదా!"

"ఆయన దగ్గరకి శుభాంగిని ఒకసారి తీసుకువెడితే మనకు కొన్ని నిజాలు తెలుస్తాయి"

"కానీ....ఆయన దగ్గరకు రావటానికి శుభాంగి అంగీకరించడం లేదు కదా! నిజానికి మొన్న సాయంకాలమే ఆయనను కలవాల్సి వుంది మనం"

"అవును? వెళ్ళలేదు. పోనీ ఇవాళ వెళదాము!"

"ఆ విషయం నన్ను అడిగి ఉపయోగం ఏముంది? శుభాంగి రావటానికి సిద్ధపడటం లేదు కదా?"

"ఏం శుభా ! ఈరోజు వెళదామా ?" ఆమె వైపు తిరిగి అడిగింది.

మాట్లాడలేదు ఆమె.

ఒళ్ళు మండిపోయింది సుప్రియకి.

"ఇందాకటి నుండి మేము నీ సమస్య గురించే మాట్లాడుతుంటే నువ్వేమిటి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నావు? చివరికి ఇది మా సమస్య లాగ వుంది. దిసీజ్ టూ మచ్...." చాలా ఇరిటేటింగ్‌గా అనిపించింది ఆమెకు శుభాంగి ప్రవర్తన.

"అది కాదు సుప్రియా!" ఏదో అనబోయింది.

"సారీ....ఇంకేం చెప్పొద్దు....ఇప్పటికే తల తిరుగుతోంది. ఈ కేస్ గౌతమ్ కాబట్టి ఇంకా సహనంగా, ఓపికగా, పట్టుదలగా ప్రయత్నించుతున్నాడు. మరొకడు అయితే పిచ్చి పట్టి పారిపోయేవాడే"

"అది కాదు...."

"ఏది కాదు....క్షణానికో రకంగా ప్రవర్తించే నువ్వు....అంతుపట్టని సమస్యలు, పొంతన లేని సాక్ష్యాధారాలు....ఇంత గందరగోళంగా



వున్న కేసు ఏ ఒక్కడూ టేకప్ చేయడు. గౌతమ్ ఇంకా మూర్ఖంగా ఈ కేస్‌ని సాల్వ్ చెయ్యాలని ప్రయత్నించుతున్నాడు. నీ కనీస సహకారం అందించకపోతే ఎలా?"

"ఇంక ఎక్కువగా తిట్టద్దు" అని అర్థం వచ్చేలా సైగ చేశాడు సుప్రియకి గౌతమ్.

ఆమె మౌనంగా వుండిపోయింది.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

నిస్తేజంగా కూర్చుని ఆలోచిస్తున్న శుభాంగిలో కదలిక వచ్చింది.

"నేను డాక్టర్ దగ్గరకి రావటానికి రెడీ" ఒక్కొక్క అక్షరం కూడబలుక్కున్నట్టుగా అంది శుభాంగి.

గౌతమ్ వైపు చూసి చిరునవ్వు నవ్వింది సుప్రియ. "నా తిట్లు పని చేసాయి చూశారా" అన్న అర్థం వచ్చేలాగ.

ఒకింత రిలీఫ్‌గా ఫీలయ్యాడు గౌతమ్.

"అయితే ఎప్పుడు వెళదాం?" అడిగాడు గౌతమ్.

"అపాయింట్‌మెంట్ తీసుకోవా?"

"నన్ను కాదు అడగాల్సింది. మీ ఫ్రెండ్ ఎప్పుడు రెడీ అయితే నేను అప్పుడు రెడీ" చెప్పాడు గౌతమ్.

"అయితే నువ్వే చెప్పు శుభా!"

"ఎప్పు....డయినా....సరే!" జవాబిచ్చింది.

"గుడ్....అయితే ఇవ్వాళే అపాయింట్‌మెంట్ తీసుకుంటాను. ఇంటికెళ్ళాక అంకుల్‌కి ఫోన్ చేస్తాను. ఆయన రమ్మంటే ఈ రోజే వెళ్ళవచ్చు"

"ఇంటికి వెళ్ళి ఫోన్ చేయడం ఎందుకు? ఇక్కడి నుంచే చేయచ్చు కదా!" అడిగాడు గౌతమ్.

"ఇప్పుడా?" వాచ్‌లోకి చూసుకుంటూ అంది.

"ఏం?"

"ఈ టైములో ఆయన గాఢ నిద్రలో వుంటారు. మధ్యాహ్నం భోజనం చేశాక కనీసం రెండు గంటలైనా నిద్రపోవటం ఆయనకు అల

వాటు. ఆ టైములో ఎవరయినా నిద్ర డిస్టర్బ్ చేస్తే వాళ్ళ చచ్చినట్లే.... నిర్మొహమాటంగా తిడతాడు''

"అమ్మో అలా అయితే వద్దులెండి. ఈవెనింగ్‌లోపు అపాయింట్‌మెంట్ దొరికినదీ లేనిదీ కన్‌ఫర్మ్ చేయండి''

"అలాగే'' అంటూ లేచి నిలబడింది సుప్రియ.

"నేను వెళతాను మరి'' అంది.

"లంచ్ చేసి వెళ్ళచ్చుగా'' అప్పటివరకు సైలెంట్‌గా వున్న శుభాంగి అడిగింది.

"అహ... ఇంటికి వెళ్లాలి. పాపం రఘునాథ్ ఒక్కడే వుంటాడు. అతనికి ఏం అవసరం వుంటుందో ఏమో. అతను కూడా లంచ్ చేయలేదు. ఇద్దరం కలిసి అక్కడే భోజనం చేస్తాం. వస్తా'' అని బయటికి నడిచింది ఆమె.

కాలులేక, మంచం మీద పడిన రఘునాథ్‌ని పరాయిమనిషి అయినా సొంత మనిషి కంటె మిన్నగా సేవ చేస్తున్న సుప్రియ సంస్కారానికి మనస్సులోనే నమస్కరించాడు గౌతమ్.

o o o

నిశ్శబ్దంగా వుంది ఆ హాలు....

విశాలమైన ఆ హాలులో ఒక వైపు గోడకు నిలువెత్తు జీసస్ విగ్రహం వుంది.

జీవకళ ఉట్టిపడుతున్న విగ్రహం అది.

ఆ విగ్రహం పాదాల దగ్గర ఒకే ఒక కాండిల్ వెలుగుతోంది. ఆ వెలుతురు తప్ప మరే వెలుగూ అక్కడ లేదు.

అప్పటికి ఐదు నిముషాలుగా ఆ విగ్రహం ముందు మోకరిల్లి వున్నాడు విలియమ్స్.

అతను జీసస్‌కి మహాభక్తుడు.

అనుక్షణం జీసస్‌ని తలుచుకుంటూ వుంటాడు. అతను చేసే ప్రతి పనికీ జీసస్ ఆశీర్వాదం కావాలనుకుంటాడు.

విలియమ్స్‌తో ఏదో విషయం చెప్పాలని వచ్చిన నౌకరు ఆ గది



బయటనే ఆగిపోయాడు.

ఏ మాత్రం శబ్దం రాకుండా నిలబడి వున్నాడతను.

ఆ సమయంలో ఏ చిన్న శబ్దం అయినా విలియమ్స్ ఆగ్రహానికి గురికావలసి వస్తుంది.

మరో మూడు నిమిషాలు గడిచాయి.

మోకాళ్ళ మీద కూర్చున్నాడు విలియమ్స్.

ప్రేయర్ అయిపోయిందన్న విషయం అర్థమయింది ఆ నౌకరుకు.

మెడలోని సిలువని ముద్దు పెట్టుకుని క్రాస్ చేసుకున్నాడు. లేచి నిలబడి వెనుకకు తిరిగాడు.

రెండు చేతులుకట్టుకుని వినయంగా నిలబడ్డాడు నౌకరు.

ఏమిటన్నట్లు చూశాడు విలియమ్స్.

"అశోక్ వచ్చాడు'' చెప్పాడు నౌకరు.

"ఎప్పుడు?''

"పది నిముషాలయింది సార్''

"లోపలి గదిలోకి రమ్మను'' చెప్పి ప్రక్క గదిలోకి నడిచాడు విలియమ్స్.

దాదాపు సలభై సంవత్సరాల వయస్సున్న నల్లని వందకిలోల భారీ కాయం అతనిది. మూడొంతులు పైగా జుట్టు ఊడిపోయిన బట్టతల....

అతని శరీరం ఎంత గంభీరంగా వుంటుందో అతని గొంతు అంత పీలగా వుంటుంది. అతను ఫోన్‌లో మాట్లాడితే, అమ్మాయి మాట్లాడుతోందేమో అనే సందేహం కూడా కలుగుతుంది.

బయటకు వెళ్ళిపోయాడు నౌకరు.

లోపల గదిలోకి వెళ్ళాడు విలియమ్స్.

స్విచ్ ఆన్ చేశాడు. మసక చీకట్లు కమ్ముకుంటున్న ఆ గదిలోకి వెలుగులు నిండాయి.

నేల మీద ఒక మూలగా పెద్ద పరుపు పరిచి వుంది. గోడకు రెండు దిండ్లు ఆన్చి వున్నాయి.

వెళ్ళి పరుపు మీద కూర్చుని పిల్లోకి ఆనుకున్నాడు.

పఠాన్ డ్రస్ లాంటి వదులు దుస్తులు ధరించి వున్నాడు ఆ సమయంలో అతను.

అతను చాలరకాల దుస్తులు వాడతాడు. ఒకసారి పంచె కడతాడు, మరోసారి జీన్స్ వేస్తాడు, మరోసారి సఫారి సూట్, లాల్చీ పైజమా ఇలా రకరకాలు.

గదిలోకి వస్తున్నాడు అశోక్.

బూట్లు బయట విడిచినట్లున్నాడు, సాక్స్ మాత్రం కాళ్ళకివున్నాయి. అతనిని చూస్తూనే కూర్చోమన్నట్టు సైగ చేశాడు విలియమ్స్.

విలియమ్స్‌కి ఎదురుగా వున్న మరో చిన్న పరుపు మీద కూర్చున్నాడు అశోక్.

ఏమిటన్నట్లు చూశాడు విలియమ్స్.

"పొద్దున ఫోన్ వచ్చింది" చెప్పాడు అశోక్.

"ఎక్కడి నుంచి"

"గౌతమ్ దగ్గర నుంచి"

ఆ సమాధానం విని నిటారుగా అయ్యాడు విలియమ్స్.

"ఏమంటాడు?"

"శుభాంగి దగ్గర వున్న ఇన్సూరెన్స్ కంపెనీ రసీదుల్లో వున్న ఫోన్ నెంబర్ చూసి అదే ఇన్సూరెన్స్ కంపెనీ నెంబర్ అన్న ఉద్దేశ్యంతో మనకి ఫోన్ చేశాడు"

"ఎవరు మాట్లాడారు?"

"నేనే మాట్లాడాను. నా పేరు వరుణ్‌రాజ్ అని చెప్పాను. క్లయిమ్స్ ఇన్‌ఛార్జినని చెప్పాను"

"ఏమని అడిగాడు?"

"చాలా తెలివిగా మాట్లాడాడు. ఇన్‌కంటాక్స్ ప్రాబ్లెమ్స్ వున్నాయని, క్లెయిమ్ తాలూకు రసీదులు అవసరం అని అన్నాడు."

"నువ్వేం అన్నావు?"

"వెతికి చెబుతాను అన్నాను. రెండు గంటలకి మళ్ళీ ఫోన్ చేశాడు. అది ఇన్స్యూరెన్స్ కంపెనీ పే చేసిందని చెప్పాను"



"అతను నమ్మాడా?"

"ఖచ్చితంగా నమ్మే వుంటాడు"

"అతను మాట్లాడుతున్నది ఇన్స్యూరెన్స్ కంపెనీతో కాదన్న అనుమానం అతనికి వచ్చిందా?"

"లేదు....వచ్చే అవకాశం లేదు"

"ఆర్ యూ ష్యూర్"

"ఎస్....మనకి జరిగిన ఒక మంచి ఏమిటంటే అతను రసీదులో వున్న ఫోన్ నంబర్‌కే చేశాడు. అందువల్ల అది మనకే కనెక్ట్ అయింది. అలా కాకుండా అతను టెలిఫోన్ డైరెక్టరీలో వెతికి ఫోన్ చేసి వుంటే కథ అడ్డం తిరిగేదే. అదృష్టవశాత్తు అలా జరగలేదు"

"గుడ్"

"కానీ ఇప్పుడయినా అతను ఆ పని చేయడన్న నమ్మకం లేదు" తన మనస్సులోని అనుమానం వ్యక్తం చేశాడు అశోక్.

ఆలోచనలో వున్నాడు విలియమ్స్.

"మనం చాలా ఆలస్యం చేస్తున్నామేమో"

అశోక్ మాటలకు తలఎత్తి చూశాడు అతను.

"ఇప్పటికే చాలాకాలయాపన అయిపోయింది. ఇంక లేట్ చేయడం మంచిది కాదు" తన అభిప్రాయం మళ్ళీ చెప్పాడు అశోక్.

"ఏం చేద్దాం అంటావు?"

"అది నువ్వు చెప్పాలి" చెప్పాడు అశోక్.

మరికొద్ది నిమిషాలు దీర్ఘాలోచనలో పడ్డాడు విలియమ్స్.

"ఆల్‌రైట్....నీ కొక పని చెబుతాను. అలాచెయ్యి" అన్నాడు.

ఏమిటన్నట్లు చూశాడు అశోక్.

"ఇలారా చెబుతాను" అన్నాడు విలియమ్స్.

అతను చెప్పే విషయం వినటానికి దగ్గరకి జరిగాడు అశోక్.

29)

శుభాంగి సమస్యకు ఏదో మంచి పరిష్కారం చెప్పబోతున్నాడు విలియమ్స్ అనుకున్నాడు అశోక్.

"చూడు అశోక్....శుభాంగి సమస్యలో పరిష్కారం ఏమిటన్నది నా చేతులలోనే వుంది. నువ్వు ఏమీ వర్రీ అవ్వకు. నిశ్చింతగా ఉండు" అని మరోమాటకి అవకాశం లేకుండా లేచి నిలబడ్డాడు విలియమ్స్.

తెల్ల ముఖం వేసాడు అశోక్.

ఈ సమాధానం అతను ఊహించలేదు.

ఏదో గొప్ప సలహా ఇస్తాడు అనుకున్న సమయంలో ఇలాంటి చచ్చు సమాధానం చెప్పటంతో కడుపు రగిలిపోయింది.

ఈ సమాధానం చెప్పడం తనను ఖచ్చితంగా అవమానపరచడమే.

"అది కాదు...." అంటూ ఏదో అనబోయాడు అశోక్.

మారోమాటకి తావు ఇవ్వకుండా తిన్నగా లోపలిగదిలోకి నడిచాడు విలియమ్స్.

అప్పుడు సమయం సాయంకాలం ఖచ్చితంగా ఆరున్నర అయింది.

ఆ సమయంలో ఎక్సర్‌సైజ్ చేయటం అతని అలవాటు. అతనికి సొంత జిమ్ ఇంట్లోనే వుంది.

జిమ్‌లోకి అతను అడుగు పెట్టగానే అక్కడున్న నౌకరు ఆ గది లోని లైట్స్ స్విచ్‌లు ఆన్ చేశాడు.

ఒక్కసారిగా దేదీప్యమానమైన వెలుగులు పరచుకున్నాయి. గది నిండా.

దానిని గది అనే బదులు పెద్ద హాల్‌అనటం సబబేమో అని పిస్తుంది.

ఆ హాలుని తనకు నచ్చిన పద్ధతిలో అందంగా తయారు చేసు కున్నాడు.

క్రింద ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, గది మధ్యలో చిన్న రివాల్వరింగ్ రౌండ్ టేబుల్, దాని మీద విస్కీ, స్కాచ్, రమ్ బాటిల్స్.

వాటి ప్రక్కనే చిన్న స్టాండు మీద పోర్టబుల్ కలర్ టి.వి.

చిన్న స్టీరియో సిస్టం.



తన జిమ్‌లో అధునాతనమైన ఎక్సర్‌సైజ్ ఎక్విప్‌మెంట్ ఉంచాడు అతను.

కనీసం ఏడెనిమిది వరకు "నాటిలస్" మెషిన్స్ ఉన్నాయి.

శరీరం మీద వస్త్రాలను తీసి పక్కన ఉంచాడు.

కండలు తిరిగిన నల్లని భారీ కాయం అతనిది.

చిన్న షార్ట్స్ మాత్రం ధరించి ఉన్నాడు అతను.

సుమారు నాలుగు అంగుళాల వెడల్పున్న నల్లని ఎలాస్టిక్ బెల్ట్ ఒకదానిని నడుం చుట్టూ బిగించాడు.

దీని వల్ల పొట్ట, నడుము చుట్టూ ఉన్న కండరాలు స్టిఫ్‌గా అయ్యాయి.

రెండు చేతులకు రిస్ట్‌బ్యాండ్స్ పెట్టుకున్నాడు. తల చుట్టూ మరో హెడ్ బ్యాండ్ బిగించాడు. నిజానికి అతనికి కళ్ళలోపడేటంత పొడవైన జుట్టు లేదు. అతనిది ఉంగరాల జుట్టు.

అతనా హెడ్ బ్యాండ్ ధరించడంవల్ల పెద్దగా ఉపయోగం లేదు. అయినా ధరిస్తాడు.

నిముషాలు గడుస్తున్నాయి.

అతనినే రెప్పవాల్చకుండా చూస్తున్నాడు అశోక్.

అతనికి తెలుసు-విలియమ్స్ ఎక్సర్‌సైజులు మొదలు పెట్టాడంటే ఎవరివైపూ చూడడు....మాట్లాడడు. కనీసం అరగంట అయినా వెయిట్ చెయ్యాల్సిందే.

అతనిలో వున్న ఆ రకమైన డిసిప్లిన్‌ని చాలా ఇష్టపడతాడు అశోక్.

"సార్....టైము ఏడయింది" చెప్పాడు నౌకరు. అతని బాధ్యత అది. సరిగ్గా ఏడు అవగానే చెబుతాడు.

అంత వరకు విలియమ్స్ దృష్టి టైమ్ మీదే లేదు.

అతని ఏకాగ్రత అటువంటిది. ఎక్సర్‌సైజు చేయటం ఆపి ప్రక్కనున్న తివాసీమీద వెల్లకిలా పడుకొని బలంగా ఊపిరి తీసుకోసాగాడతను.

తాను చేసే ఈ ఎక్సర్‌సైజుని చాలా ఎంజాయ్ చేస్తాడు అతను.

ఇదే కాదు- ఏపని అయినా ఎంజాయ్ చేస్తాడతను. ముఖ్యంగా మర్డర్స్ చేయటాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తాడు.

అది ఎవరినైనా అవచ్చు.

పురుషులు, పిల్లలు, యువకులు, స్త్రీలు, వృద్ధులు....ఇలా రకరకాల వ్యక్తులని, విభిన్న వయస్సుల వాళ్ళని చంపాడు విలియమ్స్.

టవల్‌తో శరీరం మీది స్వేదం తుడుచుకోసాగాడతను.

హాల్ మధ్యలో టీపాయ్ దగ్గర వున్న ఈజీఛైర్‌లో కూర్చున్నాడు.

బ్లోయర్ ఆన్ చేశాడు నౌకరు.

దాని నుండి వచ్చే చల్లని గాలికి అతని శరీరం గాలిలో తేలిపోతున్నట్లయింది. రెండు కాళ్ళు ముందుకు జాపి కళ్ళు మూసుకున్నాడు.

అంత వరకు, ఆ హాలుకి ఒక కార్నర్‌లో నిలబడి చూస్తున్న అశోక్ విలియమ్స్ దగ్గరకు వచ్చాడు.

కళ్ళు మూసుకునివున్న విలియమ్స్ అతనిని చూడలేదు.

చిన్నగా దగ్గాడు అశోక్.

కళ్ళు తెరిచాడు విలియమ్స్.

"నువ్వు ఇంకా వెళ్ళలేదా!" అడిగాడు.

"ఎక్కడికి వెళ్ళేది? నీకంతా వేళాకోళంగా ఉంది" ఒకింత అసహనంగా అన్నాడు అశోక్.

"వేళాకోళం ఏముంది?"

"ఏముందా! బెంగుళూరు నుండి ఫ్లైట్‌లో త్రివేండ్రం వరకు వచ్చి శుభాంగి సమస్య చెబితే, నువ్వు ఇచ్చే సమాధానం ఇదా!"

ఛైర్‌లో తిన్నగా కూర్చున్నాడు విలియమ్స్ నౌకరు వైపు చూసాడు

రెండు పెగ్స్‌లో స్కాచ్ పోసి ఐస్ వేసి ఇద్దరి ముందు ఉంచాడు.

"తీసుకో" అన్నాడతనొకటి అందుకుని సిప్ చేస్తూ.

"విలియమ్స్....నేను బెంగుళూరు నుంచి వచ్చాను ఈ సమస్య గురించి"

"క్షణానికొకసారి బెంగుళూరు నుండి వచ్చాను అంటున్నావు! ఏదో



పరుగెత్తుకొచ్చిన వాడిలా మాట్లాడుతున్నావేమిటి? నిన్ను ఫ్లయిట్ తీసుకు వచ్చింది"

ఒళ్ళు మండిపోయింది విలియమ్స్ ధోరణికి. కానీ వీలయినంత వరకు ఆ ఫీలింగ్ బయటికి కనపడకుండా జాగ్రత్త పడ్డాడు.

"విలియమ్స్....ఈ విషయం గురించి నేను బెంగుళూరు నుండి నీతో ఫోన్‌లోనే మాట్లాడవచ్చు. బట్....నేనే స్వయంగా వచ్చాను అంటే సమస్య ఎంత తీవ్రంగా వుందో ఆలోచించు"

"ఏమిటి అందులో వున్న తీవ్రత?"

"ఏమిటా!....ఇప్పుడు ఒకసారి ఫోన్ చేసారు కాబట్టి అది ఇన్సూరెన్స్ కంపెనీయే అన్నట్లుగా నమ్మించగలిగాను. మరోసారి ఏమయినా వివరాలకి ఆమె ఫోన్ చేస్తే....అప్పుడు కూడా ఇలా నమ్మించడం చాలా కష్టం. కష్టం కూడా కాదు. అసంభవం"

"ఆమె ఫోన్ చేయదు" ఖాళీ పెగ్ టీపాయ్ మీద ఉంచి అన్నాడు

"అంత నమ్మకంగా ఎలా చెప్పగలవు? మరోసారి సందేహం వచ్చిందంటే ఖచ్చితంగా ఆమె ఫోన్ చేస్తుంది."

"ఆమె చేయదు"

"సరే! ఆమె ఫోన్ చేయదు....ఒక వేళ వస్తే!"

"ఎక్కడికి?"

"ఇంకెక్కడికి?" ....బెంగుళూరు ... వచ్చి ఆ పాలసీ ఏది? మా తల్లిదండ్రుల ఎడ్రస్ ఆ పాలసీలో ఉంటుంది కదా....లాంటి ప్రశ్నలు వేస్తే?"

"ఆమె రాదు"

"ఏమిటా సమాధానం? ఎందుకు రాదు?"

"ఆమె హైదరాబాద్ నుండి కదలకుండా ఆమె మెదడుకు పోస్ట్ హిప్నాటిక్ సజెషన్స్ ఇవ్వబడతాయి."

"ఎలా?"

"ఎలా ఏముంది? ఇప్పుడు జరుగుతున్నట్లుగానే ఇప్పటికి పది సంవత్సరాలుగా ఆమె మెదడు మన ఆధీనంలో ఉంది. ఇప్పుడూ అంతే....

ఒకవేళ ఆమె బయలుదేరినా, చివరి క్షణంలో అంటే రైలో, విమానమో ఎక్కే ముందు ఆమెకు ఏదో ఒక సమస్య వస్తుంది. ఏదో ఒక ఫియర్ కాంప్లెక్స్ డెవలెప్ అవుతుంది. అంతే....ఆమె అక్కడి నుండి బయలుదేరదు"

కొద్దిసేపు మాట్లాడలేదు అశోక్.

ముందు అది తాగు" అన్నాడు మరో పెగ్ తాగుతూ విలియమ్స్ స్కాచ్ పెగ్ అందుకున్నాడు అశోక్.

అతను చెప్పిన సమాధానం అంత సంతృప్తికరంగా లేదు అశోక్‌కి

"పోస్ట్ హిప్నాటిక్ సజెషన్స్ అంత ఖచ్చితంగా పనిచేస్తాయా?" సందేహంగా వ్యక్తం చేసాడు.

"హండ్రెడ్ పర్సెంట్... పనిచేస్తాయి. అందులో ఫెయిల్యూర్ అనే ప్రసక్తి లేదు."

"ఒకవేళ అయి-పొరపాటుగా బెంగుళూరు వచ్చిందనుకో"

"వచ్చినా, నీ దగ్గరకు రాదు. అంతవరకు ఆమెను రానివ్వను."

"ఎలా?"

"సమస్యలు సృష్టించుతాము. ఆమె బెంగుళూరు వచ్చినా, నీ దగ్గరకు రాకుండా చాలా ప్రాబ్లమ్స్ కలిగిస్తాము. ఆ ప్రాబ్లమ్స్ ఎంత కఠినమయినవంటే....ఆమె నీ గురించి ఆలోచించే అవకాశం కూడా లేకుండా సతమతమవుతుంది. ఆ రకంగా నీకు ఆమెనుండి పూర్తి రక్షణ కలిగిస్తాము."

"ఎటువంటి సమస్య సృష్టిస్తారు."

"అది ఇంకా ఆలోచించలేదు. పరిస్థితి అంతవరకు వస్తే అప్పుడే ఆలోచించవచ్చు."

"అంతవరకు వస్తే....అంటున్నావు... ఆమె ఒక నెల తరువాత బెంగుళూరు వస్తుందని నీ ఉద్దేశ్యమా! రేపో, ఎల్లుండో....ఏ క్షణంలోనయినా ఆమె నా దగ్గరకు వచ్చే ప్రమాదం ఉంది. ఆమె రావటం జరిగితే మాత్రం నాకు చాలా రకాలుగా నష్టం....నా జీవితమే దుర్భరం అయిపోతుంది. ఆమెవల్ల నా లైఫ్ నాశనం అయిపోతుంది."



"అవేమీ జరగవు....ఆమె హైదరాబాద్ నుండి కదిలే సూచనలు ఇప్పట్లో ఏమీలేవు. నేను హైదరాబాద్‌తో టచ్‌లో వున్నాను. ఆమె ఇంట్లో జరిగే ప్రతి విషయం.... ప్రతి రెండు గంటలకి నాకు రిపోర్ట్ అందుతోంది."

"నువ్వు చెప్పే విషయాలు అన్నీ బాగానే వున్నాయి. కానీ ఎక్కడయినా, ఏదయినా పొరపాటు జరిగి ఆమె బెంగుళూరు రావటం సంభవిస్తే మాత్రం నా నిర్ణయాలు నేను తీసుకోవాల్సి వుంటుంది" చాలా కటువుగా మారిపోయింది అతని గొంతు.

"నీ స్వంత నిర్ణయాలు తీసుకోవటం అంత మంచిది కాదు"

"మరేం చెయ్యమంటావ్....ఆమె నా దగ్గరికి వస్తే నాకు కలిగే నష్టం నీకు చెప్పాను. అయినా ఈమె విషయం మీకు ఫుల్‌టైం జాబ్ అయి వుండవచ్చు. నాకు మాత్రం పార్ట్‌టైం లాంటిది. ఈమె విషయంగా మీరు నాకిచ్చేదెంత? సంవత్సరానికి లక్షన్నర. అది నా ఆఫీసు మెయిన్‌టెయిన్ చెయ్యటానికికూడా సరిపోదు. నాకు పక్కన వ్యాపారాలు చాలా వున్నాయి. యీమె అక్కడికి వచ్చిందంటే....తీగలాగితే డొంక అంతా కదిలింది అన్నట్టు, నా వ్యవహారాలు వ్యాపారాలు అన్నీ బయటికి వస్తాయి. ఈ చిన్న వ్యాపారం గురించి నా మొత్తం వ్యాపారాలకి నష్టం కలగజేయలేను. ఈ విషయం గురించి నేను ఎంత చెప్పినా సీరియస్‌గా తీసుకోవటంలేదు నువ్వు. అందుకే చెబుతున్నాను. ఆమె బెంగుళూరులో అడుగు పెట్టిన మరుక్షణంలో ఆమె శవంగా మారిపోతుంది. ఆ శవం బెంగుళూరు కబ్బన్ పార్క్‌లో చెట్టుకి వ్రేలాడుతుంది జాగ్రత్త"

"ఆమె రాదు. వచ్చినా ముందుగా నీకు ఇన్‌ఫార్మ్ చేసే వస్తుంది."

"చూద్దాం....ఏం జరుగుతుందో....లేకుంటే చెప్పాను కదా! నేను చెయ్యబోయేది"

"ఒక విషయం గుర్తుంచుకో....ఆమెను చంపాలి అనుకుంటే చంపు....కానీ ఆ విషయం నాకు ముందుగా తెలియచెయ్యి. నా పర్మిషన్ వచ్చిన తరువాతే నువ్వామెను చంపగలవు. నా అనుమతి లేకుండా చంపే

ప్రయత్నం చేస్తే కబ్బన్ పార్కులో ఆమె శవం పక్కనే నీ శవంకూడా వ్రేలాడుతుంది" కూల్‌గా అన్నాడు విలియమ్స్.

వెన్నులో నుండి పురుగు పాకినట్లయి అదిరిపడ్డాడు అశోక్.

కారణం....ఆ సమాధానం విలియమ్స్ నుండి ఊహించలేదు అతను.

"ఏం బెదిరిస్తున్నావా!...." గంభీరత తెచ్చుకుంటూ అన్నాడు.

"కాదు....జరగబోయేది చెబుతున్నాను"

"నేను బెదిరింపులకు భయపడను. నీకు తెలుసు నా వెనుక ఎంత మంది మనుషులున్నారో"

"నీకున్న మనుషుల లెక్క అలా వుంచు....శుభాంగిని చంపినందుకు నిన్ను నేను ఏమీ చెయ్యకపోయినా, మిగతవాళ్ళు ఊరుకోరు. నీకు తెలుసు, శుభాంగి విషయంలో చాలామంది ఇన్‌వాల్వ్ అయివున్నారని"

"అవును, ఉన్నారు. వాళ్ళలో నన్ను చంపే ప్రయత్నం ఎవరు చేస్తారు?"

ఆ వ్యక్తి పేరు చెప్పాడు విలియమ్స్.

క్షణకాలం గుండె ఆగిపోయింది అశోక్‌కి.

విలియమ్స్ చెప్పిన వ్యక్తి అసాధారణ శక్తిమంతుడు. అతను తలచుకుంటే ప్రపంచంలో ఎంతటి గొప్ప వ్యక్తినయినా చంపగలడు. అతనేకాని తలుచుకుంటే అశోక్‌ని రోడ్డు పక్కన కుక్కని చంపినట్లు చంపగలడు. ఆ విషయం ఆ వ్యక్తి పేరు చెప్పగానే అర్థమయింది అశోక్‌కి

కొద్ది క్షణాలు మాట్లాడలేదు అతను.

స్కాచ్ పెగ్‌లోని ఐస్ క్యూబ్స్ రెండు బయటికి తీసి రెండు కనురెప్పల మీద ఉంచుకుని కళ్ళు మూసుకుని వెనక్కి పడుకున్నాడు విలియమ్స్.

విలియమ్స్ కొన్ని పిచ్చి పనులు చేస్తాడనుకున్నాడు అశోక్.

"ఒక పని చేస్తా!"

విలియమ్స్ మాటకి ఏమిటన్నట్లు చూసాడు అశోక్.



"ఇంతవరకు జరిగిన విషయాన్ని, ఐ మీన్ శుభాంగి, గౌతమ్‌లు నీకు ఫోన్ చేసిన విషయాన్ని ఇప్పుడే అతనికి తెలియజేస్తాను. ఆ వ్యక్తి నుండి నీకు వెంటనే జవాబు వస్తుంది. అతను చెప్పినట్లుగానే నడుచుకో.. అతను శుభాంగిని చంపమంటే చంపు....లేకుంటే వదలెయ్యి....ఏదయినా సరే నీ సొంత నిర్ణయాలు వదిలి అతనికి నచ్చిన విధంగా చెయ్యి....అతి తెలివికి పోయి ప్రాణాల మీదికి తెచ్చుకోకు."

తల ఊపాడు అశోక్.

"కానీ విలియమ్స్....అంత పెద్ద వ్యక్తికి, ఇంత చిన్న కేస్‌తో సంబంధం ఏమిటి? ఎక్కడో హైదరాబాద్‌లో పెయింటింగ్‌లు వేసుకునే ఓ పాతికేళ్ళ అమ్మాయి గురించి అంత తపన, సీరియస్‌నెస్ ఎందుకు?"

"ఆ విషయం చెప్పవలసినది నువ్వు కాదు. ఈమె కేస్ విషయంలో నీకూ నాకూ పూర్తిగా తెలియనంతమంది హేండ్స్ ఉన్నాయి. ఇది నీకూ నాకూ మైనర్ విషయంగా తోచినా, కొందరికి ఇది చాలా పెద్ద విషయం. నిజం చెప్పాలంటే ఇది నువ్వో, నేనో హేండిల్ చేయదగ్గ కేస్ కూడా కాదు. మన స్థాయికి మించినది. మనం కేవలం కాపలాకుక్కల లాంటి వాళ్ళం అంతే."

"బట్....ఒక అమ్మాయి, ఇదేమీ లక్షల కోట్ల కేసు కాదు. రిజర్వ్ బ్యాంక్ దోపిడీ కాదు. విదేశాల నుండి ఆయుధాలు స్మగుల్ చేయటం కూడా కాదు. కనీసం ఆమె ఇండియాకు ప్రధాన మంత్రి కాదు. ఆఖరికి ఎమ్మెల్యే కూడా కాదు. ఈ కేసులో కొన్ని వందల మంది ఇన్వాల్వ్‌మెంట్ ఏమిటి? ఆమె ప్రత్యేకత ఏమిటి? వై ఈజ్ షి సో ఇంపార్టెంట్?"

"అది నీకు అనవసరం. అవసరం అనుకున్న రోజున అప్పుడే నీకు చెబుతాను."

"ఇంతవరకు ఆమె ఎలా ఉంటుందో కూడా నేను చూడలేదు. ఇంత ప్రాముఖ్యం ఉన్న కేస్‌లో నేను ఇన్‌వాల్వ్ అయ్యానన్న సంగతి నాకు తెలియదు. నేను ఆమెను చూడవచ్చా?"

"అవసరం అనుకుంటే ఫోటో చూపిస్తాం. నీకు ఆమెను చూడవల

సిన అవసరంరాదు. లేదుకూడా'' నిర్మొహమాటంగా చెప్పాడు విలియమ్స్

ముఖం మీద కొట్టినట్లనిపించింది అశోక్‌కి.

ఇన్నాళ్ళూ తను చాలా పొరపాటు పడ్డాడు, శుభాంగి కేస్ విషయం హేండిల్ చేయటంలో తను చాలా ముఖ్య పాత్ర వహిస్తున్నాడు అనుకున్నాడు. కానీ....ఇప్పుడు అది నిజం కాదన్నది నిర్ధారణ అయింది. విలియమ్స్‌కి ఉన్నంత ప్రాముఖ్యం కూడా తనకి లేదు. విలియమ్స్‌కి తెలిసినన్ని నిజాలు కూడా శుభాంగి విషయంలో తనకి తెలియవు. ఈ కేస్‌లో ఎంతోమంది ఇన్వాల్వ్ అయివున్నారు. నువ్వు శతకోటి లింగాలలో బోడిలింగానివి, అన్న విషయాన్ని ఖచ్చితంగా చెప్పాడు విలియమ్స్.

ఆ విషయానికే అశోక్ మనస్సు చివుక్కుమంది. తనొక బ్రోకర్ అంతే! ఆ విషయానికి వస్తే విలియమ్స్ ఇంకొంచెం పెద్ద బ్రోకర్ అంతే.

అంతే....తనకు తెలియని చాలా విషయాలు ఉన్నాయి.

"ఏమిటాలోచిస్తున్నావ్?....ఈ కేస్ విషయంలో నీ పాత్ర ఎంత చిన్నదా! అనా?"

మాట్లాడలేదు అశోక్.

చైర్‌లో నుండి లేచాడు.

"నేను వెళతాను...." పొడిగా అన్నాడు.

"మంచిది"

చైర్ దగ్గర నుండి కదిలాడు అశోక్.

"ఒక్క నిముషం"

విలియమ్స్ పిలుపుకి వెనక్కి చూసాడు ఏమిటన్నట్టు అశోక్.

"ఇదిగో—ఇది తీసుకెళ్ళు"

టీపాయ్ క్రింద వున్న చిన్న లెదర్ బ్యాగ్ అందించాడు విలియమ్స్.

"ఏమిటిది?"

"ఖర్చులకి....లక్ష ముప్పైవేలో, నలభైవేలో ఉండాలి. ఎంతుంటే ఏంలే.... కొద్ది రోజులకి ఖర్చులకి సరిపోతాయి."

అంతవరకు దిగాలుగా ఉన్న అతని ముఖం కొంచెం వికసించింది. బ్యాగ్ అందుకున్నాడు.



"శుభాంగి బెంగుళూరు రాకుండా మాత్రం నువ్వే చూడాలి" అభ్యర్థనగా మరోసారి అన్నాడు అశోక్.

అలాగే అన్నట్లు తల ఊపాడు విలియమ్స్.

ఏదో గుర్తువచ్చినవాడిలా వెనక్కి తిరిగాడు అశోక్.

ఏమిటన్నట్టు చూశాడు విలియమ్స్.

"మరి...."

"డబ్బు సరిపోదా!....ఇంకా కావాలా!"

"అది కాదు. ఒక చిన్న డౌట్"

"అడుగు"

"శుభాంగి కాకుండా గౌతమ్ బెంగుళూరు వస్తే?"

"నిర్దాక్షిణ్యంగా చంపవచ్చు. బెంగుళూరులోనే కాదు....ఎక్కడైనా చంపొచ్చు"

"ఈ శుభాంగికి మరో పేరు ఏదయినా ఉందా! ఈమె తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చావలేదని అయితే నాకు తెలుసు. మరి ఆమె అసలు తల్లిదండ్రులెవరు?" విలియమ్స్ కళ్ళు తెరిచి అశోక్ వైపు చూసాడు.

ఆ చూపులోనే "నీకు అనవసరం....ఎక్కువగా వాగితే ప్రమాదం. బ్రతకాలని లేదా!" లాంటి చాలా సమాధానాలు కనిపించాయి అశోక్‌కి.

o o o

"హెల్ప్"

ఎక్కడినుంచో ఆర్తనాదం

అదిరిపడి బెడ్‌మీద కూర్చున్నాడు గౌతమ్.

"హెల్ప్"

మరోసారి కీచుమంటూ వినిపించింది ఓ స్త్రీ ఆర్తనాదం.

చుట్టూ చిక్కటి చీకటి.

పక్కను దొర్లి బెడ్ పక్కన స్టూల్ మీద వున్న టేబుల్ లైటు ఆన్‌చేసాడు. "హెల్ప్....హెల్ప్"

సందేహం లేదు. అది శుభాంగి గొంతే.

క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు గౌతమ్.

పిల్లో క్రింద దాచిన 7 ఎం.ఎం. ఆటోమాటిక్ పిస్తోలు చేతిలోకి

తీసుకుని బెడ్‌మీద నుండి కిందికి దూకి, బయటికి వచ్చాడు.

గది గోడలు దద్దరిల్లేలా అరుస్తోంది శుభాంగి. ప్రాణాలు తీసే సమయంలో తుది క్షణంలో చేసే ఆర్తనాదాల్లా ఉన్నాయి అవి.

ఏమయి ఉంటుంది .. క్షణకాలం మెదడు అంతా శూన్యం అయిపోయింది.

ఆమె గది తలుపు దగ్గరకు వేసుంది.

భీకరంగా అరుస్తోంది ఆమె.

చేతిలోని రివాల్వర్ ట్రిగ్గర్ మీద వేలు బిగించి రెండో ఆలోచన లేకుండా, సూటిగా ఆమె గదిలోకి దూసుకు వెళ్ళిపోయాడు గౌతమ్.

జరుగుతున్న సంఘటనని తొలిసారి తప్పుగా అంచనా వేసాడు గౌతమ్.

సుడిగాలిలా ఆ గదిలోకి ప్రవేశించి లైట్ స్విచ్ ఆన్ చేశాడు గౌతమ్.

ఒక్కసారిగా గదిలో వెలుగులు పరచుకున్నాయి.

బెడ్‌మీద వెల్లకిలా పడుకుని చేతులు, కాళ్లూ విదిలిస్తూ అరుస్తోంది శుభాంగి.

గది అంతటినీ పరిశీలనగా చూశాడు గౌతమ్.

ఎవరూ కనపడలేదు.

ఆమెకు అవతలివైపు వున్న కిటికీ తలుపు తెరిచి వుంది.

అటుగా పరిగెత్తి కిటికీలోంచి క్రిందకి చూశాడు.

కళ్ళు మూసుకొని ఆమె ఇంకా అలా అరుస్తూనే వుంది.

"శుభా" పిలిచాడు.

ఆమెకు వినపడలేదు.

"శుభా" మళ్ళీ పిలిచాడు.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచిందామె.

ఎదురుగా గౌతమ్ వున్నాడు.

"ఏమయింది?....ఎందుకలా అరుస్తున్నావు?"

ఒకింత ఆందోళనగా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.



గౌతమ్ కళ్ళలోకి క్షణకాలం పరీక్షగాచూసి చటుక్కునలేచి గాఢంగా కౌగిలించుకుని "గౌతమ్....నన్ను రక్షించు....నన్ను రక్షించు" అంటూ చిన్న పిల్లలా ఏడవసాగింది ఆమె.

ఊహించని ఆమె చర్యకు ఉలిక్కిపడ్డాడు గౌతమ్.

భయంతో వణికిపోతున్న ఆమె శరీర ప్రకంపన అతనికి స్పష్టంగా తెలుస్తోంది.

అతనిని గాఢంగా హత్తుకొని వుందామె.

"గౌతమ్....వాళ్ళు నన్ను చంపేస్తారు హెల్ప్ మీ" వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆమె.

గొంతు పెగల్చుకొన్నాడు గౌతమ్.

"నీకు....ఏమీ అవ్వదు. కంట్రోల్ యువర్ సెల్ఫ్" ధైర్యం చెప్పినట్లుగా అన్నాడు.

అతనికి విషయం అర్థమయింది. ఆమెకు మళ్ళీ కల వచ్చింది. కలలో ఒంటిచేతి వ్యక్తి వచ్చాడు.

ఆమె శరీరంలో వణుకు ఆగింది.

కానీ అతనిని ఇంకా వదలలేదు.

చాలా ఇబ్బందిగా వుంది గౌతమ్‌కి.

స్త్రీ స్పర్శ....

అంత సన్నిహితంగా....

అది మొదటిసారి ....

ఆమెను విడిపించుకొందామని ఒకింత ఇబ్బందిగా కదిలాడు.

ఆమె అతనిని తన బాహువుల్లో మరింత బలంగా బంధించింది.

జీవితంలో మొదటిసారిగా అనుభవిస్తున్నాడు ఆ రకమైన అనుభూతిని, ఇబ్బందిని కూడా. అతనికి స్పష్టంగా తెలుస్తోంది.

"గౌతమ్.... వాళ్ళు నన్ను చంపేస్తున్నారు" మళ్ళీ గొణిగినట్లుగా అంది.

"న ...థింగ్....విల్.... హేపెన్....నేను.... వున్నాను" అప్రయత్నంగానే ఆమె భుజాల మీద చేతులు వేశాడు ధైర్యం చెప్పినట్టుగా.

అతని గొంతులో చిన్నపాటి వణుకు చోటు చేసుకుంది.

హృదయస్పందన హెచ్చినట్టు....

బాడీ టెంపరేచర్ పెరిగినట్టు ....

ఏదో వింత అనుభూతి.

ఆమెను మరింత దగ్గరకు తీసుకోవాలన్న ఆలోచన....

అదే సమయంలో....ఆమెను దూరంగా తోసివేయాలన్న మరో ఆలోచన.

కానీ ఆ రెండో ఆలోచనకి పూర్తిగా సహకరించని మనస్సు ....

మొదటి ఆలోచనకి సహకరిస్తున్న వయస్సు ....

ఏదో సందిగ్ధం ..

అయోమయం.

శుభాంగి శరీరం అంత సున్నితంగా పాలనురగలా వుంటుందని అతనికి తెలియదు.

ఒక స్త్రీ శరీరం తనకు అంత సన్నిహితంగా వచ్చినప్పుడు, తనలోని ఆలోచనల్లో మార్పు వుంటుందని తెలియదు ....

ఆమెను దూరంగా తోసివేయాలనుకున్నా ఆ పని చేయలేక పోతున్నాడు.

ఆమెను మరింత దగ్గరగా తీసుకోవాలి అని ....

ఆమె తలని తన గుండెల్లో దాచుకోవాలని అనిపిస్తోంది.

అంటే....ఇది ప్రేమా!

కాదు....

ప్రేమనే మాటకి అతని నిఘంటువులో అర్థం లేదు.

కాబట్టి ప్రేమ కాదు.

మరి....లస్ట్....

కాదు....అది లస్ట్ అయితే .... ఇప్పటికి చాలామంది అమ్మాయిలు తనతో సఖ్యంగా వుండాలని....శారీరకంగా దగ్గరవ్వాలని ప్రయత్నించారు కానీ ఎవరికీ తను ఆ అవకాశం ఇవ్వలేదు ....

అది లస్ట్ అయితే ...



ఆ వచ్చిన అవకాశం వినియోగించుకోవాలని....ఆమెను మరింత దగ్గరకు తీసుకోవాలని....ఏదేదో చెయ్యాలని అనిపించేది ....

కానీ అలా కూడా లేదు....

ఇట్స్ యాన్ అట్టర్ కన్‌ఫ్యూజన్.

ఫర్ ది ఫస్ట్ టైమ్.

"శుభాం....గీ .... ఏమయింది....ఎందుకలా అరిచావు" వణుకుతున్న గొంతుని అదుపులో పెట్టుకుంటూ అడిగాడు.

ఆమె నుండి దూరంగా జరగాలని ప్రయత్నించాడు. కానీ అలా జరగడానికి ఆమె ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు.

"అదే కల" గొంతు పెగల్చుకొని అంది.

"అంటే"

"అదే....ఒంటిచేతి మనిషి"

"అదే రకంగా వచ్చిందా కల....లేక"

"ఏ మార్పు లేదు. అదే పద్ధతి, నా శరీరం అంతా తడిమాడు"

"తరువాత"

"ఇంక పదహారు రోజులే అన్నాడు"

"పదహారు అంటే....ఇంతకు ముందు కల వచ్చినప్పుడు ఏమన్నాడు?"

"పదిహేడు రోజులు అన్నాడు"

అతని నడుము చుట్టూ వేసిన చేతులు తొలగించిందామె.

ఒకింత రిలీఫ్‌గా ఫీలయ్యాడు గౌతమ్.

ఆమెమాత్రం అతనికి అతి సమీపంగా కూర్చుని వుంది.

ఆమె శరీరం దాదాపుగా తనకి తగులుతోంది.

ఆమె పెదవులు దాహంతో ఎండిపోయినట్టుగా ఉన్నాయి.

శరీరంమాత్రం స్వేదంతో తడిసిపోయి వుంది.

లైట్ ఎల్లోకలర్ నైటీ ఆమె శరీరవర్ణంలో కలిసిపోయింది.

అసలే పలుచగా వున్న ఆ నైటీ చెమటకి తడి అయి మరింత పారదర్శకంగా మారింది.

ఆమె శరీర అందాలు కొంత స్పష్టంగా. మరికొంత అస్పష్టంగా బహిర్గతం అవుతున్నాయి.

ఆమె చాలా అందంగా వుంది అనుకున్నాడు గౌతమ్ ఆ సమయంలో....

ఇంత అందమైన శరీరమేనా తనని ఇంతసేపూ అల్లుకుపోయింది అని మరోసారి అనిపించింది.

ఏమిటీ పాడు ఆలోచన అని ఇంకొకసారి అనిపించింది.

"గౌతమ్—నాకు భయంగా ఉంది" అందామె నాలిక తడి చేసుకుంటూ.

"ఎందుకు?"

"పదహారురోజుల తరువాత ఏం జరుగుతుందో అని"

"ఏమీ జరగదు"

"ఎందుకు జరగదు? నన్ను ఎవరయినా చంపేస్తారేమో!"

మనస్సులో ఉలిక్కిపడినా, పైకి చిరునవ్వు ప్రదర్శించాడు అదేదో జోక్ అన్న భావన స్ఫురించేలా.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"నిన్ను చంపేస్తారన్నావుగా అందుకే"

"నాకు ప్రాణభయంగా వుంటే....నీకు నవ్వులాటగా వుందా?"

"నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు....సరేనా!" ఆమెకు ధైర్యం కలిగేలా అన్నాడు.

చటుక్కున ముందుకు వంగి అతని బుగ్గని సున్నితంగా చుంబించింది.

అదిరిపడ్డాడు గౌతమ్.

"థాంక్యు గౌతమ్. నాకా నమ్మకం వుంది. నువ్వుండగా నన్ను ఎవరూ ఏమీ చేయలేరు" ఆనందం నిండిన గొంతుతో అని అతని గుండెలమీద తల ఆన్చి గట్టిగా హత్తుకుంది.

"మైగాడ్....ఏమిటిది? ఈమె ఎందుకిలా నా దగ్గరకు వస్తుంది? ఎందుకు నాకు పరీక్ష పెడుతూంది" అనుకున్నాడు మనస్సులో.



ఆమె కావాలని అలా హత్తుకుంటుందో....భయంతో హత్తుకుంటుందో తెలియడంలేదు.

"గౌతమ్...."

"గౌతమ్" మరోసారి పిలిచింది అతని నుండి సమాధానం రాకపోవడంతో.

ఉలిక్కిపడి "ఆ" అన్నాడు.

అతని ఉలికిపాటు ఆమెకు తెలిసింది.

"ఎందుకలా ఉలిక్కిపడ్డావు?"

"ఏం....లేదు"

"నువ్వు నా ప్రక్కనుంటే నా ప్రాణానికి ప్రమాదం ఉండదు గౌతమ్."

"నేను ఇక్కడే ఉన్నాకదా! నీ ప్రాణానికి ప్రమాదం ఏ మాత్రం లేదు."

"కానీ...."

"ఆ....కానీ"

"నువ్వు ఇక్కడ ఎన్నాళ్ళుంటావు?"

"అవసరం అయినన్నిరోజులు"

"ఆ తరువాత?"

"ఆ తరువాత బొంబాయి వెళతాను" ఆ మాట అన్నాడుకానీ, అది మనస్ఫూర్తిగా అన్నమాటలాగ అతనికి అనిపించలేదు.

"వెళ్ళిపోతావా!"

"వెళ్ళను" అనాలనిపించింది కానీ అనలేదు.

"గౌతమ్....మాటాడవేం?"

"ఏం మాట్లాడను!"

"వెళ్ళిపోతావా అని అడుగుతున్నాను."

"వె....వెళ్ళనులే"

"ఇక్కడే ఉండిపోతావా!"

31)

"...."

"చెప్పు గౌతమ్....ఇక్కడే ఉండిపోతావా"

"...."

"ఉండవా!"

"ఉం....టా....ను"

"ఎప్పటికీ నాతోనే వుంటావా!"

చాలా ఇబ్బందిగా ఉన్నాయి శుభాంగి ప్రశ్నలు.

ఉంటానని చెప్పాలా....ఉండనని చెప్పాలా....

సందిగ్ధం.

మనస్సు ఉండనంటోంది.

వయస్సు ఉంటానని చెప్పమంటోంది.

ఆమెతో "ఉండను" అని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాడు.

కారణం....

ఆమెను, తన కేస్‌కు సంబంధించిన ఒక క్లైయింట్‌గా మాత్రమే భావిస్తే "ఇక్కడ ఉండవలసిన పని నాకేమిటి? మీ కేస్ ఒకటీ సాల్వ్ చేస్తే సరిపోయిందా? బొంబాయిలో నాకు లక్షన్నర పనులున్నాయి" అని చెప్పేవాడు. కానీ ఆ మాట ఆమెతో చెప్పలేకపోతున్నాడు.

కారణం....

ఆమెమీద వ్యక్తిగతమయిన అభిమానం పెంచుకున్నాడు.

ఆరంభంలో లేని ఆ అభిమానం కాలక్రమేణా పెరిగింది.

దానినే "లవ్" అంటుంది సుప్రియ.

కాదని ఖచ్చితంగా చెప్పేసాడు ఆ రోజు.

కానీ....

ఇప్పుడు....అదే ప్రేమంటే....ఏదో! అనిపిస్తోంది.

కానీ....తను ఎవరినీ ప్రేమించడు కదా!

"గౌతమ్....ఐ లవ్ యు" అతని గుండె మీద తల వుంచి చిన్నగా గొణిగినట్లుగా అంది ఆమె.

అదిరిపడ్డాడు.



గుండెల్లోకి మైక్ పెట్టి చెప్పినట్లు అనిపించింది గౌతమ్‌కి.

"యస్! గౌతమ్....ఐ లవ్ యు"

ఐ లవ్ యు....ఐ లవ్ యు....ఐ లవ్ యు....ఐ లవ్ యు....

ఆ గది గోడలన్నీ ఆ శబ్దంతో ప్రతిధ్వనించుతున్నట్టు అనిపించింది అతనికి.

"నాకు నీ ప్రేమ కావాలి గౌతమ్....నువ్వంటే నాకు ప్రాణం"

అతనికి మెదడు పనిచేయటం లేదు.

"నువ్వు నన్ను కాదంటే నేను చనిపోతాను గౌతమ్. నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేను"

........

"నువ్వు లేని జీవితాన్ని ఉహించలేను"

........

"నువ్వు తోడులేని జీవితం దుర్భరం"

........

"నేనంటే నీకు ఇష్టమో లేదో చెప్పు గౌతమ్"

........

"ప్లీజ్ టెల్ మీ"

........

"గౌతమ్....నేనంటే నీకు ఇష్టం లేదా!"

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయని అర్థం అవుతోంది గౌతమ్‌కి.

కారణం....ఆమె వెచ్చని కన్నీటి చుక్కలు అతని ఛాతీ మీద పడుతున్నాయి.

ప్రేమిస్తున్నానని చెప్పలేదు.

కానీ....ప్రేమించడం లేదని కూడా అనలేదు.

"గౌతమ్....టెల్ మి గౌతమ్!"

"ఇ....ఇ....ష్టం....మే!"

"డూ యూ లవ్ మీ!"

ఆమె ప్రశ్నలు ఇంకా కొనసాగుతున్నాయి.

ఇంక ఆమెకు విషయం స్పష్టంగా చెప్పాలనుకున్నాడు.

"శుభా...."

"ఊ...."

"ఒక విషయం చెప్పనా!"

"ఏమిటి?"

"నువ్వు అంటే... నాకు ఇష్టమే"

"థాంక్యూ"

"కానీ....అది ప్రేమ అని చెప్పలేను. ప్రేమ అవునో కాదో తెలియదు"

తల ఎత్తి అతని కళ్ళలోకి సూటిగా చూసింది ఆమె.

"అవును....అది ప్రేమో కాదో నాకు తెలియదు. కారణం....నేను అసలు ప్రేమ అన్న పదానికే వ్యతిరేకిని."

"ఎందుకు?"

అతని బాల్యం నాటి విషయాలు చెప్పాడు. తన తండ్రి ఎంత కఠినంగా ఉండేవాడో చెప్పాడు. అతనికి కోపం వచ్చినప్పుడు తల్లిని కూడా నిర్దాక్షిణ్యంగా కొట్టేవాడన్న విషయం చెప్పాడు. తన తల్లి కూడా తనని ఎలా దండించేదో, ఎన్నిసార్లు తనని ఎంతమంది డాక్టర్ల దగ్గరకు తీసుకు వెళ్ళిందో అన్నీ చెప్పాడు.

మౌనంగా విందామె.

" ఈ సంఘటనలు అన్నీ చూసాక నాకు ప్రేమ అనే మాట మీద నమ్మకం పోయింది. ప్రేమ అంటే, బూటకం, ట్రాష్....అనే అభిప్రాయానికి వచ్చాను. అది బలంగా నా మనస్సులో నాటుకు పోయింది కూడా. అందుకే ఇంతవరకు ఎవరినీ ప్రేమించలేదు. ప్రేమించలేను కూడా!"

"అంటే... నా మీద కూడా నీకు ప్రేమ లేదా గౌతమ్"

ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

నీరు నిండిన ఆమె కళ్ళలోకి చూడలేక తల వంచుకున్నాడు గౌతమ్.

"నీ మీద నాకు ప్రేమ ఉందో లేదో నాకే తెలియదు. నీతో మాట్లా



డాలని, సన్నిహితంగా ఉండాలని అనిపిస్తుంది. తలపులని 'ప్రేమ' అని ఎవరైనా అంటే, ఆ ప్రేమకి దూరం అవుదాం అనిపిస్తుంది. మనిద్దరి మధ్య స్నేహాన్ని ప్రేమ అనే పిలుపుతో కాక మరేదైనా మాటగా పిలిస్తే బావుంటుందనిపిస్తోంది. నేను ఏమీ తెలియని స్థితిలో ఉన్నాను."

నిశ్శబ్దంగా అతని మాటలే వింటోంది ఆమె.

"నిన్ను ప్రేమిస్తున్నాను అంటే.... అది అబద్ధమేమో అని ఒకసారి అనిపిస్తుంది. నిన్ను ప్రేమించడం లేదు....అంటే అది ఆత్మవంచనేమో అని మరోసారి అనిపిస్తుంది. అలా అని నేను హిపోక్రాట్ని కాను."

"నీ విషయంగా ఒకసారి నాకు సుప్రియకి ఆర్గ్యుమెంట్ వచ్చింది. ప్రేమ ఉందని ఆమె, లేదని నేను, తీవ్రంగా వాదించుకున్నాము. కానీ.... ఆ సమయంలో, చనిపోయిన తన భర్త గురించి చెప్పిందామె.

అతనితో కలిసి వున్నది కేవలం తొమ్మిది రోజులే అంది. ఆ సంఘటన వింటే ప్రేమ ఉందేమో అనిపిస్తుంది" తన మనసులోని అట్టర్ కన్ఫ్యూజన్ని దాపరికం లేకుండా చెప్పాడు గౌతమ్.

"గౌతమ్!" అతని చుబుకాన్ని పట్టుకొని తన వైపుకు తిప్పుకుందామె.

"ప్రేమ ఉంది గౌతమ్. సృష్టిలోని ప్రతి వ్యక్తికి, మరొక వ్యక్తి మీద ప్రేమ ఉంది. అది లేకుంటే కుటుంబమూ, సంసారం అనే వ్యవస్థే లేదు. కొన్నాళ్ళ సుదీర్ఘ పరిచయం....స్నేహం....ప్రేమకి దారి తీస్తాయి. సృష్టిలో ఏ ఒక్కరూ ప్రేమకు అతీతులు కారు. నీకొక విషయం తెలుసా!....ఇన్నాళ్ళుగా భర్తకి దూరం అయినా, నా స్నేహితురాలు సుప్రియలో ప్రేమ చావలేదు తెలుసా! అతని జ్ఞాపకాలు అనుక్షణం ఆమెను బాధించాయి. ఆ జ్ఞాపకాలు ఆమె ఒంటరి జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే ఆమె ఆ జ్ఞాపకాలలోంచి బయటపడగలుగుతోంది. అందుకు కారణం తెలుసా!"

తెలియదన్నట్లు చూసాడు గౌతమ్.

"అందుకు కారణం రఘునాథ్."

ఉలిక్కిపడ్డాడు గౌతమ్.

"అవును. రఘునాథ్‌ని సుప్రియ ఇంట్లో ఉంచడం కాకతాళీయంగా జరిగింది. ఆమె మానవతా దృక్పథంతో అతన్ని ఇంట్లో ఉంచింది. అహర్నిశలు అతనిని కనిపెట్టుకుని ఉంటోంది. అనుక్షణం అతని మంచిచెడ్డలు స్వయంగా చూస్తోంది.

ఫలితం....

అతనిమీద తెలియని అభిమానం ఏర్పరచుకుంది.

మొదట అతనిమీద కలిగింది జాలి

పాపం....కాలు లేనివాడు....ఎన్నో బాధ్యతలు మోయవలసినవాడు....చిన్న వయస్సులోనే అవిటివాడయ్యాడన్న జాలి....సానుభూతి.

ఆ తరువాత....

అతని వ్యక్తిత్వాన్ని గౌరవించింది.

డ్యూటీ అంటే ప్రాణాలకు కూడా తెగించిన అతని సిన్సియారిటీని గౌరవించింది.

చివరికి ఒక వ్యక్తిగా అతన్ని గౌరవించింది.

ఆ గౌరవం అభిమానంగా మారింది.

మరేవ్యక్తి అయినా కూడా అతని మంచిచెడ్డలు, తను చూపినంత జాగ్రత్తగా చూడలేమోనన్న అనుమానం కూడా కలిగింది.

అందుకే రఘునాథ్ జీవితానికి తనే తోడయితే....! అన్న ఆలోచనలోవుంది.

"ఈ ఆలోచన సుప్రియలో వుందా?" ఆతృతగా అడిగాడు గౌతమ్.

"యస్....వుంది....నిన్ననే ఆ విషయం నా దగ్గర వ్యక్తం చేసింది."

అదిరిపడ్డాడు గౌతమ్.

"వాట్!" నోరు తెరుచుకుని అచేతనంగా వుండిపోయాడు గౌతమ్. ఇది అతను ఊహించని మలుపు.

"అవును. రఘునాథ్ వచ్చాక, ఆమె పాతజ్ఞాపకాలకు చాలా వరకు దూరం కాగలిగింది. చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుని-ఛిన్నాభి



న్నమైన జీవితం ఆమెది. కనీసం రఘునాథ్‌ని పెళ్ళి చేసుకుంటే....విధి వంచితుడయిన ఓ ఉత్తముడి జీవితానికి తోడయ్యానన్న తృప్తి అయినా ఆమెకు ఉంటుంది. ఇది కేవలం జాలివల్ల తీసుకున్న నిర్ణయం కాదు. ఎక్కడో హృదయాంతరాళాల్లో మొగ్గ తొడిగిన ప్రేమే దానికి కారణం."

నిర్ఘాంతపోయి వింటున్నాడుగౌతమ్. సుప్రియ....వయస్సులో తన కంటే చిన్నదయినా, సంస్కారంలో ఎంత ఉత్తమురాలు?.... ఆ సమయంలో సుప్రియ తన ఎదురుగా వుంటే ఆమె సంస్కారానికి రెండు చేతులూ జోడించేవాడు.

"ఈ విషయం ....రఘునాథ్‌కి తెలుసా?" తేరుకుని అడిగాడు.

"ప్రత్యేకంగా కాకపోయినా, పరోక్షంగా తన మనస్సులోని అభిప్రాయం అతనికి చెప్పే ఉండవచ్చు."

అదినిజం అయితే....రఘునాథ్ అదృష్టవంతుడు .. అవిటివాడయిన అతని జీవితాన్ని నిలబెట్టడానికి సుప్రియ వస్తుందంటే.... అంతకంటే ఇంకేం కావాలి.

ఒకింత ఆనందంతో మనసు ఉప్పొంగింది.

"ఈ విషయం వింటూంటే ఆనందంగా ఉంది కదూ!" అంది శుభాంగి.

"చాలా ఆనందంగాఉంది. సుప్రియలాంటి అమ్మాయి, రఘునాథ్‌ని ప్రేమించడం....ఇట్స్ రియల్లీగ్రేట్"

"ఆగు....రఘునాథ్‌నిప్రేమించడం....అన్నావు....అంటే ...ప్రేమ అనేది ఉందని ఒప్పుకుంటున్నావు కదూ!"

ఉలిక్కిపడ్డాడు ఆమె మాటకు.

"చెప్పవేం గౌతమ్....ప్రేమ అనేది ఉంది కదా!" రెట్టించింది.

అయిష్టంగానే తల వూపాడు ప్రేమ ఉంది అన్న అర్థం వచ్చేలాగ

"మరి ....నామీద నీకు ప్రేమ లేదా!"

తిరిగి మొదటిప్రశ్నకు వచ్చింది ఆమె.

"చెప్పు గౌతమ్....నీకు ప్రేమ ఉన్నా లేకపోయినా నేను మాత్రం చెబుతున్నాను. ఐ లవ్ యూ!" అంది అతని చెవి దగ్గరికి నోరు చేర్చి

అలా చెబుతున్నప్పుడు ఆమె వెచ్చని ఊపిరి అతని మెడ మీద తాకింది.

అతని చెవి దగ్గర ఉన్న నోటిని కొంచెం ప్రక్కకు తిప్పి అతని బుగ్గమీద సున్నితంగా చుంబించింది.

ఒంట్లోంచి విద్యుత్ పాకినట్లయింది గౌతమ్‌కు.

"ఐ లవ్ యు" మరోసారి అని, అతని మెడచుట్టూ రెండుచేతులు వేసి, అతని పెదవులమీద తన పెదవులతో ముద్ర వేసింది.

మరోసారి విద్యుత్ ఘాతం తగిలిన అనుభూతి పొందాడతను.

ఆమె పెదవులు అతని ఛాతీని చుంబించాయి.

అతని చేతులు అప్రయత్నంగా ఆమె భుజాల చుట్టూ పడ్డాయి.

ఇప్పుడతని మనస్సు అతని కంట్రోల్‌లోలేదు.

ఆమెను తన శరీరానికి గట్టిగా అదుముకొన్నాడు.

ఒక రకమైన ఉద్వేగంతో, కళ్ళుమూసుకుని తల పైకెత్తిందామె.

మూసి వున్న ఆ కళ్ళు "గౌతమ్ నేను అదృష్టవంతురాలిని" అని చెబుతున్నట్టు అనిపించాయి. అతని పెదవులు ఆమె కళ్ళను సున్నితంగా స్పృశించాయి.

"నిన్ను నువ్వు ఇంక మోసం చేసుకోలేవు" అంటోందిఅతనిమనస్సు.

"ఐ లవ్ యు" అని అస్పష్టంగా పలుకుతోంది అతని నోటి నుండి వచ్చే వెచ్చని ఆవిరి లాంటి ఊపిరి.

* * *

సమయం సాయంకాలం ఆరుగంటలు కావొస్తోంది.

వాతావరణం చల్లబడింది.

మెత్తగా రోడ్డుమీద జారిపోతున్న మారుతీని లెఫ్ట్‌కి టర్న్ చేశాడు గౌతమ్.

ఆ రోడ్డులో యాభై గజాలు ముందుకు వెళ్ళి డాక్టర్ పరమాత్మ హాస్పిటల్ ముందు ఆపాడు.

కారు పార్కింగ్ ప్లేస్‌లో ఉంచి క్రిందికి దిగారు గౌతమ్, శుభాంగి.

దిగగానే చీర కుచ్చెళ్ళు ఒకసారి సవరించుకుంది ఆమె.



"పద" అన్నాడు డోరు లాక్‌చేస్తూ.

క్షణకాలం సంశయించింది ఆమె.

"ఏమిటి ఆగిపోయారు?" అన్నట్లుగా చూశాడు.

"గౌతమ్....నాకు భయంగా వుంది"

చిన్నగా నవ్వాడు గౌతమ్.

"మనం ఏమీ పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళటం లేదు. పద" అని మరో ఆలోచనకు తావు లేకుండా ముందుకు కదిలాడు.

ఒకింత ఇబ్బందిగానే కదిలింది ఆమె కూడా.

హాస్పిటల్ డోరు తెరుచుకుని హాలులో అడుగు పెట్టారు.

"డాక్టర్‌గారు ఖాళీగానే వున్నారు లోపలికి వెళ్ళండి" అన్నాడు అక్కడున్న బోయ్ డోరు తెరుస్తూ.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

ఆ గదిలోకి అడుగుపెట్టగానే ఎ.సి.లోని చల్లగాలి శరీరాన్ని హాయిగా తాకింది.

చైర్‌లో కూర్చుని వాళ్ళ రాకకోసమే ఎదురుచూస్తున్నాడు పరమాత్మ.

"టైమ్ షార్ప్‌గా మెయిన్‌టెయిన్ చేసారే! నువ్వేగా శుభాంగి!" పరిచయానికి తావు ఇవ్వకుండా అన్నాడు పరమాత్మ.

అవునన్నట్లుగా తల ఊపింది శుభాంగి.

"నీ గురించి సుప్రియ తరచుగా చెబుతుంటుంది. కమ్....ఆ ఛైర్‌లో కూర్చో" అన్నాడు తాను ఛైర్‌లో నుంచి లేస్తూ.

గది మధ్యలో ఒక ఈజీ ఛైర్‌లాంటిది వుంది. ఆ ఛైర్ వైపు చూపించాడు పరమాత్మ.

అక్కడికి వచ్చిన ఆమెలో భయం పెరిగింది. సంశయంగా గౌతమ్ వైపు చూసింది.

"చూడమ్మా. నీకు వచ్చిన భయం ఏమీ లేదు. హాయిగా కూర్చో వచ్చు" అన్నాడు ఆమె కొంచెం ఫ్రీగా వుండేందుకు.

ఛైర్‌లో ఒక ప్రక్కగా ఒదిగి కూర్చుంది ఆమె.

ఆమెలోని ఇబ్బందిని గమనించసాగాడు డాక్టర్.

"నేను....బయటికి వెళ్ళాలా!" సంశయంగా అడిగాడు గౌతమ్.

"నువ్వు వెళ్ళవద్దు" అన్నట్టుగా చూసింది శుభాంగి.

"అవసరం లేదు. మీరు ఇక్కడే వుండవచ్చు. ఆ ఛైర్‌లో కూర్చోండి" అంటూ మరో కుర్చీ చూపించాడు గౌతమ్‌కి.

"చూడమ్మా శుభాంగీ....నువ్వు చాలా మంచి పెయింటర్‌వట.... ఏం పెయింటింగ్స్ చేస్తావు?....నాకు పెయింటింగ్ అంటే చాలా ఇష్టమమ్మా. నా చిన్నప్పుడు నా సైకిలుకి పెయింట్ నేనే వేసేవాడిని, మా ఇంటికి పెయింట్ కూడా నేనే చాలాసార్లు వేసా!"

ఫక్కుమని నవ్వింది శుభాంగి ఆ మాటకి.

"లవ్లీ లాఫ్" అనుకున్నాడు గౌతమ్.

డాక్టర్‌లోని సెన్సాఫ్ హ్యూమర్ ఆమెకు నచ్చింది.

ఆ నవ్వటంలో ఆమె తనకు తెలియకుండానే ఛైర్‌లో రిలాక్స్‌డ్‌గా కూర్చుంది.

దానిని గమనించాడు గౌతమ్.

దాదాపుగా పది నిముషాలపాటు అలా సరదాగా మాట్లాడుతూనే వున్నాడు పరమాత్మ.

కారణం....

ఆమెలోని భయం, ఆందోళన, బెదురు పోగొట్టాలని.

"ఓకే....ఇంక ట్రీట్‌మెంట్ మొదలుపెడతాను" అన్నాడు పరమాత్మ.

తిరిగి ఆమె ముఖంలో ఆందోళన చోటుచేసుకుంది.

"డాక్టర్....ట్రీట్‌మెంట్ ఎంత టైము....పట్టవచ్చు?"

"అది నువ్వు అందించే సహకారాన్ని బట్టి వుంటుంది. నువ్వు ఎటువంటి సంకోచాలు లేకుండా సమాధానాలు చెబితే త్వరగానే పూర్తి అవుతుంది."



"ఈ ట్రీట్‌మెంట్ చేస్తున్నప్పుడు నా మెదడుకు నొప్పికాని, బాధగాని వుంటుందా!"

"నథింగ్ ఆఫ్ దట్ టైప్....ముందే చెప్పాకదా!....అటువంటివి ఏవీ వుండవని. ఒక రకంగా చెప్పాలంటే, ఈ అనుభవం నీకు తమాషాగా వుంటుంది. యూ విల్ ఎంజాయ్ ఇట్....మరి స్టార్ట్ చేయనా!"

సరే అన్నట్లు తల ఊపిందామె.

ఆ గదిలో దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లను ఆఫ్ చేశాడు పరమాత్మ.

క్షణకాలం చీకటి అయింది.

ఒకే ఒక లైట్ ఆన్ చేశాడు.

ఆ లైట్ ఒక పెయింటింగ్ మీద ఫోకస్ అయింది.

ఆమె తల తిప్పి గౌతమ్ వైపు చూసి, నువ్వు ఇక్కడే వుండు అన్నట్టుగా సైగ చేసింది.

ఆమె ఎంత ప్రశాంతంగా వుండాలని ప్రయత్నించినా ఒకింత ఆందోళన ఆమె ముడివడిన కనుబొమల రూపంలో వ్యక్తం అవుతూనే వుంది.

"నీ ఎదురుగా ఏం కన్పిస్తోంది శుభాంగీ"

"పెయింటింగ్"

"అందులో ఏమున్నాయి?"

"సముద్రం....నీలిరంగు నీళ్లు....నురగలు కక్కే అలలు....అలల మీద తేలియాడుతున్న తెరచాప పడవ...."

"ఇంకా!"

"నీలాకాశంలో అక్కడక్కడ పలుచని మబ్బులు!"

"ఇంకా?"

"ఇంకేమీ లేదు"

"ఆ దృశ్యం బావుంది కదూ!"

"అవును"

"నీటి మీద తేలే ఆ పడవలో కూర్చోవాలనిపిస్తోంది కదా!"

"అవును"

చాలా మంద్రస్థాయిలో గంభీరంగా వుంది అతని గొంతు. అతని మాటలు, ఆమెను ప్రశ్నించుతున్నట్టుగా లేవు....ఏదో సమ్మోహితురాలిని చేస్తున్నట్టుగా వున్నాయి.

"సముద్రపు అలలమీద నుండి వచ్చే చల్లని గాలి....ఆ అలల మీద అలవోకగా తేలుతున్న పడవ....నువ్విప్పుడా పడవలో నిలబడుతున్నావు. ఆ చల్లని గాలి నీకు కూడా తగులుతోంది....నీ కెంతో హాయిగా వుంది. ఆ గాలితోపాటు మనసు గాలిలో తేలిపోతున్నట్టుంది కదూ!"

"అవును"

"నువ్విప్పుడా పడవలో పడుకుంటున్నావు. అది నీకొక పసిపాప ఊయలలాగ అనిపిస్తుంది. అలల మీద తేలే పడవ, ఊగే ఊయలలాగ వుంటుంది. నీకెంతో హాయిగా వుంటుంది. ఆ చల్లగాలికి నీ కళ్లు మూతపడు తున్నాయి. నీకు నిద్ర వస్తున్నట్టుగా వుంది."

మెల్లగా ఆమె కళ్ళు మూతపడ్డాయి.

ఆమె కుర్చీని సమీపించి దానిని కొంచెం వెనక్కి వాల్చాడు. ఇప్పు డామె హాయిగా పడుకున్న స్థితిలో వుంది.

"నీకు చాలా రిలాక్స్‌డ్‌గా వుంది. ఇప్పుడు నేను నీ నుదుటిని నా వేలితో తాకుతాను. నీ నుదుటి దగ్గర కండరాలు బిగించినట్టుగా వున్నాయి. అంటే నువ్వు టెన్షన్‌లో వున్నావని తెలుస్తోంది.

"యస్....నువ్వు పళ్ళు బిగించడం లేదు....విశ్రాంతిగా వున్నావు"

"ఇప్పుడు నీ మెడలోని కండరాలను రిలాక్స్ చెయ్యి....ప్రయ త్నించు....గుడ్....నీ మెడలోని కండరాలకు టెన్షన్ లేదు"

"నీ భుజాలలోని కండరాలను రిలాక్స్ చెయ్యి....కమాన్ రిలీజ్ యువర్ షోల్డర్ మజిల్స్" ఇలా శరీర కండరాలను వరసగా రిలాక్స్ చెయ్యమని సందేశాలు ఆమెకు ఇవ్వసాగాడు పరమాత్మ.

తొలిసారి చూస్తున్నాడు అటువంటి వ్యవహారం గౌతమ్.

అతనికి ఏంతగా వుంది ఆ తంతు.

రిలాక్స్ చెయ్యమని ఇతను అడగటం....ఆమె చెయ్యటం....

"నీ కుడిచేతి కండరాలు రిలాక్స్ అవ్వాలి...."

ఎడమ చేతి కండరాలు.



పొట్ట భాగంలోని కండరాలు....కాళ్ళు, చివరికి పాదాలు....ఇలా ప్రతికండర భాగంలోని మజిల్స్‌ను రిలాక్స్ చెయ్యమని సందేశాలిస్తున్నాడు పరమాత్మ.

"ఇప్పుడు నీ శరీరం మొత్తం తేలికపడింది. పడవతో పాటు నీ శరీరం కూడా నీటి మీద తేలుతోంది. నీ కెంతో హాయిగా వుంది. నీ కళ్ళు బాగా మూతలు పడుతున్నాయి. నీకు నిద్ర వస్తోంది. గాఢ నిద్ర వస్తోంది. నీ మెదడు మత్తులో మునుగుతోంది....నువ్వెంతో హాయిగా నిద్రపోతున్నావు"

ఆమెలోని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు క్రమబద్ధం అయ్యాయి....ఇప్పు డామె తన ఊపిరి బరువుగా పీల్చుతోంది.

"ఇప్పుడు నేను నీ కుడిచేతిని తాకుతున్నాను. నీ కుడి చేతిని పట్టు కొని పైకి ఎత్తుతున్నాను. నీ చేయి ఇప్పుడు గట్టిగా బిగుసుకున్నట్టు అనిపి స్తోంది. చేయి కదిలించడం అసాధ్యం అనిపిస్తోంది. నీ చేయి ఎంత గట్టిగా మారిందంటే .... నేను నీ చేయి వదిలిన తరువాత కూడా నీ చేయి క్రిందకి పడదు".

ఆమె చేయి అలాగే వుంచింది.

ఆమె చేయి అలాగే వుంచింది.

"ఇప్పుడు నీ చేతిని క్రిందికి దించు"

ఆమె ప్రయత్నించింది. కానీ ఆ చేయి కదలలేదు.

"నేను నీ చేతిని కదిలించబోతున్నాను. కదిలిస్తున్నాను. నీ చేతిని ఒడిలో ఉంచుకో. రెండవ చేతిని కూడా ఒడిలో వుంచు. అరచేతులు ఆకాశం వైపు వుండేలా చేతులు పెట్టు...."

ఆమె రెండు చేతులను ఇప్పుడు ఒడిలో వుంచుకొనగలిగింది.

"ఇప్పుడు నువ్వు హాయిగా నిద్రపోతున్నావు. నా ప్రశ్నలు వింటా వు....వాటికి సమాధానం చెబుతావు....ఈ అనుభవాన్ని నువ్వు చాలా ఎం జాయ్ చేస్తావు."

"అవును" ఆమె మాట నిద్రలో నుంచి వచ్చినట్టుగా వుంది.

అతను తిరిగి తన ఛైర్‌లో కూర్చుంటూ గౌతమ్ వైపు చూసి నవ్వాడు.

"ఎ....లా....వుంది. ఆమె?" టెన్షన్‌గా ఫీలవుతూ అడిగాడు.

"ఫైన్....షి ఈజ్ పెర్‌ఫెక్ట్లీ ఆల్‌రైట్. హిప్నాసిస్‌కి శుభాంగి ఎక్సెలెంట్ సబ్జెక్ట్ అవుతుంది. ఆమె మానసిక పరిస్థితి చాలా సహకరిస్తోంది."

ఒకింత రిలీఫ్‌గా ఫీలయ్యాడు అది విని గౌతమ్.

శుభాంగి వైపు నిశితంగా చూశాడు పరమాత్మ.

చిన్నగా గొంతు సవరించుకుని ప్రారంభించాడు.

"శుభాంగీ.... నీ పేరు.... పూర్తి పేరు ....ఏమిటి?"

"శుభాంగీ పుట్టణ్ణ"

"నీ అసలు పేరు అడుగుతున్నాను"

"శుభాంగీ పుట్టణ్ణ నా పేరు" చాలా ప్రశాంతమైన స్థితిలో సమాధానం ఇస్తోంది ఆమె.

"నిజంగా నీ పేరు అదేనా?"

"అవును."

"మీదేవూరు?"

"బెంగుళూరు."

"ఆలోచించి చెప్పు"

"బెంగుళూరు."

"నీది బెంగుళూరు కాదని, నీ పేరు శుభాంగి కాదని.... నీ తల్లిదండ్రులు మరో ఊరికి చెందిన వాళ్ళని కొందరు అంటున్నారు....నువ్వు విన్నావా?"

"లేదు."

ఆమె సమాధానానికి తెల్లబోయాడు గౌతమ్.

"బాగా ఆలోచించి చెప్పు"

"లేదు."

"నువ్వు అబద్ధం చెబుతున్నావు"

క్షణ కాలం నిశ్శబ్దం....తరువాత అంది "లేదు.... ఆ పేరు వినలేదు"



"నీకు గౌతమ్ అన్న వ్యక్తి తెలుసా?"

డాక్టర్ ప్రశ్నకు శుభాంగి నుంచి ఏ సమాధానం వస్తుందో చూడాలన్న ఆసక్తితో ముందుకు జరిగి కూర్చున్నాడు గౌతమ్.

"తెలుసు"

"బాగా తెలుసా!"

"నాకు మంచి ఫ్రెండ్ కదా!"

"గుడ్ .... అతని నోటి నుంచి నువ్వు మౌనిక అనే పేరు విన్నావా?"

సమాధానం లేదు ఆమె నుంచి.

"శుభాంగి....నా ప్రశ్నకు సమాధానం చెప్పు"

"వినలేదు....అతను ఎప్పుడూ ఆ పేరు నా దగ్గర చెప్పలేదు."

"శుభా....యువార్ టెల్లింగ్ లైస్....నిజం చెప్పు"

"నేను వినలేదు"

"నా దగ్గర అబద్ధం చెప్పలేవు నువ్వు"

"ఆ విషయం నాకు తెలుసు"

"మరి నిజం చెప్పు....మౌనిక పేరు విన్నావా?"

"లేదు."

తెల్లబోయాడు ఆ సమాధానానికి గౌతమ్. ఎంత ఖచ్చితంగా అబద్ధం చెప్పేస్తోంది? అనుకుని అయోమయంగా డాక్టర్ వైపు చూశాడు అతను.

"ఆమె సమాధానాలు సహజమైనవి కాదు గౌతమ్"

"అంటే."

"ఆమె బ్రెయిన్ ప్రోగ్రామ్ చేయబడింది."

"నాకు సరిగ్గా అర్థంకాలేదు."

"ఏమీ లేదు.... కొన్ని ప్రశ్నలకు ఆమె సరైన సమాధానం చెప్పకుండా వుండేలాగ ఆమె మెదడును ఎవరో కంట్రోల్ చేసేశారు."

"బట్ ....ఇప్పుడెలా!" ఆందోళనగా అన్నాడు గౌతమ్.

"ఓపికగా ప్రయత్నించడం ఒకటే మార్గం" అని శుభాంగి వైపు దృష్టి సారించాడు పరమాత్మ.

"శుభాంగీ....నువ్వు ఆందోళన చెందొద్దు....నిజాలు చెప్పు ... నువ్వు చాలా ప్రశాంతంగా వున్నావు. నీకు ఎటువంటి టెన్షన్స్ లేవు .... నువ్వు నాకు అన్నీ నిజాలే చెబుతున్నావు. నువ్వు ఇతరుల మాటలకు రెస్పాండ్ అవ్వొద్దు....ఇప్పుడు....నువ్వు నీ వయస్సు కంటె తక్కువలోకి వెళుతున్నావు. నీ వయస్సు ఇప్పుడు ఇరవై ఆరు.... నువ్వు ఒక్కొక్క సంవత్సరమే వెనక్కి వెడుతున్నావు.... నీ వయసు ఇప్పుడు ఇరవై ఐదు .... ఇరవై నాలుగు.... ఇరవై మూడు...." అలా తగ్గించుకుంటూ పోతూ "ఇప్పుడు నీ వయస్సు పదహారు. అవునా!"

"అవును"

"గుడ్....ఇప్పుడు నువ్వు బెంగుళూరులో వున్నావు."

"బెంగుళూరులో.... మీ ఇంట్లో వున్నావు.... నువ్వు మీ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నావు. మీ అమ్మ నీకు భోజనం అరేంజ్ చేస్తోంది. ఆమె కిచెన్‌లో వుంది అవునా?"

"అవును."

"మీ అమ్మ వండిన వంటకాలు ఏమున్నాయో చెప్పు"

"ఏమీ లేవు"

"పొరపాటు పడుతున్నావు. సరిగ్గా చెప్పు....మీ అమ్మ వంటకాలు అన్నీ టేబుల్ మీద అరేంజ్ చేసింది. జాగ్రత్తగా చూసి చెప్పు ఏమున్నాయ్?"

"ఏమీ లేవు"

"మీ అమ్మ పేరేమిటి?"

"అపర్ణ"

"మీ నాన్న పేరు?"

"పుట్టణ్ణ"

"మీ అమ్మ ఎలా వుంటుంది?"

"అందంగా వుంటుంది."

"అందంగా అంటే....ఆమె కళ్ళు ఎలా వుంటాయి. రూపురేఖలు ఎలా వుంటాయి?"



".... .... ...."

"పోనీ ఎంత ఎత్తు వుంటుంది?"

".... .... ...."

"మీ అమ్మ వంట బాగా చేస్తుందా?"

"తెలియదు."

"మీ అమ్మ నీ కోసం రోజూ ఒక స్వీట్ తయారు చేసేది.... అదేమిటి?"

"గుర్తులేదు."

"మీ అమ్మ ఉద్యోగం చేసేదా!"

"తెలియదు."

"మీ అమ్మ పుస్తకాలు చదివేదా!....సినిమాలు చూసేదా!"

"తెలియదు. తెలియదు."

"నీ కన్న తల్లిగురించి నీకు ఏ మాత్రం తెలియదా! ఆశ్చర్యంగా వుందే! నీకు తెలుసు....అబద్ధం చెబుతున్నావు."

"నాకు నిజంగానే తెలియదు" అసహనంతో ఆమె నుదుటి మీద గీతలు తిరిగి కనిపించాయి. ఆమె చేతులు ఇప్పుడు ఒడిలో లేవు. ఆమె కూర్చున్న చైర్ అంచులను పట్టుకుని ఉన్నాయి.

ఆమెలో మార్పు గమనించి ఒకింత ఆందోళన చెందాడు గౌతమ్.

"ఓ.కే....కూల్ డౌన్....రిలాక్స్....విశ్రాంతి తీసుకో....నిద్రపో ....హాయిగా నిద్రపో. నిన్ను ఎవరూ డిస్టర్బ్ చేయరు. నీ తండ్రి పేరు పుట్టణ్ణ కాదు, నీ తల్లిపేరు అపర్ణకాదు. నువ్వు డైనింగ్ టేబుల్ దగ్గర లేవు. అదంతా కల్పనా, అబద్ధం. కేవలం నిన్ను టెస్ట్‌చేయటానికి అడిగిన ప్రశ్నలు....అది నిజమయితే నీ తల్లి ఎలా వుండేదో....ఆమె ఇష్టాఅయిష్టాలు అన్నీ ఖచ్చితంగా చెప్పగలిగే దానివి. నీ మెదడు ఎవరో కంట్రోల్ చేశారు. అందుకే నువ్వు నీ తల్లిదండ్రుల గురించి చెప్పలేకపోతున్నావు.

"నీకు తెలిసిన నిజాలు వేరే ఉన్నాయి. అవి గుర్తుతెచ్చుకునే ప్రయత్నం చెయ్యి....నువ్వు నిజంగా ప్రయత్నించితే తప్పక చెప్పగలవు

బాగా ఆలోచించు రిలాక్స్‌డ్‌గా ఆలోచించు ....నీ వయస్సు ఇప్పుడు పదహారు....ఇప్పుడు నువ్వు ఎక్కడున్నావు''

"నేను....నేను ఒకగదిలో వున్నాను''

"ఏంచేస్తున్నావు?''

"పడుకొని వున్నాను''

"ఎక్కడ?''

"బెడ్ మీద పడుకొని ఉన్నాను''

"ఏం చేస్తున్నావు?''

"ఏమీ చేయటం లేదు. నాకు భయంగా వుంది. నన్నెవరో ఏదో చేయబోతున్నారు''

"సరిగ్గా చెప్పు?''

"నా వంటి మీద దుస్తులు లేవు. నేను నగ్నంగా వున్నాను. నా కాళ్ళు చేతులు కట్టివేయబడి వున్నాయి. నన్ను ఎవరో ఏదో చేయబోతున్నారు'' ఆమె గొంతు వణుకుతోంది.

"ఆ గదిలో ఏమున్నాయి?''

"టేబుల్ వుంది. దానిమీద ఏవేవో బాటిల్స్ వున్నాయి. ఇంజెక్షన్ సిరెంజిలు ఉన్నాయి''

"ఇంకా''

"గదంతా స్పిరిట్ వాసన వస్తోంది. అమోనియా వాసన వస్తోంది.... నాకు కడుపులో తిప్పుతోంది.''

"నువ్వు చెప్పేది నిజం....ఇంకాచెప్పు....ఆ గదిలో ఎవరున్నారు? ఏం జరగబోతోంది?''

సమాధానం చెప్పలేదు ఆమె.

ఆమె పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

తల విదిలించినట్టుగా చేసింది.

నాలుకతో పెదవులు తడి చేసుకుంది.

ఆమె నోటి నుంచి చిన్న గురక వంటి శబ్దం రాసాగింది.

తల గుండ్రంగా తిప్పసాగిందామె.



అదిరిపడ్డాడు ఆమె ప్రవర్తనకి గౌతమ్.

"బ్రేవ్'' మని వికృతమైన తేన్పు ఆమె నోటినుండి వచ్చింది.

ఒక్కసారిగా తల పక్కకి వాల్చి గిలగిల కొట్టుకోసాగింది.

ఆమెకు శ్వాస అందటం లేదు.

"డాక్టర్....ఆమెకు శ్వాస అందటంలేదు....మైగాడ్....ఆమె చనిపోతుందేమో!'' దాదాపుగా అరచినట్టు అని ఒక్క ఉదుటున చైర్లో నుంచి లేచి ఆమెను సమీపించాడు గౌతమ్.

డాక్టర్ మాటకి ఆగిపోయాడు గౌతమ్.

నిస్సహాయంగా ఆమె వైపు చూస్తుండిపోయాడు గౌతమ్

కళ్ళు మూసుకునే గిలగిలా కొట్టుకుంటోంది ఆమె.

ఆమెను పరిశీలనగా చూస్తున్నాడు డాక్టర్.

ఆమె నోటినుంచి ఈలలాంటి శబ్దం వస్తోంది. విపరీతమైన వేగంతో తల అటూ ఇటూ కదలిస్తోంది.

"డాక్టర్... ఆమెకు ఏదో అయిపోతోంది....ప్లీజ్....ఆమెను రక్షించండి''

మాట్లాడవద్దన్నట్లు తీవ్రంగా చూశాడు గౌతమ్ వైపు డాక్టర్.

ఆమె కళ్ళు ఉబ్బినాయి. ముఖం అంతా ఎర్రగా అయిపోయింది. పెదవులు ఎండినట్లు అయ్యాయి.

"శుభాంగీ....నువ్వు రిలాక్స్‌డ్‌గా ఉంటావు....నీ మనస్సు ప్రశాంతంగా వుంటుంది. నీలో ఆందోళన వద్దు....కంట్రోల్ యువర్ సెల్ఫ్.... నీలోని టెన్షన్ అంతా పోతోంది....నీకు శ్వాస పీల్చడంలో చిన్నఇబ్బంది వచ్చింది అంతే. ఇప్పుడా ఇబ్బంది తొలగిపోతుంది. నీ శరీరం తిరిగి మామూలుస్థితికి వస్తోంది. నీకు ఊపిరి తీసుకోవట లో ఎటువంటి ఇబ్బందీ లేదు. నువ్వు మామూలుగా ఊపిరి పీల్చుతున్నావు....అదీ ....అలా.... మెల్లగా ఊపిరి పీల్చాలి....నీ శరీరం మళ్ళీ నీటి మీద తేలిపోతోంది. మనస్సు ప్రశాంతంగా వుంది. నీకు నిద్రవస్తోంది. నువ్వు ప్రశాంతంగా నిద్రపోతున్నావు.''

అతని మాటలు ఆమె మీద ఖచ్చితంగా పనిచేశాయి.

ఆమె ముఖంలో తిరిగి పాత రిలీఫ్ చోటు చేసుకుంది శ్వాస మామూలుగా తీసుకోసాగింది.

"డాక్టర్....ఏమయింది ఆమెకు? ఎందుకలా అయింది? అయోమయంగా అడిగాడు గౌతమ్.

సమాధానం చెప్పలేదు డాక్టర్.

శుభాంగి నుదుటి మీద చూపుడు వేలు వుంచాడు డాక్టర్.

"శుభా....నా మాట నీకు వినిపిస్తోంది కదూ!"

"అవును" గొణిగినట్టు వచ్చింది జవాబు.

"నీకు ఇప్పుడు ఏమయిందో తెలుసా!" "తెలియదు"

"నీకు శ్వాస తీసుకోవటంలో సమస్య వచ్చింది. దానిని నేను ఇప్పుడు సరి చేస్తున్నాను. నీకు ఇంక అటువంటి సమస్య రాదు. ఒకవేళ తిరిగి అటువంటి సమస్య ఎదురయినా నువ్వు దానిని కంట్రోల్ చేసుకోవాలి."

"నా వల్ల కాదు డాక్టర్"

"నువ్వు చేయగలవు. ఇది నీకు స్వతహాగా శ్వాస పీల్చడంలో వచ్చిన సమస్య కాదు. కేవలం సృష్టించబడినది. కొందరు వ్యక్తులు నీ మీద పోస్ట్ హిప్నాటిక్ సజెషన్స్ ఇచ్చారు. కొన్ని ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పకుండా వుండటంకోసం వాళ్ళు చేసిన పనే ఇది. నిన్ను తరచి ప్రశ్నించకుండా వుండడానికి చేస్తున్న ప్రయత్నం ఇది. కాబట్టి మానసికంగా నువ్వు నిబ్బరంగా వుంటే, వాళ్ళ ప్రయోగం నీ మీద పని చెయ్యదు మానసిక ధైర్యం పోగొట్టుకోకుండా వుంటావా?"

"వుంటాను" చెప్పింది ఆమె.

రిలీఫ్‌గా ఫీలయి తిరిగి తన సీట్లో కూర్చున్నాడు డాక్టరు పరమాత్మ.

గౌతమ్ మాత్రం తిరిగి తన ఛైర్‌లో కూర్చోలేకపోయాడు. అతని దృష్టి శుభాంగి మీదే వుంది.

"డాక్టర్....ఈమె ఈ హిప్నాసిస్‌ని తట్టుకోలేదేమో!...." ఒకింత సందేహం వ్యక్తం చేశాడు గౌతమ్



"నథింగ్ టు వర్రీ....షి ఈజ్ పెర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ అని శుభాంగి వైపు దృష్టి సారించాడు.

ఆమె ముఖంలో ప్రశాంతత చోటుచేసుకుంది.

"శుభా....నువ్వు గదిలో బెడ్ మీద పడుకొని వున్నావు. నీ ప్రక్కన టేబుల్ మీద ఇంజెక్షన్ బాటిల్స్ వున్నాయి. గదిలో అమోనియా సిరిట్ వాసన వస్తున్నాయి. అవునా?"

"అవును"

"నీ వంటి మీద దుస్తులు లేవు"

"అవును"

"నీ మనస్సు ప్రశాంతంగా వుంది. ఎటువంటి ఒడిదుడుకులకులోను కాదు" మరోసారి ఆమె బ్రెయిన్‌ని కాషన్ చేశాడు.

"ఇప్పుడు చెప్పు....ఇంకేం కనిపిస్తోంది నీకు"

"ఎక్కడ?"

"రూమ్‌లో"

"టేబుల్ మీద ఏవో పెద్ద బాటిల్స్ కూడా వున్నాయి. యాపిల్స్ కూడా వున్నాయి"

"ఇంకా?"

"అదేదో మెషిన్ వుంది"

"ఏమిటది?"

"తెలియదు. హార్ట్ పేషెంట్స్ దగ్గర వుండే ఎలక్ట్రో ఎన్సెఫాలోగ్రాఫ్ ఎక్విప్‌మెంట్ లాగ వుంది.

"అది నీ శరీరానికి కనెక్ట్ అయి వుందా"

"అవును"

"ఇంకేం వున్నాయి?"

"ఒక ఇంజక్షన్ సిరంజి వుంది. నాకు అదంటే అసహ్యం"

"ఎందుకు?"

"ఎందుకంటే....ఒంటిచేతి వ్యక్తి నన్నుఆ సూదితో హింసిస్తాడు"

ఇంకేమున్నాయి ఆ గదిలో....

"ఏమీ లేవు"

"సరిగ్గా చూడు"

"ఒక కిటికీ వుంది."

"గుడ్....దాని తలుపులు తెరిచి వున్నాయా, మూసి వున్నాయా?"

"తెరిచి వున్నాయి"

"కిటికీ బయట ఏముంది?"

ఆమె మాట్లాడ లేదు.

"శుభా....జాగ్రత్తగా విను....కిటికీ బయట ఏం కనిపిస్తోంది?"

"...."

"నా మాట నీకు వినిపిస్తోందా?"

"వినిపిస్తోంది"

"చెప్పు కిటికీ బయట ఏం కనిపిస్తోంది?"

ఆమె ముఖం అసహనంగా మారింది. స్వరం కర్కశంగా మారింది.

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్...థర్టీ సిక్స్"

అదిరిపడ్డాడు ఆమె సమాధానం విని గౌతమ్.

"శుభా....నిన్ను నేను అడిగే ప్రశ్న విను....కిటికి బయట ఏం కనిపిస్తోంది?"

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్...థర్టీ సిక్స్"

"డాక్టర్....ఆ మాటలు నేను విన్నాను" వెంటనే అన్నాడు గౌతమ్

"ఏ మాటలు..." అర్థంకాక అన్నాడు పరమాత్మ.

"ఇంతకు ముందు ఈ మాటకి ఈమె చాలా తీవ్రంగా రియాక్ట వటం నేను మూడు నాలుగుసార్లు చూశాను" అని, అంతకుముందు జరిగిన సంఘటనల్లో ఆమె ప్రవర్తనను డాక్టర్‌కి త్వరత్వరగా చెప్పాడు గౌతమ్.

"శుభా....నువ్వు చాలా ప్రశాంతంగా వున్నావు....జాగ్రత్తగా విను, కిటికీ బయట నీకు ఏం కనిపిస్తోంది?" అడిగాడు డాక్టర్.

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్...థర్టీ సిక్స్

అదే సమాధానం ఆమె నోటి వెంట.

"శుభా....లిజన్ టు మి కేర్‌ఫుల్లీ"

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్...థర్టీ సిక్స్"



"మైగాడ్....నేను అడిగేది ఒకటి. ఈమె చెప్పేది మరొకటి. అంటే ఆ వ్యక్తులు రెండోసారి ఆమె మెదడును కంట్రోల్ చేశారు. మొదటిసారి శ్వాస తీసుకోవటంలో సమస్య సృష్టించి వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఆమె మెమొరీని బ్లాక్ చేశారు. ఇప్పుడు ఏం చెయ్యాలి?....పరిస్థితి విషమించిందే!" నిస్సహాయంగా చూస్తూ అన్నాడు డాక్టర్.

ఆ మాటలకి గౌతమ్ వెన్నులో నుండి పురుగు పాకినట్లయి భయంతో ఒళ్ళు జలదరించింది.

o o o

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్...థర్టీ సిక్స్"

"శుభా....నేను మాట్లాడేది నీకు వినిపిస్తోందా?" అడిగాడు పరమాత్మ.

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్... థర్టీ సిక్స్"

కళ్ళు మూసుకుని జుట్టులోకి వేళ్ళు పోనించి తల పట్టుకున్నాడు గౌతమ్. అతనికి అంతా గందరగోళంగా వుంది. ఇంతకుముందు ఒకసారి ఎడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ వ్యక్తి ఇదే మాట అంటే అతని చెంప పగిలేలా కొట్టింది. తనూ అదే మాట అంటే కొన్ని రోజులపాటు ముఖం కూడా చూడలేదు. ఇప్పుడు ఆమె అదే మాట అంటోంది. ఏమిటి ఆ మాట?.... ఎందుకంటోంది?

"శుభా....నిన్ను నేను ఏ నిజాలు చెప్పమని అడగడం లేదు. మరే రహస్యాలూ చెప్పమనడంలేదు. నా మాట వింటున్నావా లేదా అని మాత్రం అడుగుతున్నాను. దానికి సమాధానం చెప్పు చాలు"

"చెబుతాను"

"అయితే చెప్పు...." అతని మాట ఇంకా పూర్తి కాలేదు.

"థర్టీ సిక్స్...ట్వంటీ ఫోర్... థర్టీ సిక్స్"

"ఓగాడ్...." తల పట్టుకున్నాడు డాక్టర్ పరమాత్మ కూడా.

"సర్... ఆ మాట.... ఎందుకు.... అన్నిసార్లు రిపీటెడ్‌గా అంటోంది?.... మీరడిగే ప్రశ్నకు, ఆ జవాబుకు ఏ మాత్రం పొంతన లేదు. ఆమె మెంటల్‌గా సరిగానే వుందా? లేక ఏమయినా పిచ్చెక్కిందా?" అయో

మయంగా అడిగాడు గౌతమ్.

ఎండిపోయినట్టు అయిన నోటిలో గ్లాసుడు నీళ్ళు పోసుకుని గడగడా తాగేశాడు పరమాత్మ.

గ్లాసు టేబుల్ మీద వుంచి గౌతమ్‌ని చూశాడు.

"ఈమె.... మానసిక స్థితి సరిగ్గానే వుంది. బట్.... ఆ వ్యక్తులు ఉపయోగించిన రెండో ఆయుధం ఇది. మొదటగా ఆమె శ్వాస పీల్చుకోలేకుండా సమస్య సృష్టించారు. ఇప్పుడు.... ఇలా ఒక కొత్త మాట పలికించుతున్నారు."

"అంటే.... ఇదీ ఒక రకమైన లాక్ సిస్టం లాంటిది. ఆమె మెమొరీని బ్లాక్ చేస్తున్నారు. ఆమె జ్ఞాపకశక్తిని ఒకరకమైన కోడ్‌వర్డ్‌తో అడ్డుకుంటున్నారని నా అనుమానం"

"అయి వుండవచ్చు"

"మరి.... ఇంతకు చాలా రోజుల ముందే ఆమె ఆ మాట వింటే అసహ్యించుకునేది. దానికి దీనికి ఏమయినా సంబంధం వుందా?"

"ఉండవచ్చు.... ఆమె జ్ఞాపక శక్తిని చాలాకాలం క్రిందటే బ్లాక్ చేసేసి వుండచ్చు. అందుకొరకు ఆ మాట ఉపయోగించి వుండవచ్చు."

"ఇప్పుడు మరి ఏం చెయ్యాలి?"

"దట్స్ వాట్ అయాం థింకింగ్. ఈ కోడ్ వర్డ్‌తో ఆమె జ్ఞాపకాలకు అడ్డుకట్ట వేసేసారు. దానిని ఛేదించితేనే కాని ఆమె జ్ఞాపకాలు గతంలోకి వెళ్ళవు"

"అడ్డుకట్టని ఛేదించాలా! ఇదేమైనా గోడా, తలుపా పగులగొట్టి లోపలికి ప్రవేశించడానికి అయినా కోడ్‌వర్డ్‌తో జ్ఞాపక శక్తికి అడ్డుకట్ట వెయ్యడం ఏమిటి? వింతగా వుంది డాక్టర్"

"ఇది వింతగానే వుంటుంది. కానీ సాధ్యం.... ఆమె జ్ఞాపక శక్తికి అదృశ్య రూపంలో ఒక గోడ కట్టినట్లే ...ఇప్పుడు దానిని ఛేదించే ప్రయత్నం చేస్తాను."

సాధ్యమా?"

"చూద్దాం" అని శుభాంగి వైపు తిరిగాడు పరమాత్మ.



వీళ్ళ మాటల్తో సంబంధం లేనట్టుగా నిశ్చలంగా కుర్చీలో వెనక్కివాలి వుంది శుభాంగి.

"శుభా.... నీ మనస్సు ప్రశాంతంగా వుంది. నీకూ ఏ టెన్షనూ లేదు. నువ్వు చాలా రిలాక్స్‌డ్‌గా వున్నావు. నువ్వు హాయిగా నిద్రలో వున్నావు. అవునా?"

"అవును" చెప్పిందామె.

"నీ మీద ఏ వ్యక్తుల ప్రభావమూ లేదు. నీ జ్ఞాపకశక్తికి ఎవరో అడ్డుకట్ట వేశారు. అది ఒక బండరాయిలాగా అడ్డంగా వుంది. దానిని నువ్వు తొలగించాలి. అందుకుగాను ఆ బండరాయిని నీ చేతులతో పట్టుకో ...." హిప్నాసిస్ మొదలు పెట్టాడు.

చేతులు రెండూ గాలిలోకి ఎత్తి ఏదో వస్తువు పట్టుకున్నట్టుగా చేసిందామె.

"ఇప్పుడా రాళ్ళని శక్తి కొద్దీ దూరంగా తోసివేయి. నీ జ్ఞాపక శక్తికి ద్వారాలు తెరుచుకుంటాయి"

ఆమె తన రెండుచేతులతో ఏదో వస్తువును ప్రక్కకు జరుపుతున్నట్టుగా చేతులు కదల్చసాగింది. ఏదో ఒక బరువైన వస్తువును ప్రక్కకు దొర్లిస్తున్నట్టుగా ఒక రకమైన స్ట్రెయిన్ ఆమె ముఖంలో కదలాడింది.

"ఆ రాతిని ప్రక్కకు నెట్టేశావా?"

'అవును' అన్నట్లుగా తల ఆడించింది ఆమె.

"గుడ్ ....ఇప్పుడు నీ జ్ఞాపక శక్తికి అడ్డుగా నిలిచిన ఆ గోడ పోయినట్టే కదా?"

"అవును"

"ఇప్పుడు నాకు సరి అయిన సమాధానం చెప్పగలవు కదా"

"అవును"

'థాంక్ గాడ్' అనుకున్నాడు గౌతమ్.

గొప్ప రిలీఫ్‌గా అనిపించింది పరమాత్మకి కూడా.

"గుడ్ ....ఇప్పుడు నువ్వు నాకు జవాబు చెబుతున్నావు. నీ మనస్సు

ప్రశాంతంగా కూడా వుంది. నువ్వు గదిలో బెడ్ మీద వున్నావు. గదిలో స్పిరిట్ వాసనలు, అమోనియా వాసనలు వస్తున్నాయి. అవునా?''

"అవును''

"గదిలో ఒక కిటికీ వుంది కదా?''

"అవును''

"ఆ కిటికీ తెరిచి వుంది కదా?''

"అవును''

"కిటికీ లోంచి పరిశీలనగా చూడు. ఏం కనిపిస్తోంది?''

"థర్టీ సిక్స్....ట్వంటీఫోర్....థర్టీ సిక్స్''

తల తిరిగి పోయింది ఆ సమాధానం విన్న ఇద్దరికీ.

అలసటగా చైర్‌లో చతికిలపడిపోయాడు డాక్టర్.

కొద్ది నిముషాల పాటు ఆయన అలాగే వుండిపోయాడు.

కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు అతని ముఖంలో

"డాక్టర్.... మనకిమార్గం....'' గొంతు పెగల్చుకున్నాడుగౌతమ్.

"మామూలుగా ఏదయినా కూడా ఈ హిప్నోసిస్‌కి లొంగాలి. కానీ ....ఇప్పుడు మాత్రం ఇది హిప్నోసిస్‌కి లొంగటం లేదు. ఇంత స్ట్రాంగ్‌గా అమె మెమొరీని బ్లాక్‌చేసిన ఆ వ్యక్తుల మేధా శక్తికి ఆశ్చర్యపోతున్నాను. వాళ్ళెవరో కానీ మాస్టర్స్!

"బ్లాక్ ఆయిన ఆమె జ్ఞాపకశక్తిని చెదించడానికి చాలా పద్దతులున్నాయి నా దగ్గర. కానీ అవేవీ పని చేస్తాయని నేను అనుకోను''

"మరి ఇంకేం చెయ్యలేమా?'' ఒకింత నిర్లిప్త ధోరణిలో అన్నాడు గౌతమ్.

ఒక సారి భారంగా శ్వాస తీసుకున్నాడు డాక్టర్.

ఇంక రెండే మార్గాలు మిగిలాయి'' అన్నాడు డాక్టర్.

"ఏమిటి అవి?''

"ఒకటి....ఇలా రోజుల తరబడి హిప్నోసిస్ చేస్తూపోవటమే..... కొన్నాళ్ళకి ఆ బ్లాక్ తప్పక బ్రేక్ అవుతుంది.''

"అంటే ఎన్ని రోజులు పట్టవచ్చు.



"రోజులలో అవకపోవచ్చు. సంవత్సరాలు పట్టవచ్చు. అది ఇప్పుడు సాధ్యం కాదు.''

"మరి రెండో మార్గం ఏమిటి?''

"ఇప్పుడు మనం ఉపయోగించింది ఈ "థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్'' అన్నది ఒక కోడ్ వర్డ్. దానికి ఆన్సర్ కోర్డ్ వర్డ్. ఒకటి మనం ఆమె మెదడుకు చెప్పుకుంటే....ఆ లాక్ విడిపోయేఅవకాశంవుంది''

ఈ కోడ్‌వర్డ్‌కి జవాబుగా మరో కోడ్‌వర్డ్ కావాలా?''

"అవును''

"అందులో అసలు కోడ్ ఏముంది? "థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్'' అంటే ఖచ్చితమైన శరీరసౌష్టవానికి కొలతలు. ముప్పైఆరు అంగుళాలు ఛాతీ కొలత, ఇరవై నాలుగు అంగుళాల నడుము కొలత, ముప్పైఆరు అంగుళాల పిరుదుల కొలత ఉన్న స్త్రీలు అరుదు. అలా ఖచ్చితమైన అందాలున్న వాళ్ళని, మిస్ ఇండియాలుగా, మిస్ వరల్డ్‌గా ....సెలక్ట్ చేస్తారు. అంతే ...అందులో కోడ్ ఏ ముంది? రహస్యం ఏముంది?''

"ఏముందనే విషయం నేను ఇప్పుడు ఏమీ చెప్పలేను. ఇదిమాత్రం రెండు ముక్కలుగా ఉన్న పజిల్. అందులో ఒకటి ఆమె దగ్గర ఉంది. దానికి రెండోమాట మనం కనుక్కోవాలి''

"అదే ఎలా?''

"ఇంకొకసారి ప్రయత్నించుతాను. అదృష్టం బావుండి జ్ఞాపకశక్తికి అడ్డుపడిన ఆ గోడ తొలుగుకుందేమో'' అని తిరిగి హిప్నోసిస్ ప్రారంభించాడు.

నిమిషాలు గడుస్తున్నాయి

అదే సమాధానం ఆమె నుండి.

ఇంక వాళ్ళ మాటలు వినటం మానేశాడు గౌతమ్.

"థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్‌కి మరో కోడ్ వర్డ్ ఏముంటుంది....'' రెండు కళ్ళు మూసుకుని దీర్ఘాలోచనలో పడ్డాడు అతను.

అరగంట పైగా గడిచింది.

ఆమె నుండి అదే సమాధానం.

"థర్టీసిక్స్....ట్వంటీఫోర్....థర్టీ సిక్స్"

"డాక్టర్....మీరు వృధా ప్రయత్నం చేస్తున్నా రేమో" అన్నాడు చివరికి గౌతమ్.

"ప్రయత్నం ఎప్పుడూ వృధాకాదు. బట్....ఈ రోజుకి ఆపివేద్దాం. మళ్ళీ రేపు ప్రయత్నం చేద్దాం" అన్నాడు డాక్టర్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో.

డాక్టర్‌కున్న సహనానికి, ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్యం వేసింది గౌతమ్‌కి.

నిద్రావస్థలో ఉన్నట్టుగా ఉన్న శుభాంగిని, తిరిగి మామూలు స్థితికి తీసుకువచ్చేసాడు పరమాత్మ.

ఆమె ముఖం అలసిపోయినట్టుగా నీరసంగా కనిపించింది.

"మీరు వెళ్ళండి .. రేపు సాయంకాలం మళ్ళీ రండి" అన్నాడు పరమాత్మ.

"అలాగే" అని ఆమె చేయి అందుకుని బయటికి నడిచాడు గౌతమ్.

"ఇంతసేపూ ఏం జరిగింది గౌతమ్....నా చేత ఏం మాట్లాడించారు? నేను ఏం చెప్పాను?" పట్టలేని ఆసక్తితో అంది శుభాంగి.

"థర్టీ సిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్" అంటూ జవాబు ఇచ్చాడు ఎటో చూస్తూ గౌతమ్.

o o o

ఆ రోజు ఆదివారం....

సాదారణంగా ఆదివారంనాడు పరమాత్మ హాస్పిటల్‌కు రాడు.

కానీ ఆ రోజు వస్తున్నాడు.

కారణం....శుభాంగిని ఆ రోజు మరోసారి హిప్నోసిస్‌ద్వారా నిజం చెప్పించే ప్రయత్నం చెయ్యాలి. మధ్యాహ్నం మూడు గంటలకే రమ్మని చెప్పాడు వాళ్ళని.

అప్పుడు టైం మూడు ఐదు అయింది.



అంటే ఏ నిమిషంలో అయినా వాళ్ళు వచ్చే ఛాన్స్ ఉంది.

ఈరోజు ఏమయినా ప్రగతి సాధించగలనో! లేదో!....ఆ కోడ్ వర్డ్‌కి సూట్ అయ్యే సెకండ్ కోడ్ వర్డ్స్ ఇవ్వాళ రకరకాలుగా ప్రయత్నించాలి— అని తీవ్రంగా ఆలోచిస్తోంది పరమాత్మ మేధస్సు.

ఇది చాలా జటిలమైన కేస్ అనిపిస్తోంది.

అదృష్టం బావుంటే మెమొరీ బ్లాక్ త్వరగా బ్రేక్ అవొచ్చు. లేకుంటే సంవత్సరాలే పట్టచ్చు.

"మే ఐ కమిన్ సార్' గౌతమ్ మాట వినిపించి తల ఎత్తాడు పరమాత్మ.

"హలో....కమిన్" అన్నాడు వాళ్ళని చూస్తూ.

ఆ రోజు శుభాంగి ముఖం చాలా ఫ్రెష్‌గా అనిపించింది పరమాత్మకి.

"ఏం శుభా... ఎలా వున్నావు?"

"ఫైన్ డాక్టర్....నిన్న జరిగిన విషయం అంతా నాకు గౌతమ్ చెప్పాడు. నాకంతా వింతగా వుంది."

"ఇట్సాల్‌రైట్. అలా కూర్చో" చైర్ చూపించాడు.

ఆమె కూర్చుంది.

"డాక్టర్.... ఒక్క విషయం" అంది.

ఏమిటన్నట్లు చూశాడు.

"మీకు కావలసిన వివరాలు నేను నిన్న చెప్పలేదట. గౌతమ్ చెప్పాడు. నాకు అన్నీ నిజాలు చెప్పాలనే వుంది డాక్టర్. కానీ అలా ఎందుకు జరిగిందో....మీకు కావలసిన నిజం నేను ఎందుకు చెప్పలేదో నాకు తెలియదు. నేను కావాలని అబద్ధాలు అయితే చెప్పట్లేదు" నన్ను నమ్మండి అన్నట్టుగా చెప్పిందామె.

ఆమె మాట తీరుకి నవ్వు వచ్చింది పరమాత్మకి.

"ఇట్సాల్‌రైట్....కళ్ళు మూసుకోమ్మా" అన్నాడు.

"డాక్టర్....మీరు ...గౌతమ్ కూడా నా గురించి చాలా కష్టపడుతున్నారు. మిమ్మల్ని అందర్ని నేను చాలా ఇబ్బంది పెడుతున్నాను.

నన్ను క్షమించండి! అసలు నేను ఎవరి కూతురిని అయితే ఏమిటి డాక్టర్. నేను పుట్టణ్ణ కూతురినా, జైసింగ్ షకావత్ కూతురినా తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు లేదు. నా ఊరు బెంగుళూరా, ఢిల్లీనా అని తెలుసుకోవాలన్న కుతూహలం కూడా నాకు లేదు. అయామ్ వెరీ హేపీ టు బి కాల్డ్ శుభాంగి. నాకీ జీవితం బాగానే వుంది'' ఇంకా ఏదో అనబోయింది.

''షటప్....ఈ విషయం వెనుక చాలామంది హస్తం ఉన్నట్టుగా నమ్మకంతో ఉన్నాను నేను. వాళ్ళు నిన్ను ఇలా మానసికంగా కృంగదీసి పిచ్చిదాన్ని చేస్తారో, ఏదో ఒక రోజు చంపేస్తారో తెలియదు. మరి వాటికి సిద్ధం అవుతావా?'' తీవ్ర స్వరంగా అన్నాడు గౌతమ్.

''గౌతమ్.. ప్లీజ్ కీప్ క్వయిట్. ఏమీ మాట్లాడవద్దు. శుభా.... టేకిట్ ఈజీ....'' అంటూ తిరిగి హిప్నోసిస్ ప్రారంభించాడు.

''నీ మనస్సు ప్రశాంతంగా వుంది. ఆ గదిలో నువ్వు ఒంటరిగా వున్నావు. నీ శరీరం కట్టివేయబడి వుంది. అక్కడ అమోనియా, స్పిరిట్ వాసనలు వస్తున్నాయి. గదికి ఒక కిటికీ వుంది. కిటికీ బయట ఏం కనిపిస్తోంది?''

ఆమె నుండి సమాధానం రాలేదు.

''శుభా....చెప్పు నీకు ఏం కనిపిస్తోందో....భయపడవద్దు'' మళ్ళీ అడిగాడు.

నిజానికి ఆ రోజు ఆమెను మానసికంగా ప్రిపేర్ చేయటానికి చాలా టైమ్ తీసుకున్నాడు పరమాత్మ. చాలా రిలాక్స్‌డ్ కండిషన్‌లో ఆమెను ఉంచి హిప్నోసిస్ ద్వారా ప్రయత్నించుతున్నాడు.

మౌనంగా ఉందామె.

''శుభా....కెన్ యు లిజన్ టు మి?....నా మాట వినిపిస్తోందా?''

''వినిపిస్తోంది.''

''మరి చెప్పు... నీకేమీ భయంలేదు. కిటికీ బయట నీకేం కనిపిస్తోంది?''

''థర్టీ సిక్స్....ట్వంటీఫోర్... థర్టీ సిక్స్...''



అది పరమాత్మ ఊహించిన సమాధానమే.

దానికి చెప్పవలసిన రెండవ కోడ్ వర్డ్ కూడా ప్రిపేర్ అయి వున్నాడు అతను. వెంటనే అన్నాడు....

''మిస్ ఇండియా! డూ యూ నో మిస్ ఇండియా?'' అన్నాడు.

ఆమెలో మార్పులేదు. నిశ్చలంగా కళ్ళు మూసుకుని వుంది.

''శుభా....కిటికీ అవతల నీకేం కనిపిస్తోంది?''

''థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్''

అంటే....కోడ్‌వర్డ్‌లో రెండవ భాగం మాట ఇది కాదన్నమాట.

''మిస్ యూనివర్స్....డూ యూ నో మిస్ యూనివర్స్ తెలుసా?'' అడిగాడు.

''పోనీ నీకు తెలిసినది చెప్పు''

''థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్''

''సార్....అటువంటి కోడ్ వుండకపోవచ్చు. మీ ప్రయత్నం చేస్తున్నారు కానీ....'' అన్నాడు గౌతమ్.

మాట్లాడవద్దన్నట్టుగా సైగ చేశాడు పరమాత్మ.

''శుభా....నువ్వు రిలాక్స్‌డ్‌గా వున్నావా?'' అడిగాడు.

''ఉన్నాను''

''థర్టీసిక్స్ ట్వంటీఫోర్ థర్టీసిక్స్ అంటే ఏమిటి?''

''........''

''తెలియదా?''

''........''

''నేను చెప్పనా?''

''చెప్పండి''

''ఫెంటాస్టిక్ ఫిగర్. అవునా?''

''తెలియదు'' మెల్లగా అంది ఆమె.

ఇదీ కాదు....ఇంకేమయి వుంటుంది? ...ఇది అందానికి సంబంధించిన కోడ్ కాదేమో ఇంకేం అయి వుండవచ్చు?

అంతలో ఒక అయిడియా వచ్చింది గౌతమ్‌కి.

"త్రీ ఇయర్స్, టు ఇయర్, త్రీ ఇయర్స్ అయి వుండవచ్చు డాక్టర్" అన్నాడు.

కళ్ళజోడు తీసి టేబుల్ మీద పెట్టి పరీక్షగా గౌతమ్ ముఖంలోకి చూశాడు.

"అవును డాక్టర్ థర్టీ సిక్స్ అంటే....ముప్పై ఆరు నెలలు అనుకోండి. ముప్పై ఆరు నెలలు అంటే మూడు సంవత్సరాలు కదా! ట్వంటీ ఫోర్ అంటే ఇరవై నాలుగు నెలలు అంటే రెండు సంవత్సరాలు, మళ్ళీ థర్టీసిక్స్ అంటే ముప్పై ఆరు నెలలు అంటే మూడు సంవత్సరాలు అనుకుందాం. ఈ కోడ్ ఉపయోగించి చూడండి డాక్టర్" చెప్పాడు సన్నని ఆశ మెదిలిన కళ్ళతో.

సరికొత్త ఆలోచన ఇచ్చిన గౌతమ్ వైపు మెచ్చుకోలుగా చూసి "ఇది పని చేయవచ్చు" అన్నాడు ఆమెవైపు తిరుగుతూ.

కళ్ళు మూసుకుని తల వెనక్కు వాల్చి నిద్ర పోతున్నట్టుగా వుంది ఆమె.

"శుభాంగి....నా మాట వినిపిస్తోందా?" అన్నాడు ఆమెను ఉద్దేశించి.

"వినిపిస్తోంది" అనే అర్థం వచ్చేలా తల వూపింది ఆమె.

"త్రీ ఇయర్స్, టూ ఇయర్స్, త్రీ ఇయర్స్" అన్నాడు పరమాత్మ.

ఆమెలో కదలిక లేదు.

"శుభా....త్రీ ఇయర్స్, టూ ఇయర్స్, త్రీ ఇయర్స్....వింటున్నావా?" మళ్ళీ అన్నాడు.

"విన్పిస్తోంది" అన్నట్టుగా తల వూపింది.

"చెప్పు....కిటికీ బయట నీకు ఏం కనిపిస్తోంది?"

ఆమెలో సమాధానం లేదు.

సైలెంట్‌గా కూర్చుని వుంది ఆమె.

"నో....ఇది కోడ్ వర్డ్ కాదు" ఆ ఆశ వదులుకున్నవాడిలాగా అన్నాడు పరమాత్మ.

నిశ్శబ్దంగా కూర్చున్నారు ఇద్దరూ.



"ఆ అంకెలలోనే ఏదో రహస్యం వుందని నా అనుమానం" కొంతసేపటి తరువాత అన్నాడు డాక్టర్.

ఎక్కడి రహస్యమో ఏమో....తల తిరిగిపోతోంది అనుకున్నాడు గౌతమ్.

నిశ్చలంగా నిద్రపోతున్నదానిలా వుండిపోయింది శుభాంగి.

టేబుల్ మీద వున్న పెన్ తీసుకుని కాయితం మీద ఏవేవో అక్షరాలు రాయసాగాడు డాక్టర్.

చేతివేళ్ళతో కణతలు రుద్దుకుంటూ మేధస్సు మధనం చేయసాగాడు గౌతమ్.

నిమిషాలు గడవసాగాయి.

"గౌతమ్.... ఐ గాట్ యాన్ ఐడియా" అక్కడి నిశ్శబ్దాన్ని భంగపరుచుతూ అన్నాడు డాక్టర్.

ఏమిటన్నట్టు చూశాడు గౌతమ్.

"ఇటురా" అన్నాడు డాక్టర్.

చైర్‌లో నుండి లేచి పరమాత్మని సమీపించాడు.

"ఈ కాలిక్యులేషన్ చూడు" అన్నాడు పేపర్ వైపు చేయిచూపిస్తూ.

దృష్టిని ఆ కాయితం వైపు సారించాడు గౌతమ్

"36–24–36 అనే అంకెలను కూడితే ఏమవుతుందో చూడు" అన్నాడు పరమాత్మ.

పేపర్ మీద 36+24+36=96 అని వేసి వుంది.

"ఈ 96కి అర్థం ఏమిటి డాక్టర్?" అడిగాడు గౌతమ్.

"తొంభై ఆరు గంటలు అనుకో. అంటే నాలుగు రోజులు.... అవునా"

అవునన్నట్టు తల వూపాడు గౌతమ్.

"ఇప్పుడు ఇంకో పద్ధతిలో ఈ అంకెలను కూడితే ఏమవుతుందో చూడు" అవి–3+6+2+4+3+6=24 అని రాశాడు పరమాత్మ.

"ఈ రకంగా టోటల్ చేస్తే ఇరవై నాలుగు వస్తుంది. ఇరవై నాలుగు గంటలు అనుకుంటే ఒక రోజు" అతనే అన్నాడు.

"ఇది బాగానే వుంది....ఒక రకంగా టోటల్ చేస్తే నాలుగురోజులు, మరో రకంగా టోటల్ చేస్తే ఒకరోజు అని అర్థం వస్తోంది. ఈ నాలుగు రోజులు, ఒక రోజుల అర్థం ఏమిటి?" తెల్లముఖం పెట్టి అడిగాడు గౌతమ్.

"నేనొక అర్థం వూహిస్తున్నాను. ప్రతి స్త్రీకి నెలకు మూడు లేదా నాలుగు రోజుల వరకు పీరియడ్స్ టైమ్ (బహిష్టు) వుంటుంది. ఆ సమయంలో స్త్రీలు శారీరకంగా నీరసంగా వుంటారు. మానసికంగా కూడా కొంతవరకు బలహీనంగా వుంటారు."

"అయితే ఏమిటి?" ఏమీ అర్థంకాక అడిగాడు గౌతమ్.

"చెప్పేది విను....ఆ సమయంలో స్త్రీ మానసికంగా కూడా వీక్‌గా వుంటుంది. కాబట్టి ఆ సమయంలో క్షుద్రశక్తులుగాని, హిప్నాటిజంగాని ప్రయోగించడం కొంతవరకు తేలిక. ఆ నాలుగు రోజుల సమయంలో ఇరవై నాలుగవ గంటలో (ఇరవై నాలుగవ గంట....అంటే అర్థరాత్రి పన్నెండు గంటల సమయం) ఆమెను నాలుగురోజులపాటు హిప్నటైజ్ చేసి వుండవచ్చు. ఇది కేవలం నా వూహ మాత్రమే."

ఆయన చెప్పేది విన్నాక అన్నాడు గౌతమ్-

"ఇప్పుడు మనం ఏం చెయ్యాలంటారు?"

"ఆమె పీరియడ్స్ టైం తెలుసుకుని.... ఆ సమయంలో ప్రతిరోజూ రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకి హిప్నటైజ్ చేసి చూద్దాం"

"అది పని చేస్తుందంటారా?" అనుమానంగా అన్నాడు గౌతమ్.

డాక్టర్ లాజిక్ చాలా చిరాగ్గా అనిపించింది. స్త్రీకి పీరియడ్స్ టైమ్ ఎప్పుడో తెలుసుకొని ఆ టైములో హిప్నటైజ్ చేయటం ఏమిటి అసహ్యాంగా అనుకున్నాడు.

చెప్పాను కదా. ఇది కేవలం నా ఊహ మాత్రమే. కానీ ప్రయత్నించక తప్పదు....ఇప్పుడు ఆమెను స్పృహలోకి రప్పించుతాను. ఆమె పీరియడ్స్ టైమ్ ఎప్పుడో అడుగు. అప్పుడే ఆమెను హిప్నటైజ్ చేద్దాం"



నోరు తెరుచుకుని విన్నాడు గౌతమ్

మరో పది నిమిషాలకి మామూలు అయిపోయింది శుభాంగి.

"మేం వెళతాం డాక్టర్" చెప్పాడు బయటికి కదులుతూ.

"రేపు ఫోన్ చేసి నాకు ఏ విషయమూ చెప్పు" అన్నాడు పరమాత్మ.

ఇద్దరూ బయటికి నడిచారు.

"గౌతమ్ ఈ రోజు హిప్నాసిస్‌లో నేను నిజాలు చెప్పానా?" అడిగింది.

"నిన్నొక ప్రశ్న అడుగుతాను ఏమీ అనుకోకు....నీ పీరియడ్స్ టైమ్ ఎప్పుడు?" చాలా సూటిగా, నిర్మొహమాటంగా అడిగేసాడు.

తెల్లబోయింది శుభాంగి ఆ ప్రశ్నకి.

o o o

నిశ్శబ్దంగా నిద్రపోతోంది నగరం.

డాక్టర్ పరమాత్మ హాస్పిటల్ మాత్రం మెలకువగా వుంది.

సమయం పదకొండూ యాభై ఐదు.

చైర్‌లో నిశ్చలంగా కూర్చుని వుంది శుభాంగి.

అప్పటికి ఐదురోజులుగా డాక్టర్ దగ్గరికి రాలేదు వాళ్ళిద్దరూ. కారణం.... ఆ రోజు నుండి ఆమెకు పీరియడ్స్ ప్రారంభం.

అందుకే ఆ రోజు తీసుకువచ్చాడు గౌతమ్. సరిగ్గా పన్నెండు అయింది సమయం.

హిప్నోసిస్ మొదలయింది.

".... నువ్వు ప్రశాంతంగా వున్నావు. నీ మెదడు, మనస్సు కూడా రిలాక్స్‌డ్‌గా వున్నాయి. నువ్వు గదిలో బెడ్ మీద వున్నావు. ఆ గదిలో స్పిరిట్, అమోనియా వాసనలు వస్తున్నాయి. అవునా!" అడిగాడు.

డాక్టర్ ఆమెను ట్రాన్స్‌లోకి తీసుకువెళ్ళాడు. అవునన్నట్టు తల వూపింది.

టెన్షన్‌గా వాళ్ళనే చూస్తున్నాడుగౌతమ్. డాక్టర్ ఏవేవో ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ ఏవీ ఫలించడం లేదు. ఇది వృథా ప్రయాసే అని

నమ్మకంగా అతని మనస్సు చెబుతోంది.

"నువ్వున్న ఆ గదికి కిటికీ వుంది కదా...."

"అవును"

"కిటికీ తెరిచి వుందా?"

"అవును"

"కిటికీలోకి పరిశీలనగా చూడు....ఏం కనిపిస్తోంది?"

"...."

"శుభా.... కిటికీ బయటికి చూడు. ఏం కనిపిస్తోంది?"

"...."

"నా మాట నీకు వినపడుతోందా?"

"వినపడుతోంది"

"చెప్పు....కిటికీ బయట ఏం కనిపిస్తోంది?"

ఆమె శరీరం చలికి వణికే విధంగా వణుకుతోంది.

"కమాన్ టెల్ మి?"

"అక్కడ.... అక్కడ...." ఆమె గొంతు కూడా వణుకుతోంది.

ఆమె ఏం చెప్పబోతోందో అన్న ఉద్వేగంతో గౌతమ్ నరాలు తెగిపోయేలా వున్నాయి.

"అక్కడ.... ఆకాశం.... వుంది" గొణిగినట్టు అంది ఆమె.

చెప్పలేని ఆనందంగా ఫీలయ్యాడు గౌతమ్.

'థాంక్ గాడ్' ఆమె మెమరీ బాక్స్ బ్రేక్ అయ్యింది..

చాలా రిలీఫ్‌గా చూశాడు గౌతమ్ వైపు పరమాత్మ.

మొత్తం మీద బ్రేక్ చేయగలిగాను చూశావా అన్న ఆనందం అతని ముఖంలో కనిపించింది.

"శుభా....టెన్షన్ ఫీలవకు....గెట్ రిలాక్స్‌డ్....ఇప్పుడు చెప్పు.... కిటికీలో నుండి చూస్తే నీకు ఏం కనిపిస్తోంది?"

"నీలాకాశం"

ఆ సమాధానం విని హాయిగా అనిపించింది గౌతమ్‌కి.

"ఆకాశం ఒకటేనా కనిపించేది?"



"అవును"

"బయట ఇళ్ళు, రోడ్లు ఏం కనపడడం లేదా?

"లేదు"

"నువ్వు ఏ ఊరిలో వున్నావో తెలుసా?"

"తెలియదు"

"ఏ దేశంలో వున్నావో తెలుసా?"

"తెలియదు"

"ఓ.కే. ఆ విషయం మర్చిపో. ఆ గదిలో నీతోపాటు ఇంకెవరైనా వ్యక్తులు వున్నారా?"

"వున్నారు"

"ఎవరు?"

"ఒక నర్స్"

"ఎలా వుంటుంది?"

"నల్లగా పొడవుగా వుంది."

"ఆమె నర్స్ అని ఎలా తెలుసు"

"ఆమె నర్స్‌లు వేసుకునే డ్రస్ వేసుకుంది కాబట్టి, అనుకుంటున్నాను."

సమాధానాలు చాలా ఫ్రీగా ఆమె నోటి నుండి వస్తున్నాయి.

"ఆమె ఏం చేస్తుంది?"

"నాకు బ్లడ్ ప్రెషర్ చూస్తుంది, ఇంజెక్షన్ చేస్తుంది"

"ఇంకెవరున్నారు?"

ఆమె మౌనంగా వున్నది.

"టెల్ మి .. ఎవరున్నారు? భయపడవద్దు"

"అతను...."

"అతను....అంటే....?"

"అ....త....నే....ఒంటి చేతి మనిషి...."

ఉలిక్కిపడ్డాడు ఆమె సమాధానానికి గౌతమ్.

అంటే....

కలల్లో కనిపించే ఆ ఒంటి చేతి వ్యక్తి చాలా ప్రమాదకరమైన వాడు....అంతేకాదు....ఆమె మీద హిప్నోసిస్ ప్రయోగిస్తున్న వ్యక్తి కూడా అతనే అయి వుండాలి.

"ఎవరా ఒంటి చేతి వ్యక్తి?"

"డాక్టర్"

"నీకెలా తెలుసు?"

"నర్స్ అతనిని డాక్టర్ అని పిలుస్తుంది"

"వాళ్ళ పేర్లు తెలుసా?"

"తెలియదు"

"డాక్టర్ ఏం చేస్తాడు?"

"నన్ను....నన్ను....హింసిస్తాడు"

"వివరంగా చెప్పు....ఎలా హింసించాడు?"

"అతను నన్ను సమీపించుతాడు....తన చేతితో నా శరీరం అంతా తడుముతాడు...." అంటూ వివరంగా అంతా చెప్పింది ఆమె.

అది చెబుతున్నప్పుడు ఆమె శరీరం సన్నగా వణకటం గమనించాడు పరమాత్మ.

ఆమెను కొన్ని నిమిషాలపాటు ఏమీ ప్రశ్నించకుండా వదిలేసాడు పరమాత్మ.

కొంతసేపటికి ఆమె మామూలు స్థితికి వచ్చింది.

"శుభా నువ్వు ఇంకాకొద్ది రోజులు ముందుకు వెళ్ళాలి"

"అంటే...."

"ఇప్పుడు నీ వయస్సు పదహారేళ్ళు....ఈ వయస్సులోనే కొద్ది రోజులు ముందుకు వెళ్ళాలి. ప్రయత్నించు"

"...."

"నీ పేరు?"

"శుభాంగి"

"మౌనిక పేరు ఎప్పుడయినా విన్నావా?"



"లేదు"

"ఆలోచించి చెప్పు"

"...."

"మౌనిక పేరు విన్నావా?"

"విన్నట్లు వుంది"

"విన్నట్లుంది కాదు. విన్నావు"

"అవును విన్నాను."

"ఓ.కే....నీ కళ్ళ ముందు ఏం కనిపిస్తోంది?"

"...."

"జాగ్రత్తగా చూడు. ఏం కనిపిస్తోంది?"

"ఆకాశం"

"ఇంకా?"

"ఆకాశంలో మెరిసే నక్షత్రాలు"

"ఆకాశానికి క్రిందుగా ఏం కనిపిస్తోంది?"

"చాలా దీపాలు వెలుగుతున్నాయి, బహుశా పెద్దనగరం అయి వుంటుంది"

"అందులో నీకొక ఇల్లు కనిపిస్తోందా?"

"అవును"

"ఇంకేం కనిపిస్తోంది?"

"పెద్ద తలుపు వుంది"

"ఆ తలుపు తెరిచి చూడు"

"తెరవటం....సాధ్యం కావటం లేదు"

"ప్రయత్నించు....నువ్వు తెరవగలవు"

"కష్టంగా వుంది"

"ట్రై....ఎగైన్"

"తెరుచుకుంది"

"ఫైన్....ఏం కనిపిస్తోంది?"

"అక్కడ ఒక గది వుంది"

"ఆ గదిలో ఏముంది?"

"బెడ్ వుంది"

"ఇంకా?"

"బుక్ షెల్ఫ్‌లున్నాయి"

"ఇంకేం కనిపిస్తున్నాయి?"

"ఒక పెద్ద విండో వుంది"

"ఆ గదిలో నువ్వు ఎక్కడున్నావు?"

"బెడ్ మీద వున్నాను"

"నీ పేరు?"

"మౌనిక"

ఆ మాట వినగానే ఒక్కసారిగా గొప్ప రిలీఫ్ ఫీలయ్యారు గౌతమ్, పరమాత్మ.

పట్టలేని ఆనందంతో డాక్టర్ చేయి పట్టుకుని కుదిపేసాడు గౌతమ్.

"థాంక్యూ డాక్టర్....యు వార్ జీనియస్....అసంభవం అనుకున్న విషయాన్ని సంభవం చేసారు" గొణిగినట్లుగా అన్నాడు అతను.

o o o

కాఫీ కప్పులో ఒక స్పూన్ చక్కెర వేసి అది గౌతమ్‌కి అందించింది శుభాంగి.

కప్ అందుకుని సిప్ చేయసాగాడు.

"అయితే ఇప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావు గౌతమ్?"

కాఫీ తాగుతున్నప్పుడు నోటికి అడ్డం వస్తున్న మీగడని స్పూన్‌తో పక్కకి తొలగించి ఆమె వైపు చూశాడు.

"వాట్స్ యువర్ ప్లాన్"

"రేపు బయలుదేరి బెంగుళూరు వెళదామనుకుంటున్నాను"

"ఎందుకు?"

"అక్కడికి వెళితే చాలా వివరాలు తెలుస్తాయి"

"ఎలా?"



"ఎలా ఏముంది? ఆ ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళతాను. ఆ పాలసీ వివరాలు చూపించమంటాను.... అసలా ఆఫీసు కూడా ఇన్స్యూరెన్స్ కంపెనీ కాదని నా అనుమానం"

"మరి ఏమయి వుండవచ్చు?"

"ఆ గ్యాంగ్ ఆడే నాటకంలో ఒక భాగం అయి వుండవచ్చని అనుకుంటున్నాను. ఎందుకంటే, నీ తల్లి దండ్రులు బెంగుళూరుకు చెందిన వాళ్ళు కాదని ఋజువయిపోయింది. అటువంటప్పుడు అక్కడ ఇన్స్యూరెన్స్ కంపెనీలో ఈ క్లెయిమ్ సెటిల్ అవటం అసంభవం. అందువల్ల ఒక్కసారి బెంగుళూరు వెళ్ళి ఇన్ఫర్మేషన్ లాగటం మొదలు పెడితే డొంకంతా కదులుతుంది"

"అంతవరకు ఎందుకు? ఇక్కడ నిన్ను ఫాలో అవుతున్న మనుషుల్ని పట్టుకుని నాలుగు తంతే వివరాలు తెలియవా?"

నవ్వాడు ఆమె మాట ధోరణికి గౌతమ్.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఇక్కడ నా వెంట తిరిగేవాళ్ళంతా పిల్లకాకులు. వీళ్ళమీద బల ప్రయోగం చేసి టైము వృధా చేసుకోవటమే అవుతుంది. అందువల్ల బెంగుళూరు వెళ్ళడమే సరిఅయిన మార్గం"

"రేపు ఎప్పుడు వెళతావు?"

"రాత్రి ట్రెయిన్‌కి"

"ఫ్లయిట్‌లో వెళ్ళచ్చుగా!"

"కొన్ని కారణాలవల్ల వద్దనుకుంటున్నాను"

"మరి నేను ఏం చెయ్యను?"

"అర్థం కాలేదు నువ్వన్నమాట ఏమిటో?"

"నువ్వు బెంగుళూరు వెళితే, నేను ఇక్కడ ఏం చెయ్యాలి అని?"

"ఏముంది నీ పనులు నీకుంటాయి"

"కాదు నీతో వస్తాను"

"ఎక్కడికి"

"ఇంకెక్కడికి? బెంగుళూరు"

"నో:... నో.... వద్దు. నేను వెళుతున్న పని వేరు. నువ్వు నాతో వస్తే చాలా సమస్యలు ఎదురవుతాయి. ఇక్కడే వుండు. ఇక్కడయితే నీకు రక్షణ వుంటుంది. సుప్రియ వుంది. రఘురామ్ వున్నాడు."

"నువ్వు లేకుండా నాకు ఇక్కడ వుండడం ఇష్టం లేదు"

"బట్.... నువ్వు వస్తే కష్టం"

"అయినా సరే.... నువ్వున్న చోటే నాకు రక్షణ.... నీ తోనే నా లైఫ్... నా నిర్ణయంలో మార్పులేదు" ఖచ్చితంగా అంది ఆమె.

కొంతసేపు మాట్లాడలేదు అతను.

చివరికి అన్నాడు—

"ఆల్‌రైట్.... నీ ఇష్టప్రకారమే నాతోనే రా!" అని.

"ఎప్పుడు బయలుదేరుతున్నాం?"

రేపు చెప్పాడు గౌతమ్.

0 0 0

సమయం రాత్రి ఎనిమిది ఇరవై.

ఢిల్లీనగరం.

దేదీప్యమానంగా వెలిగే లైట్లు ఆ నగరాన్ని ఆవరించిన చీకట్లను పారద్రోలుతున్నాయి.

దూరంగా మినుకు మినుకుమనే లైట్లతో ఎయిర్‌పోర్ట్‌లో లాండ్ అవుతూ కనిపిస్తోంది ఒక ప్లేయిన్.

జనవరి నెల....

ఢిల్లీనగరాన్ని చలి గజగజలాడిస్తోంది.

ఆ రోజు టెంపరేచర్ నాలుగు డిగ్రీలకి పడిపోయింది.

పగలు కూడా రోడ్లు దాదాపు ఖాళీగానే వున్నాయి ఆ చలికి ఆ రోజు.



విండో గ్లాసెస్‌లో నుండి బయటి దృశ్యాన్ని చూస్తున్నాడు జైసింగ్ షకావత్.

అతని చేతిలోని పెగ్‌లో వున్న షివాస్ రీగల్ మెల్లగా అతని గొంతులోకి జారిపోయింది.

చల్లని ఆ వాతావరణంలో శరీరంలోకి వెచ్చదనం చేరినట్లనిపించింది అతనికి.

మరో రెండు మూడు రోజుల వరకు చలి అలాగే కంటిన్యూ అవ్వచ్చని టి.వి.లో చెప్పారు.

ఢిల్లీ వాతావరణమే అంత.

చలివచ్చినా విపరీతంగానే వుంటుంది. ఎండ అయినా అంతే.

రోడ్డుమీద అడపా దడపా వచ్చే వాహనాలు తప్ప మరేమీ కనిపించటంలేదు.

జైసింగ్ షకావత్ కోటీశ్వరుడు. .... కోట్లు ఏం ఖర్మ, బిలియన్స్‌లో వుంటాయి అతని ఆస్తులు.

ఇప్పటికి దాదాపుగా ఇరవై సంవత్సరాలుగా ఎం.పి.గా ఎన్నిక అవుతూనే వున్నాడు. పాలకవర్గంలో వున్నప్పుడు మంత్రి పదవి ఖచ్చితంగా వుండేది. డబ్బు కూడా రెండు చేతులా బాహాటంగా, నిర్మొహమాటంగా సంపాదించాడు. ప్రతిపక్షంలో కూర్చున్న సందర్భాలలో కూడా దొరికినంత సంపాదించేవాడు. ఆరకంగా రాజకీయ ప్రవేశం చేసిన దగ్గర నుండి అంతులేకుండా సంపాదించాడు. అతను ఢిల్లీలో వుండేది అఫీషియల్ రెషిడెన్స్. అందులోని ఫర్నిచర్ కూడా గవర్నమెంట్‌దే. అందువల్ల అతను తన వస్తువులన్నిటినీ ఆ ఇంట్లో పెద్దగా వుంచలేదు.

కానీ.... జయపూర్‌లో అతనికి కళ్ళు చెదిరే బిల్డింగ్ ఒకటి వుంది. దాన్ని బిల్డింగ్ అనడంకన్నా పేలస్ అనటం కరెక్టు అవుతుంది.

సుమారు ముప్ఫై అయిదు గదులుంటాయి ఆ ఇంట్లో.

అంత పెద్ద ఇంట్లో వుండేది అతడు ఒక్కడే.

అతని భార్య చనిపోయాక మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు.

కూతురు కిడ్నాప్ అయిన తరువాత అతను పూర్తిగా ఒంటరివా డయ్యాడు.

అతను ఒంటరివాడయ్యాక కూడా అతనికీ ఆ ఇల్లు యెక్కువ అనిపించలేదు.

కారణం....

అతని దగ్గర అసాధారణమైన వస్తువుల కలెక్షన్ వుంది.

పురాతన విగ్రహాలు, నాణాలు, వస్తువులు ఇండియన్‌వి. గ్రీక్, ఇటాలియన్, చైనీస్.... ఇలా చాలా దేశాల పురాతన వస్తువులు అతని దగ్గర వున్నాయి.

పర్షియన్ సోఫాలు .... చైనీస్ కార్పెట్స్ ... జపనీస్ క్రోకరీ.... నవాజో బ్లాంకెట్స్....

లక్షల విలువ చేసే వస్తువులు....

ఆ ఇంట్లో అదో పెద్ద బార్....

అందులో రెండు మూడు వందల రకాల వైన్స్.

ఒక మ్యూజియం లాగ వుంటుంది అతని ఇల్లు. నెలలో నాలుగు రోజులు అక్కడ గడుపుతాడతను. అతనికి పూనాలో ఒక ఇల్లు, ఢిల్లీలో షాపింగ్ కాంప్లెక్స్‌లు....బొంబాయిలో షిప్పింగ్ కార్పొరేషన్లు.... ఇలా లెక్కలేనన్ని వ్యాపారాలున్నాయి.

ఢిల్లీలోని అతని నివాసం కొంతవరకు సింపుల్‌గానే వుంటుంది. కానీ అక్కడి కార్పెట్స్ క్రింద ఎలక్ట్రానిక్ ఐసి, ఇన్‌ఫ్రారెడ్ స్కానర్స్ వున్నాయి. ఇంట్లోకి చిన్న పురుగు కూడా ప్రవేశించలేదు.

అతని ఇంట్లో వుండే మనుషులు చాలా తక్కువ. ఒక వంట మనిషి, ముగ్గురు పనివాళ్ళు. అంతే. ఎక్కువమంది ఇంట్లోకి రావడా నికి ఇష్టపడడు అతను.

టీపాయ్‌మీద కార్డ్‌లెస్ ఫోన్ మోగసాగింది.

కుడిచేతిలోని గ్లాస్ ఎడమ చేతిలోకి మార్చుకుని కుడిచేత్తో ఫోన్ అందుకున్నాడు.

"హలో"



"ఏం చేస్తున్నావు?"

అది హరిహరన్ గొంతు.

"ఆ.... చెప్పు హరిహరన్.... ఏమిటి విషయం?"

"ఎలా వున్నావు?"

"ఫైన్.... బాగానే వున్నాను. ఏమిటి విషయం చెప్పు"

"మన సంభాషణ ఎవరూ వినరు కదా?"

అతని ప్రశ్నకి ఒకసారి ఇటూ అటూ చూశాడు షకావత్. ఎవరూ లేరు.

ఫోన్ వుండే డస్క్ వెనుకకు ఒకసారి చూశాడు.

అక్కడ ఒక ఎలక్ట్రానిక్ డివైజ్ వుంది. అది ఒక "టాస్ ఎల్ట్రిక్ బి 409" కమ్యూనికేషన్ కంట్రోలు సిస్టం.

అది పనిచేస్తోంది. అది పనిచేస్తుంటే ఆ టెలిఫోన్ సంభాషణని మరొకరు టాప్ చేయడం కుదరని పని.

ఒకసారి తృప్తిగా తలాడించి "ఓకే. హరిహరన్.... చెప్పు.... మన మాటలు ఎవరూ వినలేరు" చెప్పాడు షకావత్.

"అయితే విను.... ఇప్పుడే మాకు రిపోర్టు వచ్చింది"

అతని మాటలు విని ఒక్కసారిగా నిటారుగా కూర్చున్నాడు షకావత్.

"హరిహరన్.... ఆ రిపోర్టు చూడాలని నాకు చాలా ఆతృతగా వుంది. నేను నిన్ను ఎక్కడ కలవాలి!"

"ఈ సారి కొత్త ప్రదేశంలో కలుద్దాం. నువ్వు కరోల్ బాగ్ దగ్గరకు రా!"

"కరోల్ బాగ్‌లో ఎక్కడికి"

"కరోల్‌బాగ్‌లో దుగ్గల్ జ్యూయలరీస్ అనే షాపు వుంది. అది దాటగానే ఎడమవైపు మూడో సందులోకి రా. అక్కడ క్రీం కలర్ చెవర్లెట్ కారు ఆగి వుంటుంది. నేను అందులోనే వుంటాను"

"అలాగే ఎంతసేపట్లో రాను?"

"సరిగ్గా అరగంట తరువాత"

"అలాగే.... అది సరే ... ఈ నెలలో నాకు రిపోర్టు ఇవ్వటం ఐదు రోజులు ఆలస్యం అయిందేం?"

"అయితే ఏమయిందంట?"

"మన ఎగ్రిమెంట్ ప్రకారం సరిగ్గా ఒకటో తారీకుకి నాకు రిపోర్ట్ ఇవ్వాలి"

"ఒక్కొక్కసారి లేటవుతుంది"

"అదే చెప్పేది.... అవ్వటానికి వీలులేదు అని"

"హెచ్చరిస్తున్నావా?"

"ఎలాగయినా అనుకో.... నాకు మాత్రం లేట్ అవటానికి వీలు లేదు" ఇంకా ఏదో అనబోతున్నాడు.

అవతల లైన్ డిస్కనెక్ట్ అయింది.

"హలో.... హలో...."

"హరిహరన్‌కి కోపం వచ్చివుంటుంది. అందుకే ఫోన్ పెట్టేశాడు" అనుకున్నాడు.

"వాచ్‌లో టైం చూసుకున్నాడు. ఎనిమిదిన్నర. ఇంక అర గంటలో అక్కడ వుండాలన్నమాట" అనుకున్నాడు బయలుదేరడానికి సిద్దపడుతూ.

0 0 0

షకావత్ వున్న కారు కరోల్ బాగ్ ప్రాంతాన్ని సమీపించింది. ఒంటరిగా బయలుదేరి వచ్చాడు.

అతను ఒంటరిగా బయలుదేరి రావటం అరుదు.

అసలు ఒంటరిగా అతను బయలుదేరటం జరగని పని అని కూడా చెప్పచ్చు.

కారణం....

సెక్యూరిటీ ప్రాబ్లం.

ఒంటరిగా బయలుదేరితే ఎక్కడయినా ఏమయినా జరగవచ్చు.

కాని హరిహరన్‌ని ఎప్పుడు కలిసినా ఒంటరిగానే వస్తాడు.

10,0 పి.సి. మారుతీ కారు అది.



దాని రిజిస్ట్రేషన్ కూడా అతని పేరుమీద లేదు.

సాధారణంగా ఆ కారు బయటికి తీయడు. ఇలాంటి అరుదైన సందర్భాలలో మాత్రమే తీస్తాడు.

అతనికి డుగ్గల్స్ జ్యూయలరీ షాపు కనిపించింది.

దానిని దాటాక ఎడమవైపు మూడో సందులోకి కారు టర్న్ చేశాడు. ఆ సందులో అతనికి చెవర్లెట్ కారు ఏదీ కనిపించలేదు. ఆ సందు మొత్తంమీద రెండే కార్లు కనిపించాయి. ఒకటి 800 సి.సి. మారుతి, మరొకటి కాంటెస్సా.

రోడ్డుకు ఎడమవైపు కారు ఆపి లైట్స్ ఆఫ్ చేశాడు.

అతను కారు ఆపిన చోటు నుండి పదిగజాల అవతల ఒక చిన్న రెస్టారెంట్ ఏదో వుంది. ఇద్దరు వ్యక్తులు టీ తాగుతున్నారు. వాళ్ళు మందమైన వున్ని వస్త్రాలు ధరించి వున్నారు.

వాళ్ళ శరీరంలో సన్నని వణుకు కనిపిస్తోంది.

కారు డాష్ బోర్డు మూత తెరిచాడు. అందులో ఒక రివాల్వర్, ఒక లైట్ మెషిన్‌గన్ వున్నాయి. వాటిలో నుండి రివాల్వర్ తీసి కోటు జేబులో వుంచుకున్నాడు.

బుల్లెట్ ప్రూఫ్ ధరించి వున్నాడతను. దానిమీద వులెన్ కోటు ధరించాడు. చేతులకు వులెన్ గ్లోవ్స్ వున్నాయి.

వెనుక నుండి కారు వస్తున్నది. దాని హెడ్‌లైట్స్ కాంతి అతని కారు గ్లాసెస్ మీద పడి రిఫ్లెక్ట్ అయింది.

తన కారుని దాటి ఓ పది గజాలు వెళ్ళి ఆగింది కారు.

అది చెవర్లెట్....

హరిహరన్ వున్న కారు వచ్చేసింది అన్నమాట.

కారులోంచి దిగి డోరు లాక్ చేసి గబగబా నడిచి చెవర్లెట్‌ని సమీపించాడు.

ఆ కారు వెనుక సీట్లో కూర్చుని వున్నాడు హరిహరిన్.

షకావత్‌ని చూడగానే చిరునవ్వు నవ్వి డోరు తెరిచాడు.

లోపలికి రాగానే డోరు క్లోజ్ చేశాడు హరిహరన్.

కారు ముందుకు దూకించాడు డ్రైవర్.

మెత్తగా రోడ్డుమీద జారిపోతోంది కారు.

"నీతో ఇంకా ఇంకెవరైనా వచ్చారా!" అడిగాడు హరిహరన్.

హరిహరన్ హిందీ అనర్గళంగా మాట్లాడతాడు. కానీ అక్కడక్కడా తమిళయాస ధ్వనిస్తుంది.

"ఎందుకు వస్తారు?.... నేను ఒంటరిగానే వచ్చాను" చెప్పాడు షకావత్.

తల తిప్పి వెనక్కి చూశాడు హరిహరన్.

కొన్ని నిమిషాలపాటు అలాగే చూశాడు.

వెనకాల ఎవరూ ఫాలో అవటంలేదు.

"నాకు అదే కంపరం కలిగిస్తుంది. నాతోపాటు ఎవరూ రాలేదని చెప్పిన తరువాత కూడా ఎవరయినా ఫాలో అవుతున్నారేమో అని చూస్తున్నావు. అంటే నామీద నమ్మకం లేకే కదా?" చిరాకు ధ్వనించింది అతని గొంతులో.

"నిన్ను నేను నమ్మను.... నీకు తెలుసుగదా"

మాట్లాడలేదు. షకావత్.

కారు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది.

"ఏదీ.... రిపోర్టు ఎక్కడ?" ఒకింత ఆత్రుతగా అడిగాడు షకావత్.

"తొందరపడతావెందుకు? ఇప్పుడేకాదు.... మనం యింకొక కారులోకి మారతాం.... ఆ కారులో మనం యిద్దరమే వుంటాము. అప్పుడు యిస్తాను"

తల తిప్పి వెనక్కి చూశాడు డ్రైవర్.

ఏమిటన్నట్లు చూశాడు హరిహరన్.

"సార్.... నన్ను కూడా నమ్మట్లేదా! మీ దగ్గర యిరవై సంవత్సరాలుగా డ్రైవర్ని" అతని మాట పూర్తి కాలేదు.

"ఏరా!.... నిన్ను ఏమయినా మాట్లాడించానా!.... తెలివి ఎక్కు



వయిందా? ఇంటికి పంపించమంటావా!" కర్కశంగా అన్నాడు హరిహరన్. ఇంటికి పంపించమంటావా అన్న మాటను ఒత్తిపలుకుతూ.

అదిరిపడ్డాడు డ్రయివర్.

"క్ష....మిం....చండి....ఇంటికి మాత్రం పంపించవద్దు" అన్నాడు.

గ్రీన్ సిగ్నల్ వెలిగింది.

"ఇంటికి పంపించమంటావా! అని అడిగితే అలా వణికిపోయాడేంటి డ్రయివర్?" అడిగాడు షకావత్.

"నా భాషలో . ఇంటికి పంపడం అంటే....అర్థం వేరులే"

"ఏమిటో ఆ అర్థం."

"ఇంటికి....అంటే....యముడి ఇంటికి" కూల్‌గా అన్నాడు.

అదన్నమాట....అందుకే నోరు మూసేశాడు డ్రయివర్ అనుకున్నాడు. ఇంకేమీ మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు షకావత్.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

మరో మూడు కిలోమీటర్లు ప్రయాణించింది కారు.

"ఆ కనిపించే రోడ్డు మలుపులో కారు ఆపెయ్" చెప్పాడు డ్రయివరుతో.

స్లో చేసి ఆపాడు కారు.

డోరు తీసుకుని దిగారు ఇద్దరూ.

"నువ్వు ఇంటికి వెళ్ళిపో" అన్నాడు డ్రయివర్‌తో.

డ్రయివర్ శాల్యూట్‌చేసి కారు స్టార్టుచేసి వెళ్ళిపోయాడు.

"పద" అంటూ నడక సాగించాడు, ఒకసారి ఇటూ అటూ చూసి హరిహరన్.

సుమారు ముప్పయ్ గజాలు నడిచి ఆ వీధి మలుపు తిరిగారు.

"ఆ కారులో వెళదాం" అన్నాడు. అక్కడ రోడ్ ప్రక్కగా పార్క్ చేసి వున్న మెర్సిడెస్‌వైపు చేయి చూపిస్తూ

ఇద్దరు కారును సమీపించారు.

37)

డ్రయివింగ్ సీటువైపు వెళ్ళి డోరు తెరిచి, ఇవతలి డోర్ లాక్ తీశాడు హరిహరన్.

డోరు తెరిచి లోపలికి వచ్చి తిరిగి క్లోజ్ చేశాడు షకావత్.

కారు డోరు మీద పడిన మంచు అతని గ్లోవ్స్‌కి అంటుకొని తడిగా అయింది.

చేతుల నుండి గ్లోవ్స్ తొలగించాడు షకావత్.

చిన్న జర్క్‌తో స్టార్టయి దూసుకుపోసాగింది కారు.

"ఈ రోజు ఎటువైపు వెళదాం!" అడిగాడు హరిహరన్.

"అమృతసర్ హైవేలో వెళదాం" చెప్పాడు షకావత్.

వాళ్ళకు ఓ ప్రత్యేకమైన అలవాటు వుంది. ముఖ్యమైన విషయాలు చర్చించాలనుకున్నప్పుడు వాళ్ళు ఫోన్లలో మాట్లాడుకోరు. ఇళ్ళలో కూడా అసలే మాట్లాడుకోరు.

ఇలా కార్లలో కూర్చుని మాట్లాడుకుంటారు. అది గంటయినా సరే గంటలయినా సరే. అలా రెండు మూడు వందల కిలోమీటర్లు డ్రయివు చేసుకుంటూ వెళతారు. కారు నడుస్తున్నంతసేపూ వాళ్ళ సంభాషణ సాగుతుంది.

విషయాలన్నీ మాట్లాడడం పూర్తికాగానే తిరిగి వచ్చేస్తారు.

దటీజ్ ది సేఫెస్ట్ ఐడియా అని వాళ్ళ అభిప్రాయం.

ఇలా ప్రయాణించుతున్నప్పుడు వాళ్ళ మాటలు మరొకరు వినే అవకాశం తక్కువ. అంతేకాదు....ముందు జాగ్రత్తగా ఆ కారుకి "ఎలక్ట్రానిక్ లిజనింగ్ డివైజ్" కూడా బిగించారు.

ఆ ఎలక్ట్రానిక్ డివైస్ వున్నప్పటికీ మామూలు గదులలో అయితే సంభాషణలను మరొకరు వినే అవకాశం వుంది. కారులో అయితే ఇంజన్ శబ్దాలు వుంటాయి కాబట్టి....మరొకరు స్పష్టంగా వినే అవకాశం ఉండదు.

"రిపోర్టు ఏది?" అడిగాడు షకావత్ ఆత్రుతగా.

మాట్లాడలేదు హరిహరన్.

"అయాం ఆస్కింగ్ ఫర్ రిపోర్ట్"



"ఈసారి....రిపోర్ట్‌లో రాయడానికి ఏమీలేదు."

"అంటే"

"రాసివున్న రిపోర్ట్ ఏమీలేదు. నేను నోటితో చెప్పేదే రిపోర్ట్."

"నాన్సెన్స్....వేళాకోళమా!"

"కాదు షకావత్ నిజం. ఈసారి నీకు ఇవ్వడానికి రాసి వున్న రిపోర్ట్ ఏమీ లేదు."

"ఇది చాలా అన్యాయం. మన ఎగ్రిమెంట్ ప్రకారం నా కూతురికి సంబంధించిన రిపోర్టు ప్రతి నెల ఒకటో తారీఖుకి ఇవ్వాలి ఈసారి ఐదో తారీఖుకి కలుస్తున్నాం. ఇంకా పైగా రిటెన్ రిపోర్ట్ ఏమీ లేదంటున్నావు?" ఆవేశంగా మారిపోయింది షకావత్ కంఠం.

నవ్వాడు హరిహరన్.

"నీ ఆత్రుత నేను అర్థం చేసుకోగలను. కన్నకూతురి మీద వున్న మమకారం నీచేత అలా కోసంగామాట్లాడిస్తోంది."

"నా కూతుర్ని కిడ్నాప్ చేశారు. ఎక్కడుందో తెలియదు. ఇంత వరకు ఆమెను నాకు చూపించలేదు. క్షేమంగా వుందనే చెబుతున్నారు. ఫోటోలు కూడా చూపిస్తున్నారు. ఆమె నన్ను మర్చిపోయేలా హిప్నాసిస్ ద్వారా ఆమె మెదడును కంట్రోల్ చేసేశారు. ఆమె గురించిన రిపోర్టు నెలనెలా ఇస్తున్నారు. అవి చూసుకునే నా కూతుర్ని చూసినంత ఆనందం పొందుతున్నాను. నిజం చెప్పు....ఈ నెలలో రిపోర్టు ఏదీ తయారుచేయ లేదు అంటున్నావు. నా కూతురికి ఏమయింది?"

"ఏమీ అవలేదు షకావత్"

"ఆమె ప్రాణానికి ఏమయినా హాని తలపెట్టారా!" అతని గొంతు ఆర్ద్రమైంది.

"షకావత్....నువ్వు అతిగా ఆలోచిస్తున్నావు. ఆమె క్షేమంగా వుంది."

"ఎక్కడుంది?"

"ఎక్కడయితేనేం.... ఇండియాలోనే వుందనుకో, లేకుంటే

జపాన్‌లో వుందనుకో....అదీ కాదంటే బ్రిటన్‌లో, ఫ్రాన్స్‌లో, నెదర్లాండ్‌లో....నీ ఇష్టం వచ్చిన చోట....బట్....షి ఈజ్ సేఫ్. ఆమెను నేనూ అభిమానిస్తున్నాను. ఆమె నాకు కూడా కూతురులాంటిదే. అందుకే చంపలేదు. ఈ నెలలో చాలా సమస్యలు వచ్చాయి. అందువల్ల రిపోర్ట్ తయారుచేయలేకపోయాం. అంతే....అయామ్ వెరీసారీ"

"కనీసం ఆమె ఫోటోలయినా వున్నాయా?"

"ష్యూర్....యు కెన్ సీ దెమ్" అంటూ కోటు జేబులోంచి ఒక కవర్ తీసి అతని ఒడిలో పడవేసి చిన్న లైట్ ఆన్ చేశాడు హరిహరన్.

ఆత్రుతగా కవర్ అందుకున్నాడు షకావత్.

అందులో సుమారు ఇరవై వరకు 5X7 అంగుళాల సైజు కలర్ ఫోటోలున్నాయి.

త్వత్వరగా వాటిని చూడసాగాడు షకావత్.

బయట పొగమంచు దట్టంగా పడుతోంది. విండ్ షీల్డ్ మీద పలుచని నీటి పొరలాగా ఏర్పడుతోంది.

వైపర్స్ ఆన్ చేసి రెండు నిముషాలపాటు వుంచి ఆఫ్ చేశాడు హరిహరన్. రోడ్డు క్లియర్‌గా కనపడసాగింది.

క్షణం ఆగి హెలోజన్ లైట్స్ ఆన్ చేశాడు.

శక్తివంతమైన హెలోజన్ లైట్ల వెలుగు రోడ్డుమీద పడడంతో దారి మరికొంత స్పష్టంగా కనపడసాగింది.

"హరిహరన్....ఈ రెండు ఫోటోలలో నా కూతురు ప్రక్కన ఈ వ్యక్తి ఎవరు?"

ఆ ప్రశ్న అతను అడుగుతాడని హరిహరన్ ఊహించినదే.

"నీకా వ్యక్తి తెలుసు"

"నాకు తెలుసా!"

"అవును. కొంచెం ఆలోచిస్తే గుర్తువస్తాడు"

కొద్ది క్షణాలు గడిచాయి.

"ఎక్కడో చూసినట్లుంది"



"అవును గుర్తువచ్చింది. ఇతను ప్రైవేట్ డిటెక్టివ్. బొంబాయిలో వుంటాడు అవునా?"

"అవును. అతని పేరు గౌతమ్."

"ఆ గుర్తువచ్చింది. ఇతన్ని ఎప్పుడో ఆరు ఏడు ఏళ్ళ క్రిందట చూశాను. ఇప్పుడు ఇతను ఇక్కడెలా వున్నాడు?" ఫోటో మీద వేలువుంచి అడిగాడు.

"ఏదో ఇన్వెస్టిగేషన్‌కి వెళ్ళాడు.అక్కడ నీ కూతుర్ని చూసి గుర్తుపట్టాడు. ఇప్పుడు ఆమెతో స్నేహం పెంచుకున్నాడు. ఆమెను ఎవరు కిడ్నాప్ చేసారో తెలుసుకునే ప్రయత్నం మొదలుపెట్టాడు. బెంగుళూరు ఇన్స్యూరెన్స్ కంపెనీకి ఫోన్ చేశాడు. ఒక హిప్నాటిస్ట్ దగ్గరకు ఆమెను తీసుకువెళ్ళి ఆమె మర్చిపోయిన గతం గుర్తువచ్చేలా చేయించాడు"

"అంటే....ఇప్పుడు ఆమెకు నేను తండ్రినని తెలిసిందా! నన్ను గుర్తుపడుతుందా?" ఒకింత సంతోషంగా అడిగాడు షకావత్.

"అది అప్రస్తుతం....చెప్పేది విను....ఆ యువకుడు ఇప్పుడు పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు"

"మరి ...ఈ గౌతమ్‌కి నేను క్లైయింట్‌ని. ఇంతవరకు నాకు ఒక్క మాట కూడా ఇన్‌ఫార్మ్ చెయ్యలేదేమిటి? .. నా కూతురిని వెతకమని అపాయింట్ చేసింది నేనే. లక్షల్లో డబ్బు ఇచ్చాను. ఇప్పుడు ఆమె ఆచూకీ తెలిసింది కదా! .. నాకు తెలియచెయ్యాలి కదా!"

అక్కడే పొరపాటు పడుతున్నావు షకావత్. గౌతమ్ అమోఘమైన తెలివితేటలున్నవాడు. ఈ కిడ్నాప్ వెనుక నీ హస్తం వుందని అతనికి అనుమానం వచ్చింది. అందువల్ల నీకు తెలియజేయలేదు. పూర్తి సాక్ష్యాలతో, ఆధారాలతో, వివరాలు సేకరించాక, పత్రికల వాళ్ళని పిలిచి వాళ్ళకి ఈ న్యూస్ ఇచ్చి....ఇది అందరికీ తెలిసిన తరువాతనే నీ దగ్గరకు వస్తాడు."

తెల్లముఖం వేసుకుని చూడసాగాడు షకావత్.

సమయం రాత్రి పదకొండు గంటలు దాటింది.

పొగమంచు ఇంకా దట్టంగా అయింది.

హాలోజన్ లైట్ల వెలుగు కూడా మహా అయితే పదిహేను అడుగుల దూరం మించి కనపడటం లేదు.

కారుని స్లో చేసి లెఫ్ట్ మార్జిన్‌కు తీసుకుని ఆపేశాడు హరిహరన్.

కొంతసేపు అయితేనేకానీ డ్రైవ్ చేయటం అసంభవం అనిపిస్తోంది.

"ఇప్పుడు నా కూతుర్ని ఏం చేయబోతున్నారు?" అడిగాడు హరిహరన్‌ని.

"అదే నిర్ణయించలేదు"

"ఎలాగూ ఆమెకు తన గతం గుర్తువచ్చింది కదా! నా దగ్గరకు పంపించకూడదా!....పది సంవత్సరాల పాటు ఆమెకు దూరంగా వున్నాను. ఇప్పుడయినా ఆమెతో వుంటాను."

"అసంభవం" ఖచ్చితంగా అన్నాడు.

ఒళ్ళు మండిపోయింది హరిహరన్ మాటకి.

"ఇప్పుడు నా కూతురికి, తన తండ్రి ఎవరో తెలిసిపోయింది. ఆమె నన్ను వెతుక్కుంటూ రాదని గ్యారంటీ ఏమిటి?" రెట్టించాడు.

"అది జరగదుగా!"

"అంటే ...ఏం చెయ్యబోతున్నారు?"

"బహుశా నీ కూతురిని ఇంటికి పంపిస్తాము"

వెన్నులో నుండి పురుగు పాకినట్లయి అదిరిపడ్డాడు షకావత్.

హరిహరన్ భాషలో ఇంటికి పంపడం అంటే అర్థం అంతకు ముందే తెలుసుకున్నాడు.

"నో....నా కూతురిని చంపడానికి వీలులేదు" చిన్నగా అరిచాడు.

"ఆమెను ఇంటికి పంపించడం తప్ప మరో మార్గం కనపడటం లేదు."

షకావత్ ముఖం ఎర్రగా అయింది.

"సరే....నా కూతురిని చంపడం నీ నిర్ణయమా!"



"నా నిర్ణయం కాదు.... ఇటువంటి నిర్ణయాలు తీసుకోవటానికి నేనెవరిని? నా కెపాసిటీ ఎంత? మిగతావాళ్ళ ఆలోచన అది. నా పైవాళ్ళ ఆలోచన మాత్రమే"

"అలా అయితే.... నా నిర్ణయం కూడా విను.... నా కూతురికి ఏ మాత్రం హాని జరిగినా, నా నుండి మీకు కావలసిన ఎటువంటి వివరాలు రావు. ఎటువంటి సహకారమూ రాదు" ఆవేశంగా అన్నాడు.

"ఏం బెదిరిస్తున్నావా?"

"బెదిరింపు కాదు .... నా కూతురే పోయాక .... నేను వుంటేనేం? పోతేనేం?.... నేను చావుకు సిద్ధమే. నా కూతురిని చంపడం వల్ల నేనెంత నష్టపోతానో, నా నుండి ఎటువంటి సహకారం లేకపోతే మీరు అంతకు నాలుగింతలు నష్టపోతారు. జాగ్రత్త." షకావత్ మహా మొండివాడు. అతని సంగతి హరిహరన్‌కి తెలుసు. నిజంగా మౌనికని చంపిన రోజున అతను ఎదురుతిరుగుతాడని, దానివల్ల నష్టం చాలా వుందని తెలుసు. అయినా బెదిరింపు కోసం అన్నాడు.

"షకావత్.... నువ్వు ఆవేశపడుతున్నావు.... కూల్ డౌన్. నీ కూతుర్ని ఇంటికి పంపకుండా మరో మార్గం వుంది"

"ఏమిటది?"

"మరోసారి కలకత్తా పంపించడమే"

"కలకత్తాకి ఎందుకు?"

"డాక్టర్ భట్టాచార్య దగ్గరకు"

ఉలిక్కిపడ్డాడు అతని పేరు విని.

భట్టాచార్య హిప్నాటిస్ట్. అతను నీగ్రో పురుషుడికీ, బెంగాలీ స్త్రీకి పుట్టిన వ్యక్తి. అందుకే మూడొంతులు నీగ్రోలాగ, ఒక వంతు ఇండియన్‌లాగా వుంటాడు. అతనికి యాక్సిడెంట్‌లో చేయి తెగిపోయింది. మౌనిక మీద హిప్నోసిస్ ప్రయోగించి తండ్రిని మర్చిపోయేలా చేసింది అతనే.

"భట్టాచార్య దగ్గరకు....ఎందుకు?"

"మళ్ళీ ఆమెను హిప్నటైజ్ చేసి, ఈ గతం అంతా, అంటే గౌతమ్‌తో సహా మర్చిపోయేలా చేసి, మరో ప్రాంతంలో వుంచడమే.

అక్కడ ఆమె తిరిగి కొత్త పేరుతో కొత్త జీవితం మొదలు పెడుతుంది"

"ఆమె జీవితంతో ఆడుకుంటున్నారు" బాధగా అన్నాడు.

"తప్పదు. అదొక్కటే మార్గం. అయితే అందులో ఒక సమస్య వుంది. అది కూడా నీకు ముందుగానే చెబుతున్నాను. ఆ తరువాత చెప్ప లేదంటూ గొడవపెడతావు."

"ఏమిటది?"

"ఆమె ఇప్పటికి రెండు సార్లు హిప్నోసిస్‌కి గురి అయింది. ఒక సారి భట్టాచార్య, మరోసారి డాక్టర్ పరమాత్మ — ఆమెను హిప్నోథెరపీలో వుంచారు. మరోసారి చేస్తే అదివాళ్ళ మీద పనిచేయవచ్చు.... చేయక పోవచ్చు.

ఇంకొక ప్రమాదం ఏమిటంటే.... ఆమె పిచ్చిదానిగా మారే ప్రమాదం కూడా వుందట డాక్టర్ భట్టాచార్య చెప్పాడు. ఏదయినా కూడా ఫిఫ్టీ ....ఫిఫ్టీ ఛాన్సెస్"

అదిరిపడ్డాడు షకావత్.

"హరిహరన్ .... నా కూతుర్ని చంపెయ్యండి. పిచ్చిదానిగా మాత్రం చేయకండి. నా అందమైన కూతుర్ని పిచ్చిదానిగా నేను చూడలేను. బెటర్ .... యు కిల్ హర్ .... ఆమెను ఒక్కసారిగా చంపెయ్యండి" నీళ్ళు నిండిన కళ్ళతో అన్నాడు షకావత్.

"షకావత్....డోంట్ బి ఎమోషనల్ ....అంతగా ఉద్రేకపడకు. ఆమె పిచ్చిదిగా మారే అవకాశం వుందన్నానుకానీ, అవుతుందనలేదు కదా! ... అయినా నువ్వు మూర్ఖుడివి....నీకు ఆ రోజే చెప్పాను. ప్లాస్టిక్ సర్జరీ చేసి నీ కూతురి రూపురేఖలు మార్చేద్దాము. దాని వల్ల ఎవరూ గుర్తుపట్ట లేరు అని.... వినలేదు.... ఇప్పుడు గౌతమ్ గుర్తుపట్టాడు."

"నా కూతురు చాలా అందమైనది. ఆమె రూపు మారటానికి వీలు లేదన్నావు. సమస్యలు ఎలా వస్తున్నాయో చూడు."

"ఆ గౌతమ్ కేసు ఇంతవరకు తీసుకువచ్చేనదాకా ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?" కక్షగా అన్నాడు షకావత్.



"ఒంటరిగాడు ... పిల్ల వెధవ.... ఏం చేయగలడని అశ్రద్ధ చేశాం. ఇప్పుడు తల మీద బండగా మారాడు."

"ఇప్పుడు గౌతమ్ ఎక్కడున్నాడు?"

"నీ కూతుర్ని తీసుకుని, ఇన్స్యూరెన్స్ కంపెనీలో నిజానిజాలు తెలుసుకోవడానికి బెంగుళూరు వెళుతున్నాడు"

"ఎక్కడి నుంచి వెడుతున్నాడు?"

"అది నీకు అనవసరం అని చెప్పాను కదా!"

"వాళ్ళు బెంగుళూరు వెళ్ళి ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళితే నిజాలు బయటికి వస్తాయి కదా! మౌనిక, పుట్టణ్ణ అనే వ్యక్తి కూతురు కాదని తెలుస్తుంది కదా! వాడు అక్కడికక్కడే పత్రికలవాళ్ళని పిలిచి ఈ విషయం వాళ్ళకి చెప్పడని గ్యారెంటీ ఏమిటి?"

"వాళ్ళు అసలు ఇన్స్యూరెన్స్ కంపెనీ వరకు వెళితేగా?"

"అంటే....ఏం చేస్తావు?"

"అవరోధాలు సృష్టిస్తాను. వాళ్ళు ఇన్స్యూరెన్స్ కంపెనీని చేరేలోపు గానే కొత్త కొత్త విషయాలు చూపించి వాళ్ళ దృష్టి మరల్చుతాను. వాళ్ళు అక్కడి నుండి కలకత్తా వచ్చేలా చేస్తాం."

"ఎలా?....కిడ్నాప్ చేస్తారా!"

"కాదు....వాళ్ళంతట వాళ్ళే కలకత్తా వెతుకుంటూ వచ్చేలా చేస్తాం. నీ కూతురు, గౌతమ్ ఇద్దరూ కలిసి డాక్టర్ భట్టాచార్య దగ్గరకు వచ్చేలా చేస్తాం."

"అసలు గౌతమ్ ఎందుకు?"

"తొందరపడకు....అక్కడకు వచ్చిన మరుక్షణం ...గౌతమ్ జీవితం ఆఖరు. నీ కూతురికి భట్టాచార్య చేత ట్రీట్‌మెంట్ మొదలు"

"ఆమెకు ఆ ట్రీట్‌మెంట్ మరోసారి జరగకుండా ఆపలేవా?" దీనంగా అడిగాడు షకావత్.

"అసంభవం"

"మరి ఆమె పిచ్చిదయిపోతే?"

38)

"అవకపోవచ్చు"

"ఒకవేళ అయితే?" రెట్టించాడు.

"నువ్వే చెప్పావుగా నా కూతుర్ని పిచ్చిదాన్నిగా చూసే బదులు ఆమె శవాన్ని చూడటానికి ఇష్టపడతాను అని...."

"అంటే?"

"ఆమె పిచ్చిదిగా మారితే .... అప్పుడే ఇంటికి పంపించివేద్దాం" చాలా మామూలుగా అన్నాడు హరిహరన్.

ముఖం మీద బాంబు విస్ఫోటనం చెందినట్లు అదిరిపడ్డాడు షకావత్.

o o o

సమయం—సాయంకాలం ఆరు గంటలు. కోలాహలంగా ఉంది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్.

"యువర్ అటెన్షన్ ప్లీజ్....బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ ఈజ్ రెడీ టు స్టార్టు ఫ్రం ప్లాట్‌ఫాం నెంబర్ టూ" అంటూ అనౌన్స్‌మెంట్ వినిపించింది.

పరుగులాంటి నడకతో ఫస్ట్‌క్లాస్ ఎ.సి. కంపార్ట్‌మెంట్‌లోకి దూరారు గౌతమ్, శుభాంగి.

"థ్యాంక్ గాడ్....నిముషం లేటయినా ట్రెయిన్ వెళ్ళిపోయేది" ఆయాసంతో సగం మాటలు మింగుతూ అంది శుభాంగి.

చిన్న జర్క్‌తో కదిలింది ట్రైన్.

"నిముషం లేటు కాదు....పది సెకన్లు లేటయితే కూడా ట్రెయిన్ వెళ్ళిపోయేదే!" అన్నాడు సూటుకేస్‌లు పైన పెడుతూ.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

వేగం అందుకుంది ట్రైన్.

కిటికీలో నుండి బయటికి చూడసాగింది ఆమె.

ఈ రోజు ట్రెయిన్ ఎక్కేవరకు ఆమెకు అనుమానంగానే ఉంది. మానసికంగా తెలియని ఆందోళనకి గురిఅయింది.

మెట్ల మీద నుండి దిగుతుంటే .... క్రిందపడిపోతానేమోనని భయం....



తలనొప్పి వస్తున్నట్లు ...కళ్ళు తిరుగుతున్నట్లు .... రకరకాల భయం....

ఇంట్లో నుండి బయటికి వచ్చాక కిచెన్‌లో గ్యాస్ ఆఫ్ చేయలేదన్న అనుమానం....

టాక్సీలో ఎక్కాక ఇంటి తాళం సరిగా వేయలేదేమోనన్న అనుమానం....

రైల్వేస్టేషన్‌కి వస్తుండగా రిజర్వేషన్ టిక్కెట్ ఇంట్లో మర్చిపోయివచ్చానన్న విషయం గుర్తుకురావటం... ఫలితం....మళ్ళీ ఇంటికి పరిగెత్తడం....టెన్షన్....ఇలా చాలా అడ్డంకులు....అవరోధాలు....కొద్ది సెకన్లు ఆలస్యం అయితే... ట్రెయిన్ మిస్ అయ్యేవారు....

"ఏమిటి శుభా అలోచిస్తున్నావు?" అడిగాడు.

తల తిప్పి అతనివైపు చూసి నవ్వింది. ఆమె ఏమీ లేదు అన్న అర్థం వచ్చేలాగ.

ఆ నవ్వు చాలా అందంగా కనిపించింది.

ఈమెది అసాధారణమైన అందం అనుకున్నాడు. ఆమె కళ్ళలోకి పరిశీలనగా చూస్తూ—

"మరి .. గౌతమ్ నువ్వేమిటి ఆలోచిస్తున్నావు?"

"ఆ విషయం నీతో చెప్పకూడదులే"

"ఎందుకు?"

చటుక్కున లేచి ఆమె పెదవులమీద గాఢంగా చుంబించాడు

శరీరం విద్యుత్ ఘాతానికి గురి అయినట్లుగా జలదరించింది.

ఆమె కన్నులు అరమోడ్పులయ్యాయి.

అదొక అనిర్వచనీయమైన అనుభూతి ఆమెకు.

కొన్ని నిముషాలపాటు మాట్లాడలేకపోయిందామె.

"ఎలా వుంది? ఈ ఎక్స్‌పీరియన్స్!" కొంటెగా చూస్తూ అన్నాడు.

తడిగా మెరుస్తున్న పెదవులతో ఆమె మరింత అందంగా కనిపించింది.

ఆమె కనురెప్పలు క్రిందికి వాలాయి

"మాటలలో....చెప్పలేను" తడబాటుగా అంది.

ఆ సమాధానానికి ఏదో ఆనందంగా పీలయ్యాడు.

ఒక్క ఉదుటున లేచి అతని పెదవులను తన పెదవులతో కప్పి వేసింది.

అతని రెండు చేతులూ ఆమె చుట్టూ బిగుసుకున్నాయి.

వేగంగా దూసుకుపోతోంది రైలు.

o o o

పంప్... పంప్....పంప్....

శబ్దం చేస్తోంది బార్ బెల్....ఆ శబ్దానికి జిమ్ ప్రతిధ్వనిస్తోంది.

శరీర కండరాలు అన్నీ బిగించి రాడ్స్ పట్టుకుని లాగుతున్నాడు విలియమ్స్.

శరీరానికి అతి కష్టమయిన ఎక్సర్‌సైజ్ అది.

పశుబలంతో చేస్తున్నాడు. శరీరం అంతటా స్వేదం మెరుస్తోంది.

అతని పాదాల మధ్య దూరం ఇరవై నాలుగు అంగుళాలు ఉంచాడు. శక్తినంతా ఉపయోగించి ఎక్సర్‌సైజ్ చేస్తున్నాడు.

దాని తరువాత జెఫర్ సన్‌లిఫ్ట్స్....

కాళ్ళకు, చేతులకు, నడుముకి, శరీరంలో అన్ని భాగాలకు ఎక్సర్‌సైజ్ చేస్తున్నాడు.

శరీరంలోని రక్తం అంతా ముఖంలో పంప్ అయినట్లుగా ఎర్రగా ఉబ్బినట్లయి వుంది అతని వదనం....కళ్ళు....

"సార్....టైమ్ అయింది"

నౌకరు మాట విని వ్యాయామం ఆపాడు విలియమ్స్

అక్కడి నుండి కదిలి ఈజీ ఛైర్‌లో కూర్చున్నాడు కళ్ళు మూసుకుని. శ్వాసబలంగా తీసుకుంటున్నాడతను.

అతని శ్వాసకి అనుగుణంగా కదులుతోంది విశాలమైన అతని ఛాతీ....

గ్లాస్‌లో స్కాచ్‌పోసి అతని చేతికిచ్చాడు నౌకరు.

ఒకే ఒక్క గుక్కలో అది తాగి....గ్లాస్ అక్కడ ఉంచాడు.



కొన్ని నిమిషాలపాటు అలాగే వున్నాడతను.

స్వేదంతో అతను ధరించిన బనియన్ ముద్దగా అయిపోయింది.

ఛైర్‌లో నుండి లేచి నిలువుటద్దం దగ్గరకు నడిచాడు. రెండు చేతులు పైకెత్తి, భుజాలు, కండరాలు ఎలా ఉన్నాయో చూసుకున్నాడు.

అదే సమయంలో రింగ్ అయింది ఫోన్. ఫోన్ అందుకున్నాడు.

ఆ ఫోన్‌కి కూడా ఎలక్ట్రానిక్ డివైస్ వుంది. అది ఉంటే, ఆ ఫోన్ సంభాషణ మరొకరు వినటం సాధ్యంకాదు.

"హలో"

"గుడీవినింగ్ విలియమ్స్ .... నేను మేథ్యూస్‌ని మాట్లాడుతున్నాను"

"ఆ....ఎక్కడి నుండి మాట్లాడుతున్నావు మేథ్యూస్ ?"

"బెంగుళూరు నుండి"

"ఏమిటి విషయం?"

"ఆమె బయలుదేరింది"

"ఎవరు?"

"శుభాంగి"

క్షణకాలం సైలెంట్ అయ్యాడు.

అంటే....డాక్టర్ భట్టాచార్య ఆమె మెదడును కంట్రోల్ చేసి అవరోధాలు సృష్టించి అక్కడి నుండి కదలకుండా చేసిన ప్రయత్నం ఫలించలేదన్నమాట.

"ఇప్పుడు ఎలా?" ఒకింత టెన్షన్ ధ్వనించింది మాథ్యూస్ గొంతులో.

"డోంట్ వర్రీ....ఇది పెద్ద సమస్యకాదు....వాళ్ళు బెంగుళూరులో దిగగానే ఫాలో అవు"

"ఆ ప్రైవేట్ డిటెక్టివ్‌ని చంపెయ్యమంటారా?

"ఆ డిటెక్టివ్‌ని చంపినా చంపకపోయినా ఆమె ప్రాణం మాత్రం మనకు చాలా ముఖ్యం"

"ఏం....మరెవరైనా ఆమెను చంపాలనుకుంటున్నారా?"

"అశోక్ నుండి ఆమెకు హాని కలగవచ్చు"

"అశోక్ నుండా!"

"అవును....మొన్న వచ్చాడు. ఏదేదో వాగాడు. తనేమైనా చేస్తాడే మోనని అనుమానం"

"నేను చూసుకుంటాను. అశోక్‌ను త్వరలో తప్పించడం మంచిదేమో!"

"త్వరలో అశోక్‌కు పట్టబోయే గతి అదే....ఏమయినా అవసరం అయితే మళ్ళీ ఫోన్ చెయ్యి" అన్నాడు.

"సరే"

లైన్ కట్ అయింది.

"హాయ్ డియర్" అన్న పిలుపువిని తలతిప్పాడు.

చైర్‌లో కూర్చుని వుంది టీనా.

టీనా కొంచెం పొట్టిగా ఉంటుంది. ఖచ్చితమైన కేరళ అమ్మాయిలా ఉంటుంది. వంకులజుట్టు....వదులుగా వేసినజడ....ఛామనచాయ రంగు....పొందికగా వుండే అందాలు.

అప్పటికి సంవత్సరం నుండి అతని దగ్గరకు వస్తోంది ఆమె.

క్యాజువల్ వేర్ ధరించాడు విలియమ్స్.

"యువార్ వెరీ సెక్సీ డియర్" అంది స్కాచ్ గ్లాసు అతని దగ్గరకు తీసుకువస్తూ.

అది అందుకుని "థాంక్స్" అన్నాడు.

ఆమె మరో గ్లాసు తెచ్చుకుంది.

"పద....నీ బెడ్‌రూమ్‌లో కూర్చుందాం" అంటూ ముందుకు కదిలింది.

బుక్స్, ఫైల్స్, కవర్స్ అన్నీ తీసి షెల్ఫ్‌లో పెట్టసాగింది ఆమె.

ఆమె ఆ కాయితాలు వుంచే సమయంలో నాటిలో నుండి ఒక ఫోటో క్రిందకి జారి కార్పెట్‌మీద పడింది.

అది ఆమె గమనించలేదు.



అది శుభాంగి ఫోటో. అందంగా....సమ్మోహనంగా నవ్వుతున్న ఫోటో అది.

వడిలో వచ్చి కూర్చుంది టీనా.

"డల్‌గా వున్నావేం డార్లింగ్?" మెడచుట్టూ చేతులువేసి పెదవుల మీద ముద్దు పెట్టింది.

శుభాంగిని ఒక్కసారయినా ముద్దుపెట్టుకోగలిగితే ..జన్మ సార్థకం అవుతుంది అనుకున్నాడు.

"యువార్ హేండ్సమ్ డియర్" అతని ఛాతీ మీద ముద్దుపెడుతూ అంది.

అతని దృష్టి క్రింద పడివున్న ఫొటో మీదే ఉంది.

ఏ చలనం లేకుండా ఎటోచూస్తున్నవిలియమ్స్ దృష్టివున్న వైపుకు చూసింది.

ఆమెకు శుభాంగి ఫొటో కనిపించింది.

"విలియమ్స్....ఆమె ఎవరు....ఎవరిదా ఫోటో?" అడిగింది అతని కళ్ళల్లోకి అనుమానంగా చూస్తూ.

అతని నుండి ఏ సమాధానం రాలేదు.

"విలియమ్స్!....ఎవరా అమ్మాయి?" రెట్టించింది.

చిరాకుగా అనిపించింది ఆమె ప్రశ్నించిన విధానం.

"చెప్పవా?" తిరిగి ఆమె అడిగింది.

"టీనా.... నీకు చెప్పేది కాదు ఇది"

"ఎందుకు?"

"చెప్పకూడదు?"

"అదే ఎందుకంటున్నాను. నా కంటే అందంగా వుంది కదా! అందుకే ఆమె గురించి చెప్పటంలేదు కదా! ఏం....దాన్ని మరిగావా! ఇంక నేనెందుకు?"

విలియమ్స్‌లో సహనం అడుగంటింది.

విసురుగా ఆమెను తోసాడు.

వెల్లకిలా కార్పెట్ మీద పడిందామె.

వెంటనే లేచి కూర్చుంది. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నట్టుగా వున్నాయి.

"నీ లాంటి క్రిమినల్ నన్ను భార్యగా చేసుకుంటాడని అనుకోవడమే పొరపాటు. ఇన్నాళ్ళు నన్ను వాడుకున్నావు. ఇప్పుడు ఇదిగో....ఇదెవత్తో వచ్చింది....ఛీ....కుక్కబుద్ధి .. బాస్టర్డ్....థూ." అని విసురుగా వెళ్ళిపోయింది టీనా.

కసిగా పళ్ళుకొరికి ఆమె వెళ్ళినవైపే చూస్తూ కొంతసేపు వుండిపోయాడు.

దృష్టి మరల్చిన అతనికి క్రిందవున్న శుభాంగి ఫోటో కనిపించింది చైర్‌లోంచి లేచి ఆ ఫోటోని చేతిలోకి తీసుకున్నాడు.

టీనా మూర్ఖురాలు! ఆమె అనుకున్నట్టుగా తనకి, శుభాంగికి ఏ సంబంధం లేదు! ఇంతవరకు ఆమెను ప్రత్యక్షంగా చూడలేదు కూడా.

నిజంగా....శుభాంగితో ఒక్క రోజు గడపగలిగితే....

ఆ రోజున ఆమె తన శరీరాన్ని....కండలు తిరిగిన బాడీని చూసి మెచ్చుకోవాలి....మోహించాలి....ఈ బలిష్టమైన బాహువుల్లో ఆమె నలిగిపోవాలి.

కలల్లో తేలిపోతున్నాడు విలియమ్స్.

ం ం ం

ఏదో శబ్దం....

అప్పుడే నిద్ర పట్టిన గౌతమ్ ఉలిక్కిపడి లేచాడు.

అప్పుడు అర్థం అయింది ఎవరో తలుపుమీద దబదబా బాదుతున్నారని.

ఉదయం నాలుగు గంటలకి బెంగుళూరులో ట్రెయిన్ దిగారు గౌతమ్ శుభాంగి.

చలి విపరీతంగా వుంది.

అర్జెంటుగా మనం ఒక హోటల్‌లో రూమ్ తీసుకుని కొంతసేపు నిద్రపోయి రిలాక్సయి, పది గంటలకి ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళదాం" అన్నాడు గౌతమ్.



అన్నట్టుగానే ఇద్దరూ రైల్వేస్టేషన్ కి దగ్గరలో వున్న ఒక మంచి హోటల్‌లో బస చేశారు.

పడుకునేసరికి ఐదు అయింది.

మరోసారి శబ్దం అయింది డోర్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా బ్రీఫ్‌కేసులోని ఆటోమేటిక్ రివాల్వర్ బయటికి లాగాడు.

"గౌతమ్" ఆమె లేచి ముందుకు రాబోయింది.

కదలద్దు అన్నట్టుగా సైగ చేశాడు గౌతమ్.

డోరు క్రింద భాగంలో ఏదో శబ్దం అయింది.

తల వంచి క్రిందికి చూశాడు.

బ్లాకలర్ కవర్ ఒకటి లోపలికి తోసారు ఎవరో.

అంటే తలుపు కొట్టిన దానికి అర్థం....ఈ కవర్ చూడమని అన్న మాట!

కవర్ చేతిలోకి తీసుకుని వెనక్కి వచ్చి బెడ్ మీద కూర్చున్నాడు.

"ఏమిటది?" అడిగింది.

"అదే చూస్తున్నాను" అతికించి వున్న కవర్‌ని జాగ్రత్తగా ఓపెన్ చేశాడు.

అందులో నుండి ఒక కాయితం బయటికి వచ్చింది.

అందులో నల్లని బాల్‌పాయింట్ పెన్‌తో రాసిన అక్షరాలున్నాయి.

ఈ విషయం పైకి చదవొద్దు. మనసులో చదువుకో. నువ్వు మాట్లాడే ప్రతి మాటని వినే డివైజ్ నీ రూమ్‌లో బిగించి వుంది. నీతో ఒకసారి మాట్లాడాలి. విశ్వేశ్వరయ్య మ్యూజియం దగ్గరకు రా. ఈరోజు ఉదయం సరిగ్గా పది గంటలకు. నిన్ను ఎవరైనా ఫాలో అవుతారు. జాగ్రత్త. ఈ కాయితం మీకు పంపటం నా ప్రాణానికి ప్రమాదం అని నాకు తెలుసు. కానీ తెగించి పంపుతున్నాను.

-జైసింగ్ షకావత్

ఆ మేటర్ చదివి ముఖాముఖాలు చూసుకున్నారు ఇద్దరూ.

♦ ♦ ♦

సన్నని జల్లు పడుతోంది.

ఆ జల్లుకి తడిసిన రోడ్లు స్వచ్ఛంగా మెరుస్తున్నాయి.

హోటల్ నుంచి బయటికి వచ్చారు గౌతమ్, శుభాంగి.

అప్పుడు సమయం సరిగ్గా తొమ్మిదీ ఇరవై.

హోటల్ బయట ఆగి వున్నాయి మూడు నాలుగు అంబాసిడర్ టాక్సీలు.

గౌతమ్, శుభాంగిలను చూడగానే ముందుకు వచ్చాడు ఒక డ్రైవర్.

"టాక్సీ బేకా. సార్" కన్నడ భాషలో అడిగాడు.

కావాలని తిరిగి అదే భాషలో చెప్పాడు గౌతమ్.

"ఎక్కడికి?"

"విశ్వేశ్వరయ్యమ్యూజియమ్"

"రండి" ముందుకు నడిచాడు డ్రైవర్.

"ఒక్క నిముషం"

వెనక్కి తిరిగాడు డ్రైవర్

"ఒక కండిషన్ మీద నీ టాక్సి ఎక్కుతాం!"

అర్థంకానట్లు ముఖం పెట్టాడు డ్రైవర్.

"నీ టాక్సీలో మేము కూర్చొని, మనం కొంతదూరం వెళ్ళాక, ఏదో ఒక వాహనం మనల్ని ఫాలో అయ్యే అవకాశం వుంది. అలా ఫాలో అయితే నేను నీకు చెబుతాను. ఆ వాహనానికి దొరకకుండా డ్రైవ్ చేసి మమ్మల్ని మ్యూజియం దగ్గరకు చేర్చాలి."

ఒకింత భయంగా చూశాడు డ్రైవర్ ఇందులో ఏం తిరకాసుందో అన్నట్లుగా.

"డోంట్ వర్రీ....భయపడేదేమీ లేదు. నువ్వు అలా తప్పించి మమ్మల్ని మ్యూజియం దగ్గరకు చేర్చగలిగితే నీకు మీటరు చార్జీమీద ఐదురెట్లు ఇస్తాను."

డ్రైవర్‌లో తిరిగి ఏదో ఆశ తొంగి చూసింది.

"రండి" అన్నాడు.

"నీ డ్రైవింగ్ మీద నీకు నమ్మకం ఉందా!"



"చూస్తారుగా" అన్నాడు డోరు తెరుస్తూ.

ఇద్దరూ లోపల కూర్చున్నారు.

ఐదు నిముషాల తరువాత అతని దృష్టిని ఆకర్షించింది ఒక మారుతీవ్యాన్

"డ్రైవర్....మన వెనుక వస్తున్న బ్లూ మారుతీవ్యాన్‌ని చూడు" చెప్పాడు.

రియిర్‌వ్యూమిర్రర్ సరిచేసుకుని చూసాడు డ్రైవర్.

"అవును సార్ ...అదేనా మనని ఫాలో అవుతుంది"

"అదే అనుకుంటున్నాను నువ్వు స్పీడు పెంచాలి."

స్పీడు పెంచడానికి నాందిగా ముందుగా వైపర్స్ ఆన్‌చేసి, అద్దం మీద ఉన్న నీటి బిందువులు తుడిచివేశాడు.

రోడ్డు స్పష్టంగా కనపడసాగింది.

ఒక్కసారిగా స్పీడందుకుందికారు.

"గౌతమ్....నాకు భయంగా వుంది" అతని చేయి గట్టిగా పట్టుకుని వెనక్కి చూస్తూ అంది శుభాంగి.

* * *

ముందు వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్నాడు డ్రైవర్.

అదే స్పీడ్‌తో వ్యాన్ ఛేజ్ చేస్తోంది.

టెన్షన్‌గా వుంది గౌతమ్‌కి.

ఇంత ఫాస్ట్‌గా ఛేజ్ చేస్తున్నారు. అసలు షకావత్‌ని కలిసే అవకాశం వుంటుందా? ఇంతకీ అతనికి తను బెంగుళూరు వస్తున్నట్టు ఎలా తెలుసు?

ఆ లెటర్ పంపింది షకావతేనా....రకరకాలుగా తనని తాను ప్రశ్నించుకున్నాడు గౌతమ్.

సుమారు యాభై గజాలు వెనుకగా వ్యాన్ వస్తూనే వుంది.

"డ్రైవర్.... ఇలా అయితే మనం వాళ్ళను తప్పించుకోలేం.... నువ్వు ఎంత స్పీడుగా డ్రైవ్ చేసినా ఉపయోగం లేదు పద్ధతిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే."

"మీరు కంగారుపడకండి సార్. నేను చూస్తా కదా" అన్నాడు వేగం మరింత పెంచి.

స్పీడో మీటరు ఎనభై మీదకు వెళ్ళింది. ముందు రెండు సిటీ బస్‌లు వెడుతున్నాయి. సడన్‌గా లెఫ్ట్‌కి వచ్చి బస్‌లను ఓవర్‌టేక్ చేసి ముందుకు వచ్చేసాడు డ్రైవర్. ఇప్పుడు రెండు బస్‌ల వెనుక వుంది వ్యాన్. కానీ అదీ సరిపోదు. ఆత్రుతగా చూస్తున్నాడు. ఎదురుగా ట్రాఫిక్ సిగ్నల్స్ గ్రీన్ నుండి రెడ్‌కి మారుతున్నాయి. ఒక్కసారిగా యాక్సిలేటర్ రైజ్ చేసి సిగ్నల్ ఛేంజ్ సమయంలో దూసుకువెళ్ళిపోయాడు డ్రైవర్.

వెనుక వస్తున్న బస్‌లు రెండూ రెడ్ సిగ్నల్ రావడంతో ఆగిపోయాయి. ఆ వెనుకనే ఆగిపోయి వుండాలి వ్యాన్ కూడా. కనపడడం లేదు అందుకే అనుకున్నాడు గౌతమ్. కొద్ది గజాలు ముందుకెళ్ళి నో ఎంట్రీ అన్న బోర్డువున్న రోడ్డులోకి టర్న్ చేసి, మరో వంద గజాలు వెళ్ళి రైట్‌కి తిరిగి మళ్ళీ మెయిన్ రోడ్‌లోకి కారు తిప్పాడు డ్రైవర్.

"సార్.... ఎట్లా దాటించాను?" ఒకింత గర్వంగా అన్నాడు డ్రైవర్.

"నీ డ్రైవింగ్ చాలా బావుంది" మెచ్చుకోలుగా అన్నాడు. ఆనందంతో పొంగిపోయాడు డ్రైవర్.

"అయితే డ్రైవర్ ఈ షాప్స్ దగ్గర ఐదు నిమిషాలు కారు ఆపు" అన్నాడు.

"ఆపితే వ్యాన్ వస్తుందేమో సార్"

"అదే కన్‌ఫర్మ్ చేసుకుందాం" కారు ఆపాడు డ్రైవర్. ఇద్దరూ క్రిందికి దిగారు. జల్లు పెరిగింది.

"ఒక గొడుగు కొందాం పద...." అంటూ ఎదురుగా వున్న షాప్‌లోకి వెళ్ళి ఒక గొడుగు కొని, నాలుగైదు నిమిషాలు గడిపి బయటికి వచ్చారు ఇద్దరూ.

ఒకసారి ఆ చివరి నుండి ఈ చివరి వరకు చూసాడు గౌతమ్. వ్యాన్ లేదు. ఎవరూ తమని అబ్జర్వ్ చేయటం లేదని నిర్ధారించుకున్నాక తిరిగి వచ్చి కారులో కూర్చున్నారు.



"నేను చెప్పాను కదా సార్ ఎవరూ మన వెనుక రారు. వెళదామా మ్యూజియం వైపు" అన్నాడు కారు స్టార్ట్ చేస్తూ డ్రైవర్. తల ఊపాడు గౌతమ్.

మరో పది నిమిషాల తరువాత మ్యూజియం దగ్గర ఆగింది టాక్సీ.

టాక్సీ అతనికి మూడు వందల రూపాయిలు ఇచ్చాడు గౌతమ్.

"థాంక్యూ సార్" అని కళ్ళ కద్దుకుని జేబులో పెట్టుకొని వెళ్ళిపోయాడు అతను.

o o o

టైమ్ సరిగ్గా పది అయింది.

"ఇప్పుడు నా తండ్రిని చూడబోతున్నానా?" అడిగింది శుభాంగి.

"అవును. నీకు నీ తండ్రిని చూడబోతున్నావంటే ఎలా వుంది? పద....లోపల వున్నాడేమో షకావత్" అంటూ కదిలాడు గౌతమ్. ఆ వెనుకనే నడిచింది శుభాంగి.

"ఎక్స్‌క్యూజ్‌మీ...." వెనుక నుండి పిలిచారు ఎవరో.

ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి, సన్నగా పొడవుగా వున్నాడు. "మీ పేరు .... గౌతమ్ కదా!"

అవునన్నట్టు తల ఊపాడు.

"ఈ స్లిప్ మీకు జైసింగ్ షకావత్ ఇమ్మన్నాడు. ఇందులో ఒక టెలిఫోన్ నెంబర్ వుంది. మిమ్మల్ని అర్జెంట్‌గా ఆ నెంబర్‌కి ఫోన్ చేయమన్నాడు" అంటూ ఒక స్లిప్ అందించాడు.

"అంటే ...ఆయన ఇక్కడికి రాలేదా!"

లేదన్నట్టుగా తల ఊపి వెళ్ళబోయాడు.

"జస్టేమినిట్" గౌతమ్ మాటకి వెనక్కి తిరిగాడతను. "ఇంతకీ ....నేను మీకు ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు గౌతమ్.

"షకావత్ కొన్ని గుర్తులు చెప్పారు. దాని ద్వారా తెలుసుకున్నాను" అని మరో మాటకి అవకాశం లేకుండా వేగంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

స్లిప్ మడతలు విప్పాడు గౌతమ్.

అందులో ఫోన్ నెంబర్, హోటల్ రూం నెంబర్ వున్నాయి.

o o o

గౌతమ్....ఏమిటీ సంఘటనలు? మనం హోటల్‌లో దిగగానే ఎవరో కవర్ ఇచ్చారు. దాని ప్రకారం మ్యూజియంలో కలవాలి. ఈ లోపు కొందరు మనని ఛేజ్ చేశారు. ఇప్పుడు మరో వ్యక్తి వచ్చి హోటల్ రూమ్‌కి ఫోన్ చేయ్య మంటున్నాడు. నా కెందుకో భయంగా వుంది''

వాన జల్లు పెరగడంతో గొడుగు తెరిచి దాని క్రిందకు శుభాంగిని రమ్మన్నట్టుగా సైగ చేశాడు.

ఇద్దరూ టెలిఫోన్ బూత్ సమీపించారు.

నంబర్ డయిల్ చేశాడు.

కొద్ది క్షణాలు రింగయిన తరువాత ఫోన్ లిఫ్ట్ అయింది. ఆపరేటర్ లైన్ లోకి వచ్చింది.

''ప్లీజ్ కనెక్ట్ మి టు రూం నెంబర్ సిక్స్ వన్‌టు అడిగాడు.

''ప్లీజ్ హోల్డ్ ఆన్'' తీయగా వినిపించింది ఆపరేటర్ గొంతు.

మరికొద్ది క్షణాల తరువాత అవతల వైపు ''హలో'' గంభీరమైన గొంతు వినిపించింది.

అది జై సింగ్ షకావత్ మాట అని వెంటనే గుర్తు పట్టాడుగౌతమ్ కారణం....షకావత్ వాయిస్ చాలా మెటాలిక్‌గా వుంటుంది.

''ఈజిట్ జై సింగ్ షకావత్'' అడిగాడు.

''గౌతమ్....నా కూతురు ఎలా వుంది?....నీ దగ్గరే వుందా?'' ఉద్వేగం నిండిన గొంతులో అన్నాడు షకావత్.

''ఫైన్ సార్....మాట్లాడతారా ఆమెతో''

''నో ఇప్పుడు కాదు''

''ఇక్కడికి పది గంటలకి మెసేజ్ పంపి రాలేదేమిటి?''

''నా మీద అబ్జర్వేషన్ ఎక్కువగా వుంది. నేను మీకు మెసేజ్ పంపిన విషయం కొందరుపసిగట్టారు. ఇప్పుడు నేనుబయటికి రావడం నా ప్రాణానికే ప్రమాదం''



''ఇప్పుడు ఏం చేద్దామంటారు?''

''నువ్వు, శుభాంగి అర్జంట్‌గా ఇక్కడికి రండి'' అంటూ హోటల్ పేరు చెప్పాడు.

''క్షమించండి. నేను రావడం అసంభవం. తెలియని చోటకి.... మీరున్న ప్రదేశానికి వచ్చి రిస్క్ చేయలేను. ఇద్దరం....మరో క్రొత్త ప్రదేశంలో కలుద్దాం. అప్పుడు ఇద్దరికీ రిస్క్ వుండదు''

''గౌతమ్ .... నేను నిన్ను చంపే మనిషిని కాను. నీకు ద్రోహం చేసేవాడిని కాను. నన్ను నమ్మ. నువ్వు త్వరగా రావాలి. మీకు చాలా ముఖ్యమైన విషయం చెప్పాలి. ఏ మాత్రం ఆలస్యం చేసినా మీ ప్రాణాలు నా ప్రాణాలు కూడా రిస్క్‌లో పడతాయి''

చాలా హడావుడిగా ఎవరో తరుముకు వస్తున్నంత స్పీడుగా మాట్లాడుతున్నాడు.

ప్లీజ్ గౌతమ్. మిమ్మల్ని కలవాలని చాలా రిస్క్ చేసి వచ్చాను. ఢిల్లీ నుండి బెంగుళూరు డైరెక్ట్‌గా ఫ్లయిట్ వున్నా కూడా నన్నెవరయినా ఫాలో అవుతున్నారన్న అనుమానంతో చాలా శ్రమపడి రావాల్సి వచ్చింది బొంబాయికి ఫ్లయిట్‌లో వచ్చాను. అక్కడి నుండి పూనే వరకు ట్రెయిన్ లో....అక్కడి నుండి టాక్సీలో....ఇలా రకరకాలుగా....చాలా మంది కళ్ళుకప్పి వచ్చాను. ప్లీజ్ నన్నునమ్మ. నువ్వుత్వరగా రావాలి. ఇప్పటికే మన ఫోన్ సంభాషణ ఎవరయినా వింటున్నారేమోనని నా అనుమానం. నీ గురించి ఎదురు చూస్తున్నాను'' మరోమాటకి అవకాశం లేకుండా లైన్ డిస్కనెక్ట్ చేశాడు షకావత్.

ఫోన్ పెట్టి బిల్ పే చేసి....జరిగిన విషయం శుభాంగితో చెప్పాడు గౌతమ్.

''గౌతమ్....మనకేం ప్రమాదం జరగదు కదా'' భయంతో ఆమె కళ్ళ రెప్పలు టపటప కొట్టుకున్నాయి.

''లెటజ్ సీ'' అని ఆటుగా వెళుతున్న టాక్సీని పిలిచి ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు.

o o o

సరిగ్గా పది నిముషాల తరువాత హోటల్ కాంపౌండ్‌లోకి వచ్చి ఆగింది టాక్సీ.

ఫేర్ పే చేసి క్రిందికి దిగారు ఇద్దరూ.

కాప్స్యూర్‌లా వున్న లిఫ్ట్‌లో ఆరో అంతస్థుకి చేరుకున్నారు.

లిఫ్ట్‌లోనుండి బయటికి వచ్చాక అంది ఆమె. "ఎన్నో ఏళ్ళక్రిందట చూసిన తండ్రిని....మళ్ళీచూస్తున్నాను....ఆయన రియాక్షన్ ఎలాఉంటుందో ఆయన ఏం మాట్లాడితే నేను ఏం సమాధానం చెప్పాలో"

ఇద్దరూ 612 ముందు ఆగారు.

డోరు క్లోజ్ చేసి వుంది.

"నువ్వు ముందు లోపలికి వెళ్ళి మీ డాడీకి సర్ ప్రైజ్ ఇవ్వు. ఒక నిమిషం తరువాతనేనువస్తా" అన్నాడు డోరుతెరిచి ఆమెను ముందుకి తోస్తూ.

టకటకా కొట్టుకుంటున్న గుండెల మీద చేయి వేసుకుని లోపలికి వెళ్ళిందామె.

కెవ్వుమన్న శుభాంగి అరుపు వినిపించింది లోపలి నుంచి.

అదిరి పడ్డాడు గౌతమ్. మైగాడ్....ఆమెకేదో ప్రమాదం జరిగింది అనుకున్నాడు.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు....జేబులో నుండి రివాల్వర్ లాగి డోరు తోసుకుని రూమ్ లోకి వెళ్ళాడు.

లోపల....కళ్ళు రెండూ మూసుకుని గజగజా వణికిపోతుంది శుభాంగి.

ఆమెకు నాలుగు అడుగుల అవతల....నేలమీద రక్తపు మడుగులో పడి వున్నాడు జైసింగ్ షకావత్ నిర్జీవంగా.

ఆ గది మధ్యలో బోర్లా పడి వుంది షకావత్ శవం.

అతని చుట్టూ రెండు మూడుఅడుగుల దూరం వరకు రక్తం కారింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా లోపలి గదిలోని టాయిలెట్ లోకి వెళ్ళి చూశాడు గౌతమ్. హంతకులెవరైనా వున్నారేమోనని.



ఎవరూ లేరు

హత్య చేసి పారిపోయారు.

తిరిగి ముందు రూమ్‌లోకి వచ్చాడు.

మోకాళ్ళమీద కూర్చుని షకావత్ శవం వైపు చూస్తోంది ఆమె.

"శుభా.... బాధపడుతున్నావా?" ఆమె ప్రక్కనే కూర్చుంటూ అడిగాడు.

తల ఎత్తి అతని వైపు చూసింది.

ఆమె కళ్ళలో ఒకింత విచారం తప్ప చెప్పుకో దగ్గ బాధకనపడ లేదు.

నాకు ఎందుకో ఏడుపు రావటంలేదు లేదు గౌతమ్. అతను నాకు కన్న తండ్రి లాగ అనిపించడం లేదు. బహుశా పది ఏళ్ళగా దూరంగా వుండడం అందుకు కారణం ఏమో! అంతేకాదు....నన్ను కిడ్నాప్ చేసిన వ్యక్తులతో ఇతనికి సంబంధాలున్నాయి. అందువల్ల ఇతను నా తండ్రి అనుకోవడానికి కూడా అంతగా మనస్సు ఒప్పుకోవడం లేదు. అందువల్ల చనిపోయిన ఈ వ్యక్తి గురించి బాధపడుతూ ఇక్కడ వుండవలసిన అవసరం కూడా లేదు. పద....వెళ్ళిపోదాం....త్వరగా!" అంటూ లేచి నిలబడింది!

"కొంచెం వెయిట్ చెయ్యి.... ఇక్కడ మనకి కొంచెం పని వుంది" అన్నాడు చుట్టూ కలయచూస్తూ. "ఇక్కడ అంతా వెదుకుదాం. మనకి ఏమయినా ఇన్ఫర్‌మేషన్ దొరకొచ్చు" అన్నాడు.

"ఇక్కడా?"

"అవును. ఏమయినా డాక్యుమెంట్స్ వగైరా దొరికితే మనకి ఉపయోగం. షకావత్ మనకి చాలా ముఖ్యమైన విషయం చెబుతాను అని పిలిచాడు కదా! అందువల్ల ఖచ్చితంగా ఏదో ఒక ఇన్ఫర్‌మేషన్ దొరకవచ్చు" అంటూ త్వరత్వరగా అక్కడున్న వస్తువులు సోదా చేయనారంభించాడు.

40)

అతనివి రెండు సూట్‌కేస్‌లు వున్నాయి. ఒక సూట్‌కేస్ లాక్ చేసి వుంది.

కొంచెం బలం ఉపయోగించి మూత తెరవాలని ప్రయత్నించాడు. కానీ అది ఊడి రాలేదు. రెండవ సూట్‌కేస్ క్లిప్స్ కదిలించాడు.

అది లాక్ చేసి లేదు. క్లిప్స్ రెండూ ఓపెన్ అయ్యాయి. మూత తెరిచాడు. దాని నిండా బట్టలు, అవి చాలా వున్నాయి. అవన్నీ కార్పెట్ మీద బోర్లించాడు. అందులో ఐదారు జతల బట్టలు, ఒక సేవింగ్ సెట్....కొన్ని షుగర్ టాబ్లెట్స్....నెయిల్ కట్టర్, ఆయుర్వేదిక్ టూత్ పౌడర్ లాంటి వస్తువులు క్రింద పడ్డాయి. బట్టలు అన్నీ వెతికాడు. రెండు కవర్లు బయటపడ్డాయి. ఒకటి ఓపెన్ చేశాడు. అందులో కొన్ని టెండర్స్ తాలూకు పేపర్స్....మరికొన్ని పర్మిట్ పేపర్స్. రెండవ కవర్ తెరిచాడు అందులో సగం రాసిన ఉత్తరం ఒకటి వుంది.

అది శుభాంగికి షకావత్ రాసినది "ఇది చదువుదామా" అంటూ ఆతృతగా అందుకుంది ఆమె.

"ఇప్పుడంత టైము లేదు బయటికి వెళ్ళాక చదువుదాం" అని మిగతా కాగితాలు బయటికి లాగాడు. అందులో నుంచి కొన్ని పేపర్ కటింగ్స్ బయటికి వచ్చాయి. సుమారు పది ఏళ్ళ క్రిందటి కటింగ్స్ అవి. ఆ కటింగ్స్ అన్నింటిలోనూ ఒక వ్యక్తి వున్నాడు.

"గౌతమ్....ఇతను....ఇతను....నా కలలోకి వచ్చే ఆ ఒంటి చేతి వ్యక్తి.... వణికే స్వరంతో అంది ఆమె. డాక్టర్ భట్టాచార్య పరిశోధనలు....డాక్టర్ భట్టాచార్యకు సన్మానం....హిప్నాటిజంలో నూతన ప్రక్రియలు కనుగొన్న డాక్టర్ భట్టాచార్య....ఇలా రకరకాల హెడ్డింగ్స్‌తో వ్యాసాలు న్నాయి. అంటే....అతని పేరు భట్టాచార్య అన్నమాట అనుకున్నాడు.

"ఈ కటింగ్స్ మనకి చాలా ఉపయోగం. నీ బ్యాగ్‌లో పెట్టు క్విక్" అని ఆమెను అక్కడ్నించి బయల్దేరదీశాడు.

రెస్టారెంట్‌లో ఒక కార్నర్‌లో కూర్చున్నారు గౌతమ్, శుభాంగి.

వ్యానిటీ బ్యాగ్‌లో నుండి కవర్ బయటికి తీసింది శుభాంగి.

పేపర్ కటింగ్స్ టేబుల్ మీద వుంచే సమయంలో వెయిటర్ వచ్చాడు.



బ్రెడ్ టోస్ట్, శాండి విచెస్ ఆర్డర్ చేశాడు గౌతమ్.

ముందుగా శుభాంగికి రాసిన ఉత్తరం బయటికి తీసిందామె.

ఇద్దరి కళ్ళూ ఆ అక్షరాల వెంట పరుగెత్తాయి.

"డియర్ మోనా! నన్ను క్షమించు....నీ తండ్రిగా నీకు ఇవ్వవలసిన ప్రేమ, మమకారం ఇవ్వలేకపోయాను. నీ అభిమానం పొందలేకపోయాను. నా జీవితం వ్యర్థం. తల్లి లేని నిన్ను ప్రాణంగా చూసుకోవలసినవాడిని....కొన్ని ఒత్తిళ్ళకి తలఒగ్గి....నిన్ను ఒంటరిగా వదిలేసాను" ఇలా ఏదో....అతని మానసిక వ్యథ అంతా రాసాడు. అందులో ఉపయోగపడే విషయం ఏమీ లేదు.

"ఆ పేపర్ కటింగ్స్ ఇలా ఇవ్వు" అని అవి తీసుకుని టేబుల్ మీద వుంచి చదవసాగాడు.

బేరర్ ఫుడ్ ఐటమ్స్ టేబుల్ మీద వుంచాడు. ఆ సమయంలోవారి ధ్యాస తిండి మీద లేదు.

వరసగా ఆ కటింగ్స్ అన్నీ చదవసాగారు ఇద్దరూ.

అవి చదివాక భట్టాచార్య అంటే ఒక అవగాహన వచ్చింది వాళ్ళకి

భట్టాచార్య....మహా మేధావి....జీనియస్....ఏ కొద్దిమందో తప్ప చదవలేనంత చదువు, అపారమైన నాలెడ్జి వున్నాయి. అతను మెడిసిన్ చదివాడు. బయాలజీ, బయో కెమిస్ట్రీ, సైకాలజీలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు చేశాడు. ఆ చదివిన విషయాలన్నిటి మీద ఆర్టికల్స్ రాశాడు, రిసెర్చి చేశాడు. మనిషి మెదడు-మానవ మేధాశక్తిక సంబంధించి విస్తృతంగా పరిశోధనలు జరిపాడు. మనిషి ప్రవర్తన ఏ పరిస్థితుల్లో ఏ రకంగా వుంటుంది. ఎప్పుడు మారుతుంది. బాల్యం నుండి మనిషి మెదడులో ఆలోచనల్లో కలిగే పరివర్తనలు ఏమిటి, మేధాశక్తిని పెంచ వచ్చా, మేధావిని మూర్ఖుడిగా చేయవచ్చా .. ఇలాంటి విషయాల మీద విస్తృతంగా పరిశోధనలు జరిపాడు ఈ రకమైన పరిశోధనల్లో అతను అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాడు. అతనికి ఎన్నో మెడల్స్, అవార్డ్స్ వచ్చాయి. ఇరవై ఏడవ ఏట కారు యాక్సిడెంట్‌లో భట్టాచార్యకి ఒక చేయి పూర్తిగా తెగిపో

యింది. అప్పటి నుండి అవిటివాడు అయిపోయాడు అతను. కొద్ది నెలల పాటు మానసికంగా నీరసించాడు.

తిరిగి తన ప్రయోగాలు ప్రారంభించాడు.

0 0 0

సైకాలజిస్ట్‌గా అత్యున్నత శిఖరాలు చేరవలసిన సమయంలో అతనొక పెద్ద తప్పు చేశాడు.

అతనొక పుస్తకం రాశాడు. అందులో మనిషి మెదడు ఎలా పని చేస్తుందో, బ్రెయిన్ వాష్ ఎలా చెయ్యాలో రాశాడు.

అటువంటి పుస్తకం వల్ల జరిగే అనర్థాలు ఎక్కువని భావించింది భారత ప్రభుత్వం. ఆ పుస్తకాన్ని నిషేధించింది. భట్టాచార్య ఎక్కడ వున్నా నిర్బంధించమని పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని ఆదేశించింది.

ఫలితం... భట్టాచార్య ఎవరికీ కనపడకుండా మాయం అయ్యాడు.

అయితే నాలుగు సంవత్సరాల క్రిందట కలకత్తాలోని ఒక యూనివర్సిటీలో చదువుతున్న ఒక అమ్మాయిని హిప్నాటిజం ద్వారా అపహరించాడని, ఆమెను చెరిచాడనీ, ఆ తరువాత ఆమె ఆత్మహత్య చేసుకుందని వార్తలున్నాయి. అయితే అవేవి కోర్టులలో ఋజువు కాలేదు. అవి వదంతులో, వాస్తవాలో తెలియవు.

పేపర్ కటింగ్స్ అన్నీ మడిచి తిరిగి కవర్‌లో వుంచాడు గౌతమ్.

"భట్టాచార్య, ఆ కలకత్తా యూనివర్శిటీ స్టూడెంట్‌ని ఖచ్చితంగా చెరిచి వుంటాడు" అంది శుభాంగి ముఖం అదోలా పెట్టి.

"ఏమిటంత నమ్మకం"

"ఐ నో దట్ బాస్టర్డ్స్ బిహేవియర్. కలల్లోకి వచ్చినపుడు నా దగ్గర ఎంత అసహ్యంగా ప్రవర్తిస్తాడో తెలుసా! వాడికా వెధవ బుద్ధులున్నాయి" కక్షగా అంది.

"గౌతమ్....నాకు ఆ షకావత్ ఆస్తి వద్దు, అంతస్తు వద్దు. ఆ డబ్బంతా స్వాహా చెయ్యాలన్న తలంపులేదు. తిరిగి వెళ్ళిపోదాం పద. ఇప్పుడు నేను షకావత్ కూతురిని అని ఋజువు కాకపోతే మాత్రం ఏమిటి నష్టం. ఆ షకావత్ ఎలాగూ లేడు. అతడే నా తండ్రి....అన్న మమకారమూ నాకేమీ పెల్లుబకడం లేదు. ఇంకెందుకు!" అంది.



"అయినా తప్పదు శుభా....ఇప్పుడు మన ప్రాణాలు రిస్క్‌లో వున్నాయి. నిన్ను మళ్ళీ హిప్నటైజ్ చేయరనో, నన్ను చంపరనో గ్యారంటీ ఏమిటి? ఇప్పటికే వాళ్లు మన మీద పగ బట్టి వున్నారు. కాబట్టి వాళ్ళ వ్యవహారం ఏదో తేల్చి పోలీసులకు తెలియచేయకపోతే మన అంతు వాళ్ళు చూసేస్తారు"

"ఇదంతా ఎందుకు జరుగుతోంది? నన్ను కిడ్నాప్ చేసింది ఎవరు? నన్ను చంపకుండా ఎందుకు గతం మాత్రమే మర్చిపోయేలా చేశారు? ఎందుకు మనల్ని అనుక్షణం నీడలా వెంటాడుతున్నారు? షకావత్‌ని ఎందుకు చంపారు? అసలు ఎవరు చేస్తున్నారీ పనులన్నీ? ఎందుకు చేస్తున్నారు?"

"నన్నడిగితే ఏం చెప్పగలను? నీకెంత తెలుసో, నాకూ అంతే తెలుసు"

"వాళ్ళ కళ్ళు కప్పి ఢిల్లీ నుంచి బెంగుళూరు వచ్చిన షకావత్‌ను వెంటాడి చంపేసారు. ఇప్పుడు మనం కూడా వాళ్ళ కంట పడకుండా కలకత్తా వరకు వెళ్ళటం సాధ్యమా?"

"మనం ప్రయత్నం చేద్దాం. మనం డైరెక్టుగా వెళ్ళొద్దు. ఒక కారు హైర్ చేసుకుని తిరుపతి వెళదాం. అక్కడి నుండి బస్‌లో విజయవాడ వెళదాం. అక్కడి నుండి ట్రైయిన్‌లో భువనేశ్వర్ వరకు. అక్కడినుండి ఫ్లయిట్....ఇలా వెళతాం. అలా అయితే వాళ్ళు మనని ఛేజ్ చేయలేకపోవచ్చు."

"ఏమో. నాకు భయంగా వుంది."

"ఇంకేం మాట్లాడకు. త్వరగా టిఫిన్ తిను. బయలుదేరదాం" ఆజ్ఞాపించినట్టు అన్నాడు.

తల దించుకుని తినసాగిందామె.

0 0 0

బెంగుళూరు తిరుపతి రోడ్డుమీద మెత్తగా జారిపోతోంది గౌతమ్, శుభాంగి ఎక్కిన కారు.

"కార్లు బాగానే మెయిన్‌టెయిన్ చేస్తున్నారు వీళ్ళు. బ్రేకులు, యాక్సిలరేషన్ అన్నీ ఖచ్చితంగా వున్నాయి."

"అది సరే కాని గౌతమ్....కారు రెంట్‌కి తీసుకున్నప్పుడు.... డ్రైవర్ వద్దు....నేనే డ్రైవ్ చేస్తాను. సిటీ సైట్ సీయింగ్ అన్నావు. ఇప్పుడీ కారు తిరుపతికి తీసుకువెళుతున్నాం. తిరిగి వాళ్ళకి చేర్చేదెలా?"

"చేర్చేదీలేదు, మార్చేదీలేదు. తిరుపతి వెళ్ళగానే కారు ఓనర్‌కి ఫోన్ చేసి "కొన్ని కారణాలవల్ల కారు తిరుపతి తీసుకురావాల్సి వచ్చింది. ఇక్కడ ఫలానా చోట మీ కారు పార్క్ చేసి వుంటుంది. వచ్చి తీసుకోండి" అని ఫోన్ కొట్టి మన దారిన మనం వెళ్ళిపోతాం. ఆ తరువాత వాడి పాట్లు వాడు పడతాడు."

ఏదో అనబోయిన ఆమెను మాట్లాడవద్దు అన్నట్లుగా సైగ చేసి రివ్యూ మిర్రర్‌లో చూడసాగాడు.

గ్రే కలర్ మారుతీ వ్యాన్ ఒకటి వెనుకే వస్తోంది.

కారు స్పీడు పెంచాడు. వ్యాన్ కూడా వేగం పెరిగింది.

మెరుపులాంటి ఐడియా వచ్చింది గౌతమ్‌కి.

యాక్సిలేటర్ మీద నుండి కాలు తీసి బ్రేక్ మీద వేసి బలంగా తొక్కుతూ, ఏయిర్ బ్రేక్ కూడా అప్లయ్ చేశాడు.

కీచుమని శబ్దం చేస్తూ ఒక్కసారిగా ఆగిపోయింది.

అది వ్యాన్ డ్రైవర్ ఊహించని పరిణామం.

అంత హఠాత్తుగా కారు ఆగిపోతుందన్న ఆలోచన లేదు వాళ్ళకి.

వాళ్ళ ఊహకందేసరికి కారుని దాటి వ్యాన్ పదిహేనుగజాలు ముందుకెళ్ళిపోయింది.

అప్పటికే వ్యాన్‌లోని గన్‌మాన్ తుపాకీ పేల్చాడు.

అతని అంచనా తప్పటంతో బుల్లెట్స్‌బాయ్‌నెట్‌కి తగిలాయి.

అదే క్షణంలో గౌతమ్ చేతిలో పేలిన రివాల్వర్ గుండు వ్యాన్ వెనుక టైర్‌ను చీల్చింది. వ్యాన్ డ్రైవర్ ఊహించని, ఊహించలేని పరిణామం అది.

ఫలితం స్టీరింగ్ కంట్రోల్ తప్పి, కీచుమని శబ్దం చేస్తూ రోడ్డుకి



అడ్డంగా కదిలి చెట్టుకు ఢీకొంది.

వ్యానులోని మనుషుల ఆర్తనాదాలు, వ్యాన్ ఢీకొన్న శబ్దంతో కలిసాయి.

అదే క్షణంలో గేరు మార్చి ముందుకు దూకించి, స్పీడు పెంచి, రెప్పపాటు కాలంలో ఆ ప్రదేశం నుండి అదృశ్యం అయిపోయాడు గౌతమ్.

అతని కారు తిరుపతి వైపు దూసుకుపోతోంది.

"నువ్వు ఇంక లేచి కూర్చోవచ్చు" అన్న గౌతమ్ మాటకి తల ఎత్తింది శుభాంగి!

అంతవరకు ఏం జరిగిందో ఆమెకు అర్థం కాలేదు.

కీచుమన్న శబ్దాలు, రివాల్వర్ల సౌండ్స్....ఏదో వాహనం ఢీ కొన్న సౌండ్....అవే అర్థం అయ్యాయి, అంతకు మించి ఏం జరిగిందో ఆమెకు తెలియదు.

వెనుకకు చూసింది. వ్యాన్ కనపడడం లేదు.

"గౌతమ్....ఏమయింది. వ్యాన్ ఏది?" అడిగింది. ఆమె కళ్ళు రెప్పలు ఇంకా భయంతో టపటపా కొట్టుకుంటున్నాయి.

జరిగింది చెప్పాడు గౌతమ్.

గుండెల మీద చేయి వేసుకుని కళ్ళు మూసుకొని "హమ్మయ్య" అంది రిలీఫ్‌గా.

ఆ తరువాత కూడా వేగంగానే డ్రైవ్ చేస్తున్నాడు గౌతమ్.

ఇద్దరి మధ్య అడపా దడపా తప్ప పెద్దగా మాటలు లేవు.

మరో రెండున్నర గంటల తరువాత కారు తిరుపతిలో ప్రవేశించింది

దూరంగా కనిపిస్తున్నాయి ఏడుకొండలు. దాని మీదకు వెళుతున్న వాహనాలు....నడిచి కొండ ఎక్కేందుకు వున్న మెట్లు, వాటి గోపురాలు.

"గౌతమ్... నువ్వు ఇంతకుముందు ఎప్పుడయినా తిరుపతి వచ్చావా?" అడిగింది.

"చాలాసార్లు"

"అలా కాదు. కొండ మీదికి వెళ్ళావా?"

"కొండ మీదికే .... నా ఏడో ఏడు వరకు మా అమ్మ ప్రతి ఏడు ఒకసారి వచ్చేది. వచ్చిన ప్రతిసారీ గుండు చేయించేది. అందువల్ల నా పదో ఏట వరకు దాదాపు గుండుతోనే వున్నాను"

ఫక్కుమని నవ్వింది ఆ మాటల ధోరణికి ఆమె.

"ఇప్పుడు ఒకసారి దర్శనం చేసుకుని వెళదామా?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పటానికి ఒకింత ఇబ్బందిగా ఫీలయ్యాడు.

"ఇప్పుడు... వెళ్ళటం అంత మంచిది కాదు. అలా అని దర్శనం చేసుకోకుండా వెళ్ళకూడదంటారు. అందుకే మనల్ని క్షమించమని ఏడు కొండలవాడిని కోరుకుందాం. మిగిలిన పనులన్నీ నిర్విఘ్నంగా సాగితేఅప్పుడు తప్పక వద్దాము"

"అయితే ఒన్ కండిషన్....కండిషన్‌కాదు, ఒకవిషయం మొక్కుకున్నాను"

"ఏమటది?"

"మన పెళ్ళి ఇక్కడే స్వామి సన్నిధిలో జరగాలని" ఆ మాట అన్నప్పుడు ఆమె శరీరం పులకరించింది.

తలతిప్పి ఆమె ముఖంలోకి చూశాడు.

"అంత గట్టిగా మొక్కుకున్నావా?"

అవునన్నట్టు తల ఆడించింది.

"సరే. నేనూ నిన్ను ఇక్కడే చేసుకుంటానని మొక్కుకుంటున్నానులే" అన్నాడు.

"భగవంతుడా, మమ్మల్ని ఇద్దరినీ నీ సాన్నిధ్యంలో ఒకటిగా చేయి" అనుకుంది శుభాంగి.

o o o

కారు ఆఫ్ చేసి క్రిందకి దిగాడు అశోక్.

డోరు లాక్ చేసి ముందుకు నడిచాడు.

అడుగులు తూలుతున్నట్లుగా పడుతున్నాయి.

టైమ్ రాత్రి ఒంటి గంట అయినా అయివుండాలి.



అపార్ట్‌మెంట్స్ అన్నీ నిశ్శబ్దంగానిద్రపోతున్నట్టున్నాయి.

లిఫ్ట్‌ని సమీపించి బటన్ నొక్కాడు.

డోర్సు తెరుచుకున్నాయి. లోపలికి అడుగుపెట్టి ఆరో నెంబరు బటన్ నొక్కాడు.

లిఫ్ ఆగింది. బయటికి నడిచాడు అశోక్.

తన డోర్‌ని సమీపించాడు.

జేబులో నుండి తాళాలు బయటికి తీసాడు. సరిగ్గా అదే సమయంలో ఆ ప్రాంతం అంతా అంధకారం అలుముకుంది.

కరెంట్ పోయింది.

"ధూనీ...." అని తిట్టుకుని, జేబులోని సిగరైట్ లైటర్ ఆన్‌చేసి డోరు తెరిచాడు.

డోరు తెరవగానే అతనికి ఒక రకమైన వాసన ముక్కుకి తగిలింది.

ఆ వాసన ఏమిటో అర్థం చేసుకోవటానికి కొద్ది సెకన్లు టైం పట్టింది. అది వంటగ్యాస్ వాసన.

ఎవరింట్లో నుండి వస్తోంది?.... ఎవరో గ్యాస్ ఆపెయ్యటం మర్చిపోయినట్లున్నారు అనుకుంటూ మళ్ళీ అది తన ఇంట్లోనే నేమోనన్న అనుమానం వచ్చింది.

తన ఇంట్లో నుండి గ్యాస్ వాసన ఎందుకు వస్తుంది? తనకి భార్య లేదు. కాబట్టి గ్యాస్‌స్టవ్ లేదు.

పక్కింట్లో అయి వుంటుందా?

కరెంట్‌రాగానే హెచ్చరించి రావాలి అనుకున్నాడు.

గదంతా చీకటిగా వుంది. ఎమర్జెన్సీ లైట్ ఒకటి వుండాలి.... ఎక్కడుందో చూద్దామని చేతిలోని లైటర్‌ని ఆన్ చేశాడు.

అంతే....

అదే క్షణంలో....బ్రహ్మాండమైన విస్ఫోటనం.

బాంబు ప్రేలిన శబ్దం....

లీక్ అయిన గ్యాస్ లైటర్ మంటలతో అంటుకుంది.

జరిగినదేమిటో అర్థమయ్యేలోపే మాడిమసైపోయాడు అశోక్.

పెద్ద ఎత్తున మంటలు వస్తూనే వున్నాయి.

కెవ్వుమని అరుస్తూ ఫ్లాట్స్ లోంచి పరిగెత్త సాగారు జనం.

అంతవరకు ఆ దృశ్యం దూరం నుంచి చూస్తున్నాడు ఓ వ్యక్తి.

అశోక్ లేని సమయంలో ఇంటి తలుపు తెరిచి గ్యాస్ సిలిండర్ వుంచి లీక్ చెయ్యటం....అతను రాగానే కరెంట్ ఆఫ్ చెయ్యటం.... అశోక్ జీవితం ముగిసిపోవడం....అంతా విలియమ్స్ చెప్పిన పథకం ప్రకారమే చేశాడా వ్యక్తి. ప్లాన్ పెర్‌ఫెక్ట్‌గా అమలు జరిగింది.

ఆజ్ఞలను ధిక్కరించి శుభాంగిని చంపాలని ప్రయత్నం చేసినందుకు అశోక్ సజీవ దహనం అయిపోయాడు. చూసే జనాలకది గ్యాస్ సిలిండర్ ప్రేలిన ప్రమాదం మాత్రమే మర్డర్‌కాదు.

తృప్తిగా కదిలాడు ఆ వ్యక్తి అక్కడ నుండి. ఇప్పుడా విషయం అతను విలియమ్స్‌కి ఫోన్‌లో చెప్పాడు.

o o o

సమయం పది కావస్తోంది.

కలకత్తా నగరం బిజీగా మారిపోయింది.

కార్లు, బస్సులు, లోకల్ ట్రైన్స్.... అన్నీ రద్దీగా కిటకిటలాడి పోతున్నాయి. భారత దేశంలోనే అత్యధిక జనాభా గల నగరం అది.

ఇంత జనాభా ఈ ఊళ్ళో ఎలా నివసిస్తున్నారా అని అనుమానం వస్తుంది కలకత్తా వచ్చిన ప్రతిసారీ గౌతమ్‌కి.

స్నానం పూర్తి చేసి డ్రస్ చేసుకోసాగాడు గౌతమ్.

అతనున్న హోటల్ రూమ్ పన్నెండో ఫ్లోర్‌లో వుంది.

అక్కడి నుండి క్రిందికి చూస్తే చిన్న చిన్న బొమ్మల్లా వున్నారు మనుషులు, వాహనాలు.

"ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నావ్ గౌతమ్" అడిగింది శుభాంగి విశాలమైన అతని ఛాతీ వంక చూస్తూ.

"ఇంకెక్కడికి? ఆ భట్టాచార్య ఎక్కడుంటాడో ఏమిటో వివరాలు సేకరించడానికి" అన్నాడు సాక్స్ వేసుకుంటూ.



అదే క్షణంలో ఫెళ్ళుమని శబ్దం చేస్తూ తెరుచుకుంది డోరు.

అదిరిపడి తల తిప్పాడు గౌతమ్.

సుడిగాలిలా గదిలోకి దూసుకువచ్చాడో ఆగంతుకుడు,

అతని చేతిలో ఒక విధమైన గన్....ముఖానికి మాస్క్....

అది గ్యాస్‌మాస్క్....

కెవ్వుమని అరిచింది శుభాంగి ఆ మనిషిని చూస్తూనే.

లిప్తపాటు కాలంలో బ్రీఫ్‌కేస్ తెరిచి అందులోని రివాల్వర్ మెరుపువేగంలో తీశాడు గౌతమ్.

కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది.

ఆ వ్యక్తి చేతిలోని గన్ చిన్నగా శబ్దం చేస్తూ పేలింది.

అందులో నుండి తూటా లాంటి వస్తువు వచ్చి గౌతమ్ నడుమును తాకింది.

రాయితో బలంగా కొట్టినట్టు దెబ్బ తగిలింది అతనికి.

అదే సమయంలో ఆ తూటా లాంటిది పగిలి అందులో నుండి ఒక రకమైన తెల్లని పొగ వచ్చింది.

అది పీల్చకూడదనుకున్నాడు గౌతమ్.

కానీ....తెలియకుండానే ఆ గాలిని పీల్చాడు గౌతమ్.

మరుక్షణం అతనికి ఏమయిందో తెలియదు.... ఉన్న చోటే కుప్పకూలిపోయాడు గౌతమ్.

హోటల్ బయట ఆగివుంది పెద్ద టొయోటా వ్యాన్.

అందులో కూర్చుని ఉన్నారు విలియమ్స్, హరిహరన్,

ప్రతిక్షణం వాళ్ళ దృష్టి హోటల్ గేట్ వైపే పోతోంది.

ఐదు నిముషాల తరువాత రెండు పెద్ద పెట్టెలు మోసుకుని రాసాగారు కొందరు మనుషులు. వాళ్ళని చూసి కళ్ళు మెరిశాయి ఇద్దరికీ.

ఆ పెట్టెలు వ్యాన్‌లోకి ఎక్కించారు వాళ్ళు.

పెట్టెలపై మూతను తొలగించి అచేతనంగా పడివున్న గౌతమ్, శుభాంగిలను వ్యాన్ లో క్రింద పడుకోబెట్టారు.

డోర్స్ క్లోజ్ అయ్యాయి.

పడుకొన్ని వున్న ఆ భంగిమలో శుభాంగి వస్త్రాలు అస్తవ్యస్తంగా చెదిరివున్నాయి.

ఆ స్థితిలో ఆమెను చూసిన విలియమ్స్ నరాలు తీయగా మూలిగాయి.

'ఫోటోలోనే అందంగా వుంది అనుకుంటే.... ఇక్కడ ఇంకా అందంగా వుంది. ఈమెను ఒక్కసారి అయినా అనుభవించాలి' అనుకున్నాడు. అతని చూపులు ఆమె అందాలని ఆర్తిగా తాకుతున్నాయి.

వ్యాన్ బయలుదేరింది.

o o o

మెలుకువ వచ్చింది గౌతమ్‌కి.

తల అంతా బరువుగా వుంది. అతి కష్టం మీద కళ్ళు తెరిచాడు. మొదట అతని కళ్ళకి ఏమీ కనపడలేదు. కొంత సేపటికి అతనికి చుట్టూ వున్న వ్యక్తులు కనిపించసాగారు.

అతనికి తాను ఎక్కడ ఉన్నాడో అన్న విషయం అర్థం కాలేదు.

నిమిషం తరువాత కూర్చున్నాడు.

కడుపులో తిప్పుతున్నట్టుగా వుంది. దాహంగా, నాలుక ఎండిపోయినట్లుగా వుంది.

అదొక చిన్న గది. వెలుతురు సరిగా లేదు. చిన్న స్టూల్ తప్ప ఆ గదిలో ఏమీ లేవు. అదే క్షణంలో శుభాంగి గుర్తుకు వచ్చింది.

తల తిప్పి ఇటూ అటూ చూశాడు. ఆమె కనపడలేదు.

కళ్ళు ఇంకా మసకగానే వున్నాయి.

నులుముకొని చుద్దామనుకున్న అతనికి చేతులు కదలలేదు. కారణం అతని రెండు చేతులు వెనుక వైపుకు తిప్పి కట్టి వేయబడి వున్నాయి.

కాళ్ళు కూడా కట్టేసారు.

తను ఇంకా బ్రతికిఉన్నాడేమిటి? న్యాయంగా అయితే చంపెయ్యాలి కానీ....ఇలా కట్టివేసి గదిలో పడవేయవలసిన అవసరం ఏమిటి? అర్థం కాలేదు అతనికి.



వెనుకనున్న చేతులకున్న కట్టును విడిపించుకునే ప్రయత్నం చేద్దామని, చేతులు అటూ ఇటూ కదిలించాడు.

కట్టు కొంచెం వదులుగా అయ్యింది.

మరో రెండుసార్లు కదిలించాడు. ఊడిపోయాయి చేతికట్లు.

మరింత ఆశ్చర్యపోయాడు గౌతమ్,

ఇంత వదులుగా ఎవరూ కట్టరే....అనుకుని, ఊడిపోయిన ఆ తాడు చేతిలోకి తీసుకున్నాడు. దాని వంక పరీక్షగా చూశాక అర్థమయింది అతనికి కట్టు అంత త్వరగా ఎందుకు ఊడిందో,

తాడు ఒకచోట మూడు వంతులు పైగా కోసివేయబడివుంది. చిన్న కొన పట్టు మీద మాత్రం ఆగి ఉంది. అందువల్ల చేతులు విదిలించగానే తాడు తేలిగ్గానే తెగిపోయింది.... అంటే....తన చేతులు కట్టివేయబడివున్న సైములో ఒక తాడును ఎవరో మూడు వంతులు కోశారు. ఎవరయి వుంటారు?

కాలి కట్లు కూడా విప్పి నిలబడ్డాడు.

ఆ గదిలో శుభాంగి లేదు.

అది ఎవరి ఇల్లో అర్థం కాలేదు.

గది ఒక వైపు తలుపు సగం సగం తీసి వుంది.

మెల్లగా లేచి ఆ డోరు తోసాడు. అదీ ఇంచుమించు ఖాళీగానే వుంది. ఆ గదిలోనూ మనుషులు ఎవరూ కనపడలేదు.

గది ఒక మూల మాత్రం కొన్ని బ్యాగ్‌లున్నాయి.

ఆ గదిలో నుండి మరో గదికి దారి ఉంది.

ఆ తలుపుకూడా తెరిచాడు.

అది కిచెన్ లాగా వుంది. కొన్ని స్టీల్‌సామాన్లు గ్యాస్ స్టౌ ఉల్లి పాయల వాసన వస్తోంది. ఒక ప్రక్క ఫ్రిజ్ వుంది.

దానిని సమీపించి డోరు తెరిచాడు. అందులో నీళ్ళున్నాయి. బాటిల్ ఓ పెన్ చేసి నోట్లోపోసుకుని గడగడా తాగేసాడు. కాసిని ముఖం మీద కూడా చల్లుకున్నాడు.

చాలా రిలీఫ్‌గా అనిపించింది.

ఆ గదిలో నుండి మరో గదిలోకి తలుపు వుంది.

ఆ తలుపు తోసుకుని తరువాత గదిలోకి ప్రవేశించాడు.

అక్కడ మనుషులు ఎవరూ కనపడలేదు.

ఒక టేబుల్ మీద కొన్ని పుస్తకాలున్నాయి. వాటిని సమీపించి అవి ఏం పుస్తకాలో చూశాడు.

హ్యూమన్ బిహేవియర్, సైకాలజీకి సంబంధించిన పుస్తకాలు అవి అంటే ఇది భట్టాచార్య ఇల్లు అయి వుండవచ్చు అనుకున్నాడు.

టేబుల్‌కి ఒక చిన్న అరవుంది. ఆది తెరిచాడు అందులో అతనికి నాలుగైదు రకాల రివాల్వర్స్ కనిపించాయి.

ఒక టొకట్ అందుకుని చూశాడు. ఒక ఆటోమేటిక్ రివాల్వర్‌లో మాత్రం బుల్లెట్స్ ఉన్నాయి. మిగతావి ఖాళీగావున్నాయి. అందులో వున్న నాలుగైదు సైలెన్సర్లలో ఒకటి తీసుకుని రివాల్వర్ ముందు బిగించాడు. అవి నిజమైన బుల్లెట్లో, డమ్మినో తేల్చుకోవాల్సిన అవసరం వుంది. టేబుల్ మీద వరసగా వున్న బుక్స్‌లో ఒక లావుపాటి బుక్ తీసి దానిని టేబుల్ మీద విడిగా నిలబెట్టాడు.

నాలుగు అడుగుల దూరంలో నిలబడి రివాల్వర్ ట్రిగ్గర్ లాగాడు.

టప్‌మన్న శబ్దం అయింది.

పుస్తకాన్ని చిన్నాభిన్నం చేస్తూ బయటికి వచ్చింది తూటా.

తృప్తిగా తల ఆడించి దానిని జేబులో ఉంచుకున్నాడు.

ఆ గది తలుపు తోసుకుని మరో గదిలోకి అడుగు పెట్టాడు. అదొక బెడ్‌రూమ్‌లాగవుంది. ఆ గదిలోకి రాగానే అతని జ్ఞానేంద్రియాలు ఎలర్ట్ అయ్యాయి.

ప్రక్క గదిలో నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి.

ఆ గదిలో ఎవరో ఉన్నారు కనీసం నలుగురైదుగురు ఉండవచ్చు అనుకున్నాడు.

ఏ మాత్రం శబ్దం చేయకుండా పిల్లిలా నడుస్తూ ఆ తలుపుని చేరు కున్నాడు.

వాళ్ళలో భట్టాచార్య ఉండవచ్చు అనుకున్నాడు.



తలుపుని కొద్దిగా తోసాడు.

సన్నని చీలికలాంటి ఖాళీ ఏర్పడింది.

అందులో నుండి చూశాడు.

అక్కడ నలుగురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. అందులో ముగ్గురు వ్యక్తులు ఎవరో తనకి తెలియదు.

ఒకే ఒక వ్యక్తి తెలుసు.

ఆతనిని చూసిన క్షణం అదిరిపడ్డాడు.

అతని రక్తం గడ్డ కట్టింది.

కారణం....అతను....జైసింగ్ షకావత్.

0 0 0

మెలుకువ వచ్చింది శుభాంగికి,

తల తిరుగుతున్నట్లు, కడుపులో తిప్పుతున్నట్లుంది. కళ్ళు తెరిచిన ఆమెకి ఎదురుగా టేబుల్, చైర్ కనిపించాయి.

"మేడమ్! ఆమెకు మెలుకువ వచ్చింది" అని ఎవరిదో గొంతు విని పించి, అటువైపు చూద్దామని తల తిప్పింది.

కానీ తల అటువైపు తిరగలేదు.

కారణం .. తలకు ఆమె పడుకున్న మంచానికి కలిపి ఒక బెల్టుతో బంధించారు. చేతులు కాళ్ళుకూడా కట్టివేయబడి ఉన్నాయి.

"ఎవరు?....ఎందుకు నన్ను బంధించారు?" అని అరిచిందామె.

"హలో బ్యూటీ....హౌ ఆర్ యూ" అంటూ వినిపించిందో కంఠం.

ఆమెకు ఎదురుగా వచ్చి నిలబడిందో యువతి.

ఆమెను గుర్తుపట్టగలిగింది శుభాంగి.

తన కలలలో వచ్చే నర్స్....

"యూ బ్లడీ బిచ్... ఐ హేట్ యు" అరిచింది శుభాంగి.

చెళ్ళు మనిపించింది ఆమె చెంపని, నర్స్.

అలా రెండు మూడు నిముషాలపాటు చెంపలమీద కొడుతూనే వుంది.

"సైరా....నీ పని త్వరగా పూర్తిచెయ్యి డాక్టర్ భట్టాచార్య ఆమెను చెక్ చేద్దాం అనుకుంటున్నారు" అంటూ వచ్చి ఆమెతో చెప్పి వెళ్ళిపోయాడు ఒక వ్యక్తి.

అలాగే అని తల వూపింది సైరా.

"నువ్వు పాకిస్తానీ స్త్రీవి కదూ?" అంది శుభాంగి ఆమెను ఉద్దేశించి, కారణం ఆమె మాటతీరు....గొంతులో పలికిన ఉర్దూయాస .... అలా అనిపించాయి.

చాలా కరెక్ట్‌గా చెప్పావు పిల్లా....ఇంతకీ నీకెలా తెలిసింది?" అడిగింది ఆమె.

"నీ మాటనుబట్టే చెప్పవచ్చులే" అనుకుంది మనసులో ఆమె.

"గౌతమ్ ఎక్కడున్నాడు? చెప్పవా ప్లీజ్" బ్రతిమాలినట్టు అంది సైరాతో.

"నీకు చెప్పేదీ లేదు. చూపించేదీలేదు. నోరు మూసుకుని పడుకో" కసురుకున్నట్టుగా అని ఒక ఇంజక్షన్ బాటిల్, సిరంజి అందుకుంది.

"ఏయ్ ఏంచేస్తున్నావు" అరిచింది.

"నోరుముయ్యి. అరిచావంటే మరోసారి చెంపలు పగులుతాయి. ఈ ఇంజెక్షన్ చేస్తే హాయిగా నిద్రపడుతుంది."

"నో....వద్దు....నాకా ఇంజెక్షన్ వద్దు."

అవేమీ సైరా చెవిన పడటం లేదు. ఇంజెక్షన్ ఆమె చేతిలో దిగబడింది.

ఆమెకు అర్థమవుతోంది. మత్తుకి ఏదో ఇంజెక్షన్ ఇచ్చి తను స్పృహలో లేని స్థితిలో ఉన్నప్పుడు ఏదో చేయబోతున్నాడు.

"హాయిగా నిద్రపో మై స్వీటీ" అంటూ అక్కడి నుండి కదిలింది సైరా.

కళ్ళుమూతలు పడుతున్నట్లున్నాయి. మెదడు మొద్దుబారుతున్నట్టు అనిపిస్తోంది. స్పృహ తప్పుతున్నట్లుంది.

ఇంట్రావీనస్ ఇంజెక్షన్ ఇస్తే సాధారణంగా పది పదిహేను సెకన్లలో స్పృహ పోతుంది.



"డాక్టర్....ఆమెకు ఇంజెక్షన్ ఇచ్చాను" ఎవరితోనో చెపుతోంది సైరా.

"నువ్వు బయటికి వెళ్ళు. నేను ఎగ్జామిన్ చేస్తాను" అన్నాడు డాక్టర్.

ఉలిక్కిపడింది ఆ గొంతు విని శుభాంగి.

అదే గొంతు....అదే మాట....తనకు కలలో వచ్చే ఒంటిచేతి వ్యక్తి మాట. అంటే అతను లోపలికి వస్తున్నాడన్నమాట.

సైరా ఇంజెక్షన్‌చేసి ఇరవై సెకన్లపైన అయిందికదా ఈ టైమ్ కల్లా స్పృహ పోవాలే....ఇంకా పోలేదు.

కళ్ళు తెరవాలని ప్రయత్నించింది. మామూలుగా తెరుచుకున్నాయి చుట్టూవున్న వస్తువులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆశ్చర్యంగా ఉంది. కళ్ళముందున్న వస్తువులు కనీసం మసకగా అయినా కనపడాలి. అంటే ...ఆ ఇంజెక్షన్ పనిచెయ్యలేదా?

ఇంట్రావీనస్ ఇంజెక్షన్ పనిచెయ్యకపోవటం సాధ్యమా!

ఆమె మత్తుకి ఇంజెక్షన్ చేయబోయి పొరపాటుగా మరో ఇంజెక్షన్ చేసిందా!

డోర్ క్లోజ్ అయిన శబ్దం వినిపించింది. గదిలోకి ప్రవేశించాడు భట్టాచార్య.

o o o

స్పృహ కోల్పోయినట్లు నటించడం మంచిదనుకుంది శుభాంగి.

అతని చేయి ఆమె ముఖాన్ని తాకుతోంది.

శరీరం మీద పురుగుపాకినట్లయి ఒళ్ళు జలదరించింది ఆమెకి.

"యు వార్ బ్యూటిఫుల్"

"యువార్ ప్రెట్టీ"

"ఐ లవ్ యు డార్లింగ్" అంటూ ఆమె పెదవులమీద ముద్దుపెట్టుకున్నాడు.

కెవ్వుమని అరవబోయి చివరి క్షణంలో ఆ అరుపును గొంతులోనే దిగమింగింది ఆమె.

"అబ్బ....వెన్న, మీగడ కంటె మెత్తగా ఉన్నావు"

అతని చేయి ఆమె భుజాలను తాకింది.

"నీ అందాలను తాకడానికి నాకు ఒక చేయి వుంది. దేవుడు దుర్మార్గుడు....నా రెండో చేయి తీసేసాడు. నీ అందం తాకడానికి, చూడటానికి ....వెయ్యి కళ్లు, వెయ్యి చేతులు కావాలి."

ట్రాన్స్‌లో వున్నట్టుగా మాట్లాడుతున్నాడు.

శరీరంలో వస్తున్న వణుకు అతనికి తెలియకుండా వుండాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది ఆమె.

ఆమె శరీరం మీది వస్త్రాలు తొలగించడానికి ప్రయత్నం మొదలు పెట్టాడు.

అదిరిపడింది ఆమె. ప్రతిఘటించాలనుకుంది. కానీ ధైర్యం చేయలేకపోయింది.

"నిన్ను....ఈరోజు తనివిదీరా అనుభవిస్తాను. నా జన్మ సార్థకమయ్యేలా అనుభవిస్తాను. నువ్వు ప్రతిఘటించలేవు. నాతో సహకరిస్తావు" హిప్నటైజ్ చేసినట్లుగా అన్నాడు.

ఆమె వస్త్రాలు తొలగించటానికి అతనికి ఇబ్బందిగా ఉంది.

కారణం....ఆమె శరీరం బెల్టుతో టేబుల్‌కి బిగించబడి వుంది.

"ఆనంద స్వర్గంలో తేలిపోవడానికి ఈ బంధాలు....వస్త్రాలు, ఏమీ ఉండకూడదు."

ఆమెతో మాట్లాడుతున్నట్టుగా అని బెల్టు ఊడదీయసాగాడు.

ఆమె తలచుట్టూ వున్న బెల్టు ఊడిపోయింది.

చేతులకు ఉన్న కట్లు విడిపోయాయి.

కాలికి వున్న బంధాలు కూడా తొలగింపబడ్డాయి.

"నీ....అందాలు....చూడాలి....ఐ విల్ ఎంజాయ్....ఈ రోజు నా



ఆనందానికి అవధులు లేవు" అంటూ ఆత్రుతగా ఆమె వస్త్రాలు చింపేసి శరీరం నుండి లాగివేయసాగాడు.

నిస్సహాయంగా, మౌనంగా, నిశ్చలంగా....ప్రతిఘటిస్తోంది. రోదిస్తోంది.

ఆమె మీదికి వంగాడతను.

సరిగ్గా అదే సమయంలో....ఊహించని సంఘటన జరిగింది.

o o o

కెవ్వుమని అరిచి వెల్లకిలా పడ్డాడు భట్టాచార్య.

కారణం తన.... మీదికి వంగబోతున్న భట్టాచార్య కడుపులో మోకాలితో శక్తి కొద్దీ బలంగా తన్నింది శుభాంగి.

ఏ మాత్రం ఊహించని కొద్ది క్షణాలపాటు జరిగిందేమిటో కూడా అర్థం చేసుకోలేక పోయాడు అతను.

మెరుపులా బెడ్ మీద నుండి అటువైపు దొర్లి అక్కడ పడివున్న తన చీరని శరీరానికి అడ్డుగా చుట్టుకొని డోరువైపు పరిగెత్తిందామె.

గట్టిగా వున్న డోరు బోల్ట్ తెరవటానికి శక్తి కొద్దీ ప్రయత్నం చేస్తోందామె.

వెనుక నుండి వచ్చి ఆమె చెయ్యి పట్టుకొని బలంగా వెనక్కి లాగాడు.

విసురుగా వచ్చి నేల మీద పడిందామె.

"సాలీ....తూ కహా భాగ్‌సక్‌లీ" కక్షగా తిట్టి ఆమె చెంప మీద కొట్టాడు.

కెవ్వుమంది ఆమె.

"నిన్ను వదలను....మత్తులో మునిగినట్లు నటించి నన్ను దెబ్బ తీస్తావా! నిన్ను అనుభవించక వదలను" అరుస్తూ తన శరీరం మీది షర్ట్ లాగేసుకున్నాడు.

భుజం వరకు తెగిపోయిన అతని మొండి చేయి వికృతంగా కనిపించింది.

మరో సారి ఆమె మీద పడ్డాడు.

బాధతో విలవిల లాడిందామె.

కర్కశంగా ఆమె బుగ్గ మీద కొరికాడు.

కెవ్వుమంది ఆమె.

మరోసారి కొరకాలని ముందుకు వంగాడు.

కుడిచేతి చూపుడు వేలుతో అతని కంట్లో బలంగా పొడిచింది.

భీకరంగా అరుస్తూ పక్కకి దొర్లాడు.

కంటి గుడ్డు చితికిపోయింది.

రెండు చేతులతో కన్ను మూసుకుని బాధతో విలవిలలాడిపోయాడు.

లేచి శక్తి కూడదీసుకుని నిలబడి కన్ను తెరిచే ప్రయత్నం చేశాడు కానీ సాధ్య పడలేదు. పరిగెత్తి డోరుని సమీపించిందామె.

గడియ తీసేటంతలో ఆమె ఆలోచన మారింది.

భట్టాచార్యని అలా వదలటం తనకి ప్రమాదం అనుకుని అదే క్షణంలో, గిర్రున వెనక్కి తిరిగింది. అక్కడ టేబుల్ మీద ఇంజెక్షన్ బాటిల్స్, సిరంజిలు, బ్యాండేజ్‌లు ఒక పెద్ద కత్తెర ఉన్నాయి క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ కత్తెర చేతిలోకి తీసుకుంది.

ఆ కత్తెరతో ఆమె తనకేదో చేయబోతోందని రెండో కంటితో గమనించాడు భట్టాచార్య

"నో" అరవబోయాడు.

కానీ ఆలస్యం అయిపోయింది. ఆమె తన శక్తినంతా చేతుల్లోకి కేంద్రీకరించింది.

రెప్పపాటు కాలంలో. ఆ కత్తెర భట్టాచార్య కంఠాన్ని నిలువుగా చీల్చుతూ దిగిపోయింది నిశ్శబ్దంగా కూలిపోయాడు భట్టాచార్య.

o o o

"కిల్ దట్ క్రీచర్...."

గదిగోడలు దద్దరిల్లేలా వినిపించిందా అరుపు.

"దొరికిపోయాను. తను చాలా జాగ్రత్తగానే తలుపు వెనకాల నిలబడ్డానని అనుకున్నాడు కానీ వాళ్ళ కళ్ళబడ్డాడు.



క్షణం కూడా ఆలస్యం చేయకుండా రివాల్వర్ ట్రిగ్గర్ మీద చేయి బిగించి డోరు నుంచి ఇవతలకి వచ్చాడు గౌతమ్.

తలుపు వెనుక వున్నది గౌతమ్ అని ఊహించారు వాళ్ళు కానీ అతని చేతిలో రివాల్వర్ వుందన్న విషయం వాళ్ళు ఆలోచించలేదు.

అందరిలోకి ముందుగా తేరుకున్న వాడు విలియమ్స్.

"యూ....ఐ విల్ కిల్ యూ!" గొంతు పగిలేలా అరుస్తూ ఛైర్‌లో నుంచి లేచి ముందుకు దూకాడు. కానీ టేబుల్ అంచు తగలటంతో దబ్‌మని క్రిందపడ్డాడు విలియమ్స్.

సరిగ్గా అదే సమయంలో ఆటోమేటిక్ రివాల్వర్ బయటికి లాగాడు హరిహరన్.

రెప్పపాటు కాలంలో గౌతమ్ చేతిలోని రివాల్వర్ నిప్పులు కక్కింది. హరిహరన్ గుండెలను చీల్చుతూ దూసుకుపోయింది తూటా. మెరుపులా కదలబోయిన మస్నూర్‌వైపు రివాల్వర్ తిప్పి ట్రిగ్గర్ లాగాడు గౌతమ్. "ఫట్" మన్న శబ్దంతో రెండుగా చీలిపోయింది అతని తల.

నిశ్చేష్టుడయి చూస్తున్నాడు జైసింగ్ షకావత్. అదేక్షణంలో గౌతమ్ ఊహించని సంఘటన జరిగింది. క్రింద పడిన విలియమ్స్ చేతికి అందిన ఇనుపరాడ్‌ను గౌతమ్‌వైపు విసిరాడు.

అది తిన్నగా వచ్చి గౌతమ్ కుడిచేతిని బలంగా తాకింది. ఎగిరి అవతల పడింది అతని చేతిలోని రివాల్వర్.

ఇంకొక్క క్షణం అక్కడున్నా తను ప్రాణాలతో మిగలటం అసంభవం. అంతే, గిర్రున వెనక్కి తిరిగి శక్తికొద్దీ కిటికీవైపు పరుగెత్తి ఎగిరి గాలిలోకి డైవ్ చేశాడు గౌతమ్.

"సాలా....తుమ్‌కో నహీ ఛోడూంగా...." అరుస్తూ ఆ వెనుకనే బయటికి పరిగెత్తాడు విలియమ్స్.

క్రిందపడి వెంటనే లేచి పరుగు ప్రారంభించాడు గౌతమ్.

అలా పరిగెడుతున్నాడే కానీ, అతని మెదడులో రెండు ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి.

ఒకటి శుభాంగి ఎక్కడుందో తెలియదు. రెండు విలియమ్స్ నుండి

తప్పించుకోవటం ఎలాగో అర్థం కావటంలేదు. విలియమ్స్‌ని ప్రాణాలతోనే వుంచాలి. తను తప్పించుకోవాలి. విలియమ్స్ సజీవంగావుండటం చాలా అవసరం. అందువల్ల చాలా విషయాలు తెలిసే అవకాశం వుంది. తన వెనకాల విలియమ్స్ పరిగెడుతున్నప్పుడు అతని అడుగులు చేస్తున్న శబ్దం విన్పిస్తోంది గౌతమ్‌కి.

విలియమ్స్ అడుగుల శబ్దం మరింత సమీపించింది. తల తిప్పాడు గౌతమ్.

మహా అయితే నాలుగే అడుగుల దూరం వుంది. అలా తల తిప్పి వెనుకకు చూడటం గౌతమ్ చేసిన పెద్ద తప్పు, గౌతమ్ కాలు ఒక గుండ్రటి రాయి మీద పడింది. అంతే, కాలు స్లిప్ అయి దబ్‌మని వెల్లకిలా క్రింద పడ్డాడు గౌతమ్.

"బాస్టర్డ్ ఐ విల్ కిల్ యూ" దిక్కులు ప్రతిధ్వనించేలా అరుస్తూ ఒక్కసారిగా గాలిలోకి ఎగిరాడు విలియమ్స్.

o o o

జరిగిన విషయం అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ చైర్‌లోంచి లేచాడు జైసింగ్ షకావత్. రక్తపుమడుగులో పడి వున్నారు మన్సూర్, హరిహరన్‌లు.

గౌతమ్ వస్తాడని కాని, వాళ్ళిద్దరినీ చంపుతాడని కానీ ఏ మాత్రం ఊహించలేదు షకావత్ కూడా. తనని కూడా చంపుతాడేమో అనుకున్నాడు కానీ .. అలా జరగలేదు. మరికొద్ది సెకన్లు గడిస్తే తనని కూడా చంపేవాడేమో. విలియమ్స్ మహాక్రూరుడు. అతని చేతిలో గౌతమ్ జీవితం ముగిసిపోవటం ఖాయం అనుకున్నాడు షకావత్.

అంతలోనే అతనికి కూతురు మౌనిక గుర్తు వచ్చింది.

ఆమె ఇప్పుడు భట్టాచార్య ఆధీనంలోనే వుండి వుంటుంది.

అతనేవో పరీక్షలు జరపాలన్నాడట. అది కేవలం అబద్ధమని షకావత్ అభిప్రాయం.

ఈ పాటికి ఆమెకు తిరిగి హిప్నటైజ్ చేయటం మొదలు పెట్టి వుండాలి.



నో....ఆమెపై హిప్నోసిస్ జరగటానికి వీలులేదు. తన కూతుర్ని రక్షించాలి.

అవసరమైతే భట్టాచార్యను చంపయినా సరే.

షకావత్‌లో కూడా ఒక విధమైన తెగింపు వచ్చింది. హరిహరన్, మన్సూర్‌లు ఇద్దరూ ఎలాగూ చనిపోయారు. విలియమ్స్ కూడా, గౌతమ్ చేతుల్లో హతమారితే సరే. అలా కాకుండా సజీవంగా తిరిగి రావటం జరిగితే, తనయినా వాడిని చంపాలి. వాడు కానీ, భట్టాచార్య కానీ బ్రతికి వుంటే తన కూతుర్ని మామూలుగా బ్రతకనివ్వరు. ముందుగా మౌనికని రక్షించాలి.

అక్కడి నుండి కదిలాడు షకావత్.

o o o

అది ఒక పెద్ద భవంతి. అందులో రెండు అంతస్థులున్నాయి.

మొదటి అంతస్థులో భట్టాచార్య వుంటాడు. అందులోనే అతని లేబొరేటరీ, ప్రైవేట్ రూమ్.

నిశ్శబ్దంగా వుంది ఇల్లంతా. ఆ ఇంట్లో మనుషులు కూడా ఎవరూ లేకుండానే ఒంటరిగా వుంటున్నాడా భట్టాచార్య అని సందేహం వచ్చింది షకావత్‌కి.

మెట్లు ఎక్కి నిలబడిన అతనికి ఎవరిదో స్త్రీ కంఠం వినిపించింది.

ఏదో పాట....కూనిరాగం తీస్తోంది ఆ కంఠం.

క్షణకాలం నిశితంగా విన్న షకావత్‌కి అది బెంగాలీ పాట అని అర్థమయింది.

ఎవరయి వుండవచ్చు పాట పాడేది?....

మౌనిక అయి వుండచ్చా?

ఆ గది తలుపుని సమీపించి క్షణకాలం తటపటాయించి లోపలికి చూశాడు షకావత్.

ఒక యువతి....నర్స్‌లాంటి దుస్తుల్లో వుంది. ఏవేవో కెమికల్స్‌ని డిష్‌లలో వేసి కలుపుతోంది. నిశ్శబ్దంగా ఆమెను సమీపించాడు షకావత్.

కూని రాగం తీస్తూ యథాలాపంగా తల తిప్పిన ఆమెకు ఎదురుగా షకావత్ కనిపించడంతో ఉలిక్కిపడింది.

"మౌనిక ఎక్కడ?" కరుకుగా మారింది షకావత్ గొంతు.

ఆమె సమాధానం చెప్పలేదు. ఎగాదిగా అతని వైపు చూసింది.

"చెప్పు. నా కూతురు ఎక్కడ?" ఉర్దూలో ప్రశ్నించాడు మరో సారి.

ఆమె ముఖంలో ఒక రకమైన భయం చోటు చేసుకుంది.

"హరామ్ జాదీ....తూ బోల్‌తే క్యోంనహీ" కర్కశంగా మారిపోయింది షకావత్ గొంతు.

అతని చేతిలోని రివాల్వర్ ఆమె కణతలను తాకింది.

అదే సమయంలో, చేతిలో వున్న గాజు సీసాతో శక్తి కొద్దీ, షకావత్ గుండెల మీద కొట్టింది ఆమె.

అందులోని యాసిడ్ షకావత్ శరీరం మీద ఒలికింది.

సరిగ్గా అదే సమయంలో షకావత్ చేతిలోని రివాల్వర్ పేలింది.

కెవ్వుమని అరిచి నిర్జీవంగా నేలమీదికి జారిపోయింది ఆమె.

శరీరం మీద నిప్పులు పోసినట్లుంది షకావత్‌కి. బాధతో ప్రక్కనున్న వాష్ బేసిన్ దగ్గరకు పరిగెత్తి టాప్ తెరిచి నీళ్ళు శరీరం నిండా పోసుకున్నాడు.

అయినా మంట ఏ మాత్రం తగ్గలేదు.

భరించలేని బాధతో అక్కడే మోకాళ్ళపై కూర్చుండిపోయాడు.

తల ఎత్తి చూసిన షకావత్ క్షణకాలం అలాగే వుండిపోయాడు.

కారణం.... ఎదురుగా నిలబడివుంది మౌనిక.

కొద్ది క్షణాలు కన్నార్పకుండా ఆమెనే చూశాడు షకావత్.

బాధతో మెలికలు తిరిగిపోతున్న అతని కళ్ళల్లో ఒక రకమైన వెలుగు కనిపించింది.

శరీరంలో లేని శక్తిని కూడదీసుకుని లేచి నిలబడ్డాడు.

యాసిడ్ మీద పడడంతో శరీరం మీద షర్టు కాలిపోయింది అతనికి.



ఛాతీ ప్రాంతంలోని చర్మం నల్లగా కమిలినట్లయింది. అక్కడక్కడ గాజు పెంకులు అతని శరీరంలో గుచ్చుకుని రక్తం కారుతోంది.

"మౌనికా!" శక్తిని కూడదీసుకుంటూ అన్నాడు షకావత్.

ఆమెలో ఎటువంటి రియాక్షన్ లేదు. రెప్పవాల్చకుండా అతనినే చూస్తోంది.

"నేను....షకావత్‌ని.... నీ తండ్రిని"

అతను ముందుకు కదలటంతో ఒక అడుగు వెనక్కి వేసింది ఆమె.

సజీవంగా కనిపిస్తున్న షకావత్‌ని చూసి అదిరిపడిందామె.

ఇదెలా సంభవం?.... రక్తసిక్తమయిన షకావత్ శవాన్ని బెంగుళూరులో హోటల్‌రూమ్‌లో చూసింది తను. కానీ....ఇప్పుడు....సజీవంగా....ఎదురుగా కనిపిస్తున్నాడు.

"చనిపోయిన వాడిని మళ్ళీ ఎలా బ్రతికానా అని ఆలోచిస్తున్నావు కదమ్మా....నేను నిజంగా చావలేదు" కొన్ని క్షణాలు ఆగి...... అన్నాడు

"నిజం.... నేను చావలేదు. చనిపోయినట్లు నటించాల్సి వచ్చింది. నన్ను నమ్మ"

"నాకు.... ఇప్పుడు ఎంతో సంతోషంగా వుంది. ఎన్నో ఏళ్ళ క్రిందట పోగొట్టుకున్న నిన్ను నేను తిరిగి కలవగలిగాను" నిలబడేశక్తి లేనివాడిలా అక్కడే చతికిల పడిపోయాడు షకావత్.

మౌనిక వదనంలో ఎటువంటి సంతోషమూ, ఆనందమూ కనపడలేదు షకావత్‌కి.

"ఏం మౌనికా, నా మీద కోపంగా వుందా!" జీరపోయిన గొంతుని సవరించుకుంటూ అన్నాడు.

43)

"కోపం కాదు. అసహ్యం నువ్వు నా తండ్రివి అన్న తలపే చాలా అసహ్యంగా అనిపిస్తోంది" ఆమె చూపులలో, మాటల్లో కూడా ఏహ్య భావం కనిపించింది.

తలదించుకున్నాడు షకావత్.

కొద్ది క్షణాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"మౌనికా! ...నేను...." ఏదో అనబోయాడు.

"షటప్....డోంట్ కాల్ మి మౌనిక....నా పేరు శుభాంగి. నాకు తల్లి, తండ్రి ఎవరూ లేరన్న తలపే చాలా తృప్తిని, ఆనందాన్ని ఇస్తోంది. ఇన్ని సంవత్సరాలుగా లేని బంధుత్వాలు, రక్తసంబంధాలు ఇప్పుడు తీసుకురావద్దు. ఐ హేట్ ఇట్"

భగభగ మండుతున్న ఛాతీమీద చేతితో రుద్దుకుంటూ మౌనంగా ఉండిపోయాడు షకావత్.

"నీ ఆలోచన నాకు అర్థమయింది. ఇప్పుడు నీ శరీరం నిండా యాసిడ్‌తో కాలిన గాయాలున్నాయి. నువ్వు కదలలేని స్థితిలో ఉన్నావు. ఈ క్షణంలో నీ కంటే నేనే బలవంతురాలిని నిన్ను చంపినా ప్రతిఘటించ లేవు అందుకే....బంధుత్వాలు కలిపి నీ ప్రాణాలు కాపాడుకుందామనుకుం టున్నావు. నిన్ను నేను చంపను. దయచేసి నన్ను "కూతురు" అని మాత్రం పిలవకు."

"ప్లీజ్....అలా అనొద్దు....నాకు ప్రాణంమీద తీపిలేదు నువ్వు చంపుతావేమోనన్న అనుమానమూ లేదు నీ మీద నాకున్న మమకారం నీకు తెలియదు నిన్ను చూడాలని ఎంత తపించానో కూడా నీకు తెలియదు"

"ఆహా....అంత తపించావా! నేను నిన్ను కలవటానికి వచ్చినపుడు చనిపోయినవాడిలా ఎందుకు నటించావు!....మేము ఇక్కడికి వచ్చేలాగ ఎందుకు చేశావు....? మమ్మల్ని మృత్యుముఖంలోకి ఎందుకు తోసావ్?....



చేసిన దౌర్భాగ్యపు పనికి సిగ్గుపడక ఇంకా ఈ మాటలెందుకు ఛా!" ఆమె మాటల్లో అతనిపట్ల ఏవగింపు పతాకస్థాయిలో వుంది.

"నేను నటించలేదమ్మా....నటించేలా చేశారు నేను చనిపోయినట్లుగా నటించకపోతే అదే క్షణంలో నిన్ను చంపేసేవారు గత్యంతరంలేని పరి స్థితిలో అలా చెయ్యాల్సివచ్చింది. నీకు నిజాలు తెలియవు. నా జీవితం వెనుక ....నా నుండి నువ్వు దూరం అవటానికి వెనుక .... కొన్ని భయంకరమైన నిజాలు ఉన్నాయి వాటిని నమ్ముతావన్న నమ్మకం నాకు లేదు....బలమైన పరిస్థితులవల్ల నేను నిన్ను మోసగించాను ఒక ఎం.పి.గా దేశ ప్రజలనీ మోసగించాను ఒక రకంగా నన్ను నేనే మోసం చేసుకున్నాను. నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఆ నిజాలు నీకు చెప్పక తప్పదు. అంతేకాదు నేను చేసిన తప్పులు బహిరంగంగా ప్రజలు ముందుకూడా ఒప్పుకొని ఎటువంటి శిక్షకయినా సిద్ధపడాలనుకుంటున్నాను"

ఆమె చూపులో ఏహ్యభావం అలాగే వుంది.

జీరపోతున్న గొంతు చిన్నగా సవరించుకొని చెప్పటానికి సిద్ధ మయ్యాడు షకావత్.

జైసింగ్ షకావత్ భారతీయుడు కాదు. పాకిస్థాన్ దేశస్థుడు అతని అసలు పేరు మన్సూర్ అలీఖాన్.

మన్సూర్ అలీఖాన్, జైసింగ్ షకావత్‌గా మారటానికి వెనుక కొన్ని అనూహ్యమైన పరిస్థితులు, మరికొన్ని భయంకరమైన నిజాలు వున్నాయి.

అవి, భారత్‌పాకిస్థాన్‌లమధ్య తొలిసారి యుద్ధం జరిగినరోజులు.

భారత సైన్యంలో జైసింగ్ షకావత్ అనే రాజస్థానీ యువకుడు సుబేదారుగా పని చేసేవాడు. పంజాబ్ సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యంతో జరిగిన యుద్ధంలో భారత సైన్యానికి తీవ్ర నష్టం వాటిల్లింది. తూటాల గాయాలతో స్పృహలేకుండా పడివున్న జైసింగ్ షకావత్‌ని పాక్

సైన్యాలు అదుపులోకి తీసుకున్నాయి. అతనితో పాటు మరో నలుగురు సైనికులు కూడా బందీలుగా పట్టుబడ్డారు.

యుద్ధం ముగిసింది.

యుద్ధంలో పట్టుబడ్డ ఈ ఖైదీలను లాహోరు జైలులో రెండేళ్ళ పాటు వుంచారు. జైలులోవున్న షకావత్‌ని చూసిన తరువాత ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది, పాకిస్తాన్ సైనిక ఉన్నతాధికారి ఒకరికి.

ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం తన పథకాన్ని ప్రభుత్వం ముందు వుంచాడతను. అందకు పాక్ ప్రభుత్వం నుండి వెంటనే గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

మరుక్షణం ఆ ఆలోచన కార్య రూపం దాల్చింది. జైసింగ్ షకావత్‌ను కట్టుదిట్టమైన భద్రతలతో రావల్పిండి జైలుకు తరలించారు.

పాక్ ప్రభుత్వ పథకం ప్రారంభమైంది.

పాకిస్థాన్ ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్‌గా పని చేస్తున్న మన్సూర్ అలీఖాన్‌ను కూడా రావల్పిండికి తీసుకు వచ్చారు.

కారణం.... మన్సూర్ అలీఖాన్ ముమ్మూర్తులా జైసింగ్‌ను పోలి వుండటమే.

సరిగ్గా జైసింగ్ అంత ఎత్తు, ఇంచు మించు అదేరంగు, లావు, అదేమాదిరిగావున్న కనుముక్కు తీరు.

మన్సూర్‌కి వున్న పొడవైన గడ్డం తీసి, అతని తల వెంట్రుకలను కురుచగా కత్తిరిస్తే చాలు.... ఖచ్చితంగా జైసింగ్‌ను పోలివుండే స్వరూపం అది.

జైలులోవుండగా జైసింగ్, నడక, భాష, ప్రవర్తన, మాటతీరు, ఉచ్ఛారణ, మొదలయినవి నిశితంగా పరిశీలించడానికి వీలుగా, అతని ప్రతికదలికని 16 ఎం. ఎం. కెమెరాలో బంధించారు. తనని కెమెరాతో



షూట్ చేస్తున్న విషయం జైసింగ్ ఏ మాత్రమూ గమనించకుండా జాగ్రత్త పడ్డారు. అలా తీసిన ఫిలింని మన్సూర్‌కి చూపించి, ఖచ్చితంగా జైసింగ్‌లాగే మాట్లాడటం, నడవటం, ప్రవర్తించడం అనుకరించడం ప్రారంభించమన్నారు పాక్ అధికారులు.

వాళ్ళ ఆజ్ఞాలు తుచ తప్పకుండా పాటించాడు.

దాదాపు రెండు సంవత్సరాలు పాటు జైసింగ్ ప్రతి కదలికని అబ్జర్వ్ చేసి ఖచ్చితంగా అతని లాగే నడవటం మాట్లాడటం....నేర్చుకున్నాడు మన్సూర్.

ఇప్పుడు జైసింగ్, మన్సూర్‌ల మధ్య రెండే రెండు తేడాలు మిగిలాయి.

ఒకటి, మన్సూర్ ముక్కు కంటే జైసింగ్ ముక్కు కొంచెం కొనదేలి వుంటుంది.

పలు వరసలో కూడా కొద్దిపాటి తేడావుంది.

మన్సూర్ పై వరస పళ్ళలోని ఇన్ సిజర్స్ (ముందు భాగంలో వుండే రెండు దంతాలని ఇన్ సిజర్స్ అంటారు) కొంచెం పెద్దవి.

ఆ రెండు తేడాలను సరిచేయటానికి ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడుని, ఒక కాస్మోటిక్ డెంటల్ సర్జన్‌ని ఇంగ్లండ్ నుంచి రప్పించింది పాక్ ప్రభుత్వం.

సర్జరీ పూర్తి అయింది. తేడా సరి అయింది. ఇప్పుడు జైసింగ్, మన్సూర్‌ల మధ్య తేడా లేదు.

సర్జరీ చేయబడిన డాక్టర్లు ఇంగ్లండ్ తిరిగి వెళ్ళలేదు. ఇస్లామాబాద్‌లో ఒక రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోయారు. కాదు చంపబడ్డారు.

వాళ్ళు చనిపోయిన రెండో రోజుకే జైసింగ్‌షకావత్‌ని కూడా కాల్చి చంపారు.

మరి కొన్నాళ్ళకి యుద్ధఖైదీల మార్పిడికి ఉభయ దేశాల మధ్య శిఖరాగ్ర సమావేశాలు, ఉన్నత స్థాయి సంఘాల సమాలోచనలు జరిగాయి రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

విడుదల చేసిన ఖైదీలతోపాటు, జైసింగ్ షకావత్ స్థానంలో మన్సూర్ అనే వ్యక్తిని పంపింది పాక్ ప్రభుత్వం

మన్సూర్‌ని చూసిన వాళ్ళందరూ అతనే జైసింగ్ అని నమ్మారు. ఆర్మీనుండి రిటైర్‌మెంట్ తీసుకుని రాజస్థాన్‌లోని స్వగ్రామానికి వెళ్ళాడు. జైసింగ్ రూపంలోని మన్సూర్.

యుద్ధసమయంలో గర్భవతిగా వున్న జైసింగ్ భార్య అప్పటికి మౌనికని ప్రసవించింది. భార్యకి తోడుగా జైసింగ్ ముసలి తల్లి కూడా ఉంది.

మన్సూర్ ఆ ఇంట్లో ప్రవేశించే సరికి మౌనికవయస్సు సంవత్సరం ఎనిమిది నెలలు.

బయట ప్రజానీకాన్ని జైసింగ్ షకావత్‌గా మభ్యపెట్టినా, అతని భార్యను, తల్లిని మోసగించడం అసంభవమనే విషయాన్ని వచ్చిన రెండో రోజే గ్రహించాడు మన్సూర్.

ఫలితం....జైసింగ్, భార్య, తల్లి గుడినుండి వస్తుండగా చంపించబడ్డారు.

అది ఒక యాక్సిడెంట్ చావులాగా ప్రజలను నమ్మించారు.

భారతదేశ రాజకీయాలలో ప్రవేశించమని పాకిస్తాన్ నుండి ఆదేశాలు అందాయి అతనికి.

ఆ ఆదేశాల మేరకు రాజకీయ జీవితంప్రారంభించి దేశానికి ఎన్నికలు జరిగే సమయంలో తానూ పోటీ చేశాడు. కానీ అతని అనుభవం సరిపోలేదు. ఓడిపోయాడు.

మరోసారి ఎన్నికలొచ్చాయి.

ఈ ఎన్నికలను చాలా సీరియస్‌గా తీసుకున్నది పాక్ ప్రభుత్వం ఎన్నికల సమయానికి పెద్ద ఎత్తున, డబ్బుల్ని, మనుషుల్ని పంపింది.

ఫలితం.... మన్సూర్ పార్లమెంట్‌కు ఎన్నిక అయ్యాడు.

భారత ప్రభుత్వం మాత్రం అతన్ని జైసింగ్ గానే నమ్ముతోంది. అంతేకాదు మంత్రి పదవి కూడా ఇచ్చారు.



పాక్ ప్రభుత్వం ఎత్తుగడ బ్రహ్మాండంగా పారింది.

భారత ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వివరాలు, రహస్యాలు, డాక్యుమెంట్లతోసహా పూర్తిగా పాకిస్తాన్‌కి లభించసాగాయి.

పాక్ దేశపు ఇద్దరు గూఢచారులను మన్సూర్ ఇంట్లో వంటవాళ్లగా నియమించింది. వారిద్వారా కూడా ఎన్నో రహస్యాలు అందసాగాయి పాకిస్తాన్‌కు.

కాలం గడిచింది రెండవసారి కూడా ఎం.పీ.గా ఎంపిక అయ్యాడు మన్సూర్. భారతప్రజలు మరోసారి కూడా అతన్ని అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఎన్నుకున్నారు.

ఈసారి మన్సూర్‌లో ఒక రకమైన మానసిక పరివర్తన మొదలయింది. ఎంతో అభిమానంతో, నమ్మకంతో ఎన్నుకున్న ప్రజలను, ప్రభుత్వాన్ని దేశాన్ని మోసం చేస్తున్నానేమో!....అన్న భావం అతనిలో చోటు చేసుకుంది. అప్పటినుండి అతనిలో మార్పు ప్రారంభమైంది. పాక్ ప్రభుత్వానికి రహస్యాలు చేరవేసే పనిని తగ్గించాడు.

పదిహేను సంవత్సరాలు గడిచాయి.

జైసింగ్‌గా మారిన మన్సూర్ నుండి ఏ వివరాలు రావటంలేదన్న విషయాన్ని స్పష్టంగా గ్రహించింది పాక్ ప్రభుత్వం

అందుకే... కన్న కూతురిలా ప్రేమిస్తున్న మౌనికని కిడ్నాప్ చేసి ఆమెను సజీవంగానే వుంచి మన్సూర్ ద్వారా తిరిగి రహస్యాలు రాబట్టాలని ప్లాన్ చేసారు. కిడ్నాప్ చేయబడిన మౌనిక తిరిగి తనతండ్రి దగ్గరకు వెళ్ళే ప్రయత్నం చేయకుండా వుండటం కోసం, ఆమె మెదడు మీద భట్టాచార్యని ప్రయోగించారు.

భట్టాచార్య చేసిన హిప్నోసిస్ ఫలితంగా తండ్రికి సంబంధించిన వివరాలు అన్నీ మర్చిపోయి తాను శుభాంగినే అని నమ్మింది ఆమె.

శుభాంగిగా ఆమె కొత్త జీవితం ప్రారంభించాక కూడా ఆమెచుట్టు మనుషులను వుంచి ఆమె సజీవంగానే వుందన్న విషయాన్ని మన్సూర్‌కి ఫోటోల రూపంలో తెలియజేయసాగారు పాక్ ప్రభుత్వ మనుషులు.

ఆమెను సజీవంగానే వుంచడంలో ముఖ్య ఉద్దేశ్యం, ఏమిటంటే, ఆమె ప్రాణానికి ముప్పు వాటిల్లినరోజున మన్సూర్ పూర్తిగా మొండికేసే ప్రమాదం వుంది. అందుకే ఆమెచుట్టు నిఘావున్న మనుషులు ఆమెను వెన్నాడటమే కాకుండా సజీవంగా వుండడానికి కూడా రక్షణ కల్పిస్తున్నారు.

కిడ్నాప్ అయిన మౌనికని వెతకటానికి ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన ఒక ఉన్నతాధికారిని నియమించింది భారతప్రభుత్వం. కాని, ఆ అధికారిని కోట్లరూపాయలు కుమ్మరించి కొనివేసింది పాక్ ప్రభుత్వం, మిగతా అధికారులనుకూడా అడుగడుగునా విఘాతాలు కల్పిస్తూ కేసు విషయంలో ముందంజ వేయనీయకుండాచేసి చివరకు కేస్ క్లోజ్‌చేయించింది.

ఈ నేపథ్యంలో రహస్యంగా గౌతమ్‌ని కలిసి తన కూతురి గురించి ఇన్వెస్టిగేట్ చేయమని ఆదేశించాడు మన్సూర్.

గౌతమ్ రంగప్రవేశంతో కథ అడ్డం తిరిగింది.

గతం మరచిపోయిందనుకున్న శుభాంగి, తానే మౌనికనన్న విషయం గ్రహించింది. అందువల్ల మౌనిక ఏక్షణంలో అయినా తన తండ్రిని కలిసే ప్రమాదం వుందని గ్రహించి తిరిగి రంగ ప్రవేశం చేసారు పాకిస్తాన్ మనుషులు.

ఫలితం....ఈ సంఘటనలు అన్నీ.

ఏదో ఒక విధంగా కూతుర్ని కలవాలనీ విశ్వప్రయత్నం చేసిన, మన్సూర్‌ని చనిపోయినవాడిలా నటింపచేసారు. ఆ గదిలో భట్టాచార్య తాలూకు ఫోటోలు, పేపర్ కట్టింగ్స్ వుంచి, ఆమె భట్టాచార్యను వెతుక్కుంటూ వచ్చేలాగ చేసారు.

o o o

నీరసించిపోతున్న శరీరాన్నీ, నిస్సత్తువగా మారుతున్న, నరాలను అదుపులోకి తెచ్చుకుంటూ, లేని ఓపికతో....జరిగిన విషయం వివరించాడు. జైసింగ్ షకావత్ రూపంలోని మన్సూర్ అలీఖాన్,



"నువ్వు....నా కన్న కూతురివి కాకపోయినా....తల్లిని పోగొట్టుకున్న నిన్ను ఒంటరిగా అనాథగా వదలలేకపోయాను. నీ మంచి చెడ్డల బాధ్యత నేను తీసుకున్నాను ఫలితం....నీ మీద మమకారాన్ని, అభిమానాన్ని పెంచుకున్నాను....నన్ను....నమ్మ"

అతని మాట తడబడుతోంది....కంటిలో నీటిపొర నిలబడింది.

అతనినాస్థితిలో చూసిన ఆమెమనస్సు తొలిసారిగా ఆర్ద్రమయింది.

అతని రెప్పలు బరువుగా మూతపడుతున్నాయి.

o o o

"బాస్టర్డ్....ఐవిల్ సక్ యువర్ బ్లడ్"....

దిక్కులు దద్దరిల్లేలా అరుస్తూ, వెల్లకిలాపడివున్న గౌతమ్ మీదకు సింహంలా దూకాడు విలియమ్స్.

సరిగ్గా....అదే సమయంలో

రెండు కాళ్ళను బలంగా గాలిలోకి విసిరాడు గౌతమ్.

"దబ్"మని శబ్దం చేస్తూ విలియమ్స్ గుండెలు బలంగా తాకాయి ఆ కాళ్ళు. కెవ్వుమని అరిచి, గాలిలోకి రెండు అడుగులు ఎగిరి అవతలకు పడ్డాడు విలియమ్స్....

అతని తల నేలకు తాకగానే ఫట్‌మన్న శబ్దం వచ్చింది.

నిశ్శబ్దంగా అలాగే వుండిపోయాడు విలియమ్స్

క్షణకాలం తరువాత లేచి కూర్చున్నాడు గౌతమ్.

ఏ మాత్రం ప్రతిఘటించకుండా అలా నిశ్శబ్దంగా విలియమ్స్ పడుకున్నాడేమో అన్న సందేహం వచ్చి అటుగా చూసి ఆ దృశ్యం చూడలేక తల పక్కకు తిప్పుకున్నాడు గౌతమ్.

44)

కారణం....

వెల్లకిలా పడటంతో విలియమ్స్ తల మొనదేలివున్న ఒక బలమైన రాయిమీద పడింది.

ఫలితం, తలనిట్టనిలువుగా చీలిపోయింది.

అయిపోయింది. అతనిద్వారా ఏమయినా వివరాలు తెలియవచ్చు, అతనిని సజీవంగా పట్టుకుంటే అనుకున్నాడు....కానీ....ఉపయోగం లేదు..

అతని పంచ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

అదే సమయంలో గౌతమ్‌కి శుభాంగి గుర్తువచ్చింది.

అరె....తను ఎటువంటి ప్రమాదంలో వుందో, అన్న ఆలోచన వచ్చి, మరుక్షణమే లేచి అక్కడికి సుమారు రెండువందలగజాలదూరంలో ఉన్న బిల్డింగ్ వైపు పరుగు ప్రారంభించాడు.

0 0 0

ఆ గదిలో అడుగుపెట్టాడు గౌతమ్.

గౌతమ్‌ని చూసిన మరుక్షణం, గదిలో ఒకమూల దిగులుగా కూర్చుని వున్న శుభాంగి.

ఒక్క ఉదుటున లేచివచ్చి అతనిని పొదివి పట్టుకుంది.

ఆమె శరీరం భయంతో కంపించిపోతోంది.

ఏ....మ... యింది?

గదిలో ఒకమూల, గాయాలతో, రక్తసిక్తమైన శరీరంతో పడి వున్న జైసింగ్‌ని చూసి "ఏమయింది?" అన్నాడు గౌతమ్.

ఆమె నుండి సమాధానం లేదు.



"ఈజ్ హి డెడ్?" అడిగాడు జైసింగ్ శరీరం వైపు అనుమానంగా చూస్తూ.

లేదు....అన్నట్లు తల అడ్డంగా ఊపిందామె.

"భ....ట్టా....చార్య....ఎ....క్క....డ?"....చుట్టూ కలయచూస్తు అడిగాడు గౌతమ్.

"చ....చం....పే....సా!".... భట్టాచార్య శవంపడివున్న గది వైపు చేయి చూపిస్తూ అంది ఆమె.

ఉలిక్కి పడ్డాడు ఆమె సమాధానానికి అతను.

ఆమె నుండి దూరంగా జరిగి జైసింగ్ రూపంలో వున్న మన్సూర్ శరీరాన్ని సమీపించి ముక్కు దగ్గరవేలు వుంచాడు.

శ్వాస ఆడుతోంది.

"మనం ముందుగా అంబులెన్స్‌కి ఫోన్ చేసి ఈయనని ఇక్కడ నుండి తరలించి ఆ తరువాత కలకత్తా పోలీసులకీ విషయం చెప్పటం మంచిది." అన్నాడు అక్కడున్న టెలిఫోన్ వైపు కదులుతూ.

ఆమె అలా వణుకుతూనే వుంది.

నిముషం తరువాత అంబులెన్స్‌కి ఫోన్ చేసి చెప్పాడు గౌతమ్.

స్పృహలోలేని మన్సూర్ శరీరంవైపు చూస్తూ "ఇతను ఇంక బ్రతకదేమో!...."అన్నాడు

నిశ్శబ్దంగా నిలబడి వుంది శుభాంగి.

"విలియమ్స్‌ని ప్రాణాలతో పట్టుకుంటే ఎన్నో నిజాలు తెలుస్తాయి అనుకున్నాను. కానీ.... బాడ్‌లక్.... వాడు చనిపోయాడు".... ఒకింత నిరుత్సాహంగా అన్నాడు గౌతమ్.

"నాకు.... తె....లు....సు.... అన్నీమా.... నాన్న.... చెప్పారు" ....అంది శుభాంగి గొంతు పెకలించుకొని.

"మా నాన్న" అన్న ఆమె మాటకి ఆశ్చర్యపోయాడు గౌతమ్.

"జరిగినది అంతా చెబుతాను" విను అంది చిన్నగా గొంతు సవరించు కుంటూ.

ఆమె చెప్పేది ఆశ్చర్యంతో వింటున్నాడు గౌతమ్.

ం ం ం

అరగంట తరువాత....

అతి కష్టం మీద అంబులెన్స్‌లోకి ఎక్కించారు మన్సూర్‌ని.

లోపలపడుకో బెట్టిన మరుక్షణం ఫస్ట్ ఎయిడ్ ప్రారంభించాడు డాక్టర్-

"ఇంతకీ మీరు ఎవరు?....మీరుకూడా ఈ వ్యక్తితోపాటు రావాలి" .....

ఒకింత ఆజ్ఞాపించిన స్వరంతో అన్నాడు అంబులెన్స్‌లో వచ్చిన ఒక వ్యక్తి.

"డోంట్‌వర్రీ....మీ వెనుక నేనూ వస్తాను.... అయామ్ ఎ ప్రైవేట్ డిటెక్టివ్".... జేబులోంచి ఐడింటిటీ కార్డు తీసి చూపాడు గౌతమ్ క్షణకాలం తటాపటాయించి వ్యాన్ ఎక్కాడు అతను.

చిన్న కుదుపుతో కదిలింది అంబులెన్స్.

నిలబడేందుకు ఒంట్లో శక్తిలేనట్లుగా గౌతమ్ భుజంమీద తలవాల్చింది శుభాంగి.

ఆమె నడుం చుట్టు చేయివేసి పొదివి పట్టుకున్నాడు గౌతమ్.... "నీకు నేనున్నాను" అన్న అర్థం వచ్చేలాగ.

వారిద్దరికీ దూరంగా వెళ్ళిపో సాగింది అంబులెన్స్....

A NOVEL BY

VEMPALLI NIRANJAN REDDY

SANDYA BOOK STALL

